అయినంపూడి శ్రీలక్ష్మి

# కొత్త ప్రేమలేఖలు



**సరోజినీ శ్యామ్ సుందర్ ప్రచురణలు**
హైదరాబాద్

KOTHAPREMA LEKHALU
(A Collection of New Love Letters Broadcasted in All India Radio)

First Edition :
2020 January
1500 copies

ISBN :

Price : ₹ 300/-

Layout & Design
Rainbow Print pack

Publisher
Sarojini Shyam Sunder Prachuranalu
# 103, Durga Apartments, Durga Nagar,
Hyderabad.

For Copies
Nageswara Rao Bandlamudi
1002, A-Block, Royal pavilian,
Beside RBI Quarters, Ameerpet,
Hyderabad.
Ph : 99633 74567, 99899 28562

Printed at
Rainbow Print Pack
Hyderabad. Ph : 040- 23731620/23741620

Cover Design

**Ravi Varma Painting**

## అంకితం

### కుటుంబానికి...

వ్యక్తిగతంగా 'అయినంపూడి'-'బండ్లమూడి' వంశాలకి

వృత్తిగతంగా 'ఆకాశవాణి' ప్రోగ్రాం, ఇంజనీరింగ్, అడ్మిన్ బృందాలకి.....

– అయినంపూడి శ్రీలక్ష్మి

యూ ట్యూబ్‌లో ఈ ఆడియో కార్యక్రమాలను వినాలనుకునేవారు –

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం అప్‌లోడ్ చేసిన ఈ లింక్ ద్వారా వినవచ్చు.

https://www.youtube.com/playlist?list=PLuaylPhVg9CjQMxrmFBKfOKsJRs9TdDo_



## ఆలోచన, ఆత్మీయత, ఆచరణల సంగమం
## శ్రీలక్ష్మి గారి లేఖా సాహిత్యం!

*"How wonderful it is to be able to write Someone a letter! To feel like conveying your thoughts to a person, to sit at your desk and pick up a pen, to put your thoughts onto words like this is truly marvelous."*

ప్రఖ్యాత జపనీస్ రచయిత Haruki Murakami 1987లో రాసిన Norwegian Wood నవలలో ఒకచోట లేఖల గురించి చెప్పిన వాక్యాలివి. ప్రతిష్టాత్మక World Fantasy Award ను, Franz Kafka Prize ను గెల్చుకున్న ఈ రచయిత లేఖారచనలో ఇమిడిఉండే హృదయ గత అనుభూతులను సరళంగానే అయినా చక్కగా వ్యక్తీకరించాడనడంలో సందేహం లేదు...

అందుకే ఉత్తరం అంటే హృదయనివేదన...! ఆత్మావిష్కారం!! అభిప్రాయాల కలబోత!! విషాదానందాల వలపోత!

మన నిత్య జీవితంలో ఉండే ఉద్వేగ క్షణాలను, ఉత్తేజ సందర్భాలను, ఉల్లాస సన్నివేశాలను ఉత్కృష్ట సమయాలను అక్షరాలలో పొదిగి, తెల్ల కాగితంపై అందంగా లిఖించే మనఃపూర్వక కళ – లేఖా రచన!

అందుకే ఉత్తరం, అది పుట్టినప్పటి నుంచీ మనుషులమధ్య అక్షరవారధిని కట్టింది! ఆలోచనాస్ఫోరకమై నిలిచింది! ఆత్మీయభాషణమై భాసించింది! ఆచరణాత్మక దృక్పథమై మార్గదర్శనం చేయించింది.

ఇంతగా మనుషుల జీవితాలతో పెనవేసుకుపోయిన ఉత్తరం గత రెండు దశాబ్దాల కాలం నుంచీ క్రమంగా అదృశ్యమవుతూ వస్తూంది. మానవజాతి నిర్మించుకున్న ఎన్నో విశిష్టమైన సంప్రదాయాలలో లేఖారచన కూడా ఒకటిగా కొనసాగి, ఇప్పుడు అంతరించిపోతున్న ఇతర సంప్రదాయాల కోవలోకి చేరింది...

ఒకప్పుడు అక్షింతలను, కన్నీళ్ళను, నమ్మకాన్నీ, ధైర్యాన్నీ, ఆశలనూ, మొత్తంగా జీవితాన్నీ, జీవనేచ్ఛనూ మోసుకొచ్చిన ఉత్తరం ఇప్పుడు మానవ మస్తిష్కపు స్టోర్‌రూమ్‌లో 'పాత వస్తువు'గా మారిపోయింది...

అందుకే ఉత్తరం 1990 తరపు మనుషుల వరకూ ఓ నోస్టాల్జియా... ఒక జ్ఞాపకం... ఒక దిగులు... ఒక బెంగ... ఒక పోగొట్టుకున్న జీవన పార్శ్వం... ఒక కోల్పోయిన ప్రపంచ శకలం... అన్నింటినీ మించి ఒక శిథిల స్వప్నం!

ఇలా మనసులోనే ఉంగలు చుట్టుకుని కునారిల్లుతూ, నవజీవన శైలుల మెరుపులను కళ్ళకు ఎంతగా అతికించుకున్నా, గుండెలోతుల్లో ఏ మూలో నిరుడు కురిసిన లేఖా హిమసమూహాలను తల్చుకుంటూ, మనో భారంతో 'పెన్ను'నీడుస్తున్న క్షణాన...

ఓ అశరీరవాణి ఉత్తరాలరూపంలో గాలిలో తేలుతూవచ్చి చెవులను సోకింది... అక్షరం అక్షరాన్ని ఆర్ద్రంగా గుండెల్లోకి ఒంపి, ఇన్నినాళ్ళ నిరీక్షణను సార్థకం చేసింది...

అది– 'ఆకాశవాణి'లో వినిపించిన ''కొత్త ప్రేమలేఖలు''!

అవి– శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి సృష్టించిన సాహితీ రేఖలు!!

ఇలా నవ్య సంప్రదాయ పంథా (Neo–classicism) లో నవీన ఆహార్యంతో, నవకల్పనగా సమకాలీన అంశాలే వస్తువుగా

దూసుకువచ్చిన 'కొత్త ప్రేమలేఖలు' సంవత్సరకాలం పాటు ప్రతీ సోమవారం ఉదయమే 'ఆకాశవాణి' శ్రోతలను ఎంతగానో ఆకట్టుకుని 'ట్రెండ్ సెట్టర్'లా నిలిచాయి... అలాంటి 'కొత్త ప్రేమలేఖల' ప్రపంచం లోకి తొంగిచూసే ముందు, అసలు 'లేఖా సాహిత్యం' గురించి కొన్ని విషయాలు తెల్సుకుంటే ఈ కొత్తప్రేమ లేఖలు విశిష్ఠత మరింత అవగతం అవుతుంది.

**లేఖా సాహిత్యం : (Epistolary)**

సాహిత్యంలో ఎన్నెన్నో ప్రక్రియ (Genre) లు వాడుకలో ఉన్నాయి. దీనికి ఆయా సాహిత్య ప్రక్రియలలోని వస్తువు (Theme), శైలి (style), శిల్పమే(technique), ప్రధాన కారణాలు. ఆ లెక్కన విశ్లేషిస్తే ఉత్తరాలు, లేఖల ద్వారా విషయాన్ని చెప్పే విధానాన్ని 'లేఖా సాహితీ ప్రక్రియ'గా చెప్పవచ్చు.

ఈ లేఖా సాహిత్యానికి సమానార్థకంగా ఇంగ్లీష్‌లో 'Epistolary' అని పిలుస్తారు. ఇది గ్రీక్ పదం'Epistle అంటే 'అక్షరం' లేదా 'ఉత్తరం' నుండి ఏర్పడింది. అంటే Epistolary is a literary genre pertaining to letters అన్నమాట!

**లేఖా సాహిత్యం (Epistolary) – విశిష్టతలు :**

అన్ని లేఖలు లేఖలుగానే ఉంటాయి. కానీ కొన్ని మాత్రమే సాహిత్య ప్రతిప్రత్తిని, కావ్య గౌరవాన్ని పొందుతాయి. దానికి ఆ లేఖలో పొందుపరిచిన విషయాలు, ఉపయోగించిన భాష, పద సౌందర్యం, రాసిన విధానం, శైలి, అందులోని సామాజిక ప్రయోజనాత్మకత, విషయ వివరణలో కళాత్మకత, సౌందర్య దృష్టి (Aesthetics)వంటివన్నీ కలిసి కారణమవుతాయి. ఆ విధంగా లేఖాసాహిత్య విశిష్టతలను ఈ విధంగా చెప్పవచ్చు.

★ కథనంలో కాల్పనికత కన్నా వాస్తవికత (Realism) ప్రధానాంశం.

★ ఇందులో ఏకోన్ముఖ వివరణకన్నా బహుముఖ వ్యక్తీకరణకు అవకాశం.

★ ఈ ప్రకియవల్ల పాత్రల లోతైన మనోభావాలు, ఆలోచనలు పాఠకులకు అవగతం అవుతాయి.

★ రచయిత స్వంత కల్పితాలకన్నా యధార్ధ సంఘటనలు, సందర్భాలతోనే పాఠకులకు సంధానం ఏర్పడుతుంది.

★ ఇందులోని శైలి–సంబోధనాత్మకంగా, సంభాషణాత్మకంగా ఉండటంవల్ల పాఠకుడు, శ్రోత మమేకమయ్యే అవకాశం ఎక్కువ.

★ దీనిలోని ఉటంకింపులు ఎంత సంభ్రమాశ్చర్యాలకు రసానందానికి గురి చేస్తాయో, అందించే సమాచారం, గణాంకాలు కూడా అంతే జ్ఞానాన్ని అందిస్తాయి.

ఈ కోణంలోంచి చూస్తే, ఈ 'కొత్త ప్రేమలేఖలు' ఈ లక్షణాలన్నింటినీ సమగ్రంగా ప్రతిబింబిస్తూ కావ్య గౌరవానికి అర్హమైనవిగా కనిపిస్తాయి.

**ఉత్తరం రాయడం ఓ కళ !**

మన నిత్య వ్యవహారంలో 'ఉత్తరం రాయడమూ ఒక కళే' అని అందరూ అంటుండగా వింటుంటాం. కానీ ఉత్తరం రాయడాన్ని ఓ కళాత్మక విషయంగా అధ్యయనం చేసే శాస్త్రం ఒకటుందనే విషయం మాత్రం అంతగా తెలీదు. ఈ ఉత్తరం రాసే కళనే గ్రీకులు ప్రాచీన కాలంలోనే 'Epistolography ' అని పిలిచారు. Epistole అంటే అక్షరం, ఉత్తరం అనీ, graphia అంటే రాయడం, లిఖించడం అనీ అర్థం. ఈ రెండు పదాల కలయిక నుంచే ఈ లేఖా రచనా శాస్త్రం (Epistolo graphy) ఉద్భవించింది.

కాగా ఈ శాస్త్రం యూరప్‌లో బైజాంటైన్ సామ్రాజ్యయుగంలో స్వర్ణయుగాన్ని చవిచూసిందని చెప్పాలి. ప్రాచీన కాలంలో తూర్పు రోమన్ సామ్రాజ్యానికే బైజాంటియమ్ అని పేరు. ఇది యూరప్‌లో క్రీ.శ. 395 నుండి 1453 వరకు రాజ్యమేలింది. ఈ సామ్రాజ్య రాజధాని అయిన బైజాంటియమ్ నగరం 1453లో ఆటోమాన్ టర్కుల ఆక్రమణ అనంతరం 'కాన్‌స్టాంటి నోపిల్'గా ఆ తర్వాత ఆధునిక కాలంలో 'ఇస్తాంబుల్'గా పేరుపొందింది.

ప్రాచీన బైజాంటియన్ చక్రవర్తులు తమ శాసనాలకు, చట్టాలకు సంబంధించిన ప్రతీ అంశాన్నీ ప్రజలకు, ఇతర రాజులకు ఉత్తరాలద్వారా తెలియజేసేవారు. దీనికోసం వారు ఉత్తరాన్ని, లేఖలను రసరమ్యంగా, మనోరంజకంగా రాయడంకోసం ప్రత్యేక నిపుణులను నియమించుకోవడమే కాక, రాజశిక్షణలో యుద్ధవిద్యలతోపాటు ఒక అంశంగా ఈ లేఖారచనా కళను అభ్యసించారని చారిత్రక ఆధారాల వల్ల తెలుస్తోంది. అంటే రాజ్యాలమధ్య యుద్ధం లేదా శాంతి ఏర్పడాలన్నా, ప్రజలలో రాజుపట్ల భక్తిభావం, విధేయత పెరగాలన్నా లేఖరాసే విధానం వల్లనే సాధ్యమవుతుందనే మౌలిక విషయాన్ని ఈ రోమన్ చక్రవర్తులు తెలుసుకున్నారని దీన్నిబట్టి చెప్పవచ్చు. అలా లేఖకు ఉండే శక్తిని ఈ ఉదంతాలు తేటతెల్లం చేస్తాయి.

**లేఖా పరిణామం :**

నిజానికి 'లేఖ' ప్రధానలక్ష్యం – ''సమాచారాన్ని, సందేశాన్ని ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి చేరవేయడం!'' నిర్దేశిత వ్యక్తులు ప్రత్యక్షంగా కలుసుకోలేకున్నా, దూరంగా ఉన్నా వారి మధ్య సమాచార మార్పిడికి, తద్వారా తదనంతర కార్యాచరణకు దోహదం చేసే మానవ అవసరంలోంచి ఉత్పన్నమైన లిఖిత విశేషమే– లేఖ!

అయితే 'లేఖలు' వేలాది సంవత్సరాల నుంచీ ఎన్నో దశలనుదాటి, ఎన్నెన్నో పరిణామాలను చవిచూసాయి. మొదట్లో లేఖ సారాంశం మౌఖికంగా వార్తాహరులు, రాయబారులు, అనుచరులు ద్వారా చేరవేయడం జరిగేది. ఆ తర్వాత శిలలపై చెక్కిన అక్షరాల ద్వారా, ఆ తర్వాత తాళపత్రాల ద్వారా, వస్త్ర పత్రాల ద్వారా లేఖలు సమాచారాన్ని చేరవేసేవి. ఈ కాలంలో లేఖలను ఒక చోటునుంచి మరోచోటుకి చేర్చే మాధ్యమాలలో మనుషులు, పక్షులు, జంతువులు ఉపయోగించబడేవారు.

మనదేశంలో 1853లో రైల్వే రవాణా ప్రారంభంకావడం, 1854లో తపాలా విధానం అమలులోకి రావడంతో లేఖా సంప్రదాయం రాజులు, కులీనులకు మాత్రమే కాక, చదువుకున్న ఇతర సమాజాలకి కూడా అందుబాటులోకి వచ్చాయి. మరోవైపున 'లేఖల చేరవేత' విధానం వ్యవస్థీకృతం అయి ఉత్తరాలు, లేఖల బట్వాడా సులభతరం అయింది.

ఆ తర్వాత సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ, లేఖలు మరెన్నో పరిణామాలకు లోనయ్యాయి. అలా టెలిగ్రామ్, ఫాక్స్ (ఫాసిమిలీ) విధానాలు అందుబాటులోకి వచ్చాయి. కాగా 2000 సంవత్సరం తర్వాత దేశంలో మొదలైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంటర్‌నెట్ వంటి వాటివల్ల పేజర్, ఈమెయిల్, షార్ట్ మెసేజ్ సర్వీస్ (SMS) వంటివి ఇప్పుడు జనబాహుళ్యంలోకి వచ్చి ''సంప్రదాయ లేఖ'' అనే అర్థాన్ని, వ్యవస్థను మార్చివేసాయి. ఇక సోషల్ మీడియా (ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్) విజృంభణతో లేఖలు, లేఖాసాహిత్యం అనేవి గతకాలపు చిహ్నాలుగా, అంతరించిపోయే సంప్రదాయంగా మారిపోయాయి.

అయితే, కొంచెం సానుకూలంగా ఆలోచిస్తే 'లేఖ' లోని 'ఆత్మ' (సమాచారాల చేరవేత) కనుమరుగు కాలేదనీ, లేఖ రూపం మాత్రమే (పేపర్ నుండి పేపర్‌లెస్ ఈ–మెసేజ్‌లకు) మారిందనీ అర్థమవుతుంది. ఆ లెక్కన ప్రస్తుతం న్యూ జనరేషన్ సాంకేతిక రూపాలైన మెయిల్, మెసేజ్‌వంటివన్నీ 'లేఖ'కు కొనసాగింపులు గానే భావించాల్సి ఉంటుంది.

ప్రపంచ లేఖా సాహిత్యం – ప్రముఖ రచనలు :

లేఖా సాహిత్యం (Epistolary) ప్రక్రియలో ప్రపంచ భాషలలో వచ్చిన తొలి నవలగా 1485లో Diego de San Pedro స్పానిష్ భాషలో రాసిన 'Prison of Love' ని చెప్పుకోవచ్చు. కాగా ఇంగ్లీష్ సాహిత్యంలో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన సాహితీవేత్తగా Howell (1594–1666)ను సాహితీ చరిత్రకారులు చెపుతారు. ఈయన రాసిన 'Familiar Letters' అనే గ్రంథం ఈ ఘనతను సాధించింది. ఇందులో ఆయన విదేశాలు, యాత్రలు, సాహసాలు, స్త్రీలు, జైలు, జీవితం, ప్రజలు, అలవాట్లు వంటి ఎన్నో అంశాలను ఉత్తరాలరూపంలో వ్యక్తీకరించారు.

ఇక, ఈ ప్రక్రియలో పూర్తిస్థాయి నవల, Aphra Behn రాసిన Love–Letters Between a Nobleman and His Sister అని చెప్పాలి. ఈ నవల మూడు భాగాలుగా 1684, 1685, 1687 సంవత్సరాలలో వెలువడి సంచలనం సృష్టించింది.

కాగా 18వ శతాబ్దం నాటికి ఈ సాహితీ ప్రక్రియ అమిత ప్రజాదరణ పొందింది. దీనికి Samuel Richardson రాసిన Pamela (1740), Clarissa (1749) నవలలు ఎంతగానో దోహదపడ్డాయి. ఇందులో Pamela నవల ఇతివృత్తం – Mr. B అనే యజమాని దగ్గర పనికి కుదిరిన పమేలా తన పేద తల్లిదండ్రులకు రాసే ఉత్తరాల పరంపరే ఈ నవల.

అయితే ప్రఖ్యాత రాజనీతిజ్ఞులు, 'అధికార పృథక్కరణ సిద్ధాంతం' (Theory of separation of Powers) ను ప్రతిపాదించిన Montesquieu 1721 లో Letters Persian పేరుతో ఫ్రెంచ్‌లో గ్రంధాన్ని రాయడం విశేషం. అలాగే, ప్రముఖ ప్రకృతివాద తత్త్వవేత్త (Naturalism) సామాజిక ఒడంబడిక సిద్ధాంత కర్త (Social Contract Theory) Jean–Jacques Rousseau కూడా Julie, or the New Heloise పేరుతో 1761లో రాసాడు. ప్రముఖ జర్మన్ తత్వవేత్త–సాహితీకారుడు Johann Wolfgang Von Goethe కూడా 1769లో The Sorrows of Young Wert her అనే నవలను రాసాడు. ఇవన్నీ లేఖా సాహిత్య కోవకు చెందినవే!

18వ శతాబ్దం నాటికి ఈ లేఖాసాహిత్య ప్రక్రియ ఎంత ఉధృతిని సాధించిందో అంతే విమర్శనుకూడా ఎదుర్కొంది. ఆ తర్వాత ఈ ప్రక్రియను చిన్నబుచ్చుతూ కొన్ని వ్యంగ్య రచనలు, ప్రహసనాలు కూడా వెలువడ్డాయి. అయితే ఈ వ్యంగ్యరచనలను చేసిన వారు ప్రముఖ రచయితలు కావడం గమనార్హం! Samuel Richardson రాసిన Pamela నవలకు కౌంటర్‌గా Shamela (1741) నవలను Henry Fielding, రాయగా, మరో ప్రముఖ సాహితీవేత్త Oliver Goldsmith లండన్‌లో నివసించే చైనీయ తత్వవేత్త గాథగా The Citizen of the World పేరుతో 1761లో ఒక నవలను రాసాడు. అలాగే ప్రఖ్యాత Pride and Prejudice నవలను రాసిన Jane Austen కూడా తన తొలినాళ్ళతో Lady Susan పేరుతో 1794లో ఓ నవలను ఈ లేఖా సాహిత్య సంప్రదాయంలో రాసింది.

మరో ప్రఖ్యాత రచయిత, నాటక కర్త Honore de Balzac రాసిన Letters of Two Brides నవల విమర్శకులను సైతం ఆకట్టుకుంది. విద్యార్థి దశలో స్నేహితులైన ఇద్దరు అమ్మాయిలు పాఠశాలను వదిలిన తర్వాత కాలంలో వారి జీవితంలో సంభవించిన మార్పులను ఉత్తరాల రూపంలో వెల్లడించిన ఈ నవల, సాహితీ ప్రస్థానంలో ఓ మైలురాయిలా నిలిచిపోయింది.

ఈ లేఖారచనా సంప్రదాయంలో వచ్చిన సాహిత్యంలో చెప్పుకోదగింది Frankenstein! ప్రఖ్యాత కవి P.B. షెల్లీ భార్య Mary Shelly 1818లో ఈ నవలను ఉత్తరాల రూపంలోనే రాసింది. ఈ నవలలోని మూడు ప్రధాన పాత్రల మధ్య జరిగే ఉత్తరాల ద్వారా మొత్తం కథ నడుస్తుంది.

అలాగే, 1897లో Bram Stoker Dracula నవలను రాసాడు. ప్రపంచ హారర్ సాహిత్య చరిత్రలో మైలురాయిగా నిలిచిన ఈ నవల అంతా ఉత్తరాల రూపంలోనే నడుస్తుంది. వీటికి తోడుగా పత్రికా కథనాలను, టెలిగ్రాములను, డాక్టర్ నోట్స్‌ను, ఓడల ప్రయాణపు రికార్డులను కూడా ఉపయోగించారు.

The Diary of a Young Girl పేరిట రెండో ప్రపంచ యుద్ధకాలంలోని భయానక భీభత్స అనుభవాలను, వాటిపై స్పందనలను Anne Frank రాసింది. అయితే ఈ గ్రంధాన్ని ఆమె ఉత్తరాలు, డైరీ రూపంలో రాయడం విశేషం!

ప్రసిద్ధ రచయిత్రి Alice Walker 1982లో The Color Purple – నవలను ప్రచురించింది. ఇది Celie అనే ఓ నల్లజాతి అమ్మాయి కథ. ఇందులో ఆమె తన కథను తన సోదరికి, దేవుడికి ఉత్తరాల రూపంలో చెప్తుంది.

మరో ప్రఖ్యాత రచయిత్రి Virginia Woolf 1938 లో Three Guineas అనే వ్యాసాన్ని ఈ లేఖా సాహిత్య ప్రక్రియలో రాసింది. ఇది ప్రపంచ స్త్రీ వాద సాహితీ చరిత్రలోనే గొప్ప రచనగా పేరు పొందింది. అలాగే 1748లోనే John Cleland రాసిన Funny Hill నవల సరస శృంగార నవలగా ప్రఖ్యాతి సాధించి, లేఖా సాహిత్యానికి ఉన్న పరిధిని విస్తృతపరిచింది. ఇందులో ఓ అనామక వ్యక్తికి తన మనసులోని భావాలను ఉత్తరాల పరంపరగా కథానాయకి రాస్తుంది.

అలాగే Wilkie Collins తను రాసిన The Woman in White (1859), The Moonstone (1868) లో లేఖా సాహిత్య సంప్రదాయంలో డిటెక్టివ్ నవలలను సమర్ధవంతంగా రాసి, ఉత్తరాల ద్వారానే నేర పరిశోధనాక్రమాన్ని ఆసక్తిదాయకంగా చెప్పగలిగాడు.

ప్రఖ్యాత రష్యన్ రచయత Fyodor Dostoyevsky తన రచనా ప్రస్థానాన్ని ఈ లేఖా సాహిత్య ప్రక్రియతోనే ప్రారంభించాడనేది అతి తక్కువ మందికి మాత్రమే తెలుసు. 1846లో ఆయన రాసిన తొలి రచన Poor Folk రష్యా విప్లవ పూర్వకాలంనాటి ఇద్దరు మిత్రుల కథగా, వారిద్దరి మధ్య నడిచే ఉత్తరాల రూపంలోనే నడుస్తుంది.

ఇంకా Saul Bellow రాసిన Herzog (1964) Endo Shusaku రాసిన Silence (1966), Stephen King రాసిన Carrie (1974), John Updike రాసిన 'S' (1988), Helen Fielding రాసిన Bridget Jones's Diary (1996), Carolyn Hart రాసిన Last Day of Summer (1998), వంటివి ఈ లేఖాసాహిత్య పరంపరలో పేరెన్నికగన్న సమకాలీన రచనలుగా చెప్పవచ్చు.

అలాగే ప్రఖ్యాత భారతీయ రచయిత 2008లో ప్రతిష్ఠాత్మక బుకర్ ప్రైజ్ విజేత  అయిన అరవింద్ అడిగా రాసిన The White Tiger కూడా ఈ కోవలోనిదే కావడం ఇక్కడ ప్రస్తావనార్హంగా చెప్పాలి. ఈ నవల అంతా, ఒక భారతీయ రైతు చైనా ప్రధానికి రాసే ఉత్తరాల రూపంలో ఉంటుంది.

**భారతీయ సాహిత్యం – లేఖా సంప్రదాయం :**

ప్రాచీన అలంకారికులు భారతీయ సాహిత్యాన్ని మూడు రకాలుగా వర్ణిస్తారు.

1. ప్రభు సమ్మితాలు
2. కాంతా సమ్మితాలు
3. మిత్ర సమ్మితాలు

అంటే సాహితీ సృజనకు ప్రేరకాలుగా, కారకాలుగా ఈ మూడు ఉంటాయని అంటారు. వీటిలో 'మిత్ర సమ్మితాల' కోవలోకి వచ్చేది 'లేఖా సాహిత్యం' అని చెప్పవచ్చు.

సాధారణంగా లేఖలు ఎవరు ఎవరికి రాసినా వాటిలో అంతర్లీనంగా ఉండే అంశం, రాసే విధానం అంతా మిత్రులతో సంభాషించినట్లుగా, ఇతరుల క్షేమాన్ని, మేలును ఆశించినట్లుగా ఉండటం సహజం. ఈ సున్నితమైన మానవీయ కోణం మిగతా సాహిత్య ప్రక్రియలలో కన్నా లేఖల ద్వారా వెల్లడించే అవకాశం ఎక్కువగా ఉండటం వల్లనేనేమో. ఇది ఒక ప్రత్యేక 'రచనా సంప్రదాయం'గా ఎదిగింది.

భారతీయ ఇతిహాసాలైన రామాయణం, మహా భారతాలలోని రాయబార ఘట్టాలన్నీ మౌఖిక లేఖా సంప్రదాయంలోని తొలి రూపాలే అని చెప్పవచ్చు. అంగదుడు, హనుమంతుడు, సంజయుడు, శ్రీకృష్ణుడు చేసిన ప్రయత్నాలు దీనికి ఉదాహరణలు. కాగా, పూర్తిస్థాయిలో లేఖా సాహిత్యం మొదటగా మనకు సంస్కృతంలో రాసిన 'సుహృల్లేఖ' లో కనిపిస్తుంది. ఈ పదానికి అర్థం 'మిత్రునికో ఉత్తరం' (An Epistle to a Friend,) ! దీనిని బౌద్ధ మహాముని ఆచార్య నాగార్జునుడు (క్రీ.శ. 50–120) రాసాడు. ఆనాటి శాతవాహన చక్రవర్తి శాతకర్ణిని ఉద్దేశించి బౌద్ధమతంలోని విశిష్టతలను, సామాజికావసరాన్ని వివరిస్తూ ఈ బృహత్ లేఖను ఆయన రాశాడు.

అలాగే 'సందేశ కావ్యాలు' కూడా లేఖా సాహిత్యం కోవలోనివే అని చెప్పవచ్చు. కాళిదాసు రాసిన 'మేఘదూతం' దీనికి ఉదాహరణ. విరహంతో ఉన్న యక్షుడు తన ప్రేయసికి మేఘం ద్వారా సందేశాన్ని అందించే లక్ష్యంతో రాసిన ఈ కావ్యం సాహితీశిల్ప సంప్రదాయాలలో ఓ విశిష్ట ప్రయోగం అనే చెప్పాలి.

ఇక ఆధునిక కాలంలో ప్రముఖ వ్యక్తులు ఆయా సందర్భాలలో రాసిన ఉత్తరాలు సాహిత్య ప్రతిపత్తిని పొందే స్థాయిలో ఉండటం విశేషం. ఆ లెక్కన లేఖా సంప్రదాయపు సాహిత్యం మనకు రెండు రూపాలలో కనిపిస్తుంది.

1. కవులు, రచయితలు, మేధావులు, తాత్త్వికులు ఆయా సందర్భాలలో వారి ఆత్మీయులకు రాసిన లేఖలే ఆ తర్వాత సాహిత్య స్థాయిని సంతరించుకోవడం.
2. రచయితలు, సృజనకారులు ఐచ్ఛికంగానే తాము రాయాలనుకున్న కథను లేదా సృజనాత్మక రచనను లేఖా సంప్రదాయపు శిల్పం ద్వారా ఆవిష్కరించడం.

ఈ విషయంలో స్వామి వివేకానందుడు (1863–1902) శరత్ చంద్ర ఛటోపాధ్యాయ (1876 –1938), జవహర్‌లాల్ నెహ్రూ (1889–1965) వంటివారు రాసిన లేఖలు మొదటి కోవలోకి వస్తాయి. నెహ్రూ తన కూతురు ఇందిరాగాంధీకి రాసిన లేఖలు కేవలం వ్యక్తిగత క్షేమ సమాచారంగానే కాక, సాధికారిక విజ్ఞాన అంశాలుగా ప్రసిద్ధికెక్కి, వైయక్తికతను (Individuality) దాటిన సామాజిక ప్రయోజనాన్ని (Social Utility) సాధించాయి.

అలాగే విశ్వకవి, నోబెల్ సాహిత్య గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్‌కు తన అర్జెంటీనా అభిమాని విక్టోరియా ఒకెంపోకు మధ్య జరిగిన ఉత్తరాలు ప్రపంచ సాహిత్య చరిత్రలో సహృదయ స్పందనలుగా గుర్తింపు పొందాయి. ఆ లేఖాబంధమే చివరికి ఠాగూర్ 'పూరబి' పేరుతో ప్రేమ కవితల సంకలనాన్ని రాయడానికి ప్రేరణగా నిలిచింది, ఈ కావ్యాన్ని ఆయన ఆమెకు అంకితం ఇవ్వడం కూడా ఈ వాదనను బలపరుస్తోంది.

**తెలుగులో లేఖాసాహిత్యం :**

తెలుగు సాహిత్యంలో లేఖా సంప్రదాయపు ఛాయలు తరచి చూస్తే ప్రాచీన కావ్యాలలో కూడా కనిపిస్తాయి. వాటిలో ప్రముఖంగా ప్రస్తావించుకోదగినది– గజపతిరాజుకు అల్లసాని పెద్దన రాసినట్లుగా చెప్పుకునే పద్యలేఖ! దండయాత్రకు వచ్చిన రాజు ఈ పద్యలేఖతో వెనుదిరిగి పోయినట్లుగా 'విజయనగర చరిత్ర' అనే గ్రంథంలో ఉటంకించబడింది.

అలాగే, రాయప్రోలు సుబ్బారావు రాసిన 'స్నేహలతాదేవి లేఖ' తెలుగు లేఖా సాహిత్యంలో పేరెన్నికగన్నది. ఇంటిని తాకట్టుపెట్టి కూతురు పెళ్ళి చేయాలనుకున్న తండ్రి స్థితికి చలించి, ఆ కూతురు ఉత్తరం రాసి ఆత్మహత్య చేసుకుంటుంది. ఆ విషాదాంతరచన అప్పట్లో వరకట్నంపై నిరసనగా నిలిచింది.

ఇక గుర్రం జాషువా తన 'గబ్బిలం' ద్వారా లేఖా సంప్రదాయపు ప్రాథమిక రూపమైన సందేశ విధానాన్ని పాటించగా, 'ఫిరదౌసి' కావ్యంలో పూర్తిస్థాయి లేఖా సాహిత్య సృష్టిని చేశారు. మాట తప్పిన చక్రవర్తి ఘజనీ ప్రభువును ఉద్దేశించి కవి ఫిరదౌసి రాసిన కవితా లేఖ కరుణరసాత్మకంగా సాగి గుండెలను ఆర్ద్రం చేస్తుంది.

అలాగే, తిరుపతి వేంకటకవులు 1910–14 మధ్య కాలంలో రాసిన ఉత్తరాలతో వేసిన 'గీరతం' అనుభూతి కవి దేవరకొండ బాలగంగాధర తిలక్ రాసిన 'సైనికుడి ఉత్తరం' కవిత ('అమృతం కురిసిన రాత్రి' లోనిది) త్రిపురనేని గోపీచంద్ రాసిన నవల 'పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా' 'పోస్టు చెయ్యని ఉత్తరాలు', పానుగంటి లక్ష్మీనరసింహారావు రాసిన 'సాక్షి' వ్యాసాలు (అందులోనూ ఆరో సంపుటిలోని లేఖలు), బోయ భీమన్న రాసిన 'జానపదుని జాబులు' తెలుగు సాహిత్యంలో లేఖాసంప్రదాయానికి పెట్టనికోటలుగా నిలిచాయి.

ఇవేకాకుండా నవలల్లోకూడా లేఖా ప్రయోగాలు విస్తృత పాఠకాదరణను పొందాయి. వాటిలో యద్దనపూడి సులోచనారాణి రాసిన 'ప్రేమలేఖలు' నవల, మరో రచయితరాసిన 'ఉత్తరాయణం' అనే హాస్య నవల ప్రముఖమైనవి. పాపులర్ నవలా విభాగంలో మల్లాది వెంకట కృష్ణమూర్తి రాసిన 'దూరం' నవల ఆసాంతం ఉత్తరాలతోనే నడిచి పాఠకులకు శిల్పపరంగా కొత్త అనుభూతినిచ్చింది.

ఇక, చలంరాసిన 'ప్రేమ లేఖలు' అయితే తెలుగు లేఖా సాహిత్య ప్రస్థానంలో ఒక మేలు మలుపుగా నిలిచాయి. లేఖా ప్రక్రియ ద్వారా ఎంత హృద్యమైన సాహిత్యాన్ని సృష్టించవచ్చో నిరూపించాయి. అలాగే మామిడి హరికృష్ణ 2012 అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవ వేడుక విశేషాలను ఓ పాఠశాల విద్యార్థి తన మేనమామకు ఉత్తరం రాసినట్లుగా అందించాడు. ఇది ఆంధ్రభూమి, ఆదివారం అనుబంధంలో కవర్‌స్టోరీగా ప్రచురితమైంది.

ఈ పరంపరలోనే, నేటి ఇంటర్‌నెట్ యుగంలో అంతరించి పోయిందనుకుంటున్న లేఖా సాహిత్యపు అద్భుత సంప్రదాయాన్ని ఈ తరానికి గుర్తుచేసి ఆత్మీయంగా అల్లుకున్న రచనలుగా 'కొత్త ప్రేమలేఖలు' మళ్ళీ ఒక్కసారి ఉత్తరాల తోటలోకి తొంగిచూసేలా చేసాయి.

ఇంత గొప్ప సంప్రదాయం, చరిత్ర, సాహితీ ప్రస్థానాన్ని సాగించిన లేఖా సాహిత్యం, నేటి తరంలో మళ్ళీ ఊపిరి పూసుకోవడానికి పునరుజ్జీవితాన్ని సాధించి, మరికొంతకాలం కొనసాగడానికి, మరిన్ని రచనలు ఈ తరహాలో రావడానికి ప్రేరణగా ఈ ''కొత్త ప్రేమలేఖలు'' నిలిచాయి. ఆర్ద్రంగా, ఆత్మీయంగా గాలి తెరలలోంచి తేలివచ్చి శ్రోతల / పాఠకుల హృదయాలను స్పృశించాయి!

**కొత్త ముద్ర :**

శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి గారు రాసిన ఈ 'కొత్త ప్రేమలేఖలు' ఎన్నో రకాలుగా తెలుగు సాహితీలోకంలో కొత్తముద్రను వేసిందని చెప్పాలి. లిఖిత రూపంలో ఉండాల్సిన లేఖలను మొదటగా 'శ్రవణ'రూపంలో అందించడం, తర్వాత వాటికి పుస్తకంగా సంకలనం చేయడం ద్వారా 'ముద్రణ' రూపాన్నివ్వడం అపూర్వమైన విషయమే!

అలాగే ఈ లేఖలలోని 'వస్తువు' (Subject) ద్వారా కూడా ఈ సంకలనం మరోముద్రను వేసిందని చెప్పాలి. 51 లేఖల ఈ నవీన 'సుహృల్లేఖ'లో అంశాలను లోతుగా పరిశీలిస్తే, వాటిని ఈ క్రింది రకాలుగా వర్గీకరించవచ్చు.

1. **ప్రకృతి లేఖలు :** వ్యవసాయం, విత్తనం, చెట్టు, కాలం, పిచ్చుక వంటి ప్రాకృతిక అంశాలపై రాసిన లేఖలు.
2. **ఆరోగ్య లేఖలు :** వైద్యం, పాలియేటివ్ కేర్ (మృత్యు అవసాన కాలపు సంరక్షణ), శతమానం, యోగ, క్యాన్సర్, తలసీమియా వంటి ఆరోగ్య సంబంధ అంశాలపై రాసిన లేఖలు.
3. **కుటుంబ సంబంధాల లేఖలు :** అమ్మచీర, అత్తాకోడలు, అమ్మ (పాలింకిన నేల), వృద్ధాప్యం, నాన్న, పెళ్లి వంటి అంశాల ఆధారంగా కుటుంబ బంధాలపై రాసిన లేఖలు
4. **శాస్త్ర, సాంకేతిక లేఖలు :** ఆకాశవాణి, సినిమా, చంద్రయాన్, ఎలక్ట్రానిక్స్ వలలో పిల్లలు వంటి శాస్త్ర సాంకేతిక, వైజ్ఞానిక పరిణామాలపై రాసిన లేఖలు
5. **ప్రత్యేక దినాలపై లేఖలు :** వినియోగదారులు (మార్చి 15), ప్రేమికులు (వాలెంటెన్స్ డే ఫిబ్రవరి 14), స్నేహితులు (ఆగష్టు రెండో ఆదివారం) రాజ్యాంగం (నవంబర్ 26) మొదలగు ప్రత్యేక దినోత్సవాలు పురస్కరించుకుని రాసిన లేఖలు.
6. **దేశభక్తి లేఖలు :** సైనికులు, భారతమాత, త్రివిధ దళాలు వంటి అంశాలు దేశం, జాతీయతలో వాటి పాత్రపై రాసిన ఉత్తేజ పూర్వక లేఖలు.
7. **జీవనశైలి లేఖలు :** చీరకట్టు (దేహసిరి), సౌందర్యం, ప్రమాదాల నివారణ, నో చెప్పడం ఒక కళే, విజయ సాధన వంటి జీవనోత్సాహ శైలులపై రాసిన లేఖలు.
8. **పండుగలపై లేఖలు :** సంక్రాంతి, బోనాలు, బతుకమ్మ, వినాయక చవితి వంటి పండుగలు, వాటిలోని విశిష్టతలు, వాటిలో ఇమిడివున్న సామాజిక, పర్యావరణ, మానవీయ ప్రయోజనాలపై రాసిన లేఖలు.
9. **మార్గదర్శులపై లేఖలు :** గాంధీజీ 150వ జయంతి, సమతామూర్తులు (అంబేద్కర్, జ్యోతి బాపూలే, జగ్జీవన్‌రామ్) జయంతుల సందర్భంగా వారి జీవన విశేషాలపై స్ఫూర్తి దాయకంగా రాసిన లేఖలు.

**10. భాషా సాహిత్యాలపై లేఖలు :** మాతృ (అమ్మ) భాష, కవిత్వం – కవి వంటి సాహిత్య సంబంధ అంశాలపై రాసిన లేఖలు

**11. సామాజిక –రాజకీయ లేఖలు :** సమాజం, రాజ్యాంగం, బ్యాలెట్ బాక్స్, పోలీస్ వంటి అంశాలపై, మానవ పరిణామ ప్రగతిలో వాటి సేవలపై రాసిన ఆలోచనాత్మక లేఖలు.

పైవిధంగా ఈ 51 కొత్త ప్రేమలేఖలు స్థూలంగా 11 రకాల అంశాలపై విషయపరంగా, విశ్లేషణపరంగా, అంతకుముందు తెల్సిన అంశాలకన్నా ఎన్నెన్నో తెలియని కోణాలను ఆవిష్కరించి 'కొత్త' అన్న పేరును సార్థకం చేసాయి. ఎంపిక చేసుకున్న అంశాలు కూడా ఎంతో సమకాలీనతను, సామాజికతను కలిగి ఉండటమే కాక సాధారణంగా కనిపించే ఆ అంశాలలోని అసాధారణత్వాన్ని, అసామాన్య తత్వాన్ని సున్నితంగా, సాధికారికంగా, గణాంకాలు, చరిత్రతో మేళవించి అందించాయి.

అలాగే పై ఉత్తరాలన్నీ చదివితే ప్రఖ్యాత Zen బోధకుడు Thich Nhat Hanh చెప్పినట్లు –

*"A real love letter is made of insight, understanding, and compassion. Otherwise it's not a love letter. A true love letter can produce a transformation in the other person, and therefore in the world. But before it produces a transformation in the other person, it has to produce a transformation within us. Some letters may take the whole of our lifetime to write."* అనే మాటలకు రుజువులుగా అనిపిస్తాయి.

**కొత్త శైలి :**

ఈ 'కొత్తప్రేమలేఖలు' రాసిన విధానం అనుకోకుండానే Franz Kafka ఓ సందర్భంలో చెప్పిన –

*"I answer one of your letters, then lie in bed in apparent calm, but my heart beats through my entire body and is conscious only of you. I belong to you; there is really no other way of expressing it, and that is not strong enough"* అన్న మాటలను గుర్తుచేసాయి.

అలా ఈ 'కొత్త ప్రేమలేఖలు' వస్తువు పరంగానే కాక, శైలి (Presentation Style) లో కూడా కొత్త పుంతలు తొక్కాయనే చెప్పవచ్చు. సాధారణంగా ఉత్తరం రాసే శైలి సహృదయతని కలిగి ఉంటుంది. కానీ ఈ 'కొత్త ప్రేమలేఖలు' సహృదయతోపాటు విజ్ఞానాన్ని, వికాసాన్ని, విశ్లేషణను, వివరణలను కూడా అందించి తొలి అక్షరపు పలకరింపు నుండి చివరి ముగింపు వాక్యం దాకా ఒక సున్నిత ఆత్మీయతను అక్షరాల నిండా నింపుకుని పరిమళిస్తుంది. ఈ లేఖల నిండా అమ్మలాలన, గురువు బోధన, నాన్న దీవెన, స్నేహితుడి శుభకామన, సాటి మనిషి హృదయ నివేదనలే వెల్లువలావచ్చి పాఠకుల్ని /శ్రోతల్ని లేఖల ప్రపంచంలోకి తీస్కెళతాయి.

పదాలను పొదిగిన తీరు, వాక్యాలను అల్లుకున్న విధానం, విషయానికి విషయానికీ మధ్య సంభాషణాశైలి అంతా రచయిత్రి వేరువేరు రూపాలలో మన ఎదురుగా నిలబడి, మన చేయి పట్టుకుని తన వెంట తీస్కెళ్ళినట్టుగా అనిపిస్తుంది.

ఈ లేఖలన్నింటినీ ఒకేసారి ఏకబిగిన చదివినా, విడివిడిగా దఫదఫాలుగా చదివినా ఈ లేఖల అంతిమ లక్ష్యం మనలోని మానవున్ని, మానవత్వాన్ని, మానవ తత్వాన్ని స్పృశించినట్లుగానే అనిపిస్తాయి. "అక్షరం – సాహిత్యం ఏదైనా ఒక విస్తృత సామాజిక ప్రయోజనాన్ని కలిగి ఉండాలి. మనకు తెలీని మనలోని అంతరంగ మానవున్ని తట్టిలేపాలి. రేపటి సుందర సమాజ నిర్మాణానికి మనల్ని పురికొల్పాలి. ఒక్కమాటలో చెప్పాలంటే సాహిత్య సృష్టి ఏదైనా దాని అంతిమలక్ష్యం మానవత్వ పునరుద్ధాటనే "(Reaffirmation of humanity)"! ఈ మాటల వెలుగులో గమనిస్తే, ఈ 'కొత్త ప్రేమలేఖలు' ఆ మాటలకు అచ్చమైన సాక్ష్యాలు అని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు.

ఇంకా, ఈ 'కొత్త ప్రేమలేఖలు' – సమ్యక్ ఆలోచనకు, సంపూర్ణ ఆత్మీయతకు, సానుకూల ఆచరణకు వెలుగు దివిటీలు అని, శ్రీలక్ష్మి గారి ఈ లేఖాసాహిత్యం తెలుగు సాహితీలోకంలో ఓ దీప శిలగా నిలుస్తుందని ప్రపంచ లేఖా సాహితీ స్రవంతికి ఈ సంకలన గ్రంథం ఓ వెలుగురేఖను తోడు చేసిందని తడుముకోకుండా చెప్పవచ్చు.

చివరగా... ఈ 'కొత్త ప్రేమలేఖలు' పుస్తకం –

మనసులోని భావాలన్నిటినీ వాక్యాలుగా గుదిగుచ్చిన హృదయహారం
అంతరంగం, ఆత్మీయతలను అక్షరాలుగా పేర్చిన ఆలోచనా ద్వారం
ఒకప్పుడు ప్రేమలేఖ... జీవితాంతం గుండెల్లో దాచుకునే నెమలీక
ఇప్పుడు ప్రేమలేఖ... అంతరించి, అవశేషంగా మిగిలిన జ్ఞాపిక...
ఈ పుస్తకం లేఖా సాహిత్యానికి అక్షరమెత్తు కానుక!
అయినంపూడి శ్రీలక్ష్మి కలం నుండి జాలువారిన
ఈ 'కొత్త ప్రేమలేఖలు'... నవతరం హృదయ రేఖలు !
మనసు నుండి మనసువల్ల, మనసుకోసం...
మనసుతో మనసుచేసే సంభాషణను మనసు విప్పి విందాం... రండి...
గుండె తడిని, మనసు అలజడిని, ఆలోచనల ఉరవడిని, సంఘర్షణల తాకిడిని...
అనుబంధాల జడిని... హృదయం తెరచి చూద్దాం రండి !

**– మామిడి హరికృష్ణ**
డైరెక్టర్ – భాషాసాంస్కృతిక శాఖ
తెలంగాణ ప్రభుత్వం



## స్వరాల తోటలో ఉత్తరాల పూలు!

'బహుజన హితాయ – బహుజన సుఖాయ' అంటూ సర్వ మానవాళి క్షేమాన్ని ఆకాంక్షించే అందరి ఆత్మబంధువు ఆకాశవాణి. కొన్ని దశాబ్ధాలుగా శ్రోతల హృదయాలను అలరిస్తూ సమాజ సంక్షేమంలో – ఆరోగ్యకరమైన దేశ నిర్మాణంలో తనదైన ప్రత్యేక ముద్రను కల్గించింది ఆకాశవాణి. శ్రావ్య మాధ్యమంగా పనిచేస్తూనే కార్యక్రమాలను మన మనోముంగిట్లో దృశ్యమానం చేసే స్వరవిహంగం ఆకాశవాణి మాత్రమే. ఎన్నో తరాలను తన విశేష ప్రతిభతో అభిమానులుగా మార్చుకుని ఆత్మీయతను పంచుతూనే వినోదాన్ని, విజ్ఞానాన్ని, సమాచారాన్ని, సంక్షేమ పథకాల్ని సమంగా అందిస్తూ సమాజ పురోగమనంలో తన పాత్రను రసరమ్యంగా నిర్వహిస్తున్న ఆకాశవాణి ది సాహిత్య సంగీత రంగాలలోనే కాకుండా సమాజ పునర్నిర్మాణంలో కూడా ప్రముఖ పాత్రే వుంటుందన్నది అందరికీ తెల్సిన సత్యమే.

ఆ పరంపరలో భాగంగానే అదృశ్యమైపోతున్న ఉత్తరాల వాహికగా అనుబంధాల్ని మానవీయ విలువల్ని, సమాజ సంక్షేమ సమాచారాల్ని ఎప్పటికప్పుడు శ్రోతలకు అందిస్తూ ''కొత్త ప్రేమలేఖలు'' శీర్షికతో లేఖా సాహిత్య రచనతో మీ ముందుకొచ్చింది ఆకాశవాణి. 2019 జనవరి 7వ తేది నుండి డిసెంబర్ 30వ తేది వరకు సంవత్సరంపాటు భిన్న భిన్న కోణాల్లో విభిన్న అంశాలతో కొనసాగిన అక్షర అస్త్రాలివి. లేఖా ప్రవాహాలివి.

'సమాజ హితమే' సాహిత్యం అంటారు. రేపటి సమాజం ఏ విధంగా ఉండాలో నిర్దేశించగలవారు రచయితలే అనటంలో నాకెలాంటి సందేహం లేదు. ప్రచ్ఛన్న శాసనకర్తలుగా అందుకే వారిని అభివర్ణిస్తారు. రవిగాంచని చోట కూడా కవి గాంచుతాడు అని చెప్పగలిగేది ఈ ఉద్దేశంతోనే.

ప్రతి సోమవారం ఉదయం 7.15 ని॥ ప్రసారమయిన ఈ 'కొత్త ప్రేమలేఖలు' శ్రోతల హృదయాలను బాగా ఆకట్టుకుంది అనటానికి మాకొచ్చిన ఉత్తరాలే తార్కాణం. ప్రత్యక్ష ఫోన్ ఇన్ కార్యక్రమంలో కూడా శ్రోతలు అదే విషయాన్ని మాతో పంచుకునేవారు.

కొన్ని కార్యక్రమాలు శ్రోతలను బాగా ఆకర్షిస్తాయి. సినిమాల మీద మేము రూపొందించిన కార్యక్రమాలు, సాహిత్యం మీద ఏర్పాటుచేసిన చర్చావేదికలు, ఆరోగ్యపరమైన ప్రత్యక్ష ఫోన్ ఇన్ కార్యక్రమాలకు మంచి స్పందనలు వస్తుంటాయి. ఎక్కడా దొరకని లబ్దప్రతిష్టులైన కళాకారులు అరుదైన గొంతులు, విలువైన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు మీకు అందిస్తూ మీ రసస్పందన కోసం అనుక్షణం ఎదురుచూస్తూ అశేష జనావళి ఆదరణను చూరగొంటున్న ఆకాశవాణిది ఎప్పటికీ భారతీయ సంస్కృతీ ఆత్మనే – పెద్ద ముత్తైదువ పాత్రను మాత్రం విస్మరించకుండా మంచినే ప్రబోధిస్తూ, విలువల్ని ప్రసంగిస్తూ సత్యం – ధర్మం – న్యాయం ఈ మూడింటిని సమపాళ్ళుగా అందిస్తూ అటు ఆధ్యాత్మిక ఇటు ఆరోగ్య మరోవైపు సామాజిక – ఇంకోవైపు నైతిక సమాజ చేతనలో తనవంతు భూమికను పోషిస్తుంది ఆకాశవాణి అని మీ అందరికీ తెల్సు.

ఆకాశవాణిలో ధారావాహికగా ప్రసారమైన ఈ కార్యక్రమాలన్నీ ఒక పుస్తకంగా తీసుకురావాలన్న సంకల్పంతో శ్రీలక్ష్మి ముందుకు రావటం నాకెంతో ఆనందాన్ని కల్గించింది. ఏదో రాసుకున్నాం ఎప్పుడో ప్రసారమయ్యింది అని అంతటితోనే

ఆగిపోకుండా సంకలనంగా తీసుకురావడం అభినందనీయం. అంతే గాకుండా, ఇందులో శ్రోతల స్పందనలతో కూడిన విశేషాల్ని కూడా పొందుపరుస్తూ తన రచనలకి సార్థకత కల్గిస్తూ పదిమందికి ఉపయోగపడేలా ఈ పుస్తకాన్ని రూపొందించారు.

ఈ కార్యక్రమాల పరంపరని గమనిస్తే ఇందులో మనల్ని మనం వెతుక్కుంటాం. మన అస్తిత్వాన్ని ప్రశ్నించుకుంటాం. సమాజ నియతిని గమనిస్తాం. ప్రాపంచిక విశేషాల్ని దర్శిస్తాం. అరుదైన సమాచారాన్ని గ్రహిస్తాం. మొత్తం మీద ఒక అనుభూతిని, మరెన్నో అనుభవాల్ని స్వంతం చేసుకుంటాం. ఈ లేఖ మొదలైన దగ్గర నుండి సమయంతో సంబంధం లేకుండా ఏకబిగిన సాగే ధోరణి నన్ను ఆకర్షించింది. ముఖ్యంగా మా చావలి దేవదాసు గారి 'గళ విన్యాసం' ఎందరో శ్రోతల్ని మంత్ర ముగ్ధుల్ని చేసింది. మా ఆకాశవాణి నాటక విభాగంలో A గ్రేడ్ ఆర్టిస్టుగానే కాక మా ఆకాశవాణి అసిస్టెంట్ డైరెక్టర్ దేవదాసు గారు 100 కి 100% శాతం ఈ కార్యక్రమం విజయపథంలో సాగటానికి దోహదం చేశారన్నది నిర్వివాదాంశం. 'కలం – గళం' రెండూ పోటా పోటీగా సాగి మంచి కార్యక్రమాన్ని శ్రోతలకు అందించాయి. అది నా నిర్వహణలో అంటే నేను ఆకాశవాణి Dy. Director General గా ఉన్న సమయంలో జరగటం నాకు సంతోషాన్ని కల్గిస్తుంది.

మంచి కార్యక్రమాన్ని ఆదరిస్తున్న శ్రోతలందరికీ మంచి రచనల్ని ప్రోత్సహించే పాఠకులందరికి ఈ కొత్త ప్రేమలేఖలు ఒక వినూత్న ఉత్తేజాన్ని , ఉత్సాహాన్ని అందిస్తాయని నేను మనస్ఫూర్తిగా నమ్ముతూ ఈ రచనల్ని క్రొంగొత్తగా అందించిన మా శ్రీలక్ష్మిని అభినందిస్తూ...

ఆశీస్సులతో...

మీ

**శైలజా సుమన్**
Dy. Director General(P)
ఆకాశవాణి కేంద్రం
హైదరాబాద్.



## తోక లేని ప్రేమ పిట్టలివి...

చిన్నప్పుడు మా నాయనమ్మ నారాయణమ్మ వసారాలో ఒక ఇనుప తీగకు ఉత్తరాలన్నీ గుచ్చి ఉంచేది. ఇంటికి ఏ ఉత్తరం వచ్చినా అందరూ చదవాల్సిందే. అందరూ చదివాక ఆ కమ్మికి గుచ్చి పైకి పెట్టేది. అప్పుడప్పుడూ ఆ ఉత్తరాలన్నిటినీ కిందకి దించి దుమ్ము దులిపి మా పిల్లలందరితో చదివించేది. ఒక్కో ఉత్తరం చదవటం అయిపోయిన వెంటనే వాళ్ళెవరో, మన కుటుంబానికి ఏమవుతారో, వారికీ మనకీ మధ్య ఉన్న బంధుత్వం ఏమిటో, వాళ్లు మనకు ఎంత ఆత్మీయులో వివరంగా చెప్పేది. దానిద్వారా శుభ, అశుభ కార్యక్రమాలలో బంధు బలగాలు కలిసినా వాళ్లు మాకు తెలిసినట్టే అనిపించేది. నిజానికి మా చదువుల వల్ల అందరినీ మేం చూడలేకపోయినా ఉత్తరాల ద్వారా వారు మాకు చిరపరిచితులు అయినట్టుగా అనిపించేది.

అన్నిటికీ మించి మా నాయనమ్మ మాకు నేర్పిన గొప్ప పాఠం అనుబంధాలే. ప్రతి పరిచయంలో ఆత్మీయత దాగి ఉంటుందని, ప్రతి రక్తసంబంధం వెనక ఎన్నెన్నో జన్మల బంధం ముడిపడి ఉంటుందని మా నాయనమ్మ ఎరుక పరచేది. తెంచుకోవడం క్షణాల్లో పని అని, అనుబంధాలు పెంచుకోవడానికి సంవత్సరాలు పడతాయని రోజూ చెప్పేది. మనకు ఎవరు సాయం చేశారో మరీ మరీ చెబుతూ తరతరాలుగా మనం కృతజ్ఞత తెలియజేయాల్సిన అవసరం ఉందని తెలియపర్చేది.

నిజానికి మా తాతయ్య ఎడ్ల బండి మీద నుండి కింద పడ్డప్పుడు పుత్తూరు తీసుకెళ్లిన సుకాసి వెంకటేశ్వర్లు తాతయ్య, సత్యం తాతయ్య, చిన్నప్పటినుండి నన్ను లక్ష్మీమస్కట్ అంటూ ప్రతిరోజు నాకొక పండు తెచ్చిచ్చి మరెంతో గారాబం చేసే మంచి రచయిత భరత్ కుమార్ (అబ్రాం మావయ్య), మా నాన్నగారికి బాగాలేనప్పుడు మా నాన్నతో హాస్పిటల్స్ తిరిగిన పోస్ట్ మాస్టర్ వెంకటస్వామి మామయ్య, మా ప్రతి అవసరాన్ని గమనిస్తూ తోడుగా నిలిచిన రామరాజు గారు, కర్ణుడు మామయ్య, నరసింహారెడ్డి మామయ్యలు మాకు ఎప్పటికీ ఆరాధనీయులే. మూడు తరాలు గడిచినా వాళ్ల ఇంటి నుండి ఎవరు వచ్చినా ఆత్మబంధువులు గానే చూస్తాం. ఇంటిల్లిపాది వారి ప్రతి కార్యక్రమాలకీ వెళ్తాం. ఈ రాగ బంధాన్ని మాలో నింపింది, పెంచిందీ ఉత్తరాలే అనడంలో అతిశయోక్తి ఏమీ లేదు.

ఇక్కడ ఒక విషయం చెప్పాలి – 1983లో మా నానమ్మకి క్యాన్సర్ అని ఉస్మానియా హాస్పటల్ కి తీసుకెళ్ళాం. మాకు హైదరాబాద్ లో ఎవరూ తెలియదు. మా ఇంట్లో మాతృస్వామ్య వ్యవస్థ ఉండేది. మా ఇంటికి పెద్దదిక్కు తానే. నాన్నకి తన మాట వేదవాక్కు. పుట్టెడు దుఃఖంతో హైదరాబాద్ చేరిన మమ్మల్ని ఆదుకుంది ఉత్తర పఠనమే. మా నాన్న గారి ఫ్రెండు P.L. రాజు గారు హైదరాబాద్ లో సెటిల్ అయ్యానని ఎప్పుడో రాసిన ఉత్తరం మా నానమ్మకి జ్ఞాపకం ఉంది. అదే విషయం చెప్పింది. వెతికితే దొరికింది రాజు మామయ్య రాసిన ఉత్తరం, అందులోని వాళ్ళ ఇంటి అడ్రస్.

వెంటనే నాన్న వాళ్ళ ఇంటికి వెళ్లారు. మావయ్య మాకెంతో సహాయం గా నిలిచారు. అప్పుడు నరసింహారెడ్డి మామయ్య వాళ్ళు కూడా వచ్చి మాకెంతో అండగా నిలిచారు. బ్రతికే నమ్మకం లేదని, నానమ్మకు బాగా లేదని అందరికీ ఉత్తరాల ద్వారానే తెలిసింది. నానమ్మ చనిపోయినప్పుడు అర్థమైంది – నానమ్మ మా చేత బంధువులందరికీ అనుబంధాలు పెంచుకోమంటూ ఎందుకు ఉత్తరాలు రాయించేదో. అందరూ తమ ఇంట్లో మనిషే చనిపోయిందన్నంత ప్రేమగా వచ్చారు. ''వాళ్ళు రాయలేదు కదా

మనమెందుకు రాయాలీ'' అని ఉత్తరం రాయడానికి బద్ధకంవేసి అడిగితే, ''వాళ్ళు ఏదో పనిమీద ఉండొచ్చు, క్షేమసమాచారాలు తెలుసుకోవాలి కదా, ఆ మాత్రం అనుబంధాలు లేకపోతే మనిషి జన్మకి మిగిలేది ఏంట్రా'' అనేది. మాకు నేర్పిన జీవన పాఠం అనుబంధాలకీ, స్నేహాలకూ ప్రాణం ఇవ్వమనే .

చిన్నప్పటి నుండీ నా చేతి రాత బాగుంటుందని మా నాన్న నాతో ఎన్నో ఉత్తరాలు రాయించేవారు. నాన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి గారికి అభిమానంగా రాయించిన ఉత్తరాలు నాకిప్పటికీ జ్ఞాపకాలే. మా పెద్ద తాతయ్య, బాన్సువాడ హ్యాట్రిక్ ఎమ్మెల్యే శ్రీనివాస్ రావు గారు తన అంతిమ కాలంలో ఎన్నో ఉత్తరాలు రాయించారు. నాన్న నాతో పేపర్లకి కూడా ఉత్తరాలు రాయించేవారు. అలా నాకు చిన్నప్పట్నుండి ఉత్తరాలు రాయడం అలవాటు అయింది. సందర్భానుసారంగా కాలేజీలో పుట్టినరోజు, మిత్రుల పెళ్లిరోజులకి ఉత్తరాలు రాయడం వల్ల అందరూ నా పట్ల మంచి మిత్రత్వంతో ఉండేవారు.

కాస్త పెద్దయ్యాక 'పల్లకి' పత్రికలో రెండు, మూడు ప్రేమ లేఖలు ప్రచురింపబడ్డ జ్ఞాపకం ఉంది. మా ఫ్రెండ్ పెళ్లికి నేను రాసిన అతి పెద్ద ఉత్తరం వారింట్లో నాకు విపరీతమైన క్రేజ్ ను తెచ్చిపెట్టింది. ఇంత చిన్న అమ్మాయి అంత అనుభవంతో రాసిందా అని అందరూ ఆశ్చర్యపడ్డారు. ఆ తరువాత 'కేకలు' దశాబ్ది సంచికలో కథల పోటీ పెట్టారు. వరకట్నం తీసుకురాలేదని అత్తింటివారు పెడుతున్న బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకున్న అమ్మాయి, తండ్రికి రాసే చివరి ఉత్తరం కథాంశంగా నేను రాసిన కథకి రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి వచ్చింది. అప్పుడు నా వయసు 18 సంవత్సరాలు. డిగ్రీ లోకి అడుగు పెట్టబోతున్నాను. ఆ తర్వాత కవిత్వాన్ని ప్రేమించడం మొదలుపెట్టి, కథని, వ్యాసాన్ని నిర్లక్ష్యం చేశాననే చెప్పుకోవాలి. అలా మూడు దశాబ్దాలు గడిచిపోయాయి.

ఎందుకో గత సంవత్సరం పుస్తకాలు సర్దుతుంటే 1985 నాటి కేకలు దశాబ్ది పత్రిక కనిపించింది. ఇప్పటికి చదివినా నాకు మళ్ళీ కన్నీళ్లు తెప్పించింది. అలాగే మిత్రులకు నేను రాసిన ఉత్తరాలు కూడా బయట పడ్డాయి. మళ్లీమళ్లీ చదువుకున్నాను. ఎంతో గొప్పగా అనిపించాయి. ఆ జ్ఞాపకాలన్నీ సజీవ చెలమలైనాయి. నా మిత్రులందరినీ మరొక్కసారి చూడాలి అనిపించింది.

అనుకోకుండా నా ఫ్రెండ్ కూతురు పెళ్ళికి వెళ్ళాను. 'ఎవరో తెలుసా' అంటూ నా ఫ్రెండ్, వాళ్ళ కూతురుని అడిగింది. 'తెలీదు' అంది ఆ అమ్మాయి అమాయకంగా. నేను 'ఎప్పుడూ ఒక ఉత్తరం నా జీవితాన్ని మలుపు తిప్పింది అంటానే ఆ ఉత్తరం రాసింది తానే' అంటూ వుండగానే 'ఓ లక్ష్మి ఆంటీనా' అంటూ 'థాంక్యూ ఆంటీ' అంటూ నన్ను హగ్ చేసుకుంది ఆ అమ్మాయి. 'మీరంటే మా మమ్మీ కి ఎంతో ఇష్టం. ఆ ఉత్తరం మీరు డిగ్రీలో ఉన్నప్పుడు రాశారట కదా. ఎప్పుడు కాస్త బాధేసినా తీసి చదువుకుంటుంది. మీ ఉత్తరం ఒక పర్సనాలిటీ డెవలప్మెంట్ క్లాస్ లా ఉంటుంది' అంది. ఆ మాట నాకు చాలా ఆశ్చర్యంగా అనిపించింది. ఆలోచిస్తూ ఇల్లు చేరాను. మిత్రులకి నేను దూరంగా ఉన్నా కదా అనిపించింది ఇన్నేళ్లు. నేను దూరంగా ఉన్నా మా మధ్య దగ్గరితనాన్ని కాపాడింది ఉత్తరమే కదా అనిపించింది. ఇప్పటికీ ఒక వీవీఐపీ లాగా వాళ్ళు నన్ను రిసీవ్ చేసుకున్నారు. అపరాధ భావన కూడా కలిగింది నాలో.

అప్పుడే నేను పనిచేసే మా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం లో ఏదైనా కార్యక్రమం పెడితే బాగుండు అని మా అధికారులు మాట్లాడుకున్నారు. మంత్రవాది మహేశ్వర్ గారి హాస్య ప్రసంగాల తర్వాత మళ్లీ అంత పాపులర్ కార్యక్రమం రాలేదు. కొల్లిమర్ల పుండరీకాక్ష రావు గారు, తాడేపల్లి పతంజలి గారి రచనలు ఎంత బావున్నాయో మహేశ్వర్ గారు ప్రెజెంట్ చేసిన విధానం కూడా అంతే బాగా ఉండటం వల్ల ఆ కార్యక్రమం సూపర్ డూపర్ హిట్టయ్యింది. నేను కూడా ఆ కార్యక్రమానికి మంచి అభిమానిని. నిజామాబాదు లో నా చేత చేయించిన 'విషయం ఇంతేమరి' కార్యక్రమం తర్వాత నేను మళ్ళీ సీరియల్ కార్యక్రమం రాసి ప్రజెంట్ చేసింది ఏదీ లేదు.

నేను ఆకాశవాణి కోసం మళ్ళీ తర్వాత ఏదో ఒకటి చేయాలి అనిపించింది. అందుకు దారి వేసింది మాత్రం సి.ఎస్. రాంబాబు గారు. 'ఈ మధ్య మన ఆకాశవాణిలో రాసే వాళ్ళు తగ్గిపోయారు. కొత్తగా ఏదైనా ఆలోచించండి' అన్నారు. ఎందుకో లేఖలు రాయాలి అనిపించింది. అదే విషయం ఇంట్లో చెప్పాను. నాన్నకి నచ్చలేదు. 'ఇప్పుడు లెటర్లు వినేంత తీరిక ఉంటుందా'

అన్నారు. మా శ్రీవారు మాత్రం 'రాస్తే బానే ఉంటుంది, కానీ సీరియల్ గా రాయగలవా' అన్నారు. నాన్న తన శిష్యుడు మామిడి హరికృష్ణ తో ఈ విషయం చెప్పారు. హరి 'కొత్తగా రాయండమ్మా, ప్రేమలేఖలకి ప్రగాఢత, పరిధి కొద్ది మాత్రమే. అదే కొత్త ప్రేమలేఖలు అంటూ అంశాన్ని విస్తృతం చేసి మీదైన మానవీయ కోణంలో మీ జీవిత అనుభవాలనే తీసుకొని అక్షరాలుగా పేర్చి ప్రేమైక విశ్వాన్ని చూపించండి' అని కొత్త ప్రేమలేఖలు అంటూ కొత్త కాన్సెప్ట్ చెప్పారు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, ఎనభై ఏళ్ల అమ్మా నాన్న, నా సాహిత్య కార్యక్రమాలు, ఆఫీసు పనులు, మనవడి అలనా పాలనా, మధ్య మధ్య అమెరికా ప్రయాణాలు – ఇన్నింటి మధ్య రాయగలనా అనిపించింది. వారం వారం రాయాలి. అందంగా ఉండాలి, అందరికన్నా భిన్నంగా ఉండాలి. ఇది ఒక ఛాలెంజ్ అనిపించింది నాకు. మొత్తం మీద నన్ను ఎంతో ప్రోత్సహించే అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్ చావలి దేవదాస్ గారి దగ్గరికి వెళ్లి విషయం చెప్పాను. ఆయన ఎంతో మెచ్చుకున్నారు. 'ఇంకొక పది రోజుల్లో కొత్త సంవత్సరం వస్తోంది, కొత్త సంవత్సరంలో కొత్త ప్రేమలేఖలు ప్రారంభించండి' అన్నారు. తనది అద్భుతమైన గళం, పైగా ఏ–గ్రేడ్ డ్రామా ఆర్టిస్ట్. 'మీరు చదువుతానంటే నేను వ్రాస్తాను' అన్నాను నేను. 'నేను ఆఫీసు పని మీద తిరుగుతూ ఉంటాను కదా కుదురుతుందా' అన్నారు. నేను ఒప్పుకోలేదు, మీరు చదువుతానంటేనే రాస్తానని మొండి పట్టు పట్టాను.

మొత్తం మీద దేవదాస్ గారు మాట ఇచ్చారు. తానే వెళ్లి మా డైరెక్టర్ ఉదయ్ శంకర్ గార్కి విషయం చెప్పారు. వారు నన్ను పిలిచి 'చాలా సంతోషం శ్రీలక్ష్మి గారూ, మీరు సంవత్సరం పాటు నిర్వహించిన తెలంగాణ వైభవం జాతీయ స్థాయిలో ఆకాశవాణికి పేరు తెచ్చింది. పుస్తకం కూడా వేసుకున్నాము. ఇది కూడా ఒక రికార్డు బ్రేక్ అవుతుంది అని నేను నమ్ముతున్నాను' అన్నారు. ఆ విధంగా గోపిచంద్‌గారు, రాఘవరెడ్డి గారు, రాంబాబు గారు, దేవదాసు గారు, ఉదయ శంకర్ గారు ఈ కార్యక్రమం మీద నిర్ణయం తీసుకున్నారు. వారందరికి ధన్యవాదాలు.

ఒక ఉత్తరం ప్రసారమయ్యేసరికి ఒక నాలుగు ఐదు ఫోన్ కాల్స్ వచ్చాయి. ఓ మూడు నాలుగు ఉత్తరాలు జనవాణికి అభినందిస్తూ రాసారు. ధైర్యం కలిగింది. ఇక ఆ తరువాత కొత్త ఉత్సాహంతో రాయడం ప్రారంభించాను. మీరంతా నమ్మాలని నేను ఈ మాట చెప్పడం లేదు. కానీ నేను ఎక్కడికి వెళ్ళినా, ఏ పుస్తకం తిరగేసినా, ఏ చర్చల్లో పాల్గొన్నా, నా ప్రతి ఆలోచన రాబోయే ఉత్తరం ఎలాంటిది అయితే బాగుంటుంది అన్న దాని చుట్టూ తిరుగుతూ ఉండేది. నిజంగా ఈ ఉత్తరాల్ని నేను ఎంత మనస్సు పెట్టి రాసానంటే ఒక్కోసారి అర్ధ రాత్రి లేచి రాసుకున్న సందర్భాలు ఉన్నాయి.

మా నాన్నకు బాగోలేకపోతే నేను రాసిన ఉత్తరం చూసి మా నాన్న గారి విద్యార్థులంతా ఫోన్‌ల మీద ఫోన్‌లు చేశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఆయన నిలుపుకున్న విలువలకు నేను ఇచ్చిన అక్షరరూపం ఇంత మందిని జాగృతం చేసిందా అనిపించింది. అలా అత్తయ్య హనుమాయమ్మను పాలియేటివ్ కేర్‌లో వుంచినప్పటి అనుభవాలు, నా ఫ్రెండ్స్‌తో నా జ్ఞాపకాలు ఇలా ఎన్నెన్నో ప్రేమ పావురాలై శ్రోతల మనో మందిరాలపై వాలాయి.

ఏ క్షణంలో మామిడి హరికృష్ణ గారు కొత్త ప్రేమ లేఖలు అని నామకరణం చేశారో కానీ మొదలు పెట్టిన మొదటి రోజు నుండి ప్రశంసల జల్లు కురుస్తూనే ఉంది.

ముఖ్యంగా ఇక్కడ చావలి దేవదాస్ అన్నకి కృతజ్ఞతలు చెప్పాలి. ఏ స్టేషన్ కి వెళ్లినా అక్కడికి మెయిల్ లో పంపిస్తే చాలు, ఆ ఉత్తరాన్ని తీసుకొని వాయిస్ రికార్డు చేసి తిరిగి నాకు పంపించేవారు. నా పనుల ఒత్తిడి వల్ల అప్పుడప్పుడూ ఆలస్యం అయినా, తనకు హాలిడేస్ ఉన్నా కూడా ఆఫీసుకొచ్చి తప్పకుండా చదివేవారు. ఎంతో నిబద్ధంగా, ఇష్టంగా ప్రేమలేఖలు వినిపించేవారు. ఈ కార్యక్రమం ఇంత పాపులర్ గా జనాల మధ్యకు వెళ్లడానికి ముఖ్య కారణం వారి గళ ప్రభావమేనంటే సముచితంగా ఉంటుంది. 50% రచన ప్రభావం అయితే, మరొక 50% వారి గళ విశ్వరూపం అనడం సముచితం. వారికి నా కృతజ్ఞతలు.

ఇక్కడ మరో విషయం చెప్పాలి.

ఇవన్నీ ఆకాశవాణిలో ప్రతి సోమవారం ఉదయం 7 గంటల 15 నిమిషాలకు 2019 జనవరి 7 నుండి డిసెంబర్ 30వ తేదీ వరకూ ప్రసారమైన కార్యక్రమాలు. దేవదాసు గారు జూలైలో రిటైరయ్యారు. అప్పటికి మంచి లిజనింగ్ ఉన్న కార్యక్రమంగా

ప్రశంసలు అందుకుంటోంది. ఆ తర్వాత ఏం చెయ్యాలా అని ఆలోచించాను, ఆపేద్దామనుకున్నాను. అంతలోనే ఢిల్లీ నుండి మా ఆకాశవాణి కేంద్రానికి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ గా విచ్చేసిన శైలజా సుమన్ గారు అన్ని కార్యక్రమాలనూ పరిశీలించారు. రావడం రావడమే 'కొత్త ప్రేమలేఖలు మంచి కార్యక్రమం అంటున్నారు, కంటిన్యూ చెయ్యండి' అన్నారు. ఎంతో గొప్పగా అనిపించింది నాకు. శైలజా సుమన్ గారు ఏ కార్యక్రమాన్ని తలపెట్టినా వినూత్నంగా ప్రచారం చేయడం తన ప్రత్యేకత.

అలా అందరి అభిమానాన్ని చూరగొని సంవత్సరం పాటు విజయవంతంగా ప్రసారమై ఆకాశవాణికి, నాకూ సరికొత్త ఆనందాన్ని, కీర్తిని, అన్నిటికీ మించి సంతృప్తిని అందించిన ఆ కార్యక్రమాన్ని ఇలా పుస్తకంగా మీ ముందుకి తీసుకొస్తున్నాం.

పుస్తకం వెయ్యాలా వద్దా అని నిర్ణయించుకోక ముందే మహబూబ్ నగర్ కొల్లాపూర్ నుంచి రాం చరణ్ అనే వ్యక్తి వచ్చి 200 పుస్తకాలు ఆర్డర్ ఇచ్చారు. ఎందుకని అడిగాను. అబ్దుల్ కలాం ఫౌండేషన్ స్థాపించి, ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకి మౌలిక వసతులు సమకూరుస్తూ, వ్యక్తిత్వ వికాసం కోసం ప్రయత్నం చేస్తున్నానని, ఈ పుస్తకాలు విద్యార్థులకి అందిస్తే అనుబంధాలతో పాటు, మానవీయ కోణం తెలుస్తుందని చెప్పారు. ఎంతో గొప్పగా అనిపించింది నాకు. 'Wounded Heart' అని కేన్సర్ బాధితులకు నేను రాసిన దీర్ఘ కవితని కేన్సర్ బాధిత కుటుంబాలకి సహానుభూతిని పంచడం కోసం ఇలానే వచ్చి తీసుకెళ్లేవారు. నా ఆత్మీయ దత్త పుత్రిక, గీత రచయిత శ్రీవల్లి మరో వంద పుస్తకాలు, 'అక్షరయాన్'–Telugu Women Writers Forum మరొక 200 పుస్తకాలు, NRI ఒకరు మరో 300 పుస్తకాలు, కార్పోరేట్ స్కూళ్లలో పంచడం కోసం సురేష్ చౌదరి గారు ఒక 200 పుస్తకాలు, మా శ్రోతలు మలక్‌పేట రాధ, పోలేరయ్య, హరీంద్రబాబు గారు మరో వంద పుస్తకాలు ***పుస్తకం ప్రచురించబడకుండానే ఆర్డర్ ఇచ్చేశారు..*** ఈ సంఘటన నాలో మరింత ఆనందాన్ని కలుగ చేసింది. ఇలా సరికొత్త రికార్డు క్రియేట్ చేసిన పుస్తకం ఇది.

మా కుటుంబ సభ్యులం అందరం ఆలోచించి ఈ వెయ్యి పుస్తకాలు అమ్మగా వచ్చిన డబ్బుని వితరణ కింద ఉపయోగించాలి అనుకున్నాం. ఇందులో తెలుగు ఉమెన్ రైటర్స్ ఫోరం అంటూ ప్రారంభమైన అనతికాలంలోనే రికార్డు క్రియేట్ చేసి ఎన్నో కార్యక్రమాలను నిర్వహించిన 'అక్షరయాన్ సంస్థ' కి కార్యక్రమాల కోసం 30 వేల రూపాయలు, యుద్ధంలో చనిపోయిన సైనికుని కుమారునికి ఇంజనీరింగ్ చదువు నిమిత్తం 50 వేల రూపాయలు, అబ్దుల్‌కలాం ఫౌండేషన్‌కి 20 వేల రూపాయలు డొనేట్ చేద్దామనుకుంటున్నాము. ఇది మా కుటుంబానికి ఎంతో ఆనందదాయకం.

ఈ పుస్తకాన్ని ఆవిష్కరించిన గౌరవనీయులు తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. తొలి ప్రతిని అందుకున్న డిప్యూటీ డైరెక్టర్ జనరల్ శైలజా సుమన్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

ఎప్పటికప్పుడు సలహాలిస్తూ ఈ కార్యక్రమం సజావుగా సాగటానికి మార్గనిర్దేశం చేస్తూ నన్ను నడిపించే నా కుటుంబ సభ్యులు ముఖ్యంగా మా అన్నదమ్ములు శేఖర్–సుధ, సుబ్బారావు–హిమబిందు, మహేష్–మాధవి లకి నా ధన్యవాదాలు. అద్భుతమైన కవిత్వంతో ముందుకు సాగుతున్న నా మేనల్లుడు సమయ్ కి, మేనకోడళ్ళు సంహిత, మహిత, మేధలకి, నా మరో మేనల్లుడు ప్రణవ్ కి ఆశీస్సులు.

నా ఇద్దరమ్మాయిల కుటుంబాలు యశస్వి బొద్దులూరి–నవ్యత, గుర్రం అభినవ్–హర్షితలకి, సాయి నవీన్ కి, నన్ను నడిపించే ఇంధనమైన నా బుల్లి మనవళ్లు ఆరవ్–నీరవ్ లకి ఆశీస్సులు.

నాకు వియ్యపురాళ్లగా కన్నా మంచి మిత్రులుగా ఎప్పటికప్పుడు సహాయ సహకారాలందించే బొద్దులూరి ఉమాదేవి, వాణిశ్రీ–గుర్రం మురళీధర్‌రావ్, అనురాగ్, బొద్దులూరి తేజ లకి ప్రత్యేక కృతజ్ఞతలు.

అన్నింటికి మించి నేనీ స్థాయిలో ఉండడానికి కారకులైన నడిచే దేవతలు మా అమ్మానాన్నలు అయినంపూడి సరోజిని–శ్యామ్ సుందరరావ్ గార్లకు, నిరంతరం నన్ను ప్రోత్సహించే శ్రీవారు బండ్లమూడి నాగేశ్వర రావు గార్కి, నన్నెంతో అభిమానించే నా తోబుట్టువు లాంటి ఆడపడుచు ఝాన్సీ రాణికి నమస్కారాలు. నా మరిది రమేష్–తోడి కోడలు సంధ్యకి అన్నిటికి మించి నాకు

ఎప్పటికప్పుడు సహాయసహకారాలు అందించే తమ్ముడు దోనెపూడి చక్రపాణి – ధనలక్ష్మి, మా కుటుంబ లాయర్ మరియు ఆత్మీయులు సురేష్‌కుమార్ పొన్నేరి గారికి, పొన్నం రవిచందర్ అన్నకి, పొన్నం కుటుంబ సభ్యులకు, ఆకాశవాణి ఇంజనీరింగ్ అధిపతి నరేంద్ర కుమారి మేడమ్ గారికి ధన్యవాదాలు. U ట్యూబ్‌కి బొమ్మవేసిన బ్నిం గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

ఇక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన విషయం ఈ లేఖలు మీ చేతుల్లో ప్రేమ పావురాలుగా నిలబడటానికి కారకులై నిరంతరం నా ప్రతి పనికి సహాయ సహకారాలు అందించే మా కుటుంబ బిడ్డలు పి.వి.జి. సతీష్, జావీద్ వారి కుటుంబాలకు, మాకు మరో బిడ్డ కిరణ్ గంగరబోయిన కు ప్రేమతోనూ, అభిమానంతోనూ కృతజ్ఞతలు అందిస్తున్నాను.

మా కుటుంబ వైద్యులు డా॥ రేఖ–మురళీధర్ రావు గార్కి, డా॥ నిర్మల–చంద్ర శేఖరరావ్ గార్కి, డా॥ గీత–అమరేష్ గారికి, డా॥ ములుకుట్ల రాఘవదత్, డా॥ మద్దినేని జగదీశ్, డా॥ చిరంజీవి, డా॥ జ్వాల, డా॥ పాపారావ్, డా॥ గూడపాటి రమేశ్, డా॥ ఆంజనేయులు, డా॥ కోయ కిశోర్ గారికి,

నా ప్రేమలేఖలకి చక్కటి పాటని అందించిన మ్యూజిక్ డైరెక్టర్ చిన్ని చరణ్ కి, రాం చరణ్ కి, సినీ గీత రచయిత్రి శ్రీవల్లికి, అక్షరయాన్ తెలుగు రచయిత్రుల బృందానికి, సురేష్ చౌదరి గారికి, యోగ అరుణ, తమ్ముడు సత్య – జయలకు, ఆనంద గజపతి రాజు గారికి, పూలపల్లి వెంకట రమణ గారికి, నరేంద్రరెడ్డి గారికి ప్రత్యేక ధన్య వాదాలు తెలియజేసు కుంటున్నాను.

నా సాహితీ ప్రస్థానాన్ని నిరంతరం ప్రోత్సహించిన గురుదేవుడు కీ.శే. సైబ పరంధాములు కుటుంబానికి, డాక్టర్ నాళేశ్వరం శంకరం గారి కుటుంబానికి, ఆకాశవాణి సిబ్బందికి, 'అవ్వా' అంటూ ఆత్మీయంగా పలకరించే డాక్టర్ మామిడి సుదర్శనం గారి కుటుంబ సభ్యులకి, విజయ – జనార్ధన్, రాజశ్రీ – రాజేంద్రప్రసాద్, సుకృతి – పవన్, జయకృష్ణకి ధన్యవాదాలు. చక్కటి ముందుమాటతో ఈ పుస్తకానికి మరింత ప్రాచుర్యాన్ని కల్పించిన మా కుటుంబ ఆత్మబంధువు మామిడి హరికృష్ణ గారికి, ఆత్మీయ వచనాన్ని అందించిన శైలజా సుమన్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

**– అయినంపూడి శ్రీలక్ష్మి**

# లేఖాలోకం...


| | | ప్రసారమైన తేది | పేజీ |
|---|---|---|---|
| 1 | మట్టి పాట (వ్యవసాయం) | 07-01-2019 | 1 |
| 2 | ముగ్గుల పండుగ (సంక్రాంతి) | 14-01-2019 | 5 |
| 3 | కణ నీరాజనం (క్యాన్సర్) | 21-01-2019 | 9 |
| 4 | రెండు ధృవాలు – ఒక్క ఆకాశం | 28-01-2019 | 12 |
| 5 | ఆ డిజిటలిజం (ఎలక్ట్రానిక్స్ వలలో పసివాళ్లు) | 04-02-2019 | 17 |
| 6 | ప్రేమను ప్రేమించు ప్రేమకై (వేలంటైన్స్ డే) | 11-02-2019 | 22 |
| 7 | డియర్ సోల్జర్ | 18-02-2019 | 26 |
| 8 | వినియోగ చైతన్యం | 25-02-2019 | 30 |
| 9 | పాలించిన నేల (అమ్మ) | 04-03-2019 | 34 |
| 10 | త్రిదళం – త్రినేత్రం (భారతమాత) | 11-03-2019 | 37 |
| 11 | అచ్చంగా పిచ్చుక | 18-03-2019 | 42 |
| 12 | ఎన్నికల'వరం' (బ్యాలెట్ బాక్స్) | 25-03-2019 | 46 |
| 13 | కాలం | 01-04-2019 | 50 |
| 14 | అమ్మమ్మ చీర | 08-04-2019 | 55 |
| 15 | సమతామూర్తులు | 15-04-2019 | 58 |
| 16 | శతమానం (వైద్యం) | 22-04-2019 | 63 |
| 17 | స్వప్న నగరం (హైదరాబాద్) | 29-04-2019 | 67 |
| 18 | దేహ సిరి (చీరకట్టు) | 06-05-2019 | 73 |
| 19 | మేఘాలాపన (అత్యాచారాలు) | 13-05-2019 | 76 |
| 20 | సతత హరిత జీవితం | 20-05-2019 | 82 |
| 21 | శిశిర వసంతం (వృద్ధాప్యం) | 27-05-2019 | 87 |
| 22 | నిన్నటి తరం దూత (నాన్న) | 03-06-2019 | 91 |
| 23 | పచ్చని ఆశ (చెట్టు) | 10-06-2019 | 97 |

| | | | |
|---|---|---|---|
| 24 | యోగావరణం! | 17-06-2019 | 101 |
| 25 | జలోత్సవం (కాళేశ్వరం) | 24-06-2019 | 106 |
| 26 | సౌందర్య లాలస (అందం) | 01-07-2019 | 111 |
| 27 | బోనం (అమ్మకు నైవేద్యం) | 08-07-2019 | 117 |
| 28 | ఆసన్న నిష్క్రమణ (పాలియేటివ్ కేర్) | 15-07-2019 | 121 |
| 29 | జాబిల్లీ వస్తున్నాం (చంద్రయాన్) | 22-07-2019 | 126 |
| 30 | నిస్తంత్రీ స్వరం (ఆకాశవాణి) | 29-07-2019 | 130 |
| 31 | మ్రోగింది కళ్యాణ వీణ | 05-08-2019 | 137 |
| 32 | చలన దృశ్యం (సినిమా) | 12-08-2019 | 141 |
| 33 | మనలో ఒకడు (కామన్ మెన్) | 19-08-2019 | 146 |
| 34 | మైత్రి లోకం | 26-08-2019 | 153 |
| 35 | అవిఘ్నమస్తు | 02-09-2019 | 158 |
| 36 | తలసీమియా | 09-09-2019 | 164 |
| 37 | సమాజమా...! | 16-09-2019 | 168 |
| 38 | తోకలేని పిట్ట | 23-09-2019 | 174 |
| 40 | ఈ శతాబ్ది సత్యం (గాంధీవాదం) | 30-09-2019 | 179 |
| 41 | తీరొక్క పువ్వు (బతుకమ్మ) | 07-10-2019 | 184 |
| 42 | విజయీభవ! | 28-10-2019 | 190 |
| 43 | జగద్రక్ష (పోలీసు) | 04-11-2019 | 195 |
| 44 | మార్గదర్శులు | 11-11-2019 | 200 |
| 45 | స్ఫూర్తి దాతలు | 18-11-2019 | 206 |
| 46 | అక్షర బ్రహ్మ | 25-11-2019 | 209 |
| 47 | రాజ్యాంగం | 02-12-2019 | 214 |
| 48 | ప్రమాదాలు | 09-12-2019 | 219 |
| 49 | అమ్మ భాష | 16-12-2019 | 224 |
| 50 | నోఅని చెప్పటమూ ఒక కళే! | 23-12-2019 | 230 |
| 51 | కొత్త సృష్టి చేతనం (విత్తనం) | 30-12-2019 | 234 |
| | అనుబంధం – 1 కొత్తప్రేమలేఖలు – అక్షర స్పందనలు | | 240 |
| | అనుబంధం – 2 ఆత్మీయవాక్యం – సుధాశేఖర్, సుబ్బారావు, బిందు | | 253 |
| | అయినంపూడి శ్రీలక్ష్మి రచనలు | | 258 |

# మట్టిపాట

బాబాయ్ !

ఎలా ఉన్నారు ? చాన్నాళ్లయింది మీతో మాట్లాడి ... ఉత్తరం రాసి ఏళ్ళే అయిందనుకో ... కానీ ఎందుకో ఈ రోజు నీకు ఉత్తరం రాయాలనిపిస్తోంది. దూరాలను కలిపే ఆత్మీయ దారాలు ఉత్తరాలే కదా ... ఫోన్లలో సొల్లు కబుర్లు ఎన్ని చెప్పుకున్నా 'హృదయావిష్కరణ' జరగాలంటే ఉత్తరానికి మించిన మార్గం లేదు ... అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ .... ఎంతో చెప్పాలని చాలా ఏళ్ళుగా అనుకుంటున్నా ... కానీ చెప్పే సమయం, సందర్భం రాలేదు ఇప్పుడిక చెప్పకపోతే నేనిక ఎప్పటికీ చెప్పలేనేమో, తప్పుగా భావిస్తే మన్నించు బాబాయ్! నచ్చితే ఆశీర్వదించడం మరచిపోకేం...

నిన్న మన ఊరి నుండి మున్సబు గారి మనవడు వచ్చాడు ... నువ్వు పొలం అమ్మేద్దామని అనుకుంటున్నావని ... కాస్త వ్యవసాయం దెబ్బతిందని అందుకే నువ్వు ఆలోచనలో పడ్డావని చెప్పాడు ... నీకు చెప్పాల్సినంతటి వాడిని కాదు బాబాయ్ ... అయినా కొన్ని విషయాలు గుర్తు చేద్దామని ఈ ఉత్తరం మొదలుపెట్టాను.

నీకు గుర్తుందా బాబాయ్ ! మా చిన్నప్పుడు మా పిల్ల జనాభా అంతా నీ చుట్టూ వుండే వాళ్ళం. ట్రాక్టర్ మీద నువ్వు ఎక్కిందే తడవు బిలబిల పది మంది పిల్లలం నీతో పాటు ఎక్కేవాళ్ళం... గట్ల మీద నువ్వు కూలీలను అదమాయిస్తూ వెళ్తుంటే నీలా నడవాలని .... చేతితో పైరుని తడుతూ నీలా ముచ్చట్లు చెప్పాలని ఆశ పడే వాళ్ళం ... మధ్యాహ్న భోజనం నీతో పాటు పొలంలో చేయటం మాకెంతో సంతోషమని నీకు బాగా తెల్సు. అమ్మ ఎంత తిట్టినా సరే మాకు కూడా క్యారియర్లు సర్దుకుని నువ్వు తుమ్మ చెట్టు కింద తుండుగుడ్డ పరిచి మొదటి భోజనాన్ని మన క్యారియర్‌తో బోర్లిచ్చిన వెంటనే బిరబిరా కూలీ రైతుల గిన్నెలన్నీ కలిసేవి ... అందరి భోజనాలు ఒకే చోట కలిపి అందరి దోసిట్లో నువ్వు పెద్ద పెద్ద ముద్దలు పెడుతుంటే ... ఆ రుచి ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నా బాబాయ్ ... దేశదేశాల వంటల రుచి చూసిన వాడిగా చెప్తున్నాను ... నీ మనసును ఆ భోజనంలో కలిపి పెట్టావేమో అందుకే అది అంత రుచిగా వుంది అని ఇప్పుడనిపిస్తుంది...

చుట్టు పక్కల ఏ ఊరి రైతుకు ఏ సమస్య వచ్చినా నువ్వే వెళ్ళి తీర్చేవాడివి ... చిన్న చిన్న చీడపీడలకి నువ్వే మందులు చెప్పే వాడివి.. నువ్వు పిలిస్తే వ్యవసాయాధికారులు పరుగెత్తుకు వచ్చేవారు... పది మంది రైతుల కోసం రచ్చ బండ మీద నువ్వు రాత్రుళ్లు చెప్పే వ్యవసాయ పాఠాలు చిన్నప్పటి నుండి వింటూ పెరిగిన వాళ్ళం మేమంతా ... ఇప్పుడు కర్ణుడు కవచ కుండలాలు పక్కన పెట్టబోతున్నట్టుగా అనిపిస్తోంది నీ నిర్ణయం వింటుంటే ...

బాబాయ్ ! వ్యవసాయమే మన దేశాన్ని ఆర్థిక మాంద్యం నుండి ఆదుకుంది. ప్రపంచ స్టాక్ మార్కెట్ కుప్పకూలినా తట్టుకుని నిలబడ్డ దేశాల్లో మన దేశం ఒకటి. అందుకు కారణం మన వ్యవసాయరంగం ... 70% వ్యవసాయాధారిత దేశం మనది ... నిజానికి నాలాంటి డాక్టరో ... నీ పిల్లల్లా సాఫ్ట్ వేర్ రంగమో ఈ దేశాన్ని నడిపించడం లేదు ... నీలాంటి

రైతులే మన దేశాన్ని కాపాడుతున్నారు. ఆనాడు 'జై జవాన్' 'జై కిసాన్' నినాదం స్కూల్లో చేస్తున్నప్పుడు నా కళ్ల ముందు నువ్వే కన్పించేవాడివి... నా గుండె గర్వంగా ఉప్పొంగేది... మా మాస్టారు ఎప్పుడూ చెప్తుండే వాడు ... అన్ని దానాల్లోకెల్లా 'అన్నదానం' గొప్ప అని. దేశానికి 'అన్నం' భిక్షగా పెట్టే స్థాయిలో రైతు నిలబడి ఉన్నాడు బాబాయ్ ... ఎన్నిసంపాదించినా ... ఎంతలా సంపాదించినా బంగారాన్ని రజనుగా చేసుకుని తినలేడుగా... మెతుకు ముత్యాలు పంచే నీ చేతి ముందు ఏ రంగంలోని ఎంత స్థాయి వ్యక్తులైనా దిగదుడుపేగా ... అన్నదాతవి, ఆర్తి ప్రదాతవి నువ్వే బాబాయ్!...

నువ్వన్నావ్ క్రితం సంక్రాంతికి నేను ఊరొచ్చినప్పుడు, 'భూమి ఇదివరకులా లేదురా ... అనుకున్నట్టుగా దిగుబడి రావట్లేదు ... వ్యవసాయ ఖర్చులు కూడా బాగా పెరిగిపోయాయి... కూలీ జనాల కొరత ఉంది ... వ్యవసాయం చేయటం కష్టంగా ఉందిరా' అని. వ్యవసాయం వ్యయసాయం ఎప్పుడూ కాదు అని నేను పుట్టినప్పటి నుండి నీ నోటి ద్వారా వింటూనే వున్నా ... కాలాన్ని నమ్ముకున్న వాడి కంట్లో నీరూరదు ... భూతల్లి గుండెల్లో చెమ్మ ఉన్నంతకాలం రైతు చెమట చుక్కల్లో దమ్ము ఉన్నంతకాలం ... వేసే నాగలి కర్రుల్లో ధైర్యం ఉన్నంతకాలం పండే పంటకు కొదవలేదు ... దిగుబడి రాబడులకు కొరత రాదు.

ఎప్పుడో విన్న మాట

ఎంత దున్నినా మట్టికి ఎప్పుడైనా కలత వుందా ?

ఎంత ఉలికినా యేటికి ఎప్పుడైనా నెలత వుందా ?

ఎంత ఎగిసినా నింగికి ఎప్పుడైనా కొలత వుందా ?

ఎంత పీల్చినా గాలికి ఎప్పుడైనా కొరత వుందా ?

రైతూ అంతే బాబాయ్ ! నువ్వు అన్నావుగా 'నాగలి నాగరికతకు' నాంది అని. Our common culture is agriculture అని – నిజం. అన్నం శరీరానికి ఇంధనం... రైతు దేశానికి మూలధనం ... మీ చెమట చుక్కల్తో భూమితల్లిని తడిపి నేలతల్లి కడుపు పండించే రైతు రాజులు మీరు. నీటి చెమ్మ తగలక గుండె బండబారినా తనను నమ్మిన రైతు కంట్లోని చెమ్మ చూడలేక భూతల్లి తన గుండెను మాత్రం బీటలు బారకుండా, చెమ్మ తగ్గకుండా భరిస్తుందట... అచ్చు మన అమ్మమ్మలా ... ఏం ఉన్నా లేకున్నా మనందరికీ వండి పెట్టి ఆఖరికి అన్నం గిన్నెలో ఉన్న నాలుగు మెతుకుల్ని గంజి పోసుకుని తిని తన బిడ్డలు కడుపు నిండా తిన్నారన్న ఆనందంతో రోజంతా గడిపేది .. అలాంటి బంగారు తల్లి మన భూతల్లి ... చేనుకు ఏడవడం తెలియదు ఓదార్చడం తప్ప ... చేనుకు పిరికితనం తెలియదు పిడికెడు దానం తప్ప ... ఇన్నేళ్లుగా వ్యవసాయం చేస్తున్న భూమి ఆప్త పుత్రుడివి నువ్వు ... నీకు తెలియని విషయాలా ఇవి?

వ్యవసాయం అంటే వ్యవస్థకు చేసే సాయం ... వ్యవసాయాన్ని వృత్తిగా కాక జీవనవిధానంగా మార్చుకున్న జాతి మనది ... భూతల్లిని మలుచుకున్న వాళ్ళం మనం ... మంత్రాలకు జీవశక్తిని ఇచ్చింది ఋషులైతే నేలకి ప్రాణశక్తిని ఇచ్చిన స్వేదర్షులు మీరంతా ... ప్రపంచం మొత్తం మీద యూదుల్ని పోరాట యోధులుగా చెప్తారు ... నాకు తెల్సి రైతును మించిన పోరాట యోధుడు ఎక్కడా కన్పించడు ... మీరు పోరాడుతూనే ఉన్నారు బాబాయ్ ఇప్పటి వరకూ ... పిల్లల్ని చదివించారు ... సమాజాన్ని నడిపించారు ...ఇప్పుడు మీలాంటి రైతులే మాతో కాదని వెనుదిరిగితే మేమేమైపోవాలి ... మీరే నాగలి వదిలేసిననాడు దేశం జోలెపట్టుకుంటుంది ... మన దేశ ప్రజలు అన్నమో రామచంద్రా అని ఆకలితో అల్లల్లాడతారు ..

నాగలి నాగరికతకు నాంది మాత్రమే కాదు, సేద్యం సంస్కృతికి పునాది కూడా ... అతిపెద్ద ఉపాధి కల్పనా రంగంగా వున్న వ్యవసాయం ఈనాడు మళ్ళీ గాడిన పడింది ... కుదేలయింది మిగతా రంగాలే ... కార్పొరేట్లు కుందేల్లా

సంవత్సరానికొకసారి జంపులు చేస్తుంటారు. కావల్సిందల్లా ఒక్కటే. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా వస్తున్న మార్పులకు తగ్గట్టుగా ఆలోచనా పరిధి విస్తృతం చేసుకోవాలి ... ఆచరణాత్మక విధానాలకు పెద్ద పీట వేసుకోవాలి.

వ్యవసాయంలో అశాస్త్రీయ, అసంబద్ధ పోకడలు మాత్రమే రైతు కుటుంబాలను ఆర్థిక స్థితిగతుల్ని అస్థిరపరుస్తున్నాయే తప్ప భూతల్లి కాదుగా–బయో టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, నానో టెక్నాలజీ లాంటి నూతన శాస్త్ర విభాగాలు వచ్చాక ఉద్యాన వనాల పెంపకంలో రైతు నికరాదాయాన్ని చూస్తున్నాడా లేదా ?

హరిత విప్లవం ఫలితంగా ఆహార భద్రత లభించినప్పటికీ పెరుగుతున్న జనాభాకి అనుగుణంగా ఆహార ఉత్పత్తుల్ని సాధించటంలో మనమింకా వెనకబడే వున్నాం ...నీకొక నిజం చెప్పనా బాబాయ్ ... పంజాబ్ రాష్ట్రాన్ని వ్యవసాయాభివృద్ధిలో అగ్రగామి అంటుంటాం ... ప్రతీ వారం పంజాబ్ నుండి ఒక రైలు బండి మన హైదరాబాద్ కి వస్తుంది. ప్రజలు దాన్ని క్యాన్సర్ బండి అంటారు. ప్రతి వారం కొత్త కొత్త క్యాన్సర్ పేషంట్స్ ని మోసుకొస్తుంది. అందుకు కారణం విచక్షణారహితంగా రసాయన పురుగుమందుల వాడకం... దిగుబడుల గురించి ఆలోచిస్తున్నారే తప్ప ఆరోగ్యం గురించి ఆలోచించకపోవటం వల్ల వచ్చిన ఇబ్బందే ఇదంతా... ఆరోగ్య స్పృహ బాగా పెరిగిన దశ ఇది కదా! దాన్ని పంటలకి అన్వయించి ఆరోగ్యపంట దిగుబడులు తీద్దాం...

బాబాయ్ ... స్తుతిమంతునికి భూతకాలం, బుద్ధిమంతునికి వర్తమానకాలం, మతిమంతునికి భవిష్యత్ కాలం సహాయం చేస్తాయట ... కానీ పనిమంతులైన మీలాంటి రైతులకు అన్ని కాలాలు కలిసి సహకారం అందించాల్సిందే.... సహాయం చెయ్యాల్సిందే ... కాకపోతే అప్పుడప్పుడూ ఆటుపోట్లూ ఉంటాయి ... అలజడులుంటాయి ... అంతమాత్రాన అలసిపోతామా ... భూతల్లి మనతల్లి కదా ... ఆ తల్లి మీద అలుగుతామా .. అమ్మను విడిచి వెళ్ళిపోతామా ... కానీ ఒక మాట మాత్రం నిజం ... నువ్వన్నదే ...

'ఇప్పుడు పల్లెలు కబేళాకు తరలిస్తున్న ఆవుల్లా ఉన్నాయ'న్నావ్ ... 'పాడి పంటలతో ... ధన ధాన్యాలతో కోడెగిత్తల్లా ఉండేవి ఆనాడు ... ఇప్పుడు మాలాగానే జవసత్వాలు లేక ... జీవకళ కోల్పోయాయి' అని... మన బుచ్చన్న కల్లంలోనే పురుగుల మందు తాగి పోయాడు అని కళ్లనీళ్ళు పెట్టుకున్నారు. రైతులెప్పుడూ ఫైటర్సే బాబాయ్. నిరంతరం ఆశావాదులే... ఈ యేడు కాకపోతే వచ్చే యేడు వరుణుడు కరుణిస్తాడని ఆకాశం వంక ఆశగా చూసి బతుకుతారు... ఆ ఆశతోనే మమ్మల్ని పెంచి పెద్ద చేశారు... ఆశని వదులుకోవద్దు బాబాయ్ ... నిరాశని దరి చేరనివ్వొద్దు...

పాడి పంటలు మనకు రెండు కళ్ళు ... పల్లె మన జన్మస్థలం ... జన్మనిచ్చిన పల్లెలకు పునర్జన్మనిచ్చే ప్రాజెక్టులెన్నో వస్తూ వున్నాయి ... అన్నం పెట్టిన పల్లెల కడుపుల్ని చెరువులతో నింపుకుందాం ... నడక నేర్పిన పల్లెల్ని ప్రగతి నడకలతో పరుగులు పెట్టిద్దాం ... మీలాంటి రైతులే పల్లెల సంరక్షకులు ... భూమికి రక్షకులు ... అయితే మారుతున్న కాలంతో పాటు మీరూ మారాలిగా బాబాయ్ ...

'వరి జీవన ఝరి' అంటూ వరిని పట్టుకుని వేలాడకుండా ఆరుతడి పంటలు వేయండి ... హార్టి కల్చర్ మీలాంటి హార్ట్ ఉన్నవాళ్ళు చేయాల్సిన కల్చర్... ఉద్యానవనాల లాంటి పల్లెల్ని సృష్టించండి ... యంత్రాల్ని మంత్రాలుగా భావించి దండం పెట్టండి ... lab to land యాజమాన్యాన్ని దత్తత తీసుకోండి ... 'యధా బీజం తథా సస్యం' మంచి విత్తనాలు ఎన్నుకోండి ... విత్తన శుద్ధి చేయండి ... మనింట్లో తాగే నీరు శుద్ధి చేసుకు తాగటం మాత్రమే కాదు ... ప్రతి సంవత్సరం మన శరీరానికి వైద్య పరీక్షలు చేయించుకోవటం మాత్రమే కాదు ... మన భూతల్లి ఆరోగ్యం ఎలా ఉందో, ఏయే ధాతువులు ఏ స్థాయిలో వున్నాయో తెలుసుకుని తదనుగుణంగా పంటలు మార్చి వేసుకునేందుకు అనువుగా 'భూసార' పరీక్షలు చేయించాలి... మనం ప్రతి పండగకి కొత్త బట్టలు కట్టుకుంటాం ... ఒకే బట్టతో భూతల్లి ఆనందంగా ఉంటుందా ? పొద్దు తిరుగుడు పూల పంట సాగు చేసి భూతల్లి సిగలో పూమాల వేయండి ... నేలలోని పంట వేరుశనగ వేసి ఆ తల్లికి జవసత్వాలివ్వండి ... చిరుధాన్యాలు వేసి చిరునవ్వులు అద్దండి ...సేంద్రియ ఎరువులు వేసి బలాన్ని చేకూర్చండి...

'అన్నీ చెప్తున్నావ్ బాగానే వుంది ... వయసు అయిపోయిందిరా, భుజాలు అరిగిపోయాయి ... చేనుల్లో నడిచీ నడిచీ కాళ్ళకు ఆనెలు వచ్చేశాయ్' అంటారు ... మేమున్నాం బాబాయ్ ... పట్నాల నుండి పల్లెల్ని చూడటానికే కాదు, పండుగలకి ఊర్లోకొచ్చి బాగున్నారా అని అడిగివెళ్లటానికే కాదు, సాగు చేయటానికి ... సాయంగా నిలబడటానికి మన వ్యవసాయ సంస్కృతిని ముందు తరాలకు అందించటానికి...

నిజం బాబాయ్ ... వంగిపోయిన నీ భుజాలకు కావాల్సింది రెండడుగుల చేతికర్ర కాదు ...మా భుజాల సాయం ... అందుకే నా కొడుకుని భూడాక్టర్ ని చేశాను ... భూమి పుత్రుడు మా నాన్న ... మా బాబాయ్ ... నేను వైద్య వృత్తిలో వేల మందికి ప్రాణం పోస్తున్నా మా ప్రాణాల్ని నిలబెట్టి 'అన్నం' పెట్టి ఆదరించిన నిన్ను, మన ఊరిని మర్చిపోము ... మర్చిపోయి మనుగడ సాగించలేము ... నా వారసుడు వస్తున్నాడు బాబాయ్ ... మీ కడుపున పుట్టిన పిల్లలం దేశాల బాట పట్టినా మా కడుపున పుట్టిన పిల్లలు మా మూలాల్ని ప్రశ్నిస్తున్నారు ... మీ ఊరికి మీరేం చేశారు, మీ భూమి రుణం ఎలా తీర్చుకున్నారని ....

వ్యవసాయాన్ని వ్యాపారం చెయ్యలేమని మీరనేవారు ... వ్యాపారం చెయ్యొద్దు బాబాయ్ కానీ ఆధునీకరిద్దాం ... ఆరోగ్యదాయకం చేద్దాం ... వ్యవసాయ ఖర్చులు తగ్గిచ్చి దిగుబడిని రసాయన ఎరువులు లేకుండానే ... వాడకుండానే సాధిద్దాం ... రైతులుగా మీరు మాకు ఆరాధ్యనీయులు ... మీ అడుగుజాడలు జాతిపిత ఆకాంక్షలు ... సమైక్య సాగు చేద్దాం ... సమగ్ర వ్యవసాయ విధానాలు పాటిద్దాం ... భూమిని గెలిపిద్దాం ... ఊరును మళ్ళీ బ్రతికిద్దాం ... దేశాన్ని తలెత్తుకునేలా నిలబెడదాం ... మీతో మేమున్నాం ... మాతో మీరున్నారు .... అన్నదాతకు జయం జయం ...రైతే దేశానికి బలం బలం ...

రేపటి ఆదివారం మన ఊరొస్తున్నాం బాబాయ్ ... నువ్వు ధైర్యంగా ఉండు, నువ్వుఅలా గట్టుమీద నిలబడి పనులు పర్యవేక్షించు చాలు మిగతాదంతా నా కొడుకు చూసుకుంటాడు.


పాదాభివందనాలతో...

ఉండనా మరి,

మీ అబ్బాయ్

– జనార్ధన్

# ముగ్గుల పండుగ



అబ్బాయ్ !

ఈ హేమంత మాసంలో అప్పుడప్పుడే చిగురిస్తున్న తొలివేకువ కిరణాల్లో మనింటిముందున్న వేపచెట్టు కింద పడక్కుర్చీ వేసుకుని నీకు ఉత్తరం రాయటం భలేగా అనిపిస్తుందిరా ... కుర్చీతో నేను బయటకొస్తుంటే మీ అమ్మకి ఒకటే కంగారు ... 4 గంటల నుండి కళ్ళాపి చల్లి వాకిలంతా పేర్చిన తన ముగ్గులు ఎక్కడ తొక్కుతానోనని ... మీ అమ్మకి 60 ఏళ్ళు వచ్చినా ఈ విషయంలో మాత్రం 20 ఏళ్ల అమ్మాయితో పోటీ పడుతుందిరా ... అందరికన్నా తన ముగ్గు బాగుండాలని ... ఒక్క క్షణమైనా ఇంటి ముందుగా వెళ్ళే వారు ఆగి చూడాలని తపన పడిపోద్ది... అత్తయ్యా! ఈ చుక్కల ముగ్గు చెప్పు ... అమ్మమ్మా! ఈ రథాల ముగ్గు చూపించు అంటూ ఎవరొచ్చినా పొంగిపోతూ ఓ చూపు నా వైపు తిప్పుతుంది గర్వంగా, చూశారా అంటూ ...

చిన్నగా ఉన్నప్పుడు అక్కతో పాటు నువ్వూ గొబ్బిళ్ళు పెట్టేవాడివి... తోకలాగా దాన్ని అనుసరిస్తూ ప్రతీదీ దానికి సాయం చేసేవాడివి... ఈ నెల రోజులు పేర్చిన గొబ్బెమ్మల్ని పిడకలుగా గోడకు కొట్టడం – అవి ఎండాయో లేదో చూసుకోవటం ... భోగి పండుగకి పెద్ద చలిమంట వేయటం పెద్దమ్మల్ని, పెదనాన్నలని, బాబాయిల్ని పిలవటం ... పొంగలి తినటం, ... ఇంట్లో చెత్త సామానంతా వేసి 'పీడ' పోయింది ఇక అరిష్టాలేవీ రావని సంతృప్తి పడటం ... కొత్త బట్టలు ... అరిసెలు ... కొత్త అల్లుళ్ళ రాక ... అబ్బో ... ఆ రోజులు మాకిప్పటికీ మధుర జ్ఞాపకాలే ...

మీ అమ్మ నిన్న ఓ పొడుపు కథేసింది ... ఆడవాళ్ళు కిందికి చూస్తూ చేసుకునే పండుగ, మగవాళ్ళు పైకి చూస్తూ చేసుకునే పండుగయేది అని ... సంక్రాంతికి ఆడవాళ్ళు ముగ్గులు వేస్తూ, మగవాళ్ళు ఆకాశంలో పతంగులు ఎగరేస్తూ 'సంబురాలు' చేసుకునే పండుగ ఇది కాక మరేది చెప్పు ? అయినా తెల్సికూడా తెలియదనే సరికి ముసిముసిగా నవ్వుకుంటూ పొడుపు కథ విప్పింది... ఎంతైనా మీ అమ్మను గెలిపించటంలో ఓ గొప్ప థ్రిల్ ఉంటుందిలే... మా పల్లెటూర్లో ఇవికాక సరదాలేముంటాయి చెప్పు.

బాబీగా ... అమెరికా నుండి అక్కొచ్చి వారమైంది ... 'మూలాలు మర్చిపోకూడదు నాన్నా నా పిల్లలు' అంటూ రెండేళ్లకి ఒక్కసారైనా, అది వేల కిలోమీటర్ల నుండి ప్రేమగా వస్తుంది ... వంద కిలోమీటర్ల దూరంలో కూడా లేని నువ్వు 'అబ్బా ... బోర్ అంటారు నాన్నా మా పిల్లలు' అంటూ తప్పించుకుంటావ్ ... పైగా 'ఊరంతా ముసలివాసన వస్తుంది నాన్నా' అన్నావ్ ఈ యేడు కొత్తగా ...

బాబూ ! పండుగలంటే భక్షాలు వండుకుని తినటం కాదు ... ఇల్లంతటికీ రంగులేసుకుని చూసి ఆనందించటమూ కాదు ... ఈ పండుగ పూట పంటలన్నీ ఇంటికొచ్చిన శుభ సందర్భాన మనతో పాటు ఉన్న మన ఆత్మబంధువులకీ, మనని నమ్ముకుని బ్రతికే పనివాళ్ళకు మనకు తోచింది పెట్టి మన ఆనందాన్ని పంచడం .. మనతో వారికున్న

అనుబంధాన్ని పిండివంటల్ని మార్చుకున్నట్టుగా పంచుకుంటూ నీకు నేను ఉన్నాను ... 'మాకు మీరున్నారు' అన్న భరోసాని బ్రతుకులో నింపుకోవటం ...

నాన్నా ! డబ్బులున్నాయా ? అంటూ అడగటమే నీ బాధ్యత అనుకోవద్దురా ... అన్నీ సమకూర్చాం కదా ... ఇంకా ఎందుకు నాన్న పదే పదే లోటుగా ఫీల్ అవుతారు అని అక్కతో అన్నావని తెలిసింది ... నీ ఇంట్లో టివి, ఫ్రిడ్జ్ వున్నట్టుగా వూర్లో మేం వున్నామనుకుంటే సరిపోతుందా బాబూ ... అవి మరలు ... మేం మనుష్యులం అప్పుడప్పుడు మొరాయించే అవి ఆగిపోతేనే క్షణాల్లో ఉరుకులు పరుగులు పెడ్తారు ... సర్వీసింగ్ లు సంవత్సరానికోసారి చేయిస్తారు ... అలాంటిది కన్నవాళ్ళం ... మీకోసం బోలెడు కలల్ని కన్నవాళ్ళం .. సంవత్సరానికి మాకోసం ఒక్కరోజు కూడా కేటాయించలేరా నాన్నలూ.

కన్నా! నువ్వు నాటిన రేగుచెట్టు నిండా బోలెడు పండ్లున్నాయి. ఈ సంక్రాంతికి ఊరంతా వచ్చి యేరుకుపోతారు. మీ అమ్మ అడిగిన వాళ్లకూ, అడగని వాళ్ళకూ చెప్తూ ఉంటుంది ''అది మా చిన్నోడు 4వ క్లాస్ లో వుండగా నాటాడు ... ఈ మామిడి చెట్టు మా పాప 5వ క్లాసులో వుండగా పాతింది ... పండుగకి మామిడాకులు తెంపుకుపోండి .. ఇదో ఈ కాయలు పట్టుకుపోండి'' అని పిలిచి పిలిచి మరీ ఇస్తుంటుంది. పాపం పిచ్చిది ... ఎంతన్నా తల్లి కడుపు కదరా ... ఇక్కడ పది మందిని సంతోషపెడితే అక్కడ మీకు కూడా ఏ కన్నతల్లో ఇంత సాయం చేయకపోదుగా అన్న సిద్ధాంతం తనది ...

చిన్నా ! నీకొక జీవిత సూత్రం చెప్పనా ! నువ్వు పనిచేస్తున్న కార్పొరేట్ కంపెనీ మెయిన్ ఆఫీసు అధికారులు ఈ రోజు మన ఊరిలోనే వున్నారు ! అదేదో ప్రాజెక్టు వర్క్ అంట ! ఇన్ని వేల సంవత్సరాలుగా ఈ పండుగలు ఎలా జరుపుకుంటున్నారు... కొన్నేళ్లు జరుపుకుని ఆపేయాల్సింది ... లేదా వాటంతట అవే ఆగిపోవాల్సింది ... ఇన్నేళ్లు ప్రజలంతా వాటిని మరో తరానికి అందిస్తూ కాపాడుకుంటున్నారంటే దాంట్లో నిగూఢత ఏదో ఉండి ఉండాలి... ఆ సూత్రాన్ని పట్టుకోగలిగితే మాలాంటి కార్పొరేట్ కంపెనీలు కొంతకాలం మనుగడ సాగిస్తాయి... ఇన్ని కోట్లు పెట్టి కంపెనీలు పెట్టినా ఎందుకు దివాళా తీస్తున్నాయి ... ఈ పండుగలెలా ఇన్ని వేల సంవత్సరాల పాటు మనుగడ సాగిస్తున్నాయి అన్నది వాళ్ళ పరిశీలనాంశమట ... ఈ రోజు ఉదయం నాదగ్గరకు వచ్చారు ... నేనేం చెప్పానో తెలుసా ... భారతీయ పండుగలన్నీ సామూహిక ఉత్సవ లక్షణంతో రూపొందించబడ్డాయి ... మనిషిని ఓ యంత్రంలా భావించే కంపెనీలకు మానవుడు భావోద్వేగాలతో మాత్రమే పనిచేయగలడనే జీవన సూత్రం తెలియనంత కాలం కంపెనీల మనుగడ ప్రశ్నార్థకమే అని చెప్పాను ... అందరికోసం ఒక్కరం ... ఆ ఒక్కరి కోసం అందరం కలివిడిగా ఉంటాం ... కలిసి తింటాం ... కలిసి బ్రతుకుతాం ... ఆ స్ఫూర్తి ఇచ్చేదీ పండగలే కదరా ...

చిన్నా! చిన్నప్పుడే కాదు ఎప్పుడూ శరీరానికి వ్యాయామం వుండాలి – నీకు కర్రాబిళ్ళ ఆట నేర్పటం కోసం మనింటి ప్రక్కనున్న పీర్ సాహెబ్ ఎంత కష్టపడ్డాడో తెల్సా! ఈనాడు నువ్వు మీ ఆఫీసు టోర్నమెంట్లో రారాజుగా క్రికెట్ ఆడేస్తున్నావంటే కారణం ఆ కర్రా బిళ్ళా మూలాలే కదా – నువ్వుంటున్న నగరానికి నువు పుట్టిన ఊరే పునాది అన్నది కూడా మర్చిపోకు. మీ అమ్మతో ఎప్పుడూ నేను చెపుతూ వుంటాను. అక్షరాలు సంతకాలు నేర్పితే టెక్నాలజీ వేలిముద్ర వేయిస్తుందని. ఇది పురోగమనమా – తిరోగమనమా అంటే అది ఆలోచించే విధానాన్ని బట్టి వుంటుంది కదూ.

ఎవరో చెప్పగా విన్నారా అబ్బాయ్! ''ఈ దేశం గెలవాల్సింది క్రికెట్ స్టేడియాల్లో కాదు పచ్చని పంట పొలాల్లో'' అని. నిజం కదా! దేశంలో 80% వృత్తి వ్యవసాయమే కదా. మరి నిత్యం పూజించాల్సింది రైతునా – రెండేళ్ళకోసారి జరిగే క్రికెట్ ఆటగాళ్ళనా – నువ్వు అన్నం తింటేనే కదా ఆరోగ్యంగా వుండి ఏ ఆటలైనా ఆడగలిగేది – ఆస్వాదించగలిగేది. మరి రైతు ఎందుకుని హిట్ కాలేకపోతున్నాడు. – ఒక్క వికెట్ పడిపోతేనే విక్స్ డబ్బాలు ఖాళీ చేసేసే మీరు దేశానికి అన్నంపెట్టే రైతన్నల దేహాలెన్నో కూలిపోతుంటే ఒక్కసారైనా పట్టించుకున్నారా? వందపరుగులు చెయ్యాలి మా క్రికెట్ దేవుడని ఆ వెంకన్న స్వామికి మొక్కుతారే తప్ప మా నాన్న 100 బస్తాలు పండించాలని ఎప్పుడూ మొక్కవేంటిరా –

జీతాలు పెరగాలని ధర్నాలు చేస్తారేకానీ రైతు జీవితాలు దళారీల చేతుల్లో వున్నాయెందుకని ఎప్పుడూ అడగరేమిటి రా....

కన్నా!... పండగపూట ఇవన్నీ అడిగి నిన్ను ఇబ్బంది పెట్టాలని కాదురా నాన్నా! నా కొడుకు గొప్ప పదవిలో వున్నాడు. లక్షలు లక్షలు సంపాదిస్తున్నాడు అంటే ఏ తండ్రికైనా సంతోషమేరా కానీ అంతకన్నా మరీ మరీ సంతోషం. తన మూలస్తంభాలైన పల్లెల్ని, కన్న తల్లిదండ్రుల్ని మర్చిపోకుండా వుంటేనే కదా వస్తుంది.

రారా నాన్నా! కవర్ల మీద అనుభూతుల్ని కవర్చేయటం మానేశాంకదా. కార్డుల మీద క్షేమసమాచారాల్ని రికార్డుగా పంపించటం ఆపేశాం. ముసలి వాళ్ళంకద నాన్న! ఆ Mail లు Whats app లు మాకెలా తెలుస్తాయి. అయినా ఆ facebook లో నిన్ను చూస్తే మా మనసు ఎలా నిండుతుందిరా? నీ face ని ముద్దాడి ఈ ముసలి చేతులతో నీ ఒళ్ళంతా ఆత్మీయంగా తడిమేతేనే కదురా మాకు సంతోషం.

నిజం చెప్పు, కార్పొరేట్ నిర్వహణ అనే అవసరం అమెరికా లాంటి పెద్ద దేశాల ఆర్థిక అవసరం నుండి పుట్టిందే కదా ... చెస్టర్ బెర్నార్డ్ అధ్యయనం, డెల్ కార్నెజ్ ఇన్స్టిట్యూట్ సూచనలు బైబిల్ గా భావించినా ఆర్థిక సంక్షోభ వలయంలో పెద్ద దేశాలు ఎన్ని అతలాకుతలం అయ్యాయో ... ఆ సమయంలో కూడా మనం తొట్రుపాటు పడకుండా నింపాదిగా ఉండగలిగాం అంటే మనని ఆదుకుంది మన వ్యవసాయం, మన గ్రామాలేరా! దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలే కదరా ... ఆ గ్రామాలకు స్ఫూర్తి ఈ పండుగలే... సామూహిక చైతన్యాన్ని బోధించే కృష్ణాష్టమి, ప్రకృతి అవసరాల్ని ఎత్తి చూపే వినాయక చవితి, లక్ష్యాన్ని పక్కదోవ పట్టకుండా కాపాడే రావణ వధ, సకల జనుల అవసరాలను గుర్తించాలని బోధించే ఈ మన సంక్రాంతి, ప్రకృతిలోకి తరలిపొండి అంటూ ప్రకృతి అవసరాల్ని పదే పదే చెప్పే ఉగాది ఇవన్నీ మనకి పుట్టుకతోనే అలవాటయ్యాయి... కాబట్టే ప్రపంచం మొత్తం మీద ఎక్కడ పని చేసినా, భారతీయుడు తట్టుకొని మొదటి శ్రేణి పనిమంతుడిగా మిగలగలుగుతున్నాడంటే అందుకు మూల సూత్రం ఈ పండుగలు చెప్పే పరమార్థాలేరా ... వాటినుండి మీ పిల్లల్ని మాత్రం దూరం చేయకండి ... వారికి మన మూలాలు నేర్పండి... గెలుపోటములు సరిసమంగా చూడగల్గుతారు ...

చిన్నా ! ధనుర్మాసపు నెలరోజుల్ని నువ్వెలా మర్చిపోయావో నాకార్థం కావట్లేదు ... ఈ నెల రోజులూ ముంగిళ్ళన్నీ ముగ్గులతో ముస్తాబవుతుంటే గొబ్బితల్లి హుందాగా ఆ ముగ్గుల మధ్య గుమ్మడి పూలతో, బంతి పూలతో కొలువుతీరటం నీకు గుర్తులేదా ? హరిదాసు హరిలో రంగ హరీ అంటూ మనింటికొచ్చినప్పుడు తన తల మీద ఉన్న అక్షయ పాత్రలో అమ్మ నీతో బియ్యం పోయించటం గుర్తులేదా ? తనతో పాటు నువ్వూ చిన్న పంచకట్టుకొని నగర సంకీర్తన చేయటం గుర్తు లేదా ? బసవన్నని వెంట తీసుకొని గంగిరెద్దుల మేళంతో వచ్చే సామి, ఆ తరువాత వచ్చే బుడబుక్కలాయన, కోతలు కోస్తూ తెగనవ్వించే పిట్టల దొర, రంగురంగుల వస్త్రధారణతో ఆకట్టుకొనే జానపద కళాకారులు ఎందరొచ్చినా లేదూ కాదూ అనకుండా ఇంట్లో అప్పాలు, వడ్లు, అక్కా నువ్వు పోటాపోటీగా పంచుతుండే వాళ్ళు కదరా...

అర్ధనారీశ్వరులు కొప్పునుండి గంగను చిలకరించినప్పుడు ఆ నీళ్ళు మీద పడితే మంచిదని ఊరంతా పోటీ పడుతుంటే నిన్ను నా మెడ మీద కూర్చోపెట్టుకొని ఆ నీళ్ళు పడేలా ఎదురు చూడడం నువ్వెలా మర్చిపోయావు చిన్నా ... అమ్మా, అక్కా బొమ్మల కొలువులు మంగళ స్నానాలు, భోగి పళ్ళు చూసుకుంటుంటే, నువ్వూ నేను భోగి మంటలు వేస్తూ కొమ్ముదాసరి, విప్రవినోదులు, జంగమ దేవరలు అందరినీ ఇంటి మనుషుల్లా చూస్తూ సంబరాలు చేసుకునేవాళ్ళం కదా ... కొత్త సున్నాలతో ఇల్లు, పురినిండా ధాన్యంతో ఊళ్ళు, మిగిలిపోయిన పరిగెలతో పొలాలు ఎంత సంబరంగా ఉంటాయి ఈ మాసంలో ? ఇప్పుడు పాలకంకులు తినే పిచ్చుకలూ లేవు, ఇంట్లో పిల్లలూ లేరు ... ఇల్లంతా మీరు లేక బోసిపోయింది నాన్నా ... మీరొస్తేనే ఇంటికి సంబరం ... ఈ ముసలి కళ్ళకి ఆనందం ...

నాకు తలంటుతూ కూడా కుంకుళ్ళంటే అబ్బాయికి ఎంత భయమో ... చిన్నప్పుడు వాడిని పట్టుకుని

తలంటటానికి వీధంతా పరుగులు పెట్టేదాన్ని అని మురిసిపోతూ వుంటుంది మీ అమ్మ. మీరు మా దగ్గర లేకపోయినా మీ జ్ఞాపకాల్లోనే మేం బ్రతుకుతుంటాం ... మేం మీకు దగ్గర్లోనే ... అందేంత దూరంలో వున్నా ఇంకా దేనికోసమో మీరు పరుగులు పెడ్తుంటారు... పేపర్లో చూస్తున్నా... నగరమంతా పల్లెబాట పట్టిందని ... రోడ్లన్నీ కర్ఫ్యూలాగా నిర్మానుష్యంగా వున్నాయని ...

కన్నలూ ! మీకు కార్లున్నాయి ... కరెన్సీ కట్టలున్నాయి ... సమాజంలో పెద్ద స్థాయి ఉంది ... హై క్లాస్ సొసైటీ ఉంది ... కానీ ఒక్క విషయం మర్చిపోవద్దురా ... అదంతా మీకివ్వటానికి ఆరుగాలాలు ఈ మట్టి మనుష్యులు పడ్డ కష్టం ... నేనొక్కడినే కాదు ... ఈ ఊరు ఊరంతా మీకోసం కష్టపడింది ... ఒకరు చదువు చెప్పారు ... ఒకరు పాలు పోశారు ... ఒకరు పాట నేర్పారు ... ఒకరు వ్యాయామంతో నీకు శరీర ఆకృతినిచ్చారు ... నీ ఆలోచనలు విస్తరించటానికి ఇక్కడి మనుష్యులంతా దోహదం చేసిన వాళ్ళే ... ఇప్పుడు ఊరు కానిదైపోవటం యేమిటిరా ... 'ముసలివాసన' ఊరు రావట్లేదురా ... నీ ఆలోచనలు వస్తున్నాయి ... రేపు నేను ముసలివాడిని అయినట్టే నువ్వూ కాకుండా వుంటావా చెప్పు ... బాబాయ్ అని నువ్వు భుజాల మీదకెక్కి తొక్కిన రంగయ్య ... నిన్ను స్కూల్ కి దింపిన ఆమోసు ... నీకు టీకాలిచ్చిన యేసుబు అంతా నీ గురించే జ్ఞాపకం చేస్తారు ... నువ్వెన్నో సార్లు అంటావ్ ... ఇల్లు పడగొట్టి కొత్త ఇల్లు కడితే వస్తానని ..

నాన్నా ! ఇల్లంటే సిమెంటు ఇటుకలతో సౌకర్యవంతంగా కట్టుకునేదని నువ్వనుకుంటావ్ ... కానీ ఇల్లంటే మాకు ఆర్నెల్లప్పుడు నువ్వు దాటిన గడప ... మీ అక్కకి అట్లతద్దికి వేసిన కొమ్మల ఉయ్యాల ... నీ తొలి అడుగుల్ని ముద్రించుకున్న సిమెంటు తాపడపు పలక.. పుష్పవతి అయినప్పుడు మీ అక్కని కూర్చోబెట్టిన తాటిచాప ... జ్వరమొచ్చినప్పుడు, అమ్మవారు పోసినప్పుడు నిన్ను క్రింద పడుకోబెట్టిన పడమటింటి గది ... మీరు పుట్టినప్పుడు మీ అమ్మమ్మ వచ్చి తొలికాన్పులు చేసి పోతూ పోతూ ఇచ్చిన చింకి బొంత ...

నీకు గుర్తుందా నాన్నా ! అమ్మమ్మ వాసన ఈ బొంతలో ఉంటుందని ... నువ్వు 10వ తరగతికి వచ్చినా ఆ బొంతనే కప్పుకుని పడుకునే వాడివి.. అమ్మమ్మ పోయినా మీ అమ్మ నీకిష్టమని ఆ చిరిగిన బొంతని భద్రంగా బీరువాలో దాచిపెట్టింది నీ పిల్లలకి చూపిద్దామని... బ్రతుకంటే ఇదేరా ... భవంతులు కాదు ... భాగ్యమంటే ఇదేరా ... డబ్బు కాదు ... నాన్నా ! నీ కోసం ఈ ముసలి తలకాయలే కాదు .. జవసత్వాలు ఉడిగిన పల్లె ... పెచ్చులూడిపోయిన ఇల్లు కూడా ఎదురుచూస్తుందిరా ... నువ్వే మా ఆనందం ... నువ్వే మా బలం ... నువ్వే మా పండగవి ... రారా కన్నా ... అమ్మ చేసిన అరిసెలు, పాయసం, గారెలు నీ కోసం ఎదురు చూస్తున్నాయి ... అంతకంటే ఎక్కువగా నేడో రేపో ఆగిపోయే మా ముసలి గుండె కూడా ... నీ పిలుపు కోసం ... నీ ఆత్మీయ స్పర్శ కోసం ఎదురుచూస్తూనే ఉంటుంది.

నీకు నీ పిల్లలెంతో, నువ్వూ మాకంతే కదరా ... నువ్వు కన్నవాళ్ళ పట్ల నీకున్న ప్రేమ నిన్ను కన్నవాళ్ళ పట్ల కూడా చూపించాలి కదరా నాన్నా ... రా నాన్నా ... మనవడిని తీసుకుని, కోడల్ని తీసుకుని త్వరగా రా ... కడుపు చేత పట్టుకుని పట్నాలకు వలసపోయిన మా ఇంటి పక్షులొస్తేనే మాకు అసలు సిసలు పండుగ ... మీ అమ్మకి ఎన్ని పనులున్నా .. కళ్ళు మాత్రం వీధివాకిలి వైపే ... మాకు తృప్తినిచ్చేది మీ అందరితో ఉన్నప్పుడే, మేం కన్నపిల్లలు మా యింటి ముందర, మా కళ్ల ముందర తిరిగినప్పుడే ....

మీ రాకకోసం వేయికళ్ళతో ఎదురు చూస్తూ,

మీ

నాన్న !

– నరేంద్ర

# కణ నీరాజనం

పూర్ణా!

ఎలా వున్నావ్ అని అడగటానికి మనసు రావటం లేదు. అయినా అడుగుతున్నాను. నువ్వు కాస్తన్నా నిల దొక్కుకున్నావా... వాస్తవ పరిస్థితుల్ని చూసి నిలబడగలుగుతున్నావా అని ... థ్యాంక్ గాడ్, ఫోన్లో నువ్వు చెప్పిన మాట విని నేనే పక్కనున్న గోడపట్టుకుని తూలకుండా ఆపుకున్నాను. ఇక నీ పరిస్థితి ఎలా వుందో ఉహించగలను..

పూర్ణా ! ఒక్కగా నొక్క కూతుర్ని నువ్వెంత గొప్పగా చూసుకున్నావో... ఎన్నెన్ని కలలు కన్నావో నాకు బాగా తెలుసు... కానీ విధి చేతిలో అందరూ బొమ్మలమే. కాకపోతే నేను ఎప్పుడూ ఆశావాదినే. నీ కూతురు రాణి కొచ్చింది – బ్రెస్ట్ క్యాన్సర్. తొలి దశలోనే గుర్తించబడింది కాబట్టి పెద్దగా భయపడాల్సిన పనిలేదు.. నిజం పూర్ణా! 75ఏళ్ళ వయస్సులో అమ్మకి బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చినప్పుడు నువ్వు హైదరాబాద్‌కి వచ్చి మా అమ్మని చూసెళ్ళిన విషయం జ్ఞాపకం చేసుకో... రాణి వయస్సు 35 యేళ్ళే. తట్టుకోగల్గిన శక్తి మా అమ్మ కంటే రాణికే ఎక్కువ వుంటుంది.

క్యాన్సర్ అంటే బ్రతుకు క్యాన్సిల్ కాదు. పైకి పోవటానికి జారీ అయిన వీసా అంతకన్నా కాదు. అది కూడా జ్వరంలా... జలుబులా ఒక వ్యాధే. నివారించటానికి వీలులేని, వీలుకాని వ్యాధి మాత్రం కాదు. అన్ని జబ్బులకు మందులున్నట్టే ఈ జబ్బుకీ మందులున్నాయి... శస్త్రచికిత్సలున్నాయి. కీమోథెరపీలున్నాయి. కాకపోతే కాస్త కోలుకోటానికి వ్యవధి పడుతుంది. చికిత్సా విధానంలో ఎప్పటికప్పుడు వస్తున్న 'సరికొత్త మార్పుల వల్ల వ్యాధి తీవ్రత – బాధాకరమైన ఇబ్బందులు చాలా తక్కువయ్యాయి'.

పూర్ణా! నీకు తెలుసుగా.... అమ్మదగ్గర నేనే వున్నానప్పుడు. అడిగితేకాని అమ్మ అయినా అన్నం పెట్టదంటారు. కాని క్యాన్సర్ అమ్మల గన్న అమ్మ, అడగకుండానే తన కణాలను పుట్టలు పుట్టలుగా పుట్టించేస్తుంది. దానితో ఎన్నో సైడ్ ఎఫెక్ట్స్ వుంటాయి. అమ్మ జుట్టు కీమోథెరపీతో పోతా, పోతా వుంది. అమ్మ జడ 4 అడుగుల నాగుపాములా నల్లగా నిగనిగలాడుతూ వుండేది. అమ్మకి తన జుట్టంటే మహా ప్రాణం. ఇలా దువ్వెనపెడితే చాలు పాయలు పాయలుగా వచ్చేసింది. డాక్టర్ గారు అందుకే ముందే చెప్పారు. రోజూ దిగులు పడకుండా ముందే గుండు కొట్టించమని... అమ్మ ససేమిరా అంది. ఏడ్చింది... 'అమ్మా నీ కేశఖండనం మేం చూడలేదుగా. 9 నెలలకి నాకు గుండుకొట్టించి పోగులు కుట్టించావు. నా కూతురికీ, దాని కూతురికి కూడా నువ్వే ఒళ్ళో కూర్చొబెట్టుకుని కేశఖండన చేయించావు. ఇప్పుడు మాకు అవకాశం వచ్చింది. ఇప్పుడు చేయ్యనివ్వమ్మా' అంటూ వాతావరణాన్ని తేలికపరుస్తు ఎన్నో జోక్స్ చెప్తూ పని పూర్తిచేశాం.

ఒక నిజం చెప్పనా పూర్ణా! బ్రెస్ట్ అంటే అదే వక్షోజాలు కదా. అవి స్త్రీ పతాకలు. గుండె వైకుంఠానికి ఇరువైపులా రక్షణగా నిలచిన జయ విజయులు. స్త్రీకి, నిండైన నిబ్బరాన్నిచ్చే స్థైర్యపు జాడలు. శోభనం రాత్రి భర్తకు అమరత్వాన్ని

ప్రసాదించే అమృత బాంఢాలు, పిల్లలకి జీవాన్ని ధారగాపోసిన పాలవెల్లులు. స్త్రీలంతా కర్ణులు అయింది వీటివల్లేకదా! అనవరతం మనని అంటిపెట్టుకొని, సహజీవించి, సహచరిస్తుంది మన పాలిండ్లే కదా. అయినా కూరగాయలకి పుచ్చొస్తే, అంతవరకు కత్తిరించి కూరవండుతామా లేదా? ఇదీ అంతేగా, పాలిండ్లకి వైరస్ సోకితే కత్తిరించి పారేసి ఆనందంగా జీవితాన్ని ఎందుకు గడపలేమో చెప్పు.

క్యాన్సర్ నుండి బయటపడటానికి కావల్సిన అతి ఆవశ్యకరమైన మందు ధైర్యమే! మీతో మేం వున్నామని మనమిచ్చే భరోసా వాళ్ళలో కొత్త ఆశని పాదుకొల్పుతుంది. కంటికి కనిపించని క్యాన్సర్ శత్రువు మీద పోరాడే శక్తి ని కల్గిస్తుంది. ఎంత విచిత్రం కాకపోతే చిన్న అణువిస్ఫోటం దేశాన్ని మాయం చేసినట్టు శరీరంలోని కణవిస్ఫోటం జీవితాల్ని కబళించివేయటం గొప్ప విషాదం కదా! కీమోథెరపీ ద్వారా మనలోకి వెళ్ళి లోపల వున్న క్యాన్సర్ కణాల్ని చంపేయటం ఆధునిక శాస్త్రవిజ్ఞానం కనిపెట్టిన ఘనతే కదా.

ఆడపిల్లలు అందంగా వుండాలని బారెడు జడవేసి అందరి అమ్మల్లాగా మనమూ రకరకాల రిబ్బన్లు కట్టి రోజుకో రకం పూలదండ పెట్టి పిల్లల్ని బడికి పంపేవాళ్ళం, కానీ ఇప్పుడు మన అమ్మకి... అమ్మాయికి పింక్ రిబ్బన్ని ఎదమీద గుర్తుగా పెట్టామని అప్పుడు అనుకోలేదు కదా! మన కడుపున పుట్టిన పిల్ల... మనని కన్న కడుపు ఇద్దరూ వ్యాధితో ఇబ్బంది పడుతున్నవాళ్ళే. అయితే బాహికంగా వుండటం వల్ల మరణాలు తక్కువే. పైగా ముందుగానే గుర్తించటం వల్ల ఇద్దరూ మృత్యుముఖం నుండి బయట పడ్డారు.

పూర్ణా! మా నాన్నమ్మ ఎప్పుడూ ఓ మాట చెప్పేది... చిరునవ్వుల్ని నీతోపాటు ఎప్పుడూ సంచీలో వేసుకుని వెంట తీసుకెళ్ళు. నవ్వలేని నిర్భాగ్యులెవరైనా వుంటే నాలుగు నవ్వుల్ని దానం చెయ్యి అని. డబ్బులైతే కరిగిపోతాయి కానీ దానం చేసిన కొలదీ పెరిగేది నవ్వులొక్కటే. ధనానికి లేని సానుకూలత చిరునవ్వులకు మాత్రమే వుంది. మనం నవ్వుతూ వున్నంత కాలం మన వాళ్ళను మన నుండి ఎప్పుడూ, ఎవ్వరూ దూరం చెయ్యలేరు.

ఈ సమయంలో వాళ్ళు ఒకలాంటి అభద్రతతో వుంటారు– పైగా మనల్ని పరిశీలిస్తూ వుంటారు. వర్షించే ఆ ప్రతికన్ను పొడిచేతి ఆనకట్టకోసం ఎదురుచూస్తుంది. కూలిపోయిన ప్రతిమనసు ఆసరాన్నిచ్చే భుజంకోసం ఆరాటపడుతుంది. ఛిద్రమైన ప్రతి చెక్కిలి ఊరటనిచ్చే స్పర్శకోసం తహతహలాడుతుంది. గడ్డకట్టిన ప్రతి హృదయం నీకేం కాదన్న భరోసా వాక్యం కోసం నిరీక్షిస్తుంది. ఏ క్యాన్సర్ సోకిన ఇంట్లో చూసిన కొంగుచాటు చంద్రుళ్ళు చేసిన అలజడలు నిశ్శబ్దంగా జ్వలిస్తూనే కనిపిస్తాయి. మనం అది గుర్తించాలి. మనం మాములుగా కన్పిస్తే వాళ్ళు కుదురుగా వుంటారు. మనం ఏడిస్తే వాళ్ళు మరింత బెదిరిపోతారు. నిరాశక్తులవుతారు. అసలు ఏం జరుగుతుంది అన్నది వారి ఆందోళన. ఆ తర్వాత వచ్చే పరిణామక్రమాలు ముందే తెలుసుకోవటం వల్ల మనం మరింత అవగాహనతో వ్యాధిని ఎదుర్కోగలుగుతాం.

నాకు ఆవేదన కల్గించే అంశం ఒకటుంది పూర్ణా! కార్ సర్వీసింగ్ ఎప్పుడు చేయించుకోవాలో క్యాలండర్ మీదనో సెల్‌ఫోన్లోనో రికార్డు చేసి రిమైండర్ పెట్టుకునే మనం బాడీ సర్వీసింగ్‌ను మాత్రం ఎందుకు అశ్రద్ధ చేస్తామో అర్థం కావటం లేదు. భర్త LICలు, పిల్లల ఫీజులు, అత్త మామగార్ల షుగర్ టెస్టులు, రెగ్యులర్‌గా వెళ్ళి చేయించే మనం, మన ఆరోగ్యం అంటే ఎందుకంత అనాసక్తి చూపిస్తాం? రెండువేలు పెడితే మెమోగ్రాం వస్తుంది. అల్ట్రాస్కాన్ అయితే 1500.... పాప్‌స్మియర్ టెస్ట్ ద్వారా ముందే గర్భసంచికి వచ్చే క్యాన్సర్‌ని గుర్తుపట్టగలుగుతాం. అందరి ఆరోగ్యాలు మనం చూస్తాం. ఇల్లంతా మనదే అనుకుంటాం. కానీ మనతోనే మన ఇల్లు నిలబడి ఉంటుందని ఆలోచించం. ఆరోగ్యంగా వున్న మనమే మన ఇళ్ళు అనుకోం... ఆడది చదువుకుంటే ఇళ్ళంతా చదువుకున్నట్టే అని చెప్పుకుని పొంగిపోయే మనం ఆరోగ్యంగా వుంటేనే, ఇంటిల్లిపాది ఆనందంగా – సౌకర్యవంతంగా సజావుగా వుంటారని గమనించం... మన చిన్న అలక్ష్యం మన కుటుంబానికి ఎంత పెద్ద శాపమో చూశాము కదా!

పూర్ణా! నువ్వు నమ్ముతావో లేదా కానీ ఈ మధ్యనేను ఏ ఫంక్షన్‌కెళ్ళినా, గిఫ్ట్ యేం ఇస్తున్నానో తెలుసా!....... Health Check up Gift ఓచర్లే.... అంతకంటే పెద్ద గిఫ్ట్ నాకు కన్పించటంలేదు. దెబ్బతింటేనే కదా మనం కోల్పోయిందేమిటో తెలిసేది... అనుభవరాహిత్యంతో అమ్మ ఆరోగ్యాన్ని పణంగా పెట్టానని చాలా యేళ్ళే భాధపడ్డాను... అమ్మ ధైర్యస్తురాలు కాబట్టి బ్రెస్ట్ క్యాన్సర్ నన్నేం చేస్తుందంటూ 75 యేళ్ళ వయసులో సైతం ధాటిగా ఎదుర్కొని ఆరోగ్యంగా తిరుగుతుంది.

ముందు అన్నిటికంటే ఒక విషయం చెప్పాలి పూర్ణా నీకు.

మన జీవనశైలితోనే ఏ వ్యాధులైనా వచ్చేది. కనీసం 6 గంటలు నిద్ర – ఓ గంటన్నర వ్యాయామం లేదా వాకింగ్ ఆడవాళ్ళకు అత్యవసరం. ప్రొద్దుట చదివే పేపర్ని ఎండలో కూర్చుని చదువుకుందాం. సూర్యకిరణమే మన సూదిమందు. అది పడితే తప్ప మన ఎముకల ఆరోగ్యం సజావుగా వుండదు. మంచి నీళ్ళు కనీసం ఓ ఆరులీటర్లు తాగుదాం. గోరు వెచ్చని నీళ్ళు మరీ మంచిది. ఉదయమే గోరువెచ్చని నీళ్ళలో నిమ్మకాయ కలుపుకుని తాగటం మరింత ఆరోగ్య దాయకం.

ఇంతకాలం ఆడపిల్లని గుండెలపైన కుంపటి అనేవారు, ఆడపిల్ల గుండెల్లోనే కుంపట్లు ఉన్నాయని ఇప్పుడు మనం గమనించాలి. గాయాలు, బాధలు, దుఃఖాలు, వేదనలు, మనకు కొత్తకాదు. ప్రసవం అంటేనే కొత్తజన్మ. కనీసం రెండుసార్లు అయిన పునర్జన్మించిన వాళ్లమే. ఇప్పుడు మనకోసం మరోసారి సరిక్రొత్తగా జన్మిద్దాం. ఫీనిక్స్‌లా పునరుత్థానం పొందుదాం. ఈ రాజపుందును దేహ సంస్కృతిలోని కొత్త పండుగగా ఆహ్వానిద్దాం. ఉరోజ రాహిత్య దశను ఇన్నాళ్ళు స్త్రీత్వం పేరిట వేసిన సంకెళ్ళనుండి విముక్తిగా భావిద్దాం. జీవన పుస్తకంలో కొత్తపాఠంలా చదువుకుందాం. ఈ స్తనాతీత దశను మహిళా ప్రస్థానంలో నవయుగోదయం అని చాటిచెపుదాం. మనము 'షీ' అనుకుంటేనే కదా సమస్య. ఇప్పుడు మనీషి అనుకుందాం. జెండర్‌గా కాకుండా మానవీయ జెండాగా నడుద్దాం.

పూర్ణా! జీవితం పరిపూర్ణమయ్యేది ఆరోగ్యంతోనే, సమైక్య సమూహ కుటుంబ వ్యవస్థలుపోయి వ్యక్తి కుటుంబాలు వచ్చాకే చెప్పేవారు తక్కువైపోయారు. – అన్ని తెలిసిన పెద్దమనిషి మంచాన పడ్డాక కానీ అసలు మనకేం తెలుసో అన్న నిజం బయట పడటంలేదు. అప్పటికే చేతులు కాలాక, ఆకులు పట్టుకున్న చందం అవుతుంది.

నీకు తెలుసా! సమూహాల్లో వున్న వ్యక్తులు... అందరితో కలిసిమెలిసి అందరి కోసం ఆలోచించే వ్యక్తులు ఎక్కువకాలం బ్రతుకుతారట. వాళ్ళలో పాజిటివ్ ఎనర్జీ లెవల్స్.... సంతృప్తి ఎప్పుడూ వాళ్ళని చిరారోగ్యంతో వుంచుతాయట. చితి చచ్చినాక కాలుస్తుంది. చింత బ్రతికున్నవాళ్లనూ కాలుస్తుంది. విజేతలైనా పోరాడాల్సిందే పోరాడితే పోయేదేముంటుంది మహా అయితే ఎటూ పోతుందనుకునే ప్రాణం ఒక్కటే కదా. కాని పోరాడి గెలిస్తే మనతోపాటు ఈ ప్రపంచము మన కుటుంబమూ కూడా గెలుస్తుంది. అపుడు అందరం నవ్వుతూ బ్రతికేస్తాం.

నాలుగు గోడల్ని ఛేదిద్దాం. నలుగురు మనుషుల్ని కూడేద్దాం. నాలుగు మంచి మాటలు వల్లిద్దాం. పదిమందికి సాయంగా బ్రతుకుదాం. ఆరోగ్య అవగాహన పెంచుదాం. బ్రతుకులోని ఆనందాన్ని ఆనందంగా అనుభవిద్దాం.

నేను రేపటి రైలుకి బయలుదేరుతున్నాను నీ దగ్గరికే.... రాణికోసం... నీకోసం... మాత్రమేకాదు... ఒకరికి ఒకరు తోడుగా వుంటే అదో గొప్ప ధైర్యం... మీకు మేమున్నామన్న భరోసాకి మించిన మందెక్కడ వుంది పూర్ణా –వస్తున్నా.

కన్నీళ్ళు తుడవటానికి కాదు, కన్నీరే కారకుండా చేయటానికి... నేను వస్తున్నాను... క్యాన్సర్‌ని మన కుటుంబాల నుండి... ఈ ప్రపంచం నుండి దూరంగా తరిమే అవగాహన కల్పించటానికి, ధైర్యపు గూడు సరిక్రొత్తగా నిర్మించటానికి.

వుండనా మరి....

నీ

– రాజశ్రీ

# రెండు ధృవాలు – ఒక్క ఆకాశం

ఒరే రామారావ్!

నీకో గుడ్ న్యూస్ రా ! అహంకారంతో చేతులారా చెడగొట్టుకుంటుందనుకున్న నా కూతురు తన సంసారాన్ని తానే సరిదిద్దుకుంటుందిరా! అత్తంటే ఆ జన్మ శత్రువుగా భావించే తాను ఆలోచనల్లో పడింది. రేపు నువ్వూ నీ కొడుకు నుండి విడిపోవడానికి సిద్ధంగా ఉండమని మనం చెప్పిన మాటలు దానిలో పరివర్తన రగిలించాయి. అయినా నేను చెప్పడమెందుకు, అత్తగారికి మా అమ్మాయి రాసిన లేఖ చూడు. నీకూ పంపించమని చెప్పిందిలే సంతోష పడతావని .

★★★

అత్తమ్మా !

మిమ్మల్ని ఇలా పిలుస్తుంటే మనసుకెంత ఆహ్లాదంగా వుందో తెల్సా ! మా వైపు ఎందుకో మరి 'అత్తయ్యా' అని పిలవటం అలవాటు. మేనత్తలోని దగ్గరతనం, ఆత్మీయత, అమ్మలోని ప్రేమ గుణం, నమ్మకం కలిస్తేనే కదా అత్తమ్మ అయ్యేది. ఆ అన్ని గుణాల కలబోతగా – మంచితనానికి మారుపేరుగా నిల్చారు అత్తమ్మా–మీరూ, మామయ్య గారూనూ. పుట్టిన ప్రతి పసికందూ మొదట 'అత్త' అనే ఎందుకంటుందా అని తెగ ఆలోచించేదాన్ని. మిమ్మల్ని చూశాక అర్థమైంది–జీవిత భాగస్వామినిచ్చి బ్రతుకుకు ఓ సరికొత్త ఆనందాన్ని అద్దేది అత్తేనని. తలలో నాలుకలా, ఇంటి భారం మొత్తం మోసే గరిమనాభిలా, పరువు ప్రతిష్టలకు ఎత్తిన పతాకంలా, సతీలోకపు ప్రతీకలా ఉండేది అత్తమ్మ అన్న కవిత గుర్తొచ్చింది.

నేను చిన్నప్పుడు అమ్మతో చూసిన టీవీ సీరియల్స్, ఇంటి పక్కన కుటుంబాల్లో గమనించిన విషయాలు అత్త పట్ల ఓ విధమైన వైరి భావాన్ని నాలో కలిగించాయి. ఆడపడుచు పాత్ర పట్ల ఒక విధమైన విముఖత, తానేదో నా పట్ల ఆజన్మాంతరపు శతృత్వాన్ని చూపిస్తుంది అన్న మార్గంలోనే ఆలోచించాను. పైగా అమ్మ తరచూ తన అత్తగారి వల్ల పడ్డ కష్టం చెపుతూ పెంచిందేమో, ఆ వ్యతిరేకత మరింత పదునెక్కింది. చిన్నప్పటి నుండి 'సింగిల్'గా పెరిగినందువల్ల అనుకుంటా..నాకూ కాస్త పెంకితనం, మరికొంత గారాబం అబ్బాయి. నాకే అన్నీ తెలుసుననే అహంకారం కూడా ఎక్కువే. నేను ప్రేమించడం ఓ గొప్పతనం, ప్రతిగా తానూ ప్రేమించి తీరాలి అనుకున్నాను.

అత్తమ్మా! అభిరామ్ మిమ్మల్ని ఎంతగా గౌరవిస్తాడో నాకు బాగా తెల్సు. అమ్మంటే అందరికీ ప్రేముండడం సహజం. కానీ అభిరామ్ దేవుడు ముందా, అమ్మ ముందా అంటే క్షణం కూడా ఆలోచించకుండా – 'అమ్మ' అనేంత పిచ్చి గౌరవం మీరంటే. గొప్ప వ్యక్తిత్వంతో తీర్చిదిద్దారు మీరు. మనుషుల్లో ఆర్థిక బంధాలే కాదు, హార్దిక సంబంధాలూ

వుంటాయన్న విషయం చాలా తక్కువ తెల్సు నాకు. అమ్మను బాగా చూసుకొనేవాడు భార్యను ఇంకా బాగా చూసుకుంటాడన్న సామాన్య సూక్తితో బాగా కనెక్ట్ అయిన నేను, అదే 'మీరు ముందా నేను ముందా, తేల్చుకో'మనే వరకూ వచ్చానంటే నాది ఏ మోతాదు పిచ్చో ఇప్పుడు అర్థమవుతోంది.

నిజం అత్తమ్మా! ఈ రోజు మీరు నా కన్ఫెషన్ బాక్స్ అనుకొని మనస్ఫూర్తిగా చెప్తున్నాను. అత్తమ్మా! ఏ భేషజాలు లేకుండా నిజాయితీగానే ఉత్తరం రాస్తున్నాను. మంచికోసం మీరే మాటలు చెప్పినా దాన్ని వ్యంగ్యంగానే ఆలోచించే దాన్ని. కానీ నాకప్పుడు తెలియదు, కుటుంబం విలువను కాపాడ్డానికి ముందు తెలుసుకోవలసిన అంశం ఒకటుంది... "Open your eye and close your I" అనేది.

అభిరామ్ నా తెంపరితనాన్ని కాచుకున్నాడు. నా మొండితనాన్ని భరించారు. నా తప్పుడు నిర్ణయాల్ని సర్దుకున్నారు. కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ, భోజ్యేషు మాతా, శయనేషు రంభా, రూపేచ లక్ష్మీ, క్షమయా ధరిత్రీ, షట్ కర్మ యుక్తా కుల ధర్మ పత్నీ – అని ఏ పురుషుడు రాశాడో గానీ, కామందక నీతి సూత్రంలోని పద్యానికి మాత్రం ప్రచారాన్ని కలిగిస్తే నా లాంటి వాళ్ళు కంఠతా పట్టి వుండేవాళ్ళేమో, అదేపనిగా వాడుకోవచ్చనుకుని.

''కార్యేషు యోగీ, కరణేషు దక్షః,
రూపేషు కృష్ణః, క్షమయాతు రామః,
భోజ్యేషు తృప్తః, సుఖ దుఃఖ మిత్రం,
షట్కర్మ యుక్తః ఖలు ధర్మ నాదః''

పనులు చెయ్యడంలో ప్రతిఫలాన్ని ఆశించని యోగిలా, కుటుంబ నిర్వహణలో నేర్పుతో సంయమనంతో వ్యవహరించడం, రూపంలో కృష్ణునిలా ఉల్లాసంగా, క్షమాగుణంలో రామునిలా, వండినదాన్ని సంతృప్తిగా వంకలు పెట్టకుండా భుజిస్తూ, సుఖదుఃఖాల్లో కుటుంబానికి అండగా ఉండేవాడే ఉత్తమ పురుషుడని చెప్పారు. అంతటి ఉత్తమోత్తమ పురుషుడత్తమ్మా మీ అబ్బాయి. నేనే అర్థాంగిగా పనిచేయలేకపోయాను.

తానేం చేస్తున్నాడో అని ఎప్పుడూ ఓ కన్ను వేసి ఉంచానే తప్ప నేనేం చెయ్యాల్సిఉందో ఎప్పుడూ చూసుకోలేదత్తమ్మా. అదే నేను చేసిన అతి పెద్ద తప్పు. ఆఫీసుకి వెళ్ళి రావటమే నేను చేసే అతి గొప్పపని అనుకునేదాన్ని. నాలాగే తానూ ఆఫీసుకి వెళతారని, ఇంటిపని, వంటపనుల్లో సాయం చేస్తారని, పచారీ కొట్టు, బ్యాంకు పనులు, కుటుంబ ఫంక్షన్లన్నీ ఒంటి చేత్తో సర్దుకుంటారని నాకు తెలుసు . అయినా ఏదో తనకు 'అవకాశం' ఇచ్చాను, మంచిపేరు తెచ్చుకోవడానికి అన్నట్టు ప్రవర్తించేదాన్ని. నా బద్ధకాన్ని పైకి కనిపించనివ్వకుండా, నా ఇగోని ఎప్పుడూ సంతృప్తి పరుస్తూ ప్రతిదానికీ అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఉండేదాన్ని. ఇల్లంతా అలంకరించి, నాకో కొత్త డ్రెస్ కొని, నా పుట్టిన రోజునాడు సర్ ప్రైజ్ పార్టీ ఏర్పాటు చేస్తే తనకో థాంక్స్ చెప్పడానికి కూడా నాకు మనసు రాలేదెందుకో ఇప్పుడు అర్థం కావడంలేదు. పైగా డ్రెస్ నాకు నచ్చలేదంటూ విసుక్కున్నాను. తన పుట్టిన రోజుని కనీసం గుర్తుపెట్టుకోక పోగా, గుర్తు చెయ్యొచ్చు కదా అంటూ ఆ అపరాధాన్ని తన మీదే రుద్దేశాను. ఎంత డిప్లమసీనో కదా అనిపిస్తోంది ఇప్పుడు తలుచుకుంటే.

మా కుటుంబానికి వారసుడిని ఇచ్చి మరో తరాన్ని అందించే పుణ్యవతివి, అంత పవిత్ర భాగస్వామ్యం నీది అనే మర్యాదస్తుడితో, గిల్లికజ్జాలు, ఇగోలు, అలకలతో చిన్నబుచ్చేదాన్ని. ప్రతి పనిని భూతద్దంలో పెట్టి చూస్తూ 'అదిగో నీకు నా మీద ఇష్టం తగ్గిపోయింది' అంటూ శంకించేదాన్ని. నీకు నేనే ముందు ప్రపోజ్ చేశాననా నా పట్ల చిన్న చూపు చూస్తున్నావ్ అంటూ ఎద్దేవా చేసేదాన్ని. మా అమ్మని తాను ఎంత బాగా చూసుకునేవాడో, మా చెల్లెలొస్తే కూడా తానడగకముందే అన్నీ చేసిపెట్టేవాడు. ప్రతి క్షణం – 'మావయ్య గారూ ఏం తింటారు, అత్తమ్మా మీకు ఏం కావాలి'

అంటూ మా అమ్మానాన్నల్ని అడుగుతూ నా కుటుంబాన్ని అపురూపంగా చూసేవారు. మా ఇంటికి వస్తే అందరితో చతురోక్తులు విసురుతూ కలిసిపోయేవారు. ఓ సారి నాన్న నన్ను దగ్గరికి తీసుకొని, నా తల మీద ముద్దు పెట్టి, 'నేను అల్లుడిని అడిగితే నువ్వేంటమ్మా బాధ్యత గల కొడుకునే ఇచ్చావ్? అసలిలాంటి కాలంలో ఇంత గొప్ప సుగుణాలు కలిగిన మనిషి దొరుకుతాడా' అన్నారు.

ఇటువైపు నేను ఆలోచించాను – చీటికీ మాటికీ నా గొప్పతనాన్ని, అభి మీద నాకున్న ఆధిపత్యాన్ని చూపించుకోవడం కోసం ఎంత మందిలో ఉన్నా అరుస్తూ ఉండడం, సెలవలకి ఇంటికొచ్చినా గంటలు గంటలు ఫోన్లతో, ఫ్రెండ్స్ తో ఉబుసుపోని కబుర్లతో టైం వేస్ట్ చెయ్యడం, వంటగదిలో ఆ వయసులో మీరు హైరానా పడుతుంటే, హాల్లో కూర్చుని పేపర్ తిరగేస్తూ పనివాళ్ళతో కాలక్షేపం చెయ్యడం, అయ్యో కోడలితో గడపలేదే అని మీరు నా గదికొచ్చినా, బాగా అలిసిపోయానత్తయ్యా అని నిద్ర వస్తున్నట్టు పడుకోవడం – ఇవేగా నేను చేసింది.

''పొద్దస్తమానం అమ్మ అంటావ్, ఊరు వెళదాం అంటావ్, లైఫ్ విసుగ్గా ఉంది నాకు'' అంటూ అభిని సైకలాజికల్ గా బ్లాక్ మెయిల్ చేసి ఊటీ, కొడైకెనాల్ తిరగడం తప్పించి, ఈ సంవత్సర కాలంలో నేను చేసింది ఏముంది? ఈ అరవై ఏళ్ళ వయసులో మీరు ఎనభై ఏళ్ల అత్త మామలకి సేవ చేస్తూ, చురుగ్గా తిరుగుతూ అందరి అవసరాలూ ఎలా తీరుస్తున్నారా అని ఏనాడూ ఆలోచించ లేదు.

ఈ ముసలివాళ్ళతో, ఆసుపత్రుల చుట్టూ తిరగడం విరక్తి అనిపించడం లేదా అత్తమ్మా అని ఓ సారి అడిగితే – వీళ్లంతా మనవాళ్లే, మనవాళ్ళకి ఏమొచ్చినా ప్రేమగా చూసుకుంటామనే భరోసా ఇవ్వలేకపోతే అది కుటుంబం ఎలా అవుతుంది. నా భర్త ఓ జడ్జ్. నిజాయితీ గల ఆయన ముందు ఎవ్వరూ నోరు మెదిపి మాట్లాడే ధైర్యం కూడా చెయ్యరు. కానీ, ఇంట్లో నేనేది చెప్పినా ఆయన నోరు మెదపరు . తనకు తెలుసు, అత్త మామల్ని అమ్మానాన్నల్లా చూసుకుంటానని. అది చాలదా ఏ మగవాడికైనా. మీ మామయ్యతో మనకొక చిరునామా వచ్చింది. కానీ ఇంట్లోని ఆడవాళ్ళతో పరువు, ప్రతిష్ట పెరుగుతుంది. మంచి తెచ్చినా, చేడు తెచ్చినా ఆ ఇంట్లోని ఆడవాళ్ళ పాత్రే ఎక్కువ – అని మీరు చెప్పినప్పుడన్నా నేను అర్థం చేసుకొని ఉండాల్సింది.

అత్తమ్మా ! ఆఫీసులో నేను జారి పడ్డప్పుడు, రెండు నెలలు బెడ్ రెస్ట్ చెప్పినప్పుడు, అభి మలేషియా వెళుతూ నన్ను ఎక్కడ దించనూ అని అడిగాడు. మా అమ్మ ఉద్యోగస్తురాలు, నన్నెలా చూసుకుంటుందీ అన్నాను పెడసరంగా . పొద్దస్తమానం పుట్టింటి గొప్పలు ఆపకుండా చెప్పే నేను పనుల షేరింగ్ వచ్చేసరికి, వాళ్లకి ఇబ్బంది కలిగించకుండా మీ మీద తోసేసే దాన్ని .

అభి ఫోన్ చేసిన వెంటనే మీరు, అయ్యో కోడలికి అంత కష్టం వస్తే ఏంట్రా అలా అంటావ్, ఆఫీసుకెళ్లే హడావిడిలో తను సరిగా తినడం కూడా లేదు, మనింట్లోనే ఉండి ఓ రెండు నెలలు రెస్టు తీసుకుంటుందిలే అన్నారు ఆనందంగా. రెండు నెలలు మీతో అన్ని సపర్యలూ చేయించుకున్నాను. అదే మీకు వైరల్ ఫీవర్ వచ్చి హాస్పిటల్ లో జాయిన్ అయినప్పుడు అభి కంగారు పడి వెళదామన్నప్పుడు, ''జ్వరమేగా తగ్గిపోతుందిలే, నాకు ప్రాజెక్ట్ లాంచింగ్ ఉంది, హెల్ప్ చేయాల్సిన అవసరం లేదా'' అని అరిచాను. వారం రోజుల నా పనిని, రెండు రోజుల్లో చేసి..ఇంకా ఏమైనా ఉందా అని అడిగి, కనీసం నువ్వు వస్తావా అని కూడా అడగకుండా వెళ్ళిపోయాడు. అప్పుడు కూడా అపరాధ భావన రాకుండా నా కంటే మీరే ఎక్కువా అని ఏడ్చాను.

ఇలాంటివి చెప్పుకుంటూ పోతే ఎన్నెన్నో, గతమంతా గాయాలే, బతుకంతా ఒంటరి తనమే. పుట్టిల్లు ఎప్పుడన్నా వచ్చి సేదదీరే హాలిడే స్పాట్ మాత్రమే, అత్తిల్లు మన శాశ్వత చిరునామా. మీరంతా నా ఆత్మ బంధువులు అన్నది ఇప్పటికి నాకు అర్థం అయ్యింది. మీతో మూర్ఖంగా ప్రవర్తించాను, క్షమించండి అత్తమ్మా. తెలివి తక్కువగా చేసిందే తప్పు, తెలివితో చేసింది కాదిది. మీ విలువను గుర్తెరుగక అందరిలో నా విలువను తగ్గించుకున్నాను.

అత్తమ్మా!

సంస్కారం మూర్తీభవించిన మంచి భర్తనిచ్చారు. మంచితనాన్ని, ప్రేమ గుణాన్ని తన ద్వారా నేర్పించారు. పితూరీలు, వెటకారాలు తెలియని మంచి కుటుంబాన్ని నా కందించారు. నిజం, మా అమ్మన్నదే నిజం – మగాడి మనసును మెప్పించాలంటే ముందు కడుపు తెల్సుకోవాలి. ఆ తర్వాత మనసుకి మార్గం కడుపునుండే ఉంటుంది. తనకు ఏం ఇష్టమో నాకింత వరకూ తెలియదు కానీ, నాకేది ఇష్టమో తనకి అన్నీ తెల్సు. సడన్ సర్ ప్రైజులు, డిన్నర్లు, వీకెండ్ లాంగ్ డ్రైవ్ లు నా కోసమే ప్లాన్ చేసేవాడు. మీరే లేకపోతే నా పెంకి తనం వల్ల తెలివి తక్కువ గుణాల వల్ల విడిపోయి వుండేవాళ్ళం.

ఎంత గొప్ప మాటన్నారు అత్తయ్యా! నా కొడుకుగా ముప్పై ఏళ్ళే, కానీ నీ భర్తగా మిగతా డెబ్బై ఏళ్లూ ఉంటాడు అభి, అని. ఈ నిజం నా లాంటి అమ్మాయిలకి ఎందుకు అర్థం కాదో! మన బంధువుల్లో ఎవరింట్లో పెళ్లి జరిగినా, కొడుకునీ కోడల్నీ తీసుకొచ్చి మీ కాళ్ళకి మొక్కిస్తారు. మీ లాంటి గొప్ప కోడలై కుటుంబాన్ని చూసుకొనేలా దీవించమని చెపుతారు. ఆ పరంపరని కూడా నేను బేఖాతరు చేసాను. అన్ని సౌకర్యాలు ఉన్న ఇల్లు అభికి ఇచ్చాననుకున్నాను. టీవీలు, సోఫాలు, ఏసీలు ఉంటే సరిపోదు. ఆత్మీయులైన మనుషులు ఉండాలి. విత్తు ముందా, చెట్టు ముందా అన్న తర్కంలో కోడిని వదిలేసి కోడిగుడ్డు నాదనుకున్నాను. రేపూ నాకూ ఓ కోడలొచ్చి, నా పట్ల ఇలా ప్రవర్తిస్తే అన్న ఊహే భరించలేకపోతున్నాను. మూడు నెలలు కూడా లేని నాకొడుకు పట్ల నేను పెంచుకున్న ప్రేమ చూసి కూడా, ముప్పై ఏళ్ల మీ కొడుకు పట్ల మీ ప్రేమని అర్థం చేసుకోలేకపోయాను.

ఓ నాలుగు గంటలు మనతో ఉండే ఫ్రెండ్స్ కోసం వెతికి వెతికి గిఫ్ట్లు పట్టుకొస్తాం. ఓ ఏడు గంటలు మనం పనిచేసే ఆఫీసులో 'మంచి పనిమంతురాలు' అన్న పేరు సంపాదించుకోవడం కోసం శ్రద్ధగా పనిచేస్తాం. అదే – జీవితాంతం మనమే జీవితంగా బతికే ఓ మనిషి కోసం, తన ఆనందం కోసం, ఆ ఆనందాన్ని పంచే తన కుటుంబం కోసం ఏమన్నా చేయాలన్న భావన ఎందుకు కలగదో నాకు అర్థం కావడం లేదత్తమ్మా.

అభికి ప్రతిదీ నేనే, నా కళ్ళతోనే ప్రపంచాన్ని చూస్తాడు, నా మనసు తెలుసుకొని ప్రవర్తిస్తాడు . నాకు నచ్చినవి కన్పిస్తే వెంటనే తెస్తాడు . నాకు నచ్చిన సినిమాలే బుక్ చేస్తాడు . ఇంతగా ప్రేమించే భర్తని పొందిన నేను, 'నేను లేకపోతే నీకు దిక్కేది' అని అడిగి ఉండకూడదు. 'ఏంటి నీ గొప్ప' అని దెప్పి పొడిచి వుండకూడదు. నిజం చెప్పవలసి వస్తే నాకంటే అన్ని విధాలా తాను గొప్ప వ్యక్తిత్వం కలవాడు . అన్నిట్లో తాను ఫస్ట్. భర్త అంటే భరించేవాడని ఎవరన్నారో గానీ అది అభికి చక్కగా సరిపోతుంది. మనం సంపాదించాల్సింది, డబ్బు బంగారం కాదు. మనవాళ్ళ ఆత్మీయతా అనురాగాల్ని. మనం కూడేసుకునేది పేరు, పెంపు కాదు.... మనవాళ్ళ నమ్మకం విశ్వాసాలే. అవన్నీ మీ వద్దే ఉన్నాయ్ అత్తమ్మా. అత్తమ్మ అంటే మమతల మాగాణమ్మ. అలాంటి మీతో కన్నీళ్లు పెట్టించాను, వేదన కలిగించాను. నన్ను క్షమించండి అత్తమ్మా. ఈసారి నన్ను నమ్మమని చెప్పను. మీకు నచ్చేలా నేనెప్పుడూ ప్రవర్తించనూ లేదు. నేను మారానని నిరూపించుకోడానికి నాకొక అవకాశం ఇవ్వమని కోరుకుంటున్నాను. అభి మనసుని రాయి చేసుకోనివ్వొద్దని వేడుకుంటున్నాను.

ప్రేమంటే ఇవ్వడం, క్షమించడం అని ఇప్పటికి తెలుసుకున్నాను. మీ మనవడిని ఆశీర్వదించడానికి వస్తారని ఆశిస్తూ ...మీ కోడలు.

★★★

చూసేవంటరా, ఎంత బాగా రాసిందో. 'ఒక ఇంటి ఆడపిల్ల, మరో ఇంటికి కోడలు. నీ కోడలు ఇలా ప్రవర్తిస్తే నువ్వు ఓర్చుకుంటావా, బుద్ధి చెప్పి పంపించు, వాళ్ళు చాలా మంచివాళ్ళు, ఆ ఇంటికి తలవంపులు నీ కూతురు వల్ల వస్తే సంబంధం కుదిర్చిన నేను, కన్నందుకు నువ్వూ జీవితాంతం తలొంచుకోవాల్సిందే అని' నువ్వన్నప్పుడు నిజమే

అనిపించింది. కూతురు కష్టంతో వస్తే కడుపులో దాచుకుంటాం, కానీ మెట్టినింటిని కష్టపెట్టి వస్తే ఆ ఇల్లు ఎంత పరాయిదో, ఈ ఇల్లూ అంతే పరాయిది అవుతుందని చెప్పాను. విషం కక్కే సీరియళ్ల వల్లే తన ఆలోచనలు పెడదారి పట్టాయి గానీ, బేసికల్ గా నా కూతురు మంచిదేరా. అత్తిల్లు అంటే భర్త తప్ప అందరూ చెడ్డవారే అని తలచకూడదని, నీ వదిన కూడా ఇలానే చేస్తే నీకు కష్టంగా ఉండదా అని అడిగాను. తాతకు పెట్టింది తలదగ్గరే ఉంటుందనే కర్మ సిద్ధాంతాన్ని గుర్తు చేసాను.

నా కూతురు తరపున నేను మాటిస్తున్నానురా. ఇంక నా కూతురు ఆ ఇంటికి కోడలుగా కాదు, కూతురుగా సేవలు చేస్తుంది. ఆ ఇంటి పరువు, ప్రతిష్టలను కాపాడుతుంది. మా ఇంటి మావిడాకులు వసివాడి విడాకులుగా మారకుండా కాపాడిన నీ లాంటి సహృదయుడైన మిత్రుడు ఉన్నందుకు గర్వ పడుతూ, హృదయపూర్వక నమస్కారాలతో...

నీ

– కిరణ్

# ఆ డిజిటలిజం

ఇక్బాల్ !

I am సారీ ... నువెన్నో సార్లు మెయిల్స్ ఇచ్చావని.. SMS, APP ల ద్వారా ప్రయత్నించావని రామారావు చెప్పాడు .. నేను ఈ మధ్య సెల్ ఫోన్ తీసేసానురా. మనని మనకు కాకుండా చేస్తున్న సాధనంగా అనిపించిందిరా. మిత్రులందరూ నా ఈ నిర్ణయాన్ని అసహనంగా తీసుకున్నారు . ఫోన్ లేకపోతే ప్రాణం పోదా అన్నట్టు చూసారు . కానీ నా అనుభవాలు నావి కదా ..

ఓరే ! నీకు గుర్తుందిగా .... నా తాహతు కు మించి నా కొడుకు బాగుండాలన్న తపనతో వాడిని కార్పొరేట్ కాలేజీ లో చదివిస్తూ హాస్టల్ లో ఉంచాను . చదువు తప్ప వాడికి మరేదీ అబ్బలేదు . వాడొక పెద్ద ఆఫీసర్ ఐనా ఇంట్లో వాడికి ఎవ్వరితోనూ అనుబంధం లేదు . ముభావంగా ఉంటూ తన పని తాను చేసుకుంటూ ఉంటాడు . వాడూ నేనూ ఒకే కప్పు కింద ఉన్నా ఎవరితో ఎవరికి మాటలు పెద్దగా ఉండవు . నేనెంత ప్రయత్నించినా వాడు నాకు దగ్గర కాలేక పోతున్నాడు . హెలికాప్టర్ పేరెంటింగ్ చేసానేమో అనిపిస్తుంది .. వాడిప్పుడు క్రైసిస్ మేనేజ్ మెంట్ కూడా చెయ్యలేడు . ఉద్యోగంలో దానివల్ల ఇబ్బంది పడుతున్నాడు. ఆ న్యూనతలో నేను ఉన్నప్పుడే నా మనవడిని నా దగ్గరకి పంపింది మా అమ్మాయి .. నా కూతురు–అల్లుడు ఇద్దరూ డాక్టర్లే కదా ! పిల్లాడిని 'డే' కేర్ లో వేస్తే త్వరగా 'సిక్' అవుతున్నాడట. కాస్త 'ప్రేమ'ను రుచి చూపించి మా అబ్బాయిని మమ్మల్ని ప్రేమించేలా పెంచివ్వండి నాన్నా అందిరా... అప్పుడు తెల్సింది నాకు, నేను చేసిన తప్పు– నా భార్య బ్రతికినంతకాలం అంటూ ఉండేది... "పిల్లల్ని వాళ్ళ ప్రపంచంలో పెంచుదాం, మన ఆశల్ని తీర్చే యంత్రాల్లా వద్దు" అని. నేను కోల్పోయిన జీవితం నా పిల్లలు కూడా పోగొట్టుకోకూడదని ప్రయత్నిస్తున్నానురా...

నాకు మాదిరే ఇవ్వాల్రేపు అందరి దగ్గరా అన్నీ వున్నాయి, కానీ లేనిదల్లా 'టైం' ఒక్కటే. పూర్వకాలంలో ఎవరి చేతికీ వాచీలు వుండేవి కావు. కానీ వాళ్ళ చేతుల్లో బోలెడంత 'టైం' వుండేది. ఇప్పుడు అందరి చేతులకీ వాచీలున్నాయి కానీ చేతుల్లో టైం వుండటం లేదు. ఎంత చిత్రం కదా.. కాలం వేళ్ళ మధ్య ఇసుకలా జారిపోతూనే వుంది. పట్టుకుందామనే ప్రయత్నంలోనే జీవిత చరమాంకానికి వచ్చేస్తున్నాం..నాలాగా.

ఏరా! దృష్టిని బట్టి సృష్టి వుంటుందని అంటావ్ కదా.. భావాల్ని బట్టి భవిష్యత్తు అంటావు కదా.. ఒక్కసారి రివ్యూ చేసుకో మనం పొందింది ఎక్కువనా..పోగొట్టుకుంది ఎక్కువనా..?

నా మనవడు ఇండియా రాగానే ఎంత మారాం చేసాడో తెలుసా ! మాట్లాడితే మూడున్నర ఏళ్ళు కూడా లేనివాడికి సెల్ కావాలి. టాబ్లెట్ లేనిదే, దాన్ని చేతుల్లో పెట్టందే అన్నం తింటానికి నోరు కూడా తెరవడు. టీ.వీ., కంప్యూటర్ల మీదే వాడి దృష్టంతా. "తాతయ్యా ! అప్పట్లో మీ చిన్నప్పుడు పాపం మీకు టీ.వీ.లు లేవంటగా.. కంప్యూటర్ లు లేవంటగా.. ఫోన్ లేకుండా ఎలా ఉన్నారు తాతా" అంటాడు. ఒక మర మనిషిలా కంప్యూటర్ కి అతుక్కుపోయే నా కొడుకుని చూసి

నిట్టూరుస్తూ వాడికి చెప్పాను – "మీలాగా మేం కంప్యూటర్ బొమ్మలతో ఆడుకోమమ్మా.. రియల్ మనుష్యులతో ఆడుకుంటాం" అంటూ మన బాల్యం గురించి చెప్పాను. వాడితో మాట్లాడుతుంటే చిత్రంగా కంప్యూటర్ ని వదిలి నా కొడుకు కూడా వచ్చి మాతో కూర్చున్నాడు.

మన ఊరి పిల్ల కాలువలు, మనం చేత్తో గిరితే ఊరే చెలమలు, మన కర్రా బిళ్లా ఆటలు, కోతి కొమ్మచ్చి ఆటల్లో మనం చేసిన హై జంప్ లు, చెరువుల్లో పెట్టుకున్న ఈత పోటీలు, చెట్ల మీద నిద్రలు, కాలవ గట్టున పరుగులు, పొలాల్లోనే తినడాలు..ఎక్కడ పిల్ల కాలవ కనిపించినా దిగి నీళ్ళు తాగే వాళ్ళం. ఎవరింట్లోనో ఆటల్లో పడి టైం తెలియకపోతే ఆ తల్లే అందరికీ కలిపి ముద్దలు పెట్టేది. ఎవరిది ఏ ఇల్లో చూసుకోకుండా వెన్నెల్లో దాగుడు మూతలు ఆడేవాళ్లం, ఆదివారం వచ్చిందంటే వలలు ఏర్పాటు చేసుకొని చెరువుకెళ్లి చేపలు పట్టుకొచ్చి వండిచ్చుకొని సహ పంక్తి భోజనాలు చేసేవాళ్లం. చిత్రాన్నం, దద్దోజనం, వడలు, వడపప్పు, గుగ్గిళ్ళు... అబ్బో ఎన్నెన్నో తిండ్లు. పీర్ల పండగొస్తే చాలు..అందరం నీతో బాటే వుండేవాళ్ళం. జోసెఫ్ ఇంట్లో క్రిస్టమస్ పండుగలో ఎన్ని గిఫ్టులు తెచ్చుకునేవాళ్ళమో క్రిస్టమస్ ట్రీ దగ్గర. ఇవన్నీ చెపుతుంటే నా మనవడితో పాటు విన్న నా కొడుకు 'బాల్యం' లో ఇన్ని అద్భుత జ్ఞాపకాలున్నాయా నాన్నా అన్నాడు. మరి నా బాల్యంలో నాకు పుస్తకాలు, స్కూల్ తప్ప ఏవీ లేవేంది నాన్నా అని కూడా ప్రశ్నించాడు. సిగ్గుపడ్డాను. ఏదో తప్పు చేశానన్న అపరాధ భావన కల్గింది.

మార్కులే పరమావధి అంటూ పిల్లల్ని మరల్లా పెంచితే మిగిలేది కన్నీళ్ళేనని నాకర్థమయ్యింది రా. అంటే పిల్లల్ని చదివించకూడదా.. వాళ్ళు పెద్ద ఉద్యోగాలు చేసుకుంటూ చేతినిండా డబ్బులతో, ఇబ్బందులు పడకుండా ఉండాలనే కదా పెద్దలుగా మనం చెప్పేది అంటారు. కానీ మన కిరాతక ఆలోచనల బోన్ లో వాళ్ళని పెరగనివ్వకుండా స్వేచ్ఛగా ఎదగనిద్దాం. వాళ్ళ బుద్ధి వికసించేలా పెంచితే వాళ్ళ కళ్ళల్లో ఎంత ఆనందం ఉంటుందో నాకిప్పుడు నా మనవడు చవి చూపించాడురా. వాడో గొప్ప ఆఫీసరో, సైంటిస్టో కావాలని కోరుకునే కన్నా ముందు వాడు మనిషిగా మిగలాలని, బ్రతకాలని కోరుకుంటున్నా. వృద్ధాప్యంలోని తల్లిదండ్రులు పిల్లలకు ATM కార్డులు కాకుండా, పిల్లలు వారికి ఆధార్ కార్డులు కాకుండా వుండాలంటే.. అనుబంధాలు బలపడాలిరా.. ఆ బంధం బలవంతపెడితే రాదు.. ప్రేమతో మాత్రమే ముడిపడుతుంది.

నీకు తెల్సా సర్వేలు ప్రపంచవ్యాప్తంగా ఏం చెపుతున్నాయో–

సోషల్ మీడియాలో ఖాతా తెరవాలంటే కనీసం 13 యేండ్ల వయసుండాలి. వాస్తవంగా చూస్తే 10 సంవత్సరాల లోపు వారు 3 వంతుల మందికి ఖాతాలున్నాయిప్పుడు. ఎంత దౌర్భాగ్యం ఇది. చిన్న పిల్లల్లో కంటి సమస్యలు, ఒబెసిటి, నడుములు వంగిపోవటం, మితిమీరిన అలసట, అశాంతి, ఏర్పడ్డానికి ప్రధాన కారణం ఎలక్ట్రానిక్ వస్తు ఉపయోగాలే. రాత్రి పూట ఎలక్ట్రానిక్ వస్తువుల్ని వాడటం వలన నిద్రనిచ్చే మెలటోనిన్ హర్మోన్ ఉత్పత్తి తగ్గిపోతుందని పరిశోధకులు అంటున్నారు.

ఎంతైనా లేడీస్ ఇన్ సైట్ ఎంతో గొప్పదిరా.. నా భార్య పదే పదే అనేది.. పిల్లల్ని స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా ఎదగనివ్వాలి. పువ్వు దానంతట అదే వికసించాలి, కానీ బలవంతంగా విప్పితే సువాసన రాదు, ఫ్రెష్ నెస్ వుండదు.. అని. అలాగే పిల్లల్ని స్వేచ్ఛాయుత వాతావరణంలో పెంచితే..ఎదురు దెబ్బలు తగిలితే తట్టుకుంటారు, పైగా గువ్వల్లాగా ఎగురుతూ ఆనందంగా పెరుగుతారు.

నిన్న నేను నా మనవడితో రోడ్డు దాటుతూ..జాగ్రత్త నాన్నా అన్నాను, వాడి చెయ్యి గట్టిగా పట్టుకొని రోడ్డు దాటించాను. ఇంటికొచ్చి వాడేం చెప్పాడో తెలుసా.. "తాతయ్యకి ఎంత భయమో..నా చెయ్యి గట్టిగా పట్టుకొని రోడ్డు దాటాడు చిన్నపిల్లాడిలా" అన్నాడు. వాడు నీళ్ళు పారబోస్తే మొన్న ఓ దెబ్బ వేశాను. హుస్సేన్ సాగర్ చూస్తే ఆనందపడ్తాడని సాగర్ దగ్గరకు తీసుకెళ్తే "తాతా ! ఇన్ని నీళ్ళు ఇక్కడ ఎవరు పారబోశారు" అన్నాడు. చూశావంట్రా..

పిల్లల దృష్టి ఎంత షార్ప్ గా వుంటుందో..ప్రతిదీ గమనిస్తారు..వాళ్ళ అనుభవాల నుండే వాళ్ళు చూస్తున్న దాన్ని అన్వయించుకుంటారు. మరి రేపటి మన తరం ఆధారపడే–ఈ తరం పిల్లల పట్ల మన మెంత జాగ్రత్తగా వుండాలో చెప్పు !

'రేపటి దేశ ప్రగతి తరగతి గదుల్లో రూపొందించబడుతుంది' అని చెప్పిన సర్వేపల్లి గారు వాళ్ళకోసం ఎలాంటి విద్యా విధానం వుండాలో కూడా వివరంగా చెప్పారు. అందుకే కదా – 'బడి గంట మోగింది. ఎన్ని సీతాకోకచిలుకలో స్వేచ్ఛగా ఎగిరొస్తున్నాయి' అన్నాడో కవి. బాల హమాలీలుగా పిల్లల్ని పెంచొద్దురా. స్వేచ్ఛగా.. సిలువ వేయని క్రీస్తులా ఉండనిద్దాం. ఆ పసినవ్వుల్లో ఆనందాన్ని చూద్దాం తప్ప – గోల్స్ అనో, టార్గెట్స్ అనో, ర్యాంకులనో ఓ ట్యాగ్ ని వాళ్ళకి అతికించి వాళ్ళ బాల్యాన్ని చిదిమెయ్యవద్దు అనిపిస్తుందిరా.. ఇంట్లో ప్రేమ దొరక్కపోతే ఆ ప్రేమ రాహిత్యంతో పెరిగే పిల్లలు ఇంటర్నెట్ కి అతుక్కుపోయి ఎవరు 'ఒరే కన్నా !' అన్నా చాలు, అక్కడ వాలిపోయి ఆ మాటలకి పడిపోతారు. నెట్ ద్వారా వల విసిరే మోసగాళ్ళు, సైబర్ నేరగాళ్ళు గురించి మనకు బాగా తెలుసు కదా, సభ్య సమాజంలో ఏం జరుగుతుందో !

అయినా మంచి మాటేమీ చౌకగా దొరికే మొబైల్ డేటా కాదురా..ఏదన్నా అన్ లిమిటెడ్ అంటే చాలు.. అరువు తెచ్చుకొని మరీ డేటా వేయిస్తారు. దేనికన్నా 'అదుపు' అతి ముఖ్యం కదరా. "ఇంత పెద్ద సముద్రానివి కదా, నీకు ఈ చెలియలి కట్టెందుకు.. నువ్వెందుకు ఓ గడ్డి పోసను కూడా వుంచుకోవూ" అన్నాడట నాలాంటి పెద్ద మనిషి. అందుకా సముద్రం నవ్వి – ఒకటే గడ్డి పోస కదా అని చేరదీస్తే చివరికి నేనంతా చెత్త గిరాటేసే డస్ట్ బిన్ అవుతాను. అలాగే 'మితం' – 'పరిమితం' అని రెండుంటాయి. అంతా నేనే కదా అంటే పలచబడి పేరు లేకుండా పోతాను. కట్టడి మధ్య ఉంటేనే ఓ చక్కని పేరు, క్రమశిక్షణ గల శైలి వుంటుంది అని చెప్పిందట. చూశావా...మనం మన పిల్లలకి ఈ జీవిత పాఠాలు చెప్పగల్గుతామా...

సాటి పిల్లల్తో పోల్చుకుంటూ నువ్వెందుకు నాకు సెల్ ఫోన్స్ ఇవ్వవు, టీ.వీ. రిమోట్ ఇవ్వవు అని ప్రశ్నించే నా మనవడిని అసలు ఆ ప్రశ్న ఉద్భవం కాకుండా చూసుకోవాలని తపన పడుతున్నాను. గార్డెనింగ్ చేయిస్తున్నా, మొక్కలకి రోజూ పూసే సరికొత్త పువ్వులు చూసి వాడు ఎంత సంబరపడుతున్నాడో ! ఆకాశంలో చుక్కలు చూస్తూ, ఖగోళ యాన యాత్రల గురించి కథలు చెప్తున్నా. వెన్నెల్లో ఇరుగు పొరుగు పెద్దల సాయంతో పిల్లలు అలసి పోయేదాకా ఆటలు ఆడిస్తున్నా. మన సాంప్రదాయ దినుసులతో వంటలు చేయిస్తూ దేహదారుఢ్యాన్ని పెంచుతూ..వాటి విలువను పదే పదే గుర్తు చేస్తున్నా.. మరలు మన చేతుల్లో వుంటే తప్ప ఉపయోగపడవు. మనుషుల్ని ప్రేమిస్తే ఎప్పుడు అవసరం ఏర్పడినా అపుడు మనతో ఉంటారు. సకాలంలో స్పందిస్తారు. మనకు అండగా నిలబడతారని అర్థమయ్యేలా చెపుతున్నా.

అయినా వాళ్ళకి అలా చెప్పేటప్పుడు నాకు గాంధీ గారు గుర్తొచ్చారురా.. 'నా కొడుకు బెల్లం బాగా తింటున్నాడు– తినొద్దని చెప్పు బాపూ' అని ఓ తల్లి గాంధీ గారిని అభ్యర్థిస్తే, కొంత కాలం తరవాత రమ్మని చెప్పి – అప్పుడు చెప్తారట గాంధీ – "బాబూ ! బెల్లం ఎక్కువగా తినకూడదు–మితి మీరినదేదీ మంచిది కాదు" అని. అందుకా తల్లి అపుడే చెప్పొచ్చుగా బాపూజీ అని అడిగితే, అందుకు బాపూజీ నవ్వుతూ – ముందు నేను మానేసి చెపితే ఆ మాటకో బలం వస్తుంది. నిజాయితీతో పలికే పలుకుకి మంత్రంకి ఉన్నంత శక్తి ఉంటుంది. అందుకే బెల్లం తినటం మానుకోటానికి నాకు కొంత టైం పట్టిందమ్మా – ఇక మీ అబ్బాయి బెల్లం తినడు అన్నాడట. మనం కూడా అంతే కదరా – వాళ్ళకు చెప్పే ముందు మనం వాటిని వాడటం తగ్గించాలి. టీ.వీ. ఓ వ్యసనంగా, సీరియల్లే సర్వస్వంగా భావించే మనుషులు మారాలి. కంప్యూటరే జగంగా భావించే మన మనస్తత్వాలు మారాలి – ఫోన్ లేకపోతే ప్రాణం వుంటుందా అనుకునే వాళ్ళు కొన్ని రోజులు ఫోన్ కి రెస్ట్ ఇచ్చి చూడాలి. మన జీవితం చుట్టూ ఎంత ఆనందం వుందో అప్పుడు అర్థమవుతుంది.

మొన్నామధ్య నాకో వాట్సప్ మెసేజ్ వచ్చింది...

అది తల్లి గర్భంలో ఉన్న పసికందు నుంచి అమ్మకు ఒక రిక్వెస్ట్ లెటర్...

ప్రియాతి ప్రియమైన డియర్ మదర్ బోర్డ్,
డాక్టర్ అంకుల్ మొన్న నీతో 'ట్యాబ్లెట్' తీసుకోండి అన్నప్పుడు
నేనేదో కంపెనీ ట్యాబ్ రాసిచ్చారు అనుకుని ఉన్నానా...
తీరా ఆయన ఏదో విటమిన్ టాబ్లెట్ ఇచ్చారు.
అమ్మా, ఒక్కటైనా మొబైల్ ఫోన్ మింగెయ్యకూడదా ???
ప్లీజ్, వెంటనే ఒక ఫోన్ మింగమ్మా
ఇంకా 6 మంత్స్ ఒక్కడినే ఉండాలంటే
నాకు ఇక్కడ చాలా బోర్ అవుతోంది
డాక్టర్ అంకుల్ scan చేసి report ఇవ్వడానికి ముందే
నేనే selfies క్లిక్ చేసి Whats app చేస్తాను,
వీక్లీ వన్స్ status update చేస్తాను
Daddy ని కూడా tag చేస్తాను.
అమ్మా IIT కి వెళ్లాలంటే ఇప్పటినుంచే
కోచింగ్ తీసుకోవాలంట, త్వరత్వరగా lessons Update చెయ్యి
ఇక్కడినుంచే చదివి, Homework లో పోస్ట్‌చేస్తాను, comment చెయ్యి
లాస్ట్ రిక్వెస్ట్,
అమ్మా... ఎలాగైనా ఉండు ఎక్కడైనా ఉండు
కానీ, సిగ్నల్ ఉన్న ప్లేస్ లో ఉండు.

ఈ మెసేజ్ చదవగానే నేను నవ్వుకోలేదురా, భయంతో వణికిపోయాను. మనల్ని మనమే ఎలాంటి ఉచ్చులో బంధించుకుంటున్నామో తెలుసుకొని. మనసుకి కమ్మిన మాయ విడిపోయినట్టయ్యింది. జీవితాన్ని ఇంత కాంప్లికేట్ చేసుకోవాలా..అనిపించింది. మనం దాటిపోయాం, మనం పిల్లల్ని కన్నాం..వాళ్ళ రాతల్ని కాదు అనుకోవద్దురా, వాళ్ళ చేతల్ని సరైన దార్లో పెడదాం, వస్తువుల్ని ఉపయోగించుకుందాం...మనుషుల్ని కలుపుకుందాం...అదెలాగన్నది మనమే ఆచరించి చూపిద్దాం అనుకొని పూనుకున్నాను.

ఒరేయ్ !

అందరం పిల్లల్ని ప్రేమిస్తాం. ఆ ప్రేమ అపరిమితం. మరి అలాంటప్పుడు వాళ్ళని ఎందుకు స్వేచ్ఛగా వుండనివ్వం. ఎందుకు గిరి గీసుకొని దాంట్లోనే మనం చెప్పిన సూత్రాల్లోనే బ్రతకమంటున్నాం..

మారాల్సింది పిల్లలు కాదు మనం..మన ఆలోచనలు..

చెప్పాల్సింది వాళ్ళకి కాదు మనకే..ఏమని.....ప్రేమతో మార్చలేనిది ఏదీ లేదని.

పిల్లలు మనకి కొనసాగింపు కావచ్చు. కానీ మన బ్రతుక్కి 'కొసరు' మాత్రం కాదు. వాళ్ళకీ ఆలోచనలున్నాయి. వాళ్ళకీ ఆశలున్నాయి. వాళ్ళకీ కోరికలున్నాయి. స్వేచ్ఛగా పెరగనిద్దాం. ప్రేమతో ఎదగనిద్దాం. అప్పుడు ప్రపంచాన్ని ప్రేమతో గెలుచుకుంటారు. ఓ బానిసగా, ఓ ముద్దాయిగా, ఓ యంత్రంగా చూస్తే వాడూ ప్రపంచాన్ని, మనుషుల్ని అలాగే

చూస్తాడు. రాబోయే మన రోజులు బాగుండాలన్నా, రేపటి బంగారు భవిష్యత్తును మనం చూడాలన్నా పిల్లల ప్రపంచం బాగుండాలి. స్వేచ్ఛగా సీతాకోకచిలకలు ఎగురుతూ ఉండే వాతావరణం మనం కల్పించాలి.

ఇక్బాల్ !

స్నేహం చెయ్యదల్చుకుంటే ప్రకృతి అంత గొప్పది, అనుభవించదల్చుకుంటే జీవితం కంటే పెద్దది ఏదీ లేదంటారు.

బాల్యం కూడా అంతేరా.. బంగారు జీవితానికి ద్వారం అది. ఆకాశంలో విరిసే హరివిల్లు..కొబ్బరి చెట్ల చివర్ల నుండి జారిపడే వర్షపు చినుకులు..కాళ్ళ కిందుగా పరుగులెడుతూ కవ్వించే పిల్ల కాలువలు... అందులో గంతులేసే కాగితపు పడవలు అన్నీ బాల్యపు తీపిగుర్తులే.

వాటిని అలాగే వుంచుదాం.
బాల్యాన్ని వాటితోనే నింపేద్దాం.
ఫోన్ లు , చాట్ లు, యాప్ లు, వీడియో కాల్ లు – ఇవి కాదు జీవితం.
పలకరింపులు..ప్రకృతి పరవశాలు..పారే సెలయేళ్లు..
ఆకాశంలో పక్షులు..తోటి పిల్లలతో ఆటలు..ఇవే కదా అసలైన ఆనందాలు.
వీటిని రుచి చూపిద్దాం. మంచి అభిరుచితో పిల్లల్ని పెరగనిద్దాం.
మరలు కాదు కావల్సింది మనుషులని..
ఎలక్ట్రానిక్ ఐటమ్స్ కాదు ఎనలేని మానవతా అనుబంధాలని తేల్చి చెపుదాం.

మనం మారితేనే మన భవిష్యత్ మారుతుంది. మనమిప్పుడు తెల్సుకుంటేనే రేపటి తరం తన తప్పుని దిద్దుకుంటుంది.

ఇప్పుడు పోగొట్టుకుంది తక్కువే కానీ, ఇలాగే కొనసాగితే పోగొట్టుకునేది పిల్లల్ని కాదు..మన జీవితాల్ని అని తెల్సుకుందాం.

అందుకేరా...నీకు సకాలంలో స్పందించలేకపోయాను. అయినా నువ్వు నాతో ఏకీభవిస్తావని, ప్రతి ఒక్కరూ తాము చేస్తున్న పనుల పట్ల మరోమారు పునః సమీక్ష చేసుకోవాలని, ముఖ్యంగా రేపు మన పిల్లలు జీవించే ప్రపంచం ఎలా ఉండాలో అలా నిర్మించుకునే పనిలో తలా కాస్త చేయూతనందించి మన ఆరోగ్య సమాజాన్ని కాపాడుకుందామని ప్రార్థిస్తున్నా. నా మనవి వినమని అభ్యర్థిస్తున్నా.

ఇట్లు

నీ స్నేహితుడు

– రాంచరణ్

# ప్రేమను ప్రేమించు ప్రేమకై...

బంగారూ !

హేపీ వేలెంటైన్స్ డే రా ! ప్రపంచానికి అత్యద్భుత వరం మహిళ అని ఎవరన్నారో తెలియదు కానీ, నువ్వు నా జీవితం లోకి రావడమే ఒక అద్భుతం అనిపిస్తోంది. రెండు సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం నువ్వు కరుణించి నా ప్రేమని యాక్సెప్ట్ చెయ్యడం ఎంత థ్రిల్ గా ఉందో తెల్సా... కళ్ళు చూసిన ప్రతిదాని వెనకా వెళ్లొచ్చు, కానీ మనసు మాత్రం జీవితం ఎక్కడుంటుందో అక్కడికే వెళ్తుందట. నా మనసు మాత్రం నిన్ను తప్ప దేన్ని అంగీకరించదు.

నేనెప్పుడూ నయాగరా చూడలేదు. నిన్ను చూశాక ఇక చూడాలని కూడా అనిపించడం లేదు. నీ నవ్వు నయాగరా జలపాతం అంత మధురంగా ఉంటుంది తెలుసా! జీవితపు మొగలి పొదల్ని దాటుకుంటూ..దాటుకుంటూ విచ్చుకున్న పరిమళభరిత పువ్వు నీ నవ్వు. ఆకుపచ్చని ఆశావాద ఆలోచనలతో అలుముకున్న మధుర భావన నువ్వు. నేను మదర్ తెరెస్సా గురించి విన్నానే గానీ చూడలేదు. యాసిడ్ తో నీ మీదకు దాడి చేసిన వాణ్ని సైతం, క్షమించిన నీ క్షమాగుణాన్ని కళ్ళారా చూశాక ఓ సారి మదర్ తెరెస్సాని చూసుంటే బావుండేదనిపించింది. నేను మానవ కంప్యూటర్ శకుంతల గురించి వింటూ... ఆ.. గొప్పలు చెప్తార్లే అనుకునేవాణ్ణి, కానీ నీ ర్యాంకులు, కాలేజ్ బోర్డ్ లో చూశాక ప్రతిభావంతులు మన మధ్యనే పుడతారని నమ్మక తప్పలేదు. కరుణ + ప్రతిభ + అందం = ప్రతిమ అని కాలేజ్ అంతా పొగిడేవారు. అంతటి వ్యక్తిత్వం నాతో ఏడడుగులు నడవడానికి ఒప్పుకోవడం ఏడేడు జన్మల సుకృతం కదా !

బంగారూ ! నీకొక నిజం చెప్పనా... ఖలీల్ జీబ్రాన్ అంటాడు కదా... "ఆమె నా ముఖంలోకి చూసింది. నా గత ఏడు తరాల వంశస్థులని దర్శించింది. నేను ఆమె ముఖం లోకి చూశాను. రాబోయే నా ఏడు తరాలని చూడగలిగాను"అని. అలా నిన్ను నేను ఫ్రెషర్స్ డే నాడు చూడగలిగాను. నీ క్లాస్ మేట్స్ అందరూ సిగ్గు పడుతూ, భయ పడుతూ, బిడియంగా కూర్చుంటే నువ్వు మాత్రం హాయ్ ఫ్రెండ్స్ అంటూ ర్యాగింగ్ గురించి సున్నితంగా చెప్పినా, చాలా సూటిగా చెప్పావ్ – ఇబ్బంది పెట్టే పనులేవీ ఆడపిల్లల దగ్గర చేయకూడదని.

నీ వాక్పటిమ, నీ ధైర్యం, నన్నెంత ముగ్ధుణ్ణి చేసాయో తెల్సా.. నువ్వు పుస్తకాలు చదవడానికి లైబ్రరీకి వెళ్తే, నేను నిన్ను చదవడానికి వచ్చేవాణ్ణి. పెదవుల మీద మొగ్గ తొడిగిన నవ్వు, కళ్ల కొలనులో పూయడం ఎంత సేపు! కన్ను చిత్రించిన బొమ్మ మనసు తెరపైకి రావడం ఎంత సేపు! ప్రేమంటేనే చిత్రం కదా !! మురిపించినట్టే మరిపిస్తుంది, మదిలో ఆశల్ని రగిలిస్తుంది. కష్టాల్లో పిలవకుండానే వచ్చేస్తుంది. మదినంతా భరోసాతో చుట్టేస్తుంది. చాలా మంది తల్లిదండ్రులు– తమ పిల్లల మనసులో మొలకెత్తిన ప్రేమని బ్లాక్ మెయిల్ చేసి, చంపేశామనుకుంటారు. భద్రమైన బ్రతుకు కోసం అలా చేశామని అనుకుంటారేగానీ, ఛిద్రమైన మనసుని మాత్రం గుర్తించరు. కానీ, రెమ్మలు త్రుంచిన కొద్దీ చిగురిస్తూ, కొమ్మలు తొడిగే కొద్దీ పుష్పించేదే ప్రేమ వృక్షం కదా !



ఏయ్ బంగారూ ! యాసిడ్ దాడిలో గాయపడి, నువ్వు హాస్పిటల్ లో వున్న ఆ సంవత్సరమంతా నేనేంచేశానో తెల్సా, మా ఇంటి కొచ్చినపుడు నువ్వు కూర్చునే చోట నైట్ క్వీన్ మొక్క నాటి రోజూ కన్నీళ్లతో పెంచానేమో, తోటంతా ఇప్పుడు నీ ఒంటి పరిమళమే! నేను లేనప్పుడు తలుపుల ముఖమ్మీది తాళపు బొట్టు చూసి, తల తిప్పుకొని వెళ్లిపోతావేమో అని భయపడి, గుండెను ఇంటి గూట్లోనే పెట్టి వచ్చాను. కాస్త జాగ్రత్త చేయరా !

ప్రేమంటేనే విషం కదా, అందుకే మరో గుక్కెడు అడుగుతున్నాను — అని ప్రముఖ రచయిత్రి అమృతాప్రీతం ఏ క్షణాన అన్నారో గానీ, నిన్ను ఇష్టపడ్డ క్షణం నుండీ నువ్వు నన్ను ఇష్ట పడాలని కోరుకుంటూ, నీకిష్టమైనవన్నీ చెయ్యాలని ఎంత తపన పడేవాడ్నో తెల్సా? ప్రేమ ప్రేమను ప్రేమగా ప్రేమిస్తుంది, ప్రేమను ప్రేమించిన ప్రేమ, ప్రేమను ప్రియంగా ప్రేమిస్తుంది అని ఏ క్షణాన విన్నానో గానీ ప్రేమ తప్ప జీవితము లో ఏమీ లేదు అన్నంతగా నీతో భవిషత్తును ఊహించు కున్నాను, మా అమ్మానాన్న మాత్రం నా ప్రేమను ఎంతో గౌరవించారు. నిన్ను అంతగానూ ఇష్టపడ్డారు.

నేను ఎప్పుడెప్పుడు నీకు చెప్తానా, నువ్వెప్పుడెప్పుడు నా ప్రేమను ఆమోదిస్తావా, ప్రేమలో పడిపోకుండా ఎప్పుడెప్పుడు ఎదుగుతామా, అని ఆశగా ఎదురు చూశారు. మీ ఇంట్లో, నా పట్ల నిరసన. నా పేదరికం పట్ల, నా కులం, మతం పట్ల నిరాసక్తత, నిర్లిప్తత. అయినా బంగారం! ప్రేమించడానికి ఎవరి అనుమతన్నా తీసుకొని నేను ప్రేమించానా చెప్పు..అప్పుడు ఒప్పుకోలేదని బాధ పడ్డానికి. నిజాయితీ గల ప్రేమ తప్పకుండా ఎదుటి గుండెను తడుతుందనే నమ్మకంతోనే బ్రతికాను.

నిన్ను మెప్పించడానికి, నీ మనసుకు నచ్చడానికి — మార్కుల సంస్కృతిని అసహ్యించుకునే నేను, వరసగా రెండేళ్ళు ర్యాంకులే తెచ్చుకున్నాను. క్యాంపస్ ఇంటర్వ్యూలో బెస్ట్ జాబ్ కొట్టేశాను. నీ దగ్గరకొచ్చి వెళ్తున్నానని చెప్పిన రోజు, తలొంచుకొని ఓ మాటన్నావ్ — 'నా బలం, నా బలహీనత నా కుటుంబం. వాళ్ళని కష్టపెట్టి నేనేదీ చేయలే'నని. నిజం చెప్పనా అప్పుడు కూడా నాకు కోపం రాలేదు, పైగా ఇంకెంతో నచ్చేశావ్. అయినా ప్రేమంటే బలవంతంగా తీసుకునేది కాదుగా, నీ ఆనందమే నా ఆనందంగా, భారంగానైనా బ్రతుకుతెరువు కోసం వెళ్ళాను – నా వాళ్ళని తలుచుకుంటూ, నీ మనసు తెలుసుకుంటూ.

నిజంగా నిజాయితీగా చెపుతున్నా స్వీటీ... ఎంతగా దేవుణ్ని వేడుకున్నానో తెల్సా! నన్ను కాదన్నా ఫర్వాలేదు తనకు నా కన్నా ఎక్కువగా ప్రేమించేవాడు దొరకాలని. అయినా పిచ్చికాకపోతే ప్రేమ దొరకకపోతే చచ్చిపోవాలా? .. మనని కన్న తల్లిదండ్రుల మాటేమిటి ! తిరిగి ప్రేమించకపోతే చంపెయ్యాలా?... ఏ రాతియుగంలో ఉన్నాం మనం ...

ఆర్నెల్లు తిరిగిందో లేదో, అమ్మ ఏడుస్తూ ఫోన్ చేసింది — 'చైతూ! ఘోరం జరిగిపోయిందిరా..ఒక్కసారి టీవీ పెట్టు' అని. చూద్దును కదా..కుప్ప కూలిపోయాను. ఓ ప్రేమోన్మాది నీ పైన యాసిడ్ దాడి చేశాడని, నీ పరిస్థితి విషమంగా ఉందనీ. ఢిల్లీ నుండి ఎలా వచ్చానో, ఎందుకొచ్చానో తెలియదు. హాస్పిటల్ ముందు ఎదురు చూస్తున్న అమ్మ, నాన్నతో కలిసి నీ కుటుంబాన్ని కలుసుకున్నాను. నిశ్చేష్టులై, బొమ్మల్లా కూలబడ్డ వాళ్ళని చూశాక అర్థమైంది నేను చెయ్యాల్సిందేమిటో. కష్టాల్లోనే మనిషి అసలు నైజం తెలుస్తుందంటారు. గుండెను రాయి చేసుకొని మిత్రులందరినీ పోగేసి పోరాటం మొదలెట్టాను . నా మగ జాతి మీద నాకే అసహ్యం కలిగేలా అనిపించింది నిన్ను ఆ స్థితిలో చూస్తుంటే.

కన్నలూ! డాక్టర్ గారొచ్చి, 'ఎవరన్నా లోపలికొస్తారా' అని అడుగుతుంటే ఎవరికీ ధైర్యం చాల్లేదు. కానీ, నేను మాత్రం లేచాను. మా అమ్మ నా భుజం పట్టుకుంది, ఏడుస్తూ. 'చూడగలవా' అంది చూపుల్తోనే. మీ నాన్న గారు మౌనంగా నా దగ్గరకొచ్చి నిలబడ్డారు. ఆయన చేతిలో చెయ్యేశాను. నా చేతిని గట్టిగా పట్టుకున్నారు. అంతే, ఆ తర్వాత ప్రతి రోజూ రెండు కుటుంబాలూ ఒకే కుటుంబంగా మసిలాం.

నీ గొంతు లోంచి భయంకరమైన మూల్గులు. పొట్టు పొట్టుగా రాలిపడే చర్మపు పొలుసులు, నీ ముఖాన్ని చూసుకోలేక ఎన్ని అద్దాలు పగులగొట్టావో, ఎన్ని సార్లు 'చంపేయ్'మంటూ ఈ బాధలు భరించలేనంటూ ఏడ్చావో...

ఒక్క మాట చెప్పనా, నిజంగా నాక్కూడా తెలీదు – నాలో అంత నిబ్బరం, సహనం, తట్టుకొని నిలబడగలిగిన ధైర్యం ఉంటుందని. గుడ్డిగా నమ్మేశాను బంగారం. నీకొక భరించలేని కష్టం వచ్చింది. నీతో నేనుండాలి. మళ్ళీ నిన్ను పూర్వపు 'ప్రతిమ' లా, ధైర్యంగా చూడాలి. అంతే.

ఆర్నెల్లకి కాస్త కోలుకున్నావ్. చుట్టూ మనుషులు కానీ, ఫ్రెండ్లీ పోలీస్ సపోర్ట్ గానీ, మన స్టూడెంట్స్ ఇచ్చిన సహానుభూతి గానీ మరువలేనివి. ఇలా, రెండేళ్ళకి నువ్వు మళ్ళీ మా మనిషివయ్యావ్. నడిచొచ్చే చామంతుల తోటలా, కనకాంబరాల పాటలా, బంతిపూల పడవలా నువ్వు, వాడిపోయిన నా ప్రేమకి వసంతాల చిగురులు వేయించావ్. కొత్తగా నన్ను నేను చూసుకునేలా చేశావ్. కుటుంబ ఆసరాతో ఆత్మన్యూనతలోంచి ఆత్మ విశ్వాసానివై ఎగిరావ్. ఎక్కడ ఓడావని కొందరనుకున్నారో, అక్కడే గెలిచావ్. నిన్న నువ్వు ఫ్యాషన్ పెరేడ్ లో క్యాట్ వాక్ చేస్తూ ధైర్యంగా తలెత్తుకొని నడిచొస్తుంటే, పిచ్చోడిలా అందర్లా చప్పట్లు కొట్టకుండా, రెండు చేతుల్లో మొహం దాచుకొని వెక్కెక్కి ఏడ్చానెందుకో ! ఎన్ని సంవత్సరాల హృదయ వేదనో అది ! ప్రపంచాన్ని నీ ద్వారా నేను గెలిచానన్న సంబరం.

మై డియర్ స్వీట్ హార్ట్ ! పరమ పవిత్రమైన 'ప్రేమ' పేరు చెప్తేనే పెద్దవాళ్ళు ఎందుకు ఉలిక్కి పడతారో ఈ రెండేళ్ళలో నేను గమనించాను.

పరీక్ష హాల్లో నరికేయడాలు, నడి రోడ్డు మీద చంపేయడాలూ, షాపింగ్ మాళ్ళలో యాసిడ్ బాటిళ్ళు విసిరేయడాలూ, బలవంతంగా ఎత్తుకెళ్లి సామూహిక అత్యాచారాలు చెయ్యడాలూ, ఇవన్నీ చూస్తుంటే నా కర్థమైంది ఆడపిల్లని కన్న తల్లిదండ్రులు అంతలా జాగ్రత్త పడ్డం అవసరమే అని. ఆడపిల్ల మనింట్లో రోజూ పూసే నిత్యమల్లి. అపురూపంగా అరచేతుల్లో పెట్టుకొని కాపాడుకుంటాము. అలాంటిది ఇంత అరాచకంగా, ఇంత పైశాచికంగా, క్రూరంగా తనకు దక్కనందుకు ప్రతీకారంగా మనిషన్నవాడెవడైనా చేస్తాడా? అసలు ప్రేమంటే తీసుకోవడం కాదు, ఇస్తూ పోవడమే. పొసెసివ్ నెస్ ని ప్రేమనుకోవడం భ్రమ.

అదే తమ కుటుంబం లోని వాళ్ళకి జరిగితే ఇలాంటి ప్రేమోన్మాదులు భరించ గలుగుతారా... అందరిలా వాళ్ళకీ అక్క, చెల్లి వుంటారుగా. నావన్నీ ప్రశ్నలే, కానీ, నీ సహనం, క్షమాగుణం నాకెన్నో సమాధానాలు చూపించింది. అతడి తాలూకూ కుటుంబం అంతా వచ్చి తలొంచుకొని నీ కాళ్ళ వద్ద నిలబడ్డ క్షణాన, అంత దుఃఖంలోనూ నువ్వు 'పిల్లల్ని కనగలరు గానీ, గుణాల్ని కాదుగా' అంటూ, క్షమించి వదిలేశావ్ చూడూ...అప్పుడు నిజంగా ఒక అసురుడు చచ్చాడనిపించింది. కన్నీటి చారికలు కార్చే కొవ్వొత్తి కాదు ప్రేమ – నిజాయితీ కలవారికి కర్పూర కళిక, మోసగించేవారికి కలకత్తా కాళిక నాలుక కావాలి, అన్పించింది

కానీ బంగారూ! అప్పుడప్పుడూ బేలగా నువ్వంటావ్, 'బైటికెళ్తే ముఖం తిప్పేసుకుంటున్నారు కొందరు' అని. వందల మాటల తూటాలు నిన్నేంచేస్తాయిరా, బుల్లెట్ ప్రూఫ్ లాంటి నా యెదలో నీ ముఖం దాచుకున్నాక. అయినా నా కళ్ళతో చూడు నువ్వెంత అందంగా కన్పిస్తావో! ఒకవేళ మన పెళ్లయ్యాక నాకలా జరిగుంటే, నన్నొదిలేసి నువ్వెళ్ళి పోయేదానివా చెప్పు. అయినా కొందరుంటారు, స్వేచ్ఛా విపణిలో దుఃఖం ధరని దిగజార్చడానికి.

ఏయ్ బంగారం! నీకో రహస్యం చెప్పనా, దేవతలు అమృతం తాగారు కాబట్టి నిత్య యవ్వనులుగా నిలబడిపోయారని చెప్పుకుంటారు , కానీ అది నిజం కాదు సుమా, ప్రేమ తాగుతూ ఉన్నారు కాబట్టే వాళ్లెప్పుడూ అంత ఆనందంగా ఉండగలుగుతున్నారు. నేనొక నిరంతర ప్రేమ తపస్విని. జన్మాంతరాలుగా నీకోసం తపస్సు చేస్తూనే ఉన్నాను. ఈసారి నేను ఐ లవ్ యూ చెప్పినప్పుడు, నేల చూపులు చూడకు. నా కళ్లలోకి చూడు. నా గుండెలో నీ గుడి కన్పిస్తుంది. ఆ గుడి గంటల ప్రతిధ్వని నీ గుండెలో విన్పిస్తుంది.

కన్నలూ! జాలి తో నన్ను చేసుకుందామనుకుంటున్నావా అన్నావ్ . సానుభూతి కావలసింది సమాజానికి ..మనకి కాదు . రేపటి మా తరం మీ పొత్తిళ్లలోనే ఆదుకోవాలి .. లాలిత్యమైన మిమ్మల్ని , పవిత్రమైన ఆడతనాన్ని



తలమీద పెట్టుకోవాలి కానీ కాలి కింద వేసి నాశనం చెయ్యాలనుకోకూడదు అని ఎపుడు నేర్చుకుంటారో. నీకు తెలుసా మన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారేమన్నారో – "అయాం వెరీ హేండ్ సమ్, ఐ కెన్ గివ్ మై హేండ్ టు సమ్ నీడెడ్ పర్సన్"అని. హేండ్ సమ్ కి అసలైన అర్థం అందం కాదు, మన హేండ్ ని అంటే చేయూతని అవసరంలో ఉన్నవారికి అందించడమే కదా!

బంగారూ! నేనొచ్చేస్తున్నా. అనుమానాల గాలి వీచనివ్వకు. అపార్థాల వాన కురవనివ్వకు, జీవితం గుడిలో దీపతోరణాలు కట్టుకుదాం. ఆశల మతాబులు పేర్చుకుందాం. నా ఆజన్మాంత సహచరివి నువ్వు. నా ఆకాశం నువ్వు. ఆఖరికి మా అమ్మవూ నువ్వే. నేనంటూ లేని అస్తిత్వాన్ని ఇచ్చే నీ సమక్షాన్ని కోరుతుంది మనస్సు. నేనే నువ్వయ్యే తీపి క్షణాలు రావాలని వేడుతుంది వయస్సు. నాతో నువ్వు ఏడడుగులు నడుస్తానని అన్నందుకేనేమో ఏడేడు జన్మలుగా నీకోసం నిరీక్షిస్తూనే ఉన్నాను. ఆశను మూస పోసే నీ ప్రేమ కొలిమి ముందు నేను ఉత్త ప్రేమికుడిని కాదు, నిత్య ప్రేమికుడిని. ఈ మాఘ మాసంలోనే మన పెళ్లి. సిద్ధంగా ఉండు మరి.

..... నీ

నిత్య స్వాప్నికుడు..

– చైతూ

# డియర్ సోల్జర్

Dear సోల్జర్!

ఈ ఉత్తరం మిమ్మల్ని చేరే క్షణాన .. మీరంతా నిలువెత్తు దుఃఖంలో మునిగి ఉంటారని తెలుసు .. అయినా విధి నిర్వహణలో సరిహద్దు కంచె దగ్గర కళ్ళనే కెమేరాగా చేసి పహారా కాస్తూనో .. థార్ ఎడారి మండు టెండల్లో భగభగ మండే బుల్లెట్ వర్షానివై మెరుస్తూనో .. కశ్మీర్ మంచు కొండల్లో ఎంతో మంది దేహాల్ని పేల్చే పిరికి తీవ్రవాదుల ముందు గుండె నిలిపో .. తూరుపు చిట్టడవుల్లో ఎక్కుపెట్టిన విల్లుల్లా సంచరిస్తూనో ఉంటారని తెలుసు.. ఏది ఏమైనా నా దేశానికి ఉదయం కాపలా కాసే సూర్యుడివి నువ్వే..రాత్రికి పహారా కాసే చంద్రుడివీ నువ్వే..అన్నిటికన్నా మిన్నగా 130 కోట్ల జనాల అంతరంగ అభిమాన మూర్తివీ నువ్వే. ఎలా ఉన్నా... ఎక్కడున్నా..కాస్త సమయం తీసుకుని నా ఉత్తరం చదువుతావు కదూ..!

డియర్ సోల్జర్ ... పుల్వామా ఘటన చూసి ఎర్రబడింది మంచు కొండలు మాత్రమే కాదు .. కోట్లమంది జన నేత్రాలు కూడా. దేశం చుట్టూ అల్లుకున్న రక్షణ హస్తాలు మీవి. దేశాన్ని నిరంతరం కాపాడుతున్న నిఘా నేత్రాలు మీవి. చురుకైన కళ్ళు, కఠిన శిక్షణతో రాటుతేలిన ఒళ్ళు, ఆత్మ స్థైర్యంతో కూడిన నడక, ఆత్మీయ పలకరింపులతో మీరు కవాతు చేస్తుంటే పొంగేది ఎర్రకోట మాత్రమే కాదు మన దేశపు జనాభా గుండెలు కూడా!

సరిహద్దుల్ని కాపలా కాయటమే కాదు, ప్రకృతి విపత్తు లొచ్చినప్పుడు పరుగెత్తి కొచ్చి ఆదుకొనేది, వరదల్లో కొట్టుకు పోతున్న వాళ్ళని ఒడ్డుకు చేర్చేదీ, భూకంపాల్లో కూరుకుపోతున్న వాళ్లని బయటకు తీసేదీ, భారీ అగ్ని ప్రమాదాల్లో ఆపన్నులకు అండగా నిలిచిందీ మీరే...విలయాన్ని, విషాదాన్ని దాటుకుంటూ దేశ జెండాలా నిలబడి ఆత్మ విశ్వాసాన్ని నలుదిక్కులా పరిచేదీ మీరే..దేవుడు మొక్కితేనే వచ్చి కాపాడతాడు. కానీ సోల్జర్ గా మీరు దేశానికి ఏ కష్టం వచ్చినా వెన్నంటే ఉంటారు. వెన్నుతట్టి ధైర్యం చెప్పి నిలబెట్టి వెళతారు.

అమృతం కురిసిన రాత్రి లో తిలక్ సైనికుడి ఉత్తరం చదివి ఎన్ని రాత్రులు ఏడ్చానో..అమెరికా సివిల్ వార్ లో అయిదుగురు బిడ్డల్ని పోగొట్టుకున్న తల్లి కి అప్పటి అమెరికా ప్రెసిడెంట్ అబ్రహాం లింకన్ ఆర్ద్రంగా ఉత్తరం రాశాడు అని తెలిసి అంతే హృద్యంగా స్పందించా..మీకు నేను ఎన్ని ఆరాధనా పూర్వక ఉత్తరాలు రాసానో తెలుసా!

కార్గిల్ వార్ లో అమరుడైన కెప్టెన్ విక్రమ్ బాత్రా చెప్పిన ఆఖరి మాటలు నాకు ఇప్పటికీ చెవుల్లో మార్మోగుతున్నాయి.. 'నేను తిరిగి వస్తాను..మన త్రివర్ణ పతాకాన్ని కార్గిల్ పై ఎగరేసిన తర్వాతైనా..లేదా ఆ త్రివర్ణ పతాకాన్ని నా దేహం చుట్టూ చుట్టుకొని శవంగానైనా..కానీ కచ్చితంగా విజయం తోనే తిరిగొస్తాను' .. ఎంత ధైర్యం కావాలి ఇలా మాట్లాడటానికి..? అంతేనా 19 ఏళ్ల వయసులో దేహంలోకి బుల్లెట్లు దూరి తూట్లు పొడిచినా లెక్క చేయక

కార్గిల్ వార్ లో కార్గిల్ శిఖరం ఎక్కి తోటి సైనికులకు దారి చూపిన సుబేదార్ యోగేంద్ర సింగ్ యాదవ్ వీరోచిత మరణాన్ని ఎవరు మాత్రం మర్చిపోతారు?

1971 ఇండో–పాక్ యుద్ధం లో మేజర్ జనరల్ ఇయాన్ కర్డొజ్ (Ian Cardozo) గురించి ఎన్నో వార్తలు చెప్పేవారు. మందుపాతర పేలి కాలు తీవ్రంగా గాయపడితే తనకు తానుగా ఆ కాలుని కత్తిరించుకుని యుద్ధంలో తిరిగి దూకాడని..దేశం ముక్కలు కాకుండా ఉండటానికి తాను ఎన్ని ముక్కలైనా ఫర్వాలేదని చెప్పారని అప్పటి యుద్ధ సైనికులు చెప్పేవారట..వీరి స్థైర్యం ఎంత గొప్పది.. కార్గిల్ లో అమరుడైన వీర జవాన్ తల్లి ఉద్వేగం తో ఓ మాట చెప్పింది .. 'నేను ప్రతి సంవత్సరం కార్గిల్ యాత్రకి వెళ్తాను, అక్కడికి నాలాంటి, బిడ్డని పోగుట్టుకున్న తల్లులెందరో వస్తారు. మా బిడ్డలు మాకు అక్కడ కనిపిస్తారు' అని.

మీకు మరో ఘటన గుర్తు చేయనా.. బ్రిగేడియర్ మొహమ్మద్ ఉస్మాన్ ..ఆ పేరు చెప్పగానే మీ కళ్ళల్లో ఆనందం నాకు తెలుస్తుంది..భారత్ పాకిస్తాన్ విభజన సమయంలో తన మాతృదేశం భారతదేశాన్ని వదిలి రానని, తన జీవితం దేశానికి అంకితమని చెప్పి అవివాహితుడి గానే ఆఖరి శ్వాస వరకూ జీవించిన ఆ పుణ్య పురుషుడి గొప్ప గుణాన్ని ఎన్ని రీతుల్లో చెప్పుకుందాం.. పుల్వామా దాడిలో ఎంతమంది జవానుల గుండెలు ఎగిరెగిరి పడ్డాయో ..ఎన్నెన్ని కుటుంబాల ఆశలు ఆర్తనాదాలు చేశాయో.. ఎంత దుఃఖం, ఎంత వేదన, ఎంత గుండె కోత .... ఇది వ్యక్తి గతం కాదు ..వ్యవస్థా గతం.

శాంతిని వల్లె వేస్తున్న రక్షక దూతల్ని రాక్షసంగా వెన్ను పోటు పొడవమని ఏ మతం నేర్పింది? మతం అభిమతం అందరి హితం కావాలి గానీ మనిషిని చంపే ఉన్మాదం కాకూడదు కదా! .. ఇలా రాసుకుంటూ పోతే ఈ ఉత్తరం చాలదు..ఈ సమయమూ సరిపోదు..మీ త్యాగం..మీ బలిదానం...మీ దేశభక్తి.. దేశ ప్రజల పట్ల మీకున్న అనురక్తి ఈ దేశం ఎప్పుడూ మర్చిపోదు.

కందకాల్లో, ముళ్ల చెట్లల్లో, హిమాలయ పర్వత శిఖరాలలో, ఎడారుల్లో, అడవుల్లో, లోయల్లో, మీ ఊపిరే మిమ్మల్ని భయపెట్టే సమయాల్లో గుండెల నిండా దేశభక్తిని నింపుకొని మృత్యువు ఛాయలో సైతం నిర్భయంగా మీరు కాసే పహారా వల్లే కదా మేము ఇక్కడ ఇంత నిశ్చింతగా బతకగలుగుతున్నది.. బానిస బతుకులు ఎంత హీనమో గుర్తు ఎరిగాక స్వేచ్ఛను గుండెల నిండా అనుభవిస్తున్నాం కదా. దేశం సగర్వంగా తలెత్తుకుని ఉండాలనే అందరం కోరుకుంటాం.. ఆ బాధ్యతను సమర్ధవంతంగా మోస్తూ దేశం ప్రశాంతంగా ఉండేలా చేసే మీ వృత్తి ధర్మాన్ని, ప్రవృత్తి గుణాన్ని ఎలా విస్మరించగలం? అందుకు ప్రతిఫలంగా మిమ్మల్ని గాయపర్చిన ఈ విద్రోహ దాడిని ప్రపంచం యావత్తు అసహ్యించు కుంటోంది .. దీనికి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరిస్తోంది.

పేరు తెలియదు. ఊరు తెలియదు..జాతి–మతం తెలియదు..అందరిదీ ఒకే బ్రాండింగ్ ..soljarism.. సోల్జర్ అని పలుకు తుంటే చెయ్యి చేసే సెల్యూట్ కంటే ముందు మనసు సాగిలపడి పాదాభివందనం చేస్తుంది. నా సోల్జర్ సోదరా ! మీ ఔన్నత్యం మీ పట్ల ఎంత గౌరవ భావాన్ని పెంచుతుందో, మీ కుటుంబాన్ని తలుచుకున్నప్పుడల్లా అంత కంటే ఎక్కువ ఆరాధనా భావం కలుగుతుంది. బంధాన్ని,అనుబంధాల్ని వదిలేసి మరో మహోన్నత బంధానికి కట్టుబడి యాత్ర చేస్తున్నారు మీరు. మాతృదేశానికి నిత్య సేవ చేస్తున్నారు మీరు.

అమ్మానాన్నల దీవెనల చేతులు ఉండాల్సిన తలమీద ఇనుప టోపీతో, చిన్నారి బిడ్డల లేత ముద్దుల ముద్రలుండాల్సిన ముఖం మీద నల్లటి చారికలతో, భార్య చేతిలో ఉండాల్సిన మీ చెయ్యి ట్రిగ్గర్ మీద – ఇలా గుండె లోతుల్లో ఎంత అంతర్ యుద్ధాన్ని అనుభవిస్తారో, మీ జ్ఞాపకాల పుటల్లో ఎన్ని దిగుళ్ళ నెగళ్లను చవిచూస్తుంటారో, మీ ఆలోచనల ప్రవాహంలో ఎన్ని బెంగల కన్నీళ్లను దిగమింగుకుంటారో కదా ! మనసును శిలగా మార్చి, కంటి రెటీనా వెనుక అశ్రువులను గడ్డ కట్టించి, పెదాల మాటున రక్త బంధాన్ని, పాదాల దిగువన స్నేహ సుగంధాన్ని మాయం చేసి –

ఒక లక్ష్యం తో, ఒక్క నినాదం తో, ఒకే ఒక్క గమనం తో దూసుకెళుతున్న మీరు – పిట్ట కన్నును మాత్రమే చూస్తున్న ఆధునిక అర్జునులు కదా అనిపిస్తుంది. రాగ ద్వేషాలకన్నా దేశ భక్తిలోనే ఆత్మానందాన్ని వెతుక్కుంటున్న ఆధునిక భీష్ములు కదా అనిపిస్తుంది.

అయ్యో పుల్వామా, ఎంత పని చేశావు – ఇంటి దగ్గర ఇంకా చూడని ఆరు నెల్ల పాప తండ్రి ఒకరు, పండు వయసులో కళ్ళలో ప్రాణాలు నిలుపుకొని నిరంతరం ఎదురు చూసే తల్లి కన్న కడుపున పుట్టిన కొడుకు ఒకరు, కట్టిన తాళికి దిష్టి తగల కుండా గుండెల్లో దాచుకుంటూ నుదుటి బొట్టులో రోజూ చూసుకుంటూ నిద్రలో పలవరించే భార్య ఉన్న భర్త ఒకరు, రక్త బంధాన్ని దేశానికి ధారాదత్తం చేసి కుటుంబ బాధ్యతలను చూసుకునే తోబుట్టువుల్ని పొందిన అన్న ఒకరు – వీళ్ళందరి త్యాగాల ఫలమే కదా ఒక్క మన దేశం. దేశాన్ని రక్షించటానికి నా బిడ్డడు వెళ్ళాడు అంటూ రచ్చ బండ సాక్షిగా రాజసం తో పొంగిపోయి మిమ్మల్ని కన్న ఊర్లు ఎంతగా గర్వ పడతాయో తెల్సా సోల్జర్..!

నా ఫ్రెండ్ ఓ మాట చెప్పాడు... దేశభక్తి నిస్సందేహంగా మందగిస్తుంది..దేశద్రోహం నిర్లజ్జగా ఎదుగుతుంది.. అంతులేని అవినీతి అంతటా వ్యాపిస్తుంది..అంతు పట్టని అభద్రతా రోగం అందరినీ వేధిస్తుంది – అని. ఎన్ని పార్శ్వాల్లో అవినీతి, అన్యాయం తొంగి చూసినా, దేశద్రోహులు ఎన్ని రూపాలు మార్చినా, ఎన్ని దారుల్లో తెగబడ్డా మిమ్మల్ని ఏమార్చ గలుగుతారా. అప్పుడెప్పుడో ఓ పెద్ద మనిషి చెప్పాడట..'భారతదేశ సిపాయిలని ఇవ్వండి, ప్రపంచాన్ని జయించి చూపిస్తాను' అని – ఎంత గొప్ప ప్రశంసో కదా సోల్జర్!

మసీదుల్లో చొరబడ్డ ముష్కరుల్ని అంతమొందించడానికి.. శరపరం పరగా వస్తున్న బుల్లెట్ల వర్షాన్ని తప్పించుకుంటూ మీరు తెగువతో ముందుకురుకుతున్నప్పుడు, మందిరాల్లోకి దూసుకొచ్చిన తీవ్రవాదుల్ని అడ్డుకోటానికి మీ వంటినే కవచంగా మార్చి అడ్డుగోడగా మీరు నిలబడ్డప్పుడు, భూమికీ ఆకాశానికీ మధ్యన మంచు శిఖరాలలో తోడేళ్ళ మాదిరి తెగపడి మీ సహచరులను పట్టుకెళ్ళి మర్మాంగాలను కోసి మిమ్మల్ని బలహీన పర్చాలని కుతంత్రం చేస్తుంటే..సంయమనంతో పక్కా ప్రణాళికతో, ఎదురు దాడి చేసి, విజయాన్ని ధరించి, చిరునవ్వుతో మీరు వస్తుంటే దేశ దేహం ఉప్పొంగింది... జనావళికి ముందుగానే దీపావళి వచ్చింది.

ప్రతీ క్షణం..ప్రతీ సందర్భం మా రోమాలు నిక్కపొడుచుకొనేలా ఎన్నో వీరోచిత గాథలలో మీరంతా మా నోళ్లలో నానుతూ..మా ఇంట్లో చందమామ పాటలా మార్మోగుతూ ఉంటారు. అందరికీ అమ్మానాన్న.. అన్నదమ్ములు.. భార్య బిడ్డలు – ఇలా ఓ కుటుంబం. కానీ, దేశమే కుటుంబం గా భావించి ఆ రక్షణ వ్యవస్థను ఏర్పరుచుకొని నిబద్ధంగా ఉన్నందుకేమో.. ప్రతి గడపా మీకోసం ఎదురు చూస్తుంది, ప్రతి ఇల్లూ మీ పేరును జపిస్తుంది.

సోల్జర్ ..ఒకసారి నేను ఉత్తర భారతం వైపు వెళ్ళాను..అక్కడ రైల్వే స్టేషన్ లో మీ డ్రస్ కనిపిస్తే చాలు అది దేశ అడ్రస్ గా భావిస్తూ ఒకటే దండాలు..పాదాభివందనాలు.. ఒక కదిలించే సంగతి చెప్పనా – అక్షరధామ్ ఘటనలో మీరు విధులు నిర్వహిస్తున్నప్పుడు ఒక నిండు గర్భిణి, అప్పుడే పుట్టిన తన బాబుని అక్కున చేర్చుకొని తన భర్తను వెతుకుతూ మందిర పరిసరాలకు వచ్చిందట.. రెండు చేతుల్లో అతన్ని ఎత్తుకొని మీరొచ్చినపుడు, చనిపోయాడు అనుకున్న భర్తని మళ్లీ చూసిన ఆనందంలో తన బాబుకి మీ పేరే పెట్టిందిటా..అది విన్నప్పుడు అనిపించింది జన్మంటే ఇది కదరా అని .

130 కోట్ల ప్రజల మాన ప్రాణాలు మీ చేతుల్లో ఉన్నాయన్న భావన మీకెంత ఆనందాన్ని..బాధ్యతని పంచుతుందో మిమ్మల్ని చూస్తే తెలుస్తుంది.. గగన తలంలో Air Force.. జలంలో Navy.. భూ భాగంలో Army మూడు కళ్లుగా ఈ దేశం భావిస్తుంది..అయితే సోల్జర్ ...విధి నిర్వహణలో పడి కళ్ల నిండుగా మీ కుటుంబాన్ని చూసి ఎన్ని దినాలైందో. బంకర్లలో మాగన్నుగా నిద్ర పడుతున్న సందర్భంలో, ఉలిక్కి పడి లేచి, నా పాప ఏడుపు వినిపించింది అంటూ దిక్కులు చూస్తే కనిపించేది చిమ్మ చీకటే కదా.. మాట్లాడాలని ఉన్నా సాటి మనిషి కూడా కానరాని స్థితి.. ఏ మెత్తటి మట్టి

కనిపించినా మా అమ్మ స్పర్శంత మెత్తగా ఉందంటూ నుదుటిన పెట్టుకుని ఆనందించే మీకు.. కర్ర పోటుతో ఏ వృద్ధుడు కనిపించినా భుజం సాయం చేసి తాతా అంటూ పాదాలు తాకే మీకు..ఏ పూల పరిమళమో సోకినప్పుడు కళ్ళనిండా నీళ్లతో భార్య గుర్తొచ్చినప్పుడు.. కళ్ల తడి గుండెల్లోకి రాకుండా దేశ జెండా వంక చూసి నమస్కారం చేసే మీ సంస్కారం చూసినప్పుడల్లా మేము ఎంత గర్వపడతామో తెలుసా..

పుల్వామా అమర సిపాయిల్లారా! మీరు మాకు హీరోలు..మీరు వీరులు..ధీరులు. మీరే ధైర్యం, మా స్థైర్యమూ మీరే. మా బలం మీరే, మా బలగం మీరే, మా భవితా మీరే. భిన్నత్వం లో ఏకత్వం చూసిన దేశ ప్రజగా చెపుతున్నా.. శాంతిని స్థాపించే యుద్ధం లో మీ మరణం ఆఖరి వాక్యం కాదు..మీ త్యాగం చివరి చరణం కాదు. అలాగే మాతృ భూమి రక్షణలో మీ వీరత్వం విజయ సంకేతం . మీ ధీరత్వం ఆత్మ విశ్వాస కేతనం . మీ పట్టుదల, నిబద్ధత మాకు నిత్య స్ఫూర్తి... మీ నిస్వార్థం, నిజాయితీ మాకు నిరంతర దీప్తి.

అందుకే మన దేశ ప్రజల కళ్ళల్లో మీరుంటారు.. దేశం గుండెల్లో మీరుంటారు.. మా తొలి వేకువ ప్రార్థనల్లో మీరుంటారు. అమరుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ...

Dear సోల్జర్
Long live your spirit

ఇట్లు,
– భారతదేశం

# వినియోగ చైతన్యం

రామా!

నిన్న నువ్వు ఇంటికొచ్చిందగ్గర్నుంచీ మీ చెల్లెలి పోరు పడలేకపోతున్నానురా. 'చూశారా మా అన్నయ్య గారు రజతోత్సవ వివాహ వేడుకకి మా వదెనకి సర్ ప్రైజ్ గా చీర కొనివ్వాలనుకున్నారు. మీరూ వున్నారు, ఎందుకూ'అంటూ ఒకటే షంటింగ్ అనుకో. అయినా రామా ! ఎంతో గొప్ప సాహసం చేసావ్. ఆడవాళ్ళకు, అందునా భార్యకు చీర కొనేంత దమ్మున్న భర్తలున్నారా ఈ ప్రపంచంలో...అమ్మో..కలర్ నచ్చితే ప్యాటర్న్ నచ్చదంటారు, అదీ నచ్చితే ఇంత ధరనా అంటారు. ఎలారా వీళ్ళను అర్థం చేసుకోవడం?

నన్నూ మీ చెల్లెలు వెంటబెట్టుకొనే వెళ్తుంది షాపింగ్ కి , తనేమో చీరలు చూస్తుంటే నేనేమో వాటిమీద ఉన్న ధరలు చూస్తుంటాను. చివరికి షాపులో ఉన్న చీరలన్నీ టేబుల్ మీదికొచ్చాక, సగం చీరలు కట్టుకొని చూసాక, ఓ నాలుగు చీరలు నాకు చూపిస్తుంది. నేను 'ఇది' అనే చెప్పేలోగా ప్యాక్ చేయిస్తుంది 'ఒక్కటి'. ఇంత దానికి నాకింత దండన ఎందుకే అంటే, పక్కింటి రూప వాళ్ళాయన్ని ఇలాగే తీసుకెళ్లి చీర కొనిపిచ్చుకొంటుంది. మరి మీరు కూడా నాతో వచ్చి కొనకపోతే చిన్నతనం కాదా అంటుంది.

అయినా, ఆలి కొన్నది కోక – అంతరిక్షపు నౌక అంతకన్నా చౌక, అన్న ఆరుద్ర గారి కూనలమ్మ పదాలు గురుతు లేదంటరా అంత సాహసం చేశావు. అయినా చీర కొనే ముందు చూసుకోవద్దా.. వాళ్లకేం వ్యాపారులు, మోసాన్ని యుక్తిగా చేస్తారు, నీతి కలిగిన వాణిజ్య వ్యాపారాలు చేసే రోజులా ఇవి? వినియోగదారుడే రాజు అంటారు గానీ, పెద్ద అందమైన కుచ్చు టోపీ పెట్టేది మనకేరా.. పైగా బోలెడంత క్యూ ఉందని రసీదు కూడా తీసుకోకుండా బిల్ కట్టేసి వచ్చానంటావ్.

రామా! జగమంతా వస్తుమయం–బ్రతుకంతా క్రియామయం. చెల్లించే ప్రతి పైసాకూ ప్రయోజనముండాలి. చేసే ఒక్కో కొనుగోలుకు సరైన బిల్లుండాలి. వస్తువులో లోపం ఉన్నా, సేవల్లో తేడా జరిగినా బిల్లే మన ముఖ్య ఆయుధమని గమనించాలి. టాక్స్ పడ్తుందనో, టైం పడుతుందనో మనల్ని ఏమార్చారంటేనే అదేదో మోసపూరిత విషయమని గుర్తుంచుకోవాలి. కొద్ది మొత్తం పన్ను భారాన్ని కాదనుకుంటే వేల రూపాయల నష్టాన్ని భరించాల్సి వస్తుంది. వాళ్ళ బేరాలు మనకు భారాలు కాకూడదన్నది చూసుకోవాలి.

పాపంరా, రైతులు ఎంతో ఆశపడి విత్తనాల కోసం, ఎరువుల కోసం వెళ్తారు. వాళ్ళ నమ్మకాన్ని ఆసరా చేసుకొని కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులు ఇస్తారు. ఆరు కాలాలు కష్టపడ్డా ఫలితం లేక నిర్వేదంలో కూరుకుపోతున్నారు రైతులు. అన్నదాతలకే ఇంత మోసం జరుగుతుంటే, ఇక మనమో లెక్కనా చెప్పు.. క్రితం సంవత్సరం మా బామ్మర్ది ఇల్లు కొన్నప్పుడు ఆ బిల్డర్ GST నుంచి తప్పుకుందామని తక్కువ ధరకు కొన్నట్టుగా చూపించి ఆపై బోర్డ్ తిప్పేసిన దగ్గర

నుండి డబ్బులు లాక్కోలేక, న్యాయం పొందలేక ఎంత ఇబ్బంది పడ్డామో తెల్సా ! ఆశ మంచిదే కానీ అత్యాశ ఉండకూడదురా.

అయినా సగం ధరకి ఇవ్వడానికి వ్యాపారులు మన సోదరులా లేక అత్తింటివారా – ఎవరైనా ఎవరికైనా లాభం చేస్తాడు అంటే వాడు నష్టపోయేలా మాత్రం అస్సలు చేయడన్న విషయం కూడా నీకు స్ఫురణకు రాలేదా? వెలకు తగ్గ విలువ లేని వస్తువును పదిసార్లు చూసుకొని కొనుక్కోవాలి. మోసమెప్పుడూ వేయి వేషాలతో ఎదురు చూస్తుంటుంది. మార్క్సిజం కన్నా మార్కెట్ కే చేతులెక్కువ. వినిమయ విలువల మధ్య మనిషి ఒక లోలకంరా . రాష్ట్రపతి నుండి రాళ్లు కొట్టుకునే కూలీ వరకూ, ప్రధాని మొదలు పేదింటి పిల్ల వరకూ – అందరూ వినియోగదారులే. అందరికీ ఒకటే రక్షణ వ్యవస్థ ఉంటుంది.

వ్యాపారుల కుండే విపరీతపు లాభాల ఆసక్తుల నుండి వినియోగదారుడిని రక్షించడానికి వినియోగదారుల రక్షణ వలయం ఉంది. ఏదన్నా కొను, ఎక్కడన్నా కొను – రసీదే ప్రధానం. రసీదే ప్రమాణం. రసీదే రామబాణం. రసీదు లేకుంటేనే ప్రమాదం. మాటల మీద మనిషి నిలబడేంత నీతి ఈ రోజుల్లో మనుషుల్లో లేదంటే...అదేం అసత్యం కాదు. కాగితాలకీ, కరెన్సీకీ విలువ ఉంది కానీ, మాటకి లేదన్నది చేదు వాస్తవమే అయినా, ఆ నిజాన్ని గౌరవించాలి. అయినా అమ్మకానికీ, నమ్మకానికీ మధ్య నాణ్యతెప్పుడూ నీటిమూటే. అబద్ధాన్ని సైతం అమ్మకం సరుకు చేయడం,మాటల మాయదండంతో మన జేబులు ఖాళీ చెయ్యడం వాళ్ళు నేర్చుకున్న టక్కుటమార విద్యలు. ఆ మాయాజాలంలో మనం పడకూడదని గుర్తుంచుకో.

ఒకవేళ ఆన్ లైన్ లో కొన్నావనుకో ఆ పేమెంట్ ని స్క్రీన్ షాట్ తీసుకోవాలి. మన ఫోన్ కి వచ్చిన మెసేజ్ ని దాచి ఉంచుకోవాలి. తినుబండారాలైనా, కిరాణా సరుకైనా, వాడుకొనే పాత్రలైనా, వేసుకునే దుస్తులైనా, పెట్టుకొనే నగలైనా,వాడాల్సిన మందులైనా సరే తేడాలుంటే మనం నిలదీయగలిగేది బిల్లుంటేనే గదా! అయినా 'కష్టాన్ని... నష్టాన్ని'డబ్బులు పెట్టి మరీ కొనితెచ్చుకోవడమేంట్రా వెర్రి కాకపోతే !

భారతదేశంలో కన్జ్యూమర్ ప్రొటెక్షన్ ఏక్ట్ అమల్లో కొచ్చిన 1986 డిసెంబర్ 24 ని గుర్తు చేసుకుంటూ..మొన్న డిసెంబర్ లో అదే తేదీన కాలనీ అసోసియేషన్ బిల్డింగ్ లో, జిల్లా వినియోగదారుల ఫోరం నుంచి కొందర్ని పిలిపించి సభ ఏర్పాటు చేశారు మా కాలనీ మహిళలు. నీకు మళ్ళీ మళ్ళీ చెప్తున్నానని అనుకోబాకు – మనం ఆఫీసుల్లోనూ, మన ఆడవాళ్లు ఇళ్ల దగ్గరా వేసే చిట్టీలు, చిట్ ఫండ్స్ లాంటి చిన్న చిన్న విషయాలు మొదలు, ఆహారంలో జరిగే కల్తీలు, తూనికలు – కొలతలు, పరిసరాల పరిరక్షణ, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, అసలు మనింటి కేబుల్ కనెక్షన్ లో మన కొచ్చే ఛానళ్ళను ఎంపిక చేసుకోవడంలో కూడా వినియోగదారుల రక్షణ చట్టం మనకు కాపు కాస్తుందని ఆ మీటింగ్ లోనే తెలిసింది నాకు.

గుర్తు పెట్టుకో, అవసరార్థం వస్తువులు కొన్నా, సేవలు పొందినా అందరం వినియోగదారులమే. మనకు అన్యాయం జరిగినా, సేవాలోపం జరిగినా నేరుగా మనం గానీ, వినియోగదారుల స్వచ్ఛంద సంస్థ గానీ, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు గానీ, అనేక మంది వినియోగదారుల పక్షాన ఒక్కరూ గానీ లేదా కొందరు గానీ ఫిర్యాదు చేయొచ్చు. ధన, మాన, ప్రాణాలకు, భద్రతకు ముప్పుతెచ్చే ఏ విషయం గురించైనా, వస్తువు గురించైనా జిల్లా వినియోగదారుల ఫోరంలోనూ, అక్కడ నీకు సంతృప్తి లేకపోతే రాష్ట్ర ఫోరం లోనూ, అక్కడా న్యాయం జరిగినట్టు అనిపించక పోతే జాతీయ ఫోరంలోనూ ఫిర్యాదు చేసుకోవచ్చనే సంగతి ముందుగా తెలుసుకో.

క్రయవిక్రయాలు మానవ జీవన అవసరాలు. తయారీ ధర కంటే, అంటే MRP కంటే ఎక్కువ అమ్మినా మనం కొంటున్నాం. ప్రతి సారీ గీచి గీచి బేరం ఆడుతున్నామా? MRP కంటే తక్కువకే మనకు ఆ వస్తువు రావచ్చన్న సంగతి

నీకు తెలుసా? స్థానిక పన్నులు, రవాణా ఖర్చుల మీద అమ్మకం ధర ఆధారపడి ఉంటుందన్నది నీకు తెల్సా? మనవి పూర్వపు రోజుల మాదిరి వస్తు మార్పిడి పద్ధతి కాదు కదరా... కామన్ ఎక్స్ఛేంజ్ పాలసీతో బతుకుతున్నాం. 'ధనం మూలం ఇదం జగత్ అని నమ్ముతూ 'ధర్మం' మూలం ఇదం జగత్ ని పక్కన పెట్టేసిన స్వార్థపరులం మనం. అయినా సినిమా థియేటర్ కి వెళ్ళి పది రూపాయల పేలాలని పాతిక రూపాయలకి కొంటాం. 15 రూపాయల నీళ్ళ సీసాని 30కి తీసుకుంటాం. అప్పుడు వినియోగదారుడిగా సంధించాల్సిన ప్రశ్న గుర్తు రాదు. నాకెందుకులే అని వెళ్లిపోతాం. నిలదీయకపోతే నిజాలు ఎందరికి తెలుస్తాయిరా. ఎవరో ఒకరు నడుం బిగించకపోతే నిర్ణయాలు ఎవరు అమలు చెయ్యగల్గుతారు చెప్పు. ప్రపంచ వినియోగదారుల హక్కుల రక్షణ దినోత్సవం ఏటా మార్చి 15న జరుపుకుంటాం. కనీసం ఒక్కరోజైనా వినియోగ హక్కుల్ని గురించి తెల్సుకొని అమలు చేస్తామన్న ఆకాంక్ష ప్రభుత్వానిది.

వినియోగదారుడికి పంచ ప్రాణాలనదగ్గ ఐదు హక్కులున్నాయ్. – భద్రత హక్కు, సమాచారం పొందే హక్కు,వస్తువుల ఎంపిక హక్కు, అభిప్రాయం వినిపించే హక్కు, న్యాయ పోరాట హక్కు. విత్తును బట్టే మొక్క మొలుస్తుంది. వినియోగ చైతన్యాన్ని బట్టి చక్కటి సమాజం ఎదుగుతుంది. మనం కనక మనకెందుకులే అని దాటేస్తే ఆ అలసత్వం ప్రాణాంతకమై లక్షల మందిని కాటేస్తుంది. ప్రభుత్వం వచ్చి ప్రతి ఒక్కరి అవసరాలు తీర్చడం సాధ్యం కాదు కాబట్టి, మనం అందరం ఆ బాధ్యతని పంచుకోవాలి. మన కోసం ఉన్న హక్కుల్ని ఉపయోగించుకోవాలి. వినియోగ హక్కులు నిస్తేజపు ఉదాసీనతకి రెక్కలని గుర్తుంచుకోవాలి.

ప్రతి కొనుగోలుకీ బిల్లు తీసుకోవడం ఎంత ముఖ్యమో, సరైన పన్నులు చెల్లించడం కూడా అంతే ముఖ్యం. మనకు ఏ సందేహం వచ్చినా, ఫిర్యాదు చేయవలసొచ్చినా 1967కి ఫోన్ చెయ్యాలి. దీని కోసం లాయర్ ని పెట్టుకోవాలిన అవసరం లేదు, డబ్బుల ఖర్చు కూడా ఉండదు.

మోసపూరిత, ఆకర్షణీయ ప్రకటనల మోజులో పడి, వ్యాపారుల వలలో చిక్కుకోకుండా ఉండేందుకు మన ప్రధానమంత్రి 'కేంద్రీయ వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ'ని ప్రకటించారు. మొన్నటి 2018 డిసెంబర్ 24 నాటి 'జాతీయ వినియోగదారుల దినోత్సవం' నాటి మన నినాదం 'Timely Disposal of Consumer Complaints'. ఎప్పటికప్పుడు వినియోగదారుల ఫిర్యాదుల్ని పరిష్కరించాలని కంకణం కట్టుకున్నాం. అలాగే రేపటి ప్రపంచ వినియోగదారుల హక్కుల రక్షణ దినోత్సవ నినాదం 'Trusted Smart Products'. స్మార్ట్ ఎలక్ట్రానిక్ పరికరాల, ఉపకరణాల విశ్వసనీయతని, నాణ్యతని గురించి జన సామాన్యానికి అవగాహన కలిగించడం అన్నమాట. వినియోగదారుల హక్కులు తెలుసుకుందాం. మార్కెట్ కి మానవీయతని నేర్పుదాం అన్నదే నినాదంగా పెంచాలి.

నిజమే, వ్యాపారులు పెట్టినట్టు మనం కూడా ఏడాదికోరోజు క్లియరెన్స్ సేల్ పెట్టుకుందాం. ఆ రోజున మనం 50% డిస్కౌంట్, ఉచిత వోచర్ లు, గోల్డ్ కాయిన్స్, బహుమానాలు , బై వన్ గెట్ వన్ లు , cashback లు – వంటి వాటి గురించి ఆలోచించకుండా మనలో పేరుకుపోయిన ఓల్డ్ స్టాక్ ని క్లియర్ చేసుకుందాం. అవసరం ఉన్నా లేకున్నా అతిగా కొనాలనుకునే వాళ్లు ఆ అత్యాశని క్లియర్ చేసుకుందాం. సరదాగా మొదలై అలవాటుగా షాపింగ్ లకు వెళ్ళి జేబులు ఖాళీ చేసుకొనే ఆ దురాలవాటుని మాన్పుకుందాం.

అన్నీ మాకే తెల్సనే అహంకారంతో ప్రవర్తించే వాళ్ళు వినియోగ హక్కుల గురించి తెల్సుకోవాలన్న ప్రాథమిక అంశాన్ని తెల్సుకునే తెలివితేటల్ని నేర్చుకుందాం, 'తెలుసు'అనే అహంభావాన్ని క్లియరెన్స్ సేల్ లో పెట్టేసుకుందాం. కుట్రలు, స్వార్థాలు, స్వలాభాలు – వీటన్నిటికీ మనసు గోడౌన్ నుంచి క్లియరెన్స్ ఇచ్చేద్దాం. మనుషుల్ని ఆదుకోవటమే నిజమైన మనిషి తత్వమని..కొనుక్కోవల్సిన వస్తుసామగ్రి – మంచితనం, మానవీయత, మమతానురాగాల బంధనాలేనని గుర్తుచేసుకుందాం.

రామా ! కళ్ళు వెళ్లే ప్రతి చోటుకి మనసు వెళ్ళకూడదు . మనసు వెళ్లిన చోటుకల్లా మనిషి వెళ్ళకూడదు . మనమీద మనకు నియంత్రణ లేనప్పుడు పరుల్ని తప్పుపట్టటం ఎందుకు ? అయినా గాంధీ గారి మాటలు గుర్తు చేసుకోవలసిన అవసరం ఉందిక్కడ. నీతి లేని వాణిజ్యం .. కృషి లేని సంపద – శీలం లేని విద్య – నియమ నిష్ఠలు లేని రాజకీయం – నియంత్రణ లేని మనిషి సామాజిక రుగ్మతలు . మనం 6 నెలలుగా వాడని వస్తువులని దానం చేద్దాం. మరొకరైనా దాన్ని వాడుకుంటారు కదా!

రామా! జరిగింది ఒక అనుభవంగా భావించు. మనని మనం మార్చుకుంటూ సమాజాన్ని మార్చటం పెద్ద కష్టం కాదురా. పైగా రిటైర్ అయ్యి ఉన్నాము. మన చేతిలో బోలెడంత  టైం ఉంది. కరపత్రాలు, sms, ఉపన్యాసాలు వాడేద్దాము. కలిసి పనిచేద్దాం. వినియోగ చైతన్యం రగిలిద్దాం. ఈ సారి నువ్వు hyderabad వచ్చినప్పుడు మన ధర్మపత్నులకి కలిపి చీరలు కొందాం రా.. ఈ సారి రసీదు మరిచిపోవులే ... హహ్హాఆహ్హా

ఉండనా మరి

నీ

– సారధి

# పాలింకిన నేల



అమ్మా!

'అమ్మా' అని పలకగానే కమ్మని పూల పరిమళమేదో మనసును తట్టిన అనుభూతి. ఈ భూమ్మీద మనిషి కృతజ్ఞత చూపించాల్సిన మొదటి వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది ఖచ్చితంగా అమ్మనే కదమ్మా. అమ్మకు అమ్మై పుడితే తప్ప అమ్మ ఋణం తీర్చుకోలేమంటారు. అయినా పేగుబంధంతో మొదలైన అనుబంధం పోగు బంధం దాకా సాగేది నీతోనే కదమ్మా. జీవన పోరాటంలో అలసిపోయినప్పుడు'నాన్నా! తిన్నావంట్రా' అంటూ కడుపు చూసి అన్నం తినిపించి, కొంగుతో నా నుదుటి చెమట అద్దే అమృతమయి నువ్వు కాక ఇంకెవరుంటారమ్మా. ఆ బ్రహ్మకి అమ్మలేదన్న బాధలో ప్రతి ఇంట్లో తానుండలేనని తెలిసి అమ్మను సృష్టించి ఉంటాడు.

అందుకే అందెశ్రీ గారంటారు – కొమ్మ చెక్కితె బొమ్మరా, కొలిచి మొక్కితె అమ్మరా, ఆదికే ఇది పాదురా, కాదంటే ఏమీ లేదురా – అని. అవతారపురుషుడు కూడా అమ్మ కడుపులో అణువంతే కదమ్మా ఉంటాడు. ఆ తర్వాతే కదా నీ ప్రేమతో యుగపురుషుడుగా మారేది. యశోదమ్మ ప్రేమతోనే కృష్ణయ్య ఎదిగింది.. కౌసల్య, సుమిత్ర, కైకేయిల సంరక్షణలోనే కదా రాముడు ఆదర్శ పురుషుడిగా నిలిచింది.. మరియమ్మ మాతృప్రేమ చవి చూసే కదా జీసస్ కరుణామయుడు కాగలిగింది.. శివాజీని వీరుణ్ణి చేసిన జిజియాబాయి, విశ్వామిత్రుడిని రాజర్షిగా మలిచిన రేణుక, గాంధీజీని జాతిపితగా గెలిపించిన పుత్లీబాయి, నెహ్రూని చాచాజీగా మార్చిన స్వరూపరాణి, భగత్ సింగ్ ని వీరుణ్ణి చేసిన విద్యావతి, నేతాజీని జాతికి అంకితం చేసిన ప్రభావతి, మన మిసైల్ మేన్ అబ్దుల్ కలాంని భారతరత్నగా మలచిన ఆషియమ్మ – వీరందరినీ వెనకుండి నడిపించింది నీలాంటి అమ్మేగా. అందుకే అమ్మా నువ్వు ఆది పదమే కాదు ఆర్తి కావ్యం కూడా.

అమ్మా! నాన్న తెచ్చే చాలీ చాలని జీతంతో నువ్వెంత గుట్టుగా సంసారాన్ని లాక్కొచ్చే దానివో నేను సంసారిని అయ్యేదాకా తెలుసుకోలేకపోయానమ్మా. కనపడ్డ ప్రతి వస్తువూ కావాలని కోరి నిన్నెంత ఇబ్బంది పెట్టానో తల్చుకుంటే సిగ్గుగా ఉందమ్మా. మన ఆర్థిక పరిస్థితి గురించి ఎంత చెప్పినా అదేదో మీ అపరాధమన్నట్టుగా చూశానే తప్ప అర్థం చేసుకోలేకపోయానెందుకమ్మా? మా కనీస అవసరాలు తీర్చడం కోసం నువ్వెన్ని సార్లు అర్ధాకలితో బతికావో నాకు తెల్సు. నువ్వు ఆడపిల్లవు, ఈడపిల్లవు కావని చెల్లిని ఏడిపించినప్పుడు – అది ఇక్కడ శాశ్వతం కాకపోవచ్చురా, కానీ దాని గుండెల్లో మాత్రం మనం శాశ్వతంరా – అని అన్నప్పుడైనా తెలుసుకొని నీకు 'sorry' ఎందుకు చెప్పలేదమ్మా? Daughters are angels, born with unconditional love and care forever అని నువ్వు చెప్పినప్పుడైనా అర్థం చేసుకొని అది అమ్మతోనే మొదలవాలన్న జ్ఞానాన్ని పొందేవుండాల్సింది. అమ్మా! ఆ తర్వాత నేనెప్పుడూ చెల్లిని ఏడ్పించలేదమ్మా! నిజం !

కాలేజీ రోజుల్లో సరదాకి ఓ అమ్మాయిని 'టీజ్' చేశానని ఆ రాత్రంతా నువ్వు ఏడుస్తూనే ఉన్నావు. ఇలా నీ చెల్లెలికి జరిగితే నువ్వు ఊరుకునేవాడివా అన్నావ్ – ఏం నేనొక్కడినే చేశానా, అందరూ చేశారుగా,ఏదో సరదాకే కదా – అన్నాను రోషంగా. సరదాకే అన్న మాటల్ని సున్నిత మనస్కులైన ఆడపిల్లలు ఎలా తీసుకుంటారో ఆ రోజు పేపర్ లో వచ్చిన వార్తలు వినిపించావ్. ఏది చేసినా నీ చెల్లెలి పట్ల మరొకరు అలాగే చేస్తారని అనుకుని చెయ్యి అన్నావు. ఆ క్షణంలో నాలో వచ్చిన పరివర్తన నా జీవితాన్నే మార్చేసి ఉంటే బావుండేది. ఇప్పుడు నేనిలా నీ ముందు దోషిలా నిలబడి ఉండేవాడిని కాదు. ఆడదంటే అమ్మరా, మీకు జన్మనిస్తుంది. తనకి మీరు మొక్కాలి గానీ అణగదొక్కాలనుకోకూడదని ఎన్ని సార్లు చెప్పినా నిజాన్ని గ్రహించలేదు. కన్నీళ్ళు చనుబాలు కలిపితే అమ్మవుతుందన్న నిజాన్ని గుర్తించలేదు. నా కాలేజీ దూరంగా ఉందని బస్ లో వెళితే టైం ఎక్కువగా పడుతుందని నాన్న వద్దన్నా వినకుండా నీ తాళిబొట్టు తాకట్టు పెట్టి నాకు బైక్ కొనిచ్చినప్పుడు ఆనందంతో షికార్లు చేశానే గానీ అమ్మగా నీ త్యాగాన్ని గౌరవించనే లేదు. ఆ రోజు కూడా నీకు sorry చెప్పలేదు.

సిగరెట్ తాగుతూ పొగని రింగు రింగులుగా గాలిలో వదులుతున్న ఫ్రెండ్స్ ని చూసి అదొక వీరోచిత కార్యక్రమం అనుకున్నాను. 'వీడొక తేడా గాడురా' అని గేలిచేస్తున్నారని నేనూ మొదలెట్టా. కుతి కోసం ఇంట్లో దొంగతనాలు మొదలెట్టాను. పోపుల డబ్బాలో డబ్బులు కొట్టేస్తూ నీ కంటబడ్డప్పుడు కేన్సర్ హాస్పిటల్ కి తీసుకెళ్లి లంగ్ కేన్సర్ తో చిక్కి శల్యమైన శరీరాల్ని..వారిని బ్రతికించడానికి చితికిపోయిన కుటుంబాల్ని చూపించావ్. ఆ రోజైనా అమ్మ మాట చద్ది మూటని తెలుసుకొనుండాల్సింది.

అమ్మాయిని ప్రేమించి, వాళ్ళ ఇంటి వాళ్ళతో తన్నులు తిని, కాలు విరిగి మంచం ఎక్కిన రోజు కూడా –'నాకు చెప్పి ఉండాల్సింది నాన్నా! ప్రేమించడం తప్పు కాదు కానీ ఇలా చెప్పాపెట్టకుండా పెద్దవాళ్ళ మనసులు నొప్పించి పారిపోవాలనుకోకూడదు కదా' అంటూ నువ్వే వెళ్ళి వాళ్ళతో మాట్లాడి, చదువై పోయి ఉద్యోగం వచ్చాక పెళ్లి చేసేందుకు ఒప్పించినప్పుడైనా నన్ను గెలిపించడానికి నిన్ను నువ్వు తక్కువ చేసుకోగలిగేంత పిచ్చి ప్రేమని చూపిన నిన్ను ఆనాడైనా గుర్తించి ఉండాల్సింది. నీకు thanks చెప్పుండాల్సింది.

పెళ్ళయిన సంవత్సరానికే – మా ప్రైవసీకి అడ్డుగా వున్నావని భావించి, ఆఫీసుకి దూరం అవుతోందని వంక చెప్పి వేరింటి కాపురం పెట్టేందుకు వెళ్ళినప్పుడైనా తలెత్తి నీవంక చూసుండాల్సింది. తడి కళ్ళతో నిల్చున్న నిన్ను చూసైనా మారుండేవాడినేమో. నా చదువులకైన అప్పుల్ని నీ మీద నెట్టేసి, కారులో తిరుగుతూ జల్సాలు చేసినప్పుడైనా కాలర్ పట్టుకొని నువ్వు అడిగుండాల్సింది. నేను కొత్త భార్యతో నీ దగ్గరకొచ్చినప్పుడు చిరిగిన నీ చీరను కప్పిపుచ్చుకుంటూ నాకిష్టమైనవన్నీ చేసి పన్నెత్తు మాట కూడా అనకుండా ఉన్న నీ మనసుని అప్పుడైనా అర్థం చేసుకొని ఉండేవాడినేమో!

అమితంగా ప్రేమించిన చెల్లెలి పెళ్ళికి అతిథిలా వచ్చినప్పుడు ఇరుగు పొరుగులు ఇబ్బంది పడే ప్రశ్నలేసినప్పుడు – 'వాడిప్పుడు పెద్ద ఆఫీసర్ కదా, టైం ఉండక కానీ చెల్లెలంటే వాడికెంత ప్రాణమో తెల్సుగా' అని సమర్ధించిన నాడైనా నేను నీ గురించి సంపూర్ణంగా తెలుసుకొని ఉండాల్సింది.

నాన్న రిటైరయ్యాక కూడా ఇల్లుగడవక ఉద్యోగం వెతుక్కుని పని చేస్తుంటే – 'అదేంటమ్మా! నేనున్నానుగా' అన్న మాట నా నోట్లో నుండి రాకపోగా, 'ఇల్లు ఎప్పుడు పంచుతా'రంటూ ఆస్తి పంపకం గురించి అడిగినప్పుడైనా నా చెంప చెళ్లుమనిపించి ఉంటే మీ గురించి అప్పుడైనా ఆలోచించి ఉండేవాడినేమో. ఆఫీసునుండి వస్తూ నాన్న యాక్సిడెంట్లో చనిపోయినప్పుడు కర్మకాండలకి కూడా టైం ఇవ్వలేక నీ కోడలి డెలివరీని సాకుగా చూపి తప్పించుకున్నాను చూడు, ఆ రోజైనా నన్ను తిట్టుండాల్సింది. అయ్యో పాపం కోడలు ఇబ్బంది పడ్తుందంటూ సర్దుకున్నావ్ చూడూ అప్పుడైనా నీ పాదాలు మొక్కుండాల్సింది.

ఒక్కర్తివే వున్నావన్న సాకు చెప్పి నా కూతురి కోసం జీతం భత్యం లేని పనిమనిషిలా నిన్ను నా బంగ్లాకి తెచ్చి

పెట్టుకుని 'ఆయా'గా అమ్మని చేసినప్పుడైనా నన్ను అడిగుండాల్సింది – 'నేను నీకు జీవితాన్నే ఇస్తే నాకు సర్వెంట్ క్వార్టర్ ఇచ్చావేంట్రా' అని. కనీసం అప్పుడైనా నా మూలాలు తెల్సుకొని ముక్కు నేలకు రాసుండేవాడిని.

పాప కాస్త స్కూల్లో పడ్డాక, ఇంటి చాకిరీతో నీకు ఆరోగ్యం పాడయ్యాక, నిన్ను వృద్ధాశ్రమానికి తీసుకెళ్లి – నీకిక్కడ నీ వయసు వాళ్ళుంటారమ్మా, అంత ఇంట్లో ఒక్కత్తివీ ఉండలేకపోతున్నావు – అంటూ నీ కళ్లలోకి చూసే ధైర్యం కూడా లేక కబేళాకి తరలించిన వట్టిపోయిన ఆవులా నిన్ను అక్కడ అప్పగించి వస్తున్నప్పుడైనా నా కాలర్ పట్టుకొని అడిగి ఉండాల్సింది కదమ్మా, 'కన్న కొడుకుగా నిన్ను పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులుగా మేం చేసిన త్యాగాలకి నువ్విచ్చే విలువ ఇదా' అని. అప్పుడైనా నేను వెనక్కి తిరిగి చూసుకుని ఉండేవాడిని.

నాకు తెల్సు! నేను ఏడ్చినప్పుడు నువ్వు నవ్విన ఏకైక సందర్భం, నేను పుట్టినప్పుడు మాత్రమే కదమ్మా. గెలిచినప్పుడు తల నిమిరావు. ఓడినవేళ వెన్ను తట్టి ధైర్యం చెప్పి గెలిపించావు. వెలుతురులో కూడా వెంటాడే నీడ, చీకటి రాగానే కనుమరుగౌతుంది. కానీ నువ్వు కష్టసుఖాల్లో,గెలుపోటముల్లో తోడుండి నడిపించావు. నా కంట్లో నలుసు పడితే నీ కంట్లో నీళ్లొచ్చేంతగా నన్ను ప్రేమించావు. ఇప్పుడు ఈ ముసలి వయసులో చేతికో కర్ర ఇచ్చి ఇదే నీ కొడుకనుకోమన్నాను. ఆసరా ఇవ్వాల్సిన సమయంలో జారుకున్నాను. నాకు హార్ట్ ఎటాక్ వచ్చి హాస్పిటల్ లో చేరినప్పుడు అయ్యో సెలవలు లేవంటూ భార్య, సెలవులకి అబ్రాడ్ టికెట్స్ బుక్ చేసుకున్నామంటూ పిల్లలు ఎక్కడి వాళ్ళక్కడికి వెళ్లిపోయేసరికి అర్థమయిందమ్మా – బంధాన్ని గౌరవించని నేను ఏ అనుబంధాల గురించీ ప్రశ్నించే స్థాయిలో లేనని. ఆవు, చేలో మేస్తే దూడ గట్టున మేయదు కదమ్మా. తల్లిని గౌరవించలేని నన్ను నా పిల్లలు మాత్రం గౌరవిస్తారా. ఇంత అపరాధం చేసినా క్షమామయిగా నువ్వు వచ్చావ్, నన్ను కాపాడావ్. ఖురాన్లో ఒక మాట వుంది.

''మాకే పైరోంకే నీచే జన్నత్ హోతాహై'' అంటే తల్లి పాదాల కింద స్వర్గం వుంటుందని... అది నా మిత్రుడు అహ్మద్ ఎన్ని సార్లు చెప్పినా నా గుండెల్లోకి చేరలేదెందుకమ్మా– ఏ మతం చెప్పినా 'మాతృదేవోభవ' అనే కదమ్మా చెప్పేది. 9 నెలలు నీ గర్భాలయంలో పెరిగిన నేను... 9 యేళ్ళు కూడా నిన్ను చేరదియ్యలేకపోయానా అమ్మా.

అమ్మా! నువ్వు నాకు అన్నీ నేర్పావు. అందరికీ అన్నీ చెప్పి బాగా బతికేస్తున్న నేను, ముఖ్యంగా నీకు చెప్పాల్సిన అతిముఖ్యమైన మూడు వాక్యాలు ఇప్పటిదాకా చెప్పలేదమ్మా. ఇక ఇప్పటికి కూడా చెప్పకపోతే నేను నేనుగా ఉండలేననిపిస్తోంది. నీ ప్రతిరూపాన్ని కదా నేను నా ఆత్మకి చెప్పుకోవటం ఏమిటి కృతకం కాకపోతే అని ఇన్నేళ్లూ అనుకున్నాను. కానీ కృతజ్ఞతా పూర్వకంగా నీ ముందు మోకాళ్ళ మీద కూర్చుని ఇప్పుడు చెప్తున్నానమ్మా – నేను నీకు చెప్పకుండా మర్చిపోయిన మాటలు. చెప్పాల్సిన అవసరం ఉన్నా చెప్పకుండా ఆపేసుకున్న మాటలు – sorry–thanks–love you – లే నమ్మా. నీ వల్ల ఎవరు ఇబ్బంది పడ్డా sorry చెప్పమన్నావు. నీకెవరు చిన్న సాయం చేసినా thanks చెప్పమన్నావు. కనిపించిన చిన్నపిల్లలకు love you చెప్పమన్నావు. అలా ప్రేమించడం నేర్పిన నీకు ఎప్పుడూ, ఎందుకు i love you చెప్పలేదో ఇప్పటికీ అర్థం కావటం లేదమ్మా. నీ హృదయాన్ని ఇంతలా రంపపుకోత కోసి కూడా ఎందుకు sorry చెప్పలేకపోయానో తెలియటం లేదమ్మా. నీ శరీరాన్ని గుల్ల చేస్తూ విజయసోపానపు నిచ్చెనలెక్కి ఈ స్థాయికొచ్చిన నేను ఒక్కసారైనా thanks ఎందుకు చెప్పలేదు?

పండుటాకులా ఉన్న నీ చేతిని నా చేతుల్లోకి తీసుకున్నాక తెలిసింది – వేదనతో నీ గుండె ఎంతగా కన్నీరు కారుస్తుందో అని. అమ్మా! నువ్వు నాకు బతకడం నేర్పిన బతుకమ్మవి. నాకు దీవెనలిచ్చి ఆయుష్షుని పోసిన తులసమ్మవి. నేను నిరంతరం పూజించే మల్లమ్మవి. ఇంటి సౌభాగ్యాన్ని కాపాడే పోచమ్మవి. కమ్మదనమే నీ జన్మ గుణమని ఇప్పటికి తెలుసుకున్నానమ్మా. నా అజ్ఞానాన్ని మన్నించు, నా స్వార్థాన్ని క్షమించు. నన్ను ఇంతకుముందులా ప్రేమగా లాలించు. ఎందుకో గుండె నిలువెత్తు అపరాధభావంతో సుడులు తిరుగుతోంది. నీ ఒడిలో కాసేపు పడుకోవాలని ఉందమ్మా – మళ్ళీ చిన్నప్పటి నీ చిన్నారి కిష్టుడిలా. జో కొడతావ్ కదూ...

నీ

– కిష్టుడినమ్మా...



# త్రిదళం – త్రినేత్రం

భారతమ్మా !

నీదెంత బంగారు కడుపమ్మా! చిన్నప్పుడెప్పుడో 'రత్నగర్భ భారతావని' అని పాఠ్య పుస్తకాల్లో చదువుతుంటే 'ఓహో నా మాతృభూమి భారతదేశపు నేలలో రత్న రాశులు ఉంటాయన్నమాట' అనుకున్నాను. కానీ మెతుకు ముత్యాల్ని పండిస్తూ మన ఆకలి బాధను తీర్చే అన్న దాతను చూశాక, 'ఇతడే కదా భారతమ్మ కడుపున మేలిమి ముత్యం'అనుకున్నాను. అంతలోనే 'జై జవాన్ ! జై కిసాన్ !' అన్న నినాదం గుర్తొచ్చి రెండు కళ్ళు కదా వీరిద్దరూ అనిపించింది. కానీ ఇప్పుడు నవ రత్నాలు ఏమిటో, అసలు సిసలు రత్నగర్భ అంటే ఏమిటో అర్థమైందమ్మా. రత్నాల్లాంటి నీ బిడ్డల వీరోచిత గాథల్ని చెవులారా వింటున్నాం. ఆ వీర జవానుల స్ఫూర్తిదాయక చరిత్రను కళ్ళారా చూస్తున్నాం. ఎంత గొప్ప వీరుల్ని కన్నావమ్మా. నీ గర్భమే అలాంటిది. ఆ గర్భాలయం నుండొచ్చిన ప్రతి బిడ్డా ఓ వీరుడే. పృథ్వీరాజ్, శివాజీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, లాలా లజపతి రాయ్ లాంటి వారి పేరులు వింటుంటే ఒళ్ళు జలదరించేది. ఇప్పుడు ఇదిగో నీ గగన వీరులు గొప్ప శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. ఉగ్రవాదమనే క్యాన్సర్ కి వైద్యం చేస్తున్నారు.

మొన్నటి ఫిబ్రవరి 14న పుల్వామాలో 40 మంది CRPF జవాన్లని ఉగ్రవాదం బలిగొన్న ఘటన ప్రతి భారతీయుడిలో చెరగని గాయాన్నిరేపింది. మన శాంతి మంత్రం దేశంలో అశాంతిని రేపటాన్ని జీర్ణించుకోలేకపోయాం. 2011 నాటి ముంబై దాడి, పఠాన్ కోట వైమానిక స్థావరాలమీద దాడులు, యురీ సంఘటనలు మర్చిపోకముందే, ఆ నెత్తురోడుతున్న గాయం రసి కారుతుండగానే ఇప్పుడు పుల్వామా ... పుల్వామా దారుణకాండని గర్హిస్తూ పాకిస్థాన్ ఉగ్రవాద శిబిరాలపై నిప్పులు చెరిగిన మిరాజ్ జెట్ విమానాల్ని, తలవంచని ధీరత్వంతో ముందుకు దుమికిన మన వాయు సేన వీరోచిత స్థైర్యాన్ని – ఎన్ని రకాలుగా పొగడాలమ్మా ! పుల్వామా ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకొని 40 మంది వీర జవానుల ఆత్మలకే కాదు, 130 కోట్ల భారతీయులకూ ఆనందాన్ని పంచింది. అభినందన్ వర్ధమాన్ లు వర్తమానంలోనూ, భవిష్యత్తులోనూ మరింతగా మనకు ఎదురౌతూనే ఉంటారు చూస్తుండమ్మా !

నీకో విషయం గుర్తు చెయ్యనా ! భారత నావికా దళంలో అత్యంత ధైర్యసాహసాలు కలిగిన వ్యక్తుల్లో ఒకరిగా పేరొందిన కమాండర్ బబ్రూ భాన్ యాదవ్, 1971 బంగ్లాదేశ్ విమోచనకోసం జరిగిన యుద్ధంలో ఆయన పోషించిన పాత్ర – 'మహావీర్ చక్ర' పురస్కారాన్ని పొందిన మొట్టమొదటి వ్యక్తిగానే కాదు, ఆ 'ఆపరేషన్ ట్రిడెంట్'ను గట్టున పడేసిన సవ్యసాచిగా కూడా మనం చెప్పుకునే ఈ వీరుడు వైమానిక దాడులను తిప్పికొడుతూ, పదాతి దళాల నుండి వస్తున్న ప్రతిదాడిని గమనిస్తూ రెండు యుద్ధ నౌకల సమూహాన్ని ఎదుర్కొంటూనే కరాచీ ఓడరేవులో లోలోపలికి చొచ్చుకుపోయారు. భారత నావికాదళ స్థాయి ఏమిటో దాయాది దేశానికి చూపించారు.

అంతెందుకు, అరేబియా సముద్రంలో మన యుద్ధనౌక INS ఖుక్రి, పాకిస్థాన్ సబ్ మెరైన్ విడిచిపెట్టిన టార్పెడో బాంబుకి బలైనప్పుడు, ఎన్ని వందల కుటుంబాలు పొగిలి పొగిలి యేడ్చుంటాయో – అందులో 18 మంది ఆఫీసర్లు, 176 మంది నావికులు జల సమాధి అయ్యారని అందరికీ తెలుసు. కానీ ఆ నౌకకి కెప్టెన్ గా ఉన్న మహేంద్రనాథ్ ముల్లా ఎంతో మందిని రక్షించి ఒడ్డుకు చేర్చారు, మిగతా వాళ్ళను కాపాడే ప్రయత్నంలో తనను తాను రక్షించుకోగలిగినప్పటికీ మిగతావారిని రక్షించగలిగే సమయం లేనందుకు బాధతో నైతిక బాధ్యత వహిస్తూ, అందరితో పాటు జలసమాధి కావటమే తనకిష్టమని ఎంచి ఇచ్ఛా మరణాన్ని ఆహ్వానిస్తూ తానూ జలసమాధి అయిన వాస్తవం గుర్తొస్తే ఎంత గర్వంగానో ఉంటుంది. ఇదే కదమ్మా మన జవానుల నీతి. చిరునవ్వుతో త్యాగనిరతితో నమ్ముకున్న విలువల కోసం చావును ఆహ్వానించే ఆత్మస్థైర్యం ఎంతమందికుంటుందమ్మా.. అయినా స్వాతంత్ర్యానంతరం ఒక భారతీయ నౌక అలా మునిగిపోవడం అదే తొలిసారి కదమ్మా.

అమ్మా ! నీకు ఆపరేషన్ రాహత్ గుర్తుందా.. ఎందుకు గుర్తుండదు.. దాదాపు 18 దేశాలకు చెందిన వెయ్యిమంది ప్రయాణీకుల్ని అతలాకుతలం చేసిన రోజుని ఎవరు మాత్రం మర్చిపోగలుగుతాం. అది 2015 అనుకుంటాను కదమ్మా. యెమన్ తీరంలో ప్రయాణిస్తున్న ఓడను రాత్రి వేళ హౌతీ తిరుగుబాటుదారులు చుట్టుముట్టడం, విపరీతమైన తుపాకుల మోతల నడుమ, విచక్షణా రహిత మారణహోమం మధ్య సౌదీ ప్రభుత్వ వైమానిక దళాలు పైన చక్కర్లు కొడుతుండగా, తెగించి చావును కౌగిలించుకోడానికి మన వీర కిశోరాలు తప్ప ఎవరెళతారమ్మా. INS సుమిత్ర కమాండర్ మిలింద్ మోహన్ మోకాషి ఆయుధాలు నిండిన పడవలతో దాడి చేసి ఓడలో చిక్కిన కొంత మంది ప్రయాణీకుల్ని రక్షించాడు. అతని స్థైర్యానికి 'శౌర్య చక్ర'నే వరించింది. ఆ దాడిలోనే కదూ కెప్టెన్ ప్రదీప్ సింగ్, కెప్టెన్ రాజేశ్ ధనకర్ లకి 'నౌ సేనా గ్యాలంట్రీ' మెడల్స్ వచ్చాయి. ప్రదీప్ 600 మంది విదేశీ ప్రయాణీకుల్నీ,10 మంది నర్సుల్నీ రక్షిస్తే; కెప్టెన్ రాజేశ్ 441 మంది భారతీయుల్నీ, విదేశీయుల్నీ రక్షించాడు. ఆ రాత్రి భారతదేశ చరిత్రలోనే కాళరాత్రి కదమ్మా.

అంతెందుకు, 2008 నవంబర్ 26 న ముంబై దాడుల్లో జరిగిన మారణహోమం ప్రతి భారతీయుడి గుండెల్లో ఇప్పటికీ పచ్చిగానే ఉంది. తీవ్రవాదాన్ని తీవ్రతరం చేస్తూ మత ముష్కరులు చాలా పెద్ద ఎత్తున మారణహోమం తలపెట్టారు. అయితే, అదృష్ట వశాత్తూ మన నేవీ మెరైన్ కమాండోస్, MARCOS, వల్ల ఆ ఉపద్రవ మోతాదు భారీగా తగ్గింది. నిజానికి MARCOS సముద్ర దొంగల నుండి మన చమురు ఉత్పత్తి కేంద్రాలను రక్షించి, సముద్రపు బందిపోట్లను ఎదుర్కొనే వ్యవస్థ. అలాంటి వారికి ఉగ్రదాడిని జరపటానికి దొంగతనంగా మన దేశంలోకి ప్రవేశిస్తున్న మత విద్వేషకులు చేజిక్కారు. వెంటనే చురుగ్గా వ్యవహరించిన MARCOS కొంత మందిని మట్టుపెట్టింది. వారే కనక అలసత్వం వహించి ఉంటే మరణించిన వారి సంఖ్య 165 కాదు, ఇంకా ఎక్కువ స్థాయిలో ప్రాణ హాని జరిగి ఉండేది.

అమ్మా ! ఏమిటిలా మౌనంగా ఉండిపోయావ్, నీకు ఆ దాడిలోనే వీరమరణం పొందిన హేమంత్ కర్కరే గుర్తొచ్చాడు కదూ. రెండు కన్నీటిబొట్లు రాల్చకుండా నేనూ ముందుకు సాగలేనమ్మా. యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ కి జాయింట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ గా ముఖ్య బాధ్యతలు నిర్వహిస్తున్న కర్కరే ఎంత మంది నిలువరిస్తున్నా పిట్టల్లా రాలిపోతున్న ప్రజల ప్రాణాలకంటే తన ప్రాణమేమీ ఎక్కువ కాదంటూ కాల్పుల్లోకి ఉరికాడు. అలాగే ACP అశోక్ కామ్టే కూడా వీరోచితంగా ఉగ్రవాదులకి ఎదురు నిల్చి ప్రాణ నష్టాన్ని భారీగా తగ్గిస్తూ నేలకొరిగాడు. అతడిని 'అశోక చక్ర' పురస్కారంతో గౌరవించుకున్నాం.

అమ్మా ! పాకిస్తాన్ సబ్ మెరైన్ 'ఘాజీ' గుర్తుందా నీకు.. 1971లో జరిగిన పాకిస్థాన్ తో యుద్ధంలో 'ఘాజీ' ని మనం ముంచి వేశాం. అసలూ... ఘాజీ దాడిచెయ్యాల్సింది, చెన్నై తీరంలో ఉన్న మన యుద్ధ నౌక INS విక్రాంత్ మీద. ఆ విషయం తెలుసుకున్న తూర్పు నావికాదళ కమాండింగ్ ఆఫీసర్, వైస్ అడ్మిరల్ కృష్ణన్ ఎంతో తెలివిగా INS

విక్రాంత్ విశాఖలో నావికా దళానికి సేవలు అందిస్తోందంటూ కొన్ని వార్తల్ని వ్యాపింప చేసాడు. దాంతో ఆ పాకిస్థాన్ సబ్ మెరైన్ తన మార్గం మార్చుకొని విశాఖపట్నానికి వెళ్లింది. ఆ తర్వాత కథ మనకందరికీ తెలుసనుకో. అయితే విక్రాంత్ 'ఘాజీ'ని ఏమార్చి, అండమాన్ నికోబార్ తీరానికి వెళ్ళి పాకిస్థాన్ మీదనే దాడిచేసి మన సేనకి ఎంతో అండగా నిలిచింది. ఈ వ్యూహాన్ని పన్నిన వైస్ అడ్మిరల్ కృష్ణన్ సందర్భోచిత నిర్ణయాన్ని ఇప్పటికీ స్ఫూర్తి దాయకంగా మన త్రివిధ దళాలూ చెప్పుకుంటూనే ఉన్నాయ్.

మనకి స్వాతంత్ర్యం వచ్చింది 1947లోనే అయినా, 1961 వరకూ గోవా మాత్రం పోర్చుగీస్ ఆధీనంలోనే ఉండేది. 'ఆపరేషన్ విజయ్' పేరుతో పదాతి దళానికి గగన తలం నుండి దన్నుగా నిలిచిన మన వైమానిక దళం, IAF అండతో గోవాని భారతదేశంలో సంపూర్ణంగా విలీనం చేసుకున్నాం. అంతెందుకు 1971 లో పాకిస్థాన్ నుండి బంగ్లాదేశ్ విడిపోయినప్పుడు కూడా IAF కీలక భూమిక పోషించింది. 1999 కార్గిల్ వార్ లో మిగ్ 21S, మిగ్ 27S, మిగ్ 29S లు సాయుధ దళాలకి రక్షణ కవచంలా ఉపయోగపడ్డాయ్. రాజ్ పుతానా రైఫిల్స్ లో చేరి కార్గిల్ పోరాటంలో నీ ఒడిలోకే చేరిన మేజర్ పద్మపాణి ఆచార్య ఎక్కుపెట్టిన ప్లటూన్ కురిపించిన గుళ్ళ వర్షం నీ పాదాల్ని అర్చించిన పూదళాలే కాదామ్మా !

ఈ ఏడాది, అంటే మొన్న ఫిబ్రవరి 27న జరిగిన బాలాకోట్ దాడిలో రాజులా వెలిగిన మిరాజ్ ని మొదటిసారిగా ఉపయోగించింది కార్గిల్ వార్ లోనే. హిమాలయాల్లాంటి ఎంతో ఎత్తైన ప్రాంతాల్లో ఇవి ఎంతో సమర్ధవంతంగా పనిచేస్తాయ్. రాత్రి వేళల్లో ఆకాశం నుండి దాడులు చెయ్యడానికి ఇవి ఎంతో ఉత్తమం. మిగ్ 29 S లు మిరాజ్ లకి పైలట్ ఎస్కార్టులుగా పనిచేసాయ్. బాంబుల భాష తప్ప ఏ భాషా అర్థం కాని కొన్ని దేశాలకి, వారికి సహకరించే కొన్ని పెద్ద దేశాలకి, సహనమూర్తి హుంకరిస్తే ఎలా ఉంటుందో తెలియజేసింది మాత్రం 2016 లో యురీ సెక్టార్ లో జరిగిన 'సర్జికల్ స్ట్రైక్స్' లోనే. LOC కి సమీపంలో మిలిటెంట్స్ దాక్కున్న లాంచ్ పేడ్స్ మీద 'సర్జికల్ స్ట్రైక్స్' జరిపి ప్రపంచం ఒక్కసారి ఉలికి పడేలా చేసాం. మత నినాదాన్ని పట్టుకొని, సమర నాదాన్ని వినిపించిన దేశానికి 'సత్యమేవ జయతే' సూత్రంతో సమాధానాన్ని చెప్పాం.

అమ్మా ! 1999లో కార్గిల్ యుద్ధమప్పుడు మిగ్ 21 S ని నడుపుతూ సాంకేతిక కారణాలతో పారాచ్యూట్ తో పాక్ ఆక్రమిత కశ్మీర్ వైపు దూకి, ఏడు రోజులు పాకిస్థాన్ యుద్ధ ఖైదీగా వుండి, ఎట్టకేలకు భారత్ కు అప్పగించబడ్డాడు నచికేత. 17వేల అడుగుల ఎత్తులో 80 MM రాకెట్లను, మిగ్ 27 ఎయిర్ క్రాఫ్ట్ ను ఎదుర్కొనే లక్ష్యంతో పోరాడి బటాలిక్ ప్రాంతం నుండి దూసుకొచ్చిన రాకెట్ల వర్షానికి ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ ఫెయిల్ అయిందని తెల్సి, పారాచూట్ సాయంతో దిగుతూనే తన పిస్టల్ తో ఫైరింగ్ కొనసాగిస్తూ, పోరాటం చేస్తూ పట్టుబడ్డాడు. నచికేత ఆత్మ స్థైర్యాన్ని, దేశమ్మీద వీరికున్న భక్తిని ఏ మీటర్లలో కొలుద్దాం ?

1971, డిసెంబర్ 8న నలుగురు యువకిశోర ఫైటర్లు పాక్ భూభాగంలోని వైమానిక స్థావరంలోకి దూసుకెళ్లి, మూరీదో వైమానిక స్థావరంలో నిలిపి ఉంచిన శత్రు విమానాలని ధ్వంసం చేసారు. ఎంతగా ఆదేశాలు అధికారులిచ్చినా యుద్ధక్షేత్రానికెళ్ళాక ఫైటర్స్ చాకచక్యం మీదనే ఫలితం ఆధారపడి ఉంటుంది. నీకు గుర్తుందా అమ్మా, బంగ్లా యుద్ధంలో నలుగురు ఫైటర్లు ఐదు శత్రు విమానాలని నేల కూల్చి శత్రువుల్ని మానసికంగా దెబ్బతీశారు. అయితే ఇప్పట్లో లాగా అప్పట్లో తగిన వార్తా సమాచారం లేకపోవడం వల్ల ఆ విశేషాలు ప్రజల దాకా చేరలేదు. ఎంత పగడ్బందీ ప్రణాళిక కదా!

ముందు రెండు విమానాలు బయల్దేరిన ఒకటిన్నర నిమిషం తర్వాత మరి రెండు విమానాల్ని బయల్దేరదీశారు. ఆనాటి సాహస కార్యంలో పాల్గొన్న కరంబయ, మిగ్ 19S ని చూశానని అనుకున్నానని, కానీ చీకటి తొలిగాక F16 గా గుర్తించానని, దియోస్కర్ అనే తన సహవాసి కూడా మరో విమానాన్ని గుర్తించాడని చెప్పడం గమనార్హం. అయితే తాను

శత్రు విమానాన్ని కూల్చిన వెంటనే వారు కూడా కరంబయ నడుపుతున్న విమానాన్ని ఎటాక్ చేశారని, తను పారాచూట్ సాయంతో దిగిపోతున్నానని అధికారులకి సమాచారం అందించిన తర్వాత, తలుపు దగ్గరికి వెళ్ళాక యుద్ధ ఖైదీగా శత్రు దేశానికి పట్టుబడే కంటే, మన దేశంలోనే వీర మరణం పొందాలనుకొని రెక్కలు తెగి ఇంధన ట్యాంకులకి నిప్పంటుకున్నాక కూడా స్థైర్యంతో ఆ అతి తక్కువ వ్యవధిలోనే సట్లెజ్ నది వైపుగా దూసుకెళ్ళి, తాను దూకేసానని 'వీరచక్ర' పురస్కార సందర్భంగా కరంబయ చెప్పి, పలువురి ప్రశంసలు అందుకోవడం ప్రస్తావించదగ్గ అంశం.

ఎయిర్ కమాండర్ J.L. భార్గవ పాక్ తో యుద్ధం తీవ్ర స్థాయిలో జరుగుతున్న సమయంలో హిందూస్థాన్ ఫైటర్–24 విమానాన్ని నడుపుతుండగా దాన్ని కూల్చేసిన పాక్ ఆర్మీ, అతన్ని యుద్ధ ఖైదీగా పట్టుకుంది. భారత వాయుసేన గురించి నెల రోజుల పాటు వేసిన ప్రశ్నలే వేస్తూ సమాచారం రాబట్టే ప్రయత్నం చేస్తుండగా అందులో ఒక ప్రశ్నకి ఎంత చాక చక్యంగా జవాబిచ్చాడో నీకు గుర్తుందా అమ్మా.. మీ వాయు సేనలో అత్యంత ప్రతిభా వంతుడైన పైలట్ ఎవరు, ఎక్కడుంటాడు – అని అడిగితే 'అతను మీ ముందే కూర్చుని ఉన్నాడు' అని తిరుగు లేని సమాధానాన్ని ఇచ్చిన ధీశాలి భార్గవ.

ఆ తర్వాత ఏడాదికి అతన్ని చర్చల ద్వారా విడిపించగలిగాం మనం. అమ్మా ! నీకిక్కడ ఒక పులకితమయ్యే విశేషం చెప్పనా.. నలభై ఎనిమిది యేళ్లుగా పుణే–ఖడక్ వాస్లా లోని డిఫెన్స్ అకాడమీలో, పాక్ చెరలో ఇప్పటికీ మగ్గుతున్న మన వీర జవాన్ల కోసం ఒక విశేషమైన ఏర్పాటు చేసి ఉంది. ఒక చిన్న బల్ల,కుర్చీ వేసి, ప్రతీరోజూ ఒక ఎర్రటి రోజా పువ్వుతో అలంకరించి, ఎర్రటి రిబ్బన్ కట్టి, పెద్ద ప్లేటు పక్కనే చిన్న ప్లేటు పెట్టి, కాసింత ఉప్పు, ఒక నిమ్మకాయ చెక్కని ఉంచి, బోర్లించిన గ్లాసునుంచి, ఆ పక్కనే వెలిగించని కొవ్వొత్తిని ఉంచుతారు. దాదాపు అయిదు దశాబ్దాలుగా ఏ ఒక్క రోజు కూడా మరవకుండా ఇలా చేస్తూ పక్కనే ఒక ప్లకార్డు మీద ఎప్పటికైనా పాక్ బందీలుగా ఉన్న మన సోల్జర్స్ తిరిగొస్తారన్న ఆశని, ఆకాంక్షని గుండె నిండుగా తెలియజేస్తూ ఉన్నారిప్పటికీ.

అయ్యో,ఏమిటిదీ..కళ్ల నుండి తెలియకుండానే జారిన కన్నీటితో ఈ అక్షరాలు,కాస్త చెరిగినట్టుగా ఉన్నాయమ్మా. అచ్చు మన భారతీయుల మనసుల్లాగే. ఇప్పటికీ కూడా ప్రతి భారతీయుడి గుండె నిరీక్షిస్తూనే ఉంది. కానీ అమ్మా! విజయానికి అందరూ మిత్రులే, అపజయం ఎప్పుడూ ఒంటరిదే. అది అందరి విషయంలో, కానీ, సోల్జర్స్ విషయంలో అలా కాదు కదమ్మా. సరిహద్దు రక్షణలోనూ, అంతర్గత ఉపద్రవాలప్పుడూ, ప్రకృతి విపత్తులప్పుడూ — అన్నిరకాల అత్యవసర పరిస్థితుల్లోనూ సైన్యం తామున్నామంటూ ముందుకురికొస్తుంది. అసలు వారితో చేతులు కలపడానికి, ఆ యూనిఫాంని తాకడానికి మా మనసులు ఉవ్విళ్లూరుతుంటాయంటే నమ్మమ్మ. ఇప్పుడు నీకీ విషయం చెప్తుంటేనే ఆ యూనిఫాం మీది నక్షత్రాలేవో మాకే పొదిగినట్లు పులకించిపోతున్నాను.

గత ఏడాది ఆగస్ట్ లో కేరళను ముంచిన వరదల్లో అందించిన సేవకు పురస్కారం కూడా పొందిన వాయుసైనికుడు, ధైర్యశాలి, గతవారం సర్వీస్ హెలికాప్టర్ కూలిన ఒక దురదృష్టకర సంఘటనలో అసువులు బాసి, తన జీవిత భాగస్వామి–స్క్వాడ్రన్ లీడర్ అయిన భార్యతోనే వీర అభివాదాన్ని అందుకున్న 31 ఏళ్ల పైలట్ సిద్ధార్థ్ వశిష్ఠ్ గురించి తలచుకుంటుంటే హృదయం ఆవేదనతో మూగబోతోంది. అమ్మా! ఆటల్లో గెలిచి కప్పు తీసుకొచ్చిన కొడుకు కంటే, వెనగ్గా వచ్చి నిరాశగా నిలబడ్డ కొడుకు మీదనే తల్లికి ఎక్కువ ఆపేక్ష ఉంటుందంట. వశిష్ఠ్ కుటుంబం నీ ఆశీర్వాదం కోసం ఎదురు చూస్తోందమ్మా. ఊరుకోమంటూ భుజంతట్టే నీ ఆత్మీయ స్పర్శ కోసం ఒళ్ళంతా కళ్ళు చేసుకొని నిరీక్షిస్తోందమ్మా. సముద్రం అంత నిస్తేజంతో బెంగటిల్లిన ఆ గుండెల్ని ఒక్క మారు పలకరిద్దామా, జయహో అంటూ వశిష్ఠకి సెల్యూట్ చేద్దామా. తన కుటుంబంలో నాలుగో తరానికి చెందిన సైనికుడు,అమరుడైన ఆ యువ కిశోరానికి 130 కోట్ల గొంతులతో నివాళి నినాదాన్ని వినిపిద్దామా. సెల్యూట్ వీరజవాన్, మర్చిపోదు నీ దేశం నిన్ను ఎప్పుడూ !

'సూర్యుడ్ని చుంబించిన చిరంజీవీ, నీలాగే ఎందరో సరిహద్దుల్లో మాకై కాపు కాస్తున్నారు. మీకై మేమున్నాం, గగనాన్ని చుంబించేందుకు మొక్కవోని దీక్షతో, తేజస్సుతో సాగిపోండి' అంటూ సోషల్ మీడియాలో వైరల్ అయిన కవితను రాసిన కవి ఎవరన్నది తెలీకున్నా అతను ఘటించిన అక్షరాంజలి మాత్రం అచ్చంగా 120 కోట్ల దేశ జనాభాదే.

త్రివిధ దళాధిపతులు నీకు త్రినేత్రాలు. ఏ నేత్రం తెరిచినా శత్రువు భస్మం కావలసిందే కదా...

కార్గిల్ పోరులో అసమాన ధైర్య సాహసాలు చూపించిన మిగ్ లోహ విహంగాన్ని నడిపిన ఎయిర్ మార్షల్ సింహకుట్టి వర్ధమాన్ గుర్తున్నాడా అమ్మా ! ఏంటమ్మా అలా నవ్వుతావ్ ! నిజమేలే.. ఇప్పుడంతా మార్మోగిపోతున్న అభినందన్ నాన్నగారిగా ఆయనని అందరూ గుర్తుపెట్టుకుంటున్నారు గానీ, ఆయనో చక్కని పైలట్. అంతే కాదు ఆయన తండ్రి కూడా వాయుసేనలోనే పనిచేసారు. అయితే మూడో తరం అభినందన్ ఎందుకంత అభిమాన పాత్రుడయ్యాడూ అంటే 1950 నాటి మిగ్ 21S ని నడుపుతూ 1980 నాటి F16యుద్ధవిమానాన్ని నేల కూల్చడం మాటలు కాదు. వైమానిక యుద్ధ చరిత్రలోనే ఇది అసాధారణం. పదిహేను వేల అడుగుల ఎత్తులో ఉండి అభినందన్ తొమ్మిదివేల అడుగుల్లో ఉన్నF16 ని వెంబడిస్తూ తన అద్భుత విన్యాసాలతో F16 అధికారుల్ని ఆత్మ రక్షణలో పడేసి ఇరవై ఆరు వేల అడుగుల ఎత్తుకు తీసుకెళ్లి, తానూ వెంబడిస్తూ పాక్ జెట్ వెనుక భాగాన్ని చేరి లాఘవంగా అరవై డిగ్రీల కోణంలో R73 క్షిపణి మీటను నొక్కటం ద్వారా F16 ని స్మాష్ చేసారు. పైగా పారాచూట్ తో దూకేసి, తాను పాక్ ఆక్రమిత భూభాగంపై పడ్డానని తెలిసి తన వద్దనున్న వైమానిక దళ రహస్య పత్రాలను పాక్ సైన్యం చేతికి చిక్కకుండా మింగేశాడు.

అమ్మా ! మతాన్ని పౌడర్ లా పులుముకున్న మనుషులు చిమ్మిన రక్తపు కళ్ళాపిని చూసి బాధేస్తుందమ్మా. ఎన్నేళ్లు కాలుతుందమ్మా ఈ రావణ కాష్టం. హింసకు ప్రతి హింస తగదంటూ అనాది కాలం నుండీ పెద్దలు చెప్పే నీతి సూత్రాలు వింటూనే ఉన్నాం. ఒక చెంప మీద కొడితే మరో చెంపని 70 యేళ్లుగా చూపిస్తూనే ఉన్నాం. మన సహనం చేతకాని తనంగా, మన క్షమ అలసత్వంగా, మన శాంతి సూత్రం నిస్సహాయ గీతంగా వినిపిస్తే ఏం చెయ్యగలుగుతాం చెప్పు. అహింసని ప్రపంచానికి చాటిన దేశం మీద ఉగ్రదాడులు సబబేనా? మాటలకి భాష్యం ఉంటుంది కానీ, వైషమ్యాలకి ఏ లేహ్యం పనిచేస్తుంది చెప్పు.

మనిషిని మనిషే చంపాలంటే ఎంత బాధ ఉండాలమ్మా, మనిషిని మతమే చంపాలంటే ఎంత మూర్ఖత్వం ఉండాలమ్మా... అవును, ఎప్పుడూ మనం తెల్ల పావురాల్ని గాలిలోకి ఎగరేస్తూనే ఉన్నాం. ఇప్పుడు మాత్రం తన జాతి కోసం తెల్ల పావురాలే యుద్ధాన్ని ప్రకటించడాన్ని కొత్తగా చూస్తున్నాం.

వుండనా మరి

ఓ

భారతీయుడు

– ఐ.సి. శేఖర్

# అచ్చంగా పిచ్చుక...

ఓ నా బంగారు పిచ్చుకా !

ఎన్నేళ్ళ నిరీక్షణ ఫలితంగా కనిపించావో... ఇంతలా ప్రేమించి పలవరించే నన్ను వదిలేసి ఎలా వెళ్లిపోగలిగావ్ నువ్వు...? ప్రొద్దుట నేను లేచేది నీ కిలకిలల భూపాల రాగంతోనే కదా... నువ్వు సుప్రభాతం పాడనిదే నేనేనాడైనా నిద్ర లేచానా... నా మడత మంచం పక్కగా, కిటికీలో వయ్యారంగా కూర్చుని నువ్వు కిచ..కిచల గుసగుసలు చెప్పందే, నేనెప్పుడైనా నిద్రపోయానా? నీ ముఖం చూడకుండా గానీ, నిన్ను ముద్దులాడకుండా గానీ, నాకు పొద్దే పోదన్న సంగతి నీకు తెలుసు, నాకు తెలుసు. మరీ ఎంతగా అలిగితే మాత్రం ఇంత పెద్ద శిక్షనా?

నీకో రహస్యం చెప్పనా – నేను పదేళ్ళ క్రితం ఓ అమ్మాయిని ప్రేమించాను. కవితాత్మకంగా ఒక మాట కూడా చెప్పాను. 'చిరునవ్వుల వరమిస్తావా..చితి నుండి లేచొస్తాను, మరు జన్మకు తోడుంటావా..ఇప్పుడే నేను మరణిస్తాను' – అని చెప్పిన వెన్నెలకంటిలా, నేనూ నిన్నూ ప్రేమించాను. కానీ భరించలేని చింతని నాకొదిలేసి నువ్వు వెళ్లిపోయావ్. పాతికేళ్లుగా నీకోసం వెతకని వాడ, చూడని మేడ లేవు. చెరకు తోటల్లో, మోట బావుల్లో ఎన్నాళ్లుగా చూస్తున్నానో తెలుసా.. పక్కింటి ఆంటీ వాళ్ళ నల్ల పిల్లి, ఎదురింటి బాబాయ్ వాళ్ళ పెంపుడు కుందేలు నిన్నేమైనా చేసాయేమో అని ఎంత గొడవ పడ్డానో వాళ్ళతో. నాకేం తెలుసు అవి నీకు మంచి నేస్తాలని. అయినా నా పిచ్చి కాకపోతే నీతో స్నేహం చెయ్యని వారు, నిన్ను చూసి ఆనందించని వారు ఎవరైనా ఉంటారా?

నాకు ఊహ వచ్చిన నాటి నుండీ చూస్తున్నా, నా మిత్రులు వస్తూ పోతూ ఉన్నారు కానీ..నువ్వే కదా నా చిరకాల నేస్తానివి. ఇంటి అధిపతిగా నువ్వెంతో రాజసంగా తిరుగుతుంటే మా ఇంటికి మేమే అతిథుల్లా నీ కనుసన్నల మధ్య బతికేవాళ్లం. నాన్నగారు కూర్చునే పడక కుర్చీని ముట్టుకొనే దమ్ము నీకు తప్ప ఇంట్లో ఎవరికైనా ఉందా చెప్పు. పొడుగాటి ఆ కుర్చీ చేతుల చెక్కల మీద వయ్యారాల సోయగాలతో నువ్వు 'బర్డ్ వాక్' చేస్తుంటే ఎంత ముద్దొచ్చేదానివో ! అంతెందుకు, తాతయ్య పొలం నుండి నీ కోసం లేత జొన్న కంకులు, పాలు పోసుకుంటున్న వరి కంకులు కోసుకొచ్చి చూరుకు వేలాడదీసినప్పుడు, అబ్బో నీకు ఎంత ఆనందమో! ఇల్లంతా ఒకటే సందడి చేసేస్తావ్, అయినా సంవత్సరానికి ఓ నాలుగైదు సార్లు పాల కంకులు కట్టినందుకేమో ఏనుగంబారీ ఎక్కినట్టుగా, తాతయ్య భుజమెక్కి మా అందరి వంకా గర్వంగా ఓ లుక్కేసి, కిచకిచ మంటూ తాతయ్య చుట్టూ తిరిగి నీ కృతజ్ఞతని ప్రదక్షిణగా చేసి చూపేదానివి. నువ్వంటే అమ్మమ్మకి కూడా ఎంత ఇష్టంగా ఉండేదో.

అయినా నువ్వేంటి..రోజూ ధాన్యం పెట్టే నా కంటే నీకు మా తాతయ్య ఎక్కువై పోయాడా. ఎన్నో మార్లు ఇదే విషయం మీద నీతో పోట్లాడేవాడ్ని. అంతా హరికథలా విని మళ్ళీ నాకర్థం కానీ క–భాషలో నీకేదో అర్థమైనట్టుగా చెప్పి తప్పించుకెళ్లిపోయేదానివి. చాటుగా విన్న మా అమ్మమ్మ మాత్రం 'నువ్వు దాన్ని అమితంగా ప్రేమిస్తున్నావురా, అందుకే



అది నిన్ను ఆటపట్టిస్తోంది, మహా గడుసుపిండం అది' – అని అనేది. పైగా 'ఏవండోయ్, మీ మనవరాలొచ్చింది' అని తాతయ్యతో హాస్యాలాడేది. పెరట్లో మామిడి చెట్టుకి ఆకుల కంటే మీ పిచ్చుకలే ఎక్కువగా ఉండేవి. సంక్రాంతికి ఎగరేసే గాలి పటాలతో పోటాపోటీగా మీరే కదా ఎగిరేది. గాలిపటం అంటే గుర్తొచ్చింది.. అప్పుడు మాంజా దారం తగిలి నీ సహ పిచ్చుక చనిపోయింది కదా, అప్పటి నుండీ ఇప్పటి దాకా నేనెప్పుడూ గాలి పటం ఎగరేయలేదు తెలుసా. అప్పడే కదా, నువ్వు నా మీద కోపంతో వెళ్లిపోయిందీ.

అప్పటి నుండీ నీ నవ్వుని వరి కంకుల్లోనూ, నీ రూపాన్ని పసిపాప బోసి నవ్వుల్లోనూ చూస్తూ ఎదిగాను. ముక్కు ముక్కూ తాకించుకుంటూ, రెక్కలూ రెక్కలూ స్పర్శించుకుంటూ నువ్వు నీ సహవాసితో కలిసి చూరు బొంగుల మీద కూచొని చేసే చిలిపి ముద్దుల సరాగాల్ని చూసి నేను ఉడుక్కోవాలనే కదా, అంతలా కవ్విస్తావ్! సిగ్గుల మొగ్గలా నువ్వు సింగారాలు చిందించడం చూసి మనింటి ఆడపిల్లలు కూడా ఇలా సిగ్గు పడితే ఎంత ముచ్చటగా ఉంటుందో అనే మధుర భావనలు నాలో రేగేవి. అయినా నాతో ఆడుకోవడం నీ కెందుకురా అంత సరదా? పాపకెయ్యడానికి పైకి తీసిన డైపర్ మీదికొచ్చి కూచొని సుస్సూ చేసి, అక్కతో నన్ను తిట్టిపించి, నువ్వు కేరింతలతో చక్కర్లు కొడతావ్. మీరు మా సహవాసులనే అనుకున్నా. కానీ, ఎన్ని విధాలుగానో మాతో మీకు పోలికలున్నాయేమో తెలుసా. మా మనుషుల్లో లాగా మీ మగవాళ్ళు కాస్త పెద్దగా ఉంటారు. బూడిద రంగులో ఉండే మీ మగపిచ్చుకలు, గొంతు భాగంలో నలుపుతోనూ, వీపు భాగంలో ఎరుపు–గోధుమ రంగుల మిశ్రమంతోనూ, పొట్ట భాగంలో బూడిద రంగుతోనూ ఉంటారు. ఆడ పిచ్చుకల పొట్ట భాగం బూడిద వర్ణంలోనూ, మిగతా అంతా గోధుమ వర్ణంలోనూ కనిపిస్తుంది.

అరుగు మీద కూర్చొని నేను రాసుకొంటున్నప్పుడు పిట్ట గోడ మీద కూర్చొని నువ్వు చూస్తూ ఉన్నప్పుడు,కర్రతో నన్ను బెదిరించే పంతులయ్యలా కనిపిస్తావ్. ధూళిలో నువ్వు దొర్లుతూ దుమ్మును రెక్కలతో ఒంటిపై పోసుకుంటూ స్నానిస్తున్నప్పుడు విభూతి ఒంటినిండా పూసుకున్న జంగమ దేవరలా కనిపిస్తావ్. అప్పుడప్పుడూ నీళ్లలో ఈదుతూ వెళుతున్నప్పుడు ఆకు మీద తేలే వటపత్రశాయిలా అనిపిస్తావ్. నోట్లోని ఆహారాన్ని పట్టుకొచ్చి నీ పిల్లల నోట్లో పెడుతున్నప్పుడు మాత్రం చచ్చిపోయిన మా అమ్మవే అనిపిస్తావ్.

జంటతో నువ్వున్నప్పుడు అర్ధనారీశ్వర తత్వాన్ని ఆవాహన చేసుకున్న భారతీయ సాంసారిక బంధంలా కనిపిస్తావ్.ఫ్యాషన్ పెరేడ్ లో క్యాట్ వాక్ ఎలా చెయ్యాలో అని వచ్చిన నా చెల్లెలికి నీ బర్డ్ వాక్ చూపించే కదా కప్ గెలిపించాను. ఏదన్నా ముఖ్యమైన సంగతున్నప్పుడు మీరంతా వివిధ కిచ కిచల సంగీత విభావరిని చేస్తారే, ఒక బృంద గానంలా అదెంత బావుంటుందో తెల్సా. యూరప్, ఆసియా ఖండాల్లో ఉండే మీ పూర్వీకులు ఎవరు తీసుకెళితే వాళ్ళతో ఆస్ట్రేలియా,అమెరికా, ఆఫ్రికా దేశాలకి వెళ్లారట కదా, అచ్చు మా మనుషుల్లాగే. ఎక్కడ నాలుగు గింజలు కనిపించినా చాలు అందర్నీ పిలిచి పంచుకు తినే మీ సోషలిజం మా మనుషుల కొస్తే ఎంత బావుంటుందో కదా. వివిధ ప్రాంతాల్లోని మా మనుషుల మాండలికాల్లాగా నువ్వు కూడా వివిధ ప్రాంతాల్లో భిన్న భిన్న కిచ కిచల భాషల్లో మాట్లాడతావటగా, నాకు భలే నచ్చింది అది.

ఎంతైనా నేటివిటీ ముఖ్యం కదా. నువ్వేంటి రెండువేల అడుగుల లోతైన బొగ్గు గనుల్లో కూడా ఆవాసం ఏర్పాటు చేసుకొని హేపీగా ఉంటావట. పాపం మా మనుషులకి ఈ విషయం తెలిసినట్టు లేదు, లేకపోతే ఈ విషయంలో నిన్ను ఆదర్శంగా తీసుకొని ఎప్పుడో గనుల్లో కూడా నివాసం ఏర్పాటు చేసేసుకునేవాళ్ళు. నువ్వు జత కట్టేటప్పుడూ, గూడు కట్టుకునేటప్పుడూ నీ కిచ కిచల భాషని మారుస్తావటగా, దాంట్లో కాస్త రొమాన్స్ చొప్పిస్తావా ఏంటీ ! నీలో నాకు బాగా నచ్చే మరో అంశం చెప్పనా – జీవిత కాలం మొత్తం ఒక్కే ఒక్క భాగస్వామితో కలిసి ఉంటావంటగా...ఏక పత్నీ వ్రతంలాగా. సహజీవనానికి సరికొత్త అర్థం మీ నుండే మేం నేర్చుకోవాలి. మీ మీద పరిశోధన చేసిన డాక్టర్ అంకుల్ మీ గురించి ఇంకా చాలా విషయాలు చెప్పాడు, జనావాసాలే మీకు ఆవాసాలని, రెండు కిలోమీటర్ల దూరం తప్ప ఎక్కువ దూరం వెళ్లడానికి మీరు ఇష్టపడరనీ, ఏప్రిల్ నుంచి ఆగస్ట్ మధ్య గూళ్ళు కట్టుకుంటారనీను. ఈ సారి నువ్వు నా వద్ద

కొచ్చినప్పుడు నీకొక విషయం చెవిలో చెప్పాలి – మీరు ఇంకెప్పుడూ ఫ్యామిలీ ప్లానింగ్ ని పాటించకండి. ఏడాదికి మూడు నాలుగు సార్లు నాలుగైదు గుడ్లు పెట్టి, 15 రోజులు పొదిగి మూడు నాలుగు పిల్లల్ని చేస్తారుకదా. ఇరవై – ఇరవైఐదు రోజుల తర్వాత అవి చిన్నగా ఎగురుతూ గూడు నుండి బయటకు వస్తాయి కదా. నువ్వు మా బంగారు పిచ్చుకవి కదా, అలా నీ సంతతిని వందల నుండి లక్షల్లోకి చేసేయ్. నిన్ను ప్రేమించే నాలాంటి ప్రేమికులెందరమో ఉన్నాం కదా! మేమంతా మీతో మళ్ళీ మళ్ళీ ప్రేమలో పడాలి కదా..మా పిల్లలూ, వాళ్ళ పిల్లల పిల్లలూనూ.

ఒకలాంటి అల్లరి గుణం, మరింత ఆరిందాతనం, కొంత అమాయకత్వం, మరికొంత చిలిపితనంతో నువ్వు చేసే పనులు చూసి ఎవరు మాత్రం నీతో ప్రేమలో పడకుండా ఉంటారు చెప్పు. మా ఇంట్లోని ఏ ఆనందమైనా నువ్వు రెక్కల మీద మోసుకొస్తేనే కదా వచ్చేది. సయ్యాటల పీటలు పరుస్తూ, హర్షపు పందిళ్ళు వేస్తూ, మా మూలాల్లో ఒదిగిపోతూ ఇంటి మూలల్లో తల దాచుకున్నావు. మా కుటుంబంలోనే నిన్ను ఆరో ప్రాణంగా చూసాం. మా పల్లె సంస్కృతికి తొలి పాటగా నిన్ను భావించాం.

అమ్మమ్మ చిన్నప్పుడు మాకో కథ చెప్పింది. అది నీ కథే. కాకపోతే మీ తాతల, ముత్తాతల వాళ్ళ తాతల కథ. ఒక పిచ్చుకల జంట సముద్రపు ఒడ్డున ఉన్న ఒక చెట్టుమీద గూడు కట్టుకొని అన్యోన్యంగా ఉండేవట. ఆ జంటను చూసినప్పుడల్లా సముద్రుడికి ఈర్ష్యగా ఉండేదట. ఎప్పుడవి గుడ్లు పెట్టి పొదగ బోయినా, ఆ చిన్నారి పిచ్చుక గుడ్లని తన కెరటాల చేతులతో ఉవ్వెత్తున ఎగిసిపడి ఆ చెట్టును అతలాకుతలం చేసి ఆ పక్షి గుడ్లని మింగేసేవాడు. రెండు మూడు సార్లు అల్లాగే జరిగింది. ఆ పిచ్చుక జంట కడుపుకోత భరించలేక ఏడవడాన్ని రాక్షానందంతో చూస్తూ సముద్రుడు ఉండేవాడు. అది అర్థమయ్యి పిచ్చుకల జంట ఓ రోజు సముద్రుడిని అడుగుతుంది, దండాలు పెడుతూ ప్రార్థిస్తుంది. అహంకారంతో సముద్రుడు తప్పుని సమర్ధించుకుంటాడే తప్ప ఒప్పుకోడు. దాంతో తీవ్ర వేదనకి లోనైన ఆ పిచ్చుకల జంట, తమ బిడ్డల్ని బలితీసుకుంటున్న సముద్రుడు మీద ధర్మాగ్రహంతో సముద్రంలోని నీళ్ళన్నీ తోడేయాలనుకుంటారు. తమ బుల్లి బుల్లి ముక్కులతో సముద్రం నీటిని తోడుతూ ఉంటారు.

అది చూసి సముద్రుడు వికటాట్టహాసంతో నవ్వుతూ ఉంటాడు. ఇదంతా అటుగా విష్ణుమూర్తిని తీసుకెళుతున్న గరుడుడు చూసి విష్ణుమూర్తికి చెపుతాడు. దివ్యదృష్టితో విషయాన్ని గ్రహించిన విష్ణువు చిన్నారి పిచ్చుకలకి న్యాయం చేద్దామంటూ సముద్రం ఒడ్డున ఆగుతాడు. విష్ణువుని చూసి భయంతో సముద్రుడు సాష్టాంగ పడతాడు. పట్టుకోవాల్సింది తన కాళ్ళు కాదనీ, ఆ పిచ్చుకల కాళ్లనీ, మనతో బ్రతికే సహవాసులను గౌరవించి, ప్రేమించాలి కానీ బలహీనులనే నెపంతో బాధించకూడదు, వేధించకూడదని చెప్పి, సముద్రుడు మింగిన పిచ్చుక గుడ్లను ఇప్పించేస్తాడు. చూశావా పిచ్చుకా! అదీ నీ సంకల్ప బలమంటే. విలువల వలువలు తొడుక్కున్న మా చిన్నారి పిచ్చుకవు నీవు.

ప్రకృతిలో అన్నీ ఉండాలి. పక్షులు, జంతువులు, మనుషులు, పురుగులు, జలచరాలు, భూచరాలు అన్నీనూ. జీవ వైవిధ్యం, సమతుల్యత లేకుండా ఎవ్వరూ మనలేరు. రాతి యుగం నుండీ మాతోనే ఉన్న నువ్వు, మమ్మల్ని ఒంటరివాళ్ళని చేసి అంతమొందించడం ఏమిటి చెప్పు. మా అరచేతిలోని ధాన్యాన్ని అపురావురు మంటూ తినే నువ్వు, ఒక్కసారిగా ఎందుకిలా మాయమైపోయావ్. మేం చేసింది తప్పే. మా పంట పొలాల్లో నువ్వు ఉండగా, పురుగుల్ని ఏరుకొని తింటుండగా రసాయన మందులు వాడకుండా ఉండాల్సింది. కెమికల్స్ తో పిచికారీ చేయకుండా ఉండాల్సింది. మా ఉబుసు పోని, పోసికోలు కబుర్ల కోసం వాడే సెల్ ఫోన్లతో, సెల్ టవర్లతో నీకు 'హెల్' చూపించాం. హై టెన్షన్ వైర్లతో నీకు ఉరి తాళ్ళు బిగించాం.

మితి మీరిన పెట్రోలు ఉత్పత్తుల వాడకంతో నీ జాతి సంఖ్యని తగ్గించాం. నీకు ఉడతల నుండీ, పెద్ద పక్షుల నుండీ ప్రాణ హాని ఉందంటేనే బాధ పడ్డ వాళ్ళం మేము. అలాంటిది మనుషులు తమ లైంగిక సామర్థ్యం పెంచుకోడానికి నీ లేహ్యం తింటారని తెలిసి కన్నీళ్ళ పర్యంతం అవుతున్నాం. నువ్వు నీ ముక్కుతో రంగు రంగుల సీతాకోక చిలకల్ని



పట్టుకు తినడం మాత్రం నాకెందుకో నచ్చలేదు సుమా. మా జనవాసివి అయినా కూడా నీది నూరేళ్ళ బతుకు కాకుండా, పది పదిహేనేళ్లే జీవిత కాలంగా గడుపుతున్నావ్. అది తలచుకుంటే ఎంత దుఃఖంగా ఉంటుందో తెలుసా.

అంతరించిపోతున్న జాతుల జాబితాలో నీ పేరు చూసి ఎంతగా కదిలి పోయానో. మృగ్యమైపోతున్న మానవ అనుబంధాలకి సాక్షివి నువ్వు. జనవాస సామాజిక విలువలికి సాక్షీభూతం నువ్వు. దూరదృష్టిలేని మనుషుల తప్పిదాలే కదా, నీ జాతి అంతరించిపోడానికి కారణమయ్యాయి. ప్రాణప్రదంగా ప్రేమించే నీకంటే మాకేదీ ఎక్కువ కాదు. సెల్ ఫోన్లన్ని తగ్గిస్తాం, సెల్ టవర్లని నియంత్రిస్తాం. మునుపటిలా మా మధ్యకి రావడానికి నీ డిమాండ్లు ఇంకేమున్నాయో చెప్పు.

జనహితమే నీ అభిమతమని, జనావాసమే నీ ఉనికిపట్టని తెలిసినప్పటికీ అజ్ఞానంతో మా ఆత్మ బంధువుని దూరం చేసుకున్నందుకు మేము కుమిలి పోతూనే ఉన్నాం. 25 గ్రాముల..ఇంత చిన్న పిట్టవే అయినా, ఇంత పెద్ద ప్రపంచంలో నువ్వెందుకు పట్టవో అని ఏనాడూ ఆత్మ విమర్శ చేసుకోలేదు. నమ్మి మా నట్టింట్లో కొచ్చిన నిన్ను రక్షిచుకోలేని మమ్మల్ని, రేపటి తరం క్షమిస్తుందా, ప్రకృతి ఉపేక్షిస్తుందా. మేము ఆడుకున్నట్టే మా పిల్లలూ, వారి పిల్లలూ నీతో ఆడుకోవాలి కదా ! సహవసించాలి కదా ! కలిసి హసించాలి కదా ! అందుకే ప్రతిజ్ఞ చేస్తున్నాం – పిచ్చుక మా ఆరో ప్రాణమని, పిచ్చుకల సంరక్షణే మా ధ్యేయమని. రండి..రానున్న వేసవి తాపానికి ప్రతి ఇంట్లో మీకోసం మట్టి మూకుళ్ల నిండా నీళ్ళు పెడతాం. దోసిళ్ల నిండా గింజలతో మీకు స్వాగతం చెప్తాం. మా కాంక్రీట్ జంగిళ్ళ ఆవాసాల్లో మీ గూళ్ళ కోసం చోటు చూపిస్తాం. వస్తారు కదూ...మీకోసం ఒళ్ళంతా కళ్ళు చేసుకొని, పాల కంకుల్ని తోరణాలుగా కట్టుకొని ఎదురు చూస్తుంటాం.

ఇట్లు,

నేను...

నీ 'పిచ్చి'(క) ప్రేమికుడిని

– సైబ పరంధాములు

# ఎన్నికల 'వరం'

ఓ బాలెట్ బాక్సా !

ఎన్నాళ్ళయింది నిన్ను చూసి .. ఉగాది వస్తుంది కాస్త ఇల్లు సర్దాలి అని అమ్మ అంటుంటే అబ్బా మళ్ళీ డస్ట్ ఎలర్జీ తో ఇల్లంతా ఇబ్బంది పడాలి కాబోలు అనుకుని చిరాకు పడ్డాను . కానీ అప్పుడప్పుడు ఇలాంటి బోషాణం పెట్టెలు తవ్వకాల్లో దొరికే లంకె బిందెల్లాగా దొరికి జ్ఞాపకాల తుట్టెను కదిలిస్తాయని తెలిస్తే ముందే సర్దుకునే వాళ్ళం కదా !

అయినా నాన్నగారు ఎలక్షన్స్ లో సూపరింటెండెంట్ గా పనిచేసిన రోజుల్లో ఏదో టెక్నికల్ ప్రాబ్లం వచ్చిందని నిన్నిక్కడ స్కూల్ లో ఉంచేసి వెళ్లారు కానీ లేకపోతే నీ దర్శన భాగ్యం మాకు దొరికేదా చెప్పు? ఏదో చిన్నప్పటి ఆప్త మిత్రుడిని చూసినట్లుగా అనిపించింది తెలుసా నిన్ను చూస్తుంటే ... స్కూల్లో హెడ్ మాస్టర్ గారిని చూస్తే కలిగే భక్తి భావమేదో కల్గింది మనసులో ..

ఎంత మౌన సాక్షివి నువ్వు . ఎన్ని తరాలు మారినా నీ నైజం మాత్రం మార్చుకోకుండా ఎంత నిబద్ధంగా వృత్తి ధర్మాన్ని నిర్వర్తించావో .. 1951-52 లో కదా 489 సీట్లకి గాను పార్లమెంట్ ఎలక్షన్స్ అప్పుడు నిన్ను మొదటి సారిగా ప్రజాస్వామ్య వ్యవస్థ లోకి సాదరంగా ఆహ్వానించాం . అప్పట్లో ఓటర్లు 17 కోట్ల 30 లక్షలే. దాదాపు 2,3 నెలలు ఎన్నికలు నిర్వహించారు . ఇప్పట్లో లాగా ఎలక్ట్రానిక్స్ సాధనాలు అప్పట్లో లేవు కాబట్టి సిబ్బంది కొరత ,మీ రవాణా వ్యయాలు ఇలా ఎన్నింటినో చూసుకుంటూ ఉండాలి కాదా .. ! అయినా నీ ప్రస్థానం ఎంత గొప్పది బ్యాలెట్ బాక్స్ ... !

ప్రపంచ వ్యాప్తం గా చూస్తే సీక్రెట్ గా ప్రజాస్వామ్య యుతంగా ప్రజల అభీష్టాన్ని తెలుసుకోవటానికి మొదటి సారి 1872 ఆగష్టు 15 న బ్రిటన్ లో కదా నిన్ను వాడారు . దానికోసం ఒక యాక్ట్ ని కూడా తయారు చేశారనుకుంటాను . దాన్ని బ్యాలెట్ యాక్ట్ అన్నారు . అయినా ఎన్నెన్ని రూపాల్లో నిన్ను చూసామో తెలుసా .. కుండలు ..కార్డు బోర్డు .. ఉడెన్ ..ప్లాస్టిక్ .. మెటల్ .. అద్దాలు .. ఇనుము ఇలా ఎన్నెన్ని రకాలుగా రూపాంతరం చెందారో కదా .. తిజోరీ పెట్టె లాగా ఉండి భలే గమ్మత్తుగా ఉండే వాళ్ళు మీరు.

గ్రామ వార్డ్ మెంబర్ నుండి దేశ ప్రధానమంత్రి వరకు అందరి జాతకాలని ,భవిష్యత్ ని నిర్ధారించేది మీరే కదా! నాకు చిన్నప్పుడు నువ్వంటే గొప్ప ఆకర్షణ . పెద్ద వాళ్లంతా రకరకాల వస్త్రధారణతో కలర్ ఫుల్ గా ఏదో వేడుకకు వెళుతున్నట్టుగా సందడిగా ఓటు వెయ్యటానికి వెళ్లేవారు . దేశం మొత్తానికి ఇదొక కామన్ పండుగ కదా . అంతా ఉత్సాహంగా కలిసి మెలిసి పోలింగ్ కేంద్రాల దగ్గరకి వెళ్లేవారు. నేనెప్పుడు పెద్దవాడిని అవుతానా ఎప్పుడెప్పుడు ఓటు వేస్తానా అని ఎదురు చూసేవాడిని . నెలరోజుల పాటు ఊదర గొట్టిన మైకులు ,ఇంటింటికి చెప్పులు అరిగేలా తిరిగిన అభ్యర్థులు-వారి అనుయాయులు ఎన్నికల రోజు కంటే ముందే నిశ్శబ్దమై పోతారు...బడి పంతులు గారి ముందు కూర్చున్న పిల్లలాగా ... నీ పట్ల ప్రజాస్వామ్యానికి ఉన్న గౌరవానికి తార్కాణం అది. ఉదయం నుండి సాయంత్రం వరకూ

నిర్ణీత గడువు లోగా క్యూ లో నిలబడి తమ రహస్య అంగీకారాన్ని బ్యాలెట్ పేపర్ మీద గుద్ది, సిరా చుక్క వేలిమీద పెట్టించు కుని దర్జాగా బయటకి వచ్చేవారు. మన దేశాన్ని పాలించే పాలకులను ఎన్నుకుంటున్నామన్న గర్వం వాళ్ళ మొహాల్లో కనిపిచ్చేది .

మా నాన్న లాంటి ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగులు వాటన్నింటినీ సీల్ చేసి కట్టు దిట్టమైన భద్రతల మధ్య స్ట్రాంగ్ రూమ్ కి తరలించేవారు. తీవ్రవాద ప్రాంతాల్లో అయితే సిబ్బందికి కంటిమీద కునుకు ఉండదు. ప్రతిక్షణం టెన్షన్ . బుల్లెట్ కంటే బ్యాలెట్ గొప్పదనే కదా నిన్ను మేము పూజిస్తున్నది . కొందరు ఇబ్బంది పెట్టినా సిద్ధాంత పరమైన వైరుధ్యమే తప్ప నీ మీద ఆగ్రహం కాదు కదా. నీకోసం ప్రాణాలు పోగొట్టుకోవటానికి సిద్ధమే కానీ నిన్ను మాత్రం ఎప్పుడూ అప్పగించలేదు తెలుసా..

ఎంత గొప్ప చరిత్ర నీది .. తెలుసు కున్న కొద్దీ ఆనందం .. ఆశ్చర్యం కలుగు తున్నాయి. వేద కాలం నుండి ఈ గణన ఉండేదట .. వేదాల్లో గణ రాజ్యాలు గుర్తున్నాయా .. వాటిల్లో రాజుని ఎన్నుకోవటం ప్రజల అభీష్టం మేరకు జరిగేది. ఆ తర్వాత అది వంశ పారంపర్యంగా మారింది. అధికారికం గా మాత్రం రాజు ఎంపిక భారత దేశంలో మొదటి సారి క్రీస్తు శకం 750 లో జరిగింది . పాల వంశానికి చెందిన గోపాల అనే రాజు ప్రజల చేత ఎనుకోబడ్డ రాజు గా ప్రకటింప బడ్డాడు. 9 వ శతాబ్దం లో ప్రస్తుత తమిళనాడు ప్రాంత చోళ చక్ర వర్తుల కాలం లో గ్రామాల్లో ఎన్నికల ద్వారా ప్రతినిధులను ఎంపిక చేసుకునే వారు . అప్పట్లో రాగి ఆకుల మీద అభ్యర్థుల పేర్లు రాసి బట్ట తో మూసివేసిన కుండలో వేసేవారట.

అంత క్రితం మూజు వాణి ఓటింగ్ అంటే చేతులు ఎత్తి తమ అభీష్టాన్ని తెలియ చేసేవారు. ఆ తర్వాత అభ్యర్థిని బలపరిచే వారంతా ఒక చోట చేరే వారట.వీరి గణన ప్రత్యర్థి గణన కంటే ఎక్కువగా ఉంటే వారిని ఎన్నుకున్నట్టుగా ప్రకటించే వారట . అటు తర్వాత వచ్చిందే నువ్వు కదా. అసలు ప్రజాస్వామ్య సమ్మతికి అవతారం నువ్వే కదా.అత్యంత రహస్యంగా మనం ఎవరిని బలపరిచామో ఎవ్వరికీ తెలిసే అవకాశం లేకుండా జరిగే ఎన్నికలు ఇవి.ప్రజల చేత..ప్రజల వలన..ప్రజల కొరకు అని అబ్రహం లింకన్ ఏ క్షణం లో చెప్పాడో కానీ నువ్వు ప్రజల సేవకే అంకితమై వారి సేవలోనే జీవితాన్ని అంకితం చేసిన అత్యంత విశ్వసనీయ నేస్తానివి నువ్వు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా..ఎన్నెన్ని పరిణామాలు జరిగినా ప్రజాస్వామ్య విధానం పట్ల మా నమ్మకాన్ని నిలబెట్టిన మా ఆత్మ బంధువు నువ్వు.

నీ చరిత్ర అంతా మానవ వికాసం తోనేగా ముడివడి ఉంది. క్రీస్తు పూర్వమే 508 లో ఏథెన్స్ లో ప్రజాస్వామ్యం ఉండేదంటానికి ఆధారాలున్నాయి. రోమ్ లో కూడా ప్రజల చేత ఎంపికలు ఉండేవని పుస్తకాల్లో ఉంది. ప్లేటో తన రిపబ్లిక్ అనే గ్రంథంలో రాజ్య పాలనా విధానాన్ని రాసాడంటే మనం అర్థం చేసుకోవాలి. అనాదినుండి పాలనాపరమైన అంశాలపట్ల ఎంత పరిశీలన ఉందో గమనించాలి. 13 వ శతాబ్దం లో ఇటలీ లోని వెనిస్ నగరంలో నగర పాలన కోసం 40 మందిని ఎన్నుకున్నారట. అసలు democracy అన్న పదమే అప్పట్లోదే కదా.. demos..krasia అన్న రెండు పదాలు కలిస్తేనేగా 'డెమోక్రసీ' అన్న పదం పుట్టింది. ..డెమోస్ అంటే గ్రీకు లో ప్రజలు అని అర్థము . క్రసియస్ అంటే పాలన అని అర్థం.

నిజం చెప్పాలి అంటే భారత దేశంలో క్రీస్తు పూర్వమే షోడశ మహాజన పదాలు అనే 16 గణ రాజ్యాలు ఉండేవి. మా తాతయ్య చెప్పే కథల్లో వాటిల్లోని మగధ సామ్రాజ్యం లో ప్రజా ప్రతినిధులను ఎన్నిక విధానం ద్వారానే ఎంపిక చేసేవారట . వ్యాపార రంగం లో విరివిగా వాడే శ్రేణి ఎంపిక ను ఇలా విశిష్టంగా చేసేవారట. అలాగే 12 వ శతాబ్దం లో కూడా ప్రపంచంలో మొట్టమొదటి సారిగా కర్ణాటక ప్రాంతంలో బసవేశ్వరుడు ప్రాథమిక స్థాయి పార్లమెంట్ ను రూపొందించాడు అని చారిత్రిక ఆధారాలు ఉన్నాయి. సమాజం లోని అన్ని వర్గాలు..ప్రాంతాలు .వృత్తులకు సంబంధించిన వ్యక్తులను సభ్యులుగా నియమించి వారి సలహాలు, సూచనలు తీసుకుని పాలన నడిపే ఒక కొత్త వ్యవస్థ

కు శ్రీకారం చుట్టిన వారు మాత్రం బసవేశ్వరుడు. ..అందుకే ఆయన రూపొందించిన అనుభవ మండపాన్ని పార్లమెంట్ కి తొలి మాతృక అని చారిత్రిక విశ్లేషకులు చెపుతున్నారు .నీకు ఓ నిజం తెలుసా – బ్రిటన్ పార్లమెంట్ ని ప్రపంచం మొత్తం అనుసరిస్తుంది..అందుకే దాన్ని మదర్ ఆఫ్ పార్లమెంట్ అంటారు .కానీ గొప్ప సత్యమేమిటంటే ..బ్రిటన్ పార్లమెంట్ రూపకల్పనలో మోడల్ గా తీసుకుంది ఈ అనుభవ మండపాన్నే. మనం ఎంత గర్వపడాలో కదా..

మన ప్రజాకవి కాళోజీ గారు గుర్తున్నారు కదా నీకు.
''అభ్యర్ధి ఏ పార్టీవాడన్నది కాదు, ఏ పాటివాడో చూడు.
ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు, ఇప్పటిదాకా ఏం చేశాడో చూడు.
పెట్టుకొనే టోపీలు కాదు, పెట్టిన టోపీ చూడు.''

ఎంత బావుందో కదా, అచ్చం నువ్వు ఆలోచించినట్టే. నువ్వంతే కదా. ''నేను ప్రస్తుతాన్ని, గతానికి శిఖరాన్ని. వర్తమానాన్ని–భావికి నేనే ఆధారాన్ని'' అన్నట్టుగా ప్రవర్తిస్తావు కదా. నీ కడుపులోకి వెళ్ళిన ఏ రహస్యమైనా బయటకు పొక్కిందా చెప్పు .అందుకే కదా మనుషుల నోట్లో నువ్వు గింజ కూడా నానదని, మరవైనా మనసున్న దానివని నిన్ను ఎన్నుకున్నారు ఎన్నికల కోసం.

నీకు గుర్తున్నారా రావి నారాయణరెడ్డి గారు..ఆ..ఆ..అదే ఆ నల్గొండ పార్లమెంట్ సభ్యులు రావి నారాయణ రెడ్డి గారే. 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో దేశం మొత్తం మీద అత్యధిక మెజారిటీని సాధించి తెలుగోడి గొప్పదనాన్ని జాతి పతాకలా ఎగరేసిన విలువలున్న నాయకుడు. తన ప్రత్యర్ధి మీద 2,72,280 ఓట్ల భారీ ఆధిక్యతతో గెలుపొంది తిరుగులేని ప్రజాభీష్టాన్ని దేశ రాజధాని దాకా తీసుకెళ్లారు. నెహ్రూ గారు ఈ విషయం తెలుసుకొని ఆశ్చర్యపడి పార్లమెంట్ లో తొలి అడుగు వారినే వెయ్యాల్సిందిగా ఆహ్వానించారు. సగౌరవమైన ఆ ఆహ్వానాన్ని అందుకొని రావి నారాయణరెడ్డి గారు పార్లమెంట్ లో తొలి అడుగు పెట్టిన పార్లమెంటేరియన్ గా కొత్త చరిత్రను సృష్టించారు.

2014 సార్వత్రిక ఎన్నికలప్పుడు 1200 కోట్ల ధన, వస్తు సామగ్రిని ఎలక్షన్ కమీషన్ స్వాధీనపర్చుకుంది. పంజాబ్ లో 700 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు పట్టుబడాయి. 124 కోట్ల డబ్బు రెండు తెలుగు రాష్ట్రాల్లో పట్టుబడడం ఈ సందర్భంగా గమనించాల్సిన విషయం.

బ్యాలెట్ బాక్సా, వ్యాలెట్ కి ఎంత విలువుందో బ్యాలెట్ గా నీకూ అంతా ప్రాధాన్యత వుంది. కాకపోతే వ్యాలెట్ ఆర్థిక స్థాయిని చూపిస్తే బ్యాలెట్ గా నువ్వు పాలనా పరిపుష్టిని, రాజకీయ అధికారాన్ని చూపిస్తావు. ప్రజాభీష్టాన్ని ఎరుక పరిచే నీ కంటే ఎవరు మాకు ఆదర్శం. నిన్ను బట్టే కదా సెన్సెక్స్ సూచిక అటుగా గానీ ఇటుగా గానీ దూకుతూ ఉంటుంది. ఇప్పుడు 545 పార్లమెంట్ సీట్లు, దాదాపు 90 కోట్ల ఓటర్లు. ఇప్పుడు జరగబోయే ఎన్నికల పండుగ అందరికీ అత్యంత ప్రముఖమైంది. మారుతున్న ప్రపంచ పోకడలతో భారతదేశం వేగంగా పురోభివృద్ధిని సాధిస్తున్న దశలో ఈ ఎన్నికలు అత్యంత కీలకమైనవి. నీ తర్వాత తరమే EVM ల పాత్ర – ఇప్పుడు ఎంతో ప్రముఖమైంది, ప్రామాణికమైంది కూడా.

బ్యాలెట్ బాక్స్ ! నీకు గుర్తుందా..మన పండగొచ్చిందంటే చాలు..ఓటు కోసం ప్రతినిధులు ముసలివాళ్ళకు రిక్షాలు పంపేవాళ్లు. మందు బాబులకు మందు పోసేవారు. డబ్బాస చూపేవారు. ఎన్ని చేసినా ప్రజలకు తెలియదా.. దేనికీ లొంగకూడదని, ఓటుని అమ్ముకుంటే అమ్మను అమ్ముకున్నట్టేనని. ఏ ప్రలోభాలకు మనం లొంగుతామో అప్పుడు ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతుంది. మనకి డబ్బులిచ్చి ఓటుకొనుక్కున్నవాళ్లు మనల్ని డబ్బులికి అమ్మేస్తారు. ఓటుని లాభాలతో కొలిచేవాళ్లు, ఓటుకి డబ్బులు అందించేవాళ్లు ప్రతినిధులు కాదు, సరికదా ప్రతినాయకులు అవుతారని నువ్వు కదా మాకు నేర్పించావు.

నీకు ఓటు వేస్తున్నప్పుడు నాకు నా గల్ల గురిగి జ్ఞాపకం వచ్చేది. డబ్బులు దాచుకోడానికి మా నాన్న నాకా గల్ల

గురిగి కొనిచ్చినప్పుడు కూడా నేనంతే ఆనందపడ్డాను. పావలా, అర్ధ రూపాయి దాచుకొని జాగ్రతగా, అపురూపంగా దాంట్లో వేసేవాడిని. అలాగే నా ఓటుని నీ పొట్టలో దాచుకోమని నీకు అందించినప్పుడు ఎందుకో బెంగగా అనిపించేది. మళ్ళీ అయిదేళ్ల దాకా నిన్ను చూళ్ళేనే అనిపించేది. అయిదేళ్లకొకసారి వచ్చే ఈ ఎన్నికల పండగప్పుడు నువ్వు నాకెన్నో రూపాల్లో కనిపిస్తావు. అందరూ నీకు మొక్కి నీకు తమ ఓటుని అందిస్తున్నప్పుడు గౌరమ్మని వాయనం ఇచ్చి నమస్కారం చేస్తున్నట్టుగా అనిపించేది. నీ చుట్టూ తిరిగి తెరలు కట్టిన మధ్య హాల్లో ప్రదక్షిణగా వెళ్ళి సిరా చుక్క పెట్టించుకుని నీకు ఓటు అందిస్తున్నప్పుడు బతుకమ్మ ఆట గుర్తొచ్చేది. అన్ని ప్రదక్షిణలు చేసిన సార్ధకత దొరికినట్టుగా అనిపించేది. సాయంకాలానికి నిన్ను నెత్తి మీద పెట్టుకొని అధికారులు వ్యానుల్లోకి భద్రంగా మారుస్తున్నప్పుడు నువ్వు నాకు 'బోనం'లాగా అనిపిస్తావు. అమ్మవారికి బోనాన్ని ఆషాఢంలో సమర్పించినట్టు ప్రజాస్వామ్యంలో అయిదేళ్లకొకసారి ప్రతి ఓటరు సమర్పించే ఓట్లు బోనాలుగా అనిపిస్తాయి.

నువ్వే ఓ చిత్రానివి. అయితే నీ మీద ఓ చిత్ర నిర్మాణం జరగటం విచిత్రం కదా. తీవ్రవాద ప్రాబల్యం ఉన్న ఊర్లో నిన్ను రక్షించుకుంటూ ఓ అధికారి ఎన్ని ప్రయత్నాలు చేసారో తెలియచెప్తూ తీసిన 'న్యూటన్' అనే సినిమా భారతదేశ అధికారిక ఎంట్రీగా ఆస్కార్ కి నామినేట్ అవటం, అది నువ్వు మాకు చేసిన నిరంతర సేవలకి దక్కిన గౌరవంగా, గుర్తింపుగా మేము భావిస్తున్నాము.

బ్యాలెట్ బాక్స్ ... గతమెప్పుడూ నాస్తి కాదు అది అనుభవాల ఆస్తి. అందమైన అనుభూతుల జాస్తి. ఎన్ని కాలాలు మారినా కల కాలం మనగలిగేది విశ్వసనీయత ఒక్కటే. అది నువ్వు పొందగలిగావు.

భారతదేశంలో అమలులో ఉన్నది సార్వత్రిక వయోజన ఓటింగ్ విధానం కాబట్టి ఎన్నికయ్యే ప్రతినిధులే కాదు, ఓటరుల నిజాయితీని పదిలంగా కాపాడుకోవలసిన బాధ్యత మనందరిదీ.

ఎన్నికలంటే ధనస్వామ్య దందా కాదని, ప్రజాస్వామ్య శక్తికి, ప్రజల అభీష్ట వృద్ధికి సంకేతమనే దిశగా నువ్వు ప్రయత్నం చేసావు. ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదలిక అయినట్టుగా ఒక్కొక్క ప్రజాప్రతినిధి ఎంపిక దేశపు ఒక్కొక్క ప్రగతి మెట్టుగా మనం భావించాలి. బ్యాలెట్ ప్రజాభిప్రాయాన్ని మోసుకెళ్ళే రాకెట్, ప్రజాస్వామ్యాన్ని రక్షించే బుల్లెట్.

We miss you బ్యాలెట్ బాక్స్ – ఎందుకనో నా మనోగతాన్ని నీతో పంచుకుంటుంటే మనసుకెంతో తేలికగా అనిపిస్తుంది. కొత్తవి ఎన్ని వచ్చినా మా పాత తరానికి నువ్వేగా ఆప్తురాలివి. తరాలు మారి నాకు మనవళ్ళొచ్చారు. నీ తర్వాత నీ తర్వాతి తరం EVM లొచ్చాయి. మార్పుని ఆహ్వానిద్దాం. మనసారా ఆశీర్వదిద్దాం. నీతో మా అనుభవాలు గొప్పవి. నీ నిబద్ధమైన బాధ్యతాతత్వం మాకెప్పటికీ శిరోధార్యమే. పద, ఎన్నికల సందడిని గమనిద్దాం. అవకతవకల్ని సరిదిద్దే బాధ్యత ఎన్నికల సంఘానిది మాత్రమే కాదు, ఓటు వేసే ప్రతి ఓటరుది కూడా. ఎక్కడన్నా తేడా కనిపించినా, అవకతవకలు అనిపించినా వెంటనే EC కి రిపోర్ట్ చేద్దాం. భారతీయ పౌరుడిగా మన దేశాన్ని నడిపించే నిజాయితీ గల నాయకుల్ని ఎన్నికయ్యేలా చూద్దాం. ఉండనా మరి...

నీ

అభిమాన ఓటరు

– జయకృష్ణ

# కాలం!

కాలమా !

కావ్య సృష్టికి, కళా దృష్టికి, ఋతువుల గోష్టికి, మోహ వృష్టికి, ఉద్వేగ పుష్టికి, మానవతా పరిపుష్టికి, విశ్వజనీన భావాల సంతుష్టికి ఆది గురువువి నువ్వే కదా ! తొలి పాదం నీదే కదా !

అరవై గడుల రంగుల రాట్నం ఎక్కి ఊరేగుతూ వుండే నీకు, నిమిషాల, గంటల ముళ్లతో పాటు నిరంతరం చరిస్తూ, సంచరిస్తూ వుండే నీకు, మా వినతులు చేరుతున్నాయా ? మా నివేదనలు..సంవేదనలు అందుతున్నాయా ? కాలాన్ని తీసుకొచ్చి రాటకేసి కట్టేస్తాను – అన్న ఆరుద్ర 'త్వమేవాహమ్' కావ్యాన్ని పుక్కిట పట్టినా మాకెందుకు ఆ ధైర్యం రావటం లేదు, అధైర్యం వీడడం లేదు?

ఎన్నో పురాణ కథలు చదివాం, సైన్స్ ని అధ్యయనం చేశాం. అయినా నిన్ను జయించడానికి మా మేధ సరిపోవడం లేదు. నిన్ను పట్టుకోవడానికి మా నైపుణ్యం అందటం లేదు. ఏ టైం మిషన్ ఎక్కితే నిన్ను చేరతామో... ఏ రాకెట్ ను కనిపెడితే నీతో పాటూ గమిస్తామో అర్థం కావడం లేదు. అందుకే మనిషిని మాత్రమే కాదు, ఈ యావత్తు సృష్టిని నడిపిస్తున్న నీకు దాసోహం అంటున్నాం..పాదాభివందనం చేస్తున్నాం..కాస్త కన్నెర్ర చేయక మా వినతిని కాస్త అనుగ్రహంతో వినవా...

మేం మనుషులం ... ప్రతి దాన్నీ నిర్వచించి, మా అవగాహన మేరకు ఏదో ఓ ఫ్రేమ్ లో ఒదిగించాలని ప్రయత్నం చేస్తాం. అదే మా తెలివి అనుకుంటున్నాం. ఈ ప్రపంచానికి, ప్రపంచ గమనానికి ఒక అర్థాన్నివ్వగలుగుతున్నామని మాకు మేము శభాష్ అనుకుంటున్నాం. మా అవగాహనా సౌలభ్యం కోసం భూగోళం మీది ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా కాలాన్ని లెక్కించే ప్రయత్నం చేసాం. కాలాన్ని కొలిచే ప్రమాణాల్ని నిర్ధారించుకున్నాం. అలా నిన్ను క్రీస్తు పూర్వం, క్రీస్తు శకాలుగా విభజించుకున్నాం. క్రీ.శ. 78 నుంచి శక సంవత్సరంగా పూజించుకున్నాం. రోమన్ చక్రవర్తి జూలియస్ సీజర్ క్రీ.పూ. 46 లో రోమన్ క్యాలెండర్ ని తయారు చేసినట్టు ఆధారాలున్నాయి. అయితే కాలమా, పాశ్చాత్యులు కూడా లేట్ గా నైనా లేటెస్ట్ గా నిన్ను గణించే ప్రయత్నం చేసారు కదా... గ్రిగోరియన్ పోప్ గ్రిగరి పరిచయం చేసిన గ్రిగోరియన్ క్యాలెండర్ క్రీ.శ. 1582 నుండి అందుబాటులోకి వచ్చింది. ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒక లీప్ సంవత్సరాన్ని కనిపెట్టి కాల గణనని సర్దింది అతనే. 365.25 ని నమోదు చేసి లీప్ ఇయర్ గా ప్రకటించింది అప్పుడే.

కాలమా... నా చిరంతన నేస్తమా... మా ప్రాచీన భారతీయులు కూడా నిన్ను ఒడిసి పట్టాలని, నీ గమనాన్ని గణించాలని, నీ గుణాలని వర్ణించాలని ప్రయత్నం చేసారు కదా.. మా పూర్వీకుడు వరాహమిహిరుడు 'బృహత్ సంహిత' ద్వారా ఖగోళ శాస్త్ర విశేషాలను, ఖగోళ గణితాన్ని ప్రపంచానికి చాటి చెప్పాడు కదా... తొలి భారతీయుడిగా



కాలగణన చేసి – గణాంకాలు వివరించిన మేధ అతని సొంతమే కదా... ఆ లెక్కన నీ విశ్వరూపాన్ని కీర్తించింది మా భారతీయుడే కదా....!

పంచ సిద్ధాంతం అంటే – సూర్య, వశిష్ఠ, పౌలిస, రోమక, పైత సిద్ధాంతాలను గుర్తించటం గమనించదగ్గ విశేషమే. కాలమా ! ఒక ఫలంలో ఉండే విత్తనాలను మా లాంటి సాధారణ వ్యక్తులు గుర్తిస్తారు..కానీ ఆ విత్తనం చూసి రేపు ఎన్ని ఫలాల్ని అందిస్తుందో చెప్పగలిగిన వాడే కదా మేధావి – వీరంతా ఆ కోవకు చెందిన వివేకవంతులే కదా.

జియలాజికల్ టైమ్స్ స్కేల్ ప్రకారం భూమి వయస్సుకి, కాల మానానికి సంబంధించిన శాస్త్రబద్ధమైన పరిశోధనలో భౌమ కాల మానాన్ని కాంబ్రియన్, ప్రీ కాంబ్రియన్, ఐస్ ఏజ్ లు, మెసోజాయిక్, పాలియో జాయిక్ యుగాలుగా వర్ణించారు. ఇప్పుడు అంతరించిపోయిన భారీ డైనోసార్లు, ఇతర సరీసృపాలు అన్నీ, మిలియన్ సంవత్సరాల క్రితం మెసోజాయిక్ యుగంలోనే ఈ భూమి మీద సంచరించాయని వెల్లడయింది కదా... పాశ్చాత్యులు గ్రిగోరియన్ క్యాలెండర్ ని పాటించినా, భారతీయులు శక సంవత్సరాలను అనుసరించినా, ముస్లిం సోదరులు క్రీ.శ. 622 నుండి ఇస్లాం హిజ్రా శకంగా భావించినా (మహమ్మద్ ప్రవక్త మదీనా నుండి వెళ్ళిన సంవత్సరం నుండే కదా కాలగమనం మొదలైంది) అందరూ నిన్ను అనుసరించి వారి వారి మత విశ్వాసాల ప్రకారం గణించినవారే, నిన్ను పూజించిన వారే.

సృష్టి ప్రారంభమై 28 మహా యుగాలు గడిచిపోయాయంటారు హిందువులు. ఒక మహా యుగమంటే కృత, త్రేత, ద్వాపర, కలి యుగాలు కలిస్తే అవుతుంది. హిందూ పురాణాల ప్రకారం కృత యుగం 17 లక్షల 25 వేల సంవత్సరాలు. ఆ రోజుల్లో ధర్మం నాలుగు పాదాలతో నడిచిందని, మనిషి జీవిత కాలం లక్ష సంవత్సరాలని తేల్చారు. త్రేతా యుగం 12 లక్షల 96 వేల సంవత్సరాలు. అప్పుడు ధర్మం మూడు పాదాలతో నడిచిందని, మనిషి జీవిత కాలం 10 వేల సంవత్సరాలని చెప్పారు. ఇక ద్వాపర యుగం 8 లక్షల 64 వేల సంవత్సరాలు. మనిషి జీవిత కాలం 1000 సంవత్సరాలని, ధర్మం 2 పాదాలతో నడిచిందని అన్నారు. ఇక కలి యుగానికొచ్చేసరికి దాని సమయం 4 లక్షల 30 వేల సంవత్సరాలని, మనిషి ఆయుష్షు వంద సంవత్సరాలని, ధర్మం ఒంటికాలితో గెంతుతూ ఉందని చెప్తున్నారు.

మన భారతీయ కాల గణనకి ఒక ప్రాతిపదిక ఉంది, ఒక సిద్ధాంతం ఉంది, కొన్ని లక్షణాలు ఉన్నాయి. ప్రతి యుగానికీ ఒక మహా ధర్మం కూడా ఉంది. అధర్మం పెచ్చు పెరిగినప్పుడు యుగాంతం అన్నది ఇతిహాసాల సారాంశం.

కాలామా ! ప్రాచీన మెక్సికో ప్రాంతంలోని మాయా నాగరికత ప్రకారం, వారు నిర్ధారించిన క్యాలెండర్ ప్రకారం 2012వ సంవత్సరం యుగాంతమని ప్రపంచం భయపడ్డ సంగతి నీకిక్కడ గుర్తు చేస్తున్నాను. ఏ వస్తువునైనా పొడవు, వెడల్పు, ఎత్తు లేదా లోతు లతో కొలుస్తాము కదా. కానీ ఈ త్రీ డైమన్షన్స్ మాత్రమే కాకుండా కాలాన్ని ఫోర్త్ డైమన్షన్ గా భావిస్తాం. గ్రహాల మధ్య దూరాన్ని కాంతి సంవత్సరాలుగా లెక్కిస్తాం. ఐన్ స్టీన్ శక్తి నిత్యత్వ సూత్రం E=Mc2 ప్రకారంగా శక్తిని కొత్తగా సృష్టించలేము, నాశనం చేయలేము అనే భౌతిక సూత్రాన్ని తయారు చేసుకున్నాం. నీతో పయనించగలిగితే మరెన్నో వినూత్న ఆవిష్కరణలు సాధిస్తామన్న ఆశతో ఇంకా వెంపర్లాడుతూనే ఉన్నాం.

ఆ ఊహాలోంచే, ఆ ఆకాంక్షలోంచే అద్భుతమైన కాల్పనిక సాహిత్యాన్ని మేం సృష్టించుకున్నాం. H.G. వెల్స్ అనే ఓ సృజనశీలి 'Time Machine' అనే పేరుతో ఓ నవలనే రాసాడు. వేలాది సంవత్సరాల నుంచి మనిషిలో నిద్రాణంగా ఉన్న ప్రగాఢ కోరిక భవిష్యత్తులోకి ప్రయాణించాలనేది.. అలాగే అవసరమైతే గతంలోకి కూడా వెనక్కి వెళ్లాలనేది.. ఈ ఆశను ఆసరా చేసుకొని ఈ నవలను రాసాడు. ఇలాంటి Back to Future అనే కాన్సెప్ట్ తోనే ఎన్నెన్నో సినిమాలను కూడా తీసారు. తెలుగులో సైతం 'ఆదిత్య 369' పేరుతో ఓ సినిమాను తీసారు.

ఇవన్నీ సరదాగా, వినోదంగా అనిపిస్తాయి. కానీ, ఈ కాల్పనిక సృజనల వెనుక ఉన్న ఒకే ఒక్క కోరిక ఏంటో తెలుసా ? కాలమా, నిన్ను మనోవాంఛలకు అనుగుణంగా మలుచుకోవాలనే తాపత్రయమే ! విశ్వవ్యాప్త బ్రహ్మాండ

రూపమైన నిన్ను అర్థం చేసుకోవాలనే... నీ లీలలను, నీ మహిమలను, నీ గమనానికి మాకు తెల్సిన పరిధిలో విశ్లేషణ చేయాలనే... !

అయినా నిన్ను దోసిటలో పట్టటమో, జటాజూటంలో బంధించడమో, సంచిలో భద్రపరచడమో సాధ్యమయ్యే పనేనా... ఈ అనంత మహా విశ్వంలో మమ్మలనందరినీ వేలు పట్టి తీస్కెళ్తున్నది నువ్వే కదా... ఈ వేలాది సౌరకుటుంబాల నిత్య ప్రవాహంలో మమ్మల్ని కూడా భాగస్వాములను చేస్తున్నది నువ్వే కదా... ఒక్క మాటలో చెప్పాలంటే, కాలమా, నీలో మేమున్నాము కానీ...మమ్మల్ని బట్టి నీవు లేవు కదా... అందుకే నిన్ను, నీ విశాలత్వాన్ని తలచుకుంటున్నప్పుడల్లా మాలోని అల్పత్వం, మాలోని అజ్ఞానం మాకు గుర్తుకు వస్తుంది... అయినప్పటికీ తరతరాలనుంచీ, శతాబ్దాల కాలం నుంచీ మేం నిన్ను లెక్కించే ప్రయత్నం చేస్తూనే ఉన్నాం...

సాధారణ లెక్కల్లో కోటి వరకే మాకు తెలుసు. సహస్ర కోటి, న్యార్బుదం, ఖర్వం, మహా ఖర్వం, పద్మం, మహా పద్మం, క్షోణి, మహా క్షోణి, శంఖం, మహా శంఖం, క్షితి, మహా క్షితి, క్షోభం, నిధి, మహా నిధి, పరాటం, పరార్థం, అనంతం, సాగరం, అవ్యయం, అమృతం, అచింత్యమ్, అమేయం, భూరి, మహా భూరి, ఇలా 1 తర్వాత 36 సున్నాల వరకూ మనం గణన చెయ్యగలిగేలా భారతీయ శాస్త్రాలు నిర్దేశించాయి. పురాణ కాలంలోనే మా మనుషులు ఎంతగానో నిన్ను కనుగొనే ప్రయత్నం చేసారు కదా... ఇలా నిన్ను అన్వేషించే క్రమంలో మేం ఇంకా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాం. తెలుసుకున్న గోరంతకే సంబరపడుతూ తెల్సుకోవాల్సిన కొండంత జ్ఞానం కోసం పరిశోధనలు చేస్తూనే ఉన్నాం. ఇన్నేళ్ల పరిశీలనలు,ప్రయోగాలు,పరిశోధనల్లో ఒక్కటి మాత్రం ఖచ్చితంగా తెల్సుకున్నాం. కాలమా...నువ్వు ఆదిమధ్యాంతాలు లేని నిత్య చైతన్యానివని నిరంతర దేదీప్యజ్వాలవని... నిజమే కదా!

సరే, అదలా ఉంచు... కాలమా ! నువ్వేంటీ మా ప్రకృతి కన్యను ప్రేమిస్తావటా.. ఎప్పటి కప్పుడు కొత్త హంగులు, రంగులు పులుముతావట కదా – హేమంతంలో చలి దుప్పట్లు పరుస్తావట, చామంతులతో నీ సహచరి ప్రకృతిని అలంకరిస్తావట. వసంతంలో చిగురుటాకుల ఉయ్యాలలో కోయిలను కూర్చోబెట్టి, ఆకుల హార్మోనియం మెట్లను మీటుతూ సంగీత విభావరులతో ఆనందింప చేస్తావట. వర్ష రుతువులో చెరువుల్లో చిందు యక్ష గానాలతో అలరిస్తావట. శిశిర రుతువులో ఆకులన్నీ రాల్చేసి కొత్త చీర నేయడానికి ఉపక్రమిస్తావట. శరదృతువులో నీలి మేఘాల మాలలతో ప్రకృతి కన్యను పులకింపచేస్తావట. గ్రీష్మ తాపంతో నీ విరహ వేదనను విన్నవిస్తావట. ఎంత గొప్ప ప్రేమికుడివి కాలమా, నీలాగా మా మనుషులు కూడా మారితే ఎంత బాగుండు.

మాలాగా, బతికినంత కాలం ఒకే పేరుతో కాకుండా నువ్వు సంవత్సరానికొక పేరు పెట్టుకుంటావట కదా – 'ప్రభవ'తో మొదలై 'అక్షయ' వరకూ నీకు అరవై పేర్లు కదా. భ్రమణ పరిభ్రమణాలను బట్టి కాల గణనతో ఈ యేడు 33 వ పేరుగా 'వికారి' తో మా ముంగిట్లో అడుగు పెడుతున్నావుగా ! ప్రకృతి కన్య జతతో నువ్వు పొయ్యే సోయగాలు మాకెంతో ముచ్చటగా అనిపిస్తాయి తెలుసా.

***'ఆరు ఋతువుల కాల చక్రం, ఆరు రుచులకు మూల కందం.***
***ఋతువు ఋతువుకు రుచులు మారగా, జీవితమే ఒక రస తరంగం'*** అంటూ నువ్వు శోభిస్తూ, మేము సుఖిస్తూ సమాంతర రేఖలుగా సాగుతున్నాం కదా.

అవును, నువ్వు మాకు నేర్పిస్తూనే ఉన్నావ్ – ఎదురు చూడగలిగిన ఓర్పు, అందుకోగలిగిన నేర్పు, సమన్వయం కలిగిన కూర్పు, అంగీకరించాల్సిన మార్పు ప్రతి మనిషికీ కావాలంటూ. కాల పత్రం మీద ఊహాతీత సిరాతో చరిత్రను సరికొత్తగా చెక్కుతూ సంతకం చెయ్యగలిగేది మనిషి మేధ మాత్రమేనని నువ్వు నిరూపిస్తూనే ఉన్నావ్.

నువ్వు ఆరు ఋతువులకి ఆరంభ పతాకానివి. కొత్త చిగుళ్లపై ప్రకృతి సంతకానివి. గాలి పరుగులపై కోయిల గానానివి. వేప పూతలపై షడ్రుచుల నైవేద్యానివి. ఇపుడు నువ్వు చైత్రమాసం లోకి పరకాయ ప్రవేశం చేశావు కదా,

మహా కవి శేషేన్ ఏమన్నారో తెలుసా 'చైత్ర మాసం గాలి సోకిందో లేదో చెట్లన్నీ పూయడానికి నిర్ణయించుకున్నాయి. పూలు పెదాలు విప్పాయి పుప్పొడి రహస్యాలు చెప్పడానికి. ఇప్పుడు ప్రతి చెట్టూ ఒక దేవాలయం, పక్షులన్నీ ఎగిరే దేవతలు' అంటూ పారవశ్యంతో నిన్ను ప్రస్తుతించారు. గ్రహ గతులను అనుగ్రహ గతులుగా మలుచుకోవడం నువ్వే కదా మాకు నేర్పించావ్. పంచాంగ శ్రవణం ద్వారా సకల సిద్ధులు కలుగుతాయని దీవించావ్. దేవుడితో సమంగా ప్రకృతిని పూజించే పండుగగా ఉగాదిని, బ్రతుకమ్మ పండుగని అందించింది నువ్వే కదా.

మానవ జీవనానికి, కాలానికి మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకునే ఆది ఉత్సవం ఉగాదే కదా. అయినా క్యాలెండర్లు మారుతున్నా మనిషి కేరెక్టర్ మారడం లేదు. మనిషి మనీషిగా మిగలడం లేదు. మా అంత చంచలంగా బహుశా ఎవరూ ఉండరేమో... మాకు ఏది ఎప్పుడు ప్రాచీనమౌతుందో, ఏది ఎప్పుడు ఆధునికమౌతుందో, ఏది ఎప్పుడు అనాగరికమౌతుందో, ఏది ఎప్పుడు నాగరికమౌతుందో, ఎప్పుడేది ఆటవికమౌతుందో, ఏది మానవత్వమౌతుందో ఘంటాపథంగా చెప్పలేం. మట్టి కప్పుల్లో గంజి తాగడం ఒకప్పుడు పేదరికం, ఇప్పుడది ఫ్యాషన్. గోనె సంచుల్లో సరుకులు ఒకప్పుడు అనాగరికం, ఇప్పుడది పర్యావరణ హితం. పచ్చి కూరగాయలు తినడం ఆటవికం, ఇప్పుడది ఆరోగ్యకరం. ఒకప్పుడు కాలినడకన తిరగడం సింప్లిసిటీ, ఇప్పుడదే పెద్ద పబ్లిసిటీ. ఒకప్పుడు మూలికా వైద్యం మూఢ విశ్వాసం, ఇప్పుడది ప్రకృతి వైద్యం. ఇలా మేం ప్రాచీనతకు, ఆధునికతకు మధ్య నిరంతరం గడియారంలోని లోలకంలాగా చలిస్తూనే ఉన్నాం... మా చంచలాలను, సంచలనాలను గమనిస్తున్న నువ్వు మాత్రం మౌనమునిలా మా ఆతృతలను, ఆందోళనలను దరహాసంతో గమనిస్తూ ఉన్నావు... మనుషులుగా మేమేం చెయ్య గలుగుతాం చెప్పు. ఏది ఎక్కువ కాలం మన్నితే దాన్నే నీ ప్రసాదంగా తలకెత్తుకుంటాం. ఇదంతా నీ మహిమ... అదే కాలమహిమగా చెప్పుకుంటాం...

వేప పూతలు, మామిడాకులు, చింత చిగుళ్ళు ఓ వైపు; విశ్వకచేరీలో శాశ్వత గాయకురాలు కోకిల విభావరులు మరోవైపు; మండే ఎండలు మరుమల్లెల సువాసనలతో సాగే ఈ చైత్ర మాసపు ఉగాదంటే మనుషులకు, అందులోనూ మా తెలుగువాళ్ళకి ఎంత సంబరమో కదా... అందుకే నేననుకుంటాను, ఈ వసంతం నీ చిరునవ్వు సంతకం అని, ఈ ఋతువులన్నీ నీ భావోద్వేగాలనీ... అయితే నీ చిర్నవ్వుకు ఎంత పరవశిస్తామో, నీ కన్నెర్రకు అంతగా కలవర పడతాము. ఎప్పటికప్పుడు నీ అనుగ్రహాన్ని పొందాలని, నీ ఆగ్రహాన్ని తప్పించుకోవాలని ప్రయత్నిస్తుంటాము. అయితే మాలోని కొంతమంది స్వార్థపరులు మాత్రం నీ నియమాలను, ప్రకృతి ధర్మాలను ఉల్లంఘించాలని, కాలానికి ఎదురు నిల్చి ధిక్కరించాలని, కాలాన్ని వశం చేస్కోవాలని శుష్క ప్రయాసలు పడ్తుంటారు.

అలాంటి సందర్భంలోనే నీకు ఆగ్రహం వస్తుంది. నీ సహనానికి పరీక్ష ఎదురవుతుంది... మాపై వుండే నీ అనుగ్రహం కనుమరుగై రుద్రనేత్రవు అవుతావు... ప్రకృతిని ఆజ్ఞాపించి మాపై విపత్తులతో దాడులు చేస్తావు... కరవుగా, వరదలుగా, సునామీలుగా, హిమపాతాలుగా, భూకంపాలుగా, అగ్ని పర్వత విస్ఫోటనాలుగా మాపై విరుచుకు పడతావు... కాలమా ! నీకిది ధర్మ సంస్థాపనం కావచ్చు... లోకంలోని అసంతులనాన్ని సంతులనం చేయడం కావచ్చు... రాగద్వేషాలకు అతీతమైన నీ లీలా వినోదం కావచ్చు... లేదా ధర్మకర్తృత్వం కావచ్చు... కానీ మాకు మాత్రం మహా విషాదమే... మహా దుఃఖమే !

కాలమా ! మా జీవననాదమా! ఎన్ని చేసినా నువ్వు మహా చమత్కారివి ! గాయపడ్డ గుండెలకు లేపనాన్ని పూసేది నువ్వే ! క్రుంగిపోయిన ఆత్మలకు నిలబడే స్థైర్యాన్నిచ్చేది నువ్వే ! ఓడిపోయిన నిరాశోపహతులకు విజయపు ఆశలను రగిలించేది నువ్వే ! ఛిన్నాభిన్నమైన జీవితాలకు కొత్తగా నిర్మించుకొనే ధైర్యాన్నిచ్చేది నువ్వే ! వినాశనం లోంచి నిర్మాణానికి, వేదనలోంచి వేకువలోకి, శోకం లోంచి సుఖం లోకి, కుటిలత్వం లోంచి స్వచ్ఛతలోకి మమ్మల్ని నడిపించేది... చివరకు మమ్మల్ని గెలిపించేది నువ్వే ! అందుకే, ఎంతగా మనిషి నిన్ను ప్రేమిస్తాడో, అంతగానూ నిన్ను

ద్వేషిస్తాడు. ఆనందాలు వచ్చినప్పుడు అంతా తన ప్రతిభేనంటాడు, దుఃఖాలు వచ్చినప్పుడు మాత్రం కాలం అసలు కలిసి రావడంలేదని తిట్టుకుంటాడు. అయినా దేనికీ పొంగిపోక, దేనికీ క్రుంగి పోక కాల ధర్మాన్ని పాటిస్తూ నీ వృత్తి ధర్మాన్ని నిర్వర్తించే నువ్వంటే మాకెప్పటికీ ఆరాధనే.

ఎంతగా బాధ పడ్డా గతాన్ని మార్చుకోలేమనీ, ఎంతగా ఆతృత పడ్డా భవిష్యత్తుని ముందుగా చూడలేమనీ మాకూ తెలుసు. భవిష్యత్తు రేపు చెయ్యబోయేదానిమీద కాదు, ఈ క్షణమే చెయ్యబోయేదాని మీదే ఆధారపడి ఉంటుందని మనిషి ఎప్పుడు గ్రహిస్తాడో, అప్పుడే జీవితం పరిపూర్ణం అవుతుంది. నువ్వు మాకు చెప్పింది ఒక్కటే, పుట్టినరోజు ఎంత ముఖ్యమైందో..మనం ఎందుకు పుట్టామో తెలుసుకున్న రోజు అంతకన్నా ముఖ్యమైనదే. మేమింకా నేర్చుకోవాలి.. వినడం కాదు విశ్లేషించుకోవాలని, చూడడం కాదు గమనించాలని, చదవడం కాదు అర్థం చేసుకోవాలని, తెలుసుకోవడం కాదు ఆచరణలో పెట్టాలని, బ్రతకడం కాదు ప్రతిక్షణం జీవించాలని. ఇంకా ఇంకా మేము అలవర్చుకోవలసినవి చాలా ఉన్నాయని మాకు నిరంతరం గుర్తు చేసే తొలి వేకువ కిరణం నువ్వే కదా.

మనుషులతో, వస్తువులతో, ప్రదేశాలతో మేము పెనవేసుకుంటున్న బంధాలు, అనుబంధాలు, అప్యాయతలు, మమకారాలు అన్నిటికీ తొలి ఆశీర్వాదం నీదే కదా... మా ఆదిమధ్యాంతాల జీవన సార్ధకతకు, సాక్షివి నువ్వే కదా... మాకు కనిపించని అంతరాత్మవు..ఆదిదేవుడవు నువ్వే కదా...

అందుకే, కాలమా... ప్రియ జీవనమా, నువ్వు నా friend వి, philosopher వి, guide వి... మా మానవాళికి, సకల చరాచర జీవరాశికి, త్రిలోకాలలోని సృష్టికి నువ్వే రచయితవి... నువ్వే దాతవి... మా భాగ్య విధాతవి... శాంతి ప్రదాతవి... లోక దూతవి... మా సకల జీవన గమనాలకీ నువ్వే కాంతివి.. భ్రాంతివి... విశ్రాంతి లేని క్రాంతివి...

చివరగా, ఉందిలే మంచి కాలం ముందు ముందునా అంటూ, అందరూ సుఖపడాలని కోరుకుంటూ, ఈ కొత్త సంవత్సరం అందరికీ సర్వ శుభాలు అందివ్వాలని, సకల ఐశ్వర్యాలూ సమకూర్చాలని, సమస్త సుఖ సంతోషాలూ పొందాలనీ, మనిషి నిండుగా నవ్వగలిగే మంచితనాన్ని అందరికీ ఇవ్వాలని, మానవాళి నడవడిలో నిజాయితీ పాలు పెంచాలనీ, మంచి చేస్తూ రావాలని, మానవత్వాన్ని పంచుతూ పోవాలని కోరుకుంటూ...ఆ దిశగా మేం చేస్తున్న ప్రయత్నాలలో నీ దీవెనలు మాకుండాలని విన్నవించుకుంటున్నాను... మా విన్నపాలను ఈ ప్రేమలేఖలో నీకు నివేదించుకుంటున్నాను...

ఉండనా మరి...

నీ మనిషి...

– యశ్

# అమ్మమ్మ చీర



అమ్మమ్మ చీరా!

ఎందుకో ఈ రోజు మనసంతా వెలితిగా ఉంది. ఈ ప్రపంచంలో నేనొక్కడినే వెలివేయబడ్డట్టు, నాకే ఏదో పెద్ద అన్యాయం జరిగినట్టు...గుండెనిండా నిస్సత్తువ, మనసంతా ఆందోళన,కంటిచెలమల్లో నిరంతరం ఊరుతున్న కన్నీళ్లు...చెప్పలేనంత భారంగా ఉంది సుమా. చిత్రం కాకపోతే, ఎవరికైనా నాలా అనిపించినప్పుడు ఏం చేస్తారూ... చెడ్డవే అనిపించినా బార్ కెళ్ళి కాస్త బీర్ పుచ్చుకుంటారు. లేదా సిగరెట్ కాలుస్తారు. అంత కాకపోతే సినిమాకైనా వెళతారు. కానీ నేనేంటిలా నిన్ను చేతుల్లోకి తీసుకొని, నీ మెత్తటి స్పర్శని ఆస్వాదిస్తున్నాను. నేనేంటిలా అచ్చు అమ్మమ్మ ముందు కూచుని తన ఒళ్ళో తల పెట్టుకున్నంత భరోసాగా నీ చేతి చర్మపు మడతల్లో ముఖం దాచుకున్నాను... ఎందుకో నాకు నీతో ఉండాలనిపిస్తోంది. అమ్మమ్మ దగ్గర పెరిగిన ప్రతీ వ్యక్తీ ఇలా నాలా సున్నితంగానే ఉంటాడా... ఏమో.. నేనెక్కడినే ఇలా ఉన్నానాకేమీ పర్లేదు.. అమ్మమ్మఅంటేనే ప్రత్యేకం. ఆలా నువ్వన్నాకూడా... ఐనా నువ్వంటే నాకెంత ఇష్టమో తెలుసా, నన్ను నేను ఇష్టపడేంత ఇష్టం. అందుకేగా ఇలా రూంలో కూచుని, నిన్ను నా భుజాల చుట్టూ వేసుకొని, నీకిలా ప్రేమలేఖ రాయగలుగుతున్నాను.

అమ్మమ్మ ఆరు గజాల చీరని చుట్టుకున్నట్టు కాక తీరుబడిగా ఇటుక మీద ఇటుకను పేర్చి ఇంటిని కట్టుకున్నట్టుగా అందంగా కట్టుకునేవారు. అమ్మమ్మ కట్టుకునే చేనేత చీరలు లేలేత రంగుల్లో కళ్ళకి ఇంపునే కాదు, మనసుకి సొంపుని కూడా కలిగిస్తూ హాయిగా ఉండేది. మహిళలకి చీర ఒక సంపద, ప్రేమకు ప్రతిబింబం, సంప్రదాయం, పుట్టింటి ఆశీర్వచనం, అత్తింటి జ్ఞాపకం, గౌరవం – సదాచారం – ఓ సత్కారం. అందుకే, ఇదో గొప్ప విశేషం తెలంగాణ ప్రభుత్వం ప్రతి మహిళను తమ ఆడబిడ్డగా భావిస్తూ బతుకమ్మ చీరల్ని పంచుతుంది. సామూహిక ఏకత్వాన్ని తీసుకొచ్చే ఈ పండుగ, సమైక్య జీవన విధానానికి నిదర్శనంగా ఊరంతా ఒకే చీరలు కట్టుకుని ఒకింటి అక్కా చెల్లెళ్ళైన అన్న రీతిలో కల్సికట్టుగా బ్రతుకును గడపాలి. అంటూ యూనిఫారంలాగా రిథమిగా ఆడుతుంటే పాడుతుంటే, ఆ బృంద నృత్యాన్ని చూడటానికి రెండుకళ్ళూ చాలవు.

అందమనేది చూసే కళ్ళదే కాదు ఆస్వాదించే మనసుది కూడా. ఇలా అంటున్నానని నన్ను అపార్థం చేసుకోవద్దు చీరమ్మా. ఎందుకంటే నాకీ ప్రపంచం మొత్తం మీద అత్యద్భుత సౌందర్యంతో కనిపించేది మా అమ్మమ్మే. ఎందుకలా నవ్వుతావ్ ? ఎనభై ఏళ్ల వృద్ధురాలు, ఒళ్ళంతా ముడతలు పడి ఒడిలిపోయిన మనిషిలో అందం ఏమిటా అనా ? దానికి కూడా కారణం నువ్వే కదా ! అమ్మమ్మ కట్టుకునే నేత చీరలన్నీ ఎంత కళాత్మకంగా ఉంటాయో ! ఆ కలనేతలన్నీ నా కలల నేతలే. పడుగూ పేకలతో నేసిన ఆ నేతగాళ్ళు ఎవరో కానీ, బహుచక్కని నేతపనితనం కనిపిస్తోంది. ఇప్పటికీ అమ్మమ్మకి మడత నలగని చీరే నచ్చుతుంది.

అమ్మమ్మ కోసం తాతగారు కూడా చీరలకి గంజి పెట్టడానికి మేడ పైకి వెళ్ళి.. ఓ పక్క అమ్మమ్మ, ఓ పక్క తాత గారు గంజి పట్టిన చీరని పట్టుకొని, దులిపి, ఆరేస్తారు. బాగా ఎండాక మంచిగా మడతపెట్టి పరుపుకింద పెడితే ఇస్త్రీ చెయ్యాల్సిన పనే ఉండదనుకో. తాతయ్య అభిరుచిని అమ్మమ్మ, అమ్మమ్మ ఇష్టాన్ని తాతయ్య గౌరవించుకుంటూ కలిసి పని చేసుకుంటుంటే చూడ్డానికి రెండు కళ్ళూ చాలవనుకో. మీ అమ్మమ్మని కట్టుకున్నాక, ఏ కనికట్టు చేసిందో తనా చీర కట్టుతో, నేను నా బ్రతుకునే రాసిచ్చానుకో – అని బోసి నోటితో నిండారా నవ్వుతారు తాతయ్య.

పెళ్లి – ఎక్కడ, ఎవరింట్లో, ఎలా జరిగినా మన పెళ్లి జ్ఞాపకాలు తరుముకొచ్చినట్లుగా, చీర కట్టుకొని ఏ అతివ ఎదురొచ్చినా రేపటి నా తరాన్ని అందించే జన్మ ప్రదాయిని అని గుర్తుకొచ్చి చేతులు జోడించి మొక్కాలని అనిపిస్తుంది. నువ్వు నాకు అమ్మగా, అమ్మమ్మగా, చెల్లిగా, కూతురిగా అనిపించి నీ పాదాలు తాకాలనిపిస్తుంది. చీరమ్మా మానవ జాతి మొత్తం నీకు ఋణపడే ఉంది. ఎందుకో తెలుసా...

చిన్నప్పుడు ఉయ్యాల గుచ్చుకోకుండా ఉంటుందని తన పాత నేత చీరలన్నీ వేడి నీళ్ళల్లో ఉతికి నా ఉయ్యాల్లో పరిచేదట అమ్మమ్మ. ఎక్కడికెళ్లినా ఆ మెత్తదనం లేనిదే నేను నిద్రపోయేవాడినే కాదట. స్నానం చేసాక, నన్ను తుడిచే బట్ట కూడా అమ్మమ్మ చీరనే. తల స్నానం చేయిస్తే అమ్మమ్మ తన కొంగుతోనే నా తల తుడిచేదట. నానమ్మ వాళ్ళింటికి వెళ్ళాక ఉయ్యాల లేక, అమ్మమ్మ చీర మెత్తదనం లేక నేనేడుస్తుంటే నానమ్మ రెండు రోజులు చూసి, అమ్మమ్మ చీర చూరుకు కట్టి ఉయ్యాల చేసి ఊపితే క్షణాల్లో నిద్రపోయానంట. నిద్రలో కూడా ఆ చీరకొంగుని చేతితో పట్టుకొనే పడుకునేవాడినంట. కాస్త పెద్దయ్యాక ఎందరు నవ్వుతున్నా దిండుపక్కన అమ్మమ్మ చీర పెట్టుకొని, ముఖాన్ని ఆ చీరలో దాచుకొని పడుకోవడం అలవాటయ్యింది.

పండువెన్నెట్లో నులక మంచంలో అమ్మమ్మతో పడుకొని చీరకొంగు వేలికి చుట్టుకుంటూ, చందమామ కథలు వింటం నాకెంతో ఇష్టం. నన్ను ఎత్తుకొని బయటకు తీసుకెళుతున్నప్పుడు తన కొంగునే గుడారంగా మార్చేది, వర్షం పడితే ఆ కొంగే చత్రీగా మారేది. స్కూలుకి వెళ్లొచ్చాక అమ్మమ్మ కాచిచ్చే వెన్నపాలు తాగి, అమ్మమ్మ చీర కొంగుతో మూతి తుడుచుకొని ఆటకు పరిగెత్తేవాడిని.

రాత్రి పడుకున్నాక అమ్మమ్మ నా దగ్గరకొచ్చి నా నుదుటి చెమటని కొంగుతో తుడిచి, దుప్పటి సరిగా కప్పి, కాసేపు కొంగుతో విసరి, నా నుదుట మీద ముద్దు పెట్టుకొని వెళ్ళేప్పుడు ఆ మెట్టెల సవ్వడి గది దాటేవరకూ వినడం ఎంత గొప్ప అనుభూతో. చిన్నప్పుడు ఎవరు ఎంత బెదిరించినా, ఆటల్లో ఎంత ఆనందించినా నేను పంచుకునే స్థలం మా అమ్మమ్మ కుచ్చిళ్లే. కొత్త వాళ్లొస్తే సిగ్గుతో ముఖం దాచుకునేదీ ఆ కుచ్చిళ్ళల్లోనే. కాస్త కాస్త తొలగిస్తూ, కొంచెం కొంచెంగా తొంగి చూస్తుంటే అమ్మమ్మేమో నా జుట్టు సవరిస్తూ, నా చేతులు నిమురుతూ నాకెంతో భరోసానిస్తూ ఉండేది.

ఇంకొక సరదా విషయం గురుతు చేయనా చీరమ్మా! మజ్జిగ చిలుకుతున్నప్పుడు నన్ను తన ఒడిలో కూర్చోబెట్టుకొని కవ్వంతో చిలుకుతూ కాసింత వెన్న పడ్డాక తొలివెన్నముద్ద నా నోట్లో వేసి మలి ముద్దని నా ఒళ్ళంతా పూసి కాసేపు ఎండలో నిలబెట్టేది. కాసేపటి తర్వాత తలస్నానం చేయించి, ఎడమ అరికాల్లో కాటుక బొట్టు పెట్టేది, దిష్టి తగలకుండా. చెల్లికి చీర కట్టి, జడ కుచ్చెలు పెట్టి, పెద్ద జడ వేసి నిండా పూలు పెట్టి, పేరంటానికి పంపించేది. అప్పుడు చెల్లిని చూడ్డానికి రెండు కళ్ళూ సరిపోయేవి కావు. ఆడపిల్లలు ప్రకృతి పరచిన పూల జల్లులు – అన్న మాట గుర్తుకొచ్చేది.

అమ్మమ్మ చనిపోయినపుడు పుట్టింటి చీర అంటూ అమ్మమ్మ వాళ్ళ పుట్టింటివాళ్లు పట్టు చీర తీసుకొచ్చారు. ఆ చీర కప్పి అమ్మమ్మని శ్మశానానికి తీసుకెళ్లారు. నేను ఎన్నెన్ని రోజులు ఏడ్చానో తెలుసా. అసలు నేను బ్రతుకుతానని ఎవ్వరూ అనుకోలేదట. ఆ తర్వాత అమ్మమ్మ చీరంటేనే చాలు, ఎంత భయమేసేదో. అమ్మమ్మ గురుతుకొచ్చినప్పుడల్లా

అమ్మ, అమ్మమ్మ బీరువా తీసి ఆ చీరలు చూస్తూ అమ్మమ్మ వాసన ఈ చీరల్లో ఉందమ్మా అనేది. ఎందుకో ఆ చీరల్ని ముట్టుకుంటే అమ్మమ్మని తడిమినట్టే ఉండేది.

నిజంగా పెళ్లి మంటపంలో మా అమ్మాయిని పట్టు చీరలో చూసేసరికి మా అమ్మమ్మే నా కోసం మళ్ళీ వచ్చిందా అనిపించిందో క్షణం. ఎప్పుడూ మా అమ్మమ్మ, మా అమ్మ, మా ఆవిడ కి చెప్పని ఓ రహస్యం నీకు చెప్పనా చీరమ్మా. . ఎక్కడికైనా వాళ్ళతో వెళ్లాలంటే తీరిక ఉండని నేను, పెళ్ళంటే చాలు, సెలవు పెట్టి మరీ వెళతానని, బంధుబలగమంటే నా కంత ప్రేమని అందరూ అనుకుంటారు. కానీ అక్కడందరూ రంగు రంగుల చీరల్లో కనిపిస్తూ మన సంప్రదాయాన్ని మరొక్కమారు గుర్తు చేసినట్లుగా అనిపిస్తుంది. స్వర్గం అనేదే ఉంటే బహుశా అక్కడ ఇలాగే కాంతి వంతంగా తిరుగుతారేమో అనిపిస్తుంది.

ఎక్కడో ఒక పాట విన్నాను – సింగారల దారంతో చేసేదే చీర, మమకారమనే మగ్గంపై నేసేదే చీర అంటూనే– విదేశీ వనితలకు సారె పోసి పంపేది, మన జాతీయ జండాకి సమంగా నిలిచేది చీర అంటూ చీర గొప్పదనాన్ని హృద్యంగా చెప్పారు గేయ రచయిత చంద్రబోస్. అన్నట్టూ చెప్పడం మరిచానూ..ఏ గుడికెళ్లినా కొంగు పట్టమంటూ పండుని, కొబ్బరి చెక్కని ఇస్తారు కదా. మూడేళ్ళకొకసారి పుట్టింటివాళ్లు వడినిండా బియ్యం పోసి, కుడకలేసి, కడుపు చల్లగా, తాళి చల్లగా, పుట్టినిల్లు మెట్టినిల్లు చల్ల చల్లగా – అంటూ దీవిస్తారు కదా. వడిబియ్యాన్ని మోస్తూ అప్పుడు నువ్వు నిండు గర్భిణిలా అనిపిస్తావ్. నిండు గర్భంతో ఉన్నప్పుడూ నువ్వు,బిడ్డకు దిష్టి తగలకుండా చీర చెంగుని లాక్కుంటూ నువ్వు అమ్మలకే అమ్మలా అనిపిస్తావ్.

అన్నిటి కన్నా ముందు బతుకమ్మపండుగ రోజుల్లో నాకెంతో కన్నుల పండుగ. ఎప్పటి ఎప్పటివో పట్టు చీరలు తీసి అతివలందరూ కట్టుకుని పసందుగా పాటలు పాడుతూ ఆడుతూ ఉంటే ఆ అమ్మవార్లే ఇల కొచ్చి ఆడుతున్నట్టుగా అనిపిస్తుంది. అలాగే బోనాల పండుగప్పుడు పసుపు బట్టల్లో ముఖమంతా పసుపు పూసుకొని బోనం ఎత్తుకుని ఆడవాళ్ళంతా వస్తుంటే ఎంత గొప్ప పవిత్ర భావన కలుగుతుందో తెలుసా !

అవును, ఈ వయసులో కూడా నేను మా అమ్మమ్మ చీరను స్పర్శించడం మానను..అచ్చు నా మనవడిలాగే. ఎంత హైటెక్కుల్లో ఉన్నా, ఎంత హై హీల్స్ వేసుకున్నా, సంక్రాంతికి బస్సెక్కి ఊరెళ్ళే మనుషుల్లాగా పండగలు రాగానే, పట్టు చీరల్లోకి మారిపోయే మన ఇంటి ఆడవాళ్ల లాగా, ఎంత పాశ్చత్య ధోరణిలో బ్రతికే కాలంలో ఉన్నా చిగురించే మూలాలు మాత్రం భారతీయమే అని గుర్తు చేస్తుంటాయి .

వేలాది సంవత్సరాలనుండి భారతీయులందరికీ చీరంటే కేవలం వస్త్రం మాత్రమే కాదు . పడుగు పేకల కలనేత అంతకన్నా కాదు. చీరంటే మనకు తరతరాల సాంస్కృతిక పతాక . భారతీయ పరం పరకు ప్రతీక . స్త్రీల అందాలను ఇనుమడింప చేసే సౌందర్య గీతిక . మొత్తంగా స్త్రీ జాతికి వారసత్వ కానుక ..భారత జాతి కొంగు బంగారం చీర . మహిళల ముగ్ధ సింగారం చీర .. జయహో చీర, జయ జయహో చీర.

ఉండనా మరి...

ఇట్లు

నీ

– అభినవ్

# సమతామూర్తులు

సమతా మూర్తులకు నమస్కారం !

మీ గురించి ఎప్పుడూ పుస్తకాల్లో చదవడం, చిత్రపటాల్లో చూడ్డం తప్ప ఇలా దూరాలను కలిపే దారాలైన ఉత్తరాలతో మాట్లాడింది లేదు. ఎందుకో ఈ రోజు నాకు మీరు మరీ మరీ జ్ఞాపకం వస్తున్నారు. అయినా నాకేంటీ..ఈ భారతావని మొత్తానికే మీరు గుర్తుకొస్తున్నారు. మరువగలిగినవా మీరు సృష్టించిన చరిత్రలు !

సమతుల ఆహారం మనిషికెంత ముఖ్యమో, సమన్యాయం మానవాళి మనుగడకి అంతే ముఖ్యం. అది ఆరోగ్యానికి మంచిదైతే ఇది ఆరోగ్యకరమైన సమాజానికి అవసరం. తన పాలనలో అధర్మం పెచ్చు పెరుగుతుందీ అనిపించినప్పుడు, దాన్ని సరిచేయగల వ్యక్తుల్ని చరిత్ర తనకు తానే సృష్టించుకొంటుందంట. ఆ మనుషుల్ని వెతుక్కుంటూ, ఆ కుటుంబాల్ని రూపొందించుకుంటూ, ఆ పరిస్థితుల్ని తనకనుగుణంగా మలచుకుంటూ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ సంఘటనల్ని సృష్టించలిగిన వ్యక్తుల కోసం ప్రకృతంతా తన దృష్టిని సారిస్తుందంట. ఇందుకు తార్కాణమే మీ ముగ్గురూ.

ఎంత పుణ్యం చేసుకుందో ఈ ఏప్రిల్ మాసం..మీ ముగ్గురికీ జన్మనిచ్చి. పురాణాల్లో ఎన్నో దేవతా చరిత్రలు విన్నాం. కానీ సామాజిక చరిత్రలో మీ గురించి విని స్ఫూర్తి పొందినంతగా మరెక్కడా ప్రేరణ పొందలేకపోయాం. గతించినా జీవించి వుండే సచ్చరిత్రుల్ని కీర్తిశేషులు, కేవలం తమ కొరకే బతికే క్రిమి మనస్కుల్ని మూర్తిశేషులు అంటారు. శత వసంతాల కాలం గడిచిపోయినా మీరు సృష్టించిన నియమాలు, మీ ఆచరణీయ విలువలు మాకిప్పటికీ మార్గదర్శకాలు అవుతున్నాయంటే అవెంత గొప్పవో అర్థం చేసుకోవచ్చు. అందుకే చిన్నప్పటినుంచీ మీ చరిత్రలు చదివాను. మీ మీద పిచ్చి ప్రేమను పెంచుకున్నాను. ఎంతగా అంటే మీ చరిత్రలన్నీ కంఠతా పట్టి ఉద్యమ ఉత్సాహంతో పాటలు పాడేంత మమకారం. "పతితులార భ్రష్టులారా బాధా సర్ప ద్రష్టులారా" అన్నట్టుగా అణగారిన జాతికోసం, దయనీయమైన వారి స్థితికోసం ఉద్యమించి, వారి చీకటి బతుకుల్లో వెలుగులు నింపిన సామాజిక న్యాయ త్రిమూర్తుల్లారా, సామాజిక సమానత్వ స్థాపకుల్లారా మీకు వందనం, పాదాభివందనం చెప్పుకుంటూ ఈ నా కొత్త ప్రేమ లేఖని కొనసాగిస్తాను.

ఒక మహాత్మా జ్యోతీబా పూలే, ఒక దాదా సాహెబ్ అంబేద్కర్, ఒక బాబూ జగ్జీవన్ రామ్ లుగా మీరే గనక లేకపోతే, మాకోసం రాకపోతే ఇంకా ఈ సమాజం 'ఎక్కడున్నావ్ గొంగళీ' అంటే 'వేసిన దగ్గరే ఉన్నా'నన్నట్టుగా వుంటూ, ఆ గొంగట్లోనే తింటూ అడ్డుపడ్డ వెంట్రుకల్ని ఏరుకుంటూ దయనీయంగా బతుకుని నెట్టుకొస్తూ ఉండేవాళ్లం. మీ వల్లే కదా.. మీ దార్శనికత వల్లే కదా.. మీ పోరాట పటిమ వల్లే కదా వేల సంవత్సరాల నుండీ వెనక్కి నెట్టివేయబడి, అణగద్రొక్కబడి, పీడించబడిన కోట్లాది సామాన్య ప్రజలం అందరం సామాజిక బంధనాల నుండి విముక్తి అయింది. మీ

ధిక్కారం వల్లే కదా మేమంతా ఇపుడు హక్కులను పొందింది. మీరు సృష్టించిన చైతన్యం వల్లనే కదా మన దేశంలో మానవులంతా ఒక్కటే అనే సమానత్వ స్ఫూర్తి ఉప్పెనై ఎగిసింది. అందుకే మీ గురించి, మీ జీవన ప్రస్థానాన్ని గురించి తెలుసుకుంటుంటే హృదయం ఉప్పొంగిపోతోంది. మనసు మరోప్రపంచం దిశగా ఉరకలేస్తోంది. అసలు మీవి చరిత్రలా – బ్రతుకు చిత్రాలా – చదివిన కొద్దీ ఇంకా ఇంకా చదవాలనిపించేంత మలుపులు – విన్న కొద్దీ ఇంకా ఇంకా వినాలనిపించేంత ప్రేరణాత్మక మెరుపులు ఉన్న సజీవ జీవన దృశ్యాలవి.

★★★

మహాత్మా !

మిమ్మల్నే జ్యోతీబా గోవిందరావ్ పూలే గారూ ! గాంధీ తాత కంటే ముందు మిమ్మల్నే ప్రజలంతా 'మహాత్మా' అని ఆత్మీయంగా పిలిచేవారట కదా. మహారాష్ట్రలో పుట్టడంవల్ల శివాజీ మీద అభిమానం అనుకున్నాను. కానీ మీ జీవితం అంతా శివాజీ లాగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం వెతుకులాటే అయిపోయింది. 19వ శతాబ్దంలోనే బ్రాహ్మణ పురోహితులు లేకుండా జూన్నార్ పరిసర ప్రాంతాల్లో నలభై గ్రామాల్లో పెళ్లిళ్లు నిర్వహించి ప్రత్యామ్నాయ వివాహ సంస్కృతిని భుజం మీద వేసుకొని మోసిన మీ తీరు చూస్తుంటే ఆరాధనా భావం కలుగుతోంది. మీరు ప్రారంభించిన సత్యశోధక సమాజం ద్వారా బ్రిటిష్ వలస వాదులకు వ్యతిరేకంగా, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మీరు పనిచేసిన తీరు ఇప్పటికీ విశేషంగా చెప్పుకునేదే.

మహాత్మా ! స్త్రీల కోసం మీరు ఆలోచించిన తీరు ఎంత గొప్పదీ.. స్త్రీలకు విద్యా నిషేధాన్ని విధించిన మను స్మృతిని తిరస్కరించి ఎంత మంచి పని చేసారూ ! మీ భార్య సావిత్రీ బాయి తోనే సంస్కరణలు మొదలు కావాలంటూ ఆమెను పాఠశాలలో చేర్పించి మీరు నెలకొల్పిన పాఠశాలకే గురువుగా మలిచారు, ఆమెను. మానసిక బానిసత్వం నుంచి శూద్రులను కాపాడాలని మీరు ఆనాడు రాసిన త్రితీయ రత్న నాటకం ఎంతమందిని ప్రభావితం చేసిందో తెలుసా, ఇక గులాం గిరీని నిరసిస్తూ మీరు ప్రచురించిన 'గులాం గిరీ' గ్రంథం సామాజిక సంస్కరణోద్యమంలో ఒక కీలక పాత్ర పోషించింది. చాతుర్వర్ణ వ్యవస్థను దుయ్యబడ్తూ మీరు రాసిన 'సార్వజనిక్ సత్యధర్మ్' అనే పుస్తకం మీ మరణానంతరం ప్రచురించబడింది. అయినా మీ ఇంట్లో ఉన్న స్నానాల తొట్టి దగ్గర స్నానం చెయ్యడానికి అంటరాని వారికి సైతం అనుమతిచ్చి కొత్త తరానికి పరిచయం చేసిన వారు మీరు. అక్షరాన్ని ప్రేమించారు కాబట్టే అన్ని ఆటుపోట్లు ఉన్నప్పటికీ 'దీనబంధు' వారపత్రికను స్థాపించి కొనసాగించగలిగారు.

తల్లిని చిన్నప్పుడే కోల్పోయి, కూరగాయాల వ్యాపారైన తండ్రితో ఆర్థికంగానే కాక కులపరంగా మీరు ఎదుర్కొన్న ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. జాయా కారాజీ లింగో వంటి సహచరులను పొంది మున్సిపాలిటీకి ఎంపికై రాజకీయం ద్వారానే సామాజికన్యాయం సిద్ధిస్తుందని నమ్మిన నాయకోత్తములు కదా మీరంతా. కులం పేరుతో ఎన్నో తరాలుగా అణచివేతకి గురైనప్పటికీ నోరు తెరచి ఏమిటీ అని ప్రశ్నించలేని బడుగు జీవులకి నేనున్నానంటూ బాసటగా నిలిచి, ఆత్మ స్థైర్యం కల్పించి హక్కులకోసం పోరాడేలా చేసిన మహనీయులు మీరు. జ్ఞాన సంపద ఏ ఒక్కరి సొత్తూ కాదని, జ్ఞాన సముపార్జనలో అందరూ సమానమేనని ఎలుగెత్తి చాటిన వారు మీరు.

ముఖ్యంగా స్త్రీల కోసం మీరు ఆలోచించిన తీరు నన్నెంతో ప్రభావితం చేసింది. బాల్య వివాహంతో మీ ఇంట్లోకి అడుగుపెట్టిన మీ భార్యని చదివించి మీ పాఠశాలకే గుర్విణిగా మార్చి 'ఔరా' అనిపించుకున్నారు మీరు. అగ్రవర్ణాల్లోని వితంతువుల కోసం పునర్వివాహాలని ప్రోత్సహిస్తూ మీరు స్థాపించిన సంస్థ 'బాల హత్యా ప్రతిబోధక్ గృహ' వారిలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించింది. మద్యపానాన్ని వ్యతిరేకిస్తూ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా షాపులన్నిటినీ మూసివేయాలినదిగా మీరు రాసిన ఉత్తరం ఇప్పటికీ చర్చనీయాంశంగానే మిగిలింది.

దేశమనే దేహానికి శూద్రులు ప్రాణమని, రక్త నాళాలవంటివారని చెప్తూ సామాజిక ప్రజాస్వామ్యం సాధించటమే మీ అంతిమ లక్ష్యం అని ప్రతి వేదిక మీదా చెప్పటమే కాకుండా అందుకోసం జీవితాంతం తపించిన వారు మీరు. అవునూ, మీకీవిషయం తెల్సా – దక్షిణ ఆఫ్రికా జాతీయోద్యమ నాయకుడు నెల్సన్ మండేలా, భారతదేశ పర్యటనకి వచ్చినప్పుడు మీ 'గులాం గిరీ' పుస్తకాన్ని డా. బి.ఆర్. అంబేద్కర్ ఆయనకి బహూకరించారట. ఇదెంతో గొప్ప విషయం కదా.

ఎవరి అనుభవాలు వారివి. ఎవరి జీవితాలూ వారివే. కానీ మీలాంటి చరితార్థుల అనుభవాలు, మీరు నడిచిన దారులు మాకెప్పటికీ స్ఫూర్తిదాయకంగానే ఉంటాయ్. ఉత్తమ నడవడిక సంతరించుకున్న మీ బ్రతుకులు మాకు కరదీపికలు అవుతాయి. ఓ మహాత్మా ! గమనించావా ఈ విచిత్రాన్ని – కాలం కార్చే కన్నీరు తుడవడానికి, అణచి వేయబడ్డ తన అనుంగు కొడుకుల ఆక్రోశాన్ని వినడానికి నువ్వు పుట్టిన నెలలోనే నీ దారిలో నడిచే మరో ఇద్దరు మహానుభావుల్ని పుట్టించింది. ఈనేల తల్లి. మీరు పుట్టింది ఏప్రిల్ 11 అయితే, బాబూ జగ్జీవన్ రామ్ గారు పుట్టింది ఏప్రిల్ 05. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ పుట్టింది ఏప్రిల్ 14న. మీ ముగ్గురూ మాకు సామాజిక త్రిమూర్తులు. సాటి మనుషుల పట్ల, అణగారిన సమాజం పట్ల కరుణతో ప్రేమతో వ్యవహరించడం మాకు ఉత్తేజాన్ని ఇస్తుంది. అదిగో మీ దారిలో నడిచిన ఆ ఇద్దరినీ కూడా పలకరిద్దామా.

★★★

జగ్జీవన్ రామ్ తాతా ! నువ్వు ఉప ప్రధానిగా పనిచేయడమే కాక, ఎన్నెన్నో మంత్రి పదవుల్ని అలవోకగా నిర్వహించి అందర్నీ మెప్పించావట కదా. మేమిప్పుడు నీ వంశాంకురం అయిన మాజీ స్పీకర్ మీరా కుమార్ ని చూడగలిగాం గానీ, నిన్ను చూడలేదే అన్న బెంగని అనుభవిస్తూనే ఉన్నాం. అయినా మీకంత ధైర్యం ఎలా వచ్చింది.. పెద్ద పెద్ద కర్మాగారాలతో ఢీ కొనేవారటకదా. కార్మిక నాయకుడిగా మీరు సృష్టించిన చరిత్ర స్వాతంత్ర్య చరిత్రంత గొప్పది తాతా. బీహార్ లో పుట్టి, పశ్చిమ బెంగాల్లో మీ సేవలు విస్తరించి, జూట్ మిల్ ఇంకా టెక్స్టైల్స్ రంగాల్లో మీరు సాధించిన పోరాట ఫలాల్ని ఇప్పటికీ అనుభవిస్తూనే ఉన్నాం.

నిర్దిష్టంగా లేని పని గంటలు, భద్రత లేని ఉద్యోగాలు, సమన్యాయం లేని వేతనాలు ఇలా ఎన్నెన్నో అన్యాయాలు. మీ ఉద్యమ ఫలితంగానే కదా మాకు ఉద్యోగ భద్రత సమకూరిందీ, నిర్దిష్ట పనిగంటలు కుదిరిందీ, సరియైన వేతనాలు దొరికిందీ. ఆర్టికల్ 14, 15, 16, 323 – ఇలా ఎన్నెన్నో హక్కుల్ని రాజ్యాంగ బద్ధంగా పొందగలిగిందీ. అయినా అటు వ్యవసాయ శాఖ, భారీ నీటిపారుదల శాఖ, రక్షణ శాఖ, రైల్వే శాఖ – ఇలా ఎన్నెన్నో రంగాల్లో కేంద్ర మంత్రులుగా పనిచేసిన అనుభవజ్ఞులు మీరు.

మీరు దేశానికి చేసిన అతి పెద్ద మేలు, నా దృష్టిలో ఏమిటో తెల్సా – హరిత విప్లవం; దాన్ని సాధించిపెట్టింది మీరేగా. ఇప్పుడు భారతదేశం వ్యవసాయికంగా ఇంత అభివృద్ధిని సాధించిందంటే ఆనాడు మీరు వేసిన పునాదులేగా కారణం. హైబ్రీడ్ విత్తనాలు, భూ సంస్కరణలు, ఆహారధాన్యపు నిల్వలతో, దేశ వ్యవసాయ ముఖచిత్రాన్ని మార్చింది మీరే కదా. పాకిస్తాన్ యుద్ధ సమయంలో, బంగ్లాదేశ్ ఆవిర్భావ సమయంలో త్రివిధ దళాధిపతుల్ని నడిపించిన తీరు ఇప్పటికీ కథలు కథలుగా చెప్తుకుంటారు. ఒకే నియోజక వర్గం నుండి మూడు దశాబ్దాల పాటు నిరాటంకంగా మీరు ఎన్నిక కావడమనేది ప్రజలకు మీపట్ల ఉన్న నమ్మకాన్ని చూపిస్తుంది.

ఉద్యమకారులుగా, సిద్ధాంత కర్తగా మీరు పోషించిన పాత్ర భారతీయ చరిత్రలో కొత్త శకాన్ని తెరిచింది. అవును తాతా, మీరు మా తెలుగునేలకి వచ్చి సింగూరు డ్యామ్ కి శంకుస్థాపన చేసారట కదా..మా తాత చెప్పారు. అప్పుడు మీరిచ్చిన ఉపన్యాసం ఇప్పటికీ మర్చిపోలేనంటాడు. పార్లమెంట్ లో మీ నడవడి, ప్రజల్లో మీ మనుగడ ఎందరికో

ఆదర్శనీయాలు. అడిగి, బ్రతిమాలి తెచ్చుకునే అవసరం మనకు లేదని, మన హక్కుల్ని పోరాటాల ఫలితంగానే సాధిద్దామన్న ఆత్మ గౌరవాన్ని ప్రతి మనిషిలో నాటిన, ఆత్మ విశ్వాసపు చుక్కాని మీరు.

★★★

ఆత్మ గౌరవం అన్న పదం వినగానే నా కళ్ల ముందు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కదలాడుతున్నారు. అణగారిన జాతిని నడిపించిన నాయకులుగా, గురుదేవులుగా భారతీయులందరికీ ఆరాధనీయులు. చిన్నప్పుడే తల్లిని కోల్పోయి మేనత్త పోషణలో ఎదిగి బరోడా మహారాజుగారి ఆర్థిక సాయంతో కొలంబియా విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్రాన్ని అభ్యసించి దేశాన్ని ఆర్థిక స్వావలంబన దిశగా నడిపించిన మహా మేధావి అంబేద్కర్. భారతదేశంలో నాలాగే ఎంతో మందికి వీరు గురుతుల్యులు.

★★★

అంబేద్కర్ గురువు గారూ నమస్కారం ! ప్రజాస్వామ్య యుతంగా సమానత్వ ఆచరణీయ పథకాలతో అణగారిన జాతి జీవుల బతుకుల్లో వెలుగులు విరజిమ్మిన సంస్కరణాభిలాషి మీరే అంబేద్కర్ సర్. యూనివర్సిటీలో ఉండగానే ఇండియన్ రూపీ మీద మీరు రాసిన సిద్ధాంత గ్రంథం మన రిజర్వ్ బ్యాంక్ స్థాపనలో కీలక పాత్ర పోషించిందన్న సంగతి చాలా తక్కువమందికే తెలుసు. దక్షిణ భారతదేశంలో మహారాష్ట్ర నుంచి జ్యోతీబా పూలే, తెలంగాణా నుండి భాగ్యరెడ్డి వర్మ, తమిళనాడు నుండి రామస్వామి నాయకర్, కేరళ నుండి నారాయణ గురు ల ప్రేరణతో ఎదిగిన మహా శక్తిగా నిలబడ్డారు మీరు. విధేయత చూపించాల్సిన అవసరం లేదు.

ఆత్మ గౌరవ ఉద్యమాల ద్వారానే హక్కుల్ని సాధిద్దామని ఉద్బోధించిన ఉద్యమ సూర్యుడు మీరేనని మా స్కూల్లో చిన్నప్పట్నుంచీ చెప్పేవారు. మహద్ చెరువు ఉద్యమం, కాలారం దేవాలయం ఉద్యమాల ద్వారా చెరువులోని నీటిని తాగే అర్హతని, దేవాలయంలోకి ప్రవేశించే హక్కుని, సాధించడమనేది మీ సంఘటిత శక్తికి నిదర్శనం. మూడు రౌండ్ టేబుల్ సమావేశాల్లోనూ పాల్గొని అణగారిన ప్రజల ఆశాజ్యోతిగా మారి నిరంతరం పోరాడిన కార్యశీలి మీరు కాక ఇంకెవరుంటారు చెప్పండి. బ్రిటిష్ గవర్నమెంట్ పాలనలోనే కమ్యూనల్ అవార్డ్ లో నిబంధనలు పెట్టేలా చేసి విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో ప్రత్యేక సౌకర్యాలు ఉండేలా చేసి చూపించిన ఆచరణశీలి మీరు కాక ఇంకెవరు గురూజీ. ఆ తర్వాతా అదే స్ఫూర్తితో దాన్ని రాజ్యాంగంలో పొందుపరిచేలా చేయగలిగారని చరిత్ర చెపుతోంది.

అయినా గురూజీ, ఏదన్నా పని అప్పచెప్పితే వాళ్ళు ఏం మర్చిపోయినా మీరు నిబద్ధతతో చేస్తారట కదా. అన్ని దేశాల రాజ్యాంగాల్నీ అధ్యయనం చేశాకేనట కదా మీరు రాజ్యాంగ రచనకి పూనుకున్నారూ. అమెరికా రాజ్యాంగం పట్ల విపరీతంగా ఆకర్షితులైన మీరు అక్కడి నల్ల జాతీయులపై జరుగుతున్న అన్యాయాలు ఇక్కడి అణగారిన జాతుల మీదా జరుగుతున్నాయని ఎంచి జీవితాంతం పీడిత, తాడిత జనాల పక్షాన నిలబడ్డ మేరు శిఖరం కదా మీరు.

గురువు గారూ, మీ గురించి ఇప్పటికే ఎన్నో విన్నాం కానీ, నన్ను బాగా ఆకర్షించింది ఒకటుంది. లండన్ లైబ్రరీలోని పుస్తకాలన్నీ ప్రపంచంలోని ఇద్దరే ఇద్దరు వ్యక్తులు చదివారట. అందులో ఒకరు కార్ల్ మార్క్స్ అయితే, రెండో వ్యక్తి మీరేనంట. పుస్తకం – చేతుల్లో పుష్పించే విజ్ఞాన కర్మాగారం అంటే ఏమిటో అనుకున్నాను గానీ మీరు, చదివిన వెలకట్టలేని అక్షర సంపదని ఆశయాల మేధస్సుగా మలచుకొని ఆచరణాత్మక విలువలు చొప్పించి సంరక్షక విచక్షణతని రాజ్యాంగ బద్ధంగా అందించిన మీకు ఏమిచ్చి రుణం తీర్చుకుంటుంది ఈ భారత జాతి ?

మనుస్మృతిని వ్యతిరేకించారని, అగ్రకుల ఆధిపత్యాన్ని ప్రశ్నించారనీ, హిందుత్వంలోని దురాచారాల్ని ఎత్తి చూపారనీ కొంతమంది గగ్గోలు పెట్టినా, హిందూ కోడ్ బిల్లు కోసం మీరు పట్టిన పట్టు ఏనాడూ విడువలేదు. దాన్ని అమలుచేసే విషయంలో ప్రభుత్వం సూత్ర ప్రాయంగా అంగీకరించనందుకు కేంద్ర తొలి న్యాయశాఖ మంత్రి గా

రాజీనామా చేసి, ప్రజల సంక్షేమంకంటే, అణగారిన జనుల ఔన్నత్యం కంటే అమాత్య పదవులేం గొప్పవి కావని నిరూపించిన నిస్వార్థ జీవి మీరు. ప్రపంచ వ్యాపితంగా ఎంతో మంది అభిమానుల్ని సొంతం చేసుకున్న మానవ ప్రేమికులు మీరు. హీనయాన, మహాయానాల తర్వాత బౌద్ధ మతంలో మీరు ప్రవేశపెట్టిన సూత్రాలు అంబేద్కర్ యాన అంటూ కొత్త ప్రకరణాన్ని ప్రారంభించడం మీ తాత్విక దృష్టికి నిదర్శనం. బుద్ధిజం ద్వారానే సామాజిక న్యాయమని జీవిత చరమాంకం వరకూ నమ్మిన ఆచరణశీలురు మీరు.

★★★

సమతామూర్తుల్లారా ! మా సామాజికన్యాయ త్రిమూర్తుల్లారా ! మీ మంచి మాటలు మాకు శిరోధార్యం. మీ ఉద్యమ మార్గాలు మాకు ఆచరణీయ పథాలు. నిస్వార్థంగా ప్రజాసేవలో మీరు గడిపిన జీవితం మాకు నిరంతర పఠనీయ పాఠం.

జీవితకాలం మొత్తం దేశసేవలోనే గడిపిన జాతి ప్రేమికులు మీరు. జాతి జీవనాడులు మీరు.

ఈ దేశపు మట్టిలో హరిత విప్లవాన్ని పుట్టించిన, దేశాన్ని అన్నపూర్ణగా మలిచిన వ్యవసాయిక ప్రేమికులు ఒకరైతే; అడుక్కుంటూ ఎన్నేళ్లు బతుకుతాం, మనకీ హక్కులున్నాయి, వాటిని ఉద్యమాల ద్వారా సాధించుకుందామని ఆశించిన వారు మరొకరు; హిందూ మహా సముద్రమంత గొప్పదైన హిందూ మతంలో అక్కడక్కడా చెత్తా చెదారాలు చేరి కలుషితం చేస్తున్నాయని ఎలుగెత్తి చాటే మత విశ్వాసాల్ని, మూఢ నమ్మకాల్ని ఎత్తి చూపి నిక్కచ్చిగా ధర్మాగ్రహాన్ని చూపించిన భయంలేని వ్యక్తి ఇంకొకరు. అయితే విద్య ద్వారానే సామాజిక సమతుల్యత సాధించబడుతుందని నమ్మినవారు మీ ముగ్గురూనూ. నిజం, సింహాలు తమ చరిత్ర తాము రాసుకోనంత కాలం వేటగాడు రాసిందే చరిత్రగా మిగుల్తుంది. అందుకే మీ చరిత్రను మీరే రాసుకున్నారు. పదిగురికీ స్ఫూర్తి దాయకమైన మీ చరిత్రలనే జీవన పాఠాలుగా అందించారు. వ్యక్తిగతంగానూ, వృత్తిగతం గానూ ఎన్నో ఆటుపోట్లని ఎదుర్కొని అణగారిన వర్గాలకి కుల వివక్షత లేని సరికొత్త సమాజాన్ని సృష్టించారు. మీ కళ్ళల్లోని నీరు మరొకరి కళ్ళల్లో చూడకూడదంటూ జీవిత చరమాంకం వరకూ పాటుపడ్డారు. విజ్ఞాన తృష్ణతో పుస్తకాలనే కాదు ప్రపంచాన్నే చదివేసారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజల బాధల్ని తమ బాధలుగా భావించారు.

ఎదురులేని పోరాట పటిమ, వెన్ను చూపని ధీరత్వం, మడమ తిప్పని, మాట తప్పని వ్యక్తిత్వాల కలబోత మీరు. విద్యావేత్తలు, ఉద్యమకారులు, నిజాయితీపరులు, నిస్వార్థ జీవులు, అపార మేధావులు, అద్భుత వక్తలు – ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నెన్నో ప్రత్యేక అంశాలు కనిపిస్తూనే ఉంటాయి మీ ముగ్గురిలోనూ. మీరు బాల్యంలో పడిన బాధలు, కుటుంబాలలో ఆర్థిక ఇబ్బందులు, సమాజం నుండి ఎదుర్కొన్న అవమానాలు, అణచివేతలు మాకు దిగ్భ్రాంతిని కలిగిస్తాయి. ఉద్యమస్ఫూర్తి, సందర్భ స్ఫూర్తి, సమైక్య స్ఫూర్తి, మానవీయ స్ఫూర్తితో మా దృష్టిలో మీరు ఎవరెస్ట్ అంత ఎత్తున నిలిచారు.

మీరు మన దేశ ప్రగతి నిర్దేశకులు. భావి భారతానికి పునాదులేసిన నిర్మాతలు. కులరహిత సమాజాన్ని కాంక్షించిన సంస్కరణాభిలాషులు, రాజనీతిజ్ఞులు. మిమ్మల్ని మర్చిపోము మేము బ్రతికున్నంత కాలం. మీకు నిరంతరం జోహార్లందిస్తాం. మీ నిస్వార్థ సేవలకు అంజలి ఘటిస్తాం. మీ ఆలోచనల నుండి స్ఫూర్తిని పొందుతాం. మీ ఆశయాల సాధన కోసం కృషి చేస్తాం. మీ జీవితమే ఆదర్శంగా రేపటి భారతాన్ని నిర్మిస్తాం.

ఉండనా మరి,

మీ అభిమాని,

– ఆరవ్

# శతమానం



హరీ!

నీకేదో ఒంట్లో బాగాలేదని చెల్లాయ్ ఉత్తరం రాసింది. విన్నప్పట్నుంచీ మనసంతా వెలితిగా అయిపోయిందిరా. వైద్యశాలలు కాస్తా ఈనాడు వంధ్య శాలలు అయిపోతున్నాయ్. మన కాలంలో పల్స్ చూసి శరీరంలో ఎక్కడ ఏ రోగం ఉందో చెప్పేవారు. ఈ రోజుల్లో పర్స్ చూసి వైద్యం చేస్తున్నారంటే నమ్ము. ఇప్పుడు ప్రతీ అవయవానికీ పది మంది స్పెషలిస్టులు ఉన్నారు. యంత్రాలతో పరీక్షించి, ఎక్సరే లతో నిర్ధారించి, బ్లడ్ టెస్టులతో సమాధాన పరచుకొని, స్కానింగ్ లతో సహనాన్ని దోచేసి, మనల్ని భయపడేలా రెండు రోజులు తిప్పి, చివరికి 'యురేకా' అన్నట్టుగా 'ఏదీలేదు' అంటూ ప్రిస్క్రిప్షన్ నిండా మందులు రాసి, యాజమాన్యం పెట్టిన టార్గెట్ లో ఇంకా ఎంత మిగిలిందో చూసి, తన కమీషన్ ని లెక్కేసి, మరో బకరా రోగి కోసం ఎదురు చూస్తూ ఉండడమే వైద్యమా అనిపిస్తోంది.

డాక్టర్ల దగ్గరేమో పెద్ద పెద్ద క్యూలు, ఎప్పుడు మన ఛాన్స్ వస్తుందో ఐక్యూలకి అందదు. డబ్బులు తీసుకొని కాంపౌండర్ ఆడే నంబర్ గేములు మనకు అంతు పట్టవు. హాస్పిటల్ వెలిసిందో లేదో కుడి ఎడమల్లో మందుల షాపులు. ముందేమో ఎక్సరే ప్లాంట్, పైనేమో పాథాలజీ ల్యాబ్. క్షణాల్లో పరీక్షలు, గంటల్లో రిపోర్టులు. నెల తిరిగే సరికి హాస్పిటల్లో రెండు ఫ్లోర్లు పెరుగుతాయ్, రోగుల దగ్గర పొలాలు తరుగుతాయ్. ఒక కంటికి ఆపరేషన్ చెయ్యాల్సింది పోయి రెండో కంటికి చేస్తే మన ఖర్మ అంటూ సరిపెట్టుకుంటాం. సర్జరీ చేసి పొట్టలో ఫోర్సెప్స్ పెట్టి కుట్టేస్తే పాపం హడావిడిలో మర్చిపోయి ఉంటారులే అని సర్దుకొని మరోసారి కోయించుకుంటాం.

మామూలుగా జరిగిపోవాల్సిన డెలివరీని డబ్బుల కోసం సిజేరియన్ చేసేస్తే అమ్మో ఎంత కష్టపడ్డారో అని దండాలు పెట్టేస్తాం. అవసరం ఉన్నా లేకున్నా మందుల మీద మందులు రాసేస్తూ ఉంటే ఏంటీ, ఎందుకూ అనకుండా నెలల తరబడి మింగేస్తూ ఉంటాం.

వైద్యో నారాయణో హరిః – అంటూ వైద్యుడికి అత్యున్నత స్థానం కల్పించి పూజించే దేశం మనది. స్వయంగా నారాయణుడే వైద్యుడిగా వచ్చి చూస్తాడని, పై లోకాలికి పాస్ పోర్ట్ వచ్చినా, ప్రాణాలను నేలకి దింపి సేవ చేస్తాడనీ భావిస్తాం. కానీ ఇదేంట్రా వైద్యాన్ని ఇంతలా వ్యాపారం చేస్తున్నారు?

అందరూ అలానే ఉంటారా... మా అన్నను చూడు, మా తాత గురించి విన్నావు గదా అంటాడు రవి. నిజంగానే వాళ్ళ తాత పేరు మీద ఓ రోడ్డే ఉందిక్కడ. తనకు మెడికల్ రిప్రజెంటేటివ్ లు ఇచ్చిన మందులతో బీదా–బిక్కీలకి సాయంత్రాలు వైద్యాలు చేసే అలాంటి గొప్ప డాక్టర్లు ఇంకా ఉన్నారంటావా? ఆ స్రష్ట జీవితాన్నిచ్చి సృష్టిని చేసినా, మన జీవ రక్షణ చేసే విధాతలు డాక్టర్లేగా. సేవా ప్రవృత్తితో అహరహం శ్రమించే నిరంతర పథగాములు వారేగా.

మన ఆచారి గారు మాత్రం తక్కువా ఏమిటి? పల్స్ చూసి రోగాన్ని ఇట్టే చెప్పేవారు. ఒకట్రెండు మాత్రలు తప్ప ఇచ్చేవారు కాదు. ఇప్పుడు రోజుకో కొత్త వైరస్ వస్తోంది. మేం ఎన్నని నేర్చుకోగలం? అందుకే పెరుగుతున్న రోగాల్ని, రోగుల్ని బట్టే మేం మా మెదళ్ళ మీద కాకుండా మరల మీద ఆధారపడుతున్నాం. అలా పడాల్సి వస్తుంది మరి – అంటున్నారు. ఇప్పటి డాక్టర్లు. ఏది నిజం, ఏది అబద్ధం, ఏది నమ్మాలి, ఏది నమ్మకూడదు – ఏదీ అర్థం కానీ పరిస్థితి.

కంటి మీద ఏదో అయ్యిందని డాక్టర్ దగ్గర కెళితే కంటి కేన్సర్ కావొచ్చేమో అన్నంతగా ఎన్నో పరీక్షలు చేసారు. చివరికి ఊర్లో ఫంక్షన్ కి వెళ్ళిన చాలా మందికి ఇలానే అయ్యిందని తెలిసి, కందిరీగలు ఉన్నాయి కాబట్టి అవి కుట్టి ఉంటాయని, వెంటనే వాళ్ళు బంతి ఆకు రుద్దారని, వెంటనే తగ్గిపోయిందని చెప్తే అప్పుడు మేమూ అదే చేస్తే ఫలితం కనిపించింది. ఎంతో రిలీఫ్ దొరికింది. చూసావా చిన్న దాని కోసం మూడు రోజులు ఎన్ని పరీక్షలు చేయించు కున్నానో. నేను వైద్యుల్ని తప్పు పట్టట్లేదురా, వైద్య విధానాన్ని దుయ్యబడ్తున్నా, వ్యాపార మయమైన వైద్యరంగాన్ని శంకిస్తున్నాను.

మనుషుల ప్రాణాలతో జూదం ఆడుతున్న విధానాన్ని అసహ్యించుకుంటున్నాను. వెంటిలేటర్స్ మీద ఉంచామంటూ, ఇపుడే వేలు కదిలిందంటూ, ఆరు గంటల క్రితం చనిపోయిన వ్యక్తి కుటుంబం దగ్గరనుంచి రెండు లక్షలు లాగిన హాస్పిటల్ కక్కుర్తిని చూసి, దిగజారిన మానవీయ విలువల పట్ల నెత్తీ నోరూ బాదుకుంటున్నాను. ఏం జరిగిందో తెలియదు. ఏమౌతోందో తెలియదు. సాటి మనిషిని నమ్మక ఎవరిని నమ్మాలి? ప్రాణాల్ని వ్యాపారంగా చూసే వాళ్ళని ఏం చెయ్యాలి? మన విశ్వాసాల్ని ఏమార్చే వాళ్ళని ఎలా శిక్షించగల్గుతాం? నా బాధంతా వ్యాపార మయమైన వైద్య రంగం గురించేరా.

అయినా నువ్వేంటీ, విన్న ప్రతి దాన్ని వెనకా పడుతున్నావంటా? అప్పుడెపుడో ఆయిల్ పుల్లింగ్ అంటూ ఆరేళ్లు చేసావ్. నీ అతి వాగుడికి ఓ అరగంట చెక్ పెట్టావ్ కదా అని సరిపుచ్చుకున్నాం. నూనె పశువుల కుళ్లిన పేగుల్తో తయారు చేస్తున్నారని ఎక్కడో చదివి, వెన్నపూసతో వంటలు చేయించావ్. ప్రకృతి వైద్యం అంటూ మూడు ఆకులు, ఆరు కూరగాయ ముక్కలు తిని శరీరం ఎంత తేలిగ్గా ఉందో అని తెగ సంబర పడి, ఆనక ఆరు నెలలు మంచం పట్టావ్. జామాకు, నేరేడాకు వేసి, రాగి చెంబులో నీళ్ళు పోసి తెల్లారి తాగితే మంచిదన్నారని, ఓ ఆర్నెల్లు చేసావ్.

ఎవ్వర్నీ ఏదీ అడగని నువ్వు, ఆకుల్ని అడుక్కుని తెచ్చుకునేంత స్థాయికి వెళ్ళేవంటే, నీ వెర్రి ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతోంది. ఆ తర్వాత వెన్న తినడం వల్ల కొవ్వు కరుగుతుందని, మటన్–చికెన్ తినాల్సిన ఆహారం అంటే బాక్సులు పట్టుకొని మటన్ షాపుల ముందు క్యూ కట్టావ్. చిరంజీవులు కావాలంటే చిరుధాన్యాలు తప్పనిసరంటే, ధాన్యపు గంజుల చుట్టూ చక్కర్లు కొడ్తున్నావ్. మట్టి పాత్రల్లో వంటలు మంచిదన్నారని ఇల్లంతా నింపేశావ్. ఎవరో ఏదో చెప్తే చేసేస్తున్నావ్ గానీ, అసలు నీకేం కావాలో నువ్వు నిర్ణయించుకుంటున్నావంట్రా? ఒక్కొక్కరి శరీర తత్వం ఒక్కో రకంగా ఉంటాది, అందరికీ అన్నీ సరిపడవ్. అది నువ్వెందుకు అర్థం చేసుకోవట్లేదు ?

అయినా హర్రీ, వర్రీ, కర్రీ లనే మూడింటి వల్లే కదా మనిషి ఆరోగ్యం దెబ్బ తినేది. పరుగులతో పనులు చేస్తాం టైమ్ సెన్స్ ఉంటే హర్రీ ఎందుకవుతుంది? అత్యాశ లేకపోతే వర్రీలో ఎందుకు పడతాం? ఇక కర్రీల విషయానికొస్తే జిహ్వా చాపల్యంతో అతిగా ఉప్పు, కారం, మసాలాలతో సుష్టుగా భోం చేస్తూ, ఊబ కాయంతో ఉసూరంటున్నాం.

నీకో తమాషా విషయం చెప్పనా... ప్రతీ మనిషికీ ఓ డిగ్రీ ఉంటుంది. అది మామూలే, కానీ ప్రతీ ఇంటికీ ఓ డిగ్రీ వచ్చేసిందనే సంగతి నీకు తెలుసా, అదే బియస్సీ డిగ్రీ. బి–అంటే బీ.పీ. యస్–అంటే షుగర్. సి–అంటే కొలెస్ట్రాల్. అసలు ఈ మూడూ లేని కుటుంబాన్ని నువ్వు చూడగలుగుతావా? ఎంత విషాదంరా ఇది ! నిజానికి మనకున్నదల్లా జబ్బు కాదురా, భయం. ఎక్కడ చస్తామో అన్న భయం. ఎవడురా మూడు యాభైలు బతికేది? ఎంత బాగా బతికినా ఎప్పుడో అప్పుడు చావవలసిందే కదా. చావుని మించిన తెగింపు దేనిలో ఉందిరా? మన భయాన్ని ఆసరా చేసుకునే కదా ఆసుపత్రులు బతికేది?

నిజం చెప్పు, అసలు నీకున్న రోగం ఏంట్రా – అనుమాన రోగం కదూ. ఏదో ఉందంటావ్..డాక్టర్ల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తావ్. నిన్ను తృప్తి పరచడానికి వాళ్ళు నాలుగు మందులు రాస్తారు. అయ్యో మందులే ఇచ్చారు, ఇంజెక్షన్ ఇస్తే త్వరగా తగ్గిపోయేది కదా అంటావ్. ఇంజెక్షన్ ఇస్తే టెస్టులు చేయకుండా, వ్యాధి నిర్ధారణ కాకుండా ఇచ్చాడే అంటావ్. టెస్టులు రాస్తే వ్యాధి తనకు తెలుసు, కన్ఫర్మేషన్ కోసం చేశాడు, ఇంకా ఆపరేషనే తరువాయి అని ఏడుస్తావ్. ఏదీ లేదని చెప్పినా ఏదో ఉందన్న నీ అనుమానమే నీకున్న పెద్ద జబ్బురా. నీ లాంటి వాళ్ళ వల్లే కదా, వీధి వీధికో ఆసుపత్రి వెలిసి, అంటువ్యాధిలా వీధి వీధంతా పాకుతోంది. ముక్కు చీదితే భయం, మొఖం వాస్తే భయం. దగ్గు వస్తే టీ.బీ., దడొస్తే ఓపెన్ హార్ట్ సర్జరీ. దేనికిదంతా?

నీ అలవాట్లే నీ జబ్బులని నువ్వెందుకు గుర్తించవు? ఇటు కాలు అటు తీసి పెట్టవు. పేపర్లు చదువుతుంటే అక్కడికే టిఫిన్లు రావాలి. నువ్వు లేచేలోగా బెడ్ మీదికే కాఫీ రావాలి. ఆన్ లైన్లో కూరగాయలు, సరుకులు, పాలు...వంటకో మనిషి, గార్డెన్ కో మనిషి, ఇంటికో మనిషి. పైగా జీవితమంతా కష్ట పడ్డారు, ఇకనైనా సుఖపడమన్నారు అమెరికాలోని పిల్లలు అంటావ్. డబ్బులు డాలర్లలో వస్తున్నాయని కూర్చుంటే జబ్బులు కూడా రాకెట్స్ లోనే వచ్చి పడతాయ్. మూడు బస్సులు మారి ఆఫీసుకెళ్లిన రోజులు, నాలుగు సంచుల సరుకుల్ని అలవోకగా మోసుకొచ్చిన రోజులు, వారానికి రెండు రోజులు మార్కెట్టుకెళ్లి కూరగాయలు తెచ్చుకున్న రోజులు గుర్తు చేసుకో. ఆ రోజుల్లో జ్వరం వస్తే, ఖాళీ జేబులు గుర్తొచ్చి లంఖణం పరమౌషధం అని చెప్పి ఎన్నిసార్లు చెయ్యలేదురా మనం.

బావుల్లో నీళ్ళు తాగే కదా బతికాం, ఫిల్టర్ నీళ్ళెక్కడివి? గానుగ పట్టిన నూనెతోనే కదా వండుకున్నాం. రాళ్ళ ఉప్పునే కదా తిని బతికాం. వేప పుల్ల తోనే కదా పళ్ళు తోముకుని ఉన్నాం. బెల్లం పిండి వంటలే కదా అప్పట్లో దొరికేవి? అయినా ఈ గీజర్లు అప్పట్లో లేవు కదరా, చన్నీళ్ళ స్నానమే కదా చేసాం. దాని వల్లే కదా లింఫోటిక్ వ్యవస్థ చక్కగా పనిచేసి, ఇన్ఫెక్షన్లు, టాక్సిన్లు, రసాయనాలు బయటకు పోయి దుక్కల్లా ఉండేవాళ్లం. చెప్పులు లేకుండా నడవడం, ఎండల్లో తిరగడం అన్నీ ఆరోగ్య సూత్రాలనే ఇప్పుడంటున్నారు.

నీకు గుర్తుందా, మన ఇంటి నిండా బెండ పాదులుండేవి. పిల్లలకి లెక్కలు బాగా వస్తాయని ఎక్కువగా వండేవాళ్లు. దాంట్లో ఉండే లెక్టిన్ అనే ప్రోటీన్ వల్ల రొమ్ము కేన్సర్ రాదని, బెండ గింజల వల్ల మధుమేహం మొహం చాటేస్తుందనీ, కే–విటమిన్ వల్ల ఎముకలు బాగుంటాయని ఇప్పుడు చెప్తున్నారు. బెండకాయని నిలువుగా చేసి, రాత్రంతా నీళ్ళలో నానబెట్టి పొద్దుటే ఆ ముక్కలు తీసి నీళ్ళు తాగి నాన్నగారు మధుమేహాన్ని నియంత్రించుకున్నారని నీకూ, నాకూ తెలుసు. వెల్లుల్లి కేన్సర్ కి దివ్య ఔషధమని ఐదారు వెల్లుల్లి రెమ్మల్ని పొట్టు తీసిన వెంటనే తినకుండా, 15 నిమిషాల తర్వాత తింటే 166 రకాల జబ్బుల్ని అరికడుతుందని ఆయుర్వేద గ్రంథం చెపుతోంది.

భూగోళం మీదున్న సమస్త పోషకాహార లోపాల్ని, సకల రోగాల్ని నివారించగల సత్తువ మునగాకుకి ఉందని మునగని ఆఫ్రికా దేశాల్లో కల్ప వృక్షంగా కొలుస్తారు. The Trees for Life సంస్థ మునగ గురించి చెప్పేదాకా ఏ దేశమూ దానివంక చూడలేదు. వంద గ్రాముల మునగాకులో నారింజ కన్నా ఏడు రెట్ల సి–విటమిన్, అరటి పండులో కన్నా మూడు రెట్ల పొటాషియం, పాలకూరలో కన్నా మూడు రెట్ల ఐరన్, బాదం లో కన్నా ఈ–విటమిన్, పెరుగులో కన్నా రెండు రేట్లు ప్రోటీన్లు – ఇలా 96 పోషకాలున్న ఏకైక చెట్టు ప్రపంచం మొత్తం మీద మునగ ఒక్కటే. మనవాళ్ళు కొన్ని వందల ఏళ్లుగా మునగని వాడుతున్నారనే సంగతి అందరికీ తెలిసిందే.

నీకు ఇక్కడో విషయం గుర్తు చెయ్యాలి. 14 ఏళ్ల లోపు పిల్లలు థాయ్ లాండ్ లో లువాంగ్ గుహలో కెళ్ళి, వరదలో చిక్కుకొని, తొమ్మిది రోజులు ఏమీ తినకుండా కూడా బతికి బయట పడ్డ విషయం నీకు గుర్తుందా. బౌద్ధ సన్యాసి అయిన ఫుట్ బాల్ కోచ్ ఎకపోల్ ధ్యానం ద్వారా ఒక్కో అవయవం నుంచి శక్తి తీసుకోవడం ద్వారా బతకొచ్చు అని, ఆ పిల్లల చేత ధ్యానం చేయిస్తూ బతికించి, ఆచరణాత్మకంగా నిరూపించాడు. అలాంటి ధ్యానం కానీ, యోగా కానీ పుట్టింది మన

దేశంలోనే. వనమూలికలు, వన జీవన విధానంలోని ఆయుర్వేద విధానాలు మన దేశంలో ఉన్నట్టుగా ఏ దేశంలోనూ లేవు. నీ ఆరోగ్యం నీ చేతుల్లోనే ఉంది హరీ! మనం 'హరీ' అనకముందే, గొంతులో కాసిని తులసి నీళ్ళు పడకముందే కళ్ళు తెరు, నిజం గ్రహించు. క్రమం తప్పకుండా వాకింగ్ చెయ్యి. యోగా సంపూర్ణ ఆరోగ్యానికి సూచీ అని గుర్తించు. పోపుల డబ్బా – మనం పది కాలాల పాటు ఆరోగ్యంగా జీవించడానికి దివ్యౌషధమని గుర్తించు.

అయినా హరీ, అమరత్వమనేది మందులతోనో, వైద్యంతోనే రాదురా. మనం చేసే మంచి పనుల వల్లే మన ఈ భూలోకంలో శాశ్వతమైన పేరుతో నిలబడిపోతాం. చేతి నిండా టైముంటే అనాథ శరణాలయానికి వెళ్ళి పాఠాలు చెప్పు. జేబు నిండా డబ్బు ఉంటే స్లమ్ కి వెళ్ళి నాలుగు మంచి పనులు చేయించు. మాటలు చెప్పే నేర్పుందా యువత దగ్గరకెళ్లి చెడు వ్యసనాలు మాన్పించు.

ఉండనా మరి,

ఇట్లు
నీ హితైషి
– సాయి నవీన్

# స్వప్న నగరం!

ఓ నా హైదరాబాద్ ! నా వాలెంటైన్ !

భారత్ కీ షాన్ !

తెహాజీబ్ కీ పహచాన్ !

నిన్ను నిరంతరం ప్రేమించే నేను దిల్ మే హిందుస్తాన్ ని, దడ్ కన్ మే హైదరాబాదీ ని !

ఇన్నేళ్లుగా నిన్ను చూస్తున్నా, నీతో కల్సి నడుస్తున్నా నీ మీద నాకున్న ప్రేమ పెరిగిందే తప్ప తరగలేదు. ఎందుకు నాకు నువ్వంటే ఇంత ఇంత అనురక్తి అని ఎన్నోసార్లు నన్ను నేను ప్రశ్నించుకుంటాను. అది జవాబు లేని ప్రశ్నే అవుతుంది. అమ్మ నవ్వుతుంటుంది నీ వాలెంటినా ఎప్పటికీ ఎప్పటికీ evergreen రా అని. నా భార్య కూడా అప్పుడప్పుడూ దెప్పుతుంటుంది. ఎంతైనా మీ మొదటి ప్రేయసి హైదరాబాదేనంటూ –

ఎవరు మాత్రం నిన్ను ప్రేమించకుండా ఉంటారు చెప్పు – ఉదయరాత్రుల మధ్య మా గన్ను సంచలనంగా రెండు ప్రపంచాల మధ్య మెలకువ స్వప్నంగా ఉంటావు – ఆదాబ్ నమస్తేలను ఏకం చేస్తూ 'మినీ యేచర్ ఆఫ్ ఇండియా' గా మెరుస్తావు. నడిచే నుమాయిష్‌లా, ప్రేమ చిహ్నాల నెలవులా, గుండె చప్పుళ్ళ కొలువులా వుండే నువ్వు కాలపరీక్షకి నిలిచి గెలిచిన కాలాతీత ప్రేమ మూర్తివి. రంజాన్ వేళల్లో నిన్ను చూస్తుంటే 'జమీన్ పర్ తారే ఆగయా' అనిపిస్తుంది. అసలు నువ్వంటేనే ప్రేమ – ప్రేమంటేనే నువ్వు అనుకునేంతగా నిలువెత్తు ప్రేమగా నచ్చేస్తావ్ – హుస్సేన్ సాగరాన్ని ప్రేమ సింబల్ గా మార్చేసిన ప్రేయసివి నువ్వు కాక ఎవరుంటారు చెప్పు ....?

అంతా భాగమతి, కులీ కుతుబ్ షా ల గురించి మాట్లాడుకుంటారు కానీ 'ఇంటర్ రేషనల్' లవ్ స్టోరీగా చెప్పుకునే హైదరాబాద్ ప్రైమ్మినిస్టర్ మెహమూద్ అలీఖాన్ మనవరాలు ఖైరున్నీసా – కిర్క్ ప్యాట్రిక్ గురించి చెప్పరేమిటి ? ఇక్కడి వేష భాషలు నచ్చి జర్దోసితో చేసిన షేర్వాణీలు ధరిస్తూ ఉర్దూ నేర్చుకుని కవిత్వాలు రాసి కోఠి రెసిడెన్సీని నిర్మించిన గొప్ప మేధావి కిర్క్ ప్యాట్రిక్.

నీకు గుర్తు లేదని కాదు కానీ సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ మాటల్ని మరో మారు గుర్తుచేయనా ?

'హిందుస్తాన్ కా దిల్ దేఖ్ నే కే లియే<br>
హైదరాబాద్ కా తెహాజీబ్ జాన్ నా జరూరీ హై'

ఎంత గొప్ప మాట కదా ! ఇండో చైనా వార్ తర్వాత దేశ ఆర్థిక పరిస్తితి అతలాకుతలంగా ఉన్నపుడు దేశ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి గారు ప్రతి రాష్ట్రాన్ని ఆర్థిక సాయం చేయాల్సిందిగా అభ్యర్ధించారు. శాస్త్రిగారు హైదరాబాద్ సంస్థానానికి వచ్చినపుడు విమానం నిండా 5 టన్నుల బంగారాన్ని నింపి పంపిన నీ విశాల హృదయాన్ని ఈ దేశ

పౌరుడు మర్చిపోగల్గుతాడా ! ఎన్నెన్ని గొప్ప సుగుణాలు నీలో ఉన్నయ్యో తెల్సా – అయినా పొగిడించుకోవటం మీ ఆడవాళ్ళకు సరదా కదా మరో మారు చెప్తాలే ....!

ఇంతకీ హైదరాబాద్ అంటే...

సిటీ ఆఫ్ లవ్ – సిటీ ఆఫ్ డైవర్సిటీ

సిటీ ఆఫ్ రాక్స్ – సిటి ఆఫ్ లేక్స్

సిటీ ఆఫ్ లాంగ్వేజెస్ – సిటీ ఆఫ్ పెహల్వాన్స్

సిటీ ఆఫ్ నవాబ్స్ – సిటి ఆఫ్ కబాబ్స్

సిటీ ఆఫ్ పెరల్స్ – సిటి ఆఫ్ గజల్స్

సిటీ ఆఫ్ మైగ్రేన్స్ – సిటీ ఆఫ్ సినిమాస్

సిటీ ఆఫ్ ఆర్ట్ – సిటీ ఆఫ్ మూమెంట్స్

సిటీ ఆఫ్ టూంబ్స్ –

అంతెందుకు నిన్ను గురించి ఒక్క మాటలో చెప్పాలంటే '6 B' లని చెప్పాలి.

| | | |
|---|---|---|
| బ్యాంగిల్స్ | – | కస్టమైజ్ చేస్తారు |
| బిస్కెట్స్ | – | తయారు చేస్తారు |
| బిర్యానీ | – | రుచితో కట్టిపడేస్తారు |
| బోనం | – | గ్రామదేవతలకు భోజనం పెడతారు |
| బాగ్ లు | – | ఉద్యానవనాల మయం |
| బన్ను | – | మస్కారాతో లాగిస్తారు |

ఇరానీ ఛాయ్ ని ఉస్మాన్ బిస్కెట్ తో నంజుకు తాగుతూ జీవితాన్ని గడిపేవాళ్ళు కొందరైతే, బిర్యానీ రుచిని, హలీం ని మర్చిపోలేక మళ్ళీ మళ్ళీ హైదరాబాద్ వచ్చే వాళ్ళు మరెందరో ... నిన్ను మీటింగ్ పాయింట్ ఆఫ్ సౌత్ అండ్ నార్త్ గా కీర్తించడం ఎంతో గొప్పతనం తెల్సా!

ప్రపంచంలోనే అతి పెద్ద సాలార్ జంగ్ మ్యూజియం నీ ఇల్లు. ఇప్పటికీ అంతుచిక్కని ఇంజనీరింగ్ అద్భుత కట్టడం గోల్కొండ కోట నీ కిరీటం. అందులోని డ్రైనేజ్ వ్యవస్థ, ఎకోస్టిక్స్ లు ఇప్పటికీ ఆశ్చర్యాలే. బాహ్య వలయ రహదారి నీ వడ్డాణం. నెక్లెస్ రోడ్ నీ కంఠాభరణం. సైబర్ సిటీ నీ దండ కడియం. మెట్రో నీ కాసుల పేరు....

ఇవన్నీ బాహ్య సౌందర్యాలే అనుకో... అన్నిటి కంటే గర్వకారణం నీ బిడ్డలు కదా. జైహింద్ నినాదాన్ని తొలిసారి ప్రకటితం చేసిన అబిద్ హసన్ సఫ్రానీ, అంబేడ్కర్ కే స్ఫూర్తిగా నిల్చిన భాగ్యరెడ్డి వర్మ, ప్రపంచ ప్రఖ్యాత పేయింటర్ MF హుస్సైన్, ప్యారలల్ సినిమాకే c/o అడ్రెస్ గా నిలిచిన శ్యామ్ బెనగల్, ప్రపంచ ప్రసిద్ధ ప్రజాకవి ముగ్ధూమ్ మొహియుద్దీన్, దేశంలోనే మొట్టమొదటి కవయిత్రి మా లకాబాయి చందా, అద్భుత నర్తకీమణులు తారామతి, ప్రేమావతిలు నీ కీర్తి శిఖరాలే. అంతెందుకు నాటకానికే అజరామరమైన కీర్తిని ఆర్జించిన బబ్బన్ ఖాన్, స్వాతంత్ర్య పిపాశతో వీరత్వాన్ని చాటి ఉరితీయబడ్డ తుర్రే బాజ్ ఖాన్, ఇమ్రోజ్ ఎడిటర్ షోయాబుల్లా ఖాన్, క్రికెట్ రంగాన్ని దిశా నిర్దేశం చేసిన ML జయసింహ, గులాం అహ్మద్, ఫుట్ బాల్ దిగ్గజాలు యూసుఫ్ ఖాన్, జుల్ఫకరొద్దీన్ లను ఎవరైనా విస్మరించగలరా ? ఎంతగొప్ప చరిత్రలమ్మా వారివి. నువ్వు చెప్పు వాలెంటీనా! నీ దగ్గర ఎన్నెన్ని హంగులున్నాయో కదా ... గర్వ పడే అంశాలే కదా సిగ్గుపడ్తావెందుకు? నేను చెప్పనా ...?



* ఎప్పటివో అయినా 1700 సంవత్సరం నుండి ప్రపంచ దృష్టిని ఆకర్షించిన ఫిసల్ బండలోని సమాధులు ...1543 నుండి 1672 వరకు అంటే దాదాపు 125 సంవత్సరాలకు పైగా కట్టిన కులీ కుతుబ్ షా టూంబ్స్ – 1672లో హయత్ బక్షీ సమాధి, ముషీరాబాద్ సమాధి, 1687 నాటి ఖైరతాబాద్ సమాధుల సరసన నిలబడగల అద్భుత చాతుర్యం ఎక్కడైనా కన్పిస్తుందా ?
* మహేశ్వరం ప్రాంతంలో ఉన్న అక్కన్న సరాయ్ ని చరిత్ర ఎప్పుడో ఒడిసి పట్టింది, ఆర్మోనియం సిమెట్రీ, మాంటిస్ బార్, రవి బార్, ప్రకాష్ బిల్డింగ్, సీతారాంబాగ్ ఆలయం, రణచంద్ అహోతి చంద్ దేవిడి, సుల్తాన్ బజార్ లోని రాజా భగవాన్ దాస్ భవనం, 1910 రిట్జ్ హోటల్, 1900 నాటి లేడీ హైదర్ క్లబ్ ప్రపంచంలో మరెక్కడైనా గమనిస్తామా ?
* 1578 లోనే మూసీనదిపై నిర్మింపబడ్డ 22 ఆర్చిల వంతెన సోయగం పురానాపుల్, 1580 నాటి దర్వాజా, 1592– నాటి బార్ షాపీ అశుర్ ఖానా, 1617 లో మీర్ పైజుల్లా బేగ్, రంగయ్య చౌదరీలు కలిసి నిర్మించిన మక్కా మసీద్, 1971 లోని టోలి మసీదులు చరిత్రకే కొత్త అందాలు తెచ్చిన అద్భుత కట్టడాలు ...
* ప్రముఖ నర్తకీమణులైన తారామతి, ప్రేమావతీల బారాదరి నిర్మాణం 1625 లోనే కదా జరిగింది
* భారత కోకిల సరోజినీ నాయుడు నివాసం golden thrishold గురించి కదా మనం గర్వపడాలి..

రత్నాలను రాసులుగా, ముత్యాలను మేటలుగా వేసి, మఖముల్ పై వజ్రాలను పరిచి దేశ విదేశీ యాత్రికులు ముక్కున వేలేసుకునేలా అమ్మకాలు చేసిన చరిత్ర నీది కాక ఇంకెవ్వరిది. అంతెందుకు ప్రపంచ ప్రసిద్ధ వజ్రం కోహినూర్ నీ సిగ నుండి రాలిన పువ్వే కదా...

వాస్తు నిర్మాణ శైలిలో ప్రపంచంలోని ఏ ప్రాంతానికీ లేని ప్రత్యేకత నీది. అయినా నాకు అసంతృప్తి బాగా వుంది ప్రేయసీ! అయినా నీకు తెలియదా ఏమిటి? 75సంవత్సరాలు దాటితేనే ప్రాచీన కట్టడాల పరిధిలోకి వస్తాయని ఒక గెజిట్ వుంది. అలాంటివి నీ దగ్గర 137 ప్రాంతాలున్నాయి. అయినా ప్రాచీన హోదా రావటం లేదు. హెరిటేజ్ హోదా వస్తే 2500 కోట్ల మేర ఆర్థిక సహాయం అందుతుందని నేను ఆశ పడటం లేదు. కానీ ప్రపంచం నలుమూలలకు నీ కీర్తి పాకుతుంది కదా, లక్షల్లో పర్యాటకులు వస్తారు కదా అని ఆశపడుతున్నాను. మన దేశంలో ఇప్పటి వరకు 37 ప్రాంతాలకు మాత్రమే ఈ హోదా ఇచ్చారనుకుంటాను.

హెరిటేజ్ కట్టడాలకు 200 మీటర్ల పరిధిలో ఎలాంటి ఆధునిక నిర్మాణాలు వుండరాదన్న నిబంధన వల్లనే మనకు ప్రాచీన హోదా ఆలస్యం అవుతుందని నేను భావిస్తున్నాను. ఆ ఆ ... నువ్వలా బుంగమూతి పెట్టకు... హుడా ఏర్పడ్డప్పటి నుండి మా ప్రయత్నాలు ముమ్మరం చేశాం ... అంటే1990 నుండి అన్నమాట. 400 యేళ్ళు పూర్తి చేసుకున్నప్పుడు అదే 1991 లో నిన్ను చూసేందుకు దేశం నలుమూలల నుండి కోటి మంది పర్యాటకులు వచ్చారట కదా! 2006 లో సికింద్రాబాద్ 200 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు జరిపిన సంబురాలలో 25 లక్షల మంది పాల్గొన్నారట కదా! నువ్వు ఎంత గొప్పదానివో అర్థమయిందా ?

అయినా నీకు అభియోగాలన్నీ నా మీదే కానీ 1914 లోనే నిజాం నవాబు ఆర్కియాలజీ విభాగాన్ని ఏర్పాటు చేసి తొలి అధికారిగా డాక్టర్ గులాం యెజ్దాని ని నియమించాక ఆయన పరిశోధనలు చేసి అజంతా ఎల్లోరా గుహలకు ప్రాచీన హోదా ఇప్పించారు. కానీ మనకి అదే నీలోని అలంకారాలైన టూంబ్స్ కో, గోల్కొండ కో మిగిలిన 135 కట్టడాలకో ఇప్పించొచ్చు కదా ! ఆనాడు తనను నువ్వు అడగలేదు. నువ్వు అడగకపోయినా బాధ్యత గల నిన్ను నిరంతరం ప్రేమిస్తున్న నేను చెప్తున్నా... ప్రతిబంధకాలు నిబంధనలే తప్ప ప్రయత్నలోపం మాత్రం కాదు సుమా! త్వరలో ఎన్నెన్నో శుభవార్తలు వింటావులే. అయినా ప్రేయసీ నిన్ను గురించి చెప్పాల్సొస్తే ఈ TV వాళ్లంటి చార్మినార్ ని

చూపిస్తారు ? నగరమంతా కలరా సోకి అతలాకుతలం అయిన 1950 –51 లల్లో గోల్కొండ నుండి చించలం వచ్చి బస చేసిన షా తిరిగి గోల్కొండ వెళ్తున్నప్పుడు ఆ జ్ఞాపకంగా చార్మినార్ ని నిర్మించి వుండవచ్చు. కానీ ఇప్పుడు నాకు ఆ చార్మినారే నువ్వుగా, నువ్వే ఆ చార్మినార్ గా అందంగా కనిపిస్తావ్.

ఒక మినార్ చారిత్రక వారసత్వం
ఒక మినార్ సాంస్కృతిక దర్పణం
ఒక మినార్ పర్యాటక చేతనం
ఒక మినార్ విశ్వజనీన కేతనం

వేల వేల స్వప్నాల, లక్షలాది ఆకాంక్షల వెలుగు నీడలకు సంకేతంగా నాలుగు వందల తరాల జీవితంగా అనిపిస్తావు నువ్వు. అంతెందుకు బోనాల పండగొస్తే నువ్వు బోనం ఎత్తుకుని రంగం మీద భవిష్యవాణి చెప్పేందుకు కూర్చున్నట్టుగా కనిపిస్తావ్.

అయినా ఇప్పటిదా ఈ బోనాల ఆచారం ...? నువ్వు పల్లెగా ఉన్నప్పుడు ఈ నాటి సికింద్రాబాద్ శివారు గ్రామాలైన 'చిన్నతొకటే' లోనే జనావాసం వుండేదట. అక్కడ ఈ బోనాలు చేశారట. కులీకుతుబ్ షా కాలంలో 1675 లో అబ్దుల్ హసన్ తానీషా గోల్కొండ లో రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని నిర్మించి బోనాల సంబురాలు నిర్వహించినట్టు చారిత్రక ఆధారాలున్నాయి.

లష్కర్, లాల్ దర్వాజ, ధూల్ పేటలలో బోనాలు ఉత్సవ రూపాన్ని సంతరించుకున్నాయి. బోనంలో ఆత్మగా, బతుకమ్మ రూపంగా కన్పిస్తావు. స్థల కాలాదుల్లో మార్పులొచ్చినట్టుగా నీలోనూ మార్పులొచ్చినప్పటికీ సికింద్రాబాద్ మహంకాళీ ఆలయం 1815 లో సురటి అప్పయ్య నిర్మించినప్పటి నుండే ఏనుగు అంబారీ మీద ఊరేగింపులు జరుపుతున్నట్లుగా... బోనాల సంబురాలు అంబరాన్ని అంటినట్లుగా గతం నా కళ్లముందు సజీవంగా కన్పిస్తున్నట్టుంది. మొహరం రోజు మాత్రం చార్మినార్ వీధులన్నీ రక్తపు కన్నీళ్లు కారుస్తాయి – వాళ్ళ త్యాగాల్ని గుర్తు చేసుకుంటూ వారి వీరత్వాన్ని ప్రకటిస్తూ –

అయినా హైదా ! ఈ పత్రికల వాళ్లేమిటి సంక్రాంతికి, దసరాకి బోసిపోయిన రోడ్లు చూపిస్తూ 'ఊరెళ్లిన నగరం' అంటూ రాస్తారు. లాల్ దర్వాజ బంగారు బోనాన్ని దర్శించటానికి, గోల్కొండ కోటలోని బోనాన్ని తీసుకెళ్లటానికి, భవిష్యవాణి వినటానికి ఊళ్ళకి ఊళ్లే నీ వడిలోకి వస్తాయని వాళ్ళు తెలుసుకోరా ? రోడ్లన్నీ కిటకిటలాడుతూ వుంటే నగరంలోకి ప్రతి ఇల్లు పల్లెల నుండి వచ్చే అతిథులకు ఆదరంగా ఆతిథ్యమిస్తూ ఉంటుంది. అప్పుడు రాయాలికదా పట్నం సంకనెక్కిన పల్లెలు అని లేదా నగరం వడి చేరిన గ్రామాలు అని...

వాళ్ళ సంగతి మనకెందుకులే, బోనాల్లో ఆట, బతుకమ్మలో పాటగా నువ్వు సంచరిస్తున్నప్పుడు నీ అందం మరింతగా పెరుగుతుంది తెల్సా! ఉయ్యాల పాటలు, కోలాటం పాటలు, చందమామ పాటలతో, చప్పట్లతో అతివలంతా ఆడుతుంటే చూడటానికి రెండు కళ్ళూ చాలవనుకో... రాత్రంతా జరిగే మూషాయిరాలు, వహ్వాలతో దద్దరిల్లే ఖవ్వాలీ గానాలు, వినసొంపైన గజల్స్ తో మైమరపించే ఉర్దూ సోయగాలు మనసును మరో లోకాలకు తీస్కెళ్లే సూఫీ సంగీతాలు – జానపదుల్ని నగరపు నడి బొడ్డున ఆడించే చిందు, ఒగ్గుడోళ్ళ విన్యాసాలు, వింతైన వస్త్రధారణతో ఆకట్టుకునే బంజారాలు, పాశ్చాత్య నాగరికతకు వేదికలైన హిప్‌హాప్‌లు, సల్సా నృత్యాలు ఒకటేమిటి ప్రపంచ సంస్కృతికి మినీ మేచర్ గా నువ్వే కన్పిస్తావు. గొప్ప సాంస్కృతిక వారసత్వానివి నువ్వు. ఎవరో అన్నట్టు ఆదరించమని చాచిన దోసిట అక్షయ పాత్రవు నువ్వు. ఇక్కడ కొలువైన పెద్దమ్మ తల్లిలా నీదీ పెద్ద మనసే.

బాధ్యతల్ని క్యారీ బ్యాగుల్లో వేసుకుని వలసొచ్చిన పల్లె వాసులు ఎంతో ఆశగా నీ పంచన చేరతారు. ప్రతి ఒక్కరిదీ

ఒక్కొక్క గాయపు కథే – ఆ గాయాన్ని మాన్పి ఆ భయాన్ని పారద్రోలి ఓ నాలుగు మెతుకుల్ని, నాలుగు రూకల్ని అందివ్వాలన్న తాపత్రయం నీది. అప్పుడెప్పుడో షా నదిలోని చేపల్లా నగరమంతా జనాలతో నిండాలి అని కోరుకున్నట్టు దాదాపు కోటిన్నరకు విస్తరిస్తుంది జన సంద్రం. చలనమే జీవన సంకేతంగా – కదలికే బతుకు మాధుర్యంగా కన్పిస్తావు నువ్వు. కాషాయ బావుటాలు, ఆకుపచ్చ పతాకాలు ఓ వైపుగా సహజీవన సౌందర్యాన్ని ప్రకటిస్తుంటావు.

మిలాన్ చాయ్, చైనీస్ ఫుడ్, మొఘలాయి బిరియాని పక్కపక్కనే సహవసించే సహజత్వం నీ స్వంతం.. రంజాన్, బోనాలు, క్రిస్మస్ పండుగలన్నింటినీ పరవశంగా చేసుకునే మతసామరస్యాన్ని చిన్నప్పటినుండీ అలవర్చిన పెద్దరికం నువ్వు. వలసదారుల స్వర్గం నువ్వు. అమ్మలా కడుపు చూస్తావు. కష్టపడే మనస్తత్వం ఉన్నవాళ్ళకి నాలుగు పనులు చూపిస్తావు. ఇరానీ చాయ్, బన్, బటర్, జామ్ లతో కడుపు నింపుతావు.

నాన్నలా పాలిస్తావు. మాదక ద్రవ్యాలు, ఉగ్ర పంజాలు, మత మౌఢ్యాల ఇష్టారాజ్యంగా సంచరించగల అవకాశాల్ని దాటిస్తూ వేలుపట్టుకుని నడిపించినట్టుగా మంచి దారిలో నడిపిస్తావు. ప్రతి ఒక్కరూ పక్కనున్న మనిషిని ఇంటి మనిషిలా అనుకుని తనకు దొరికిన పనిలో, ఆహారంలో భాగం పంచేలా మంచితనాన్ని నేర్పావు.

అన్నలా ప్రతీదీ ఆరా తీస్తావు. వెళ్లాల్సిన దారిని నిర్దేశిస్తావు. భాష రాకున్నా, భావం తెలియకున్నా భిన్నత్వంలో ఏకత్వాన్ని చూపిస్తూ అండగా వుంటావు. క్షణికావేశంలో ఇల్లొదిలిన ఆడపిల్ల నీ మీద కాలుమోపితే చాలు గద్దల్లా ఎత్తుకెళ్లాలని చూసే వాళ్ళ నడ్డి విరుస్తావు. షి టీమ్స్ ని గెలిపిస్తావు.

సోదరిలా రాఖీలు కడతావు. హోలీలో రంగులు చల్లుతావు. నాగుల పంచమికి కళ్ళు కడుగుతావు. వడి బియ్యాలు అందుకుంటావు. రంజాన్ మాసంలో సేమ్యా పాయసాలు వండుతావు. అన్నా అంటూ అందర్నీ ఆత్మీయంగా పలకరిస్తూ అందరూ బాగుండాలని ఆ అందరిలో నువ్వుండాలని తపన పడుతుంటావు.

ఏ రూపమని చెప్పను ? ఎన్ని పాత్రలని వర్ణించను ? టాంగాలెక్కి, రిక్షాలెక్కి, ఆటోలెక్కి, డబుల్ డెక్కర్ బస్సులెక్కి, MMTC లు, మెట్రో రైలు ఎక్కి ఎలా వచ్చినా – ఎక్కడి నుండి వచ్చినా అందర్నీ నవ్వుతూ ఆదరిస్తూ ఆవాసయోగ్యమైన ప్రాంతంగా నిన్ను నీవు మలుచుకుంటావ్, మారుతుంటావ్. నిజం చెప్పాలంటే ప్రతి రోజూ వేల మంది నీ దగ్గరికి వలసొస్తారు. అది చూసే కదా గుంపులు గుంపులుగా ఎగిరే లోహ విహంగాలు బేగంపేట్ గూడు సరిపోక శంషాబాద్ లో పెద్ద గూడు నిర్మించుకున్నాయి.

వాతావరణాన్ని బట్టి ఈ దక్కన్ పీఠభూమి అందరికీ సరిపడుతుందన్న భరోసాని నువ్వు కల్పించావు కాబట్టే దేశవిదేశీ జనాలందరూ ఇక్కడ స్థిరపడి జనాభాని పెంచేస్తున్నారు. ప్రపంచంలో ఇన్ని నగరాలుండగా నిన్నే ఎందుకు ఇంతగా ఇష్టపడ్తున్నారు అని ఆలోచిస్తుంటే అర్థమైంది – నగరాల్లో ఎక్కువ నగరాలు పుట్టుకతోనే మేము నగరాలం అన్న అహంతో ప్రవర్తిస్తాయి . నువ్వు మాత్రం నీ గ్రామ సంస్కృతిని, ఆచారాలను, ఆర్తిని బతికించుకుంటూ మానవత్వపు చెలమలా రోజూ కడుపు నింపుతుంటావు...

నిజానికి నువ్వంటే ఓ ధైర్యం, ఓ స్ఫూర్తి, ఓ జీవనార్తి, జాయ్ ఆఫ్ లివింగ్ కీ, ఆర్ట్ ఆఫ్ లివింగ్ కీ సంకేతంలా, బ్రతుకు చిత్రంలా, ఇతివృత్తాల గమనంలా నిల్చి ఆత్మవిశ్వాసాన్ని కల్గించే ప్రేమైక మనస్వివి నువ్వు ...

నువ్వంటే –
చిరిగిన బతుకుల్లోని సెలబ్రేషన్
మెరుపుల లైట్లలోని ఫస్ట్రేషన్ ల కలయిక –
వేకువలోని చీకటి / రాత్రిలోని వెలుతురు
చరిత్రలోని ప్రస్తుతం / వర్తమానంలోని గతం

కన్నీటిలోని ఆనందం / సంతోషంలోని దుఃఖం
అన్నీ నువ్వే కదా ....
దిల్ సే మొహబ్బత్ కా రిష్తా ! రాహోం సే రాహీకా రిష్తా లాగా ...
అయినా వాలెంటీనా ! నీతో నా రిష్తా కూడా అలాంటిదే –
నువ్వు చరిత్ర చెక్కిలిపై ఘనీభవించిన చిరు ముద్దువి –
మానవాళి కన్నుల్లో విరుస్తున్న కొత్త ఆశల గీతికవి

అందుకే హైదా ! నా వాలెంటైన్... నిన్ను నేనెప్పుడూ ప్రేమిస్తూనే ఉంటాను ... బ్రతికినంత కాలం, బ్రతుకు వున్నంత కాలం ...

ఉండనా మరి...

నీ
నిత్య ప్రేమికుడు
– నీరవ్

# దేహ సిరి

రూపా !

ఎలా వున్నావ్? మొత్తానికి నువ్వనుకున్నది సాధించావ్. ధాత్రిలో ఏ రాత్రి నిద్రపోని ప్రేమనగరం పారిస్ లో ఫ్యాషన్ షో అంటే ఏంటో అనుకున్నా. మన పోచంపల్లికి పట్టం కడ్తూ నువ్వు నిర్వహించిన ఫ్యాషన్ షో స్టాండింగ్ ఒవేషన్ ని అందించింది కదూ. మోడల్స్ అందర్తో డయాస్ మీద నువ్వు నిలబడ్డప్పుడు ఆ విజయం నీదిగా కాకుండా మన ఊరిదిగా అనిపించింది ఎందుకో.

అయినా నువ్వు చేసిన ఫ్యాషన్ పెరేడ్ అంతా ఒకవైపు, చివర్లో నవ్వార్ చీర కట్టుతో గోచీ పోసి, నలభై ఏళ్ళు దాటిన ప్రౌఢ స్త్రీలతో నువ్వు చేసిన ఫ్యాషన్ షో హ్యాట్స్ ఆఫ్ ! ఆ ర్యాంప్ వాక్ సాగుతున్నంత సేపూ చప్పట్లతో హాలంతా దద్దరిల్లి పోయిందంటే నమ్ము. అయినా నీకు చెప్తున్నానేంటీ అనుకోబాకు. నువ్వు చాలా టెన్షన్ గా వున్నావప్పుడు. ఎందుకో నాకు మన కాలేజీ రోజులు గుర్తుకొస్తున్నాయ్. ఇంట్లోనేమో చెల్లెల్ని ఓణీ వేసుకోనిదే కాలేజీకి వెళ్లొద్దనేవారు. కాలేజ్ లోనేమో మిమ్మల్ని అప్పలమ్మల్లా చూసేవారు. మేమూ అంతేగా కాటన్ ఫ్యాంటు, ముడతలు పడ్డ కాటన్ షర్టు తో కాలేజికి వస్తే ఎర్రబస్సెక్కి ఇప్పుడేదిగార్రా అంటూ ఎద్దేవా చేసేవాళ్ళు. కానీ లెక్చరర్లు మాత్రం బాగా గౌరవించేవారు. అది మనం సాధించే మార్కులకో లేదా సంప్రదాయ బద్ధమైన మన డ్రస్ సెన్స్ కో..అన్నది మనకర్థమయ్యేది కాదు.

రూపా! నీకు గుర్తుందా..నువ్వు కాలేజ్ డే పోటీల్లో మీ అవ్వలాగా తొమ్మిది గజాల చీర కట్టి ఫస్ట్ ప్రైజ్ కొట్టేసావ్. చిన్నప్పట్నుంచీ నీకు చీరలంటే ఎంతో ఇష్టం. ఫ్యాషన్ టెక్నాలజీ చేసిన తర్వాత చీర కట్టు మీద పెద్ద పరిశోధన చేసావంటే, నిజం చెప్పొద్దూ నవ్వుకున్నాను. ఇంత పిచ్చితనమేంటో అనుకున్నాను. కానీ, నీ ప్రవృత్తిని వృత్తిగా మల్చుకొని నువ్వు సాధిస్తున్న విజయాలు చూసి ఎంత గర్విస్తున్నానో తెల్సా..!

ఎన్నో ప్రాంతాల్ని బట్టి, ఇంకెన్నో భౌగోళిక స్థితుల్ని బట్టి రూపాంతరం చెందుతూ వచ్చింది కదా చీర ! మా ముత్తవ్వ, మా ముత్తాత పక్కన తొమ్మిది గజాల చీర కట్టుకొని ఎంత రాజసంగా ఫోటో దిగిందో తెలుసా..హుందాగా చింగులు పోసి కట్టుకున్న తీరు ఎంతటి వారినైనా కట్టిపడేస్తుంది. ఆ తర్వాత ఇక అమ్మ విషయానికొస్తే అమ్మ సగం రోజులు చీరలు, సగంరోజులు చుడీదార్లూ వేసుకొనేది. చీర కట్టుకునే అమ్మ,టూ వీలర్ మీద వెళ్తుంటే ఆ చీరకట్టు మీద అందం ద్విగుణీకృతం అయినట్టుగా అనిపించేది. అమ్మ దూరంనుండి నడిచొస్తుంటే కుచ్చిళ్ళు నెమలి పురివిప్పినట్టుగా ఆడుతూ తన కాలి వేళ్లని ముద్దాడుతూ ఎంత అందంగా ఉండేవో.

పండగ రోజుల్లో అమ్మ పట్టు చీరల్లో మరింత అందంగా ఉండేది. కాసింత పసుపు ముఖాన రాసుకుంటుందేమో పచ్చగా మెరిసిపోతూ దోసగింజంత బొట్టు పెట్టుకొని, ఆ బొట్టు కింద దేవుని ప్రతిమలకి పెట్టిన కుంకుమ బొట్టు దిద్దుకొని, చెంగుని నడుముకు దోపుకొని, చక చకా వంటలు చేసి అందరికీ సహపంక్తి భోజనాలు పెడుతుంటే ఎందుకో

పదే పదే అమ్మని చూడాలనిపించేది. అమ్మ పాదాల మీద జీరాడే కుచ్చిళ్లలోనే నా ప్రాణం నిలబడిపోతుందేమో అన్నంత తదేకంగా చూస్తూ ఉండిపోయేవాడ్ని.

ఇంక చెల్లెలికి ఓణీలిస్తూ హాఫ్ శారీ ఫంక్షన్ చేశారు గుర్తుందా. అబ్బో అప్పుడైతే ఆ అమ్మవారే మా చెల్లి రూపంలో ఇలకు దిగిందా అన్నంత అందంగా ఉందనుకో. ఎప్పుడూ జీన్స్, టాప్స్ తో ఉండే చెల్లెల్ని అలా చూస్తే అందరికీ చెప్పలేనంత ఆనందంగా అనిపించింది. ఆ తర్వాత ఎంతో ఇష్టపడి ఎన్నెన్నో పెళ్లి చూపులు కష్టపడి చూసి మా ఆవిడ్ని సెలక్ట్ చేసుకున్నాను. ఎందుకో అన్నది నీకు తెలుసు. కారణం నువ్వే కదా ! పెళ్లి చూపుల్లో ఆవిడ కట్టుకున్న చీర తీరు చూసి ఎంతెంతో ఇంప్రెస్ అయ్యి, రోజూ ఇలా ఉండకపోయినా కనీసం వారానికి మూడు రోజులైనా చీరలో కనిపిస్తే బాగుండునని కలలు కన్నాను.

పెళ్లయ్యాక అదే విషయం చెపితే ఫక్కున నవ్వింది. ఎందుకా నవ్వు అంటే 'మీరు చేసుకునుండాల్సింది నన్ను కాదు ఆ బ్యూటీ పార్లర్ అమ్మాయిని, ఎందుకంటే ఆ చీర కట్టింది ఆ అమ్మాయే మరి' అంది. నిజం చెప్పొద్దూ భలే నిరాశ పడి పోయాను. అయితే తన ఓర్పు, నేర్పు, మంచితనం అన్నీ నాకెంతో నచ్చాయ్..ఒక్క చీర విషయంలో తప్ప. ఎన్నిసార్లు ప్రయత్నించినా తనకి చీర కుదరటంలేదు. చీర చుట్టుకున్నట్టే ఉంటుందే తప్ప కట్టుకున్నట్టుగా ఉండట్లేదు. ఈ మధ్యే ఏదో వార పత్రిక వాళ్ళు నాలుగు రోజుల్లో చీర కట్టుకోవడం నేర్పిస్తామని పేపర్ ప్రకటన ఇస్తే నా కిష్టమని నాలుగు రోజులు ఆఫీసుకి సెలవు పెట్టి మరీ వెళ్ళి నేర్చుకుంది. ఈ మధ్య కాస్త నయమే అనుకో.

అయినా రూపా, ప్రపంచ వస్త్ర ధారణ అన్నింటిలో చీరకున్నంత సెక్సప్పీల్ దేనికీ లేదనీ, ఆ కట్టుకునే తీరులోనే ఎన్నెన్నో ఒంపుసొంపులున్నాయని, కన్పించకుండా కన్పించే అందాలు, ఆ ముడతలు పడ్డ చీర మడతల వెనుక వంపులు తిరిగే విరుపులు అబ్బో అంటూ శృంగార పురుషులు ఎన్ని రకాలుగా చెప్పినా చీరకట్టు చీరకట్టే సుమా.. నువ్వే కదా పెట్టుకునే బొట్టుని, చీర కట్టుకునే తీరుని చూసి ఆ స్త్రీకెంత ఓర్పుందో తెలుసుకోవచ్చు అనేదానివి. 'నువ్వు పట్టు చీర కడితేనూ పుత్తడి బొమ్మా, ఆ కట్టుబడికి తరించేను పట్టుపురుగు జన్మ' అన్న కవి కనిపిస్తే బావుండు..సాష్టాంగ పడాలని ఉంది అతని పాదాల మీద. అయినా నువ్వెన్నైనా చెప్పు రూపా, చీరలన్నింటిలోకీ పెద్ద ముత్తైదువ పాత్ర మాత్రం కంచి పట్టు చీరదే. కంచి పట్టు చీర కనికట్టు చేస్తుంది. ధర్మవరం చీర దర్పం పోతుంది. పోచంపల్లి చీర ప్రాయాన్ని దాస్తుంది. బెనారస్ చీర బ్రహ్మాండమైన అందాన్నిస్తుంది. ఉప్పాడ చీర ఉత్సాహాన్నిస్తే, నారాయణ పేట చీర నిండుదనాన్నిస్తుంది. గద్వాల చీర పెద్దరికాన్ని అందిస్తే, మంగళగిరి చీర మన్ననని అందిస్తుంది. చూశావా రూపా, మనుషులు ఎన్ని రకాలో ఈ చీరలూ అన్ని రకాలే. ఎవరు ఏ చీర కట్టి కనికట్టు చేసినా ఆ చీరలో కనిపించే అందం కన్నా, ఆ చీరలో ఉన్న అతివ అందించే ఆత్మీయతే నన్ను కట్టిపడేస్తుంది తెలుసా.

నీకు తెలుసుగా మా హంసా పెద్దమ్మ..తన నవ్వార్ చీర కట్టులో కాస్త మహారాష్ట్ర ఆచార వ్యవహారాలు మన చీర కట్టు అలవాట్లు కలగా పులగంగా కనిపించేవి. నేను రవివర్మ అభిమానిని కదా. మా ఇంటి నిండా రవివర్మ పెయింటింగ్సే ఉంటాయి కదా. ఎన్ని సార్లు చూసినా ఆ పెయింటింగ్స్ లోని స్త్రీలు నాకు మామూలు మనుషుల్లా అనిపించరు. వెలిగిపోతున్న వర్చస్సు తో దేవత లా కనిపిస్తారు. ఆలోచించగా ఆలోచించగా వారి చీర కట్టే వారి అందాన్ని మరింత పెంచిందేమో అనిపించేది. గోచి కట్టు, మట్టి గాజులు, తలలో బంతిపూలు, ముఖాన పెద్ద బొట్టుతో మన ఊరి దేవతల్లా అనిపిస్తారు. దక్కనీ సాంస్కృతిక వారసత్వాల్లో ఈ గోచి కట్టు కూడా ఒకటేమో. నుడి మహారాష్ట్రది కావచ్చేమో గానీ, అందం మాత్రం మన తెలుగు వాళ్ళదే సుమా.

భాషా శాస్త్రం లో చీరకి విస్తృతమైన అర్థం ఉంది. చీర అంటే శరీరాన్ని కప్పేది అని మాత్రమే చెప్పుకున్నారు . చీరకి లింగభేదాన్ని చూపించ లేదు . కానీ రాను రాను అర్థ సంకోచం చెంది చీర అనే పదాన్ని ఆడవాళ్ళకి మాత్రమే పరిమితం చేశారు . విచిత్రంగా అనిపిస్తుంది కదా!

ఇప్పుడు ఈ ఆధునిక యుగంలో చీరకట్టే ఓ వృత్తిగా మారింది తెలుసా! సంప్రదాయానికి ఆధునికత అద్దుతూ, జీన్స్, పలాజో, ఫ్లోర్లెంగ్త్ గౌను, లెగ్గింగు, ధోతీ, కుర్తా, పటియాలా, లెహెంగా వంటి వాటిమీద చీర ధరిస్తూ కొత్తగా మెరుస్తోంది యువతరం. దుస్తుల డిజైన్లతో పాటూ శారీ డ్రైపర్లను ఆహ్వానిస్తున్నారు అమ్మాయిలు. డాలీ జైన్ అనే కోల్కతా అమ్మాయి మూడువందల ఇరవై ఐదు రకాలుగా చీర కడుతూ రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తోంది. నాలుగు చేతులా సంపాదిస్తోంది. లెహెంగా స్టయిల్ కి చీర కట్టుని అనుసంధానించి హిప్ హాప్, టైట్ ఫిట్, షిఫ్ స్టైల్స్ ఇలా రక రకాల ప్రయోగాలు చేసిన వాళ్ళు ఎందరో ఉన్నారు. అయినా భారత దేశంలో సంప్రదాయం ఉన్నన్నాళ్లూ కాసుల పేరు, చీరకట్టు ఎక్కడికి పోతాయి చెప్పు?

రూపా ! నాకు తెలీక అడుగుతానూ.. గోచీ పోసి చీర కట్టుకునే ఆడవాళ్ళందరూ చెవులకి రకరకాల ఆభరణాలు ధరిస్తారెందుకూ ? నువ్వు కూడా అంతేగా, ఏదో పక్క పుల్ల అంటావు, అంటే ఇప్పుడు మోడ్రన్ లేడీస్ పెట్టుకునే సెంకండ్ సెట్ ఇయర్ టాప్స్ లాంటివి కదా. గంటీలు,మెంచులు, సికిడీలు, బుడీలు, గోల్డ్ బాల్స్ తో తయారైన గున్నాలు.. ఇలాంటివెన్నో కదా. ఏందంతలా నవ్వుతున్నావ్? ఇవన్నీ నాకెలా తెలుసనా ? నేను పెయింటర్ ని అన్న విషయాన్ని మర్చిపోతున్నావ్ సుమా. రవి వర్మ, వడ్డాది పాపయ్య, బాపిరాజు లాంటి వారి పెయింటింగ్స్ లో, ఎన్నెన్ని అందాలో కదా. ఆ చీర కట్టు, ఆ కనుముక్కు తీరు, పెట్టుకొనే నగలు, పెదవుల మీద నవ్వు, చుట్టూ వున్న పూల సొగసులతో అబ్బో.. విచ్చుకున్న పువ్వులా ఎంతో బాగా అనిపిస్తుంది ఒక్కో పెయింటింగ్ చూస్తుంటే.

లక్నోలోని చికెన్కారి వర్క్ అందరికి తెలిసిందే నూర్జహాన్ కాలం నుండి దీనికి విశేష ప్రాధాన్యత ఉంది. జార్ఖండ్ లోని ఖరస్వాన్ – కుచాయ్ ప్రాంతాల్లో ఆర్గానిక్ రంగులతో తయారయ్యే కుచాయి సిల్క్ తయారీలో 3 లక్షల మంది పాటుపడతారని, విదేశాల్లోమంచి డిమాండ్ ఉన్న సిల్కులలో ఇది ఒకటని, కున్బి అనే తెగవాళ్ళు మోకాళ్లకి కాస్త కిందకు కట్టే గీతల్లాంటి చీరను గోవా పొలాల్లో పనిచేసే ఆడవారు కడతారని, చత్తీస్ఘడ్ నుండి వచ్చే కోసా సిల్క్ ఓ అరుదైన పురుగునుండి లభించే నాణ్యమైన శిల్క్ అని, అరుణాచల్ ప్రదేశ్లోని ఒక గిరిజన తెగ పేరు అప్తానీ అని – వీవీ టెక్నిక్లో పేరెన్నికగన్న జిగ్జాగ్ డిజైన్లకి ఇది ప్రత్యేకమైనదని, శతాబ్దాలక్రితం బీహార్ నుండి బగల్పూరు వలసవెళ్లి తస్సర్ అనే కాయ నుండి దారాన్ని వేరు చేసి డై లతో చీరలను చేస్తారని ఎందరికి తెలుసు. మేఘాలయ ఎరీశిల్క్ ఎకోఫ్రెండ్లి కాబట్టే కదా బౌద్ధ గురువులు సైతం వాడతారు, త్రిపురలోని గిరిజనులు ప్రత్యేకంగా నేచే బట్ట పేరే పచ్రా – క్రిందివైపు గీతలు పైనంత ఎంబ్రాయిడరీ ఉండటం ఈ చీరల ప్రత్యేకత అని నీ షో చూసేంతవరకు నాకే తెలియలేదు.

అసలు పూర్వ కాలపు ఆడవారికి ఫ్యాషన్ తెలీదు అనుకునే అపార్థజీవులకి, ఈ ఆడవారిని చూస్తే ఏమనిపిస్తుందో.. వాళ్లెంత ముందుచూపుతో ఉంటారో, ఎంత ఆరోగ్యపరంగా ఆలోచిస్తారో తెలుస్తుంది కదా.. నేతచీరలు కావడం వల్ల చెమట పీల్చుకుంటుంది. గోచీ పోసి కట్టడం వల్ల త్వరత్వరగా అడుగులేసుకుంటూ పనులు చేసుకోవచ్చు. నడుంపట్టు బెల్ట్ లా ఉపయోగపడ్తుంది. ఋతుక్రమ సమయంలో కూడా భయపడాల్సింది ఉండదు. నేను పేపర్లో చదివానే గానీ, చీర కట్టుతో ఫ్యాషన్ షో ని చూడడం ఇదే మొదటిసారి రూపా. నువ్వు సాధించావ్. పారిస్ అంటేనే ఫ్యాషన్ నగరం. జువ్వాడి దేవీప్రసాద్ గారు అన్నట్టు 'ఫారీస్ పగలు ఫర్ఫ్యూమ్ బాటిల్ రాత్రి షాంపైన్ బాటిల్'. అలాంటి నగరం నడిబొడ్డున, భారతీయ సంప్రదాయాన్ని ఈనాటి తరానికి పరిచయం చేస్తూ ఫ్యాషన్ పెరేడ్ ఏర్పాటు చేయడం ఆసక్తికర అంశం. కేవలం శ్రామిక స్త్రీలు మాత్రమే వారి సౌకర్యం కోసం కట్టుకుంటారు అనే అపార్థాన్ని, గ్రామీణ నిరక్షరాస్యులు మాత్రమే చుట్టుకుంటారు అనే అపార్థాన్ని తొలగిస్తూ కొత్త ట్రెండ్ కి శ్రీకారం చుట్టే నీలాంటి ఫ్రెండ్ నాకుండడం గర్వంగా అనిపిస్తుంది సుమా.

వుండనా మరీ!

ఇట్లు
– సురేష్ పొన్నేరి

# మేఘాలాపన

మేఘమా! నా జీవన రాగమా!

ఎంత సామీప్యత నీకూ – నాకూ....

నేనూ నువ్వూ ఒక్కలాగే ఆలోచిస్తాం... ఒక్కలాగానే దుఃఖిస్తాం... కంటి మేఘం నుండి కురుస్తున్న నా కన్నీళ్ళే గడ్డ కట్టి వుంటే ఎంతయ్యేవో తెలుసా... 'ఎవరెస్టంత'! నువ్వూ అంతేగా... దిగులుగా.... బుగులుగా.... దుఃఖంగా... నీరసంగా అతి ఆర్ద్రంగా నీ మనోవేదనని ఆవిష్కరిస్తుంటావు...

ప్లీజ్....ప్లీజ్...ఒక్కసారి నా ముందుకు రావూ..ఎందుకో నిన్ను మనసారా హత్తుకోవాలని వుంది...గుండెబరువు తీరేలా గట్టిగా యేడ్వాలని వుంది.

బరువెక్కిన నా హృదయ వేదనని చెప్పుకోటానికి... అర్థం చేసుకుని ఆచరించే మరో మంచి మనసు కోసం ఇన్నేళ్ళూ వెతుకుతూనే వున్నాను. ఎందుకో నువ్వు నచ్చినట్లుగా మరెవ్వరూ నచ్చటం లేదు నీకూ నాకూ మధ్య తెలియని యేదో అనుబంధం పోగుపోసుకున్నట్టుగా అన్పిస్తుంది. మా మనుష్యుల్లాగా నువ్వు అర్థం చేసుకోకపోయినా ఫర్వాలేదు, అపార్థం మాత్రం చేసుకోకు. ఎందుకంటే నేనెంతో అభిమానించే నా ప్రేమ నేస్తానివి నువ్వు మా రైతన్నల సమస్తానివి నువ్వు.

ఎంతో ఆలోచించాను.... చంద్రుడితో చెబ్దామని...ఎందుకంటే చందమామ మా 'మామ' కదా...మామయ్యంటే మంచి కోరేవాడు అంటారు కదా... కానీ రేరాజు మారాజుగా, మహరాజుగా మారి మా కలతలు వింటాడని అన్పించలా... పైగా రాత్రికి దీపమైన ఈ శశికాంతుడికి ఎప్పుడూ చుక్కలతో సరాగాలే తప్ప మరోటి కన్పించలా నాకు... పైగా మా కవులంతా ఎప్పుడూ ప్రేమకి, విరహానికి, శృంగారానికి తప్ప చంద్రుడ్ని పెద్దగా 'పెద్దమనిషి' లా చూపిందీ లేదు.... ఇక మామకి నేనేం పెద్దరికం అపాదించను?

పగటికి దీపం సూర్యుడు కదా అనుకుని ముందడుగు వేశా... 'కర్మసాక్షి' అంటారు కదా అనుకున్నా. కానీ తన భార్యే కోపతాపాన్ని భరించలేక వెళ్ళిపోయినప్పుడు ఇక నా గోడును చెప్పుకునేంత సమయాన్ని నాకు ఇవ్వ గలడా అన్పించింది. సూర్యోదయం, సూర్యాస్తమయాలు ప్రాంతాలకీ, దేశాలకీ తప్ప ఆయన మాత్రం విశ్వమంతా పార్ట్ టైం జాబులు చేస్తూనే వున్నాడు. ఈ Shift Duty చేస్తున్న పెద్దమనిషితో నేనేం మాట్లాడగల్గుతాను.. పైగా అన్ని వేల కాంతి సంవత్సరాలు ప్రయాణించగల వయస్సు కూడా నాకు లేదు కదా.

ఓ నా జలదమా! ఇప్పుడు చెప్పు... వృత్తి ధర్మాన్ని ప్రవృత్తితో కలిపి నిజాయితీగా, నీతిగా చేస్తున్న నీ కంటే



నాకెవరు కావాలి చెప్పు? కాస్త ఆ పనిని పక్కన పెట్టి నాకోసం కొంత సమయాన్ని కేటాయించవూ... నా మనోవేదనని మనసుతో వినవూ! ఈ నా ప్రేమలేఖని ప్రేమగా చదవవూ!

కాళిదాసు 'మేఘసందేశం' చదివాక ప్రేమను మోసే నీకు ప్రేమమైకం తప్ప అసలైన మమతానురాగాల విలువ తెలుస్తుందా అన్న సందేహం కూడా వచ్చింది నాకు. కానీ నాలాగా నువ్వూ సున్నితమైన మనస్కురాలివి. దుఃఖం వచ్చినప్పుడు నువ్వూ నేనూ ఒక్కలాగానే స్పందిస్తాం... అందుకే నా ఈ ఉత్తరాన్ని సామాజిక బాధ్యతగా భావించి ప్రపంచ ప్రజలందరికీ చేరుస్తావు కదూ! ఆదికాలం నుండి వార్తాహరివి నువ్వు.... నా కోరికను మన్నించి మాకు న్యాయ సహాయం చెయ్యి నేస్తమా..!

పురాణాల్లో ఇంద్రుడికి వేయి కళ్ళున్నాయని చదువుకున్నాను. మరి నీకేంటీ ఒళ్ళంతా కళ్ళే వున్నాయి. అందుకేగా బోరుబోరు మంటూ ఏడుస్తుంటావు నీదీ నాదీ ఒకటే బాధేనా... మరి పంచుకోవచ్చుగా... ఓహో నీకూ నాలాగా ఎవ్వరూ దొరకలేదా... పాపం మనలాగానే కవి జాషువా గారికి కూడా ఎవ్వరూ దొరకలా.. అందుకే 'గబ్బిలం' తో చెప్పుకుని పెద్ద కావ్యాన్ని ప్రజలకి అందించారు... మనలాంటి వాళ్ళకి మనమే సహకరించుకోవాలి. పెద్ద తలకాయలికి పెద్ద పెద్ద వ్యాపకాలు తప్ప, మన బాధలు వినేంత తీరిక ఎక్కడుందిలే...

భూమినెప్పుడూ ఆకాశం ప్రేమిస్తునే వుంటుంది. అమర ప్రేమికులు వారిద్దరూ... మధ్యలో అన్నీ తెల్సిన నువ్వున్నావు... ఇద్దరి మధ్యా ప్రేమవారధివి నువ్వేగా... మరి ప్రేమ మూర్తులుగా అవతరించిన మా బంగారు ఆడపిల్లల్ని... రేపటి తరాల్ని సృష్టించే ఈ నడిచే దేవతామూర్తుల్ని అలా దిక్కులేని వాళ్ళుగా వదిలేస్తే ఎలా చెప్పు...? వారి ఏడ్పుని గుర్తించకుండా... వారి బాధల్ని గమనించకుండా... వారి జీవితాన్ని ప్రేమించకుండా నువ్వలా వెళ్ళిపోతుంటే ఎలా చెప్పు...!

'బానిసకొక, బానిసకొక, బానిసకొక బానిస స్త్రీ' అన్నది నువ్వూ నమ్ముతున్నావా? లేక ద్వితీయ శ్రేణి పౌరురాలేగా యేం చేస్తుందిలే అనుకుని మా మనుష్యుల్లాగే నువ్వూ నిర్లక్ష్యం చేస్తున్నావా? పాపం... పువ్వుల్లాంటి పాపలు... అమ్మానాన్నల ఆరో ప్రాణాలు.. భూమ్మీద ఏ హరివిల్లు కన్పించినా తమకోసమే విరిసిందని... ఎక్కడ ఏ తోటలో ఏ పువ్వు పూసినా తమను చూసే నవ్విందని... స్వచ్ఛమైన జలపాతంలాగా జాలువారుతూ... కేరింతలాడే మన తలరాతలు వాళ్ళు... మానవజాతిని నిలబెట్టే ప్రేమవిధాతలు వాళ్ళు... జగమంతా అందమైందని... ప్రపంచమంతా మంచిదేనని నమ్మే ఈ పిచ్చితల్లుల్ని, సీతాకోక చిలుకల్లా స్వేచ్ఛగా తిరగనిద్దామా లేక ఆదికాలంలో లాగా ఇంట్లోనే దాచేద్దామా...?

అయినా నా సోదంతా చెప్తున్నాను కానీ, అసలు నీ జండర్ గురించి ఆలోచించలేదు సుమీ! ఇంతకీ నువ్వు పుం లింగమా స్త్రీ లింగమా! ఆడమనసు మాత్రమే మరో ఆడమనసుని అర్థం చేసుకుంటుంది అని తప్పుడు statement చెప్తారు కానీ నాకూ ఓ అమ్మ వుంది.... ఓ ప్రేమించే చెల్లెలుంది... ఆదరించే అక్కవుంది... అనురాగం చూపించే భార్య వుంది అన్నిటికీ మించి నా ఆరోప్రాణమైన నా కూతురు వుంది.

ఆడవాళ్ళందరూ నవమాసాలు మోసే మరో బిడ్డను కని తల్లి ఋణం తీర్చుకుంటారు కానీ, నాలాంటి మగవాళ్ళకు ఆ అదృష్టం లేదు కదా! అందుకే 'ఆడబిడ్డనే' అమ్మగా భావిస్తూ అపురూపంగా చూసుకుంటాం... ఆ తల్లి ఋణం కొంతలో కొంతైనా తీర్చుకుందామనుకుంటాం... అందుకే ఆడపిల్లలందరూ నాన్న కూచీలవుతున్నారు. అయినా నాకొక ధర్మ సందేహం... అమ్మాయిల్ని అప్పుడప్పుడు మనం 'బేటా' అని ఆత్మీయంగా పిలుచుకుంటాం కానీ అదే అబ్బాయిని 'బేటీ' అని పిలుస్తామా... ఆడపిల్ల వుంటే Tension అనుకుంటారు కానీ ప్రతీ ఆడపిల్ల Ten Sons తో equal అని ఎందుకు అర్థం చేసుకోరూ...!

ఒకప్పుడు 'లింగనిర్ధారణ' పరీక్ష 'అమ్నియోసెంటిసిస్' ద్వారా ఆడపిల్ల కడుపులో వున్నది గమనించి అబార్షన్స్ చేయించేవారు. బీహారు లాంటి రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాల్లో కొందరు బడాబాబులు నోళ్ళల్లో వడ్లగింజలు వేసి పుట్టిన

బిడ్డను పుట్టుకలోనే చంపివేసేవారు... ఎంత అమానుషత్వం...? ఆడపిల్లే ఇలలో లేకపోతే రేపటి తరం ఎలా బ్రతుకుతుంది? 914/1000 గా నిష్పత్తి మారితే, అబ్బాయికి పెళ్ళెలా అవుతుంది...? వంశాకురం ఎక్కడి నుండి వస్తాడు? కన్యాదానం చేసి కాళ్ళు కడగాలి కాబట్టి, ఆడపిల్లలు లేకుంటే ఎవరి కాళ్ళూ పట్టాల్సిన పనిలేదుగా అని వితండవాదం విన్పించే కొంతమంది మూర్ఖులకి ఏం చెప్పాలి...? మార్చాల్సింది ఆచారాలనని చెప్పాలా..? లేక మెదళ్ళలోని దుర్మార్గపు ఆలోచనలనని చెప్పాలా?

ప్రతి ఆడపిల్ల, కన్న తలిదండ్రులకి ప్రాణమే. ప్రతి ఆడపిల్ల ఓ అన్నయ్య కళ్ళనిండుగా చూసుకునే నిండు చందమామనే.... సత్యాన్ని గుర్తించటానికి .... ఈ నిజాన్ని ఒప్పుకోవటానికి భేషజాలెందుకు?

ఓ నా నీరదమా!

'యత్ర నార్యస్తు పూజ్యంతే తత్ర రమంతే దేవతాః' అంటారు. ఎక్కడైతే స్త్రీలు పూజింపబడ్తారో ఆ నేలమీద దేవతలు నడయాడుతారు అంటారు... మరి అలాంటి నేల ఈ భూస్థలమంతా వెతికనా దొరుకుతుందన్న గ్యారెంటీ నువ్వు ఇవ్వగల్గుతావా? ప్రపంచమంతటినీ పైనుండి చూస్తున్నదానివి నువ్వు... ఏడ్చేందుకే నీకు వేలవేల కళ్ళున్నాయని అనుకున్నావుగా ఇన్నేళ్ళూ... అదే పనిని అనాదిగా చేస్తూనే వున్నావు. కాస్త ఆ కళ్ళు తుడుచుకుని మా కోసం మా పక్షాన నిలబడి నిజాయితీగా మాట్లాడు... మా గోడుని మానవ జాతికి విన్పించు...

అయినా ఆడపిల్ల కొట్లోని వస్తువా అమ్మేయటానికి...? వుమెన్ ట్రాఫికింగ్ పేరుతో దేశదేశాల్లో ఆడపిల్లల్ని వలవేసి పట్టుకుంటున్నారు.... ఒక దేశం నుండి మరో దేశానికి వెలిమూటలుగా మార్చి అమ్మేస్తున్నారు.... ఎంత అమానుషమీ దుశ్చర్యలు... రక్త మాంసాలతో వ్యాపారం చేస్తున్న మనుష్యుల మధ్య మేం నివసిస్తున్నామంటే ఎంత భయంగా అన్పిస్తుందో కదా!

మనింట్లోని ఓ అమ్మాయి తన మనసుకు నచ్చిన అబ్బాయిని ఇష్టపడ్తుందని తెలిస్తే చాలు... శివాలు ఎత్తినట్టు పూనకాలతో కర్కశంగా నడిరోడ్డున నరికిపారేస్తారా... ఆడపిల్లను ఇంటి పరువుగా భావిస్తూ ఆ పనికిరాని పరువుకన్నా ప్రాణం ముఖ్యమని మాత్రం భావించలేకపోతున్నారంటే, ఏ ఆదిమ సమాజంలో మనం బ్రతుకుతున్నాము అని ఆలోచించాలి.... అయినా ఆడపిల్ల పరువా... ఇంటిమీద బరువా... సమాజానికి వెలా.... ఊరుమ్మడి వెలయాలా...?

బసివిని చేశారు... దేవదాసీలుగా మార్చారు... జోగినిలుగా ముద్రవేశారు. మత విశ్వాసాల్ని అంటగట్టారు.. మూఢ నమ్మకాలు మనుషుల్లో నాటారు... 'మీ మీ స్వార్థాలకు... మీ కుళ్ళిపోయిన వాంఛలకి... మోహపు చూపులకి.. మీ పెత్తందారీతనానికి 'ఆడది' మాత్రమే వ్యాపార వస్తువు ఎలా అవుతుంది...?' ఇలా స్త్రీలని స్వార్థానికి వాడుకుని, మోసం చేసే వాళ్ళపై, పైనుంచి చూసే నువ్వు వానజల్లుల బదులు అగ్నివర్షం కురిపించొచ్చు కదా!

ఆడది లేకపోతే అమ్మతనమే కన్పించకపోతే ఇక ఈ సృష్టి మనుగడ, మానవజాతి నడవడి వుంటుందా అని అడగలేకపోయావా. ఒక చాక్లెట్ ఇచ్చి పసిపిల్ల మీద అత్యాచారం చేసే ముదుకాళ్ళ ముసలి ఒకరైతే – తండ్రి తర్వాత తండ్రి స్థానంగా పూజించే గురువులు తాకకూడని ప్రాంతాల్లో తాకి ఇబ్బంది పెట్టే ప్రబుద్ధులు మరికొందరు – ఎక్కడికెళ్ళినా వెకిలి చూపులు – చికిలి చూపులు – వెగటు చూపులు – మగత చూపులు – చూపుల్లోనే దోషం అనుకుంటే మనసంతా పాపపు ఆలోచనలే.

మనింట్లోని అమ్మాయి, ఎదిగిన అమ్మాయి, సంవత్సరం రోజులుగా కన్పించక పోతే ఎవర్నో ప్రేమించి ఇంట్లో నుండి వెళ్ళిపోయిందనుకుని ఊరుకున్నారట. పైకి చెపితే, పోలీసు కంప్లైంట్ ఇస్తే పరువు పోతుందట... సంవత్సరం రోజుల తర్వాత బావిలో శవమై కన్పించాక 'బావురు' మంటూ యేడిస్తే ఏమిటి ప్రయోజనం...? ఎముకలు తప్ప శరీరపు ఆనవాళ్ళు కూడా కన్పించని స్థితిలో జీర్ణమైపోయిన ఆ చిట్టితల్లి దుర్మార్గుల చేతుల్లో ఎంత నరకం అనుభవించి

వుంటుంది? అప్పుడే మనం వెతుక్కుని వుంటే కనీసం మరో 'శ్రావణి' ని కాపాడుకునే వాళ్ళం కదా! 'మనం పెంచిన మన పిల్లలమీద నమ్మకంలేని తనాన్ని మీమీ పెంపకాలకి ఎందుకు వర్తింపచేసుకోలేరు?' అని ఎందుకు ప్రశ్నించవు మేఘమా? పిల్లలకి పెద్దలంటే వుండాల్సింది భయంకాదు, ప్రేమ. ఏదైనా చెప్పుకోగల్గేంత చనువు. ఆత్మీయత లేని పెద్దరికం, ఆప్యాయత చూపించలేని 'పేగుబంధం' అనర్థదాయకమేగా... అది ఒక్కసారి విడమరిచి ఈ అమ్మా నాన్నలకి చెప్పవూ...

NCRB (National Crime Records Bureau) ప్రకారం 2015-2017 మధ్య కాలంలో 1024 మంది అపహరింపబడితే కనీసం వందమంది కూడా దొరకలేదు.. 2015లో అపహరింపబడ్డ కల్పన కేసును పరిశోధిస్తుంటే మరో మూడు హత్యలు... హత్యాచారాలు వెలుగు చూశాయి. ఎంత దారుణం... హైదరాబాద్‌లో 2017లో 91 కేసులు నమోదైతే, 2017 May 15 వరకు ఢిల్లీలో 780 అత్యాచార కేసులు నమోదయ్యాయి. ఇండియన్ యావరేజ్ రేట్ 6.3 గా నమోదయ్యింది. అయితే 99 శాతం రిపోర్టింగ్‌కి రాకుండానే కనుమరుగై పోతున్నాయి. నిన్నకి నిన్న అత్యాచారం చేసిన వ్యక్తి దగ్గరకు న్యాయంకోసం వెళితే రూ. 1.50 పరిహారం కట్టించి ఆ దుర్మార్గుడిని వదిలేయించారు కులపెద్దలు. అది భరించలేక ఆ అమ్మాయి సూసైడ్ చేసుకున్న ఘటన వెలుగులోకొచ్చింది. మణిపూర్‌లో అత్యధికస్థాయిలో 84%, ఢిల్లీలో 62%, రాజస్థాన్లో 7%, హర్యానాలో 15% అత్యాచార కేసులు నమోదయ్యాయంటే ఎంత దారుణమైన స్థితిలో ఈ భూమ్మీద మేం ఎలా ఉన్నామో ఆలోచించాలి కదా నువ్వు..

ఎప్పుడు ఏ అత్యాచారం జరిగినా నిర్భయలుగానే మా ఆడబిడ్డలు మళ్ళీ మళ్ళీ దుఃఖిస్తారు. మరి కొన్నాళ్ళు ఆక్రోశిస్తారు. ఉద్యమిస్తారు. అంతే, మళ్ళీ మామూలే – దేశంలో 4 రాష్ట్రాల్లో మాత్రం 12 సంవత్సరాలలోపు పిల్లలమీద అత్యాచారాలు జరిగితే కఠినంగా శిక్షించాలని మరిన్ని చట్టాలు చేశారు తప్ప కేసుల సంఖ్య తగ్గలేదు సరికదా మరింత పెరుగుతూనే వుంది. నీలి చిత్రాల వీక్షణం, స్మార్ట్ ఫోన్ల వాడకం, మితిమీరిన ఇంటర్‌నెట్ వాడకం, విపరీతమైన స్వేచ్ఛ – మగవాళ్ళని మృగాలుగా మారుస్తున్నాయా? మానవత్వాన్ని చంపుతున్నాయా?

నిజానికి నిన్ను చూసేశాకేనేమో షీ టీమ్స్ వాళ్ళు 'హాక్ ఐ' ని (గద్ద కన్ను) డెవలప్ చేసింది అన్పిస్తుంది నాకు – అన్నిటికి సాక్షీ భూతం నువ్వే... నిఘా నేత్రానివి నువ్వుకాక మరెవరుంటారు చెప్పు – సర్వకాల సర్వావస్థలలోనూ మాతో నువ్వుంటావు. లేదా నీ జాతి వారసులుంటారు. మేం కాలగర్భంలో కలసిపోయినట్టే నువ్వూ సుముద్ర గర్భంలో కలసిపోయే దాకా మా ఇంటి అతివలకు అండగా వుండి వాళ్ళ ఆత్మగౌరవాన్ని కాపాడవా ఓ మేఘమాలికా!

ఉమెన్ ట్రాఫికింగ్ వల్ల వచ్చే కాసులవర్షంలో తడుస్తున్న వ్యక్తులకు తెలియటంలేదు. రేపటి రోజున జరిగే అనర్థాలు.. ఆడది అంటే కామతృష్ణతో చూసే వాళ్ళది తప్పా లేక వాళ్ళను పెంచిన కుటుంబాలదా లేక విపరీతధోరణులను వృద్ధిచేసిన నీలి చిత్రాలదా..?

నిజానికి మా స్త్రీ జాతికీ నీకూ దగ్గర పోలికలున్నాయి అన్పిస్తుంది. వాళ్ళూ ఇంతే... నీలాగే ఏమీ మనసులో దాచుకోరు. ఉనికిని సైతం కోరుకోరు. ఎప్పుడూ ఇతరులకి ఏం చేద్దామా అని ఆలోచిస్తారు. అమ్మ ఇంట్లో అల్లారు ముద్దుగా పెరిగి అత్తింట్లో బాధ్యతలనెరిగి అందరి తలలో నాలుకలా అన్నీ అమర్చి... చివర్లో నాలుగు మెతుకుల్ని మజ్జిగతో తిని సరిపెట్టుకొని ఇంత చాకిరీతో అలసి – రేపటి కోసం ఏం చేద్దామా అని ఆలోచించే త్యాగశీలి మహిళ!

'పితా రక్షతి కౌమారే, భర్తా రక్షతి యవ్వనే

సుతారక్షతి వార్ధక్యే, నస్త్రీ స్వాతంత్ర మర్హతి'

అన్నట్టుగా అందరికీ అన్నీ చేసినా స్వేచ్ఛా స్వాతంత్రాలు లేని కట్టుబానిసగా ప్రేమ మాత్రమే కోరుకునే అల్పసంతోషి కదా స్త్రీ! నువ్వు కూడా అంతేగా... ఓవైపు వరుణుడు... మరోవైపు వాయువు... ఇంకోపక్క ఆదిత్యుడు... అన్నింటికి

మించి ఇంద్రుడు... అందరి ఆలనలో, పాలనలో నీ మీద ఆశలు పెట్టుకుని నీ దయాదాక్షిణ్యం కోసం నిరంతరం మొయిల వంక చూస్తే ఆర్తజనుల కోసం... బీటలు వారిన భూమికోసం.. నిరంతరం కురిసే వర్షిణివి నువ్వు – సమదర్శినివి నువ్వు. కాగే ఎండకు నీరు మరిగి ఆవిరిగామారి మేఘంగా రూపాంతరం చెంది ఆర్తిగా ఎదురుచూసే ప్రజల కళ్ళలో కన్నీటి తడి చూడలేకనే వంట్లోని శక్తినంతా ధారపోసే త్యాగి 'దధీచి'వి నువ్వు.

భగభగమండే సూర్యుడ్ని సైతం నీ వీపు వెనకాల దాచి క్షణకాలమైనా ఆ భానుడి వేడి నుండి మమ్మల్ని కాపాడుకుంటూ మిట్ట మధ్యాహ్నమైనా తలపైకెత్తి చూసే ధైర్యాన్ని కల్గించేది నువ్వేకదా. పున్నమి వెన్నెలలను ఆస్వాదిస్తూ ఆరుబయలు వెన్నెల్లో కూర్చుంటే పరదాలుగా కప్పుతూ దోబూచులాడుతూ వెండి మేఘానివై... నీ రథంలో శశికాంతుడ్ని కూర్చోపెట్టుకుని మమ్మల్ని అలరించేదీ.. ఆహ్లాదపరిచేదీ నువ్వే కదా.

మా మగజాతంతా నీలాగే మమ్మల్ని కాపాడుకుంటే జగమంతా 'శాంతి వనంలా' వుంటుందని – నీ మనసులాగా నీ రూపంలాగా తెల్లగా మెరుస్తుందని చెప్పకనే చెపుతున్న మెత్తటి స్నేహశీలివి నువ్వు. కష్టాల్లో ఉన్నప్పుడు కాస్త చేయూత, భయంగా ఉన్నప్పుడు ఓ మెత్తటి స్పర్శ. బ్రతుక్కి కాస్త గౌరవం.. తలవంచని ఆత్మాభిమానం తప్ప మా స్త్రీలు అడిగేవి ఏమున్నాయో చెప్పు – అయినా ఈ మా మగజాతికి ఎందుకీ సత్యం అర్థం కావటం లేదంటావ్?. మాకు మీ చేష్టలు కేరింతల్లాగా ఉండాలే తప్ప ఉరికొయ్యాల్లాగా ఉండరాదంటూ ఎన్నెన్ని ఉద్యమాలు చేసినా చలనం రావట్లేదు ఈ నా మగజాతి జనాలకు–

ఒక నిర్భయ, ఒక ఆసిఫా, ఆరుషి, మిథాలి, ప్రత్యూష, శ్రీలక్ష్మి, ఆయేషా, స్వప్నికా, ప్రణీత ఒకరేమిటి! ఒక పేరేమిటి? అందరూ బాధితులే.. అందరూ పీడింపబడ్డవారే. నమ్మకాన్ని ఆశించి భంగపడ్డవారే. నరజాతిలోని నీచ బుద్ధికి ఆహుతైనవారే... ఎన్నాళ్ళీ అరాచకాలు.. అకృత్యాలు.. అరణ్యరోదనలు.. బాధగా వుంది. భరించలేని దుఃఖంగా వుంది. పాపం నువ్వు మాత్రం మా కన్నీటిని కన్పడనియ్యకుండా అప్పుడప్పుడు నీ వర్షపు నీటిని సాయంగా పంపుతూ నీ బంగారు చినుకుల చేతులతో మా కంటి తడిని ఆత్మీయంగా తుడిచి భగభగలాడే గుండె మంటను నీ చల్లటి నీళ్ళతో చల్లబరుస్తావ్...సేదతీరుస్తావు. ఇది సరిపోవటంలేదు నేస్తమా మా సోదర మహిళా లోకానికి.

నువ్వు 'హాక్ ఐ' గా పనిచేస్తూ పైనుండి అన్నీ మా 'షీ టీమ్స్'కి చేరవెయ్యి. న్యాయస్థానాలకు మా మాటగా చెప్పు... న్యాయం దశాబ్దాల తర్వాత కోర్టుల్లో మగ్గి మగ్గి దొరకటం కాకుండా, సత్వరమే అందేలా చూడమని. ఆ న్యాయస్థానం ద్వారా మానవజాతి మనుగడకి మార్గం దొరుకుతుందని మేమంతా ఎదురు చూస్తాం. మా ఆడపడుచులకు అండగా నువ్వున్నావన్న ధైర్యంతో నిశ్చింతగా బ్రతుకుతుంటాం...

ఆడవాళ్ళ ఆకలి హృదయాలది. మగవాళ్ళ ఆకలి శరీరాలది – ఈ తీరుని మార్చమని మా గోడును ఆ దేవుడికి నివేదించు... చలం గారు చెప్పినట్టు–

స్త్రీకి మెదడుంది దానికి జ్ఞానం ఇద్దాం, స్త్రీకి హృదయం వుంది దానికి అనుభవం ఇద్దాం

స్త్రీకి శరీరం వుంది. దానికి వ్యాయామం ఇద్దాం. కానీ అలా ఎందరు చేస్తున్నారు? స్త్రీని భోగవస్తువుగా కాక సమదృష్టితో ఎందరు చూస్తున్నారు?

ఆశకు సంకేతం జీవితం కదా! వ్యక్తిత్వాలు యాంత్రీకరించబడ్డ చోట అస్తిత్వం తప్పిపోయిన చోట మనసు ఘనీభవిస్తుంది– ఆ నిస్తేజం నుండి మేల్కొందాం... అనాదిగా స్త్రీ జాతి మోస్తున్న 'అతివ' – 'అబల' అనే బలహీన పదాల్ని మార్చేద్దాం. సహజాతి లక్షణంగా ఆపాదించబడ్డ 'సహనశీలి' ని అసహనం పాలుకాకుండా కాపాడదాం.

నువ్వూ,నేనూ అందరం ఎప్పుడో ఒకప్పుడు మృతసదృశ విస్మృతిలోకి జారుకోవల్సిందే...కానీ మానవీకరింపబడ్డ విశ్వం గురించి మానవత్వంతో పరిమళించే మనుష్యులు గురించి ఉన్న ఈ కాలమన్నా మనం ఆలోచిద్దాం – ఓ నా

దయార్ద్ర హృదయమా! 'పప్పా' అని నా కూతురు నా భుజం మీద వాలినప్పుడల్లా నాలో ఏదో అభద్రతా భావన తొలుస్తుంది. మరికాస్త కరుణించు.

'ఆరాధన మట్టడుగన నా రాధలు ఏడ్వరాదు – గొర్రెల్లా, గోవుల్లా, నా గోపిక చావరాదు' అన్న జాలాదిని గుర్తు చేసుకొని సంఘీభావం తెలిపే సంస్కారాన్ని మా మనుషులకు నేర్పించు. ప్రపంచమంతా తిరిగే నువ్వు... ప్రజలందర్నీ చూసే నువ్వు మా మహిళాలోకానికి అండగా నిలబడు – ఎలాంటి అఘాయిత్యాల అత్యాచారాలు, అన్యాయాలు, లైంగిక వేధింపులు లేని సమాజాన్ని సరికొత్తగా సృష్టించే మా ఆశకు ఆలంబనగా నిలువు. ఆచరణీయ మార్గానివై నవపథాన్ని చూపించు.

అప్పుడు–

నువ్వు కార్చేది కన్నీరు కాదు... ఆనందబాష్పాలు కావాలి. దుఃఖాశ్రువులు కన్పించని లోకాన్ని, శోకం తాకని స్నేహాన్ని నీ లేత లేత మబ్బులతో సృష్టించే ప్రయత్నం చేయి...

ఈ సృష్టి మారేది మగవాడి దృష్టి మారితేనే అన్నది ఎంత నిజమో... నిర్భయ భారతాలు కన్పించని భారతదేశం కావాలన్నదీ అంతే నిజం... ప్రపంచంలోని దుఃఖాన్నంతా నువ్వే తీసుకొని, దుఃఖంలేని గృహాల్ని ఈ నేలమీద నిర్మించే వరం మాకు ఇవ్వు...

మేఘమా, నా మనోసంచారమా! ఆకాశంలోని దేవుడికీ, భూలోకంలోని మాకూ మధ్య వారధిగా ఉన్న నువ్వు ఆ దేవదేవుడికి మా గోడును చేరవేయి... మనుషులంతా మానవత్వంతో మెలగాలి. వారి తలరాతలను తిరగరాయమని ఆ బ్రహ్మదేవుడికి విన్నవించు... సకల మానవాళి సత్యం, అహింస, నిజాయితీ, సచ్ఛీలతను కొనసాగించేలా చూడమని ఆ మహావిష్ణువునకు నివేదించు... మనిషిలోని అరిషడ్వర్గాలను, స్వార్థం, అబద్ధం, దోపిడీ తత్వాలను నాశనం చేయమని ఆ మహాశివుడికి నివేదించు...

మేఘమా, ఇన్నాళ్ళూ నువ్వు ప్రేయసీ ప్రియుల విరహ సందేశాలను మోసుకు వెళ్ళావు... ఈసారి మాత్రం మా మనుషులలో మార్పుకోసం నా నివేదనలను నీతోపాటు తీసుకువెళ్ళు... మా మనుషులను నీలాగా మేఘాలుగా మార్చు...

ఇక ఉంటా...

నీ

– శంకరం

# సతత హరిత జీవితం

జీవితమా !

నీకు ఉత్తరం రాయడమంటే ఎందుకింత ఎగ్జైటింగ్ గా ఉంది? ఏదో తెలియని ఉత్తేజం.. ఉత్సాహం మనసంతా కమ్ముకుంది. అయినా నీకు ప్రేమలేఖ రాయడమంటే నాకు నేను రాసుకున్నట్టే కదా ! నా అస్తిత్వం నువ్వు...నా ఉనికివీ నువ్వు.. నా జవసత్వాలు నువ్వు.. నిన్ను నేను ప్రేమించలేకపోతే ఇక జీవితంలో ఎప్పుడూ, ఎవర్నీ ప్రేమించలేను. ప్రేమించే అర్హత కూడా ఉంటుందనుకోను. అంతేకాదు ఒక జీవితకాలాన్ని పోగొట్టుకున్న మూర్ఖుడినీ అవుతాను.

నిన్ను పట్టుకోవాలనీ, పరమార్థాన్ని తెల్సుకోవాలనీ యోగులు ధ్యానం చేశారు. భోగులు రసాస్వాదనంలో మునిగి తేలారు. భోగులు యోగులయ్యారు, యోగులు సంసార సాగరంలో ఈదారు. అయినా నీ ఆద్యంతాలు తెల్సుకోలేకపోయారు. పుట్టటం – గిట్టటం అందరికీ ఒకటే, కానీ మధ్యలో ఉన్న జీవితమే, నడిచే ఈ బ్రతుకే – వైవిధ్యంగా ఉంటుంది..మనిషి మనిషికీ.

అయినా జీవితమా! 'శరీర మాద్యం ఖలు ధర్మ సాధనం' అన్నారు కుమార సంభవం లో కాళిదాసు. లోకంలో ఏ కార్యసాధనకైనా శరీరం కావాలి ఎందరు గ్రహిస్తున్నారీ విషయాన్ని? నిమిషానికి లక్షల మంది పుడుతున్నారు.. లక్షల మంది మరణిస్తున్నారు. ప్రపంచ జనాభా ఈ క్షణానికి దాదాపు 800 కోట్లు. ఇంత మంది కలగంటుంది నీ గురించే కదా ప్రశాంతంగా ఉండాలని..తలెత్తుకొనేలా మిగలాలని..చరిత్రలో తమ పేరున ఓ పేజీ ఉండాలని ఆశ పడడం సహజమేగా. మరి ఎందరు ఆ ఆశని వాస్తవికంగా అందుకుంటున్నారో చెప్పు!.

ఈ మధ్య ఓ పెద్ద మనిషి చెప్పాడు... ప్రతి మనిషి శరీర విలువ దాదాపు కోటిన్నర పై చిలుకేనని. అత్యద్భుత చిత్రం మనిషి శరీరం. 213 ఎముకలు, 527 కండరాలు, 72వేల నాడులు ఉంటై. ఒక చిన్న రక్తపు చుక్కలో యాభై లక్షల ఎర్ర రక్త కణాలు, ఎనిమిది వేల తెల్ల రక్త కణాలు ఉంటాయట. మనిషి శరీరంలో వ్యాపించి ఉన్న సూక్ష్మ రక్త నాళాలు కలిపితే మొత్తం అరవై వేల మైళ్ళ పొడవుంటాయట. రక్తం గంటకి ఏడు మైళ్ళ వేగంతో ప్రవహిస్తుందట. నాలుగు వేల గ్యాలన్ల రక్తాన్ని గుండె దేహం మొత్తానికి పంపుతుందట.

మనిషి శరీరంలో ఐదు లక్షల రోమాలుంటాయంటే నమ్మలేకపోయాను తెలుసా. మూత్రాన్ని వడకట్టే సూక్ష్మ నాళికలు పది లక్షలు ఉంటాయట. పొట్టలో జీర్ణ రసాన్ని స్రవించే చిన్న గ్రంథులు మూడున్నర కోట్లు ఉంటాయంటే విని ఆశ్చర్యపోయాను. ఎంతో గొప్ప నిర్మాణం కదా మనిషి దేహం. అవయవాల మధ్య ఎంత చక్కని అవగాహన లేకపోతే ఇంతటి అనుసంధానం కుదురుతుందంటావ్ ! ఎవరో ఆపరేట్ చేస్తున్నట్టుగా గతి తప్పకుండా వంద సంవత్సరాలలు 'మనిషి' నడుస్తున్నాడంటే ఎంత గొప్ప వరమో కదా ! ఈ మధ్య మా పక్కింట్లో గొడవ జరిగితే వెళ్ళాను. తల్లిదండ్రుల్ని

ఆ కొడుకు నిలదీస్తున్నాడు – 'నాకేమిచ్చారు మీరు' అని. గూబ మీద లాగిపెట్టి కొట్టాలనిపించిది నాకు. వెర్రిమొహాలు.. ఉన్నదాని విలువ తెలుసుకోలేరు. లేనిదాని కోసం నిరంతరం పాకులాడుతూ.. ఆ వెతుకులాటలో ఆనందించాల్సిన జీవితాద్భుతాలను పోగొట్టుకుంటున్నారు.

ఒక్క నిమిషం.. అలా ఒక హాస్పిటల్ కి వెళ్ళి చూడమను. కిడ్నీ ఫెయిల్ అయిన పేషెంట్స్ డయాల్సిస్ తో ఎంతగా అవస్థలు పడ్తున్నారో. గుండె సమస్యలున్న చిన్నారులు ఎంత ఆశగా ఎదురు చూస్తున్నారో..మరో ఆశావహ వార్త కోసం. లివర్ చితికిన మద్యపాన ప్రియులు ఎంతగా పశ్చాత్తాపపడుతున్నారో.. కంటిచూపు లేని మనుష్యులు కారుచీకటి దారుల్లో పడే అవస్థలు ఎన్నని చెప్పను? 'సకలాంగులు'గా పుట్టటమే ఓ పెద్ద ఆస్తి..ఆరోగ్యంగా ఈ భూమ్మీద నడవడమే ఓ పెద్ద వరం అని ఎందరికి తెలుసు. నువ్వు అర్థం అయ్యేలా మళ్ళీ మళ్ళీ చెప్పమ్మా.. నా బంగారు జీవితమా !

నేను నిన్ను నిరంతరం ప్రేమిస్తూనే వున్నాను. ప్రతిరోజూ లేచి, కనిపించే దేవతలైన అమ్మానాన్నలకి ముందు మనసులో ధన్యవాదాలు తెలియజేసుకుంటాను. ఆ తర్వాత నీకు 'Love you' చెప్తాను. ఈ ప్రాణం ఇచ్చింది ఒకరైతే ఆ ప్రాణాన్ని, ప్రాణం విలువను తెలియజేస్తూ దాన్ని సార్థకం చేసుకోడానికి ఎలా 'నడవడి' వుండాలో తెలియ చెప్పేది నువ్వేగా.. అందుకే నా అస్తిత్వమైన నిన్ను ఎప్పుడూ నేను ప్రాణప్రదంగా చూసుకుంటాను. నిరంతరం ప్రేమిస్తూనే వుంటాను.

ప్రతిరోజూ పేపర్ చూస్తాను. టీ.వీ.ని గమనిస్తుంటాను – ఒక్కరోజైనా బలవన్మరణాలు లేని మంచి రోజంటూ వస్తుందా అని. పరీక్షల్లో ఫెయిల్ అయితే చనిపోవాలా..? ప్రియురాలు ఫోన్ లిఫ్ట్ చేయకపోతే బిల్డింగ్ పై నుండి దూకేయాలా..? ఉద్యోగం పోతే..వ్యాపారంలో నష్టం వస్తే..ఆరోగ్యం బాగోలేకపోతే..నాన్న తిడితేనే చచ్చిపోతున్నారంటే – వీళ్ళంతా నిన్ను ప్రేమించట్లేదనేగా అర్థం. బ్రతుకును ప్రేమించిన ఏ మనిషీ చావును కోరుకోడు. అమ్మానాన్నల్ని గుర్తుంచుకునే వారెవ్వరూ జీవితాన్ని అంతం చేసుకోలేరు. 2018 సం॥లో 1,34,566 మంది ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో 18 ఏళ్ళ లోపువారు 24,000 మంది ఉండటం మేధావులని దిగ్భ్రాంతికి గురిచేస్తుంది. 428 మంది విద్యార్థులు చనిపోవడం బాధాకరం. 92,114 మంది పురుషులైతే 10,687 మంది నిరుద్యోగులు, 26,589 మంది కూలీలు ఈ జాబితాలో ఉన్నారు. పురుషుల్లో కంటే ఆడవాళ్ళల్లో ఈ గుణం తక్కువ.

అయినా జీవితమా !

నా సందేహాన్ని తీర్చవా.. బ్రతుకిచ్చింది ప్రకృతి. ప్రాణం పోసింది అమ్మానాన్న. మరి జీవితాన్ని అర్థాంతరంగా ముగించడానికి వీళ్లకెవరు అనుమతిచ్చారు? అనుమతి లేకుండా ఏ పనీ చేయకూడదు కదా.. అయినా ప్రాణం అంటే ఒక్కరిది ఎలా అవుతుంది. ఆ ప్రాణాన్ని పుట్టించిన వారికే కదా సర్వహక్కులు చెందుతాయి..! లాల పోసిన అమ్మమ్మ.. భుజాన ఊపిన తాతయ్య.. పేగు బంధాన్ని ఇచ్చిన అమ్మ.. తన వారసులంటూ మురిసే నాన్న.. నా తోబుట్టువు అంటూ వేలు పట్టుకు నడిపించిన తోబుట్టువులు.. వీళ్ళందరితో ముడిపడ్డదే కదా జీవితం ! కలిసి ముద్దలు తిన్నాం.. ముద్దులూ పంచుకున్నాం.. ఒకరి బట్టలు ఒకరు తొడుక్కున్నాం. కాకి ఎంగిళ్లు తిన్నాం. మరి చచ్చే ముందు అవన్నీ గుర్తు రావా.. బ్రతకటం మన బాధ్యతగా భావించరా...! ఇవ్వాళ పోయిన వాళ్ళని రేపు పోవాల్సిన వాళ్ళు మోస్తున్నారని తత్వం చెప్తోంది. నిజమే ప్రతి జీవీ చావాల్సిందే. కానీ ఆ చావు కన్నా ముందు బతుకుని అర్థవంతంగా మల్చుకోవాల్సింది మనమే కదా. చావుకన్నా బతుకు చేదుదికాదు కదా... బరువు కాదు కదా!

ఎప్పుడు ఎవరికి పాదాభివందనం చేసినా 'దీర్ఘాయుష్మాన్ భవ' అంటూ దీవించడం మన దేశ సంస్కృతి. 'మన సంస్కృతిని మర్చిపోయి ఎలా మనగలుగుతాం మనం' అంటూ ఈ ఆత్మహత్యలు చేసుకుంటున్న వారందర్నీ గట్టిగా అడగవా నా జీవమా..!

ఈ మధ్య ఓ మంచి మాట విన్నాను. మనసు తనకు నచ్చిన వాటి మీద ఖర్చీఫ్ వేసి పెట్టుకుంటుందిట. వాటిని

గుర్తించి, గౌరవించుకుంటే మనసుకెంతో ప్రశాంతంగా ఉంటుంది. తనకు నచ్చని వ్యక్తుల మధ్య ఉన్నా, తన మనసుకు నచ్చని పనులు చేస్తున్నా ఎంతో అసంతృప్తిగా వుంటుంది. అప్పుడు జీవితం మీద..అంటే నీ మీద అనాసక్తి ఏర్పడుతుంది.

ఏం..ఎందుకంతలా నవ్వుకుంటున్నావ్? ఈ భూమ్మీద ఏ వ్యక్తికీ అన్నీ దొరకవు. వాటిని ఎవరికి వారు కూడగట్టుకోవాలి..సంపాదించుకోవాలి. 'అన్నిట్లో అమెరికా' అంటూ ఉదహరిస్తూ వుంటారు గానీ..అక్కడి పిల్లలెవరూ తల్లిదండ్రుల ఆస్తుల్ని తీసుకోరని, స్కూలింగ్ అయిపోగానే ఇంట్లో నుండి బయటకు వెళ్లిపోయి స్వతంత్రంగా పనిచేస్తూ బ్రతుకుతారని ఎందరికి తెలుసు.

చైనీస్ ఫుడ్.. అమెరికన్ శాలరీ.. జపనీస్ హోమ్.. ఇండియన్ వైఫ్ కావాలని చాలామంది కోరుకుంటారట. అంటే అప్పుడు జీవితం రంగులమయంగా ఉంటుందా అని నేను ప్రశ్నించా. ఎవ్వరూ సమాధానం చెప్పలా !

అన్నట్టు జీవితమా! నువ్వీ వార్త విన్నావా... ఓ సౌదీ సహోదరి ఈ మధ్య భర్తకు విడాకులిచ్చింది. ఆవిడ అభియోగం 'భర్త తనను విపరీతంగా ప్రేమిస్తున్నాడని, ఏది కోరినా క్షణాల్లో తీసుకొస్తున్నాడని' అయినా తనకు ఆ భర్త వద్దని కోర్టుకు వెళ్లింది. న్యాయాధిపతి విస్తుపోయి 'ఇంతకన్నా ఏం కావాలి' అని అడిగారు. 'నా భర్త వాళ్ళ అమ్మను అసలు గౌరవించడం లేదు. ఆవిడ ఏం అడిగినా చిన్న చిన్నవి తప్ప పెద్ద కోర్కెలు ఏవీ తీర్చడం లేదు. తల్లిని గౌరవించలేని కొడుకును నేనెలా నమ్మను? అతనితో కలిసి ఎలా భద్రంగా బ్రతకగలను?' అని ఎదురు ప్రశ్నించింది. నిజమే. . . భరోసా లేని జీవితం కోసం ఆవిడ అడిగిన ప్రశ్నను మన్నిస్తూ, ఆ మహిళ భావనతో తానూ ఏకీభవిస్తూ విడాకులు ఇస్తున్నానంటూ న్యాయాధిపతి తీర్పు నిచ్చేశారు. చిత్రంగా అన్పించడం లేదూ...!

మూలాల్ని మర్చిపోయి బ్రతికితే ఆ బ్రతుకు చివరికి ఏం మిగులుస్తుందో ఈ వార్త ద్వారా తెలుసుకున్నారు కదా.. పాపం ప్రపంచంలో చాలా మందికి ఈ విషయం ఇంకా అర్థం కావడంలేదు.

జీవితమా ! నువ్వుంటేనే నాకన్నీ దొరుకుతాయి. నీతో కలిసి సహవసిస్తేనే నా ఉనికికో అర్థం దొరుకుతుంది. ఎన్నెన్నో జన్మల తర్వాత మానవజన్మ దొరుకుతుంది అంటారు. ఎన్నాళ్ల తర్వాతనో దొరికిన ఈ వరాన్ని మేము నిరంతరం ఆస్వాదించేలా మమ్మల్ని ఆశీర్వదించు.

చిన్న చిన్న విషయాలకే ఆవేశంతో, తొందరపాటుతనంతో ఆత్మహత్యలకు పాల్పడి..బ్రతికుండగానే అమ్మానాన్నల్ని బలిచేయొద్దని..జీవచ్ఛవాలుగా మార్చొద్దని చెప్పు. మన చావు క్షణకాలమే..కానీ మనతో బ్రతికినవారు.. మనకు బ్రతుకును వరంగా ఇచ్చిన మన వాళ్ళు జీవితాంతం 'కడుపుశోకం'తో తల్లడిల్లుతూనే ఉంటారు.. మన అనాలోచిత తొందరపాటుమూలంగా.

అయినా... చావునే ప్రేమించగలిగినవారు నిన్ను ప్రేమించలేరా..! నవ్వుని, పువ్వుని, గువ్వని, గుట్టని, అమ్మానాన్నల్ని ప్రేమించలేకపోతే మనలో ఏదో తేడా ఉందని, అదేందో గమనించుకోమని అందరికీ చెప్పు జీవితమా !

బ్రతుకు అంటే గుర్తొచ్చింది... ఈ మధ్య ఓ వాట్సప్ మెసేజ్ బాగా వైరల్ అయింది. అందులోని ఓ సందేశం చాలా మందికి కంట నీరు తెప్పించింది. ఎక్కువమందిని ఆలోచింపజేసింది. కెవిన్ అనే ఫొటోగ్రాఫర్ సూడాన్ లో 1990 లలో కరువు కాలంలో ఓ ఫొటో తీశాడు. సూడాన్ లో తిండిలేక చాలా మంది చనిపోయారు. ఎముకలకు చర్మం అంటుకున్నట్టుగా బతుకీడుస్తున్న అన్నార్తుల బాధల్ని ప్రపంచానికి చాటాలన్న ఉద్దేశ్యంతో ఎన్నో ఫొటోలు తీశాడు. వాటిలో ఓ ఫొటోలో బక్క చిక్కి కూలబడ్డ ఓ పాప చేతిలో కొంత ఆహారం ఉంది, ఆ పాప వెనుక ఓ రాబందు ఉంది. ఆ పాప భయపడుతుంటుంది, తన చేతిలో ఆహారాన్ని ఆ రాబందు లాక్కుపోతుందేమో అని. కానీ ఆ పాపకి తెలియదు..ఆ రాబందు వచ్చింది ఆ నాలుగు మెతుకుల కోసం కాదనీ..తన కోసమేననీ...!

ఆ ఫొటో చూసిన అంతర్జాతీయ సమాజం కెవిన్ ని ఆకాశానికి ఎత్తేసింది. ఎన్నెన్నో అవార్డులతో సత్కరించింది.

విపరీతమైన పేరుతో పాటు, సత్కారాలు, సన్మానాలతో క్షణం తీరిక లేకుండావున్న కెవిన్ కి ఓ రోజు ఫోన్ కాల్ వస్తుంది. మరో సత్కారానికేమో..అంత సమయం లేదని చెప్పాలనుకుంటూ కాల్ తీసుకున్న కెవిన్ కి ఓ షాక్ తగులుతుంది. 'ఇంతకీ ఆ పాప బ్రతికిందా.. చనిపోయిందా' అని ప్రశ్నిస్తుంది అవతలి గొంతు. విసుగ్గా సమాధానం చెప్తాడు కెవిన్, 'ఏమో నాకెలా తెలుస్తుంది, ఫొటో తీసుకొని నేనొచ్చేశాను. ఆ తర్వాత ఈ సన్మానాలతో నాకసలు తీరిందా' అని. అప్పుడా అవతలి వ్యక్తి, 'నిజమే సార్! మీరన్నది నిజమే కానీ, మీ ఫొటోలో ఓ మిస్టేక్ ఉంది' అంటాడు. తన ఫొటోలో మిస్టేక్ ఉండే అవకాశమే లేదంటూ అదేంటో చెప్పమని అడుగుతాడు. కెవిన్ కి వచ్చిన సమాధానం, 'ఆ ఫొటోలో ఒక రాబందునే చూపించారు. నిజానికి అక్కడున్నవి రెండు రాబందులు. ఒకటి – చస్తే పాపని పీక్కు తిందామని కాచుకున్న రాబందు అయితే, బ్రతికి ఉన్నా కూడా పట్టించుకోకుండా ఆ పాపని సురక్షిత ప్రాంతానికి చేర్చకుండా కీర్తి కోసం ఫొటోలు తీస్తూ కూచున్న మీరే ఆ రెండో రాబందు', ఫోన్ పెట్టేస్తాడా వ్యక్తి.

నిజం కదా! అద్భుతమైన ఫొటో దొరికింది, ప్రపంచం నీరాజనం పలుకుతుందని ఆలోచించాడే కానీ, పాపమా చిట్టి తల్లిని కాపాడదామనే ఆలోచన, మానవత్వంతో కూడిన స్పందన ఉండుంటే ఆ బంగారు తల్లి బ్రతికుండేది. ఆ తర్వాత ఆ అపరాధ భారంతో అతి చిన్న వయస్సులో..33 యేళ్ళకే కెవిన్ చనిపోతాడు. బ్రతుకంటే ఐహిక ప్రపంచం మాత్రమే అనుకుంటున్న చాలా మంది ఈ సంఘటనతో తెల్సుకోవాల్సిన అంశం ఒకటుంది. పొగడ్తలు, సత్కారాలు – మానవత్వం కన్నా గొప్పవి కావు. అవి మన ఆత్మని సంతృప్తిపర్చలేవు కూడా. ఓ మంచి పని చేసి చూడండి. మానవత్వంతో స్పందించి చూడండి. అది ఎంతో ప్రశాంతంగా, ఎంతో ఆనందంగా ఉంటుంది.

అయినా ఓ జీవనమా... ! మన కోసం మనం బ్రతికే బ్రతుకు విలువ సున్నానే..ఇతరుల కోసం బ్రతకటంలోనే సంతృప్తి ఉంటుంది. పరులకోసం పాటుపడని నరుని బ్రతుకు దేనికని మనని మనమే ప్రశ్నించుకోవాలి. చెట్టు, పుట్ట, గుట్ట, గువ్వ బ్రతుకుతూనే వున్నాయి. కానీ బ్రతుకంటే జీవంతో వుండాలని, జీవనంలో గుండెతడి కనిపించాలని, అసలైన అనుభూతుల్లోనే ఎనలేని ఆనందం వుంటుందని ఈ జనాలు ఎప్పుడు తెలుసుకుంటారు..? కొన్ని క్షణాలు ఉండే మత్తుకోసం వ్యసనాలకు బానిస అవుతున్నారుగానీ ఆనందమనే మత్తును జీవితాంతం అందించే మంచి పనులు ఇచ్చే శాశ్వతత్వం కోసం ఎందుకు ప్రయత్నించడం లేదూ?

ఓ బ్రతుకా! నాకు నువ్వొద్దు. నిస్సారంగా..నిస్తేజంగా బ్రతుకుతున్నామంటే..జనాభా లెక్కల్లో వుంటున్నామంటే ఆ బ్రతుకు నిజంగా నాకొద్దు. నాకు నిరంతరం ఆస్వాదిస్తూ, ఆనందిస్తూ జీవంతో బ్రతికే అసలు సిసలు జీవితం కావాలి. పదుగురితో బ్రతికే బ్రతుకు కావాలి. పదిమందితో కల్సి పంచుకునే అనుభూతి కావాలి. 'జిందగీ నా మిలేగీ దోబారా' ! రెండోసారి దొరకని జీవితాన్ని ఎంత అపురూపంగా చూసుకోవాలి..ఎంత గొప్పగా ఆస్వాదించాలి..! పంట పండలేదని రైతన్న కల్లాల్లో పురుగుమందులు తాగడం, నేతన్నలు దూలాలకు ఉరి పోసుకోవడం, ఆడపడుచులు అత్తారింటి వేధింపులకు ఒళ్ళు కాల్చుకోవడం – ఎంత అమానుషం..!

ఒక్క క్షణం.. ఒకే ఒక్క క్షణం ఆలోచించమని చెప్పవా.. జీవితంలో గొప్పవాళ్లయిన అందరి బ్రతుకులు మొదట్లో ఆటుపోటులతోనే వున్నాయి. ఓ పెద్ద ఉడెన్ స్టాల్ వ్యాపారంతో ప్రపంచాన్ని యేలుతున్న ఈనాటి పెద్దమనిషికి ఆ సక్సెస్ ఎప్పుడొచ్చిందో తెలుసా.. 50 యేళ్ళు దాటాకనే. అప్పటిదాకా ప్రతిక్షణం ఓటమితోనే ఎదురీదుతూ బ్రతికాడు. 'బకెట్ చికెన్'లంటూ కొత్త ఐడియాతో ప్రపంచాన్ని ఓ ఊపు ఊపుతున్న గొప్ప వ్యాపారవేత్త ఓనాడు నిర్భాగ్యుడిగా వీధుల్లో తిరిగినవాడే. ఈనాడు క్రికెట్ లో అగ్రశ్రేణి ఆటగాళ్లుగా కొలవబడుతున్న చాలా మంది చదువుల పరీక్షల్లో ఫెయిల్ అయినవాళ్లేనని గుర్తు చెయ్యవా...

సహనం ఉంటే తప్ప విజయం రాదు. ఓపిక లేకపోతే ఓటమి తప్పదు. ఎన్ని దెబ్బలు తింటే రాయి దేవుడయ్యిందో చెప్పు. అయినా నువ్వేగా నాకు ఆ కథ చెప్పావు – ఓ గడప, దేవుడిగా నిలిచిన రాయిని అడిగిందట.. 'నువ్వూ రాయివే,

నేనూ రాయినే. నీకు ఈ మొక్కులూ, నాకు ఈ తన్నులూ ఎందు'కని. 'నువ్వు నాలుగు ఉలి దెబ్బలకే కంగుతిన్నావు, నేను వేల ఉలి దెబ్బలు తట్టుకున్నాకే ఇలా దండాలు పెట్టించుకుంటున్నాను. ఎన్ని ఎదురు దెబ్బలు తింటే అంతగా గెలుస్తాం.. అన్ని విజయాలు సాధిస్తాం' అని దేవుడి రాయి చెప్పిందని నువ్వేగా నాకు జీవిత పాఠాలు నేర్పావు..

ప్రతి ఒక్కరం నేర్చుకోవల్సిన బ్రతుకుపాఠం అది. ప్రతి ఒక్కరం గుర్తుంచుకోవాల్సిన జీవన సూత్రం అది. అమ్మ చేతి దెబ్బ తినకుండా, గురువు గారి బెత్తం దెబ్బ పడకుండా, నాన్న గారి కన్నెరుపు చూడకుండా ఎవ్వరమూ పెరగనూలేదు.. ఎదగనూలేదు.

జీవితామా..! నిన్ను గెలవాలంటే, నన్ను అర్థం చేసుకోవాలంటే మనుషులుగా మేం తెల్సుకోవాల్సింది ఒకటే – విజయం సాధించాలంటే అద్భుత సంకల్పం కావాలి, అసాధారణ సహనం కలిగుండాలి. సముద్రాన్ని ఔపోసన పట్టగల ఓర్పు కావాలి. అప్పుడే ఆయుష్షు ఉన్నంత వరకూ ముఖంపై చిర్నవ్వు చెదరకుండా సౌకర్యవంతమైన జీవితాన్ని ఆస్వాదించగల్గుతాం.

నిజం, భిక్ష పాత్ర పట్టుకుని 'ఓ దుఃఖమా – ఓ మరణమా' అంటూ చావును అభ్యర్థించేకంటే.. ఓ సహనపు చిరునవ్వుతో జీవితాన్ని శరణు జొచ్చడం మంచిది కదా! ఎలాంటి భేషజం లేకుండా జీవితానికి లొంగి పోతే అదే మనని విజయతీరాలకు చేరుస్తుంది – అని వివేకానందులే చెప్పారు. మార్క్స్ ఏం చెప్పాడో మరో మారు అందరికీ గుర్తు చెయ్యి జీవమా.. 'ఒక వ్యక్తి పరిణామం అతనితో ప్రత్యక్షంగానో పరోక్షంగానో సంబంధమున్న ప్రతివ్యక్తిదీ. విజయమైనా, అపజయమైనా అందరూ పంచుకున్నదే' అన్నారు కదా. ఎంత వాస్తవం..! ఒక మనిషి అర్థాంతర మరణం లేదా ఆత్మహత్య, ఆ కుటుంబం మొత్తానిది. మరి విజయాన్నెందుకు ఆ ఒక్క వ్యక్తికే ఆపాదిస్తారు? తప్పు కదా..! ఓటమైనా, విజయమైనా కుటుంబం మొత్తం బాధ్యత వహించాల్సిందే. అందుకే బాధ్యతలెరిగేలా బిడ్డల్ని పెంచాలి. సమాజానికి బరువు కాకుండా అందరికీ మంచి చేసేలా మసలుకోవాలి.

చచ్చినా జీవించి ఉండే సత్ చరిత్రులు కీర్తి శేషులు..కేవలం తమకొరకేనని బ్రతికే క్రిమి మనస్కులు మూర్తి శేషులు – అన్నారు జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత సి. నారాయణ రెడ్డి గారు. మన మరణం పదిమంది గుర్తు పెట్టుకోవాలి. మన జననం పదిగురికి మేలు చేకూర్చాలి. అలా ఉండాలనే కదా నువ్వు ఆశిస్తావ్ జీవితమా..! అందుకే నాకు బ్రతుకు కంటే ఉత్తమమైన నువ్వు కావాలి. ప్రతి క్షణం ఆనందించేలా..జీవంతో ఉన్న జీవితం కావాలి. పదుగురితో కలిసి బ్రతికే నిండు జీవితం..పదుగురి కోసం బ్రతికే సార్థకమైన జీవితం కావాలి.

మానవ సేవ మాధవ సేవ, జన సేవ జనార్ధన సేవ – అంటూ దేవుడ్ని మన పొరుగువాడిలో చూసుకుంటూ రేపటి మా జీవన విలువల్ని నీలో వెతుక్కుంటూ నిరంతరం ప్రాణం పోసిన నీ కోసం ప్రేమతో బ్రతుకుతాం. ఆత్మని హత్య చేసుకునేంత పిరికితనాన్ని, భయాన్ని, ఉద్రేకాన్ని, ఆవేశాన్ని మా నుండి దూరం చెయ్యి. నిన్ను అమితంగా ప్రేమించగలిగేంత నిజమైన ప్రేమనివ్వు. అప్పుడు ఆత్మ హత్యలు లేని కొత్త లోకాన్ని సృష్టించుకోవచ్చు. జీవితం గొప్పది.. ఎంతో గొప్పది...చావు కన్నా... బలవంతంగా ముగించుకునే చావు కన్నా ఎంతో ఎంతో గొప్పది. అందుకే నేను నిరంతరం నీ ప్రేమికుడిని.. నీ ఆరాధకుడిని.. అందుకే ఆనందంగా..ఆహ్లాదంగా జీవిస్తున్నాను. . . !

వుండనా మరి...

నీ

– ప్రసాద్ బొద్దులూరి

# శిశిర వసంతం

శ్యామ్ !

చాన్నాళ్ళ తర్వాత నిన్ను చూస్తున్నానన్న ఆనందం తో నీ దగ్గరకు వొచ్చినంత సేపు పట్టలేదురా నా ఆనందం ఆవిరి కావటానికి ... నిన్ను, మా చెల్లాయిని చూశాక వృద్ధాప్యం మనుషుల్లో ఇంత నిరాశావాదాన్ని, నిర్లిప్తతని పెంచుతుందా అనిపించింది. చలాకీ తనానికి మారుపేరుగా ఉండే నీలో ఈ నిస్తేజాన్నిచూడలేక పోయానురా. నువ్వు బాగా ఇష్టపడే భావకవి కృష్ణ శాస్త్రి గారు ఒక చోట అంటారు కదా.. "ముసలితనపు అడుగుల సడి ముంగిట వినపడగానే ఇంట లేడని చెప్పించు .. వీలుకాదని పంపించు" అని. కవులు శాసన కర్తలు కాబట్టి వాళ్ళకి చెల్లింది. మనకి కాదు కదరా. ఏ వయసుకి ఆ ముచ్చట. ప్రతిదాన్నిమనం గౌరవించాలి, గుర్తించాలి. ముఖ్యంగా ఆస్వాదించాలి. అంతెందుకు.. నా అభిమాన రచయిత్రి రంగనాయకమ్మ గారు ఏమంటారో తెలుసా.. "అమ్మమ్మల్ని చూస్తే కళ్ళకి కరువు తీరి పోతుంది . పసి పిల్లలు తప్పటడుగులు వేస్తూ ఇంట్లో తిరగటం ఎంత సందడో, పెద్ద వాళ్ళు ఇంట్లో కొలువుండటం కూడా అంతే ఆనందం" అని. బయట నుండి రాగానే పిల్లలొచ్చి కాళ్ళకి అల్లుకుంటారు . పెద్దలొచ్చి కళ్ళతో తడుముతుంటారు. ఇద్దరూ పసివాళ్లే . ఒకరు మనల్ని కన్నవాళ్ళు , మరొకరు మనం కన్నవాళ్ళు . అయితే అక్షయ పాత్రగా ప్రేమ భిక్షని అడిగిన వాళ్ళకే కాదు అడగని వాళ్లకు కూడా వేస్తూ పోయేది వృద్ధాప్యమే కదా..

అయినా శ్యామ్! ముదుతల కర్పూరంగా నేను వృద్ధాప్యాన్ని ఆస్వాదిస్తుంటే నువ్వేంటీ అసహ్యానికి పుట్టిన అందవిహీనత అంటావ్.. బాల్యాన్ని, యవ్వనాన్ని అనుభవించినంత సులువుగా నువ్వెందుకు వృద్ధాప్యాన్ని ఆహ్వానించ లేకపోతున్నావో నాకర్థం కావటం లేదు... జీవితం లో ఇదో దశగా ఎందుకు ఈజీ గా తీసుకోలేక పోతున్నారు. అదేమీ అనుకోని అతిథి కాదే, నువ్వు నిరాకరించటానికి. పుట్టుక తోనే మనం అంగీకరిస్తూ సంతకం పెట్టిన అగ్రిమెంట్ పేపర్ రా జీవితం.

మిత్రమా ! ముసలివాళ్ళంటే పనికిరారని, పనికి వేరై పోయిన వారని , పనికిమాలిన వారై పోతున్నారని ఎందుకలా మాట్లాడావో నాకర్థం కాలా? మనం ఎవరికి పనికొస్తాం రా, మనతో ఎవరికి మాత్రం పని ఉంటుంది అన్న నిరాశ నీకెందుకొస్తుందసలు? "ఎవరి అవసరాలు వారు తీర్చుకున్నారు .. పెళ్లిళ్లు చేసాం.. పురుళ్ళు పోశాం .. మనవళ్ళని, మనవరాళ్ళని మూడేసి సంవత్సరాలు పెంచి ఇచ్చాం. ఇక ఇప్పుడు మనతో పనేముందిరా వాళ్ళ జీవితాలు వాళ్ళవి" అన్నావ్ .. పిచ్చివాడిగా అనిపించావ్ రా నాకు నువ్వు నిజం .. తిట్టుకున్నా సరే నీతో కొన్ని వాస్తవాలు చెప్పటానికే నేను ఈ ఉత్తరం రాస్తున్నాను.

నిజం రా శ్యామ్ ! వృద్ధాప్యం ఒక అనుభవం . ఒక తరం నుండి మరొక తరానికి ఆచారాలు , అనుభవాలు అందించే వాళ్ళే వృద్ధులు. వృద్ధులు అంటే వృద్ధిలోకి వచ్చిన వాళ్ళు అని అర్థం . క్రింది మెట్టు లేకుండా పై మెట్టుకు

ఎక్కగలుగుతామా .. బాల్య, యవ్వనాల్లో ప్రేమను పంచి బాధ్యతల బరువును మోసీమోసీ అలసి సొలసి తిరిగి తిరిగి అదే ప్రేమను అందరి నుండీ ఆశించటం, నువ్వన్నట్టు సహజమే . కానీ ఆశించటం తోనే అసలు సమస్య వస్తుందని నీలాంటి వాళ్ళు గుర్తించటం లేదు .

తల్లిదండ్రుల్ని కావడిలో పెట్టుకుని మోస్తూ తీర్థ యాత్రలు తిప్పిన శ్రవణ కుమారుడు కానీ, తండ్రి మాట జవదాటక అడవులకు వెళ్లిన రాముడు లాంటి వాళ్ళు కానీ – ఈ కలి కాలంలో దొరకరన్న సంగతి ముందు నువ్వు గ్రహించాలి. Of course నువ్వు రాముడిగా మీ నాన్న మాట జవదాటక అన్ని పనులు చేసావ్ .. కానీ నీ పిల్లలూ అలానే ఉండాలని అనుకోవటం నీ మొదటి తప్పు. కానీ మారిన కాలాన్ని మారుతున్న తరాన్ని గమనించలేకపోవటం నీ తప్పేకదా!

నువ్వింకా నయం. నీకు ఆర్థిక ఇబ్బందులు లేవు. మన మూర్తి గాడి పరిస్థితి చూడు. వంతుల వారీగా, వాయిదాల పద్ధతిలో తల్లిదండ్రులని పంచుకుంటున్నారు. ఎంత దౌర్భాగ్యంరా అది. జీవితాన్ని మీకు ఇచ్చాం కదా మీతో కలిసి జీవించే హక్కు లేదా మాకు అని ఇక్బాల్ గొంతు చించుకుని అడిగినా పిల్లల దగ్గర నుండి సమాధానం రావటం లేదు. ఆకలిని భరిస్తున్నాను రా, కానీ నా పిల్లలు చేస్తున్న అవమానాన్ని మాత్రం మింగ లేక పోతున్నానురా అని 70 ఏళ్ళు. నిండిన వయసులో వాడు కళ్ళ నిండా నీళ్లతో మాట్లాడుతుంటే చూడలేక పోయానురా.

మొన్నామధ్య నెల్సన్ కలిసాడు. జనాంతికంగా ఎక్కడుంటున్నావ్ రా అన్నాను. 60 ఏళ్ళు వచ్చాక అందరూ వృద్ధాశ్రమాల్లో చేరాల్సిందే కదరా, గెంటించుకోవటం ఎందుకని ముందుగానే అక్కడికి చేరాను రా అన్నాడు వెలితిగా నవ్వుతూ. భార్య చనిపోయి 3 ఏళ్ళు అయిందిట. అమెరికా అవకాశం వచ్చినా కాదని ఇక్కడే పిల్లతో ఉండాలని త్యాగం చేసిన వాడికి దక్కిన ప్రతిఫలం ఇదిరా .. భర్తలు చనిపోతే భార్యలు బాధ్యతగా నిలబడి కుటుంబాన్ని నెట్టుకు రాగలుగుతున్నారు కానీ భార్యలు చనిపోతే మనమెందుకు రా కుంగిపోతున్నాం? నిజమేలే .. అన్ని పనులు వారే చేసి మనల్ని పసిబిడ్డలుగా ప్రేమించే వారు కదా .. ఆ మిస్సింగ్ ఫీలింగ్ అడుగడుగునా వెంటాడుతూనే ఉంటుంది.

అయినా శ్యామ్ .. నాకు తెలియక అడుగుతాను .. వృద్ధాశ్రమాల్లో ఉండటం ఓ సామాజిక వాస్తవం గా అంగీకరించాలా మనం .. మరి రేపటి రోజున వారి పరిస్థితి ఏమిటి.. ఈనాటి మనలో వారి రేపటి జీవితాలు కనిపించటం లేదా .. అడ్డమై పోవటం ఏమిటిరా .. అడ్డాలనాడు చేసిన అల్లరిని సహించిన పెద్దరికాన్ని గడ్డాలొచ్చిన తర్వాత అగౌరవ పర్చటం యువతరానికి ఎంతవరకు చెల్లుతుంది?. ఓటి కుండ లోని నీరులా పోతున్న శక్తి సామర్థ్యాలు నిజానికి వాళ్ళు పెట్టే చారెడు గింజలతో రావని , కేవలం మనం బ్రతికేది ఆత్మీయతా మాటల మాత్రలతో అని వాళ్ళకి ఎవరు అర్థం అయ్యేలా చెపుతారు .. ఆస్తులు, అస్తికలు కోసం పోరాడుతున్నారు కానీ అన్నం పెట్టేందుకు, ఆత్మీయత చూపేందుకు పోటీ పడితే ఎంత బాగుండు .. వాళ్ళ అల్లరిని భరించినా ఇప్పటి మన చాదస్తాన్ని మాత్రం వీళ్ళు భరించ లేక పోతున్నారు. ఎందుకని?

ఒరేయ్ శ్యామ్ ! నీకు గుర్తుందా .. మన లెక్కల మాస్టారు గారింటికి మనం ట్యూషన్ కి వెళ్ళేవాళ్ళం . ఇంటినిండా జనాలే ఉండేవాళ్ళు. వాళ్ళ తాత గారు ఏమి అడుగుతారా అని అందరూ భక్తి గా ఎదురు చూస్తూ ఉండేవారు . సర్ ఓ కన్ను, ఓ చెవి అటు వేసి ఉంచేవారు . పెద్దల పట్ల గౌరవం చూపించ లేని జీవితం ఓ జీవితం కూడా కాదు అనే వారు. మన ప్రాణం–వారు పెట్టిన భిక్ష అంటూ మనకి ఒక కేరాఫ్ అడ్రస్ ఇవ్వటం కోసం వాళ్ళు జీవితాన్ని పెట్టారు .. మనం కొంత సమయాన్ని అయినా వాళ్ళకోసం ఇవ్వక పోతే మన రేపటి తరానికి నేర్పించేది ఏముంటుంది అనేవారు .

నిజం రా ఫ్రెండ్ ! అశేష ఆలోచనల ప్రతి రూపం జీవితం . అనేక ఆచరణల ప్రతిబింబం వృద్ధాప్యం. ఈ అనుభవ వాహినిని ఎందుకు మనం అనర్థాల కోసం ధారా దత్తం చెయ్యాలి... ఒక తరానికి ఆలోచన, ఈ తరానికి మార్గ నిర్దేశనం,

రాబోయే తరానికి ఆదర్శ ప్రాయం – ఐనా పెద్ద తరం ఎందుకు నిరాదరింప పడుతోంది అన్న ఆవేదన వద్దు. రేపు మనం ప్రజల కోసం ఇంకా ఏమి చెయ్యొచ్చో ఆలోచిద్దాం.

ఇప్పటిదాకా కన్నాం కాబట్టి మమత తో చేశాం. కంటేనే బిడ్డలు అనే తప్పుడు అభిప్రాయం నుండి బయట పడి అందరూ మన బిడ్డలే అనుకునే స్థాయికి చేరుకొని అందరి హితం కోసం పనిచేద్దాం. ఈ మధ్యే పేపర్ లో చూశాను. ఓ అమ్మని కంటి ఆపరేషన్ కని తెచ్చి బస్టాప్ లో వొదిలేసి వెళ్లిన కొడుకు ఉదంతాన్ని... ఆస్తి రాయట్లేదని బండరాయితో తండ్రి తలమీద కొట్టి చంపిన పిల్లలను , బంగారం లాక్కుని అత్తని బయటకి గెంటేసిన కోడలిని.. మంచం లో ఉన్న తల్లిని చూడలేక తుప్పల్లో వొదిలేసి పోయిన కొడుకుల్ని, కూతురికి పెడుతుందని తెలిసి ఇంట్లో కట్టి పడేసిన తల్లి అవస్థని. అబ్బో ఇలా ఎంత దయనీయంగా మారిందో వృద్ధాప్యం ! వయసుడిగి పోయి కళ్ళు కనిపించకుండా , చెవులు వినిపించ కుండా కన్నీళ్లను రెప్పల కట్టల మధ్య బంధిస్తూ, పరాయీకరణమైన బతుకులో, ఆత్మల దాహార్తితో బ్రతక లేక బ్రతుకు ఈడుస్తున్నవాళ్ళు ఎందరో .. చేదు అనుభవాలను చేతి కర్ర గా తీసుకుని అజ్ఞాత ప్రస్థానాల్లోకి వేదనా వర్షంలో తడుస్తూ శిశిరంలా తరలి వెళ్లిపోతున్నారు..

అయినా వీళ్లల్లో ఎంతమందికి తెలుసు .. 1999 లో ఐక్యరాజ్య సమితి అక్టోబర్ 1 న వృద్ధుల దినోత్సవాన్ని వృద్ధులసంక్షేమం కోసం నిర్వహించాలని నిర్ణయించారు. అంతేకాదు 2007 లో వృద్ధులను నిర్లక్ష్యం చేసే వారికి 3 నెలల జైలు , 5000 రూపాయల జరిమానా విధించింది. జూన్ 15 న వృద్ధుల బాధా నివారణ దినంగా ప్రకటించింది . క్రిమినల్ ప్రొసిజర్ 125 ప్రకారం పిల్లలు పోషించక పోతే కేసు వేసుకునే సదుపాయం కూడా కల్పించింది.

అయినా తప్పు వాళ్ళది మాత్రమే కాదురా....... మనది కూడా. సంపాదన యావలో పడి డబ్బా పాల మాతృత్వాన్ని, చైల్డ్ కేర్ సెంటర్ల సంరక్షణని పంచామే తప్ప ప్రేమను ప్రేమగా చూపించామా? వాళ్ళకి మార్కుల సంస్కృతిని నేర్పింది, పైకి యెదగమని పోరింది మనమేగా. పొద్దస్తమానం ఎక్కువ శాలరీ తెచ్చుకుంటున్న వాళ్ళ గురించి చెప్పామే కానీ శ్రవణకుమార కథని కానీ, మన పెద్దల పట్ల మనం చూపించిన గౌరవాన్ని కానీ నేర్పించామా...

బహుళ జాతి కంపెనీలకు బానిసలై పోయారంటూ, డబ్బు యావ తప్ప మరేదీ పట్టదని తిట్టుకొనే ముందు మన పెంపకాన్ని గురించి ఆలోచిద్దాం. మొన్న పంపిన మదర్స్ డే గ్రీటింగ్ కార్డ్ గురించి, ఫాదర్స్ డేకి పంపిన ఫ్లవర్స్ బొకే గురించి, నెలకొకసారి అక్కౌంట్ లో వేస్తున్న డబ్బు గురించి గుర్తుచేస్తూ ఇదే కదా ప్రేమ, మేము యెంత బాగా చూసుకుంటామో తెల్సా అన్నట్లు ప్రవర్తిస్తున్నారు ఈ నాటి తరం. ఎదగమని చెప్పామే కానీ మనకే అందనంత యెత్తుకు యెదుగుతారని వూహించామా. మనం ఇరుకు గదుల్లో బ్రతికినా ఇలా ఇరుకు హృదయాల్ని అలవర్చుకోలేదు. కాంక్రీట్ జంగిళ్ళలో పెరిగిన మన పిల్లలు మాత్రం కఠిన హృదయాలను అలవాటు చేసుకున్నారు.

శ్యామ్! ఒకప్పుడు మన పిల్లల్ని రెసిడెన్షియల్లో పెట్టి వాళ్ల జీవితాలు బాగుండాలంటే అక్కడే వుండాలని ఆశించాం. వాళ్ళు మన కోసం ప్రాణం పెట్టుకొని ఆ ఊచల వెనుక నిలబడి ప్రతి ఆదివారం యెదురు చూస్తూ ఉండేవారు. ఇప్పుడు వాళ్ళు "మీ వయసు వారు ఉంటారు. మీకు కాలక్షేపం అవుతుంది. హెల్త్ చెకప్స్ బాగుంటాయి" అంటూ మనల్ని వృద్ధాశ్రమాల్లో పెడ్తున్నారు. తప్పేముందిరా.. 'వాళ్ళ దృష్టిలో అది ఒప్పు, ఇక మనకు తప్పేదేముంది చెప్పు' అని మాత్రం నేననురా.... వృద్ధాశ్రమాలు పెరగటం అభివృద్ధి కాదు. దేశ దౌర్భాగ్యం.

ఒరే! జీవితం మనదిరా – కొంత కాలం పెద్ద వాళ్ళ కోసం..... కొంత కాలం పిల్లలకోసం బ్రతికాం.... కనీసం ఇప్పుడైనా మన కోసం మనం బ్రతుకుదాంరా. మన అదృష్టం యేమిటంటే మంచి మిత్ర మండలి వుంది మనకి. దేవుడు చల్లగా చూసి సంపూర్ణ ఆరోగ్యంగా వున్నాం. ఇక రానున్నాయి అనారోగ్య అవస్థలు.... వాటిని దరిచేర నివ్వకుండా యోగా చేస్తూ, పౌష్టికాహారం సమతులంగా తీసుకుంటూ సమాజానికి సాయం చేద్దాం.

పుట్టుకతో అనాథలైన వాళ్ళనీ, వికలాంగుల్నీ, అన్నార్తులను ఆదుకుందాం. చేతినిండా డబ్బుకాదురా, సేవ చేయటానికి జీవితం నిండా సమయం ఉండాలి – పెద్ద మనసుండాలి. ఈ మన పెద్దరికం ఆ రెంటినీ మనకిచ్చింది. జపాన్ ని వృద్ధదేశం అంటారు. అంటే వృద్ధులు యెక్కువగా వున్న దేశం. అయినా ప్రపంచం మొత్తం మీద అద్భుతమైన పురోగతి సాధించింది. జపాన్ వాళ్ళకి సెలవులిస్తే, ఇంట్లో వుండమని అభ్యర్ధిస్తే కూడా వుండకుండా ఆఫీసుల కొచ్చి పనులు చేస్తారట. విశ్రాంతి అంటే వాళ్ళకు యేవగింపుగా వుంటుందంట. మనమూ అలాంటి ఆలోచనల్ని పెంచుకోవాలి.

జీవితంలో మనం ఎప్పుడూ ఆశించనిది సానుభూతిరా. అది ఇప్పుడు కూడా కోరుకోవద్దురా – కన్న బిడ్డలైనా సరే, కనికరం చూపించమని కన్నీళ్లు పెట్టుకో వద్దురా. మనం సంపాదించిన ఆస్తుల్ని సగం వాళ్ళకివ్వాలి – మిగతా సగం మన స్వార్జితం కదా. మన ఇష్టంగా ఖర్చు పెట్టుకుందాం. ఎట్లాగూ వయసులో ఉండగా పిల్లల చదువులతో, ఉద్యోగాలంటూ, మనవళ్ళ సేవలంటూ అందరికీ అన్నీ చేశాం. ఇక ఇప్పుడు మన అర్ధ భాగాల కోసం, మన కోసం సమయాన్ని కేటాయించుకుందాం. కంటికి ఇంపుగా నాలుగు ప్రాంతాలు చూద్దాం. మనసుకు తృప్తి కలిగించేలా మంచి పనులు చేద్దాం.

వృద్ధాప్యం ప్రతి మనిషి జీవితంలో తప్పని సరిగా వచ్చే ఆఖరి పేజీరా. అది లేకపోతే పుస్తకం సంపూర్ణం కాదు. గుర్తింపు కూడా ఉండదు. మనకు తెలియకుండానే పుట్టాం. ఏం చేయాలను కుంటున్నామో చెప్పకుండానే బాల్యం గడిచింది. యవ్వనంలో బరువుల మధ్యనే కాలం గడిచింది. మరి మనకు యెంతో చేసిన మనం నివసించే సమాజం ఋణం ఎప్పుడు తీర్చుకొనేది. జీవితంలో ఏవరికీ ఋణపడి పోకూడదు.. అనాథ శరణాలయాలకు వెళ్దాం. వృద్ధాశ్రమాలకు వెళ్దాం. వాళ్ళతో కబుర్లు చెబుదాం. వివిధ ప్రాంతాలకు వెళ్దాం, ప్రకృతిని ఆస్వాదిద్దాం. రెడ్ క్రాస్ సంస్థలకు వెళ్దాం. ఆప్తులకు సేవ చేద్దాం. మన అవసరాలన్నీ ఒకప్పుడు అనవసరమనుకున్నాం. పిల్లల అవసరాలన్నీ అత్యవసరంగా భావించాం. సంతానం కానీ, సర్కార్ కానీ, సమాజం కానీ అర్థం చేసుకోలేదని, ఆసరా ఇవ్వలేదని అనవసరం కన్నీళ్లు కార్చొద్దు. మన చేతులు పొడిగా వున్నాయి. ఆర్తుల కన్నీళ్లు తుడుద్దాం. మన గుండెల్లో చెమ్మ వుంది. అందరి ఆవేదనను ఆర్తిగా విందాం. అందుకే కుటుంబ సంబంధాల్ని అర్థవంతంగా తీర్చిదిద్ది సమాజ నిర్మాణానికి కీలక భూమిక పోషిద్దాం. రేపటి సమాజానికి వృద్ధాప్యం అంటే భయం లేకుండా చేద్దాం.

శ్యామ్! రారా! నీ కోసం మేమున్నాం. మాకోసం మీరంతా ఉన్నారు. ఒకరికొకరం అండగా ఉందాం. ధీమాగా జీవితాన్ని గడుపుదాం. మనకేమయిందిరా. వృద్ధులమే అయ్యాం. కానీ మానసిక, శారీరక ఆరోగ్యంతో బాగానే వున్నాం. మనుషుల సాయం కోసం ఎందరో మనుషులు ఆశగా ఎదురుచూస్తున్నారు. మన అవసరం లేని వాళ్ళకోసం ఎదురుచూస్తూ, కన్నీరుకారుస్తూ, కాలాన్ని వృధా చేయడం కంటే, అవసరంవుండి సాయంకోసం చేతులు చాచి అర్థిస్తున్న అభాగ్యుల కోసం పాటుపడదాం రా. మదర్ థెరీసా ఏమన్నారో గుర్తుందా "ప్రార్థించే పెదాల కంటే సాయం చేసే చేతులు పవిత్రమైనవి" అని కదా . ఏరా ! ఇంకా ఎంత కాలం ఉంటామో తెలియని జీవితంలో రోజులు లెక్క పెట్టుకుంటూ దేవుడి పిలుపు కోసం నిరాశగా నిరీక్షించే కంటే పదిమందికి సాయంచేస్తూ పోతే బ్రతుకుకి ఎంత సార్థకమో కదా.. ! రండిరా... దేశాభివృద్ధి లో భాగమవుదాం . చెయ్యాల్సిన పనులు, వెయ్యాల్సిన ప్రణాళికలు చాలా వున్నాయి ... నీ కోసం ఏదురుచూస్తూ ఉంటాను...

నీ మిత్రుడు

– జావీద్!



# నిన్నటి తరం దూత

నా...న్నా!

ఎప్పుడూ రాయని కొత్త పదం టైపు చేస్తున్నందుకేమో నా నోట్ ప్యాడ్ (notepad) నా వంక ఆశ్చర్యంగా చూస్తోంది. కంపెనీ సి.ఈ.ఓ. లకి, టీం లీడర్లకి మెయిల్స్ రాయడం తప్ప మీకెప్పుడూ నేను ఉత్తరం రాయలేదు కదా నాన్నా ! ఎప్పుడో 20 యేళ్ళ క్రితం మీ మిత్రులు, బంధువులు రాసిన ఉత్తరాల్ని ఇప్పటికీ ఇష్టంగా చదువుకుంటూ పదే పదే ఆ జ్ఞాపకాల్ని తలపొయ్యడం మీకు ఇష్టం కదా నాన్నా ! అందుకే ఈ ఉత్తరం మొదలెట్టాను.

ఈ హాస్పిటల్ కిటికీలోంచి అలా ఆకాశాన్ని చూస్తుంటే మీ మనసులాగే ఎంతో నిర్మలంగా కనిపిస్తూ ఉంది. నీరవ నిశ్శబ్దం ఈ గదంతా పర్చుకున్నట్టుంది. మీ చేతిని రెండు చేతుల మధ్య పట్టుకొని గాజు కళ్ళతో అప్పుడప్పుడు అమ్మ నా వంకా, సెలైన్ బాటిల్ వంకా పదే పదే చూస్తోంది.

ఎప్పుడో చిన్నప్పుడు యండమూరి వీరేంద్రనాథ్ పుస్తకంలో చదివిన జ్ఞాపకం. తండ్రి చనిపోయాడని తెలిసి కూడా అర్థరాత్రి ఇంట్లో వాళ్ళను ఏడ్పించలేక తెల్లారి చెప్పాలని ఆ రాత్రంతా తండ్రి పాదాల దగ్గర సినిమా స్క్రిప్ట్ రాసుకుంటూ కూర్చున్నానని, ఆ ఒంటరితనపు కాళరాత్రి తనలో అంతర్మథనాన్ని కల్గించిందని, అందులో నుంచి పుట్టిందే 'అంతర్ముఖం' నవల అని..తండ్రి మరణం కల్గించిన విషాదంలోనూ తన మనసు పనిచేసుకున్న విధానాన్ని, న్యూనతా భావాన్ని నిజాయితీగా రాసినపుడు – ఇది సాధ్యమా అనిపించింది. కానీ నన్ను . . . నేనున్న పరిస్థితిని చూసుకుంటే ఆ మరణా మరణం అందరి జీవితంలోనూ తప్పని ఘడియే అనిపిస్తుంది.

నాన్నంటే మీరే నాన్నా ! నా దేహాత్మ మీరు. ఎందుకో మీకు ఎంతో చెప్పాలని ఉంది. వినే టైమ్ మీకున్నప్పుడు నేను చెప్పలేకపోయాను. ఇప్పుడు నాకెంతో చెప్పాలని ఉన్నా మీరు వినలేకపోతున్నారు. నాన్నా ! కాలం, వేళ్ళ మధ్య ఇసుకలా జారిపోతూనే ఉంటుంది. ఎప్పుడు చెయ్యాల్సినవి అప్పుడే చేస్తూ వెళ్లిపోతే నాలా ఇప్పుడిలా 'రిగ్రెట్' తో తలదించుకునే స్థితి ఏ కొడుక్కీ రాదు కదా !

తెలుగు భాషలో నేను, నా అని చెప్పుకోగల్గే పిలుపును నాకిచ్చిన ఒకే ఒక్క ఆత్మీయత 'నాన్న' అన్న పదమే. నా – అన్న అక్షరంతో నా తత్వాన్ని, నా లోకాన్ని , నా ఆదరణను నాకు వెన్నతో పెట్టి మొన్న, నిన్నల అవగాహనతో నా రేపటికి చిన్న చిన్న మెట్లను నిర్మించిన నా హీరో నువ్వు నాన్నా . నాకు అర్థమైనంత వరకూ నాన్న పాలన, అమ్మ ఆలన అంటారు. నీకు తెల్సినన్ని విద్యలు ఎవ్వరికీ తెలియవేమో...చిన్నప్పుడు ఓ రైతు లా నీ చేతులు అడ్డుపెట్టి నా ప్రాణ మొక్కను పెంచావు.

నాకు నీతులు చెప్పేటప్పుడు ఓ పూజారిలా, నాకు కథలు చెప్పేటప్పుడు ఓ టీచర్లా, నాకు బట్టలు కొనేప్పుడు ఓ

దర్జీలా, నాకు భోజనం పెడుతున్నప్పుడు ఓ పోషక నిపుణుడిలా, నాకు సుస్తీ చేస్తే ఓ డాక్టర్లా, సేవలు చేయాల్సి వచ్చినప్పుడు ఓ నర్స్‌లా, నేనేదైనా ఓ పొరపాటు చేసినపుడు సరిచేసే సందర్భంలో కమ్మరిలా, నాకు అనుబంధాలు నేర్పేటప్పుడు కుమ్మరిలా, నిద్రపుచ్చేప్పుడు గాయకుడిగా, నన్ను నవ్వించేటప్పుడు విదూషకుడిగా, గుర్రంలా మారే నటుడిగా, ఎత్తుకున్నప్పుడు గున్న ఏనుగులా, మొత్తంగా నా వ్యక్తిత్వ సౌధాన్ని నిర్మించే ఆర్కిటెక్ట్ గా నా కోసం ఎంతెంతో చేశావు. నన్ను బాధ్యతాయుతమైన వ్యక్తిగా మార్చటం కోసం నిన్ను నీవు అరగదీసుకున్నావు. నీ కండరాల్ని కరగదీసుకున్నావు. నీ రక్తాన్నంతా చెమట చుక్కలుగా జార్చుకున్నావు.

నాన్నా ! నన్ను చెక్కిన శిల్పివి నువ్వు. భవిష్యత్ రంగుల లోకాన్ని నా చేతులకు అందించిన వర్ణ చిత్రకారుడివి నువ్వు, నా జీవిత కవిత్వానికి పదాలు కూర్చిన కవివి నువ్వు. నా సర్వస్వం నువ్వే. నా సకలం నువ్వే. నిన్ను నాలో కొనసాగించుకునే సహజాత సంకల్పం నువ్వే. నా ఆలనా పాలనా చూసే బ్రహ్మలా, నా స్థితికి దోహదకారిగా మలిచిన కాలంలో విష్ణువులా, నేనేదైనా తప్పు చేసినప్పుడు సరిచేసే క్రమంలో శివుడిలా త్రిమూర్తుల సంక్షిప్త రూపంగా నువ్వు కన్పిస్తావు. నేవేసిన ప్రతి అడుగు ఓ మైలు రాయిలా భావించావు. నా కళ్ళలో కన్నీరు చిందకుండా మీ కళ్ళల్లో వత్తులేసుకొని కాపాడుకున్నారు. నా ఆత్మస్థైర్యం సడలకుండా అమృతం లాంటి మాటలతో ఉత్సాహాన్ని నింపారు. అహంకారమనే తెర ఎగరనీయకుండా, ఎదగాల్సిన పై శిఖరాన్ని చూపారు. అపజయపు ముళ్లమీద నా అడుగు పడకుండా మీ అరచేతుల్ని అడ్డుపెట్టి ఆదుకున్నారు.

ఎన్ని గాయాలు నాన్నా నీ జీవనానికి..గాయాల నది నుండి పుట్టిన మా నాన్నగా నాకు బతకటం నేర్పావు–బతుకు ఇవ్వడం నేర్పావు–మనిషిగా ఎదగటం నేర్పావు. కానీ నీ గురించి నాకన్నీ తెల్సనుకున్నానే గానీ తవ్విన కొద్దీ ఊరే చెలమలా ఎన్నెన్నో విశేషాలు ఇంకా ఇంకా తెలుస్తూనే ఉన్నాయి నాన్నా ! ఎంత గర్వంగా ఉందో నాన్నా, నువ్వు నా నాన్నవి అయినందుకు... ఎంత అపరాధంగా ఉందో నాన్నా నిన్నింకా నేను సంపూర్తిగా తెల్సుకోలేకపోయినందుకు... నాన్నా ! చిన్నప్పటి నుండీ ఇప్పటివరకూ నా హీరో ఎవరూ అంటే నీ పేరే చెప్తూ వచ్చేవాడిని. పదే పదే అందరూ అడిగేవారు..ఎందుకు అని. చిన్నప్పుడు చెప్పటం తెలియక చెప్పలేదు. పెద్దయ్యాక తెల్సినా చెప్పే సందర్భం రాలేదు. నాన్నా ! నాకు..నీతో చెప్పాలని ఉంది నాన్నా, నువ్వు నా రీల్ హీరోవి కాకుండా రియల్ హీరోవి ఎందుకయ్యావో...

మా అందరికీ ఓ డజను అరటిపండ్లు కొనటంకోసం నువ్వు మూడు మైళ్ళు నడిచి, బస్సెక్కి వస్తూ ఆ డబ్బుల్తో మా అందరి సగం ఆకలి తీర్చినందుకుకాదు, పగలంతా బడిలో పాఠాలు చెప్పీ చెప్పీ ఇంటి కొచ్చాక కూడా ఊర్లోని పేద పిల్లల కోసం, నిరక్షరాస్యులైన పెద్దల కోసం రాత్రి 10 గంటల వరకూ వీధి బడిని ఇంట్లోనే నడిపినందుకు కాదు..ఇంట్లో మూడు జతలు మించి బట్టలు ఉండడాన్ని సామాజిక అపరాధంగా చూసినందుకు కాదు..మా బాల్యాన్నంతా పుస్తకాల మధ్యే నడిపించినందుకు కాదు..పుట్టిన రోజునైనా ఓ జత కొత్త బట్టలు కొనివ్వమంటే చిరిగిన బట్టలైనా వేసుకోగానీ ఓ కొత్త పుస్తకం కొనుక్కోమంటూ నేర్పినందుకు కాదు..ఒక్కొక్క మెట్టు మేం పై చదువులకు పాకుతున్నప్పుడల్లా అమ్మ వంటి మీది పుట్టింటివారు పెట్టిన ఒక్కొక్క నగ మార్వాడీ కొట్లోకి బదలాయించినందుకు కాదు..ప్రతి ఆరు నెలలకోసారి మా అందరితో రక్త దానం చెయ్యడం నేర్పించినందుకు కాదు.. నిజాయితి అనే ఒకే ఒక్క సమాధానంతో జీవించడం ఎలాగో నేర్పించినందుకు – నాకు రియల్ హీరోవి అయ్యావు నాన్నా.

నాకే కాదు, మన ఊరివారందరికీ నువ్వు హీరోవి. కాదు కాదు...దేవుడివి. వాళ్ళకి MLA, MP లు తెలియరు నాన్నా... చదువు లేదు, ప్రభుత్వం అర్థం కాదు. కానీ తెలిసిందల్లా నువ్వు మంచి మాత్రమే చూస్తావు..మంచినే అందరికీ చేస్తావు అన్న నమ్మకం. అదొక అతి పెద్ద బ్రాండింగ్ నాన్నా ! ఆ 'లేబుల్' ని మన కుటుంబానికి నువ్విచ్చావ్. విశ్వాసం, నమ్మకాలు అతిపెద్ద ఆస్తులు నాన్నా, ఆ ఆస్తుల్ని కోట్లు కోట్లుగా సంపాదించిన కోటీశ్వరుడివి నువ్వు. ఇక నీకు కోట్లతో పనేముంది నాన్నా ?

మనఊరి సర్పంచ్ గారు..అదే నీ ఆత్మీయ మిత్రుడు ఎప్పుడూ నిన్ను అడిగేవారు, నీకు గుర్తుందా నాన్నా... 'అందరికీ అన్నీ చేశావు, ఇన్ని సిద్ధాంతాల మధ్య నీలాంటి వాళ్ళు బ్రతకలేరురా..ఇప్పటికైనా బ్రతకటం నేర్చుకోరా బడిపంతులూ. నీకోసం నాలుగు రాళ్ళు వెనకేసుకోరా..ఈ మనుషుల్ని నమ్మలేం..మన దగ్గర మేలు పొంది, మనకే కీడు చేస్తారు..మనం వెనకేసుకున్న ఆస్తిపాస్తులే మనల్ని కాపాడుతాయి' అని. అందుకు నువ్వు నవ్వుతూ ఒకే సమాధానం చెప్పేవాడివి – 'ఎవరో దోచుకుంటే పోయేదీ..ఎవర్నో దగా చేస్తే పొందేదీ అయిన డబ్బు నాకొద్దురా..నిజాయితీగా, నీతిగా సంపాదించే నా జీతం చాలు. నా పిల్లలు గొప్పవాళ్లు కావడానికే కదా ఆస్తులు కావల్సింది అయినా నేను సంపాదించలేదని ఎవరన్నారు, నేను వెనకేసుకున్న ధనం మీకెవ్వరికీ కనపడదు. రేపటి మన పిల్లలు..ఆ పిల్లల పిల్లల కోసం మంచి పౌరుల్ని తయారుచేసే కర్మాగారంగా నా ఇంటిని, బడిని మలిచాను.

దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే కాదు, నా ఇంట్లో కూడా రూపుదిద్దుకుంటుంది. అదేరా నేను ఇంటికి, సమాజానికి, దేశానికి ఇచ్చే ఆస్తి' అని కొండంత గర్వంగా నువ్వు చెప్పే ఒకే ఒక్క మాటతో నాకు చిన్నప్పటి నుండీ నువ్వు హీరోవి అయిపోయావు. అదేంటో..దానర్థం ఏమిటో నా కప్పుడు తెలియదు నాన్నా. కానీ ఆ మాట చెప్తున్నప్పుడు నీ కంఠంలో విన్పించే ధాటి, నీ కళ్ళల్లో కన్పించే మెరుపు, ఆ మాట వింటూ బామ్మ, అమ్మ తల ఎత్తుకునే తీరు నిన్ను నాకు హీరో గానే పరిచయం చేసింది నాన్నా.

నాన్నా ! ఓ మారు మళ్ళీ నీ నోటి వెంట ఆ మాట వినాలని వుంది నాన్నా ! ప్లీజ్ నాన్నా ! ఒక్క మారు ఆ మాట వినిపించవా.. మళ్ళీ నన్నోసారి ఒళ్ళంతా తడిమి ఎప్పటిమాదిరి 'గొప్పవాడుగా బ్రతకటం కాదురా, గొప్ప పనులు సమాజానికి ఇవ్వడం కావాలిరా' అని నా కాలర్ సవరించరా నాన్నా !

నాన్నా ! 80 యేళ్ళ వయసులో ఒళ్ళంతా ముడుతలు పడి, అలసి సొలసి అవయవాలన్నీ విశ్రాంతి కోరుకుంటున్న ఈ వేళలో కూడా మీ ముఖం వర్చస్సుతో వెలుగుతూనే ఉంది నాన్నా! జీవితాన్ని గెలుచుకున్నానన్న గర్వం..మనుష్యుల కోసం బ్రతికానన్న ధైర్యం మీ ముఖంలో కనిపిస్తూనే ఉంది. నీకు తెల్సా నాన్నా, ఇదో పెద్ద కార్పొరేట్ హాస్పిటల్. వీళ్ళకు నువ్వెవరో తెలియవు, కానీ నీ కోసం ట్రాక్టర్లు కట్టుకొని, ఎడ్లబళ్ళు కట్టుకొని, బస్సులేసుకొని వస్తున్న జనాల్ని చూసి నువ్వెవరో ప్రజాప్రతినిధివి అనుకుంటున్నారు. నువ్వొక బడిపంతులువని తెలిసి ఆశ్చర్యపోయారు. బతకలేని ఆనాటి బడిపంతులు ఎంతమంది హృదయాల్ని గెల్చుకున్నాడో తెల్సి ఆనందపడిపోతూ ఇంకా స్పెషల్ కేర్ తీసుకుంటున్నారు. ఈ హాస్పిటల్ MD ఏమన్నారో తెల్సా నాన్నా, 'మనిషే మాయమైపోతున్న వ్యవస్థలో, మానవత్వమే మృగ్యమైపోతున్న సందర్భంలో ఓ మనిషిగా మీ నాన్న ఇందరి మనసుల్లో నిల్చినందుకు నువ్వు గర్వ పడాలి రావ్' అన్నారు. నిజం కదా నాన్నా!

నువ్వు, మాస్ కాపీ చేస్తున్నారని సస్పెండ్ చేసిన చిన్న స్కూల్ హెడ్ మిస్ట్రెస్, బడిలో బీడీ తాగాడని స్కూలుకి నెలరోజులు రానివ్వని నందూ, ఆడపిల్ల జడ పీకాడని జండా కొయ్య దగ్గర 10 రోజులు స్టూలుపై నిలబెట్టిన రావు, పెన్ను దొంగతనం చేశాడని బడంతా ఊడ్పించిన సుబ్బారావు కూడా వచ్చారు నాన్నా.. నాకు ఆ పనులే గుర్తున్నాయి కానీ ఆ తర్వాత వాళ్ళ కోసం..వాళ్ళలో మార్పు కోసం..వాళ్ళ మీద పడ్డ చెడు ప్రభావాన్ని దూరం చెయ్యడం కోసం నువ్వు వాళ్ళ పట్ల ఎంత శ్రద్ధ తీసుకున్నావో చెప్తుంటే నాకు కన్నీరు ఆగలేదు నాన్నా !

అమ్మెప్పుడూ చెప్పేది – వాళ్ళ నాన్న గారితో వాళ్ళ అమ్మ మాట్లాడ్డానికే భయపడేది అని. అమ్మా, వాళ్ళ నాన్నతో మాట్లాడింది పెళ్లయ్యాకేనట. అదీ నువ్విచ్చిన ధైర్యంతోనే ! నిజమే ! మా మిత్రులు ఇప్పటికీ చెప్తారు, వాళ్ళ నాన్నలు ఇప్పటికీ మోనార్కులేనని. కానీ నువ్వు మారిన నాన్నవి నాన్నా ! నేను మగవాడిని అన్న అహంకారం లేకుండా, జీవితాన్ని అమ్మ కోసం, మా కోసం, మా పిల్లల కోసం సగభాగం ఇచ్చి మిగతా సగాన్ని సమాజానికి పంచిన దేశభక్తుడివి నువ్వు. నీ కోడలు ఎంతమందికి చెప్తుందో తెల్సా నాన్నా.. ముందు మంచి కొడుకు, ఆ తర్వాత మంచి మొగుడిగా

వుంటానన్న నమ్మకంతోనే నన్ను పెళ్లి చేసుకుందట. అది నువ్విచ్చిన పెంపకం గొప్పతనం కదా ! నా పిల్లలు నన్నో స్నేహితుడిగా ఆత్మీయంగా చూస్తారు. నా భార్య కూడా నన్నొక ఫ్రెండ్ లాగా చూస్తుంది. నువ్వు నాకొక ఫ్రెండ్ లాగా, మార్గదర్శకుడిగా నిలిచావు. బంధాలను మించినవి ఇవే కదా..సమాజానికి కావాల్సినవి ఇలాంటి ఆరోగ్య కరమైన వ్యవస్థే కదా..పునాదులు వేసేది అందరితో అనుబంధాలే కదా నాన్నా ! ఇవి నువ్వు నేర్పిన పాఠమేగా నాన్న.

'ఇంట్లో ఆడపెత్తనం యేందిరా – ఎప్పుడూ నువ్వు లక్ష్మి ఏం చెప్పినా తల ఊపుతావేందిరా – అసలు ప్రశ్నించవా' అని రాములు మామయ్య ఎన్నో సార్లు నిన్ను అడిగేవాడు. నువ్వు ఒకే మాట చెప్పేవాడివి – ఊయల ఊపగలిగిన చెయ్యి, పదిమందికి వండి వార్చగల నేర్పు, తృప్తిగా పదిమందికి అన్నం పెట్టగల మనసు, అందరూ తన పిల్లలే అని లాలించగల హృదయం ఎప్పుడూ తప్పు చెయ్యదురా, తాను తప్పు చేస్తే నేను తప్పు చేసినట్టే – అని. అదుగో నాన్నా, అక్కడ నీ అర్ధభాగం అగమ్యగోచరంగా..చెప్పాపెట్టకుండా, నువ్వెందుకు సెలవు తీసుకోవాలనుకుంటున్నావో అర్థం కాక, అయోమయంగా చూస్తోంది. ఎప్పుడూ తనకి నీ మాటే వేదవాక్కు కదా నాన్నా! నువ్వేం చెపితే అది చెయ్యడమే తెల్సు. ఇప్పుడు మరి సెలవంటూ అడగకుండానే, నువ్వు లేకుండా మిగతా జీవితాన్ని ఎలా లాగాలో చెప్పకుండానే వెళ్లిపోతే ఎలా నాన్నా?

వీలునామాలు అందరూ రాస్తారు కదా నాన్నా, మరి నువ్వూ నీ వీలునామా రాసావా నాన్నా? నీ ఆశయాలు ఇంకా ఎన్ని మిగిలున్నాయో..నీ ఆకాంక్షలు ఇంకా ఎన్ని నెరవేర్చాలో..నీ నిబద్ధత ఎందరికి ఎన్ని హామీలు ఇచ్చిందో – అన్నీ రాసావా నాన్నా? నాన్నా నీకున్న మూడు జతల బట్టల కోసం వేల చేతులు ఎదురు చూస్తున్నాయి. వాళ్ళ దేముడి గూటిలో పెట్టుకోవాలట. హాస్పిటల్ X-ray వార్డ్ దగ్గర నువ్విడిచిన చెప్పుల్ని రాం దేవ్ మూడు రోజులుగా ఇంకా గుండెలకు హత్తుకునే ఉన్నాడు. నువ్వు రాసే పెన్ను నీ జేబులోంచి పడిపోయిందని చూసి తీసుకొని అక్క దాన్ని కొంగుకు ముడేసుకొనే తిరుగుతోంది. నీ చేతికర్ర జారిందని, దాని అవసరం ఎప్పుడైనా నీకు రావచ్చని నీ మనవలు దాన్ని పట్టుకొని వరండాలో నిలబడే ఉన్నారు. అమ్మలూ అనే నీ పిలుపు కోసం నీ కోడలు, అమ్మాయీ అనే నీ పిలుపు కోసం చెల్లెలు ఒళ్ళంతా చెవులు చేసుకొని ఎదురు చూస్తూనే ఉన్నారు.

నాన్నా ! నువ్వు నాకొక్కడికే హీరో కాదు నాన్నా, మన ఇంటికి, మన ఊరికి, ఈ దేశానికీ 'హీరోవి'. వృత్తిని ప్రవృత్తిగా మలిచిన వాడివి. వృత్తినే దైవంగా ప్రేమించినవాడివి. సమాజ హితమే మతంగా భావించినవాడివి. అందరి బాగే పరిశ్రమగా జీవించినవాడివి. నీకంటే ఎవరు నాన్నా గొప్పవాళ్ళు? నీలాంటి వాళ్ళే కదా ఈ సమాజానికి రావాలి, నీవంటి వాళ్ళే కదా ఈ జనాభాకి కావాలి. మరెందుకు నాన్నా నువ్వు అప్పుడే 'విరమణ' తీసుకుంటున్నావ్? విశ్రాంతి కోరుకుంటున్నావ్? ఇంకా శేషం 20 ఏళ్ళు ఉంది కదా నాన్నా ! ఇంకా చెయ్యాల్సిన పనులు చాలానే ఉన్నాయి కదా నాన్నా మీకు.

నాన్నంటే తలవంచని మేరు పర్వతం. గెలిచినవేళ తలనిమిరే ఆప్యాయత, ఓడినప్పుడు వెన్ను తట్టే ధైర్యం, నేలపై పాదం కందుతుందేమోనని బిడ్డకు గుండెలపై నడక నేర్పిన ప్రేమమూర్తివి. నువ్వు కాక ఇంకెవ్వరు చెప్పు ? నీ ఆ ప్రేమకు కొలతల్లేవు. ఆకాశమంత ఎత్తు, అగాధమంత లోతు, అనంతమైన ప్రేమ ఉన్నా సముద్రమంత గాంభీర్యంతో వుంటూ కన్పిస్తారు.

నువ్వు బుడిబుడి అడుగుల్లో నడక నేర్పిన గురువువి. కష్టంలోనూ, సుఖంలోనూ వెన్నుదన్నుగా నిల్చిన స్నేహితుడివి జీవితానికి దిశానిర్దేశం చేసిన మార్గదర్శివి. పొరపాట్లను సరిదిద్దిన సంస్కారివి. గెలుపు–ఓటముల్లో తోడుండిన స్ఫూర్తిదాతవి. కష్టాల్ని ఇష్టంగా మలుచుకొని ప్రేమను పంచుతూ బాధ్యతను మోసిన నా శ్రేయోభిలాషివి. తడబడినప్పుడు చెయ్యందించావు, పొరబడినప్పుడు సరిదిద్దావు వేలు పట్టుకుని గురువులా నడిపించావు. మా బరువును

నీపై వేసుకొని నడిపిన నేస్తం. బతుకుతెరువు చూపిన కల్పతరువువి. వెలుతురులో వెంటాడే నీడ కూడా చీకట్లో కనుమరుగవుతుంది. నాన్న నువ్వు అలా కాదు. మా కష్టసుఖాల్లో గెలుపువి, బతుకుల్లో తోడు నీడవి.

పెరిగే నా వయస్సుతో పాటు నీ కష్టం కూడా పెరిగిందిగా నాన్నా. అర్ధరాత్రి దాటినా, అలసి సొలసి వచ్చినా నవ్వు వీడనంత ఇష్టంతో కష్టాన్ని ఎందుకు నాన్నా అంతలా ప్రేమిస్తారు మీరు. నా కలల్ని వాస్తవంగా చూడ్డంకోసం నీ కాలాన్ని వెచ్చిస్తూ యంత్రంలా అంతలా పని ఎలా చెయ్యగలుగుతారు. సంపాదించుకోవడంలో నువ్వు పడ్డ కష్టం, ఖర్చు పెట్టడంలో మేం పడే ఆనందం ముందు ఎంతో పెద్దది నాన్నా. సంపాదించేప్పుడు నీతి, ఖర్చు పెట్టుకున్నప్పుడు కారణం బలంగా లేకపోతే సంపాదన సులభమైన సమస్య లాగా, ఖర్చు తక్కువైన కష్టంలాగానే మిగిలిపోతుందని చెప్పింది మీరేగా నాన్నా ! సంపాదన కన్నా సాయం గొప్పది. తప్పెత్తి చెప్పేకంటే తలెత్తుకునేలా నేర్పించడం మహా గొప్ప పని. సాటి మనిషికి సాయం చేయడం క్వాలిటీ కాదు నెసిసిటీ అనే కామన్ సెన్స్ ఉన్న ప్రతివారూ మా నాన్న వంటి నాన్నే అనుకుంటే ఎంతో గొప్పగా ఉంది నాన్నా !

పాఠశాలల్ని.. పార్ట్ టైమ్ శాలలుగా కాకుండా బ్రతుకు పైరు నిలిచే మడులుగా మార్చింది మీరేగా. అందరూ పాఠాలు మాత్రమే చెప్తుంటే జీవిత పాఠాల్ని నేర్పిన మా బ్రతుకు విధాత మీరే కదా ! నాన్నని హీరో అనుకోలేని కొడుకు జీరోనే తప్ప, ఎప్పటికీ తన పిల్లలకి హీరో కాలేడన్న సత్యం ఆచరణలో చూపింది మీరేగా నాన్నా. నాన్నా ! నాక్కాస్త సమయం ఇవ్వు, నేను నీ అంత కాకున్నా కొంతన్నా మారేందుకు. ఇంకొంత కాలం మాతో కొనసాగే భాగ్యాన్నివ్వు. కొంతలో కొంతన్నా సమాజం నిన్ను చూసి నేర్చుకునే సమయం చిక్కుతుందేమో.

నాన్నా ! సాయి కొడుకు జీవితం ముగించుకోబోయాట్ట – వాడికి నాలుగు మంచి మాటలు చెప్పాలిగా నాన్నా, లేచి రావా... నాగన్న పొలంలో వేసిన విత్తనాలు నకిలీవంట, అర్జీ రాయాలిగా నాన్నా, లేచి రావా... పాలు పోసే పార్వతి కూతుర్ని పట్నంలో ఎవరో మోసం చేసారట, ఆ ఇంటి ముందు మౌన వ్రతం చెయ్యాలిగా నాన్నా, లేచి రావా...మన దర్జీ అబ్రహాం దాచుకున్న చిట్ ఫండ్ కంపెనీ ఎత్తేసారట, ఐ.పి. పెట్టిన ఆ సంస్థ ముందు ధర్నా చేయాలిగా నాన్నా, లేచి రావా... కల్తీ మందు తాగి ముస్తఫా చావు బతుకుల మధ్య గవర్నమెంట్ హాస్పిటల్ లో చేరాడు నాన్నా , పరామర్శించి తనకీ, ఇంట్లోవాళ్లకీ ధైర్యం చెప్పాలిగా, లేచి రావా...

నాన్నా ! నువ్వు లేవకపోతే , నీవు లేకపోతే బతుకులో చీకటిగా ఉంది నాన్నా ! ఏమీ తోచడం లేదు. నువ్వలా పడక కుర్చీలో కూర్చొని పావురాలకి విత్తనాలు చల్లుతూ, ఇంటికి వచ్చే పోయే వాళ్ళతో నాలుగు మాటలు మాట్లాడుతూ ఉంటే అదొక ధైర్యంగా ఉంటుంది నాన్నా! నాలుగు రోడ్ల కూడలిలో నిలబెట్టబడ్డ శిలావిగ్రహం కాదు నాన్నా నువ్వు. నాలుగిళ్ళల్లో ప్రతిష్టించ కుండానే పూజలందుకుంటున్న మంచి మనిషివి నాన్నా నువ్వు. మంచి బ్రతకాలంటే నువ్వు బ్రతకాలి. అందరి మంచిని మనసారా కోరుకునే నువ్వు మాతో ఉండాలి.

ప్రియాంక చోప్రా తన తండ్రి రాసినట్లుగా భావిస్తూ రాసుకున్న కవిత:
నా సమాధి దగ్గర నిలబడి కంట తడి పెట్టకు. నేనక్కడ లేను.
గాలినై నీ చుట్టూ ఆవరించి ఉన్నా.
మంచుపై ప్రసరిస్తున్న వజ్రపు కాంతిని.
పండిన పంటపై రవిరేఖల వెలుగును.
నీ మనసును పులకరింపజేసే తొలకరి జల్లును.
వేకువ జామున నీ మేల్కొలుపును.
ఆకాశంలో మెరిసే తారను. నా సమాధి దగ్గర నిలబడి రోదించకు.
నేనక్కడలేను – నేను చనిపోలేదు – నీ చుట్టూ ఆవరించే వున్నాను.

ఈ కవిత ఈ సమయంలో నాకెందుకు గుర్తొస్తుంది నాన్న.

ప్లీజ్ నాన్నా ! ఒక్కసారి కళ్ళు తెరువు. ఒక్క మాట మాతో చెప్పు, ఈ సమాజానికి చెప్పు – నువ్వు మాకిచ్చే సందేశం కోసం కాదు. నీ జీవితాన్నే ఒక సందేశంగా మలిచినందుకు, సాటి మనిషి కోసం బ్రతికేంత ప్రేమ నీ నరనరాల్లో ఎలా పాకిందో ఆ రహస్యాన్ని చెప్పు. అప్పుడు విశ్వమానవులం మేము అవుతాం. విశ్వాన్ని సుందరంగా మారుస్తాం. రా నాన్నా...త్వరగా రా... లే నాన్నా త్వరగా లే... రేపటి తరాలను మలిచిన ఓ మంచి నాన్నగా, పదుగురిలో మమ్మల్ని మంచి నాన్నగా నిలబెట్టిన నవీన నాన్నగా మమ్మల్ని దీవించు. మాకోసం మళ్ళీ ఓసారి జీవించు !

ప్రేమతో...

నీ

– ఐ.వి. సుబ్బారావ్

# పచ్చని ఆశ

చెట్టమ్మా!

నీకు ప్రేమలేఖ రాయటానికి కాగితం వాడాలనిపించలేదు. ఎందుకంటే గుల్‌మొహర్, యూకలిప్టస్, సుబాబుల్ చెట్ల అవతారికమే కాగితం కదా అన్పించిది. పోనీ ఆకుల మీద విభిన్నంగా రాద్దామంటే నిన్ను పెంచాల్సిన విలువ తెలిశాక ఇది వరకులా నీ ఆకుల్ని తుంచలేకపోయాను. అందుకే నా సహవాసిని, సంజీవిని అయిన నీకు mail రాస్తున్నా – ఎంతైనా ఆధునిక యంత్ర మానవుడిని కదా....

చెట్టమ్మా !
నేలతల్లి ఆకాశానికి రాసే ప్రేమలేఖ నువ్వు
నా భూమితల్లి స్వప్నానివి నువ్వు
పర్యావరణ హితకారిణివి నువ్వు
అంతెందుకు విస్మృత మేఘంలోంచి కురిసిన ఆదిమ చినుకు నువ్వు
బతుకమ్మ ముగ్గుల వాకిట్లో పూసిన పూలదండ నువ్వు
నువ్వు వెయ్యేళ్ళు బ్రతికితేనేకదమ్మా మానవాళి ఆనందంగా ఆరోగ్యంగా వుండగలిగేది....

మనిషి పోసే చారెడు గింజలతో ప్రాణం పోసుకుని ఆకాశం చల్లే నీళ్ళ చిలకరింపులతో చిగుళ్ళు వేసి కొమ్మై, రెమ్మై, మాకు తోడు నీడగా వుంటూ ఆదికాలం నుండి ఆధునిక కాలం వరకూ మాతో సహవసించిన కల్పతరువు నువ్వు. విత్తనంగా భూమి పొరల్ని చీల్చుకుని తలపై కెత్తి, మొట్టమొదట విప్పారిన రెండాకుల చేతులతో ప్రాణం పోసిన పుడమికి నమస్కరిస్తావు... ఆ తర్వాత పర్యావరణాన్ని సంస్కరిస్తావు. ఎంత గొప్ప కృతజ్ఞతా భావమమ్మ నీది.

నీవు ఏపుగా పెరిగితేనే మనిషి నీలా నిటారుగా దృఢంగా నిలబడగలుతాడు. చెట్టంత మనిషి అంటే చెట్టులా పెరిగిన మనిషి అని కదా. చెట్టులా సాయం చేస్తూ ఊరంతా వనంగా నువ్వు విస్తరించకపోతే జనమెలా జగతిలో నిలబడగల్గుతారు చెప్పమ్మా. గొడ్డళ్లు గాండ్రింపులతో నిన్ను సగానికి నరికేసినా – గ్రీష్మం నిన్ను నగ్నంగా నిలబెట్టినా – తుఫాను నిన్ను కూల్చేసినా... మళ్ళీ మళ్ళీ చిగురిస్తూనే వుంటావు. వెనుకంజ వేయటం – ఆత్మహత్య చేసుకోవటం, నీ చరిత్రలో లేదు కదమ్మా.

చెట్టమ్మా! దయచేసి ఆ రహస్యం ఏమిటో, నీలో వున్న ఏ జీన్స్ నీకింత స్థైర్యాన్ని కల్గిస్తున్నాయో మాకు చెప్పమ్మా. అప్పుడే మా మానవాళి ఆటుపోట్ల మధ్య ఆత్మహననాలకు పాల్పడకుండా నీలా నిబ్బరంగా బ్రతికేస్తుంది. నీదెంత గొప్ప

జన్మమమ్మా, ఎంత గొప్ప పరోపకారం నీది. నీలో ఏ భాగం తీసుకున్నా మనిషి కోసమే, జీవజాతి మీద ప్రేమతోనే అర్పణ చేస్తావు, అర్చన చేస్తావు. చిన్నప్పటి నుండీ చూస్తున్నా...

తంబాకై నా జిల్లాకి భుక్తి నిచ్చింది నువ్వే
విస్తరాకై ఆకలికి దోసిలి పట్టిందీ నువ్వే
ఆకు కూరవై ఆకలి తీర్చిందీ నువ్వే
తమలపాకై భుక్తాయాసాన్ని తీర్చిందీ నువ్వే
మారేదు దళానివై భక్తిని పెంచిందీ నువ్వే
తాళపత్రమై తరాలుగా విజ్ఞానాన్ని పంచిందీ నువ్వే
శమీ ఆకువై బంగారంలా మారిందీ నువ్వే
తులసి ఆకువై పరమాత్ముని తూచిందీ నువ్వే
తాటాకువై మా వాసాల్ని కప్పింది నువ్వే
చెరుకాకువై పండుగలా నిల్చిందీ నువ్వే
అసలు నువ్వుంటేనే మనిషికి అన్నం
నువ్వు కనికరిస్తేనే మనిషికి వస్త్రం
నువ్వు సహకరిస్తేనే మనిషికి ఆవాసం.

నువ్వు ఎండిపోయినా, పండిపోయినా, తగలబడి పోయినా ఋణం తీర్చుకుంటావ్. కిరణజన్య సంయోగక్రియ ద్వారా స్వయం పోషకత్వాన్ని సాధిస్తూ మమ్మల్ని ఛాలెంజ్ చేస్తూ పరాధీనత కావద్దంటావ్ – మనిషికి ఆక్సిజన్‌ను ఇస్తూ అమ్మలా ఆయుష్షును పోస్తుంటావ్...

ఎప్పుడూ నీ లక్ష్యం ఆకాశం వైపే.... తలెత్తుకుని నిలబడే నువ్వు మాకెప్పుడూ ఆదర్శమే. ఏ మట్టయితే ప్రాణదానాన్ని చేసిందో ఆ నేలతల్లితో నీ ఊడలతో బంధాన్ని పెనవేసుకుంటూ జీవితాంతం ప్రేమబంధాన్ని చూపే మీ మర్రిచెట్టుని మనిషి ఆదర్శంగా తీసుకోగల్గితే ఈ సృష్టంతా సౌందర్యవంతంగా మారిపోద్దిగా. నిజం చెప్పాలంటే దుర్వాసన వేస్తున్న మనిషి అకృత్యాల్ని మార్చేస్తూ సుగంధాల్ని అద్దే సహజ అత్తరు నువ్వు.

పురాణాల్లో–
సీతమ్మ తల్లిని అశోకవనంలో వుంచారు
జమ్మిచెట్టు మీదే అర్జునుడు ఆయుధాలు దాచాడు
చెట్లను చీల్చుకుని వచ్చి బాలకృష్ణుడు వాటికి శాపవిమోచన చేశాడు
నీ చాటున నిలబడే రాముడు వాలిని చంపాడు
నీ సంజీవినితోనేగా లక్ష్మణుడు మూర్ఛనుండి తేరుకుంది.
నువ్వు చేసిన – చేస్తున్న పనులు ఎన్నవి చెప్పను...నీలో ప్రతిది ఉపయోగమే... సమాజ హితమే....

అసలు ఈ భూమి మీద పెరిగే నీ సంతతి 4 లక్షల రకాలు. ఇందులో మనిషి ఉపయోగించుకునేది 2/3 వేలే. ఆహారం కోసం అందులో మేము వాడుతుంది కేవలం 200 రకాలే. ఒక్క చిలకడ దుంప నుండి 100 రకాల వస్తువుల్ని తయారుచేసి వాషింగ్టన్ కార్వర్ ప్రపంచాన్ని ఆశ్చర్యంలో పడేశాడు కదమ్మా. అంతెందుకు మెక్సికోలో ఇప్పటికీ వున్న సైప్రస్ వృక్షం జీవితకాలం 500 సంవత్సరాలు. రెడ్‌వుడ్‌గా నీ జీవితకాలం 3 వేల సంవత్సరాలు. అంటే మా తరాలు 30 మందిని మీరు చూస్తున్నారన్నమాటే కదా! ఎంత చిత్రం కాకపోతే పైన్ వృక్షం వేళ్ళు నేలలోకి 400 అడుగుల

లోతుకు దిగటం చూస్తున్నాం. 98 సంవత్సరాల వరకు 11 అంగుళాల ఎత్తు మాత్రమే పెరిగిన పిట్ కాస్పాన్ వృక్షం లావు ఒక్క అంగుళం మాత్రమేనట. ఇది ఆర్కిటిక్ ప్రాంతంలో వుంది కదమ్మా. ఇక సీసాకు పెట్టే బిరడాను సిందూర వృక్షం బెరడు నుండి తయారు చేస్తారని అందరికీ తెల్సుకానీ, ఆ బిరడాలో ఘనపు అంగుళంలో 20 కోట్ల గాలి రంధ్రాలుంటాయంటే నమ్మలేక పోయానమ్మా. అన్నింటికంటే చిత్రంగా బోలీవియా దేశంలో వున్న పుయార్రై మాండి అనే చెట్టు తాను పుట్టిన 150 సంవత్సరాలకి 107 మీ. ఎత్తున ఒకే ఒక్క పుష్పగుచ్ఛాన్ని ఇస్తుందట. ఆ గుచ్ఛం రాలిపోగానే ఆ చెట్టు మరణించటం విషాదం కదా!

ఒకసారి ఏం జరిగిందో తెల్సా చెట్టమ్మా! జిడ్డు కృష్ణమూర్తి గారు ఆకులు రాలి మోడు వారిన ఓ చెట్టు దగ్గర నిలబడి తదేకదీక్షతో ఆ చెట్టును చుస్తూ వుండిపోయారు. 'ఏమిటి జి.కె. అక్కడంతా ఎండిపోయి రాలిపోయిన కొమ్మలు తప్ప చూసేందుకు ఏముంది' అని పక్కనున్న వ్యక్తి అడిగాడట. అప్పుడాయన కులన్నీ వుండటం వల్ల ఇన్నాళ్ళు గమనించలేదుకాని ఆ కొమ్మలు చూడు, ఆ బెరడు చూడు, ఆ చెట్టు వయ్యారం చూడు ఎంత సౌందర్యం తొణికిసలాడుతుందో అన్నారట. ఓ తత్వవేత్తని కూడా సౌందర్యోపాసకుడిగా మార్చివేసిన సౌందర్యరాశివి నువ్వు.

'చైత్రమాసం గాలి సోకిందో లేదో చెట్లన్నీ పూయటానికి నిర్ణయించుకున్నాయి. పూలు పెదవులు విప్పాయి.. పుప్పొడి రహస్యాలు చెప్పటానికి. ఇప్పుడు ప్రతిచెట్టు ఒక దేవాలయం. పక్షులన్నీ ఎగిరే దేవతలు' అంటూ నీతో నిరంతరం ప్రేమలో పడుతూ ప్రకృతి ప్రేమికుడిగా గుర్తింపబడ్డ నా అభిమాన కవి శేషేంద్రగారన్నారు. చూశావా చెట్టమ్మా – ఆ మహాకవే నిన్ను దేవాలయంతో పోల్చారు. అంత గొప్ప తరువువి – కల్పతరువువి నువ్వే కదా!.

నిజం చెప్పాలంటే ప్రకృతిసిద్ధ ఎయిర్ కూలర్ నువ్వు. అది గ్రహించకుండా మేమంతా A/cలు, కూలర్లు, ఫ్రిజ్‌లు వాడుతూ ఓజోన్ పొరను దెబ్బతీసి భూతాపానికి బలవుతున్నాం. పాలిథిన్ కవర్లు వెయ్యి సంవత్సరాలకు భూమిలో కలుస్తాయట. ఆ ప్లాస్టిక్‌ల వల్లే నీకూ, భూమికి మధ్య దూరం పెరిగి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. ఎన్నిమార్లు అరిచినా ఎప్పుడమ్మా మేం మేల్కొనేది? కాయగూరలు 5 రోజుల నుండి నెలరోజులు, నైలాన్ బట్ట 30 నుండి 40 యేళ్ళకు భూమిలో కలుస్తాయట. చూశావా అమ్మా! ప్రతి మనిషి సగటున ఏడాదికి 8 కిలోల ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నాడంటే రాబోయే తరంవారి జీవితం ఎంత దౌర్భాగ్యంగా బ్రతుకవబోతుందో నాకిప్పుడే కన్పిస్తోంది నువ్వు ఏడాదికి 100 కిలోల ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంటే మా మనిషి ఏడాదికి 9.5 టన్నుల ఆక్సిజన్‌ను పీల్చుకుంటున్నాడు. 40 గ్యాలన్ల నీటిని నువ్వు ఒక రోజున నీటి ఆవిరి రూపంలో గాలిలోకి వదులుతుంటే, మేం వాడే అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఉపకరణాల వల్ల వేడి తప్ప చల్లదనమే కరువవుతోంది.

చెట్టమ్మా! మా పిల్లలకి ఇవ్వాల్సింది ప్లాట్లు, కార్లు, బంగారాలు కాదు. అసలైన బంగారం లాంటి ప్రకృతిని. కాలుష్యం లేని జీవితాన్ని. మొక్కలతో పచ్చగా అలరారే ఈ నేలను. ఎందుకమ్మా ఈ బ్రతకలేని బతుకులు? ప్రకృతిని నాశనం చేసుకుంటున్నాం అనుకుంటున్నాం కానీ, రేపటి మా పిల్లల బతుకుల్నే నాశనం చేస్తున్నామని గుర్తించటం లేదు చెట్టమ్మా.! నువ్వు లేకపోతే గాలినెవరు శుద్ధి చేస్తారు? ఆక్సిజన్ని ఎవరు అందిస్తారు? ధ్వనిని ఎవరు తగ్గిస్తారు? ధ్వని తరంగాలలో 26% హరించి 74% చెల్లా చెదురు చేసే నీకంటే మాకెవరు ఆత్మబంధువులు చెప్పమ్మా! భూతాపం, జీవవైవిధ్యం, పర్యావరణ కాలుష్యం ఇవన్నీ నీతోనే కదా ముడిపడి వున్నాయి. అన్నీ ఉచితంగా లభిస్తుండడంతో మా మనుష్యులకు నీ విలువ తెలియటం లేదమ్మా!. కొనుక్కుని వాడుకుంటుంటే అప్పుడు తెలుస్తుంది నువ్వేంటో... నీ విలువ ఏమిటో...

చెట్టమ్మా!. పురాణాల కాలం నుండి విన్పిస్తున్న శ్రీగంధం చెట్లను ఎకరానికి 300 నాటితే 2 కోట్ల ఆదాయం 15 సంవత్సరాల తర్వాత వస్తుందని ఎంతమందికి తెల్సు. ఎకరానికి 160 వెదురు మొక్కలు నాటితే 4వ యేటి నుండి కోటి రూపాయల దిగుబడి వస్తుందని ఏ శాస్త్రవేత్త నడిగినా చెప్తాడే! ఎకరా విస్తీర్ణంలో సాగుచేసే టేకు వల్ల 25 యేళ్ళకు కోటి

రూపాయల ఆదాయం వస్తుందని రైతులకు మాత్రం తెలియదా...! ద్రాక్షను జాగ్రత్తగా పెంచితే 300 నుంచి 400 సంవత్సరాల వరకు అంటే 4 తరాలు కాలు మీద కాలేసుకుని లక్షలాది రూపాయలు లాభంగా పొందొచ్చు. చూశావా... తల్లీ! చెట్టే కదా అనుకుంటాం..కానీ రూపాయల కందువాని మా భుజాన పరిచి మౌనసాక్షిగా చూసే మా అమ్మమ్మ వి కదా నువ్వు.

అంతెందుకు, ఒక్క సిందూరచెట్టు 400 గ్యాలన్ల నీరుని భూమి నుండి రోజూ పీలుస్తుంది కదా, ఈ ఒక్క చెట్టును నరికితే నదుల్లో నీరు ఎన్నో గ్యాలన్లు తగ్గిపోతాయట. వక్క చెట్టు 90 – 100 గ్యాలన్ల నీరు గ్రహిస్తుందిట. మొక్కజొన్న మొక్కనుండి 231 లీ. నీరు ఆవిరి అవుతుంది. ఒక్క క్యాబేజి ఆకు అడుగు భాగంలో రమారమి ఒక కోటి పత్రరంధ్రాలు ఉంటాయంటే మేం నమ్మాలి. ఈ ప్రకృతిలో 500 రకాల మాంసాహర మొక్కలుండటం వల్ల కీటకాలు, చిన్న పురుగులు ఎప్పటికప్పుడు నాశనం అయి మనిషిని కాపాడుతున్నాయి. అవే లేకపోతే మనిషి కీటకాలు బారినపడి చచ్చిపోయేవాడు.

పైగా ఒక్క గులాబీని చూస్తేనే పరవశించే మనిషికి 8000 గులాబీ రకాల గూర్చి వింటే, 10 వేల రకాల యాపిల్ పండ్లను చూస్తే మతిపోద్ది కదా. ఇంకో చిత్రమైన విషయం చెప్పనా నీ మొగ్గలు లవంగాలై సుగంధ ద్రవ్యాలుగా ఎన్నో దేశాల ఆర్థిక స్థితిగతుల్ని మారుస్తున్నాయి. చెట్టమ్మా! నువ్వు నా నిలువెత్తు బంగారానివి – భావితరాల మమతల గనివి.

చెట్టమ్మా! 'మీ మనుష్యులు ఎంత పిచ్చివాళ్ళు కాకపోతే నన్నింత 'చీప్' గా చూస్తారు' అని పదే పదే అనకు. చిప్కో ఉద్యమంతో నిన్ను గుండెలకు హత్తుకున్నదీ మేమే. 'జంగిల్ బచావో – జంగిల్ బఢావో' అంటూ నీ రక్షణ కోసం ఉద్యమించిందీ మేమే. అడవుల నుండి ఇక పూచిక పుల్లను కూడా పోనివ్వం. కలప స్మగ్లింగ్‌ని జీరో చేస్తూ అడవుల మీద డ్రోన్లు ఏర్పాటం చేస్తాం. హరిత హరంలో నాటిన మొక్కల్ని 'జియో' ట్యాగింగ్ ద్వారా సంరక్షిస్తాం. 230 కోట్ల మొక్కలు నాటటం తక్షణ అవసరంగా గుర్తిస్తాం. అవును భూమి నిలబడాలంటే మొక్క వుండాలి. ప్రకృతి సమతుల్యత వున్న ప్రాంతాల్లో జీవించే మనిషే చిరారోగ్యంతో వుంటాడని గ్రహించాం.

అమ్మా! అమ్మ గొప్పతనం పిల్లలు అర్థం చేసుకోలేరు. నిన్ను అమ్మినప్పుడూ చెప్పటానికి ప్రయత్నించలేదు. ఇంతకాలానికి మేం నీ బాధలు అర్థం చేసుకున్నాం–సత్వరచర్యలు తీసుకుంటాం.

నువ్విక అరణ్యరోదనతో వెక్కిళ్ళు పెట్టకు, భూకంపనాలతో విరుచుకు పడకు

నేనెలా బ్రతుకుతానో అని గోసపడకు నువ్వూ నేను కలిసే బ్రతుకుతాం. కలిసేవుంటాం. నీకు నా అవసరం, నాకు నీ అవసరం వుంది అనే వ్యాపార ధోరణిలో మాట్లాడటం లేదమ్మా–నిండైన మమతతో నిండుగా నిన్ను ప్రేమించే మనసుతో మాట్లాడుతున్నాను.

నా అజ్ఞానాన్ని మన్నించు – మానవ జాతిని ఆదరించు. నీకు ఎల్లవేళలా మనిషి ఋణపడే వుంటాడు – ఋణాను బంధంతో ముడిపడే వుంటాడు. ఈ ఉత్తరాన్ని నీకు అందించాలిగా, email వద్దులే, నీ చెవిగా భావిస్తున్న ఏ చెట్టుతొర్రో చూసుకుని గుసగుసగా విన్పిస్తాను. నిండు గుండెతో విను.

నిజాయితీగా చెప్తున్నా, నా నేస్తానివి నువ్వు. నా మానవాళి సమస్తానివి నువ్వు. సమాదరిస్తావు కదూ! సగౌరవిస్తావు కదూ! నీమీద భరోసాతో గుండెలమీద చెయ్యేసుకుని నిద్రపోతా, ఏ గొడ్డలి గాండ్రింపులు నీ మీద పడకుండా, వెయ్యికళ్ళతో వెయ్యేళ్ళు కాపాలా కాస్తా.

నీ ఆత్మీయ బాంధవుడు

– అనురాగ్



# యోగావరణం

లక్ష్మీ !

ఎలావున్నావ్ తల్లీ ! బావున్నావా? నీ దగ్గరనుండి వచ్చాక అన్నీ నీ ఆలోచనలే, ఏదో తప్పు చేసానన్న ఫీలింగ్ నన్ను వదలటం లేదు. కాకపోతే నీ అవసరాన్ని నేను చూసుకున్నానన్న తృప్తి, నీ కష్టంలో నేను నీకు గుర్తొచ్చానన్న సంతోషం మిగిలింది.

అమ్మలూ ! నువ్వు నన్ను అడిగావే – ఆ మాట పదే పదే నా మనసులో మార్మోగుతూ వుందిరా! "నాన్నా! నేనూ నీ కూతుర్నే కదా, నాకెందుకు నీ విశాలత రాలేదు, నేనెందుకు చెల్లెలంతగా నీకు సన్నిహితురాల్ని కాలేకపోయాను" అని. నిజం చెప్పనా తల్లీ ! మీ అమ్మ చనిపోయాకే జీవితమంటే ఏమిటో నీకు అర్థమయిందిరా. "నాన్న ఊర్లోని అందర్నీ చూస్తారు, అందరికోసం డబ్బులు ఖర్చు పెడ్తారు. మన దగ్గర కొచ్చేసరికి పొదుపు పొదుపు అంటారు" అని మీ అమ్మ తరచూ అంటుండేది. ముందు నువ్వు అర్థం చేసుకున్నది అమ్మ వైపు ఆలోచనలే. ఇప్పుడు నువ్వు ఆలోచిస్తున్నది మారిన నీ ఆలోచనలతో. మీ అమ్మ ఏమీ చదువుకోలేదు. తనకి నేనంటే చిన్నప్పటినుండీ చచ్చేంత ప్రేమ. మేనమామ కూతురిగా నాకూ తనంటే చాలా ఇష్టం. నా మీద ఉన్న విపరీతమైన ప్రేమతో, 'పొసెసివ్ నెస్' తో బాధ పడేది మీ అమ్మ. సంపూర్ణంగా నా ప్రేమ, తనకు తన పిల్లలకు దక్కాలని, నా పూర్తి సమయం మీతోనే గడపాలని ఆశపడేది. నేను ఎంతగానో చెప్పి చూసాను. తనను మార్చాలన్న ప్రయత్నం కంటే నేను మారాలనే ఎక్కువగా ఆలోచించాను. కానీ నా మనసు అందుకు ఒప్పుకోలేదు. మా నాన్నకిచ్చిన మాట, సమాజం నా మీద పెట్టుకున్న నమ్మకం – రెంటినీ కాదని నేను స్వార్థంగా ఆలోచించటం సబబు కాదనిపించింది.

అప్పటినుండీ ఇంట్లో మీ అమ్మ అలకలు..అన్నం తినకుండా సత్యాగ్రహాలు. అప్పుడే మా తమ్ముడి భార్య చనిపోయింది. పిల్లలతో వాడు మనింటికొచ్చాడు. బాధలో ఉన్న తమ్ముడి కుటుంబాన్ని ఆదుకోవటం అన్నగా నా కర్తవ్యం అనిపించింది. దాంతో మీ అమ్మకు మరింత దూరమయ్యాను. కానీ నా వృత్తికి మరింత అంకితమయ్యాననే చెప్పాలి. చూశావా తల్లీ ! దేవుడు ఒక కిటికీ మూసేస్తే మరో పెద్ద తలుపు తెరుస్తాడట. నేనూ, నా కుటుంబం అనుకుంటూ కూర్చుంటే, నేనిప్పుడు ఇన్ని లక్షల మందికి గురువును కాగలిగేవాడినా..ఇంత మంది బాధలు తీర్చగలిగేవాడినా...!

అమ్మలూ! నా బంగారు తల్లివిరా నువ్వు. నాకెందుకో మా అమ్మవే అనిపిస్తావ్. నిన్నలా 19 యేళ్ళకే హాస్పిటల్ మంచం మీద చూసేసరికి తట్టుకోలేకపోయానురా. మనిషిని మూర్ఖత్వం ఎంత దీనావస్థకు చేరుస్తుందో చూసావా.. ఆలోచించిందే ఆలోచించి, నీ ఆలోచనే సరైందని అనుకుంటూ, దాన్నే పట్టుకొని వేలాడటం కంటే పాజిటివ్ ఎనర్జీతో ఆలోచించటం ప్రారంభిస్తే నీకింత బాధ కల్గి వుండేది కాదు. తల్లీ! ప్రతి మనిషీ గమనించాల్సిన అతి ముఖ్య విషయం చెప్పనా – ఈ క్షణం ఏం జరుగుతుందో చెప్పలేకపోవటమే జీవితం..మరో గంటకి మనం ఉంటామా, ఈ భూమ్మీద –

అన్నదీ భరోసా లేదు. అలాంటప్పుడు మనుషుల మీద కోపాలు, అలకలు, ద్వేషాలు ఎందుకురా కన్నలూ – పైగా అవన్నీ నీకు మాత్రమే చెరుపు చేస్తాయని నీకు తెలీదా?

మధనం అనేది మనిషిని క్షణ క్షణం చంపే మృత్యువు. చితి– చచ్చిన శరీరాన్ని మాత్రమే కాలుస్తుందని, చింత బ్రతికున్న మనిషిని సైతం చంపుతుందని నువ్వు వినలేదా? అందుకే జీవితాన్ని ఎంత నిర్వికారంగా చూస్తావో అంతే నిండుగా కరుణిస్తుంది. నువ్వెంత బరువుగా తీసుకుంటావో అదీ నిన్నంత భారంగా మోస్తుంది. ఎప్పుడూ నీ ఒక్కదానిదే జీవితం కాదురా నాన్నా! కోట్ల మంది నీతో కలిసి బ్రతుకుతున్నారు. అందరితో బ్రతకాలి. అందరికోసం బ్రతకాలి. అప్పుడే జీవితం నిన్ను ప్రేమిస్తుంది. ప్రకృతి నిన్ను ఆదరిస్తుంది. అలా కాకుండా నీలో నువ్వు, నీతో నువ్వు మాత్రమే ఉంటే, నిన్ను మాత్రమే నువ్వు ప్రేమిస్తే ఏవీ నీకు అందంగా కనిపించవు. ఆనందాన్నీ ఇవ్వవు. చిన్నపిల్లల్లా ప్రతి చిన్న పనినీ గమనించాలి, ఆస్వాదించాలి, ఆనందించాలి. అప్పుడు ప్రతి సంఘటనా మనని ఎప్పటికప్పుడు రిఫ్రెష్ చేస్తుంటుంది. రోజురోజుకూ మనం ఉత్సాహంగా తయారవుతాం.

నిజం తల్లీ, చాలా మంది మనుషులు ఈ భూమ్మీద తాము శాశ్వతం అనుకుంటారు. ఏది జరిగినా మాదాకా రాదులే అనుకుంటారు. వేరే వాళ్ళ బాధకు ఇసుమంత కూడా స్పందించరు. సరికదా..తమ బాధను మాత్రం ప్రపంచమంతా గుర్తించాలని, బాధపడాలని అనుకోవటం చిత్రంగా అనిపిస్తుంటుంది. నువ్వు గమనించాల్సింది ఈ విషయాన్నే – ఇతరుల పట్ల నువ్వెట్లా ప్రవర్తిస్తావో ఆ ఇతరులూ నీ పట్ల అలాగే ప్రవర్తిస్తారని. గోడకు బంతిని ఎంత బలంగా విసురుతావో అంతే బలంగా అది మళ్ళీ నీ దగ్గరికే వస్తుంది. అది సృష్టి ధర్మం – ప్రకృతి నియమం – దాన్ని మార్చటం ఎవరి తరం కాదు. అసలు మార్చాలనుకోవటం మన మూర్ఖత్వం. ప్రపంచం ఎప్పుడూ దాని దారిలో అది పరుగెడుతూనే ఉంటుంది. ఈ చరాచర సృష్టిలో మనం ఒక ఇసుక రేణువంత కూడా కాదు కదా. మనం సునామీలైపోయినట్టు ఊహించుకుంటే అది మన తప్పే కదా!

కన్నతల్లీ! అందుకే నీకు చిన్నప్పటి నుండీ 'యోగా' అలవాటు చేద్దామని తపించాను. కానీ నువ్వు నన్ను – మీ అమ్మను ఏడిపిస్తున్న మనిషిగా మాత్రమే చూస్తూ దూరంగా ఉండేదానివి. ద్వేషంతో ప్రవర్తించేదానివి. మిమ్మల్ని అడ్డుపెట్టుకొని నన్ను సాధించాలని చూసే మీ అమ్మ ధోరణిని మార్చలేక నేనూ నా ప్రయత్నాలు మానుకున్నాను. కానీ ఏ ఆధారం లేకుండా మనింటికి చేరిన నా తమ్ముడి పిల్లల దృష్టిలో నేను ఓ దేవుణ్ణి. వాళ్ళు నన్నలా చూసారు కాబట్టి నా ప్రతి చర్యనూ వాళ్ళు అనుసరించేవాళ్లు. కాబట్టే ఈ రోజు వాళ్ళు గొప్ప గొప్ప స్థానాల్లో ఉండగలిగారు. అందుకేరా తల్లీ మన దృష్టే మన స్థాయిని చూపిస్తుంది అని మొదటినుండీ చెప్పేవాడిని నేను.

అయినా తల్లీ, మించిపోయిందేమీ లేదు. నీకింకా 19 యేళ్ళే కదా, బోలెడు జీవితం మిగిలే ఉంది. ముందుగా నీ మానసిక ఒత్తిడి, అలజడుల మూలంగా వచ్చిన జబ్బులు థైరాయిడ్, బీపీ లు; కొన్ని జీన్స్ మూలంగా రాబోయే జబ్బుల్ని దూరం పెడుతూ నువ్వు ఇప్పటి నుండీ 'యోగా'ని జీవితంలో భాగంగా మార్చుకో. భవిష్యత్ తరాల సంపూర్ణ ఆరోగ్యం కోసం నేను ఎంతో శ్రమతో ఎన్నో ప్రక్రియలు పాటించి చూశాను. రాజ యోగా, సహజ యోగా, ట్రెడిషనల్ యోగా వంటివి. ఇలా ఎన్నెన్నో గమనించాక అన్నింటి గొప్పదనాల్నీ అవగాహన చేసుకొని నేను కొన్ని ఆచరణీయ విధానాలను జనాభాకి చెప్పటం ప్రారంభించాను. కానీ నమ్మిన నాలాంటి వాళ్ళు నన్ను అనుసరించారు. మీ చెల్లెలు తోడుగా నే పెట్టిన యోగా సెంటర్ లో పూర్తి ఉచితంగా ఎంతో మందికి ఎన్నెన్నో రోగాల్ని నయం చెయ్యగలుగుతున్నాం. అది గొప్ప సంతృప్తి నాకు.

చిట్టి తల్లీ ! నువ్వు ముందు తెలుసుకోవాల్సింది ఆహార నియమాలు. బ్రతకటానికి తినాలి గానీ తినేందుకు మాత్రమే బ్రతకకూడదు. ఎంత తింటున్నామో గమనించి అంతకు పదిరెట్లు పనిచేయాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉంటాం. 'మూడు పూటలు తింటే రోగి, రెండు పూటలు తింటే భోగి, ఒక్క పూట తింటే యోగి' అని అంటారందుకే.

తినే సమయాన్ని మాత్రం మార్చొద్దు. ఒక వేళ కుదరకపోతే ఆ సమయానికే ఏదో ఒక పండు తిని ఊరుకోవాలి కానీ తినడాన్ని మాత్రం పొడిగించొద్దు.

సమతులాహారం మన ఆరోగ్యానికి కాసులపేరు లాంటిది. ప్రతి కూరగాయనీ తినాలి. సృష్టిలో ఏదీ వ్యర్థం అంటూ ఉండదు. ప్రతి ఒక్కటీ విటమిన్లు ఉన్న పోషకాహారమే. పప్పు దినుసులు, కూరగాయలు వీలైనంతవరకూ రసాయనాలు వాడని దగ్గర నుండి తెచ్చుకోవాలి. మన కడుపు నిజానికి గుప్పెడు మాత్రమే ఉంటుంది. దాంట్లో గాలి, నీరు, ఆహారం పట్టాలి. అన్నీ తగిన పాళ్లలో ఉండాలి. నిజం చెప్పాలంటే ఓ దోసెడు అన్నం కూడా పట్టదు. మనం ఓ నాలుగు దోసిళ్ళ అన్నం మూడు పూటలా తింటూ ఉంటే ఇక అది కడుపా, చెరువా – అందుకే పొట్టలతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటోంది ఈ తరం.

ఇక యోగాలో ధ్యానం, ఆసనాలు, క్రియలు ఉంటాయి. సహజ యోగా ఎక్కువగా ధ్యానం మీద దృష్టిని కేంద్రీకరిస్తుంది. రవిశంకర్ గారు 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' అంటూ శ్వాస మీద ధ్యాస పెట్టి లోపలి మలినాలను వెలికి తీసే ప్రక్రియలు అందించారు. ఆసనాలు శారీరక వ్యాయామాన్ని కల్గిస్తూ శారీరక సౌష్టవాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తాయి. అసలు 'యోగా' అనే పదం 'యుగ్' నుండి పుట్టింది – 'కలవటం' అని దాని అర్థం. అంటే ఆత్మను, శరీరాన్ని, బుద్ధిని కలపటమే 'యోగా' విశిష్టత. అవును మనం ఆత్మకు అన్నం పెట్టాలి–అది ధ్యానం ద్వారా మాత్రమే సాధ్యం. శరీరానికి వ్యాయామం కావాలి–అది ఆసనాల ద్వారానే సాధ్యం. బుద్ధి వికసితం కావాలి–అది క్రియల ద్వారానే సాధ్యం.

చిట్టి తల్లీ! యోగా అంటే ద్విజత్వం – అంటే ఒకే జన్మలో రెండోసారి జన్మించడం అన్నమాట. దేవుడికి నేను నచ్చలేదేమో నాన్నా అందుకే తనతో అనుసంధానింపబడట్లేదు, ధ్యానం కుదరట్లేదు అన్నావ్. అది తప్పు నాన్నా. భగవంతుడికి పిల్లలందరూ సరిసమానమే. మన జీవితం మన చేతుల్లోనే ఉంటుంది. నువ్వు వాడే కంప్యూటర్లో వందల సర్క్యూట్లు ఉంటాయి. అలాగే మనిషి శరీరంలో మూడు నాడులు, ఆరు శక్తి కేంద్రాలూ ఉంటాయి. శక్తి కేంద్రాల్నే చక్రాలు అంటారు. వీటన్నింటినీ సమతుల్యం చేసే మెదడు హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్, అంటే మీ భాషలో చెప్పాలంటే కంట్రోల్ ప్రాసెస్ యూనిట్ – CPU అనుకో. మూలాధార చక్రం, స్వాధిష్టాన చక్రం, మణిపూరక చక్రం, అనాహత చక్రం, విశుద్ధి చక్రం, ఆజ్ఞా చక్రం, ఇవి షట్చక్రాలు.

ఇక ఇడ, పింగళ, సుషుమ్న – ఇవి మూడు నాడులు. మీరు జడను దీనికి ప్రతీకగా భావించవచ్చు. మూడు పాయలుగా తీసి జడ అల్లుకుంటారు కదా. ఆ మూడు నాడులుగా భావిద్దాం. ముఖ్యంగా వెన్నుపూసలో చివర సేక్రమ్ బోన్ ఉంటుంది. పరమాత్ముని ప్రేమ శక్తి నిగూఢంగా ఉండేది అక్కడే. ఆ శక్తిని జాగృతం చేసి పైనున్న చక్రాల వైపు మళ్లించాలి. యోగా అంటే జీవన ప్రక్రియ అని అర్థం చేసుకోవాలి. నువ్విప్పుడు లాప్ టాప్ వాడాలనుకో, ముందు కరెంట్ కనెక్షన్ ఇస్తావ్. ఆ తర్వాత ఇంటర్నెట్ సాయం తీసుకుంటావ్. దాన్లోంచి నీకు కావాల్సిన విశేషాల్ని డౌన్ లోడ్ చేసుకుంటావ్. అప్పుడు మాత్రమే నువ్వు ఆ విషయం మీద సాధికారంగా మాట్లాడగల్గుతావ్. జీవితం కూడా అంతేరా తల్లీ, జోడెద్దుల బండి. ఒకరు ఆత్మ – మరొకరు పరమాత్మ. ఈ రెంటినీ నడిపించేది బుద్ధి వికసనం.

ఇంకా అర్థమయ్యేలా చెప్పాలంటే నీకేం కావాల్సొచ్చినా ముందు అమ్మకేగా చెప్తావ్, అమ్మ వెనుక నిలబడి నా దగ్గరకొచ్చి ఆ మాట అమ్మతో చెప్పిస్తావ్. నేనేం చెప్తానా అని ఆసక్తిగా వింటుంటావ్. నాకేమన్నా సందేహం వస్తే అప్పుడు నువ్వు జవాబులు ఇస్తావ్. శరీరమంటే పాప అన్నమాట. అమ్మేమో ఆత్మ. పాప లాంటి శరీరం తనకున్న శారీరక, మానసిక ఇబ్బందులన్నీ ఆత్మ లాంటి అమ్మకి చెప్పుకుంటుంది. అమ్మ లాంటి ఆత్మేమో తండ్రి లాంటి పరమాత్మకి విన్నవించుకుంటుంది. వెంటనే నాన్నైన పరమాత్ముడు మన వంక ప్రేమగా చూసి ఆ పనిని సక్రమంగా నెరవేరుస్తాడు. అంటే యోగా ద్వారా మనం అమ్మ–నాన్నల్ని కలుపుతున్నాం అన్నమాట. భార్యాభర్తలు విడివిడిగా ఉంటే ఎంత అలజడిగా ఉంటుందో ఆత్మ–పరమాత్మలు దూర దూరంగా ఉంటే గనక మనిషి కూడా అంతే అశాంతిగా ఉంటాడు.

ఉదాహరణకి మూలాధార చక్రాన్నే తీసుకో, ఈ చక్రం విసర్జన, ఉత్పత్తి అవయవాలతో అనుసంధానించబడి ఉంటుంది. నైతిక విలువలు, వివేచన ఈ చక్రం ద్వారానే కలుగుతాయ్. నీకిష్టమైన చక్రం స్వాధిష్టాన చక్రం. ఎందుకంటే నీకు క్రియేటివిటీ చాలా ఇష్టం కదా. ఈ చక్రం ప్యూరిటీని ఇష్ట పడుతుంది. పెద్ద పేగులు, చిన్న పేగులతో పాటు 500 పనులు చేయగలిగిన లివర్ కూడా ఇందులోనే ఉంటుంది. మణిపూరక చక్రం, ఇది కడుపుతో ముడిపడి ఉంటుంది. మనిషి హుందాగా బ్రతకడానికి, ప్రశాంతంగా, సంతృప్తిగా జీవించడానికి ఈ చక్రం దోహదం చేస్తుంది. అనాహత చక్రం – రెస్పిరేటరీ వ్యవస్థ, హృదయం తోటి సంధానింపబడి ఉంటుంది. దీనివల్ల ఆత్మస్థైర్యంతో భయం లేకుండా బ్రతకగలిగే స్థాయి చేకూరుతుంది.

ఇక విశుద్ధి చక్రం విషయానికొస్తే, ఇది రియాక్షన్స్ మీద ఆధారపడి ఉంటుంది. అంటే ENT డాక్టర్ అన్న మాట. ఇయర్, నోస్, త్రోట్, అవయవాల్ని సంధానించి ఉంటుంది. పదిమందితో కలిసి ఉండడం, ఏ చర్య-ప్రతిచర్యనైనా ఆస్వాదించడం, అనుభూతి చెందడం, దీని ముఖ్య లక్షణం. ఇక ఆజ్ఞా చక్రం విషయానికొస్తే – బ్రెయిన్ తో ముడిపడి ఉండడాన్ని చూస్తాం. క్షమాగుణాన్ని కలిగి ఉండడం, త్యాగం చేసే లక్షణం ఉండడం ఈ చక్రం విశిష్టత. గుణాలు వచ్చి గణాల మీద ఆధారపడుంటాయ్. గణం అంటే శరీర కణం అని అర్థం. మీ పరిభాషలో సెల్ ఆఫ్ ద బాడీ. ఈ గణాలలో, గుణాలలో పరివర్తన తెచ్చేదే యోగా.

ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే ఆనందపు అంచులు గానీ, విషాదపు కొసలుకి గానీ మనం చేరినపుడు కలిగేది నిశ్శబ్దమే. అంటే నవ్వినా, ఏడ్చినా కన్నీళ్లే వచ్చినట్టు. నిశ్శబ్దం అంటే నిండారు ప్రశాంతత. ఒక అద్వైత స్థితి. దానిని కలిగించేది వేయి నాడులతో ప్రకాశవంతమైన సహస్రార చక్రం. దీని ఆధీనంలో అవయవాలుండవు, ఆరు చక్రాలనీ సమన్వయం చేయడమే సహస్రారం పని. ప్రతీ అవయవానికీ ఒక భాష ఉంటుంది తల్లీ! అయితే ఆ భాషకి అక్షరాలు లేవు. మనమే అర్థం చేసుకోవాలి. ఓపిగ్గా గమనిస్తూ ఉండాలి. నీతో ఏదో చెప్పాలని ఆశ పడుతుంది ఆత్మ. దానికి ఆకారం లేదు కదా, అందుకని శరీరాన్ని ఆశ్రయించి శరీరంతో చెప్పిస్తుంది. దాన్ని కూడా అర్థం చేసుకోకపోతే అలిగి ఏ అవయవం మీద ఒత్తిడి కలుగుతుందో అక్కడ నొప్పి కలిగిస్తుంది. అప్పుడు కూడా అర్థం చేసుకోకపోతే, పంచభూతాలతో అంటే ఐదు మూలకాలతో తయారైన ఈ శరీరం మెల్లి మెల్లిగా శిథిలమై అచేతనమై పోతుంది.

నీకో చిత్రమైన సంగతి చెప్పనా తల్లీ! కార్తీక్ మావయ్య వాళ్ళ కూతురు లవ్ మేరేజ్ చేసుకుందని ఇంట్లోకి రానివ్వలేదుగా, ఎడమ మెడ వైపుగా బాగా నొప్పితో బాధ పడేవాడు. ఎన్ని టెస్టులు చేయించినా ఏమీ లేదనేవాడు డాక్టర్. మా యోగా గురువుగారి వద్దకు తీసుకెళ్లాను. మీ తోబుట్టువులతో విభేదించారా అని అడిగారు గురువుగారు. సంగతి చెప్తే మీరు మీ చెల్లెల్ని బాగా ఇష్టపడతారు. ఇప్పుడు బాధ పడుతున్నారు. వెంటనే ఇంటికి తీసుకొచ్చి బట్టలు పెట్టి పంపించండి, మీకంతా తగ్గిపోతుందని చెప్పారు. నా కళ్ళతో చూసాను తల్లీ, అలా చేసిన వెంటనే నొప్పి తగ్గిపోయింది.

నాకెప్పుడూ నాభికి ఎడమవైపుగా నొప్పిగా ఉండేది. భార్యతో సఖ్యత లేకపోవటాన అలా జరుగుతుందని చెప్పేవారు గురువుగారు. పెద్ద తాత గారు వెంటిలేటర్ మీద ఉన్నప్పుడు నాకు గుండెకి కుడివైపున బాగా నొప్పి వచ్చింది. ECG, 2-D Echo చేయిస్తే ఏమీ లేదన్నారు డాక్టరు. ధ్యానంలో కూర్చుని పెద్దమ్మని నేను బాగా చూసుకుంటాను, మీరు బెంగ పడకండి, ప్రశాంతంగా దేవుడి సేవకు వెళ్ళండి అని పెద్ద తాత గార్ని ఉద్దేశించి పదే పదే చెప్పుకున్నాక నాకు నొప్పి తగ్గింది, అరగంటలోనే ఆయన శివ సన్నిధికీ వెళ్ళిపోయారు. ఇవన్నీ సైన్స్ కందని సత్యాలు, అనుభవంతో నేర్చుకున్న పాఠాలు.

అందుకేరా చిట్టి తల్లీ ! నిన్ను నువ్వు తెలుసుకోమనేది. ఆ తెలుసుకోడానికి వాహికగా మారింది యోగానే. క్రియాశీలకంగా రోగ నివారిణిగా యోగా పనిచేస్తుందని పరిశోధకులు, పరిశీలకులు, ఆచరిస్తున్న అనుభవశాలురు చెప్తున్నప్పుడు మనమూ స్వానుభవంతో తెలుసుకోవాలి కదరా తల్లీ! మురికిని సబ్బుతోనో, షాంపూతోనో

కడిగేసుకుంటాం. కానీ లోపలి మురికి ఎలా పోతుంది....మనసా..వచసా..కర్మణా ప్యూరిఫికేషన్ జరిగేది యోగాతో మాత్రమే.

గురువులేని విద్య గుడ్డి విద్య. ఏదో టీవీలో చూసి నేనూ చేస్తున్నాను యోగా అంటే కాదు, ఎంతో జాగ్రత్తగా గురువుగారి శిక్షణలో చెయ్యాలి. ఆసనాలు, క్రియలు మాత్రమే యోగా అంటే సరికాదు. ఇవన్నీ శరీరాన్ని శుభ్రం చేసుకొనే విధానాలు మాత్రమే. అంటే మందిరాల్లోకి వెళ్ళేటప్పుడు కాళ్ళు, చేతులు కడుక్కుంటామే అలా. అంటే ధ్యానం ద్వారా పరమాత్మునితో అనుసంధానింపబడటమే యోగా. యోగాని అన్ని మతాల వారూ ఆచరిస్తున్నారు, ఆదరిస్తున్నారు. యోగాని శాస్త్రీయంగా క్రోడీకరించింది పతంజలి గారే. సూత్రము అంటే దారము అని కదా అర్థం. ఒక్కొక్క యోగాభ్యాసాన్ని దారంతో గుచ్చి క్రీస్తు పూర్వమే 500వ శకం నుండి 100వ శకం వరకూ పతంజలి అందించిన యోగ సూత్రాలే ఇవన్నీ. హఠ యోగ ప్రదీపిక, శివ సంహిత పతంజలి యోగాలో ప్రధాన భాగాలు. చూసావా తల్లీ, యోగా వెనుక యెంత సుదీర్ఘ చరిత్ర ఉందో.

నువ్వు అంటుంటావ్ గా, నాన్నా నువ్వు కాలేజ్ కొస్తే 'మీ అన్నయ్యా' అని అడుగుతారని. యోగా ద్వారా వయసు మీద కనిపించకుండా, మనసు వేదనతో క్రుంగిపోకుండా సమతుల్య స్థితితో జీవనం సాగించొచ్చన్నమాట. అంటే యోగా చేస్తే కష్టాలు రావా అని నువ్వు అడగొచ్చు. అవి మన పూర్వజన్మ కర్మానుసారంగా వస్తాయని గురువుల మాట. అయితే వాటిని తట్టుకొని నిలబడగలిగే దృఢ చిత్తాన్ని అలవరిచేది యోగా.

విజయంతో అహంకారం పెంచుకోకుండా, విషాదంలో ఆత్మ న్యూనతతో క్రుంగిపోకుండా బేలెన్స్డ్ గా ఉంచుతూ జీవితంలో గెలిపిస్తుంది యోగా. అందుకేరా కన్నలూ, మీ నాన్నెప్పుడూ చిద్విలాసంగా ఉండగలుగుతున్నాడు. నువ్వు కూడా యోగాని అలవాటు చేసుకో తల్లీ. అప్పుడు చదువు మీద నీకూ ఏకాగ్రత పెరుగుతుంది. సమాజంలోనూ, నీ కుటుంబ సభ్యులతోనూ అనుబంధం అభివృద్ధి చెందుతుంది. మనిషి సంఘజీవి. ప్రతీ క్షణం సంఘంతోనే ముడిపడి బ్రతకాలి. నాకిక్కడో హిందీ కవిత జ్ఞాపకం వస్తోంది...

"లోగోంకే పాస్ వక్త్ హై నఫ్రత్ కే వాస్తే, జబ్ సే హయత్ కమ్ హై మొహబ్బత్ కే వాస్తే !"

చిత్రంగా అనిపించడం లేదూ, జనాల దగ్గర చాలా సమయం ఉందట ద్వేషించడానికి, కానీ అసలు సమయమే లేదట ప్రేమించడానికి. నీ పక్కనున్న మనిషిని ప్రేమిస్తేనే కదా, ఆ కనిపించని దేవుణ్ణి ప్రేమించగలిగేదీ ! నిజంగా తల్లీ, మన పక్కనున్న మనిషిని ముందుగా ప్రేమిద్దాం. మనలో ఉన్న ఆత్మని దేవునిగా గుర్తిద్దాం. మన శరీర భాషని యోగాతో అర్థం చేసుకుందాం. సర్వే భవంతు సుఖినః, సర్వే సంతు నిరామయాః, సర్వే భద్రాణి పశ్యంతు, మా కశ్చిద్ దుఃఖ భాగ్భవేత్ – అన్న శాంతి మంత్రం ప్రపంచమంతా పాటించాలంటే, ప్రతి మనిషీ విశ్వమానవుడిగా మిగలాలంటే యోగా ఆచరణతోనే సాధ్యం. ఆ సత్యాన్ని గుర్తిస్తావని ఆశిస్తూ...నా బంగారు తల్లీ, సంపూర్ణ మూర్తిమత్వం కలిగిన మానవిగా రూపుదిద్దుకుంటావని భావిస్తూ...

మీ నాన్న

– రాధా కృష్ణమూర్తి

# జలోత్సవం

కాళేశ్వరమా! నా ప్రాణేశ్వరమా!

సుశ్యామల అభివాదం నీకు..

తెలంగాణ వరదాయినివి, ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ దశల ఎత్తిపోతల ప్రదాయినివి.. అపర భగీరథ ఫలానివి... మా తలమానికానివి నువ్వు. బిడ్డకు జన్మనివ్వటానికి ఏ తల్లయినా తొమ్మిది నెలలే మోస్తుంది. కానీ 10 భారీ ప్రాజెక్టులతో పుష్టిగా ఎదిగిన నిన్ను కనటానికి నా తెలంగాణా రాష్ట్రం ఏకంగా 37 నెలలు నిన్ను కడుపులో మోసింది.

ఎన్నాళ్ళ కలల ఫలితం ఒక్క నువ్వు, ఎన్నేళ్ళ శ్రమ పుణ్యం ఒక్క నువ్వు. మిగులు సమృద్ధిని ఊర్లకు దానం చేసే సౌజన్యశీలివి నువ్వు. ప్రాణహిత, గోదావరిల కలనేతతో రూపొందిన అలల పోగుల అల్లికవి నువ్వు – చినుకులు పగిలి విచ్చుకున్న నీటి దోసిలి నువ్వు. నిజం– నువ్వు నడిచే నదిని గుండెల్లో దాచుకున్న నిధివి. ఇంతకీ మా దప్పిక తీర్చే నీళ్ళ శాస్త్రాన్ని నీకు ఎవరు నేర్పారు? పసిడి పంటల్ని పండిచే సాగు విన్యాసాన్ని ఎవరు చూపించారు?

ఎదురు చూసిన కల కాళేశ్వరమై ఎదుటికొచ్చి నిలబడ్డ రోజుని ఈ 2019 జూన్ నెల 21వ తేదీన చూశాం. మా అందరి కలలు నిజమై తెలంగాణ నిజంగానే జలకళల జరీచీర చుట్టుకుంది. గుక్కెడు నీళ్ళకోసం కొంగుచాచి అర్థిస్తే కూడా కుదురుపడని గతాన్ని కాదనుకుని, వేదనను వదిలేసుకుని గొప్ప జీవకళని మా రాష్ట్రానికి అందించటం శుభదాయకం. కోటి గొంతుకలెత్తి నీళ్ళకోసం చేసిన ఉద్యమం సఫలమైన వేళ ఇది.

కాళేశ్వరమా! అందుకే అందుకో ఈ వందనం... ప్రజా సమూహాల చేతి చందనం... అందుకే ఆనకట్టల్ని ఆధునిక దేవాలయాలని ఊరికే అన్నారా... ఎన్ని వందల ఎకరాల భూమినో తడిపింది... ఎన్ని వేల జనాల కన్నీళ్ళనో తుడిచింది...

పొలానికి నీరిచ్చి, బతుకుకు మెతుకిచ్చి, బీళ్ళ ఆశలకు మొలకొచ్చింది ఆనకట్ట వల్లే కదా. జలాశయాలెప్పుడూ సదాశయాలే. నీళ్ళని నిలువ చేసినందుకు మాత్రమే కాదు.. కలల్ని పండించినందుకు, ఆశల్ని రాశిగా పోగేసినందుకు. భూమి గుండెలపై పరుగు లెడుతూ పరుగు లెడుతూ మాలాగా... అచ్చు మా మనుష్యుల్లాగే వలసపోతూ వుండే నదిని స్థిరంగా దోసిలిపట్టి పట్టుకున్న ఆలయమే కదా ఈ నా కాళేశ్వరం!.

ఏ నదైనా సముద్రంతో కలసి తన అస్తిత్వాన్ని పోగొట్టుకోవాలను కుంటుందా? నది కూడా అమ్మేకదా. గోదావరి తల్లికి మట్టిదాహం తెలుసు. మనిషి దాహార్తి తెలుసు. తన నీటి నిధుల్ని ఉప్పు సముద్రానికి ఇవ్వటం ఇష్టంలేక, కష్టపడ్తున్న నదీమతల్లి మనసును గ్రహించి నీకోసం నిర్మించిన నీటిపుట్ట కదా. ఊరటం, ఉప్పొంగటం, దప్పికతీర్చటం, పైరుకు పాలివ్వటం నది నైజం – నీళ్ళ ఇజం... నువ్వు ఆ రెంటికలయికవి కదా! నీ నైజం అదే కదా కాళేశ్వరమా!

ఎండిన మట్టి చాళ్ళల్లో నడిచి నడిచి రక్త జీరలు కనిపిస్తున్న రైతుల పాదాలను కడుగుతున్నావా ప్రాణేశ్వరమా– ఇప్పుడే పుట్టిన నువ్వు అప్పుడే నడక మొదలెట్టావా.. 2 TMCల ఎత్తిపోతలు ప్రారంభించేశావా? 3 TMCలకు ఎగబాకుతున్నావా... అయినా కాళేశ్వరం, ఏమిటి నీ మొండితనం? నీరు పల్లమెరుగు అంటుంటే నువ్వేల ఎగువకు ఎగబాకుతున్నావు? నదికి ఎదురీదుతున్నావు. సముద్రంలో కల్సి వ్యర్థమయ్యే నది నీటిని ఆపేసి – నీ గుండె కమండలంలో దాచేసి గొలుసుకట్టు ప్రాజెక్టుల్లాంటి ఎత్తిపోతల పరంపరతో యేటా కోటి ఎకరాలు తడపటానికి నడుం బిగించావా !? ఎంతగొప్ప కారణజన్మురాలివి తల్లీ నువ్వు...

అసలు ఒక్క విషయం చెప్పు నా కాళేశ్వరమా!. ఈ భూమ్మీద నీటిని ఉత్పత్తి చేయగలిగిన వారున్నారా...? మరి ఉత్పత్తి చేయలేని నీటి వనరుని పొదుపుగా వాడుకోవాలి కదా. దాచుకుని కాపాడుకోవాలి కదా– తాగునీటికి, సాగునీటికి, దాగునీటికి పక్కా లెక్కలేసుకుని ప్రణాళిక బద్ధంగా వుంటేనే కదా నీటి యుద్ధాల్ని నివారించగల్గుతాం. నిజానికి మనిషి తెల్సుకోవల్సిన విషాద నిజాలు రెండున్నాయి. యుద్ధాల్లో చనిపోయిన వారికన్నా నీటి కాలుష్యంతో చనిపోయిన వారే ఎక్కువట. ప్రతి 15 సెకన్లకి ఒక చిన్నారి నీటి సంబంధిత వ్యాధితో చనిపోతున్నారట. ప్రపంచం మొత్తం మీద 500 పైగా మంచినీటి నదులు కలుషితం అయ్యాయని గణాంకాలు చెప్తున్నాయి.

చిత్రంగా భూమి పుట్టినప్పుడు ఎంత నీరుందో ఇప్పుడూ అంతే వుందిట. కాకపోతే జనాలే కోట్లల్లో పెరిగి నీటి కటకటను ఎదుర్కొంటున్నారు. నిజానికి మనిషి జీవన అస్తిత్వంతోనే కాదు సామాజిక అస్తిత్వంలోనూ నీరు కీలక భూమిక పోషిస్తుంది. అందుకే నీటిని జాతీయ వనరుగా గుర్తించి పొదుపుగా వాడుకోమని జాతీయ జల విధానం పదేపదే చెప్తుంది. నీటి ఆవశ్యకతను వివరిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ఐక్యరాజ్య సమితి మార్చి 22న ప్రపంచ నీటి దినోత్సవాన్ని నిర్వహిస్తుంది. 'జీవం సజీవ జలం' అంటూ రష్యన్ శాస్త్రవేత్త వెర్నడెస్కీ పదేపదే గొంతుచించుకుంది అందుకే.

ఈ భూమ్మీద 70.97% నీటితోనే నిండి వుంటుంది. అయితే పరిశుభ్రమైన నీరు 1% మాత్రమే – త్రాగేనీరు 1% కంటే తక్కువేనట. ప్రతిమనిషికి ఒకరోజుకి 30–50 లీటర్ల సురక్షిత నీరు కావాలి. మనరాష్ట్రంలో తాగు, సాగు, దాగు నీరు తక్కువే. ప్రపంచ నీటి సంక్షోభంలో పడి 48 దేశాలు అతలాకుతలం అవుతున్న దశలో నీటిని నిల్వ చేసుకోవటం, దాచుకోవటం చాలా అవసరం. విశ్వనగరం హైదరాబాద్‌లో వృథా అవుతున్న నీటిని ఒడిసి పడితే 15 లక్షల మంది ప్రజల గొంతు తడపొచ్చని ఒక అంచనా వుండటం దురదృష్టకరం. కాబట్టి నీటి సంరక్షణే నీటి ఉత్పత్తిగా భావించాల్సిన తరుణంలో మనం వున్నాం.

అందుకే మేధావులు ఏమంటున్నారో తెల్సా, 3, 4 రాష్ట్రాలు కల్సి చేయాల్సిన ప్రాజెక్ట్ ఇది. జాతీయ హోదా వచ్చిన ప్రాజెక్టులకు కూడ ఇంత భారీ ఖర్చు పెట్టలేం. ఇంత నిర్దిష్టకాలంలో, ఇది 'భగీరథ యత్నం' ఒక మనిషి సంకల్ప యజ్ఞం అంటూ కితాబులిస్తున్నారు. నిజానికి నువ్వు ఒక తోరణానివి. జలతరంగానివి కాళేశ్వరమా !

కాళేశ్వరమా! నిజంగా నీదొక శకం. శక సంవత్సరం అన్నట్టుగా కాలగతిని చెప్పుకున్నట్టే రాష్ట్ర ప్రగతిని గణించాలంటే కాళేశ్వరానికి ముందు, తర్వాత అని చెప్పుకునే రోజులు రానున్నాయి. దేశం మొత్తం మీద నీ అంత ఖరీదైనది కానీ, భారీ ఎత్తిపోతల పథకం కానీ లేదట. అన్నిట్లో నీదే రికార్డు, ఓ పెద్ద ఊరినే నిర్మించినంత సంబరంగా వుంది.

2016 మే 2వ తేదీన శంకుస్థాపన జరిగినప్పటి నుండి రైతుల ఆశలన్నీ నువ్వే అయ్యావు. ఏప్రిల్ 8న మహారాష్ట్రలో గోదావరి జలాల ఒప్పందం జరిగాక మా ఆశలు మరింత పెరిగాయి. మూడేళ్ళ కఠోర శ్రమతో ఎన్నెన్ని ప్రణాళికలతో అధికారులు పాటు పడ్డారో – Between the lines కాకుండా Beyond the lines చదవాలి అని పాఠకులకు చెప్పినట్టే నీ నిర్మాణాన్ని చూసే ప్రతి కన్నుకీ, నీ గురించి వినే ప్రతి చెవికీ, నిన్ను తలకెత్తుకునే ప్రతి మనిషికి

తెలియాల్సింది ఒక్కటే – నువ్వు మా రాష్ట్ర పెన్నిధివి.. మాకు దొరికిన నీళ్ళ నిధివి.

అందుకే.. జంట నగరాల అవసరాలకోసం 30 TMCల త్రాగునీరు అందిస్తున్నావ్. ప్రవాహ మార్గంలోని గ్రామాలకు 10 TMCల నీరు త్రాగేందుకు ఇస్తున్నావ్. పరిశ్రమల అవసరాల కోసం 16 TMCల నీరు అందిస్తున్నావ్. అన్నింటికన్నా గొప్పగా వ్యవసాయ సాగుకి 13 జిల్లాల్లో 106 మండలాల్లోని 1581 గ్రామాలకు సాగునీరు మాత్రమేకాక, కొత్తగా 18,25,700 లక్షల ఎకరాలకు సాగునీరు అందివ్వబోతున్నావు.

మన పురాణకాలం నుండి నదుల్ని చూస్తూనే వున్నాం. వాన చినుకుల ఆహ్వానాల్తో నీళ్ళు గెంతటం చూశాం. ఖరీదు కట్టిన అమ్మకాల్తో నీళ్ళ బాటిళ్ళు ఏడ్వటం చూశాం. కానీ మాటకి మంత్రశక్తిని, మనిషికి జీవశక్తిని ఇచ్చేది మాత్రం నీళ్ళే. అందుకు నదులే నాగరికత నేర్పాయన్న కృతజ్ఞతతో 'నదీమ తల్లీ' అంటూ అంజలి ఘటిస్తూ నిరంతరం పూజించే సంస్కృతి మనది.

నువ్వూ గోదావరి జలాలతో పులకించి... పలవరిస్తున్న దానివే కదా.

నదుల్లో 'గోదావరి' పెద్ద ముత్తైదువ. అందుకే మేడిగడ్డలో పెద్దపీట వేసి కూర్చోపెట్టారు. అందుకే వర్ష ధారలతో నేసిన లక్షతానుల దుప్పటిగా డా॥ యన్. గోపి గారు భావించారు

నెత్తుటి కత్తి కడిగినా నది నదే అంటారు నందిని సిద్దన్న

భూమి బ్లాంక్ చెక్కు మీద నీళ్ళ విలువను రాస్తామంటారు సుంకిరెడ్డి నారాయణ గారు

'గాయమైన పొలానికి నీటికట్టు కట్టాలన్నదే బాధంతా'

అంటూ బెంగపడిపోయారు డా॥ నాళేశ్వరం శంకరం. అవును నీ నీరు తాగి పెరిగిన కవులందరూ నీటి బాధితులే. అందరూ కవిత్వపు ప్రేమికులే... కరువుతో కృషించిపోతున్న దేహాలకు కాళేశ్వరం జలఔషధం. కాళేశ్వరం చరిత్రలో వేగుచుక్క అంటారు వనపట్ల సుబ్బయ్య. అన్నట్టు చెప్పటం మరిచాను. తమాషాగా మా వాళ్ళు నదులకు కూడా ట్యాగులు తగిలించేశారు తెల్సా...! 'గంగ యోగుల నది. గోదావరి కవుల నది. కృష్ణమ్మ శిల్పకారుల నది. కావేరి సంగీత స్రష్టల నది' అని అంటారు.

అమెరికాలో వున్న కాలిఫోర్నియాలో దాదాపు 80 ఏళ్ళ కిందనే ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన తాగునీటి–సాగునీటి కోసం నిర్మించిన ఎత్తిపోతల పథకం 'కొలరాడో' ని నువ్వు బీట్ చేసేసావు తెలుసా... కర్నూల్ జిల్లా హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రాజెక్ట్ లో ఎక్కువ మోటర్లని వాడారని గొప్పగా విన్నాం కదా. దానిలో కన్నా నీలోనే ఎక్కువ విశేషాలున్నాయి.

కాళేశ్వరమా! ఎంత చిత్రమైన నిర్మాణం నీది. నీ భూగర్భంలో నిర్మితమైన సొరంగం లో, చార్మినార్ ని ఒకదాని పై మరోటిగా 4 చార్మినార్లను పేర్చవచ్చంట. లక్ష్మీపూర్ పంప్‌హౌస్ మోటర్ల విద్యుత్ సామర్ధ్యం జైపూర్, సింగరేణి. విద్యుత్ ఉత్పత్తి కేంద్రం సామర్థ్యాల కన్నా 223 మెగావాట్లే తక్కువట. ఎంత శ్రమ ఫలితంగా జనించావో ఎందరి చెమట చుక్కల్లో ప్రతి ఫలించావో అన్పిస్తుంది ఇప్పటి నిన్ను చూస్తుంటే

అందుకే అంటాను నేను. ఆనకట్టలు అవసరం నీటికైనా, కన్నీటికైనా... ఆనకట్టలు ఆశల పైరుని సాగు చేయటానికి ఆనందాల ధాన్యం పెంచటానికి. నిజం చెప్పనా... లక్నవర గొలుసుకట్టు చెఱువుల కింద లక్షణంగా ఎదిగిన ఆత్మస్థైర్యం మళ్ళీ మాలోకి వచ్చినంత సంబురంగా వుంది. కాకతీయ వారసత్వం అదే 3T అప్రోచ్ అంటే Temples, Tanks, Traditions ని స్వీకరించిన వాళ్ళం కదా... గాదెలనిండా ధాన్యం వుండాలంటే మీలాంటి ఎత్తిపోతల పరంపరలు రావాల్సిందే...

అదిగో చూడూ, మేడిగడ్డ నుండి అన్నారం, సుందిళ్ళ, ఎల్లంపల్లి, మేడారం, రాయదుర్గ్, మధ్య మానేరు,

అనంతగిరి, మాంబూద్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మలు – ఎంత గర్వంగా చూస్తున్నామో. వినటానికే కాదు చెప్పటానికి కూడా. చెప్పుకోడానికి కూడా అదృష్టం కావాలి. 28 ప్యాకేజీలుగా విభజించిన పనిని రోజూ 3 షిఫ్టుల్లో, 60 వేలమంది కూలీలతో, 37 నెలల్లో పూర్తి చేయటం అసాధ్యం కదా! కానీ సుసాధ్యం చేసి చూపించారు...ఇంజనీర్లు, అధికారులు, ప్రతినిధులు. ఇప్పటికే దాదాపు 50 వేల కోట్లకు పైగా ఖర్చుపెట్టారని తెలుస్తుంది.

అయినా కాళేశ్వరమా...! నీకు తెలియనిది కాదు కానీ, సాగునీటి ప్రాజెక్టులంటేనే ఎలాస్టిక్‌లా సంవత్సరాల తరబడి సాగి, తరాలు వెళ్ళిపోయాకే ఎప్పటికో తయారయ్యేవి గతంలో. నువ్వేంటమ్మా మా మీద ప్రేమతో, కరుణతో, ఆర్తితో అభయమిస్తూ జలనిధిలా వచ్చేశావ్– ఎడారి లాంటి జిల్లాల్లో పచ్చని పైరు పందిళ్ళు వేయాలన్న మమకారంతో వేంచేశావ్...

నిజంగా మా అన్నదాతల కళ్ళల్లో ఇప్పుడు ఆనంద బాష్పాలు చూస్తున్నాను. 45 లక్షల ఎకరాలకు నీరు వస్తుందన్న వార్తకే వాళ్ళంతా ఉబ్బితబ్బిబ్బు అవుతున్నారు. సర్వేలకే సంవత్సర కాలం పట్టే పనిని, భూసేకరణతో సహా జాతీయ అనుమతున్నీ తీసుకొని తెలంగాణని పైరుమడుల మాగాణంగా మలిచేందుకు నువ్వు రావటం శుభదాయకం....

నీ నిర్మాణంలో 8.5 కోట్ల సిమ్మెంట్ బ్యాగులు, 4.2 లక్షల మెట్రిక్ టన్నుల స్టీలుని వినియోగించారని, 1 కోటి 17 లక్షల క్యూబిక్ మీటర్లు ఇసుకను తెచ్చారని– ఇప్పటి వరకు 55 వేల ఎకరాల భూమిని సేకరించారని వింటున్నాం. అసలు ఈ వార్తలు వింటుంటేనే ఏదో హాలీవుడ్ పిక్చర్ రీల్‌లో చూసినట్టుకాక రియల్‌గా చూపిస్తున్నట్టుగా కళ్ళముందు కదలాడుతున్నావు.

అవును, ఆనకట్టలు మనిషికి కొత్తకాదు, క్రీ.పూ. 2800 లోనే ప్రాచీన ఈజిప్షియన్లు, నైలు నదిని బంధించి, ఆనకట్టలు వేసి, నీటిని వినియోగించుకున్నట్టు చరిత్ర చెపుతుంది. ప్రపంచంలోనే ఎత్తైన ఆనకట్ట సట్లెజ్ నదిపై మన భారత దేశం నిర్మించిన భాక్రా నంగల్ డ్యాం అని దేశీయులకే కాదు ప్రపంచ జాతీయులందరికీ తెల్సు. ఐతే ఆక్విడక్ట్ అంటే నీటి పారుదల కోసం ఆర్చీలపై నిర్మించిన కాలువలే ఒకప్పుడు గొప్పగా చూసేవారు. రెండువేల సంవత్సరాల నాటి రోమ్, కాలువలు తవ్వకుండా భూమి మీదనే కట్టి గొప్ప ఇంజనీర్లుగా రోమన్లు కీర్తిగడించారు.

నీకు తెలుసా కాళేశ్వరం !రోమ్ నగరానికి నీళ్ళ సరఫరా కోసం తొమ్మిది కాలువలు కమాన్ల మీద అందంగా కట్టి వేల సంవత్సరాలు నీటి సరఫరా చేశారని ఇప్పటికీ కీర్తిస్తుంటారు. ఇప్పుడు నిన్ను చూసి కూడా అలాగే అన్పిస్తుంది. ఎంత గొప్ప ఇంజనీర్లు వాళ్ళంతా... అంకిత భావంతో చిత్తశుద్ధితో ఓ జలయజ్ఞాన్ని నిర్వహించినంత గొప్పగా వీరి పనితనాన్ని చూపించారు కదా! కాకపోతే ఏమిటి – భూగర్భంలో భారీగా 19 పంప్‌హౌజ్లు, నీటిని బాగా ఎత్తుగా చిమ్మటానికి మహాశక్తి మోటర్లు, 98 కిలో మీటర్ల మేర నీటి ప్రవాహ గొట్టాలు, 1531 కిలో మీటర్ల కాలువలు, 203 కిలో మీటర్ల మేర భారీ సొరంగ మార్గాలు, 20 బ్యారేజ్లు, 17 సబ్‌స్టేషన్లు ఇంత స్వల్పకాలంలో ఎవరు కడ్తారు.... ఎలా కడ్తారు....

మా ప్రాణ దీపమా! నువ్వు, మా అవ్వతాతలు కలలు కన్న బోషాణం పెట్టెవి, నిన్ను జలనిధులతో నింపుతాం.. నువ్వింకా కొంత ఖాళీగా వున్న నీటి గుమ్మివి, నీటి ధాన్యాలు పోస్తాం. తెలంగాణాకి తరగని ఆస్తిగా – బంగారు గనిగా అభివర్ణిస్తున్న నీ కోసం మేమంతా రవీంద్రభారతి సాక్షిగా, అమరవీరుల స్థూపం ఎదురుగా సంబురాలు చేసుకుంటున్నాం... ఊరేగింపులు, ర్యాలీలు తీసుకుంటున్నాం. మతాబులు నింగినంటేలా కాలుస్తున్నాం, దీపోత్సవాలు, యజ్ఞాలు చేసుకుంటున్నాం.

నువ్వు మా రాష్ట్ర ప్రజల సమిష్టి వృక్షానివి. చేయి చేయి కలిపి అలల నీటి కొమ్మల్ని చెక్కుతాం. నువ్వు వందల తరాల ఆశయాల తాళపత్ర గ్రంథానివి. వేల యేళ్ళుగా పరిమళిస్తూ ప్రవహిస్తున్న పైరు తడిగంధానివి. రాష్ట్ర వాకిట్లో

పేర్చిన ఎత్తిపోతల బతుకమ్మవి. ఆకాశమంత విశాలంగా, అగాధమంత ఉన్నతంగా, తలవంచిన మేరు కిరీటంగా, తలఎత్తిన సాగర కెరటంగా, మెతుకు రుచిని గుండెల నిండా నింపుకున్న నీకు, బ్రతుకు బంగారు జాడని ఊర్లకి పంచబోతున్న నీకు ఏమిచ్చి ఋణం తీర్చుకుంటాం ?

నీ నీళ్ళే మా మనుగడకు ఆనవాళ్ళు అన్నవి ఎప్పుడూ మర్చిపోం. మా రాష్ట్ర సీమను స్వర్గసీమగా మార్చబోతున్న ప్రగతి తివాచివి నువ్వు. అందుకే, నీ జలగీతం వింటూ, జల స్వప్నాలు కంటూ, జల స్ఫూర్తిని అణువణువునా నింపుకుంటూ, నీ కోసం జలయజ్ఞాలు చేస్తాం. జలాంజలి ఘటిస్తాం, జలాభిషేకాలు చేస్తాం. జలోత్సవాలు నిర్వహిస్తాం. 'జలమే మానవాళి మనుగడకు బలమంటూ' కంకణం కట్టుకుని దీక్షాదక్షులం అవుతాం. నిన్ను కళ్ళలో పెట్టుకుని చూసుకుంటాం, తరతరాలకు మాతో ఉండిపో, మా రాష్ట్ర సిరివై ఊర్లన్నీ నిండిపో.

ఇట్లు,

నీటి ప్రేమికుడు

– విద్యాసాగర్

# సౌందర్య లాలస

అనఘా!

Sorry రా నాన్నా! రాత్రి నీతో అలా మాట్లాడి వుండకూడదు. కానీ యేంచెయ్యను? మీ అమ్మ ఏడుపు – నీ మొండితనం మధ్య నా బాధ వర్ణానాతీతం...

అసలు ఎప్పుడైనా నువ్వు అద్దంలో చూసుకున్నావా తల్లీ! ఓసారి మనసుపెట్టి చూడు. అబద్ధం చెప్పని అద్దం ముందు నిలబడి నిన్ను నీలా కాకుండా ఎవర్నో చూస్తున్నాననుకుని చూడు. ఎముకల మీద చర్మం తప్ప ఇంకేదైనా కండ కన్పిస్తుందా? నీరసంగా, నిసత్తువతో ఒక రోగిలా అన్పించటం లేదూ?!

అయినా తప్పంతా నాదేలే! మీ నాన్న చెప్తున్నా వినకుండా నీకు మరింత ఫ్రీడం ఇచ్చాను. మరీ గారాబం చేశాను. ఇప్పుడు తల మీద ఎక్కి కూర్చున్నావ్... చిన్నప్పటి నుండి నీకు ఎన్నెన్ని విశేషాల్ని కథలు కథలుగా చెప్పాను. దేశ నాయకుల ఆత్మకథలన్నీ చదివి విన్పించానే... నువ్వు అర్థం చేసుకున్నది ఇంతేనా... ఎంత జీవితం చూశావు నువ్వు! నా వృత్తి జీవితం అంత లేదు నీ వయస్సు – చివరికి నాకే ఎదురు చెప్పాలని ప్రయత్నిస్తున్నావు...

చిట్టితల్లీ!

నేను నీ మేనమామను రా...'మామ' అంటే చందమామలా నిరంతరం కాపలా కాసేవాడు. కన్నుల్లో పెట్టుకుని భద్రంగా చూసుకునే వాడు. అన్నీ బాధ్యతల్ని అమ్మమ్మ ఇంటి నుండి చేయాల్సిన వాడిని... మనిషికీ మనిషికీ వున్న బంధం కన్నా ఆత్మీయ పేగు బంధంలో మేనమామ బంధం ఓ పోగు ఎక్కువే రా తల్లీ! నిన్ను నేను కాక ఎవరు మందలిస్తారు చెప్పు!

అయినా మా జనరేషన్ ఒక సంధికాలంలో వున్నాం. పెద్దవాళ్ళకు ఎదురు చెప్పకుండా బాధ్యతగా నడుచుకున్న ఆఖరితరం బహుశా మాదే ననుకుంటా. మా కడుపున పుట్టిన పిల్లల ఆనందం కోసం మీ మాట ప్రకారం నడుచుకుంటూ వెళ్తున్న తొలితరం కూడా మేమే. అయినా రెండు తరాల మధ్య నలుగుతున్నా ఇవ్వటం తప్ప తీసుకోలేని పెద్దరికాన్ని నడుం వంగిపోయేదాకా మొయ్యటం అత్యవసరంగా అలవాటు చేసుకున్న తరం వాళ్ళం కదా! కానీ ఈ రోజు నీకు చెప్పలేకపోతే ఒకతరాన్ని నేను గాలికి వదిలేసినట్టుగా భావించాల్సి వుంటుందని పిస్తుంది... అందుకే ఇలా... ఉపోద్ఘాతాన్ని బంగాళా ఖాతమంత పెద్దదిగా విన్పించేశాను కదా!

అసలు ఏమిటి తల్లి మీ జనరేషన్ ప్రాబ్లం...? జీరో సైజ్ మాత్రమే మీ దృష్టిలో అందమా? దాని కోసం ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటామా? అసలు అందమంటే ఏమిటో అర్థం తెలుసా మీకూ... అర్ధనగ్నంగా బట్టలు వేసుకోవటం....

కృత్రిమమైన మేకప్పులు – ఆర్టిఫిషియల్ ఒంపుసొంపులు... అర్థం లేని అలంకరణలు... ఒక్క 100 గ్రాములు పెరిగినా ఆ బరువును అంతర్జాతీయ సమస్యలాగా భావిస్తూ రోజంతా 'జిమ్'లోనే వర్కవుట్ చేయటం.. ఏంటిరా ఇది..?!

నువ్వు జిమ్‌కి పెడుతున్న డబ్బు ఒక పేదవాడి జీవితం ఒక నెల రోజుల కడుపు నిండా తినగల్గేంత అన్నది నీకు తెలుసా! నువ్వు బ్యూటీ పార్లర్లకి వెచ్చిస్తున్న సమయం ఒక తెలివైన విద్యార్థి Groups లో ఈజీగా సెలక్ట్ అయ్యేంత. అసలు ఇదేం పిచ్చిరా తల్లీ... ఈ అందం కాన్షియస్‌నెస్ ఏమిటి మీ యువతరానికి...

'అనోరెగ్జియానెర్వోసా' అనే డిజార్డర్‌తో మీరు బాధపడుతున్నారని మీకు తెలుసా! తిండి తింటే ఎక్కడ లావైపోతామోనన్న టీనేజ్ యువతను పీడిస్తున్న మానసిక జబ్బు ఇది... అంతేకానీ మూడు పూటలా తింటున్న బొమ్మ రోగి... రెండు పూటలా తింటున్న నాన్న భోగి... ఒక్క పూట తింటున్న నేను యోగి అంటూ బుకాయించటానికి ప్రయత్నించకు... Great line by Abdul Kalam –

I am not a handsome – But I can give my "Hand to some who needs help".

Beauty is in heart not in face అన్నది మీ తరానికి ఎప్పుడు అర్థమవుతుందిరా చిట్టితల్లీ!

అందంగా వుండాలనుకోవటం తప్పుకాదు కానీ అందంగా కన్పించాలనుకోవటం మాత్రం తప్పే! ఆరోగ్యం తినే వస్తువుల్ని బట్టి మారినట్టే అందం మనిషిని బట్టి మారుతుంది – అందం, ఆరోగ్యం పరస్పర ఆధారితాలు. ఆరోగ్యం ఒకసారి చెడితే మళ్ళీ బాగుచేసుకోవటం ఎంత కష్టమో తెల్సా నీకు...

నిన్న ఒక హిస్టరీ... రేపొక మిస్టరీ... నిన్నటి హిస్టరీ మళ్ళీరాదు. రేపటి మిస్టరీ మనకు తెలియనిది – వున్న ఈ రోజు కదా మనల్ని మలిచేదీ... మార్చేదీ...

ఒక్కసారి సూటిగా నా వంక చూసి నిజంగా, నిజాయితీగా చెప్పు... నువ్వెప్పుడైనా స్వేచ్ఛగా, స్వచ్ఛంగా నీళ్ళు మొఖంమీద చిలకరించుకున్నావా...వానలో అన్నీ మరిచి ఆడుకున్నావా...మేకప్ లేకుండా బయటకు అడుగు పెట్టావా... నచ్చినవి నచ్చినట్టు తినగలిగావా? నచ్చిన బట్ట కట్టుకోగల్గుతున్నావా... అసలు అచ్చమైన నూలు ఇచ్చే సౌఖ్యం తెలుసా నీకు... ఎందుకు రా పొద్దస్తమానం ఎవర్నో ఇంప్రెస్ చెయ్యటం కోసం బ్రతకటం... మన జీవితం మనకు అందంగా కన్పించాలి కానీ మనం కాదురా... నీకు తెలుసా... ఒకసారి ఓ అందాల పోటిలో ఈ ప్రపంచంలోకెల్ల గొప్ప అందగత్తె ఎవరు అని అడిగితే 'మదర్ థెరిసా' అని చెప్పిన వ్యక్తే మిస్ యూనివర్స్‌గా సెలక్ట్ అయింది – 'అందం' అనేది 'సేవ'లో ఉంటుందిరా శరీరంలో కాదు.

ఒక్కసారి నీ చిన్నప్పటి రోజుల్లోకి వెళ్ళిపో... ఇంత పెద్ద బొట్టు పెట్టుకుని, నూలు చీరకట్టుకుని మీ అమ్మమ్మ నట్టింట్లో తిరుగుతుంటే, ఎంత గొప్పగా ఉండేది. అయినా – నా దృష్టిలో ముడతలు పడి, 8 పదుల వయసులో ఉన్న మీ అమ్మమ్మను మించిన అందగత్తె ఈ ప్రపంచంలో లేదంటాను నేను. ఎవరైనా సరే, భార్య అందంగా ఉండాలని కోరుకోవచ్చుగానీ మా అమ్మ అందంగా లేదు అనే వారిని ఒక్కరిని చూపిచ్చు. ఒకసారి మీ అమ్మను తేరిపార చూడు. ఎప్పుడైనా Makeup వేసిందా? పౌడర్‌లైనర్ పూసిందా? Lipstick రాసిందా? కాసింత పచ్చి పసుపు తప్ప, అప్పటినుండి ఇప్పటిదాకా దేనినీ వాడింది లేదు.

అయినా – ఎంత సహజసిద్ధమైన అందం మా అక్కది. నువ్వు మా అక్క పక్కన నిలబడి అద్దంలో చూసుకో – అందానికి అసలు అర్థం అప్పుడు తెలుస్తుంది. ''బొమ్మ తిండితో పెట్టి చంపుతుంది మామయ్యా'' అంటూ విసుక్కుంటావే కానీ, మనని తినమని గోరుముద్దలు పెట్టే మనషులుండడం ఎంత గొప్ప అదృష్టమో తెలుసా నాన్నా నీకు. నెయ్యి, చిమ్మిరుండలు – 'కొవ్వు' అంటూ తీసిపడేసావే గానీ అవెంత ఆరోగ్యదాయకమో మీ తరానికి ఏం తెలుసు? ప్రతీ సదాచారం వెనుక ఓ ఆరోగ్య సూత్రం ఉందిరా కన్నలూ అర్థం చేసుకోండి. 'రతి, వీనస్, ఆఫ్రోడైట్‌లు Hindu,

Greek, Roman మత విశ్వాసాల ప్రకారంగా సౌందర్య దేవతలు. అందానికి అగ్రతాంబూలం ఇచ్చే మీరు వారినే కదా పూజించాలి. మరి మీరెందుకు Mainstream లోని పెద్ద దేవుళ్ళనే ఎందుకు పూజిస్తున్నట్టో? మీ Priorities లో అందం అగ్రభాగాన్ని ఆక్రమిస్తే, జీవిత విలువలు పక్కదారి పడతాయి తల్లీ. ఆత్మ విశ్వాసాన్ని కలిగించడంలో అందం పాత్ర కొంచెం ఉంటుందని ఒప్పుకుంటాను కానీ – అదే విజయం అంటే నేను తట్టుకోనురా!

నీకు తెలుసా, ఒక Miss World Title ని భారత్‌కి ఇచ్చి 60 కోట్ల మహిళా మార్కెట్‌ని సృష్టించుకున్న వ్యాపార కుట్రల వెనుక బలి అవుతున్న సగటు మనుషులం మనం. చిత్రం ఏమిటంటే – ఈ సౌందర్య సాధనాలన్నీ, ఈ లేపనాలన్నీ ఎక్కువగా పాశ్చాత్య దేశాల నుండి దిగుమతి అయినవే. కాస్మెటిక్ మార్కెట్‌లో ఎక్కువగా Search చేస్తుంది. యువత ఎక్కువగా వాడుతుంది – చర్మ సౌందర్య లేపనాలే. ఆ తరువాత – తలవెంట్రుకలు, దంతాలు, సెంట్‌లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. 2008 లో 2.5 బిలియన్ డాలర్ల మార్కెట్ మన భారతదేశంలో జరిగితే ఇప్పుడు 6.5 బిలియన్ డాలర్లకు అది విస్తరించిందంటే, నువ్వు అర్థం చేసుకోవాలి. సౌందర్య తృష్ణ మనిషిని ఎంత బలహీన పరుస్తుందో....

పిచ్చితల్లీ – చర్మం రంగే మనిషి అందానికి సూచిక అనుకుంటే ఆఫ్రికన్లు Miss యూనివర్స్ కాగలిగే వారా! సినీ రంగాన్ని ఏలుతున్న అగ్రతారలంతా చామనఛాయతో ఉన్నవాళ్ళే అన్నది నువ్వు గ్రహించలేదా!

ఒక్కసారి అందాల ఆరబోతతో పతాకాన్ని కైవసం చేసుకున్న – చరిత్రలోకి వెళ్ళి చూడు.

మిస్‌వరల్డ్ టైటిల్ మనదేశానికి 6 సార్లు వచ్చింది.

1966 లో – రీటా ఫారియా

1994 లో – ఐశ్వర్యా రాయ్

1997 లో – డయానా హెడెన్

1999 లో – యుక్తా ముఖి

2000 లో – ప్రియాంకా చోప్రా

2017 లో – మానుషీ చిల్లర్

ఇక మిస్‌యూనివర్స్ 2 సార్లు వచ్చింది.

1994 లో – సుస్మితా సేన్

2000 లో – లారా దత్త

మిస్ ఎర్త్ ... 2010 లో – నికోలే ఫారియా అందుకుంది.

నాకు తెలిసి ఇన్ని అందాల కిరీటాలు మన దేశానికి తప్ప మరో దేశానికి వచ్చాయని నేననుకోవడం లేదు. ఎందుకంటే – అందం అనేది ఆడవాళ్ళ బలహీనత. ఆ బలహీనతను ఎన్‌క్యాష్ చేసుకుంటుంది మార్కెట్ వ్యవస్థ.

ఈ సౌందర్య సాధనాల తయారీ వెనుక అంతర్జాతీయ వ్యాపార కుట్ర ఉందన్న సంగతి అందరికీ తెలుసు. నీకొక చిత్రమైన సంగతి చెప్పనా... అమెరికాలో అతి ఎక్కువగా సౌందర్య కేంద్రాలు పనిచేస్తున్నాయి, దీనివాడకం 25.5% నిష్పత్తిలో చూసుకోవచ్చు. అతి ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్న దేశం చైనా. 17.7% దీని వాడకం ఉంది, 999 బిలియన్‌డాలర్లదిగుమతి అన్నమాట. రెండుదేశాల ఛాయ తెలుపే. అయినా ఇంకా సౌందర్యసాధనాల్ని వాడుతున్నారు. దీని అర్థం ఏమిటో నీకే తెలియాలి? మిస్ యూనివర్స్ కావాలన్నది నీ ధ్యేయం అని బామ్మ చెబితే విని బాధపడ్డాను. దాని బదులు నీవొక సంఘసేవికగా మారినా నేను సంబరపడేవాడిని.

శరీర బరువులు, అవయవాల కొలతలు అంటూ అతివల అందాలతో వ్యాపారాలు చేసే కార్పొరేట్ వ్యవస్థకు తెలియదా! అమృతనాన్ని అందించే గొప్పధనం – ''అతివేనని''. విచిత్రమైన అంశం ఏమిటంటే – అందాల పోటీల్ని ఏర్పాటుచేసే వ్యక్తులు కానీ, Sponser చేస్తున్న కంపెనీలకు సంబంధించిన ఇంటి ఆడవాళ్ళు కానీ ఈ పోటీల్లో ఎందుకు పాల్గొనటంలేదో ఒక్కసారి ఆలోచించండి! ఆడది అమ్మకం సరుకు ఎప్పుడూ కాదు. మరి, అందాల ఆరబోతల సంగతి ఏమిటి? అని ఎప్పుడూ ఆలోచించలేదా? బాహ్య సౌందర్యం కన్నా, ఆత్మ సౌందర్యం మిన్న – అని మన వేదాలు అనాదికాలం నుండి చెబుతూనే ఉన్నాయి కదా.

ఓహో! మా తరం పాశ్చాత్యులు చెబితేనే వింటారు కదా! సరే. జాన్‌కిట్స్ మహాశయుడు ఏం చెప్పాడో నీకు తెలుసుగా...

'A thing of beauty is a Joy forever. Its loveliness – Increases and it will never pass into Nothingness, but still will keep'.

అవును – ఆనందమే జీవిత మకరందం. అది నువ్ ఎప్పుడు తెలుసుకుంటావురా బంగారు తల్లీ.

ఒకప్పుడు పిల్లలకు ముద్దలు పెట్టడం Effection అన్నారు. ఇప్పుడది Infection అంటున్నారు. Spoon తో తినిపించడం క్లాస్ అంటున్న వాళ్ళే – చేతులతో పెడితే 'మాస్' అంటూ చీదరించుకుంటున్నారు. అసలు నిలబడి అన్నం తినకూడదని, కనీసం నీళ్ళు కూడా తాగకూడదన్నది మన ఆయుర్వేదం చెప్పిన ఆరోగ్యసూత్రం. జీరో వేస్ట్ లైఫ్ స్టైల్ (వ్యర్థ రహిత జీవన విధానం) అనుసరించటం మనమెప్పుడు నేర్చుకుంటాం...

ఏది తినమన్నా బాబోయ్ కల్తీ; కల్తీ అంటున్నారు. పిజ్జాలు, బర్గర్‌లు – ఫాస్ట్‌ఫుడ్‌లను ఆవురావురుమంటూ తింటుటావ్. ఆర్డర్‌ల మీద ఆర్డర్‌లు తెప్పిస్తావ్. వాళ్ళెలాంటి నూనెలు వాడుతుంటారో నీవు చూసావా? కంపెనీల బ్రాండ్‌లకు ఇచ్చిన విలువ నిను కన్నవాళ్ళకు ఇవ్వకపోవడమే నీ దురదృష్టం.

- కంపెనీ బ్రాండ్ అనేది కమర్షియల్ తత్వం నాన్నా!
- అమ్మ నాన్నల బంధం ఆత్మీయతల అందం నాన్నా!
- ఈ తేడాను నువ్వెప్పుడు గుర్తిస్తావురా బంగారు తల్లీ!
- మీ అత్తయ్య – మొన్న ఎవరో చెప్పారని ఆన్‌లైన్‌లో order చేసి ఓ టీపొడి తెప్పించింది. ఎందుకో అనుమానం వచ్చి టీ పొడిని పళ్ళెంలో పలుచగా నెరిపి, అయస్కాంతంతో తిప్పితే ఎంతో ఇనుపరజను టీ పొడి నుండి ఎగిసి దానికతుక్కుంది.

  కాఫీ పొడిలో చింతగింజల పొడిని –

  పంచదారలో చాక్ పొడర్ని –

తేనెలో చక్కరని కలుపుతారని అందరికీ తెలుసు. తేనెను వేడిచేస్తే చిన్న చిన్న పేలుడు వస్తే అది కల్తీ అని, కల్తీ లేని అసలు సిసలు తేనె మండుతుందని నీకు తెలుసా! పశువుల పేగుల నుండి ఆయిల్ తీసి అమ్ముతున్నారని పేపర్‌లలో చూడలేదా?

కొబ్బరి నూనెలో – మినరల్ ఆయిల్
మిరియాలలో – బొప్పాయి గింజలు
ఆవాలులో – బ్రహ్మ జముడు విత్తనాలు
మిరపపొడిలో – ఇటుక పొడి

ధనియాల పొడిలో – రంగపు పొడి

శనగపిండిలో – బఠాణి పొడి, మొక్కజొన్న పొడి కల్పుతున్నారు.

పాలు – నీళ్ళను వేరుచేసే హంసలు ఇప్పుడు భూమి మీద లేవు కానీ – మనషుల మేధస్సులు ఇంకా బ్రతికే ఉన్నాయిరా చిన్నారీ. కొబ్బరినూనెను ఫ్రిజ్‌లో పెడితే గడ్డకడుతుంది. అసలైన జీలకర్రను తెలుసుకోవాలంటే అరచేతిలో వేసి నలిపితే నల్లబడుతుంది. యూరియాను, పిండిని కలిపి అనారోగ్య కారకమో తెలుసా. జాగ్రత్తగా గమనిస్తూ కల్తీని అరికట్టాలి కానీ, అన్నం మానేసి కూర్చుంటే ఎలారా? తల్లీ. కల్తీలు వస్తువుల్లోనే కాదు, వ్యక్తుల్లోనూ ఉంటాయి. వస్తువులో కల్తీని గుర్తు పట్టొచ్చు. కానీ వ్యక్తుల్లోని కల్తీని ఎలా గుర్తుపడతావు? ఆశ పెడతారు, ఆకాశానికి ఎత్తేస్తారు, ఓ రంగుల ప్రపంచాన్నే మనకోసం సృష్టిస్తారు. మార్కెటింగ్ మాయాజాలమే అది. నీకు తెలుసా! ఈ రోజు రెండు B – Business లు ప్రపంచాన్ని శాసిస్తున్నాయి.

B for Bhakthi

B for Beauty.

– ప్రపంచ ప్రజలందరినీ ఆకర్షించే పదం – అందం.

మన దేశంలో face cream ల పేరుమీదుగా వేలకోట్ల వ్యాపారం నడుస్తుందన్న సంగతి. తదనుగుణంగా beauty పార్లర్‌లు, Slin clinic లు, కాస్మోటిక్ సర్జరీలు Massage therapyలు, ఆఖరికి యోగాలో కూడా కాస్మోటిక్ యోగాలు, Hair transplantation లు, బేరియాట్రిక్ సర్జరీలు, ఫిట్‌నెస్ సెంటర్లు.... ఇలా ఇలా .... ఎన్నెన్నో పుట్టు కొస్తున్నాయ్. దాంతో పాటు విపరిణామల్నీ ... గమనిస్తున్నాం.

– Plus Size, Double plus size, obesity లు వేళకి సరియైన తిండి తినకపోవడం వల్ల కూడా వస్తాయని మీ తరానికి ఎవరు చెప్పాలి? మన పూర్వీకులను మించిన సైంటిస్ట్‌లు కానీ, ఆరోగ్యకర్తలు ఎవ్వరూ లేరు. ఆరోగ్య సూత్రాలన్నీ మన ఆయుర్వేదంలోనే ఉన్నాయి.

''తిండి కలిగితే కండ కలదోయ్

కండ కలవాడేను మనిషోయ్'' – అన్న కవి సూక్తి మీరు వినరా?

Shape, Size కాదు నాన్నా, కావల్సింది; లైఫ్ స్కిల్స్ పెరగాలి.

చిట్టి తల్లీ... ఇప్పుడు నీవు ఆడపిల్లవే, కానీ రేపు కాబోయే తల్లివి. అందుకు ఎంతో శక్తి కావాలి. బిడ్డ ఆరోగ్యంగా ఎదగాలంటే, అవయవాలన్నీ సంపూర్ణంగా రూపొందాలంటే ఎంతో పౌష్టికాహారం కావాలి. నువ్విలా అర్ధాకలితో బ్రతికితే బిడ్డ వికలాంగత్వంతో పుడతాడు. హార్మోన్లు కూడా సమతులంగా ఉండవు. అసలు బయటికెళ్తే నీళ్ళే తాగవు నీవు. జాగ్రత్త మంచిదే. కానీ ఒక వాటర్ బాటిల్ అయినా ఇంటినుండే తీసుకెళ్ళొచ్చుగా. మనిషి రోజూ 6 లీటర్లు నీళ్ళు అయినా తాగాలన్న సూత్రం కూడా మీకు తెలియదా! నీ పరిభాషలో చెప్పాలంటే “Beauty lies always in the beholder’s eyes”.

సౌందర్యం అనేది వ్యక్తుల్లోనో, వస్తువుల్లోనో ఉండదు. చూసే కళ్ళను బట్టి ఉంటుంది. నువ్వు గెలవాల్సింది అందాల పోటీల్లో కాదునాన్నా, ప్రపంచంలో బతకాల్సింది కలలలోకంలో కాదునాన్నా, – జీవితంలో.

పది మంది కోసం బతకడంలోనే గొప్ప జీవన సౌందర్యం ఉందన్న వాస్తవం ఇప్పటికైనా గుర్తించు తల్లీ.

ప్రపంచంలో ఎక్కడైనా కల్తీ ఉండొచ్చు. కానీ తల్లిదండ్రుల ప్రేమలో మాత్రం కల్తీ ఉండదు. నీ అందంతో అందరి మెప్పు పొందుదాం అనుకుంటున్నావ్ కానీ, నీ అణకువతో, నీ ఆరోగ్యంతో ఇంట్లోవాళ్ళ ఆనందాన్ని పెంచాలని మాత్రం నువ్వు అనుకోవట్లేదు. అదే దురదృష్టం –

పైగా ఆడవాళ్ళ కంటే ఎక్కువగా ఇప్పుడు మగవాళ్ళు కూడా Face కి ఫేషియల్, మసాజ్‌లు లాంటి వెన్నింటినో ఫాలో అవుతున్నారు – మాకు మాత్రం అందం స్పృహ వుండొద్దా అంటున్నారు. నిజానికి సృష్టిలో నెమలి పురివిప్పటం చూశా. కోయిల కమ్మని గొంతుతో పాడటం విన్నాం కదా – పురుషత్వంలోని అందానికి ప్రతీకలు అవి. అలా ప్రత్యేకత కళాత్మకంగా వుండాలి కానీ, అందం పట్ల కవితాత్మకంగా స్తుతిగీతంలా వుండకూడదని, భుజ కీర్తులు దేవుళ్ళకి అందగిస్తుంది కానీ మనకు కాదమ్మా!

బుజ్జమ్మా! ఎంత పెద్ద దానివైనా నువ్వు నాకు బుడిబుడి అడుగులతో గుండెల మీద ఆడుకున్నట్టే వుంటుంది – నీ ఆలోచనలు మారితే ఆనందించే మొదటివాడిని నేనే. మీ తరం కాస్త అందం మీద వెచ్చించే కాలాన్ని ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగిస్తే ఆర్తితో దండం పెట్టే ఈ తరం ప్రధానవ్యక్తినే నేనే.

ప్రతి మనిషి అంతిమ లక్ష్యం ఆనందం
ఆ ఆనందాన్ని అందరితో కలిసి పంచుకోవటమే జీవిత పరమార్థం –
దాన్ని గుర్తిస్తావని... మా తపనను గౌరవిస్తావని భావిస్తూ...

నీ మేనమామ

– చంద్ర

# బోనం

మైఖేల్ !

ఎలా వున్నావ్? చాన్నాళ్ల క్రితం నీ ఈ–మెయిల్ చూశాను. మళ్ళీ మళ్ళీ చదివాను. ఎందుకో కళ్ళు చెమర్చాయి. ఎంత చిత్రం కాకపోతే నువ్వు మాకు తారసపడ్డావ్. ఎక్కడో ఏదో విని భారతదేశం మీద అభిమానంతో నువ్వు రావడమేంటీ, ఇక్కడి ఇగ్నో లో జాయిన్ అవ్వడమేంటీ, మా ఇంట్లో అద్దెకు దిగడమేంటీ, తలుచుకుంటేనే గొప్ప ఫీలింగ్ కలుగుతోంది. ఇప్పటికి బహుశా ఓ రెండు సార్లయినా నువ్వు ఇండియా వచ్చుంటావ్. అఫ్కోర్స్, కొన్ని ప్రాంతాలకు నీతోపాటూ మమ్మల్నీ తీసుకెళ్ళావనుకో..కానీ ఈసారి నీ ఇండియా టూర్ ఒక ప్రత్యేకాంశంతో ముడిపడబోతుంది. ఎందుకంటే మా దేశ మూలాల అన్వేషణలో నిత్యం తిరిగే నీకు ఈ సారి ట్రిప్ ఎంతో దోహదం కానుంది సుమా ! చెప్పకుండా ఊరిస్తున్నానేమిటా అనుకుంటున్నావా...

నిజం మైఖేల్ ! నువ్వు హైదరాబాద్ ని 400 సంవత్సరాల చరిత్రగలిగిన నగరంగా మాత్రమే చూసావ్ కదా.. ఈసారి ఓ పెద్ద 'గ్రామం'గా చూద్దువుగాని. మా ప్రతి పండుగా గ్రామాలతోనే ముడిపడి ఉంటుందని తెలుసుగా. పంటలు ఇంటికి వచ్చాయని, నరకాసురుడి పీడ వదిలిందని, దసరా నవరాత్రులని; ఇంకా కొన్ని ఋతువులతో ముడిపడి ఉంటాయ్, ఉగాది, శ్రావణమాస వ్రతాలు, కార్తీక మాస స్నానాలూ ఇలాగన్న మాట.

అయితే ఈ పండగలన్నిటికీ నగరం పల్లె బాట పడితే, పల్లెలన్నీ బారులు తీరి నగరానికి వచ్చేలా చేసే పండగ మాత్రం 'బోనాలే'. గ్రామీణ జీవన సంస్కృతి నుండి పుట్టిన ఈ పండుగ తెలంగాణా జాతి అస్తిత్వానికే మూల స్తంభం లాంటిది. తమ సొంత తనాన్ని, తమదైన అమాయకత్వాన్ని కలుపుకొని తమని నిరంతరం కాపు కాసే అమ్మ లాంటి గ్రామ తల్లికి భోజనం పెట్టడమే బోనాల పండుగ.

మైఖేల్ ! నువ్వు మా ఇంటికి రాగానే మా ఆవిడ వెంటనే భోజనం పెట్టిందని కనిపించిన వాళ్లందరికీ చెప్పావ్ కదా, ఆత్మీయంగా ఆదరించడం, కడుపు నిండా భోజనం పెట్టడం భారతీయ సంప్రదాయం. తిన్నింటి వాసాలు లెక్కపెట్టకూడదని, ఆ ఇంటి ఉప్పు తిన్నాము కాబట్టి మేలు మాత్రమే చెయ్యాలి గానీ కీడు తలపెట్టనే కూడదని సనాతన ధర్మం ఉపదేశిస్తుంది. అందుకే తమని, తమ కుటుంబాల్ని, తమ గ్రామాల్ని చల్లగా చూడాలని ఆశిస్తూ గ్రామం అంతా ఐకమత్యంగా ఏకత్వ స్ఫూర్తితో అమ్మవారికి భోజనం పెట్టడమే బోనాల పండుగ ముఖ్య ఉద్దేశ్యం.

కాస్తంత భయం, కాస్తంత భక్తి, కాస్తంత ఆచారాల పట్ల ఉన్న నమ్మకం వల్ల వందల ఏళ్ల నుంచీ ఈ పండగని ఏ ఆటంకం లేకుండా నిర్వహించుకుంటున్నాం. నిజం చెప్పాలంటే ఆదిమ కాలం నాటి ఈ ఉత్సవాల్ని, ఆధునిక కాలంలోని మనిషి కూడా నియతితో చేస్తున్నాడంటే ఈ ఉత్సవాల వెనకున్న శాస్త్రీయత, ఆధునిక సాంకేతికాంశాల్ని గమనించాల్సిందే.

మైఖేల్ ! ఆంటీనెప్పుడూ నువ్వు ఆట పట్టిస్తుంటావ్‌గా, ఏ రాయికి పసుపు రాసి బొట్టు పెట్టినా పడి పడి మొక్కుతుందని. మా గ్రామీణుల విశ్వాసాలు అంత బలంగానే ఉంటాయ్. మీ ఆంటీ అచ్చమైన పల్లె పడుచు. మా ఇంటికి ఏ చెడు సోకకుండా నిరంతరం గ్రామ దేవత కాపాడుతుంటుందని ఇప్పటికీ బలంగా నమ్ముతూనే ఉంటుంది. అందుకే తాను ఎంతో భరోసాగా ఉంటుంది. ఎన్ని పనులున్నా అమ్మవారికి బోనం ఎత్తకుండా మాత్రం తనని ఆపలేము. నా భార్య లాంటి వాళ్ళే లక్షల్లో ఉన్నారిక్కడ.

నిజంగా మన మగవాళ్ళంతా ఒక మాటని ఒప్పుకొని తీరాలి మైఖేల్, స్త్రీల సంకల్ప బలం, మనో స్థైర్యం, పట్టుదలల ముందు మగవాళ్ళు దిగదుడుపే. మనిషిని పుట్టించగలిగిన గొప్ప శక్తి స్త్రీలకు మాత్రమే ఉందనీ, స్త్రీ పురుషుడి కంటే ఉన్నతి గలిగిందని భావిస్తూ ఆమె ఆధీనంలోనే అందరూ నడిచేవారు. అందుకే ఇంటిని ఎంత బాగా చూసుకుంటుందో, తమ గ్రామాన్ని కూడా అంతగా సంరక్షిస్తుందని భావించి గ్రామానికి వేల్పుగా గ్రామ దేవతనే రూపొందించుకున్నారు. రాను రాను గర్భిణీగా మారటం, పురుళ్ళ కాలం, వీటి వల్ల ఆ స్థానాన్ని పురుషుడు కైవసం చేసుకున్నాడు. అయినప్పటికీ తమ పిల్లల్ని తండ్రి కంటే, తల్లులే ఎక్కువ సంరక్షిస్తారు. జాగ్రత్తగా చూసుకుంటారు. అందుకు కారణం కరుణ, మాతృత్వం ఇవి తల్లి లోనే ఎక్కువగా ఉంటాయని నమ్మకంగా చెప్తున్నాను. అందుకే ఒక 'కాస్మో పవర్'ని సృష్టించాల్సి వచ్చినప్పుడు ఆ రూపం కూడా స్త్రీదే కావాలనీ, అప్పుడే తల్లి తన సంతానాన్ని చూసుకున్నంత జాగ్రత్తగా 'అమ్మతల్లి' తమని కాచుకొంటుందని అందరూ నమ్మారు.

గ్రామ దేవతల్ని భర్తీ చేయగల్గిన గ్రామ దేవుడు వాళ్ళకి తారసపడ లేదు కాబోలు, లేదా విశ్వాసాల మీద దెబ్బ కొట్టడమెందుకని కూడా మిన్నకుండిపోయి ఉండవచ్చు. మార్గ సంప్రదాయ రీతిలో పురుష దేవుళ్ళకి దీటుగా, దేశీ సంప్రదాయ రీతిలో గ్రామ దేవతలు తమ అస్తిత్వాన్ని కాపాడుకుంటూ వస్తున్నారంటే, ఈ ఆచారాల్ని బతికించుకుంటున్న స్త్రీలదే ఆ గొప్పదనమంతా.

బోనాల సంబురం దాదాపు నెల రోజుల పాటు సాగుతుంది. గోల్కొండ బోనాలు, లష్కర్ బోనాలు ముఖ్యమైనవి. లాల్ దర్వాజ లోని సింహవాహిని అమ్మవారికి జరిగే బోనాలు, అక్కన్న మాదన్న ఆలయంలోనూ జరిగే బోనాలూ ముఖ్యమైనవే.

ఆది శక్తి భువన భారాన్ని మోసిందని పురాణాల్లో చదువుకున్నాం కదా, అలాగే ఆధునిక స్త్రీ కుండని మోస్తోంది. భువనమంటే భూమి అని అర్థం. భువన మనే పదానికి వికృతి బోనం. తలపైన రంధ్రాలున్న కొత్త కుండని పెట్టుకొని, దాన్ని అలంకరించి, వేప రెమ్మల్ని కుండకి చుట్టి, అందులో దీపం పెట్టి, పైన ఒక చిన్న కుండలో పెసరపప్పు, బియ్యం, పాలతో తయారు చేసిన పాయసాన్ని ఉంచుకొని, దాని పైన మూకుడులో దీపం పెడతారు. ఆ దీపాన్ని పరమాత్మగా, పెద్ద కుండలోని దీపాన్ని ఆత్మగా భావిస్తూ ఆ దేవ దేవికి అన్నం తినిపించడమే బోనం పండుగ విశిష్టతగా భావిస్తారు. ఇందులో బోనం కుండలు, తొట్టెలు, ఫలహారపు బండ్లు, బోనాల దీపాలు, పోతురాజుల వీరంగాలు, ఘటోత్సవాలు, శివ సత్తుల పూనకాలు, రంగం ఎక్కడం — ఇలాంటివెన్నో గమనించొచ్చు.

మైఖేల్ ! మీ ఇంట్లో ఏదైనా శుభకార్యం ఉంటే నువ్వే కదా అందరికీ వెళ్ళి చెప్తావ్. అలాగే బోనాల జాతర ఉంది.. రండి రండని ఆ గ్రామ దేవతే ఇంటింటికీ వెళ్ళి పిలుస్తుంది తెలుసా. దీన్నే ఘటోత్సవంగా చెప్తారు. ఒక కలశాన్ని తయారు చేసి, అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆ కలశంలో పెట్టి, బాజా భజంత్రీలతో, డప్పులతో వీధి వీధీ ఊరేగుతూ, అందర్నీ జాగరూకుల్ని చేస్తూ ఊరికి ఎరిగింపుగా నిర్వహించుకునే సంబురం ఇది. ఊరేగింపుతో పాటూ నడుచుకుంటూ వచ్చిన జనాలందరూ అమ్మవారిని అత్తారిల్లు లాంటి గుడిలోని ప్రత్యేక ప్రాంతంలో ప్రతిష్టాపన చేస్తారు.

అమ్మవారికి భోజనం పెట్టడమనేది వ్యక్తి వ్యక్తికీ మారుతుంది. కొందరు ఫలహారం బండ్ల మీద ఊరేగింపుగా తెచ్చి అమ్మవారికి నైవేద్యం పెట్టాక, తమ బంధుమిత్రులందరికీ పంచుకుంటారు. ఆ తర్వాత మేకలతోనూ, గొర్రెలతోనూ

రథాలుగా తయారుచేసిన బండ్ల మీద బోనాల్ని తీసుకెళ్ళేవారు.

మరో అంశం తొట్టెల ఊరేగింపు. వెదురు కర్రలతో అంతస్తులు అంతస్తులుగా నిర్మించిన తొట్టెల్ని మెరిసే కాగితాలతో కళాత్మకంగా చుడతారు. నాకు తెలిసి ఏడంతస్తుల వరకూ మా పక్కింటివాళ్లు తీసుకెళ్లగా చూసాను. ఇంతకీ తమాషా అయిన విషయమేంటంటే సంతాన వృద్ధి కోసం అమ్మవార్ని మొక్కుకుంటూ కొందరు, సంతానం కలిగిందన్న ఆనందంతో మరికొందరు ఈ తొట్టెల్ని అమ్మవారికి సమర్పిస్తారు. అలయంలో ఉన్న చెట్టుకి గానీ, రాతి స్తంభాలకి గానీ ఈ తొట్టెల్ని కట్టి అమ్మ వారికి ధన్యవాదాలు తెలియచేసుకుంటారు, అయితే, బోనాల్ని ఆడవాళ్ళు తలపై మోసుకుంటూ వెళ్ళినట్టుగానే ఈ తొట్టెల్ని మాత్రం మగవాళ్ళు మోసుకుంటూ వెళుతుంటే, ఆడవాళ్ళు అనుసరిస్తుంటారు.

అమ్మవారికి బోనం పెట్టడానికి ఇల్లు ఇల్లంతా సంబరపడుతుంది. శుచిగా శుభ్రంగా ఇంటిని తీర్చిదిద్దుకుని, వాకిలి శుభ్ర పరచుకొని, ఇంటిలోని ఆడవాళ్ళందరూ ముఖం, కాళ్ళకి పసుపు రాసుకొని, పట్టు బట్టలు కట్టుకొని అమ్మవారి గుడికి వెళ్లడానికి తయారవుతారు. నిజం చెప్పాలంటే ఇది పుట్టింటికి వెళ్తున్న ఆడవాళ్ళు ఎంత సంబరంగా ఉంటారో అంత ఉత్సాహంగా ఈ సంబురాలు జరుపుకుంటారు. ముందే తెచ్చిపెట్టుకున్న రంధ్రాలున్న కొత్త కుండలో దీపం పెట్టి, ఆ పైన బోనం ముంత పెట్టి, దాని పైన దీపం పెడతారు. అది నెత్తిన పెట్టుకొని భక్తి శ్రద్ధలతో దేవాలయానికి బయలుదేరతారు. దేవాలయం ముంగిటికి చేరగానే సాకపోయడాన్ని గమనిస్తుంటాం. అంటే ఇంటి నుండి తెచ్చిన పసుపు నీళ్ళతో వేపాకుల్ని కలిపి దారికి అడ్డంగా పోస్తారు. ఆదిమ కాలంలో కల్లుని, ఆ తర్వాత బెల్లం పానకాన్ని, ఇప్పుడు కొబ్బరి నీళ్ళని కూడా పోస్తున్నారు.

ఒక గమ్మత్తైన విషయం చెప్పాలి మైఖేల్ నీకు, ఊరందరికీ అమ్మవారు రక్ష అయితే, అమ్మవారికి మాత్రం పోతురాజు రక్ష. పోతురాజు బోనాల పండుగలో ప్రత్యేక ఆకర్షణ. అందుకే పోతురాజులు పుట్టుకొస్తూనే ఉన్నారు ప్రతి ఏడాదీ. శరీరమంతా దట్టంగా పసుపు రాసుకుని, కళ్ళకు మందంగా కాటుక పెట్టుకొని, పెద్ద కుంకుమ బొట్టుతో, నడుం చుట్టూ వేప మండలతో, విరబోసుకున్న జుట్టుతో చిందులు వేస్తూ వెళుతుంటే అందరూ భక్తిగా మొక్కుతూ ఉంటారు. ఆదిమ కాలంలో పోతురాజులు జంతు బలులు ఇచ్చేవారు.

దున్నపోతుల్ని కూడా గావు పట్టడం, అంటే మెడకొరకడం – చేసి ఆ రక్తాన్ని చల్లేవారు. ఆ తరవాత గొర్రెలు, మేకలు, కోళ్ళని బలి ఇచ్చేవారు. జంతు బలులు నిషేధించిన నేపథ్యంలో ఆనపకాయల్ని, గుమ్మడి కాయల్ని బలివస్తువులుగా స్వీకరిస్తూ, వాటిని కొరికి విసిరేస్తూ ముందుకు వెళుతూ ఉంటారు. పోతురాజుతో పాటూ శివ సత్తుల పూనకాలు కూడా చూచి తీరాల్సిందే. శివ భక్తులైన స్త్రీలు కొంతమంది వెంట్రుకలు విరబోసుకొని, చేతిలో చిన్న త్రిశూలంతో, వేపమండలతో, నెత్తిన బోనాల కుండలతో ఊగిపోతూ వస్తుంటారు.

బోనాల కార్యక్రమంలో రెండో రోజు రంగాన్ని సిద్ధం చేస్తారు. ఇది మన సైన్స్ కి అందని చిత్రం. గుడిలోని అమ్మవారు ఒక మహిళని గానీ, ఒక కన్యని గానీ ఆవహించి దేశ భవిష్యత్ వాణిని చెప్పడం ఇప్పటికీ చూస్తున్నాం. అయితే ఇందులో ఆసక్తికరమైన అంశం ఏంటంటే పచ్చి కుండమీద ఆ అతివ నిలబడి ఊగిపోతూ దాదాపు గంట, గంటన్నర సేపు ఏకధాటిగా మాట్లాడుతూ ఉండడమే. మట్టితో తయారయ్యే ఆ పచ్చి కుండ చాలా సున్నితంగా ఉంటుంది. అలాంటి కుండ మీద సగటు బరువున్న అంటే ఒక 50 కేజీలున్న మనిషి నుంచుంటే ఆగుతుందా..కానీ ఇక్కడ అమ్మవారు ఆవహించింది కాబట్టి తాను మనిషి కాదు..దేవత కాబట్టి తేలికగా ఉంటుందని, అందుకే కుండ పగలదని, అమ్మవారి శక్తికి ఇది తార్కాణమని లక్షల మంది భక్తుల విశ్వాసం.

మైఖేల్ ! 1921 ప్రాంతంలో నీలాగే ఈ దేశానికొచ్చిన పాశ్చాత్యుడైన బిషప్ రైట్ రివరెండ్ హెన్రీ వైట్ హెడ్ 'ద విలేజ్ గాడెస్ ఆఫ్ సౌత్ ఇండియా' అన్న పరిశోధనా గ్రంథాన్ని రాసాడంటేనే నువ్వు ఆలోచించాలి. గ్రామ దేవతల పట్ల ప్రజలకున్న నమ్మకం, విశ్వాసాలు ఏపాటివో. అంతెందుకు కాకతీయులు 'కాకతి' అనే గ్రామదేవతని బాగా నమ్మేవారు.

ప్రతాపరుద్ర చక్రవర్తి బోనాల ఆఖరి రోజున రాశులు రాశులుగా బోనం సమర్పించి ప్రజలందరికీ భోజనాలు పెట్టేవాడని ప్రజలు చెప్పుకునేవారు. రుద్రమదేవి ఏకవీర ఆలయాన్ని సందర్శించేదనీ, కాకతి భక్తురాలనీ ప్రజలిప్పటికీ చెప్పుకుంటుంటారు.

మైఖేల్ ! నువ్వు పరిశోధకుడివి. నీకు చారిత్రక ఆధారాలుంటేనే నమ్ముతావు కదా, సింధు ప్రజలు క్రీస్తు పూర్వం 2000 సంవత్సరాల నాడు 'అమ్మతల్లి' పేరిట మాతృదేవతారాధనను నిర్వహించేవారని చరిత్ర చెపుతోంది. గ్రామ దేవతలకు శిష్ట దేవతల మాదిరి మంత్రాలుండవు. శాస్త్రోక్తమైన విధి విధానాలుండవు, దేవతకు నిర్దిష్ట రూపం కూడా ఉండదు. పూజారులు కూడా బ్రాహ్మణేతరులే. ఊరిచివర వేపచెట్టు మొదట్లో రాయికి పసుపు రాసి, బొట్టు పెట్టి కొలుపులు చేస్తారు. తాము ఇష్టపడేవాటినే అమ్మతల్లి ఇష్టపడతారని మద్యం, మాంసం పెడతారు.

ఇన్ని వేల సంవత్సరాలు గడిచినా, తెలంగాణాలోని ఏ ఇంట్లో శుభకార్యం జరిగినా పోచమ్మకి పూజ చేయందే అడుగు ముందుకెయ్యరు. మైసమ్మ పశువుల్ని కాపాడుతుందనీ, బాలమ్మ పిల్లల్ని చల్లగా చూసుకుంటుందనీ, కట్ట మైసమ్మ చెరువు కట్టలు తెగకుండా రక్షగా నిలుస్తుందనీ, పోచమ్మ గత్తర్లు రాకుండా ఇంటిని కాపాడుతుందనీ బలంగా విశ్వసిస్తుంటారు మా ప్రజలు.

జనాల నోళ్లలో బోనాల పండగ గురించీ, గ్రామ దేవతల గురించీ ఎన్ని కథలు వాడుకలో ఉన్నా ఒక కథ మాత్రం అటు జనాభాలోనూ, ఇటు సాహిత్యంలోనూ విశేష ప్రాచుర్యాన్ని పొందింది. ఆరు వందల యేండ్ల నాటి వినుకొండ వల్లభనాయుడు 'క్రీడాభిరామం' గ్రంథంలో రాసిన కామేశ్వరి కథే అది. ఈ కథ ప్రకారంగా రామావతారాన్ని మోహిస్తుంది లక్ష్మీ దేవి. ఏకపత్నీ వ్రత దీక్షలో ఉన్నానని, మరొక అవతారంలో ఆమె కోరిక తీరుస్తానంటాడు విష్ణువు. తనని కూతుర్ని చేసుకోమని శివుణ్ణి వేడుకొంటుంది. గౌరీ దేవితో పెళ్లయ్యాక అనుగ్రహిస్తాననీ, అందాకా ఈ కొలనులో ఉండమంటాడు. కొన్నేళ్లకు గౌరీ దేవితో వివాహమైన శివుడు, భార్యా సమేతంగా కొలనులో జలకాలాడుతున్నప్పుడు అలసిన గౌరీ దేవి ఏడు దోసిళ్ళ నీరు తాగుతుంది. దానితో ఏడుగురు కన్యలుగా లక్ష్మీ దేవి పుడుతుంది. వాళ్ళ రక్ష చూసుకోమంటూ పోతురాజుని సృష్టించి గౌరీశంకరులు కైలాసానికి వెళ్లిపోతారు. దీంట్లో మాత్రమే కాదు, పాల్కురికి సోమనాథుని 'బసవపురాణం', 'పండితారాధ్య చరిత్రం' లోనూ, జాయపసేనాని 'నృత్త రత్నావళి' లోనూ బోనాల జాతరను అత్యద్భుతంగా వివరించారు.

మైఖేల్ ! ఇప్పుడు నమ్ముతావా బోనాల పండుగ మూలాలు ఎన్ని వందల ఏళ్ల నుంచీ ఉన్నాయో. మన కట్టు, మన బొట్టు, మన బోనం అన్న పదాలు తెలంగాణా ఉద్యమంలో మన భాష, మన యాస, మన గోస, మన రాష్ట్రం లాగా కీలక భూమిక పోషించాయి. ప్రతి మనిషి గుండెల్లో బోనాల పతాకం ఎగరడానికి కారణం మూలాన్ని కాపాడుకోవాలన్న మా తపనే. సంప్రదాయ వస్త్రధారణతో బోనం తలపై పెట్టుకొని అమ్మవారిని అర్చించడం నవ్య సంప్రదాయంగా ఆధునికులు చెప్తున్నారు. ఆరోగ్య సూత్రాలూ, శాస్త్రీయ విలువలెన్నో ఈ సంబురంలో ఉన్నాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. అవును ఇది పర్యావరణ హితమైన పండగ. మహిళల నమ్మకాన్ని కాపాడుతున్న పండగ. ఒకప్పటి గ్రామీణులైన ఈనాటి నగరవాసులు తరతరాలుగా బతికించుకుంటున్న పండగ.

రా మైఖేల్ రా ! సముద్రాలు దాటి దేశాలు దాటి మా దేశానికి, మా తెలంగాణకి రా, మోదుగు పూల వసంత హేలగా, తంగెడుపూల బంగరు నేలగా మాత్రమే చూసిన ఈ నేలలో బతుకమ్మని, బోనాల్ని మా ప్రాణదీపాలుగా వెలిగించుకుంటున్న విధానాన్ని, బ్రతికించుకుంటున్న గ్రామీణ సంస్కృతిని చూడ్డానికి మాత్రమే కాదు, దేశదేశాల్లో కథలు కథలుగా చెప్పడానికి రా ! కళ్ళారా చూసి తరించడానికి రా. ఉండనా మరి...

రక్తబంధాన్ని మించిన రాగబంధంతో...

నీ

– యాదగిరి.

# ఆసన్న నిష్క్రమణ

డాక్టర్ బాబూ!

బాగున్నారా! ఉత్తరం మొదలెట్టే ముందు అందరూ అడిగే కుశల ప్రశ్న ఇది. కానీ మమ్మల్ని ఎవరూ అడగరు. ఈ పాలియేటివ్ కేర్ లో జీవితపు చివరి మజిలీ లో వున్న మాకు అదొక చిక్కు ప్రశ్నే. కానీ నాకు మాత్రం మిమ్మల్నిఅడగాలన్పించింది. ఎందుకంటే మీరెప్పుడూ ఇలాగే నవ్వుతూ నవ్విస్తూ ఉండాలి. మాలాంటి వాళ్ళకి ఆపన్న హస్తాన్ని అందిస్తూ ఉండాలి. వయసు రీత్యా వచ్చిన ఇబ్బందో... అలవాట్ల వాళ్ళ కల్గిన అనారోగ్యమో... జీవితంలో ఎదుర్కొన్న ఒత్తిడి వల్ల మొరాయించిన అవయవాలు ఇచ్చిన అల్టిమేటమో ఏదైతేనేం నాకు తెల్సింది నేనీ లోకాన్ని చూసేది మరి కొన్ని రోజులేనని. బహుశా ఈ రాత్రి దాటి సూర్యుడి తొలికిరణాలు భూమిని ముద్దాడే క్షణాన్ని నేను మళ్ళీ చూడలేనేమో.

ఎందుకో డాక్టర్ బాబూ – నాకీ ప్రపంచం ఎంతో ఎంతెంతో అందంగా మరింత గొప్పగా కన్పిస్తోంది. బహుశా పోగొట్టుకుంటున్నాం అని తెలిసాక దాని విలువ మరింతగా పెరుగుతుందేమో. ఎంతైనా కవిని కదా . ఈ చివరి నిమిషంలో కూడా నాలుగు కాగితాలు పాడు చెయ్యనిదే నాలుగు అక్షరాలు ప్రసవించనిదే నిద్రపోలేక ఎవరికి రాయాలో తోచక మీకు ఉత్తరం మొదలెట్టాను. ఆశ్చర్యపడకుండా ఆదరంగా చదువుతారని ఆశిస్తున్నాను.

డాక్టరుబాబూ ! నేను ఈ ఆసుపత్రి కొచ్చి అప్పుడే నెల దాటింది. ఆరు నెలల్లో నేను మారిన నాలుగో ఆసుపత్రి ఇది. మిగతా అన్నిట్లో కృత్రిమత్వమే, డబ్బు వాసనాలే. రక్తాన్ని పీల్చే జలగల్ని మనుషుల రూపంలో చూసాను బాబూ. నాకెందుకో ఈ కార్పొరేట్ ఆస్పత్రుల్లో కొన్ని బందెల దొడ్ల లాగ కనిపించాయి . ఏమిటో అలజడి, అశాంతి, ఆందోళన. ఈ పరుగులు దేనికోసమో తెలియకుండా భీతితో కూడిన మొహాలతో తిరిగే జనాలు.

బాబూ ! ఎప్పుడో చదివిన జ్ఞాపకం – UP లో ఒక నకిలీ వైద్యుడు ఒకే సిరంజితో 40 మందికి ఇంజక్షన్లను పొడిచి వారందరికీ HIV సోకటానికి కారకుడయ్యాడని. నిజానికి మన దేశంలో వున్న జనాభాకి తగినంత మంది వైద్యులున్నారా అంటే అనుమానమే. ప్రపంచ ఆరోగ్య సంస్థ దిగ్భ్రాంతికర వాస్తవాలు ఎన్నెన్నో ఎరుకపర్చింది. అల్లోపతి వైద్యులుగా ఇండియా లో చలామణి అవుతున్న వారిలో 31% మంది కేవలం డిగ్రీ స్థాయి కూడా చదవని వారు అని. వైద్య పరమైన ప్రామాణిక అర్హతలు లేకుండానే వైద్యం చేస్తున్న నకిలీలు అని తేలింది. దేశంలో మొత్తం 38 లక్షల మంది ఆరోగ్య సిబ్బంది ఉన్నట్లు లెక్కలు చెప్తున్నా అది కూడా అనుమానాస్పదమే అని అంటున్నారు.

డాక్టర్ గారూ ! ప్రతీ వెయ్యి మందికీ కనీసం ఒక వైద్యుడు ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించింది కదా ! 135 కోట్ల భారత జనాభాకి 8 లక్షల మంది మాత్రమే డాక్టర్లు ఉండటం తప్పుకదా! ఇంకా 40 లక్షల మంది నర్సులు, 20 లక్షల మంది డాక్టర్లూ కావాలని లెక్కలు చెప్తున్నా ప్రభుత్వాలకు ఇంత అలసత్వం ఎందుకు? ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుకోకూడదు కదా బాబూ. ఈ పరిణామాలు చూస్తుంటే దిగులుగా ఉంది బాబూ. నాదేముంది, ఇవ్వాళో, రేపో పోయే వాడినే. అసలే పేదదైన మన దేశంలో సకాలంలో సరైన వైద్యం దొరకక ఎన్ని లక్షల మంది చనిపోతున్నారో తలచుకుంటేనే భాదగా ఉంది. రేపటి తరం పుట్టి, బతకాల్సింది ఇక్కడే కదా. మరి నిశ్చింతంగా ఎలా ఉండమంటారో చెప్పండి బాబూ !

వేదన ఏమిటంటే ఇప్పుడు, పర్సును బట్టి పల్స్ ను చూసే రోజుల్ని చూస్తున్నాను. అపరిశుభ్ర పరిసరాలు, ప్రశాంతత కనపడని యుద్ధ వాతావరణం. మృత్యువు నీడ మన మీదే నిలిచి ఉందా అనిపించేంత టెన్షన్. ఇలా ఉండొచ్చా బాబూ – ఆస్పత్రులు నరకానికి నకళ్లుగా, పై లోకానికి పాస్ పోర్టులు జారీ చేసే ఎంబసీలుగా…?

ఐనా నాకు తెలీక అడుగుతాను, పుట్టేది మీ చేతుల్లోనే, పొయ్యేది మీ చేతుల్లేనే, welcome చెప్పేది మీరే, send off ఇచ్చేది మీరే. పుట్టి నప్పుడు మేము ఏడిస్తే మీరంతా నవ్వుతారు. పోయేటప్పుడు కుటుంబమంతా ఏడుస్తుంటే, ఆత్మ చిదానందంతో పరమాత్మ సన్నిధికి చేరుతుంది. మరణం మరోకొత్త జన్మకి మారు రూపం కదా. అందరం పోయేవాళ్లమే. కాకపోతే మాకున్న సౌలభ్యం చూసారా! ఎప్పుడు పోతున్నామో తెలుసు కాబట్టి చెప్పాల్సిన మాటలు చెప్పొచ్చు. ఇదీ ఒక అదృష్టమే కదా!

ఔను డాక్టర్ బాబూ, మనం చేసే ప్రతి పనికి సాక్ష్యం సిద్ధంగా ఉంటుందిట. లెక్కలు పక్కాగా రాసి పెట్టబడి ఉంటాయట కదా పై లోకంలో. అయినా ఈ కలికాలంలో అన్నింటినీ ఇక్కడనే అనుభవింపజేసి పంపించేస్తున్నాడు. బహుశా స్వర్గ, నరకాలు కూడా houseful తో భాద పడుతున్నాయేమో. అదేం చిత్రమో కానీ, బాబు చదువుకి, పిల్ల పెళ్ళికి, ఇల్లు కట్టు కోవటానికి అంటూ చిట్టీలు వేసి డబ్బులు పొదుపు చేసుకుంటాం గానీ, ఇలా అనారోగ్యం పాలు అవ్వాల్సొస్తుందని కానీ అప్పుడు ఖర్చులు ఎన్నో ఉంటాయని కానీ ముందు చూపు తో ఎందుకు ఆలోచించం? నాలాంటి ఎంతోమంది మాకేంకాదు అన్న భరోసాతో బతికేస్తారు. కానీ ఏ క్షణం ఎవరికి ఎలా వస్తుందో ఎవరు చెప్పగలరు చెప్పండి? నాలాంటి బాధితులను చూసి కొందరైనా జాగ్రత్త పడితే బాగుందు అనిపిస్తుందిప్పుడు.

నా గురించి మీకు తెలుసుగా..నలతగా ఉందని వీధి చివర డాక్టర్ దగ్గరకు వెళితే ఏవో టెస్టులు రాసి 20 వేలు ఖర్చు పెట్టించి, అంత గొప్ప వాళ్ళం కాదనుకుని హైదరాబాద్ లోని గవర్నమెంటు హాస్పటల్ కి వెళ్ళండి, కాస్త కేసు పెద్దదే అని చేతులు దులుపుకున్నాడు. బిక్కు బిక్కు మంటూ పట్నంలోని ఆసుపత్రికి వస్తే రిపోర్టులు చూసి ఎక్కువ రోజులే పట్టుద్ది, తెల్ల కార్డు ఉందా అన్నారు. మళ్ళీ రకరకాల టెస్టులు చేసి, ఇది స్పెషల్ కేసు, ముదిరింది, ఇక్కడ ఆలస్యం జరిగిద్ది, ప్రైవేటు హాస్పటల్ కి వెళితే ప్రాణానికి హాని లేకుండా సత్వర వైద్యం దొరుకుతుంది. అంటే మళ్ళీ ప్రాణ భయంతో పరుగులెత్తాం.

అక్కడ మమ్మల్ని కిందికీ మీదకీ చూసి ఖర్చుతో కూడుకున్న వ్యవహారం అంటూ ఇన్సూరెన్స్ ఉందా అన్నారు. లేదని తెలిశాక మరి అంత ఖర్చు పెట్టగలుగుతామన్న నమ్మకం కలగకనేమో. మళ్ళీ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. మరో 3 టెస్టులు చేసి 30 వేలు వసూలు చేసి – CM రిలీఫ్ ఫండ్ కి అప్లై చెయ్యమని, డబ్బు రావడానికి టైం పడుతుంది, అప్పటిదాకా ఎక్కడన్నా తలదాచుకోమని చెప్పి పంపించారు. చేతుల్లో డబ్బులేక, భార్యాబిడ్డలతో చలికి చస్తూ బతుకుతూ పుట్ పాత్ మీద గడిపాం.

డాక్టరుగారూ ! నిజం చెప్పనా బాబూ ! నాకు జబ్బు చేసాక, నేను చచ్చిపోతానని కూడా ఏడవలేదు నేను. నా కళ్ళ ముందే కట్టుకున్న భార్యను వీధులపాలు చెయ్యాల్సి వచ్చిందే అని ఏడ్చాను. ఆమెకు ఏమీ తెలియదు. పిల్లాడు డిగ్రీ



చదివాడు. పెద్దగా లోకజ్ఞానం రాలేదు. నాకేదన్నా జరిగితే నా శవాన్ని అయినా ఎలా ఊరు తీసుకెళ్ళగలుగుతారా అన్న భయంతో ఊరికి వెళదామని ఒక్కటే పోరు పెట్టాను నేను. నా భార్యేమో వైద్యం జరిగితే నేను బ్రతుకుతాను కదా అన్న గంపెడంత ఆశతో వుంది. అమాయకురాలు, పైగా పిచ్చి ప్రేమ బాబూ నేనంటే. ఎంతైనా ఆలి కదా ! అప్పుడు వాకింగ్ కి వెళ్లొస్తున్న ఒక పెద్దాయన నాలుగు రోజులుగా మమ్మల్ని చూస్తూ ఉండటం వల్ల మా దగ్గరకొచ్చి, మా కష్టం విని చలించి ఈ ఆసుపత్రికి పంపించారు. Of-course దీన్ని 'స్పర్శ' అంటారు కదా . పాలియేటివ్ కేర్ అంటే కేర్ మీద దృష్టి పెడతారు. క్యూరింగ్ లేని వ్యాధులకు ప్రత్యేక శ్రద్ధతో చిరునవ్వుతో, చావుని ఎదుర్కొనే ధైర్యాన్ని అందిస్తారు కదా!

డాక్టర్ గారూ, మా చిన్నప్పుడు మా ఊళ్ళో ఒక పంతులు గారు ఉండేవారు. మా తాత ముత్తాతలనుండీ వారి కుటుంబమే డాక్టర్లు. అప్పట్లో వైద్యమంటే ఆయుర్వేదమే కదా. చెయ్యి విరిగినా, కడుపు నొప్పి వచ్చినా, వికారంగా ఉన్నా మట్టిలో ముంచిన బట్టతో మట్టి పట్టీ కట్టేవారు. జ్వరం వంటివేవైనా వచ్చినా మట్టి మాత్రలు వేసేవారు. మట్టిలో పుట్టాం, మట్టిలో కలిసిపోతాం. మట్టితో అనుబంధం పెంచుకోండిరా, పది కాలాలు ఆరోగ్యంగా బతుకుతారు అనేవారు. ఊరంతా చెప్పుల్లేకుండా నడిచి వైద్యం చేసేవారు. చిన్న బట్ట పరచుకొని నేల మీద పడుకునేవారు.

ఎండైనా, వానైనా, చలిగా ఉన్నా అలాగే వెళ్ళేవారు. మనకేం కావాలో ప్రకృతికి తెలుసురా, అదే అన్నీ అమరుస్తుంది. ప్రకృతి అంటే దేవుడి ఆకృతి. దాన్ని గౌరవించండి, అదేం చెప్తోందో గుర్తించండి. అది మన శరీరానికి ఏ సందేశాన్ని అందిస్తుందో గమనించండి. ఇకప్పుడు డాక్టర్లతో మీకు పని ఏముంటుంది అనేవారు. ఆయన నాలుక చూసి, నాడిని చూసి ఒంట్లో ఏ రోగముందో చెప్పేవారు. అలాంటి డాక్టర్లు ఇప్పుడు లేరెందుకని డాక్టర్ బాబూ!

శరీరంలో ఎన్ని అవయవాలున్నాయో అన్ని విభాగాలుగా విభజించుకొని ముగ్గురేసి, నాలుగురేసి డాక్టర్లు ఉంటున్నారు. అయినా టెస్టులు చెయ్యందే మందులు రాయరు. ఆ మందులు కూడా నాలుగైదు పర్యాయాలు మార్చందే జబ్బులూ తగ్గవు. మరి మనం పురోగమిస్తున్నామో తిరోగమిస్తున్నామో మీరే చెప్పాలి.

డాక్టర్ బాబూ, నాకు ఒంటరితన మంటే చాలా భయం. నేల మీద నడిచిన నేను, నేల కింది పడకలోకి వెళ్ళాక చెప్పలేను గానీ, నేను బతికున్నప్పుడు మాత్రం నన్ను వెంటిలేటర్ల మీదికి ఎక్కించకండి. బహుశా పాలియేటివ్ లో వెంటిలేటర్లు లేకపోవచ్చు, కానీ నా శ్వాస వెళ్ళేంతవరకూ నా వాళ్ళని నా చుట్టూ ఉండనీయండి. ఎవరూ లేకుండా పోవడం కంటే అందరి మధ్యలో చూస్తూ పోవడం నాకు ఆనందంగా ఉంటుంది. నిజానికి చివరి నిమిషంలో మనం వాళ్ళని చూడలేకపోవచ్చు. కానీ వారి స్పర్శ, వారి జ్ఞాపకం మనలోనే ఉంటాయని మా బామ్మ చెప్పిన జ్ఞాపకం. ఇప్పుడు నేను ఆ దశలోనే ఉన్నానేమో. బహుశా చావుని అందుకే ప్రేమిస్తున్నానేమో !

చావంటే గుర్తొచ్చింది డాక్టరుబాబూ, మీరు సూర్యాపేట ఎల్లయ్య రాసిన పాట ఎప్పుడైనా విన్నారా! మన తమ్ముడు మ్యూజిక్ డైరెక్టర్ చిన్ని చరణ్ దర్శకత్వంలో విజ్యువలైజ్ చేస్తే లక్షల మంది చూసిన పాట.

చింతపడుతూనే చింత కట్టెలతో
చితిని పేర్చినారు – కన్నీరు చిందినారు
పాలుమరువని మనవడు నాపై
పుల్లలేసినాడు – తన పాలు పంచుకుందు
కట్టుకున్నది కాష్టంపైనే కౌగిలించుకుంది
కడసారి చూసుకుంది.
నలుగురు కలిసి నను మోసేటి ఊయల బాగుంది. ఊపిరిపోతే బాగుంది...

అంటూ సాగే ఆ పాట వింటుంటే ఒకప్పుడు ఎంత ఏడ్చానో..ఇప్పుడు మనసుకు ఎందుకో ఎంతో నిశ్చింతగా

ఉంది డాక్టర్. కులాలు లేని లోకం, మర్మాలు ఎరగని లోకం.. ఆకలి దప్పులు లేని ఆ లోకంలోకి నేను వెళ్ళిపోతున్నానని ఆనందం. ఎంత గొప్ప వేదాంతి కదా ఆ కవి అన్పించట్లేదూ... ఆ ఎల్లయ్యది ఎంత చిన్న వయసో తెలుసా... అంతేలే వేదాంతులు కొందరిలో పూర్వ జన్మ వాసనలు వుంటాయి కాబోలు.

వృత్తిని ప్రేమించే మీ లాంటి దేవుళ్ళని ఇక్కడ చూసాక నా భాద చాలా తగ్గింది డాక్టర్... నా భార్యని ఆత్మీయంగా ఆదరంగా పలుకరించే మీ... సిబ్బంది... వేడివేడి గా భోజనాలు... ప్రశాంత వాతావరణం, చక్కటి వసతి సదుపాయం... ఎప్పటికప్పుడు మందులు కూడా మీరే అందిస్తూ మమ్మల్ని చూసే తీరు చూస్తుంటే ఈ లోకంలో ఇంకా మంచి మిగిలే ఉంది అనిపిస్తుంది. బంజారాహిల్స్ అంటే ఆగర్భ శ్రీమంతులుండే ఆవాసాలు అనుకున్నాం. కానీ ఇక్కడ ఆదరణీయులు కొందరు రోటరీ క్లబ్ వారి సౌజన్యంతో రూపాయి ఖర్చు లేకుండా కాన్సర్ చివరి రోజుల్లో వున్న రోగుల్ని చేర్చుకుని ఆ నొప్పి తెలియకుండా, నిరంతరం డాక్టర్ల పర్యవేక్షణలో వైద్య సదుపాయాన్ని కల్గిస్తూ చక్కటి భవంతిలో ఉంచటం ఎంతగొప్ప విశేషం డాక్టరుగారూ.

మా జీవితకాలంలో ఇంత సౌకర్యవంతంగా ఉంటామని కలలో కూడా అనుకోలేదు. కానీ కనికరం కల్గిన ఆ దేవుడు ఈ చివరిరోజుల్లో నా మీద ఎంతో కరుణ చూపించాడు. ఆ దేవుడు మీ రూపాల్లో వచ్చి నాకు సేవ చేస్తున్నట్లుగా అన్పిస్తుంది. ఎంతో గొప్పతనం కదా. స్థాపకులైన డా. సుబ్రహ్మణ్యం, డా. ప్రణతీ రెడ్డి దంపతులకి కృతజ్ఞతతో కూడిన నా చివరి నమస్కారం చెప్పండి. డా. ఫణిశ్రీ, డా. గోపాల్, సురేశ్ రెడ్డి, జగదీష్, డా. రోహిణి, డా. రవి కిశోర్, డా. పద్మ, డా. ఆంజనేయులు గార్లకు వందనాలు. కౌన్సిలర్లగా కన్నా అచ్చు మా తోబుట్టువుల్లా ఆత్మీయంగా చూసిన పల్లవి, పద్మ, శారద గార్లకు ధన్యవాదాలు చెప్పండి. ఇంత గొప్ప కార్యక్రమాన్ని తమ భుజాల మీద వేసుకుని నడిపిస్తున్న రోటరీక్లబ్–బంజారాహిల్స్ వారికి నా పాదాభివందనాలు చెప్పండి. వాళ్ళు చేస్తోంది గొప్ప సేవ.

2011 లో ప్రారంభించబడ్డ ఈ వైద్యపు ధర్మశాల 'ఆసన్న నిష్క్రమణ' కోసం ఉద్దేశింపబడిందిగా చెప్పటం, దాదాపు 2 వేల మందికి పైగా రోగుల్ని ఆదరించటం, గౌరవ ప్రదమైన నిష్క్రమణ ఇప్పించటం, ఉపశమన సంరక్షణ సేవల్ని ఎంతో గొప్పగా అందించడం గొప్ప గుణం కదా డాక్టర్ గారూ. ఆ... అన్నట్టు ఈ ఉత్తరాన్ని నేను చనిపోయాక మీ magazine లోప్రచురించండి. మీ phone number అంటే 23384039/40 లని ఇవ్వటం మాత్రం మర్చిపోవద్దు. చనిపోయే ముందు ఇంత ఆదరణీయ వ్యక్తుల మధ్య గౌరవప్రదమైన మరణాన్ని చేరుకోవటమన్నది అందరికీ తెలియాలి డాక్టర్.

ఎంతో మంది ఇంట్లో ఉంచుకునే స్తోమత లేక కొంత బాధలో తీవ్రమైన నొప్పులతో గడ్డురోజుల్తో చావు ఎప్పుడొస్తుందా అని నిమిషాలు లెక్కపెట్టుకుంటూ భారంగా జీవితాన్ని లాగుతున్నారు. వాళ్లందరికీ తెలియాలి డాక్టర్ ఇలాంటి వైద్యాలయం ఇక్కడ ఉందని, స్వలాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా పనిచేసే మీలాంటి దేవుళ్ళు ఇక్కడ కనిపిస్తారని అందరికీ చెప్పాలి.

నిజం డాక్టర్ బాబూ! నిన్న పల్లవి గారు ఒక మాట చెప్పారు. అదేదో దేశంలో ఓ స్వచ్ఛంద సంస్థ ఓ గొప్ప ఆలోచన చేసిందట – ఎవరికైనా అవసరం వున్నప్పుడు, ఆరోగ్యం బాగోలేక హాస్పిటల్ లో చేరినప్పుడు సహాయంగా ఉండటానికి ఇష్టపడే వాళ్లతో ఓ క్లబ్ ఏర్పాటు చేశారట. ఎప్పుడైనా అవసరం పడ్డప్పుడు మనమెళ్ళి సహాయం చేస్తే ఎన్ని గంటలు చేశారు – ఎంత ఆదరంగా చేశారో గమనించి మన పేరు మీద అన్ని గంటలు రికార్డ్ చేసి పెడతారట. అంటే డిపాజిట్ లాగ. మనకు అవసరం వచ్చినప్పుడు మన దగ్గర ఎవరూ లేరే అని దిగులుపడాల్సిన పని లేకుండా వారికి ఫోన్ చేస్తే చాలు, మనం ఎన్ని గంటలు దాచుకున్నామో అన్ని గంటలు సాయం చేస్తూనే – మనం ఎంత అంకిత భావనతో సేవ చేసామో, ఆ సేవకు ఏ గ్రేడింగ్ ఇచ్చారో, ఆ గ్రేడింగ్ ఉన్న వారితోనే మనకి సేవ చేయిస్తారట. ఎంత

నిశ్చింతగా ఉంటుందో కదా! అలాంటి క్లబ్బులు మన దగ్గర కూడా వస్తే బావుండు డాక్టరు గారు.

ఒకప్పుడు ఎవరన్నా ఇలాంటి పాలియేటివ్ కేర్ ఉంటుందంటే, అంటే ఆసన్న మరణగ్రస్తుల్ని ఆదుకునే ఇలాంటి స్వచ్ఛంద సంస్థలు ఉంటాయంటే నమ్మలేక పోయేవాడిని. డాక్టరు గారూ, నాదొక చిన్న విన్నపం. నాకంటూ ఉన్న ఆస్తి నా PF లో ఉన్న 2 లక్షలు. నా భార్య నాతో చెప్పింది. ఎంతవీలైతే అంత, మీరు కాజాగూడ లో 70 పడకలతో నిర్మిస్తున్న సెంటర్ కి డొనేట్ చేస్తానని. ప్రభుత్వం కూడా మీ సేవలు గుర్తించి ఒక ఎకరం పైగానే మీకు డొనేట్ చేసిందట కదా. ఆ స్థలంలో మరో సెంటర్ ని కడుతున్నారట కదా! అలాంటి గొప్ప పనిలో నన్ను కూడా ఉడుత సాయం చెయ్యనీయండి. మా బంధువులందరికీ చెప్తూనే ఉన్నాను నేను. ఈ గొప్ప పనికి సాయం చెయ్యమని.

ఆఖరి మజిలీలో ఉన్న మా లాంటి వాళ్ళకే కదా ఈ పెయిన్ ఎంతో తెలిసేది. కానీ ఆర్తి గుండెల్నిండా ఉన్న ఎంతో మంది మీకు సాయం చేస్తున్నారని విన్నాను డాక్టర్. నిజమే, అలాంటి మంచి వాళ్ళు, దయగల హృదయాలు లేకపోతే ఈ కలియుగం ఎలా నడుస్తుందిలే.

డాక్టర్ బాబూ ! నాకు ఆస్తులు లేవు, వీలునామా రాయడానికి. కానీ చావు చివరి దశలో ఏది చెప్పినా రికార్డు చేస్తారట కదా. ఇది అలాంటి పత్రమే అనుకోండి. అరవై యేళ్ళ తర్వాత జీవితంలో ప్రతిక్షణం దేవుడు పెట్టిన భిక్షనే. ఆ బోనస్ ని సద్వినియోగం చేసుకోవాలి. ఎప్పుడైనా, ఏదైనా, ఎక్కడైనా జరగొచ్చు. నాలాగా మితిమీరిన నమ్మకంతో 'నాకేం కాదులే' అని బతక్కండి. ముందు చూపుతో ఆరోగ్యకరమైన అలవాట్లతో సంతోషంగా గడపండి. ATM మిషన్లలాగా, సంపాదనే ధ్యేయంగా బతికితే, చివరికి కనుమూయబోయేముందు ఒక్క ఆనందకర క్షణం కూడా గుర్తు రాదు. మనకంటూ ఆనందకరమైన జ్ఞాపకాలు లేని జీవితం ఒక జీవితమే కాదు.

నిజమే, మనతో ఏదీ రాదు, ఏమీ రాదు, ఎవరూ రారు. లేని, రాని, కాని, కాల తీరాల వెంట పరుగులాటలు, వెతుకులాటలు, సయ్యాటలు, తండ్లాటలు... జీవితం ఇంతేనా అనిపించకపోదు. దిగులు ఆకాశాన్ని దుప్పట్లా కప్పుకున్నట్టుగా, నా మనసంతా బెంగటిల్లింది. శూన్య నేలని అలుముకుని, కాటు కలిసిన ఆకాశం, దేహ రహదారిపై తొవ్వ తప్పిన మనసుని వెతుకుతుంది. జన్మ ఒక్కటే, పుట్టుకలే పదివేలు ప్రతిదినం; మరణం ఒక్కటే, చావులే పది లక్షలు ప్రతిక్షణం; ఇది మరణా మరణం, ఆమరణ మరణం, అమర మరణం.

చివరి క్షణం కోసం ఎదురుచూస్తున్న,

మీ...

– కె. సాంబశివరావు

# జాబిల్లీ వస్తున్నాం!

మామయ్యా! ఓ చంద మామయ్యా!

నిన్ను 45 కోట్ల ఏళ్లుగా మేము చూస్తూనే ఉన్నాము .నిన్ను మా మేనమామ గా ఆదరించి మా పిల్లలకి చూపిస్తూ గోరు ముద్దలు తినిపిస్తూనే ఉన్నాం. చందమామ రావే జాబిల్లి రావే కొండెక్కి రావే కోటి పూలు తేవే ... బండెక్కి రావే బంతి పూలు తేవే.. తేరు మీద రావే తేనె పట్టు తేవే అంటూ అన్నమయ్య సంగీతాన్ని ఆరాధనగా పాడుతూనే ఉన్నాం . మా ముత్తాతల నుండి వరుస మార్చకుండా .. నీ వయసు మార్చకుండా అందరికి మామ గా పరిచయం చేస్తూనే ఉన్నాం. ఇప్పుడిక ఆ బంధాన్ని బలోపేతం చేస్తూ నేనేమో రచయితను కాబట్టి ప్రేమలేఖ రాస్తున్నాను. మా శాస్త్రవేత్తలు ఆధునిక శాస్త్ర పరిజ్ఞానం తో సాంకేతిక ప్రేమలేఖ ను రోవర్ లో అమర్చి చంద్రయాన్ 2 లో కూర్చి నీకు రాకెట్స్ ద్వారా పంపించారు కొన్ని గంటల క్రితం .. ఎవరికైనా ప్రేమలేఖ అందుకోవటం చాలా సంతోషమేగా ... పైగా నువ్వు మనసుకు అధిపతివి కదా .. నీకు ఇలాంటివి మరింత ఆనందం కదా...

అవును మామా .. ఈ పేపర్ వాళ్ళు ఏమిటి .. ఆకాశం ఓ ప్రహేళిక .. విశ్వం విస్మయాల పుట్ట అంటున్నారు. చల్లదనాల చందమామలో ఆత్మీయతను పంచే మేనమామని , అందులో బువ్వ పెట్టే పేదరాసి పెద్దమ్మని చూసుకున్న వాళ్ళం మేమంతా .. నువ్వు మా అమ్మమ్మ వారింటి వారసుడివి . అచ్చటా ముచ్చటా తీర్చే మేనమామవి . మరి నీకు దూరంగా మమల్ని ఇంకా ఉంచటం నీకు భావ్యమా చెప్పు .. అప్పుడెప్పుడో 60 ఏళ్ళ క్రితం నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, బజ్ ఆల్డ్రిన్ లు నీ మీద కాలు మోపింది మొదలు ఇప్పటి వరకు కేవలం 12 మంది మాత్రమేగా నిన్ను తాకింది . ఇప్పటికీ నీ గుట్టును పెద్దరాసి పెద్దమ్మ బువ్వ పాత్ర లోనే ఉంచితే ఎలా మామయ్యా .. ఓ చంద మామయ్యా !

అయినా మామయ్య .. నువ్వంటే కవులకి ఎంతో ప్రేమ కదా . ప్రేమకు నువ్వేగా కారణం . కవులు విశ్వ ప్రేమికులు కదా .. మరి నువ్వు నచ్చక ఎవరు నచ్చుతారు చెప్పు . అయినా నువ్వేంది ఏకంగా పాల సముద్రం లో పుట్టేసావు .. లక్ష్మీ దేవి నీ తోబుట్టువు కదా .. నిన్ను గరళ కంఠుడు తలమీదకి ఎత్తుకుంది అప్పుడేగా .. పాల సముద్రం మథించినప్పుడు చిమ్మిన విషాన్ని తన కంఠం లో దాచుకున్న శివుడు ఆ విషపు ప్రభావానికి తాపం తో తల్లడిల్లుతున్నప్పుడు నిన్ను తన జటాజూటం లో పెట్టింది అందుకేగా .. నీ వెన్నెల చల్లదనం తో తన తాపం తగ్గుతుందని కదా .. అప్పటి నుండే కదా శివుడు చంద్ర శేఖరుడు అయ్యింది . .చకోర పక్షి నీ వెన్నెల తాగేనట కదా బ్రతికేది . సముద్ర తరంగాల దైర్ఘ్యానికి మూలా కారణం నువ్వేనంటారే .. మరి ఈ తుఫాన్ లు .. సునామీలు ఎందుకు చెప్పు మామా..

శ్రీరాముడు అన్నం తినకుండా మారాం చేస్తుంటే అద్దంలో నీ ప్రతిబింబం చూపించారని అప్పటినుండి తానూ శ్రీరామచంద్రుడు అయ్యాడని జానపదులు కథల్లో చెపుతుంటారు .. వినాయక చవితికి నిన్ను చూడ కూడదని ఓ కథ

ప్రచారం లో ఉంది . కానీ జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఆ రోజు వినాయకుడి ఆకారం లో నక్షత్ర మండలం నీకు వ్యతిరేక దిశలో కనిపిస్తుందిట . అది చూడటం శుభప్రదం కాబట్టి అటు వైపుగా చూస్తారని అది జనాలకి మంచిదని పెద్దలు చెపుతున్నారు.

అన్నట్టు మామయ్యా, తారా శశాంకం బలే శృంగార కథ కదా. ఇంత గొప్పగా ఊహించిన ఆ కవి కనిపిస్తే బాగుండు .. కాళ్ళకి మొక్కుదును .. లేక పోతే ఏమిటి మామా . బృహస్పతి అంటే పెద్ద గ్రహం .. దాని పక్కన ఉన్న చుక్క అంటే తార ని తీసుకెళ్లి పెళ్లి జరిగినట్టు చూపించి ఆ తర్వాత తార చంద్రుడి వైపు అంటే నీ వైపు ఆకర్షితురాలు అయినట్టుగా చెప్పి మీ ఇద్దరికీ బుధుడు పుట్టినట్టుగా చూపించటం భావ్యమా మామా, . సైన్స్ ప్రకారం తార నిన్ను ఢీ కొనగా రాలి శకలం బుధుడు అవునా ..చెప్పు మామా పైగా ఎవరు అందంగా కనిపించిన ఆహ్హా ఏమి వర్చస్సు .. చంద్ర కళ ఉట్టి పడుతుంది అంటూ అక్కడా నీకే ముడి పెట్టటం ఈ మనుష్యులకు బాగా అలవాటు అయ్యింది . అయినా అమ్మ వారి వర్చస్సు మాత్రం వెలిగి పోతుంది .. అచ్చు నీలాగే ... ప్రేమకి ప్రతి రూపం నువ్వు .. చల్లని మనసుకు ప్రతి బింబం నువ్వు .. కాస్త మా మనుసుల్ని దయతో కనికరించి నీతో జతగా జీవించే భాగ్యం కల్గనివ్వు మామయ్యా .

ఇదిగో మామయ్యా నీ మీద నీళ్ళున్నాయని కనిపెట్టింది మేమేగా . ఇప్పుడు నువ్వు ఆవాసయోగ్యమో కాదో చూడాలని తపిస్తున్నదీ మేమే. 3 లక్షలకు పైగా కిలోమీటర్ల దూరంలో ఉన్న నీ దగ్గరకి వ్యోమ నౌకని జాతీయ పరిజ్ఞానం తో నీ దక్షిణ ధృవానికి దగ్గరలో దింపబోతున్న తొలి దేశస్తులం భారతీయులమే . మబ్బులను చీల్చుకుంటూ పైకి లేచిన GSLV మార్క్ 3 అది మోసుకొచ్చిన ఆర్బిటర్, లాండర్, రోవర్ నీ రహస్యాల ను చంద్రయాన్ 2ద్వారా మాకు చేర వేస్తాయిలే. అయినా మామా నీకు మాకు మధ్య ఈ దాగుడు మూతలు ఇంకెన్నాళ్లు చెప్పు .. మనిద్దరం కల్సి ఆడుకునే సందర్భం దగ్గరలోనే ఉండేలా చూడు ..

అయినా మామా, ఇంతింత కళ్ళేసుకుని చూస్తున్నావుగా భూమిని .. ఇక్కడ మేనమామలు ఎట్లా బిడ్డల్ని భుజాల మీద ఆడిస్తారో.. ఎలా నేల మీద గుర్రాలై.. అంబారీలై ఊరేగిస్తారో చూడట్లేదా.. మామా అని ఆరాధనగా నిన్ను పిలుస్తున్నందుకైనా మమ్మల్ని నీ వీపున మొయ్యాలిగా. కనీసం మా అడుగు నీ మీద వెయ్యనివ్వాలిగా .. ఇప్పుడు ఇదిగో మానవ రహిత వ్యోమ నౌకని మాత్రమే పంపించాం.. నీకు 100 మీటర్ల ఎత్తులోని కక్ష్యలో అంతిమంగా స్థిరపడి, ఎన్నోసార్లు నీ చుట్టూ ప్రదక్షిణాలు చేసి, అనువైన సమయంలో సెప్టెంబర్ 6,7 తారీఖుల్లో లాండర్ ని నీ మీద దింపే లాగా ప్రణాళిక వేసుకున్నాం. అడుగడుగునా ఓ హాలీవుడ్ సినిమా తీస్తున్న ఉద్వేగం తో మలుచుకున్నాం. అంత సంభ్రమం గా పంపించాం నీ దగ్గరకి మా ఆత్మీయ సాంకేతిక ప్రేమ లేఖని .

ఇస్రో ఈ లక్ష్యాన్ని నిర్దేశించుకోటానికి కారణం భారతీయులకి నీ పట్ల ఉన్న అవ్యాజనీయమైన ప్రేమతో పాటు, మనిషికి అవసరమైన జీవావరణం నీ మీద ఉండటమే. నానాటికీ అడుగంటి పోతున్న నీటి లభ్యత, కలుషితమైపోయిన వాతావరణం, విస్తరిస్తున్న వ్యాధులు మాకు మరో నివాస స్థలాన్ని వెతుక్కోమన్నాయి..

మామా .. నీ మీద అడుగు పెట్టారన్న పేరే కానీ నీ అంతరంగాన్ని కానీ, నీ విశేషాల్ని కానీ తెలుసుకోలేక పోయాం. నీ గురించి మాకు తెలిసింది ఎంతో తక్కువ. తెలియాల్సింది ఎంతో ఎక్కువ. అమెరికా లాగా వియత్నాం యుద్ధ వ్యూహాల్లో పడి మేము నిన్ను మర్చి పోయామా చెప్పు. అగ్ర దేశాల మాదిరి అంతరిక్ష కేంద్ర నిర్మాణం మీద దృష్టి పెట్టి నిన్ను మరచిపోయామా? 2008 లో చంద్రయాన్ 1 ని ప్రయోగించి .. నీరుందని అప్పుడేకదా ప్రపంచానికి చెప్పింది!

అయినా మామయ్యా.. మూన్ ఇంపాక్ట్ ప్రోబ్ పేరు తో 35 కిలోల ఇంపాక్టర్ ను నీ మీద జారవిడిచి నప్పుడు నిన్ను బలంగా ఢీ కొట్టిందిట కదా. అప్పుడు నీకు బాగా నొప్పి అనిపించిందా.. సారీ మామయ్యా.. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న చిన్న పిల్లలం కదా.. అప్పుడు చేసిన తప్పు ఇప్పుడు చెయ్యకుండా స్మూత్ గా దిగే ఏర్పాటు చేసాములే ..

అంతే కాదు.. సొంత బుద్ధి తో తనంతట తానే పనిచేసే విధంగా రూపొందించి తయారు చేసినాం.. ఇది మా స్వీయ పరిజ్ఞానం తో తయారు చేసిన సాంకేతిక విప్లవం.

ఇప్పుడిది చరిత్ర సృష్టించిన సందర్భం కదా .. సున్నితంగా నీ మీద దిగిన దేశాలు కేవలం 3 మాత్రమే . ఇప్పుడు మేము 4 వ దేశంగా సరి కొత్త రికార్డు క్రియేట్ చేసాము కదా.. అయినా మా మనుషులకి ఆరంభ శూరత్వం ఎక్కువ.. ఇప్పుడు చూడు ఎప్పుడో 60 ఏళ్ళ క్రితం నీ మీద కాలు మోపినా నీ గురించి ఇంకా వివరాలు ఏమీ తెలియదు .. అంటార్కిటికా లో ఆవాసం కోసం ఎన్నో ఏళ్లుగా ఎన్నో దేశాలు కష్టపడ్డాయి .. ఆ తర్వాత 50 ఏళ్ళు పట్టించుకోలా .కానీ భారతీయులం నిన్ను వదిలామా .. అమ్మమ్మ వాళ్ళింటికి వెళ్లినంత సంబరంగా నిన్ను వెతుక్కున్నాం .. నీతో మా అనుబంధాన్ని అనుక్షణం పెంచుకున్నాం. ఇప్పుడు నీతో ఆడాలని ..నీ దగ్గర తలదాచుకోవాలని తపన పడుతున్నాం.

నిన్ననే రేడియో లో విన్నాను. భారత అంతరిక్ష పరిశోధనా రంగం సాధించ బోతున్న అద్భుతం నీ మీద లాండింగ్ అని చెప్పారు ..పైగా ఒక వ్యోమ నౌకను నిర్దిష్ట మార్గంలోకి మళ్ళిస్తూ అంతే ఖచ్చితత్వంతో పని చేసేలా చూస్తూ నియంత్రిచటం ..అన్ని వ్యవస్థల మధ్య సమన్వయం చెడకుండా కాపాడుకోవటం గొప్ప విషయంగా అభివర్ణించారు .. 120 కోట్ల మంది ప్రార్ధనలు చేసాం తెలుసా. చంద్రయాన్2 విజయవంతం కావాలని.

చంద్ర మామా నీకో నిజం తెలుసా .. ఆర్బిటర్ ఏడాది పాటే పనిచేస్తుందిట . కానీ లాండర్ ,రోవర్ ల పనికాలం 14 రోజులేట. సౌర శక్తి తో మాత్రమే అవి పనిచేస్తాయి కాబట్టి 14 రోజుల పగటి కాలాన్నిమాత్రమే మేము పరిగణన లోకి తీసుకున్నాం. నీ మీద రాత్రుళ్ళు ఎలా ఉంటాయో మాకు తెలియదు కాబట్టి అంతా నీమీదే భారం వేసాం. నీ దగ్గరకు పరుగెతుకు రావాలన్న మా తపనని, ప్రేమని అర్ధం చేసుకుని కాస్త సహకరించు మామా ..

చిన్నప్పుడు మా అమ్మ మాకు ఒక కథ చెప్పింది .. ఓ అమ్మకి ఇద్దరు కొడుకులంట ..ఒకసారి అమ్మకి ఆరోగ్యం బాగోలేక కొడుకులిద్దరినీ పిలిచి తన పుట్టింట్లో జరిగే శుభ కార్యక్రమానికి వెళ్లి భోజనం చేసి రమ్మని పంపిందిట .. రాగానే పిలిచి నాయనలారా ..నాకోసం.. ఎమన్నా తెచ్చారా అని అడిగిందిట .. పెద్ద కొడుకు కోపంగా. . 'ఎలా అడుగుతాం' ..అని విసుక్కున్నాడట ..చిన్న కొడుకు మాత్రం ..భుజాన ఉన్న కండువా తీసి దాంట్లో మూట కట్టుకొచ్చిన తినుబండారాలు తల్లికి ఇచ్చి 'అమ్మా ఇవన్నీ నాకు పెట్టినవే.. నీకోసం తెచ్చాను' అని చెప్పాడట.. సంతోషించిన ఆ తల్లి కోపంగా మాట్లాడిన పెద్ద కొడుకుని ఆ వేడిలోనే ఉండమని శపించి ..చిన్న కొడుకుని చల్లగా ఉండేలా వెన్నెల కురిపించమని వరమిస్తుంది .. అంటే మీరే అదే సూర్య... చంద్రులన్నమాట!

మామా! నువ్వు కాస్త జాగ్రత్త గా ఉండు. భూ కబ్జా దారులు కూడా నీ మీదకి రావటానికి ప్రయత్నాలు మొదలెట్టారు.అప్పుడే అంగుళం అంగులం చొప్పున నిన్ను అమ్మకానికి పెట్టారు. నీమీద హీలియం 3 బాగా దొరుకుతుందిట కాదా... మైనింగ్ చెయ్యటానికి సమాయత్తం అవుతున్నారు.. ఈ భూతల్లి గుండెల్లో గునపాలు దింపి నాశనం చేసినట్టే మనిషి తన స్వార్ధం కోసం నిన్ను కూడా నాశనం చేసి ఆవాస యోగ్యం కాకుండా చేస్తాడేమో అని భయంగా ఉంది ..,మళ్ళీ మాకు మరో మంచి నివాస యోగ్యమైన గ్రహం దొరకొద్దా.. ఆ గ్రహం మా మీద అనుగ్రహం చూపొద్దా ..మనసును నిలువరించగలిగేది నువ్వే కాబట్టి మంచి మనసును మా మనిషికి అందివ్వు . దుర్బుద్ధి తో దుర్మార్గపు పనులు చెయ్యాలనే దురాశను మొగ్గలోనే తుంచెయ్యి ..

అన్నట్టు నీలి ఆర్మ్‌స్ట్రాంగ్‌ని కీర్తిస్తు సినారే ఏమన్నారో తెలుసా!
నీవు హరుణి నెత్తికెక్కితే నీ నెత్తికెక్కును నరుడు
నిజంగా అతడు ఘనబుజుడు మానవజాతి చరిత్రలో మారాకు హత్తిన మరో అజుడు అంటారు.

నువ్వు బండెక్కి వస్తావని .. బంతి పూలు తెస్తావని .. తేరు మీద వస్తావని తేనెపట్టు తెస్తావని .. పడవ మీద వస్తావని పాలు పెరుగు తెస్తావని చిన్నప్పటి నుండీ ఎదురు చూసీ చూసీ పాటలు పాడీ పాడీ ఇక ఇప్పుడు మేమే నిన్ను వెతుక్కుంటూ బయలు దేరబోతున్నాం. ముందు మా చంద్రయాన్ 2 ని పంపించాం . బోలెడు ఆశలతో .. ఆకాంక్షలతో మా మావయ్య దగ్గరకి వెళుతున్నాం కదా అన్న ప్రేమ ను గుండెల నిండా నింపుకుని ఈ ప్రేమలేఖను రాయబారంగా పంపిస్తున్నాను .. మా ఆశల్ని సాకారం చెయ్యి .. మా చంద్రయాన్ నడతను నీకు అనుగుణంగా మార్చు ..మానవ జీవితాన్ని మహోన్నతంగా కూర్చు.

ఉండనా మరి...

నీ మేనల్లుడు

– శివ

# నిస్తంత్రీ స్వరం

ఆకాశవాణీ ! నా హృదయరాణీ !

''నేను భూమ్మీద పడీ పడగానే డాక్టర్ గారి మాట కంటే ముందు నీ స్వరమే విన్నానుట. అమ్మమ్మ ఎంతమందికి చెప్పిందో'' అలా ఆకాశవాణి signature tune on అయిందో లేదో వీడిలా భూమ్మీద పడ్డాడనుకోండి ... అందుకే ఆకాశవాణిలా ''బహుజన హితాయ బహుజన సుఖాయ'' అంటూ, ''అందరూ బాగుండాలని, ఆ అందరిలో తానుండాలని కోరుకుంటాడు. అన్నీ ఆకాశవాణి బుద్ధులే'' అంటూ మనిద్దరికీ పేగు బంధాన్ని మించిన 'ప్రసార' బంధంతో ముడి పెట్టేస్తుంటుంది అమ్మమ్మ ఇప్పటికీ!

ఓం నమో నారాయణ అనే అష్టాక్షరి... ఓం నమః శివాయ అనే పంచాక్షరీ ... రామా అనే ద్వ్యాక్షరాలన్నా విభేదించే వారుంటారేమో కానీ 'ఆకాశవాణి' అనే పంచాక్షరీ జపం చెయ్యని జనాలు మాత్రం బహు తక్కువని మాత్రం ఘంటాపథంగా చెప్పగల్గుతాను...

గొంతులో విశ్వాన్నంతా ఇముడ్చుకుని మైకులోంచి మాటల విత్తనాలు చల్లుతూ మనోతంత్రుల్ని మీటే కార్యక్రమాలతో 80 ఏళ్లుగా నీ ప్రస్థానాన్ని జనరంజకంగా సాగిస్తూనే వున్నా నువ్వెప్పుడూ అభిమానుల్ని పోగొట్టుకోలేదు... నీ పెద్ద ముత్తైదువతనాన్ని అగౌరవపడనివ్వనూ లేదు ... అభిమానించే వారికి కొంగు బంగారమై ఆత్మబాంధవిగా, వినోదాత్మక, విజ్ఞానాత్మక, విషయాత్మకమైన కార్య క్రమ సరళితో మా జీవన సరళిని మలచిన సుస్వర భామినివి నువ్వు ...

అవునూ... మన పురాణాల్లో ఆకాశవాణి సందేశం అందిస్తే పాటించాల్సిందేనట కదా. మరి ఈ కలికాలంలో మాత్రం నువ్వేమైనా తక్కువా ఏమిటి ? నీ ఆదేశం విన్పించావంటే ఎవ్వరైనా పాటించి తీరాల్సిందే కదా ? అంతెందుకు నిన్న మొన్నటి ఇంటర్ పరీక్షలప్పుడు ఏ సెట్ పేపర్ విద్యార్థులకు అందించాలో రేడియో ముఖంగా ఆదేశించింది నువ్వేగా ... మరి ఆకాశవాణా ... మజాకా?

నిజం కదా ! స్వరం మంత్రిస్తుంది ... నియంత్రిస్తుంది ... నిరాకార భావానికి ఆకృతినిస్తుంది. నిత్య చైతన్యాన్ని రగిలిస్తుంది... ప్రతి ఒక్కరినీ ఆలోచింపచేస్తుంది ... అందుకేనేమో నేను చిన్నప్పుడు 'బూచాడమ్మా బూచాడు బుల్లి పెట్టెలో ఉన్నాడు' పాటను ఎంత బాగా పాడే వాడినో తెల్సా ... ఇంత చిన్న పెట్టెలో ఎంత మంది ఉన్నారో కదా ! ఇన్ని మాటలు ఇన్నిన్ని పాటలు పాడ్తున్నారంటే వాళ్లెలా వుంటారు .... అన్న సందేహంతో ఎప్పుడూ నీ వంకే చూస్తుండేవాడిని ... ఎంతకీ లోపలికి వెళ్ళేవారు కానీ... వచ్చే వారు కానీ కనిపించరు... ఏమిటీ మాయ అనుకునే వాడిని. నవ్వొద్దు, మరీ చిన్నపిల్లలం కదా! మా అంత పెద్దగా, చిన్న TV లంతగా మీరు యాంటీనాలతో వుండేవారన్న జ్ఞాపకం మాత్రం వుండేది ...



ఓ నా నభోవాణీ ! నీకో సంగతి చెప్పలేదు కదూ ! మా ముత్తాత గారి పేరు 'రేడియో రంగయ్య' నిజమే ! అందరూ అలాగే పిల్చేవారుట. ఇప్పటికీ 3 తరాలు గడిచినా మేం మాత్రం రేడియో రంగయ్య వాళ్ళ కుటుంబం అంటూ ఆ పేరుతోనే బతుకుతున్నాం. అప్పట్లో అంటే 1960 ల్లో పెళ్లైతే చాలు ఓ సైకిల్, ఓ రేడియో కట్నంలో తప్పకుండా చేర్చేవారుట... మా తాత గారికి సైకిల్ ఇచ్చారు కానీ, రేడియో ఇవ్వలేదుట. దాంతో తనకేదో మర్యాద తగ్గిపోయిందని ... తనకు మిత్రుల మధ్యలో గౌరవం ఉండదని అత్తగారిచ్చిన సైకిల్ వేసుకుని మా వూరు వచ్చేశాడుట మా తాత ... ఆ తర్వాత మా బామ్మ వాళ్ళ నాన్నగారు ఎడ్ల బండి మీద రేడియో కట్టుకుని, మా బామ్మని ఎక్కించుకుని తీసుకొచ్చి అత్తగారింట్లో అప్పచెప్పి పోయారంట... అప్పట్లో ఆ వూళ్ళో రంగయ్యలు చాలా మంది ఉండేవారుట ... అందుకే తేలికగా గుర్తింపబడటానికి 'రేడియో రంగయ్య' అంటే ఇట్టే అందరూ గుర్తుపట్టేవారుట. చూశావా నువ్వు ఎంతగా మా జీవనంలో మమేకం అయ్యావో ... ఎన్ని పనుల్లో ఉన్నా ఎక్కడున్నా మనం ఏకాంతంగా లేకుండా మన చుట్టూ మనం నిర్మించుకునే ప్రపంచం ఆకాశవాణి మాత్రమే అందివ్వగల్గుతుంది ... ఆ ప్రపంచంలో చెడు వినపడదు కాబట్టి మతిచాంచల్యాన్ని పొందని ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని నువ్వు మాత్రమే నిర్మింపచేస్తావు ...

ఓ నా స్వరఝరీ ! నువ్వేమో ... స్వరమే పరిచయంగా, స్వరమే పరిమళంగా, స్వరమే చిరునామాగా, స్వరమే తొలిప్రేమగా కోటి ప్రతిస్పందనల సింఫనీని సృష్టిస్తూ ... ఎక్కడెక్కడో ఉన్న మాలాంటి వారి హృదయాలనన్నింటినీ కలుపుతూ మాటల తరంగాల్ని స్వర తరంగాలతో విలీనం చేసి వినూత్న జీవనాన్ని నీ పలుకులకు అందిస్తుంటావు ... మమ్మల్నందరినీ ఆదరిస్తుంటావు ... నేనెప్పుడూ అనుకుంటూనే వుంటాను ... నది ఇంకుతుందేమో కానీ నీ మాటల జీవనది మాత్రం నవోత్సాహంతో ఉరుకుతూనే వుంటుందని... వినోదాల క్రమంగా ఊరుతూనే ఉంటుందని .... తొలి సంధ్య సుప్రభాతం నుండి మలి సంధ్య దాటాక శుభరాత్రి వరకు మా ఇంట్లో సందడంతా నువ్వేగా నా బంగారమా !

ఓ నా స్వరలిపీ ! పురాణాల్లోని దశావతారాల గురించి చెప్తారు కానీ అసలు నువ్వెత్తిన అవతారాల ముందు అవేం సరిపోతాయి చెప్పు ... నిస్తంత్రి రేడియో,యాంటీనాల రేడియో, FM రేడియో, హ్యామ్ రేడియో, వెబ్ రేడియో, కమ్యూనిటీ రేడియో, వేవ్ రేడియో, షార్ట్ వేవ్ రేడియో,external service రేడియో. ఇలా ఎన్నెన్నో రూపాలు. ఇక రాబోయే రోజుల్లో ఏ రూపంలో కన్పిస్తావోనని నిరీక్షిస్తుంటాను. అయినా 26 భాషల్లో ప్రసారాలు వినిపిస్తున్న నువ్వు నిరంతరం నిత్య విద్యార్ధిగా కన్పిస్తావు, మమ్మల్నీ నిత్య విద్యార్థులుగానే మారుస్తుంటావు ...

ఓ నా కాలమానినీ ! మా అమ్మ నిన్నెంత ముద్దు చేసేదో తెలుసా ? నిన్నెంతగానో అనుసరించమని, time management నేర్చుకోమని ఆదేశించేదో తెలుసా ... ఉదయం 'భక్తి రంజని' ప్రారంభమయ్యిందంటే చాలు మాకు అర్ధమైపోయేది మేమిక లేవాలని, ప్రాంతీయ వార్తలు విజయవాడ నుండి ప్రారంభమయ్యే సమయానికి స్నానానికి వెళ్ళాలి ... ఉదయం 7 గంటల 5 నిముషాలకు తెలుగులో వార్తల సమయానికి పుస్తకాలు ముందేసుకుని కూర్చుని కాసేపు ఇంగ్లీష్ వ్యాసాల్ని బట్టీపట్టాలి. కార్మికుల కార్యక్రమం ముగిసి ప్రాంతీయ వార్తలు ప్రసారమయ్యే సమయానికి మధ్యాహ్న భోజనానికి ఇంటికొచ్చెయ్యాలి. మహిళా కార్యక్రమ సమయానికి భోజనం చేసుకుని బడికి తిరిగి వెళ్ళాలి ... సాయంత్రం సమయానికి స్కూల్ నుండి ఇంటికొచ్చేవాళ్ళం. తిరిగి 7.05 నిమిషాలకు మళ్ళీ వార్తలప్పుడు ఆటల నుండి ఇంటికొచ్చి కాళ్ళు కడుక్కుని పుస్తకాలు ముందేసుకుని కూర్చునే వాళ్ళం ...

రాత్రి 'spotlight' ని నాన్నతో కలిసి వినటం గొప్పగా ఉండేది. 10.30 కి ప్రసారమయ్యే మధురగీతాల్ని ఆస్వాదిస్తూ డాబాపైన చాపలు పర్చుకుని నిద్రపోయేవాళ్ళం. మా ప్రతి పని నీతోనే ముడిపడి వుండేది ... రేడియో టైమ్ కి ఉన్నంత ఖచ్చితత్వం మరే దానికీ లేదనుకో అని అమ్మ నేర్పేది ...

చిత్రగీతాలతో హృదయ గవాక్షాల మీద జ్ఞాపకాల వాన కురిపిస్తావు ... లలితమైన సంగీతానికి శ్రావ్యమైన పాటల మల్లెచెండు చుడతావు ... శాస్త్రీయ వాదన గాత్ర సంగీతపు వెన్నెల వెలుగులను నీ స్వర పుష్పక విమానంపై

మోసుకొచ్చి ముంగిట్లో ముగ్గులుగా పేరుస్తావు. వేదనల గాయాలకు, వెక్కిళ్ళ రోదనలకు రేలరేల జానపదాల లేపనాన్ని అద్దుతావు. విషాద విలాపాల్లో మోర్నింగ్ మ్యూజిక్ గా మారతావు. చెంగు చెంగున గంతులేసే మా పిల్లల నోట్లో బాలానందం, బాలవినోదంల చందమామవవుతావు, కుటుంబం గెంటేసిన ముసలితనానికి, డాక్టర్ సలహాలవై, న్యాయవాదుల వాదానివై, ఉచిత గమనానివై ఆశ్రయాన్నందిస్తావు. రైతన్నల ఆశల ఆకలికి పంటపొలాల పరిమళాన్ని అద్దుతావు.

వాతావరణాన్ని చెప్తూ జాగ్రత్తలు నేర్పిస్తావు. సాహిత్య సుధలు చిలుకుతూ కవితాక్షర మేఘమవుతావు. యువతలో ఉత్తేజాన్ని నింపుతూ రేపటి రోజును చూపిస్తావు. అన్నింటికీ నువ్వే అదృశ్య ఆర్తివి. ఓ అద్భుత శబ్దమూర్తివి! కుప్పకూలిన ఒంటరి జీవితాలకు స్ఫూర్తిదాతవి ... నిరంతర తోడూనీడవి... అదృశ్య ఓదార్పువి... వెచ్చటి మాటల కాపీలు మాతో తాగిస్తూ సుస్వరమై, భాస్వరమై, నిత్య ఆశయాల స్ఫూర్తితో ప్రవహిస్తున్న నీకంటే గొప్ప చైతన్య స్రవంతి మరెక్కడ ఉంటుంది ....

ఓ నా సుస్వరాల భామినీ ! అందుకే నీతో స్వర చాలనం చేయటానికి పెద్ద పెద్ద సాహితీవేత్తలు, మేధావులు, రాజనీతిజ్ఞులు ఉవ్విళ్లూరుతుంటారు. అంతెందుకు మన దేశ ప్రధాన మంత్రిగారు సైతం 'మన్ కీ బాత్' అంటూ తన మనసులోని మాటను నీ ముఖతా మాతో పంచుకుంటున్నారు ... దేశవాసులందర్నీ ఆకట్టుకుంటున్నారు...

అంతెందుకు ఒకప్పుడు క్రికెట్ కామెంటరీ అంటే ఆకాశవాణీనే అనేవాళ్ళు ... ఇప్పటికీ దృశ్యం కోసం TVని వాడుతున్నా, రేడియో ద్వారా కామెంటరీ వింటూ వుండే వాళ్ళు ఎక్కువ... పల్స్ పోలియో, మశూచి లాంటివి లేకుండా నువ్వు నిర్వహించిన పాత్ర జగద్విదితం ... పల్స్ పోలియో మాట విన్పించిందంటే చాలు ఆకాశవాణిగా నువ్వు గుర్తొస్తావు ఎప్పటికీ.

నాకు తెల్సిన నిజం అవునో కాదో చెప్పవా! హైదరాబాద్ సంస్థానంలో 1935 ఫిబ్రవరి 3న దక్కన్ రేడియో ప్రసారాల్ని మీర్ ఉస్మాన్ అలీఖాన్ (7వ నవాబ్) ప్రారంభించారట కదా! External Services ని భారతదేశం నుండి 'పుస్తో' భాషలో ప్రారంభించారు. జర్మనీ, అఫ్ఘానిస్తాన్, పెర్షియా, అరబ్ దేశాలను 1939లో ప్రారంభించారు. అలాగే ఫిలిప్పీన్స్, ఇండోనేషియా, మలేషియా, సింగపూర్, థాయ్‌లాండ్, బ్రూనె, వియత్నాం, లావోస్, మయన్మార్, కాంబోడియా దేశాల కోసం సాయంకాలం 5.45 నిముషాల నుండి 6.15 వరకు అంటే 30 నిముషాల పాటు వివిధ భాషల్లో సాగే ESD కార్యక్రమాలకు ఎంతో మంది విదేశీ అభిమానులు ఇప్పటికీ ఉన్నారు. అదొక జాతి చరిత్రగా మలచిన ధీశాలివి నువ్వు.

అన్నట్టు ఈ సంవత్సరం గాంధీగారి 150 వ జయంతి... జాతిపితగా దేశవాసుల హృదయాల్లో చెరగని ముద్రవేసిన మహాత్మాగాంధీ గారు ఒకే ఒక్కసారి 12th Nov 1948 లో ఆకాశవాణి ఢిల్లీ కేంద్రం నుండి జాతినుద్దేశించి మాట్లాడారు ... మనోధైర్యాన్ని పెంచుతూ, సహానుభూతిని పంచుతూ సాగిన వారి ప్రసంగం ఎప్పటికీ గొప్ప స్ఫూర్తిని కల్గిస్తూ వుంటుంది. అందుకే కదా ఆ రోజునే ప్రజాసేవా ప్రసార దినోత్సవంగా జరుపుకుంటున్నాము. 'గాంధీ మార్గం' పేరుతో కొన్ని తరాల్ని సన్మార్గంలో నడిపిస్తూ సాగుతున్న ప్రసంగాలు, అలాంటి హితోక్తులు ఎప్పటికీ ఆచరణీయాలే కదా!.

అసలు నీ ప్రసారాలు ప్రారంభం కావటానికి ముందు విన్పించే signature tune ఎంత పాపులరో తెల్సా, 1936 లో జెక్ దేశానికి చెందిన జుయిష్ రెఫ్యూజీ వాల్టర్ కఫ్ మెన్ శివరంజని రాగంలో స్వర పరిచిన తాన్పురా, వయోలా, వయొలిన్ ల కలయిక యిది.

అయినా రేడియో ! కులం, మతం, భాష, ప్రాంతం వంటి బేధాలు ఏవీ లేకుండా దేశంలోని పండుగలన్నింటినీ పాటించే నువ్వు దేశ సమగ్రత, సమైక్యతల కోసం జీవితం మొత్తం పాటుపడుతూనే ఉన్నావు ... ఎవ్వరికి ఏ అవసరం

వచ్చినా దేశ ప్రజలందరితో మనసులోని మాటను, పంచుకోవాలంటూ వాహికగా ఉపయోగపడింది నువ్వేగా ... ఇందిరాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి గారు ... నేటి మన ప్రధాని నరేంద్ర మోదీ గారి వరకూ ప్రజలకు ఉపకరించే అంశాల్ని ప్రకటించేది నీ ద్వారానే కదా ...

అయ్యో మర్చిపోయాను నా సస్యవాణీ ! పల్లె సీమలు, పాడి పంటలకు నువ్విచ్చిన చేయూత మరెవ్వరూ చేయలేరు. హరిత విప్లవ పితామహుడు నార్మన్ బోర్లాగ్ కొత్త వంగడాలను భారత్ లో ప్రవేశపెట్టాలని చూసినప్పుడు ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ గారు, కేంద్ర వ్యవసాయశాఖామాత్యులు సుబ్రహ్మణ్యం గారు, ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి గారి ఆమోదంతో ఆకాశవాణిని ప్రధాన భూమికగా ఎంచి రైస్ బ్రీడ్స్ ని పరిచయం చేసిన విషయం గుర్తుందా నీకు. ఆ వంగడం పేరు తెలియని రైతులు 'రేడియో రైస్' ఇవ్వమంటూ సీడ్ కంపెనీల చుట్టూ 'క్యూ' కట్టేలా చేసింది నువ్వే కదా! నిరక్షరాస్యులైన రైతులకు వంగడాల పేర్లు నోట్లో నానలేదు కానీ తెల్సిందల్లా 'రేడియో' అన్న విశ్వాసమే. గెల్చిందల్లా మంచినే చెప్తుంది 'మా రేడియో' అన్న నమ్మకమే. మొత్తానికి 'రేడియో రైస్' అంటూ కొత్త బ్రాండ్ ని క్రియేట్ చేశావు కదా నువ్వు ....

మా తాతయ్య ఇప్పటికీ చెప్తూ ఉంటాడు తెల్సా ... నీ లైసెన్స్ బుక్, బ్యాంక్ పాస్ బుక్ లా వుండేదట...దాన్ని పట్టుకుని post office కి వెళ్ళి రేడియో వినటానికి డబ్బులు కట్టి వచ్చేవారుట... అంటే ఇప్పుడు TV ప్రసారాలు చూడటానికి నెలనెలా మనం pay చేస్తున్నట్టు అన్నమాట .

నీ ద్వారా ఎందరో ఎంతో ప్రముఖ స్థానానికి వెళ్ళిన వాళ్ళున్నారు ... అంతెందుకు దేశంలోనే మొదటిసారిగా తెలుగులో visually challenged person వెంకటేష్ ని రేడియో జాకీ గా మార్చింది మన హైదరాబాద్ FM RAINBOW కే కదా. అందులో మా ఆకాశవాణి ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ వసుమతిగారి పాత్రను మరువ గలుగుతామా? అలా నీ ద్వారా ఎంతో మంది ఉద్యోగాలు సాధించారు ... ఎన్నో కుటుంబాలకు నువ్వొక ఆత్మీయ మిత్రునివి ...

ఇక వ్యాపార వాణిజ్య రంగాల వారు మార్కెట్ విస్తరణ కోసం ఎప్పుడూ నిన్నొక వాహికగా వాడుకుంటుంటారు. కమర్షియల్స్ కోసం నువ్వు పెద్దగా పాకులాడింది లేదు కానీ సేవా నిరతితోనే పనిచేస్తున్నప్పటికీ ఎన్నో వ్యాపార సంస్థలు ఎక్కువ భూభాగాన విస్తరించేది నీ ద్వారానే. అయితే ప్రజల్లోకి తమ ఉత్పత్తులు బాగా వెళతాయని ఎప్పుడూ నిన్నే ఎంపిక చేసుకునే వారు. ఇప్పుడు కమర్షియల్స్ కాస్త తగ్గినప్పటికీ నీ స్థానం నీదే కదమ్మా ... నామ, రూప, భావ తత్వాలను బట్టే వైవిధ్యంగా, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ ప్రసారాలు అందించే హితభాషిణివి నువ్వు...

ఓ నా స్వర విహంగమా! నాకు నీ రూపాల్లో బాగా నచ్చేది నీ సేవా నిరతి. పబ్లిక్ యుటిలిటీ రేడియోగా నువ్వు అందించే సేవలు నిరుపమానం. ప్రకృతి వైపరీత్యాలలో నువ్వు పోషించే పాత్ర అత్యంత ప్రజాదరణ పొందింది. అగ్ని ప్రమాదాలు, వరదలు, తుఫానులు, భూకంపాలొచ్చినప్పుడు, ఉగ్ర ముప్పులు కలిగినప్పుడు నువ్వు చేసే కృషి, ఇచ్చే మనో ధైర్యం వేనోళ్ల పొగిడినా తక్కువే.

ట్రైన్, ఫ్లయిట్ టైమింగ్స్, ట్రాఫిక్, మార్కెట్ ధరలు, ఎప్పటికప్పుడు కలిగే చీడపీడల నివారణలు, వాతావరణ మార్పుల వల్ల వచ్చే వ్యాధుల గురించి ఎప్పటికప్పుడు నువ్వందించే సమాచారం ప్రజలకెంతో ఉపయోగకరం... అంతెందుకు నువ్వందించే చర్చా కార్యక్రమం, రేడియో అనుసంధాన కార్యక్రమాలు, ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాల ద్వారా ఎప్పటికప్పుడు విషయ సమాచారం దొరుకుతుంది... న్యాయ సలహాలు, డాక్టర్ సలహాలను వింటూ వారితో ప్రత్యక్ష ప్రసారంలో నేరుగా మాట్లాడే అవకాశం దొరకడం వల్ల ఎంతో మంది ప్రజలకు ఉపయోగ సమాచారం దొరుకుతుంది .... తిరుమల బ్రహ్మోత్సవాలు, భద్రాద్రి కళ్యాణోత్సవాలు, శ్రీశైల బ్రహ్మోత్సవాలు వింటే రేడియోలోనే వినాలి అనేంతగా ప్రజల ఆదరణ చూరగొంది నువ్వేగా ...రాముల వారి కళ్యాణాన్ని ఊరూరా మొత్తం వినేలా మైకులు పెట్టి మరీ ప్రసారం చేస్తారు దేవాలయ కమిటీలు, ఎలక్షన్ బులిటెన్ లు, వార్తా వాహినులు నీ ద్వారా వస్తూ ఎలా

విశ్వసనీయాలో అందరికీ తెల్సు...

సంక్షిప్త శబ్ద చిత్రాల ద్వారా, పరిచయ కార్యక్రమాల ద్వారానే కాకుండా నిరంతరం చిత్రసీమ ద్వారా చిత్ర జగత్తుకి ఎనలేని సేవ చేసిన 'ప్రజావాణి' ఆకాశవాణే ... ఇప్పటికీ కొంత మంది వృద్ధులు రేడియో పాటల ద్వారా ఆయా సినిమాలు ఇంకా బ్రతికున్నాయి అంటుంటారు ... అంతేకాదు, బాగా బతికి చితికిన చిత్ర నిర్మాతకి పాటల రెమ్యూనరేషన్ ద్వారా చన్నీళ్ళకు వేన్నీళ్ళ సాయంగా ఆర్థిక సహాయాన్ని అందిస్తూ వారికి భరోసాని కల్గిస్తున్నావు...

అసలు విషయం చెప్పటం మరిచాను ... లలిత సంగీతం పుట్టింది నీలోనే కదా ... బెంగాలీ రబీంద్ర సంగీత్, సుగమ్ సంగీత్ ల ప్రస్థానం నీ ద్వారానే జరిగింది. స్వాతంత్ర దినోత్సవ సంబురాలు, రిపబ్లిక్ ఉత్సవాలు యివన్నీ ఊర్లలోని మైకుల ద్వారా ఊరు ఊరంతా వినేలా చేసే అభిమానులు ఎంతో మంది ఇప్పటికీ వున్నారు ...

విలువైన వ్యక్తుల ప్రసంగాలను, రూపకాలను, నాయకుల సందేశాలను స్వర భాండాగారంలో భద్ర పరచటం ద్వారా దేశంలో ఎక్కడా లేని విలువైన వ్యక్తుల స్వరాలను వినే అవకాశాన్ని భవిష్యత్ తరాలకు అందించిన గొప్పతనం నీది. ఇప్పటికీ ఏ కార్యక్రమం చేయాల్సి వచ్చినా మరుగున పడిన అంశాలను, కాలగర్భంలో కల్సిపోయిన మనుష్యుల స్వరాలను నీ నుండే కదా తిరిగి పొందగల్గుతున్నాం...

అవును, సాయుధ పోరాట జవాన్ల కోసం దశాబ్దాల క్రితం వరకు ఒక రేడియో చంక్ 'జయమాల' వివిధ్ భారతిలో ఏర్పాటు చేశారు కదా ... ఎంత గొప్పగా అన్పించిందో తెలుసా ... ఎప్పుడూ దేశ సేవలో నిరంతరం మునిగితేలే జవాన్లకు వినోదాత్మక కార్యక్రమాలు అందించ గలగటం ఎంత గొప్ప గుణం ?

అంతే కాదు మరో దేశం కోసం ఒక దేశం రేడియో ఛానెల్ ని నడపటం అన్నది కూడా మన భారతదేశమే ప్రారంభించింది ...'రేడియో బంగ్లా' అంటూ బంగ్లా దేశం కోసం ఒక రేడియో అందించాం మనం అంటే గర్వంగా ఉంది సుమా! హిందుస్తానీ, కర్ణాటక సంగీతాల కోసం 'రాగ' అనే ప్రత్యేక చానల్ ని కూడా నిర్వహిస్తుండటం నీకే చెల్లింది. ప్రపంచంలోనే దాదాపు 100 శాతం భూభాగాన్ని చేరగలిగే ఒకే ఒక్క ప్రసార వ్యవస్థ ఉన్న దేశం మన భారతదేశం అన్నది ఎంత మందికి తెల్సు చెప్పు ... నీ మాటకచ్చేరీలు వినటానికి శ్రోతలకు వెదికే అవసరం లేదు. పొలాలైనా, ఇల్లైనా, వాకిలైనా, కాలేజీలైనా, బ్యారేజీలైనా ప్రాంతాలు, భాషలు అన్న బేధం లేకుండా అందరికీ స్వరామృతాన్ని పంచుతుంటావు.

ప్రతిరోజూ ఉషోగీతానివై ఉదయిస్తూ నిస్తంత్రుల వేడుకల మధ్య ప్రాతః కాల పరివర్తనకు ఆది నర్తనం చేస్తావు. అంతెందుకు, నువ్వు పుష్పక విమానంలా మారి కన్యాకుమారి నుండి శ్రీనగర్ వరకు ప్రతి రాష్ట్రంలోనూ ఆయా రాష్ట్రాల భాషల్లోని కవుల కవితల్ని వింటూ వాటికి 23 భాషల్లోని అనువాదాలను పలికిస్తూ ప్రతి సంవత్సరం జనవరి 25న రాత్రి 10 గంటలకు నువ్వు ప్రసారం చేసే సర్వ భాషా కవిసమ్మేళనాన్ని మించిన సాహితీ ప్రస్థానం మరొకటి వుంటుందా నా స్వర భామినీ! అందుకే అంటుంటాను .... మైసూరుకు చెందిన గోపాలస్వామి గారు నీకు ఆకాశవాణి అని సరిగ్గా పేరు పెట్టారని ... అందరూ మెచ్చేలా అందరికీ నచ్చేలా, నిన్ను నీవు తీర్చిదిద్దుకున్న తీరు ప్రశంసనీయం.

ఓ నా స్వరాకాశమా ! రెండో ప్రపంచ యుద్ధ కాలంలో కూడా రేడియోని ఉపయోగించారు. అలా ఆశ్చర్యపోకమ్మా ! నీకు తెలియని కొత్త విషయాలు నా దగ్గరేముంటాయి ఇప్పటి రేడియో కాదులే అది. ఇద్దరు సిపాయిలు కానీ ఇద్దరు అధికారులు కానీ మాట్లాడుకోవటానికి వీలుగా 1 + 1 సెట్ లాగా వుండేది... దాన్ని చూసే మార్కోని రేడియోని రూపొందించాడంటారు...

1895 లో మార్కోని అంటే ఇటలీ అతను రేడియోను కనిపెట్టాడని చెప్తారు కానీ 1895 మే 7 న రష్యన్ శాస్త్రవేత్త

అలగ్జాండర్ పోపోవ్ బ్రాడ్ కాస్టింగ్ పద్ధతిని కనిపెట్టాడని అంటారు కదమ్మా ... 1921 లో రేడియో ప్రసారాలు ప్రపంచానికి పరిచయమయ్యాయి అంటారు కదా. 1923లో బాంబే ప్రెసిడెన్సీ రేడియోని ప్రారంభించిందని, 1924లో మద్రాసులో రేడియో క్లబ్ ఒకటి స్థాపించడంతో ప్రారంభమైనప్పటికీ అనతి కాలంలోనే గిట్టుబాటు కాకపోవడంతో మూసేశారని, ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ ద్వారా బాంబే, కలకత్తా కేంద్రాలు ప్రైవేటుగా ప్రారంభమై 1930 ఏప్రిల్ 1వ తేదీ నుండి దాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ సర్వీసెస్ గా ప్రారంభమయ్యాయి కొత్తగా .... అబ్బా నాకు తెలుసు 1936 జూన్ 8 నా ALL INDIA RADIO గా నువ్వు అవతరించావని....

వాయిస్ ఆఫ్ అమెరికా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 40 పై భాషల్లో కార్యక్రమాలను ప్రసారం చేస్తుంది .. దాదాపు 10 కోట్ల మంది పై చిలుకు ఈ కార్యక్రమాలను వింటారని ఓ అంచనా ... ఇక BBC గురించి చెప్పాల్సిన పనే లేదు ... 24 గంటలూ వార్తలను 40 భాషల్లో ప్రసారం చేసే విశ్వసనీయ వార్తా విభాగం మాస్కో రేడియో స్వర నిక్షేప విభాగంలో 'లెనిన్' లాంటి పెద్దవారి కంఠస్వరాలు ఇంకా ఉన్నాయి... టాల్ స్టాయ్, యూరిగగారిన్, గోర్కీ, మెల్కో విస్కీల గొంతులు వున్నాయిట ... ఎడ్వర్డ్ గ్రిగ్, సెర్గీ రఖ్, మానినోవ్ పియానో సంగీతపు టేపులు వున్నాయిట ...

సంగీతం అంటే గుర్తొచ్చింది ... నీ ముందు కూర్చుని పాడటం ఓ గౌరవంగా భావిస్తారు సంగీత కళాకారులు ... సంగీత సమ్మేళన కార్యక్రమాలకు శ్రోతలు ఎంత ఉత్సాహంగా హాజరవుతారో కళాకారులూ అంతే ఆసక్తిగా పాల్గొంటారు... ఈనాడు లబ్ధ ప్రతిష్టులైన ఎంతో మంది సంగీతజ్ఞులు అలా నీనుండి వచ్చిన వారే కదా... ఒక ప్రాంతపు కళను మరో ప్రాంతానికి పరిచయం చేస్తూ దేశం మొత్తం మీద నిబద్ధతతో నిశ్శబ్ద సంగీత విప్లవాన్ని సాధించేది నువ్వు కాక మరెవరమ్మా ...

బాల వినోదం, బాలానందం కార్యక్రమాల్లో చిన్నప్పుడు మేమూ పాల్గొన్నామని ఎందరో ఇప్పటికీ గొప్పగా చెప్తుంటారు ... ఆనాటి చీఫ్ సెక్రెటరీ మోహన్ కందా గారు ఎన్నో మార్లు ఈ సంగతి చెప్పారు కదమ్మ. రేడియో నాటకాల్లో పాల్గొనాలని ఆశపడ్డానని – అక్కినేని గారు ఎన్నో ఇంటర్వ్యూలలో చెప్పారు ... శారదా శ్రీనివాసన్‌గారికి అభిమానులమని ఎందరో సినీ ప్రముఖులు చెప్పిన విశేషాలు ఎన్నో మార్లు విన్నాం .... అప్పటికీ ఇప్పటికీ చెక్కు చెదరని రేడియో నాటక ప్రియులు నీకు ఉన్నారంటే ఎంత గొప్పగా వుందో తెల్సా ...

ఓ నా సహస్ర గళార్చనమా ! ప్రతి గుండెను పలకరిస్తూ – ప్రతి మనసును స్పృశిస్తూ మౌనాన్ని ఛేదిస్తూ, నువ్వు మాటల మంత్రాక్షరం పాడుతుంటే వినటానికి వేల చెవులు సరిపోక లక్షల మనసుల్ని అప్పుతెచ్చుకోవాలనిపిస్తుంది ... మా ఆకాంక్షలకి రెక్కలు తొడుగుతూ జనవాణిగా శ్రోతల నాడిని పట్టుకుని కార్యక్రమాల సరళిని మారుస్తూ స్వరమే సర్వస్వంగా, స్వరమే స్వర్ణ సోపానంగా నువ్వు చేసే శతావధానం ప్రతిరోజూ మాకు ఆనందదాయకమే ... నీ గళ రాగలహరిని గమనించినప్పుడల్లా తన్మయ చప్పట్లతో ఎన్నోమార్లు మనసులోనే అభినందిస్తుంటాము ...

భాషని అర్థ శబ్దాలంకారాలతో తీర్చిదిద్ది, భావాల ఆభరణాలతో అలంకరిస్తూ, సందర్భం సన్నివేశాలకు అనుగుణంగా దృశ్యానికి తగిన భావోద్వేగాల కాటుకను దిద్దుతూ నువ్వందించే నాటికలు, నాటకాలు, రూపకాలు, డాక్యుమెంటరీలు మాకెప్పుడూ శ్రవణానందమే... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రసార వ్యవస్థగా 26 భాషల్లో నిరంతర కార్యక్రమాలతో స్వరమే నీ జీవంగా, జీవన కారణంగా మారినందుకు బహుజన హితాయ, బహుజన సుఖాయ అంటూ ప్రజలందరి ఆత్మ బంధువుగా విజ్ఞాన వినోదాల్ని అన్ని వర్గాలకు పంచుతూ అలరిస్తుంటే వినటానికి రెండు చెవులూ చాలనట్టే, పొగడటానికి మా ఒక్క నోరూ సరిపోదు...

ఎన్నో దశాబ్దాలుగా నువ్వొక పెద్ద సెలబ్రిటీవి ... నీకున్నది గ్లామర్ కన్నా ముఖ్యమైన గ్రామర్ ... అది మాకందరికీ ఎంతో గొప్ప గౌరవప్రదం. స్వర విహంగమై ఎగురుతూ, స్వర ఝరివై కదులుతూ, స్వర లిపిగా మిగులుతూ, స్వరాకాశంగా ఎదిగిన నీకు ఏమిచ్చి ఋణం తీర్చుకోగల్గుతాను ? గాలి నుండి మా గుండెల్లోకి ఆకాశవాణిగా కురిసే నీ స్వరధారను గుండెలనిండా నింపుకున్నా తృప్తి తీరక వంటి నిండా పులుముకుంటూ నీ నుండి వచ్చే శబ్దమే సరస్వతీ స్వరంగా భావిస్తూ నిత్యం నీ అర్చన చేస్తుండే అభిమానులం మేము .... ఇప్పటికే కాదు ఎప్పటికీ మా తరతరాలు నీ అభిమానులుగానే సాగాలని కోరుకుంటున్నా ...

వుండనా మరి..

నీ

– సతీష్

# మ్రోగింది కళ్యాణ వీణ

పద్మా!

నిన్న నీ ఫోన్ వచ్చిన దగ్గరనుండి నేనెంతో మధనపడుతున్నాను. పెళ్లి అంటే అంత చిన్న చూపు నీకుంటుందనుకోలేదు. నీ ఫ్రెండ్ జీవితంలో ఏదో జరిగిందని..అందరికీ అలాగే ఉంటుందనుకోవడం సరికాదు తల్లీ. అబ్బా...ఈ తంతు అంతా ఏమిటి.. ఇందర్ని పిలవాలా.. ఇన్నేసి గంటలు కూర్చోవాలా.. ఇన్ని లక్షల ఖర్చులా – అంటూ నువ్వు మాట్లాడుతుంటే ఎంతో నవ్వొచ్చింది. మరి నీ చిన్నప్పుడు పెద్దక్క పెళ్ళికి పట్టు పావడా, జడగంటలు వేసుకుని అన్ని రోజులూ.. రోజుకో రకంగా తయారవటం నువ్వు మర్చిపోయావా. మన బంధువులు అందరితో ఎంతో ముద్దుగా, ప్రేమగా ఉండి ఎంత గొప్ప పేరు తెచ్చుకున్నావో గుర్తులేదా.. ఒక తరం వెళ్ళిపోయినా మరో తరంతో అనుబంధాలు, ఆత్మీయతలు ఉండేది ఆ రాకపోకల వల్లే కదా. అక్కయ్య పెళ్ళికి ఏ హడావిడి లేకుండా ఎంత బాగా చేశామో తెలుసా, పక్కా ప్రణాళిక ఉంటే చాలు ఏ ఇబ్బందీ అనిపించదు.

మన దేశం మహోన్నత ప్రాచీన సంస్కృతికి జన్మస్థానం. అలాంటి అత్యున్నత సంస్కృతికి మూలం, ఆచారం సంప్రదాయం. ఆచార సంప్రదాయాలకు ఆలంబనం మన సమాజం. మన సామాజిక వ్యవస్థకి పునాది, కుటుంబం. ఆ కుటుంబానికి తొలి సోపానం వివాహం. అంటే 'వివాహం' కుటుంబానికి, సమాజానికి, సంప్రదాయానికి, సంస్కృతికి, ఆఖరికి మన దేశానికి కూడా ఆధారం. అందుకే భారతీయ జీవన విధానంలో వివాహానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. వివాహం, కళ్యాణం, పెళ్లి, మనువు, మ్యారేజ్, షాదీ, నిఖా ఇలా ఏ పేరుతో పిలిచినా, ఏ పదంతో కొలిచినా దీని అంతరార్థం ఇద్దరు స్త్రీ పురుషులని సామాజికంగా ఒకటి చేయటమేనని నీకూ తెలుసు. ఈ 'ఒక్కటి చేయడం' నుంచే వంశాభివృద్ధి, కుటుంబ ప్రగతి, జాతి పురోగతి కూడా సాధ్యమవుతుందనే సత్యం కూడా ఇందులో దాగి ఉంది.

అందుకే మన జీవన శైలిలో 'వివాహం' అత్యంత ప్రముఖమైన ఉత్సవంగా గుర్తింపు పొందింది. అయితే ఈ ఉత్సవం మూడు రకాలుగా మనకు సంబరాన్ని తెస్తుంది...

వ్యక్తిగత ఉత్సవంగా.. వివాహం అంటే ఇద్దరు విభిన్న వ్యక్తుల వ్యక్తిత్వాలను మమేకం చేస్తుంది.

కుటుంబ ఉత్సవంగా.. వివాహం అంటే రెండు భిన్నమైన నేపథ్యాలు గల కుటుంబాల మధ్య కొత్త బంధుత్వాన్ని రూపొందిస్తుంది.

సామాజిక ఉత్సవంగా.. వివాహం అంటే సమాజంలోని అన్ని రకాల వ్యక్తులు, కుటుంబాల మధ్య అవినాభావ సంబంధాలకు, సుహృద్భావ అనుబంధాలకు ఒక చక్కని వేదికని అందజేస్తుంది.

అలాంటి వివాహానికి సన్నద్ధం కావటం అనేది వధూవరులు ఇరువురికే కాకుండా.. వధువు తరపు వాళ్లకి, వరుడి తరపు వాళ్లకి కూడా ఓ బృహత్ కార్యమే అని చెప్పాలి. ఇంకా చెప్పాలంటే వివాహం అనేది ఒక భారీ ప్రాజెక్టు అనీ, ఇది ఒక నిర్దిష్టమైన విజన్ తో mission లా చేయాల్సిన కార్యమనీ తేటతెల్లమవుతుంది.

ఈ వేడుకను మొత్తం ఏడు భాగాలుగా లేదా దశలుగా విభజించుకోవచ్చని గమనించు. అవి పెళ్లిచూపులు, నిశ్చితార్థం, సంగీత్, వివాహం, అప్పగింతలు, రిసెప్షన్, శోభనం. ఇవన్నీ కలగలిసిన సంబరమే వివాహం. పెళ్ళంటే ఒక్కరోజని అనుకోవడం అవివేకం. దేనికవి విడిగా భావిస్తే మనం పప్పు కాదు తప్పులో కాలేసినట్టే.

రెండు కుటుంబాల మధ్య ఆర్థిక స్థాయిలు, సాంప్రదాయాలు, మర్యాదలు, పోకడలు, ఔన్నత్యాలు ఇందులో మిళితమై ఉంటాయి. విందు భోజనాలు, ఊరేగింపులు, పెళ్లి పందిరి, కట్నకానుకలు, చీర సారెలు, బాజా భజంత్రీలు, పైకి కనిపించేవిగా అనిపించినా అంతర్గతంగా చెయ్యాల్సినవి ఎన్నెన్నో... రేపటి మన కుటుంబపు స్థాయేంటో ఈనాటి వివాహాన్ని బట్టి సమాజం నిర్ణయిస్తుంది. కాబట్టి వివాహన్ని మించిన సెలబ్రేషన్ మరొకటి కనిపించదు. అందుకే ఆహ్వానితుల జాబితాలు రూపొందించుకున్నాక, షాపింగ్ అంటూ కేటాయించుకున్నాక, జ్యువెలరీ, మేకప్ ఎలా ఉండాలో ఆలోచించుకున్నాక అమ్మాయికీ, అబ్బాయికీ తగిన అలంకరణలు, ఆహ్వాన పత్రాలు, దుస్తులు మొదలైనవి సెలెక్ట్ చేసుకుంటారు. మరి మనమేం చేశాం. అతిథులకు ఇవ్వాల్సిన చీరల కోసం గద్వాల, పోచంపల్లి, కంచి, ఓల్డ్ సిటీ కి వెళ్లి కొన్ని కొన్ని వస్తువులు దఫ దఫాలుగా ఎన్నుకొని తెచ్చుకున్నాం.

పెళ్ళిచూపుల విషయానికొస్తే, ముఖాముఖి చూసుకున్నా, ఆన్లైన్ లో చూసుకున్నా ఇవి వధూవరులకి పరస్పర తొలి పరిచయాలు. మొగ్గ తొడగాల్సిన ప్రేమకి ఆనవాళ్ళు. కళ్ళతో మొదలై మనసు లోకి దూసుకెళ్ళే అనురాగ పరిమళాలు... ఆ రోజున అక్క, ఇంట్లో ఎంత సహజంగా ఉంటుందో అలాగే అలంకరించాము.

నిశ్చితార్థం సంగతంటారా, వధూవరుల మధ్య కొత్త అనుబంధానికి, బంధుమిత్ర సపరివార సమేతంగా అందరూ తెలిపిన అంగీకారం. నాకు నువ్వు–నీకు నేను అనే పరస్పర స్నేహ స్ఫూర్తికి నిలువుటద్దం. ఆడపిల్ల వాళ్ళ స్థాయి ఏమిటో, వాళ్ళ మర్యాదలేమిటో తొలిసారిగా చెప్పే వేడుక ఇది.

ఇక వధూవరుల కుటుంబాల మధ్య సంగీత్ అనేది ఒక సంబరాల బారాత్, ఉత్సవం, ఉత్తేజం, పాట, సయ్యాట, చిందాట కలగలిసిన ఉల్లాస క్షణం.. ఉద్వేగ వీక్షణం. ఈ సంబరంలో డాన్స్ అనేది ప్రత్యేకం కాబట్టి దాని కోసం ప్రత్యేక అలంకరణ అవసరం, జాగ్రత్త అత్యవసరం.

మరి వివాహం విషయానికి వస్తే, వధూవరులిద్దరూ ఒంటరి జీవితానికి స్వస్తి చెప్పి జంట జీవితానికి చుట్టే శ్రీకారం! ఒకరికోసం ఒకరు, ఒకరిలో ఒకరు, ఒకరితో ఒకరు కలిసి చేసే సహజీవనం !! మనిషి పుట్టుకలోని అసంపూర్ణతని సంపూర్ణం చేసే దాంపత్యానికి వివాహం ఓంకారం. సాహచర్య జీవనానికి ప్రాకారం.

విశిష్టమైన ఈ ఘట్టంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ముందుగానే బ్రైడల్ మేకప్ చేయించాలి. నప్పుతుందో లేదో సరి చూసుకోవాలి. అక్క పెళ్లి గుర్తుందా! ఇప్పుడు రూపాయి బిళ్లంత ఉంగరాల ఫ్యాషన్ కాబట్టి, తలంబ్రాలు పోసుకునేటప్పుడు కూడా చక్కగా కనిపిస్తాయని బంగారంతోనే చేయించాం. అమ్మమ్మ చీరతోనే వేదిక మీదకి వెళ్ళాలనేది ఒక ఆచారం మన ఇంట్లో ఉంది కాబట్టి, అమ్మమ్మ కంచి నుంచి పట్టుచీర తెప్పించి ఆరు నెలల ముందుగానే పెద్దమ్మకి ఇవ్వటం వలన ఆ చీరని ఓల్డ్ సిటీలో చక్కని వర్క్ చేయించింది. పెళ్లి మంటపం మీద తలంబ్రాలకు తెల్ల చీర వాడతాం కాబట్టి, ఈ చీర గోల్డ్ స్పాట్ కలర్ కావటం వలన కాంట్రాస్ట్ కలర్స్ గా బ్లౌజ్, జంక్ జువెలరీ నప్పాయనిపించింది.

అప్పగింతలు...అక్షతల సాక్షిగా, ఆహూతుల ఆశీర్వాదాల సాక్షిగా వరుని ఇంటి పేరే వధువు ఇంటి పేరుగా మారే దశలోని ఉద్విగ్న వీడ్కోలు! కన్నవారి కన్నీళ్ల నేపథ్యంలో వధువు కొత్త కలలను ఆవిష్కరించుకునేటందుకు వేసే తొలి అడుగులు!!

రిసెప్షన్ సంగతి చెప్తా, ఊరేగింపు ద్వారా ఊరికి ఎరిగింపు చేసే వరుని ఇంటి ఇన్విటేషన్ ఇది. టెన్షన్నీ, అటెన్షన్నీ కలిపి వధూవరుల జీవితకాలపు రిటెన్షన్ కి ఇంటర్వెన్షన్స్ లేని ఇన్వెన్షన్ ని ఆవిష్కరించే సెలబ్రేషన్ ఈ రిసెప్షన్.

ఇక శోభనం విషయానికొస్తే.. శోభాయమానమైన, వధూవరుల మధ్య సమాగమ వైభవానికి, సంగమ సంరంభానికి ఆరంభం! కుటుంబ యజ్ఞానికి అది ప్రణవనాదం, ప్రణయ రాగం! జీవ ధర్మానికి, సృష్టి కార్యానికి తొలికిరణం!! ఈ వేడుకని హోటల్లో నిర్వహించడం చేస్తుంటారు, కానీ మేము మన పెద్దవారి ఇంటి మిద్దె మీద ఏర్పాటు చేశాం.

అయితే, ఈ సామూహిక సంబరాల్లో, అంబరాన్ని అంటే ఆనందాల్లో కొన్ని విషయాలు మర్చిపోకూడదు. అవేంటంటే... ఆర్గంజీ క్లాత్ తెప్పించి ముందుగానే జిప్ వేసి సంచులు కుట్టించాలి. ఏ అకేషన్ కి ఏమేం కావాలో వాటిల్లో సర్దుకుని, పైన ఒక పేపర్ పెట్టి సందర్భం రాసుకోవాలి. చీర, జాకెట్, అండర్ గార్మెంట్స్, మేకప్ కిట్, జువెలరీ, నెయిల్ పాలిష్, కాళ్ల పట్టీలు, విడిగా ఒక బ్యాగ్ లో చెప్పులు, అన్నీ వేసి జిప్ పెట్టేసి సర్దుకోవాలి. గంజి మూలంగా బిరుసుగా ఉండే కొత్త petticoats చాలా ఇబ్బంది పెడతాయి. ముందుగానే వాటిని ఒక గంట నీటిలో నానబెట్టి, ఎండలో ఆరబెట్టి, ఇస్త్రీ చేసి పెట్టుకుంటే సౌకర్యవంతంగా ఉంటాయి. కొత్త చెప్పులు కరుస్తాయి కాబట్టి, కాస్త నూనె వంటిది రాసి, చూసి పెట్టుకోవాలి. జీలకర్ర బెల్లం బాగా దంచాలి. లేకపోతే పొడి పొడిగా ఉండి పీటల మీదే పడిపోతుంది. అది అశుభ సూచకంగా మనల్ని కలవరపెడుతుంది. కాసు, నల్లపూసలు, తాళి బొట్టు – కొబ్బరి చిప్పలో పెట్టి పైన తెల్ల బట్టతో కట్టి పెట్టాలి. సేఫ్టీ పిన్స్, సైడ్ పిన్స్, స్పిరిట్, పారాణి, బుగ్గన చుక్క కోసం బ్లాక్ టికిలీలు, బిందీల అవసరం తరచూ ఉంటుంది కాబట్టి హ్యాండ్ బ్యాగ్ లో వెంట ఉంచుకోవటం మంచిది.

ఇయర్ రింగ్స్ కి చాలా వరకూ స్క్రూలూజ్ గా ఉంటాయి. అలా జారిపోతూ ఇరిటేటింగ్ గా ఉంటై. వేడుకల్లో బరువుగా ఉంటే ఇయర్ రింగ్స్ పెడతాం కాబట్టి buttons ఉండేలా సరిచూసుకోవటం సరైనపని. గాజులు ఈ వేడుకల్లో చాలా అవసరం. పగిలే గుణం వీటికి ఎక్కువ కాబట్టి ఒక మంచి బాక్స్ లో వాటిని పెట్టుకోవడం మంచిది. గమ్ లేని స్టిక్కర్స్, ఆరిపోయే లిప్స్టిక్స్, కారే కాటుక, ఐ లైనర్స్, పట్టని గాజులు, ఇలా అన్నీ ఓ మారు చూసుకొని పెట్టుకోవడం ఎంతో అవసరం. ప్రతి వస్తువుకి ఓ స్టాండ్ బై వస్తువుని ఉంచుకోవడం చాలా మంచిది.

పాశ్చాత్య దేశాలకు భిన్నంగా మనదేశంలో మనిషి దశనూ, దిశనూ చెప్పటానికి జీవితాన్ని రెండు దశలుగా చెప్తాం. వివాహానికి ముందు, వివాహం తర్వాత అని. కాబట్టి జీవితకాలంలో ఒకే ఒక్కసారి జరిగే వివాహం విషయంలో ఎంతో జాగ్రత్త అవసరం. అమ్మాయి కుటుంబమే వివాహ వ్యవస్థలోని కీలక ఘట్టాల్లో లీడ్ రోల్ తీసుకుంటుంది కాబట్టి.. మరీ మరీ తరచి చూసుకొని అత్తింట్లో అమ్మాయికి ఎప్పుడూ 'మీ వాళ్ళు అలా చేశారు ఇలా చేశారు' అని దెప్పి పొడవడానికి ఆస్కారం ఇవ్వకుండా జాగ్రత్త పడాలి.

అయినా తల్లీ, అన్నీ చూసుకోవటానికి మేమంతా ఉన్నాం కదా. మంచిలో కానీ, చెడులో కానీ కుటుంబం బంధాలే మనల్ని ఆదుకుంటాయి. గుండెలకి హత్తుకుంటాయి. ఆసరాగా నిలబడగలుగుతాయి. ఇలాంటి వేడుకల్లో యువత సందడి ఎంత అవసరమో, పెద్దల మార్గదర్శకత్వం కూడా అంతే అత్యవసరం. పెద్దరికం కాలు మీద కాలు వేసుకుని ఓ కుర్చీలో కూర్చుంటే చాలు, పనులన్నీ వేటికవే జరిగిపోతూవుంటాయి. క్రమశిక్షణగా ఏ పని తర్వాత ఏ పని చెయ్యాలో వాళ్లకి తెలిసినంత వివరంగా మనకి తెలియదు. పైగా మన తరం కన్నా ఆ తరానికి ఓపిక ఎక్కువ. ప్రతి దాన్నీ ముందుచూపుతో చూసి ఉంటారు. పదిసార్లు సరి చేసుకొని ఉంటారు. వాళ్ల ముందు జాగ్రత్తని చాదస్తం అనుకోకూడదురా తల్లీ!

మనసిచ్చావ్, ఆ అబ్బాయితో నిండు నూరేళ్లు కలిసి బ్రతకాలి అనుకుంటున్నావ్. ఈ హడావిడి, ఆర్భాటాలు, పనులు, ఒత్తిడులు చూసి బెదిరిపోతే ఎలా? కానీ చాలా మంది దర్పం చూపించాలనుకొని విపరీతంగా ఖర్చు చేస్తుంటారు. అదంతా వృథా. వివాహాన్ని ఆడంబరానికి చిహ్నంగా మారుస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు పోటీ పడి అప్పులు సప్పులు చేసి ఆ తర్వాత వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడ్తున్నారు. మనకి ఎంత స్థాయి ఉందో ఆ స్థాయిలోనే చేసుకోవాలి. ఆడంబరం కన్నా అనుబంధాలు గొప్పవి. అందరినీ ఆత్మీయంగా పిలుద్దాం, ఆదరణగా చూద్దాం, అరిటాకు భోజనాలు వడ్డిద్దాం. సదాచారంగా పసుపు కుంకుమలతో తాంబూలాలు ఇద్దాం. దగ్గరుండి పలకరించి సంతోషంగా సాగనంపుదాం.

పెళ్లి నూరేళ్ల పంట. కోరుకున్న వాడి చెయ్యి పట్టుకుని రేపటి బ్రతుకు లోకి అడుగు పెట్టేందుకు, ఇరు కుటుంబాల పెద్దలు కలిసి చేసే ఒక కార్యక్రమం పెళ్లి. దాన్ని ఆస్వాదించండి.. ఆనందించండి.. అంతేకానీ విమర్శించకండి.. ఒక ప్రదర్శనగా చేసే తంతును నేనూ వ్యతిరేకిస్తాను. కానీ ఇది ఒక ఆత్మీయ కలయికగా భావించాలి. ఏ తల్లి చేతి గొప్ప ఎవరికి తెలుసు. పదిమంది మంచి తల్లుల ఆశీర్వచనం నీకు మేలు చేస్తుందని నమ్ముతున్నాను. తలంబ్రాల పేరుతో బియ్యాని వృథా చేయకుండా పూల రేకులు తెప్పించాను. అనాథ శరణాలయాలకు భోజనం పంపిస్తున్నాను. మన ఇంట్లో పెళ్లి పది మంది అన్నార్తులకు కడుపు నింపితే ఎంత ఆనందమో కదరా తల్లీ! పెళ్ళంటే సంబంధాల, అనుబంధాల, అప్యాయతల హరివిల్లురా బంగారూ!

జీవితాన్ని ఇప్పుడే మొదలెట్టబోతున్నావ్. నీ అత్తింటి వారికి మరో వంశాంకురాన్ని అందించే బృహత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టించేది వివాహమే. ఇద్దరి మనసులు కలిస్తేనే సరిపోదు. రెండు కుటుంబాలు కలవాలి. పెద్దల అనుమతి, అండ ఉంటే ఒడిదొడుకులు తగ్గుతాయి. భరోసా పెరుగుతుంది. ఆలోచించరా తల్లీ! మీ యువరక్తానికి ఓర్పు తక్కువ. ఎన్నెన్నో వందల యేళ్లుగా వస్తున్న ఈ వేడుకను కాదని జీవితంలో ఓ చక్కటి అనుభూతిని మిస్ చేసుకోకు.

మేమందరం నీ పెళ్లి కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం. అరవై యేళ్ళు దాటిన వాళ్ళందరూ కల్సి కబుర్లు చెప్పొచ్చనుకుంటున్నారు. ఇరవై యేళ్ళ వాళ్ళంతా సందడి సందడిగా గడపొచ్చని తపనపడ్తున్నారు. అన్ని వర్గాల వారిని, అన్ని వయసుల వారిని అలరించి, కన్నుల పండుగలా మార్చేసే సందడిని నీ పెళ్లి అందిస్తుంది. ఇట్స్ మై ప్రామిస్. చిన్న చిన్న వాటికే టెన్షన్ పడి మమ్మల్ని టెన్షన్ పెట్టకు.

పెళ్లి ఓ గొప్ప మలుపు...మనమూ వేడుకల్ని ఆస్వాదిద్దాంరా !

ఇట్లు<br>
మీ నాన్న<br>
– తేజ

# చలన దృశ్యం

ఓ నా తెలుగు సినిమా!

ప్రజల్ని ఆనందింప చేస్తున్న వినోదమా, ప్రపంచాన్ని శాసిస్తున్న అతి పెద్ద ప్రభావ మాధ్యమమా ! నిన్నెలా చూడను ? ఏమని పిలువను ? ఏదైనా నువ్వు మా జీవితంలో భాగానివి, సంస్కృతిలో అతి ముఖ్య అంతర్నేత్రానివి. అసలు నువ్వే లేకపోతే మానవ జీవితంలో ఇంత వికాసం జరిగుండేదంటావా ?

ప్రపంచంలో కోట్లాదిమందికి ఉత్సాహాన్ని అందించేది నువ్వే కదా ! నలుగురు కలిస్తే మాట్లాడుకునేదీ నీ గురించే. కలిసి-వెళ్ళి-చూసి సెలబ్రేట్ చేసుకునేదీ నీతోనే. నువ్వు అశేష జనావళిని ఐక్యం చేసే సాధనానివి మాత్రమే కాదు..ఎక్కువమందికి వినోదాన్నందించే వాహికవి కూడా! నీ గురించి వినీ, చదివీ, చూసీ – నీ మీద ఎంత ప్రేమని పెంచుకున్నానో తెలుసా.. ఆఖరికి నా పెళ్లి చూపుల్లో నన్ను చూట్టానికి వచ్చిన అబ్బాయి వారానికి రెండు సినిమాలు చూస్తాడని తెలిసి, వెనకా ముందూ ఆలోచించకుండా పెళ్లి చేసుకున్నానంటే, ఆలోచించు-నువ్వంటే నా కెంత ఇష్టమో! బహుశా మా పిల్లోడికి కూడా అదే వచ్చుంటుంది.

నువ్వు మా సృజనాత్మకతకి, సాంకేతికతకి పుట్టిన తెరేంద్రజాలానివి ! ఇరవై నాలుగు క్రాఫ్టులు కలగలిసిన సమగ్ర కళారూపానివి ! అందుకే కదా అశేష జనావళి నిన్ను ప్రేమిస్తుందీ, పూజిస్తుందీ. నిజం చెప్పాలంటే ఇప్పుడు నువ్వు మా నిత్యావసరానివి అయిపోయావు. కాల్పనిక ఊహా వికాసం నుండి పుట్టి శాస్త్రీయ పురోగతితో దృశ్య రూప డాక్యుమెంటరీగా ఎదిగిపోయావు.

నీకు తెలుసా, భారతీయ సినీ క్రిటిక్ మామిడి హరికృష్ణ గారు నీ గురించేమన్నారో, 'తెలుగు భాష, తెలుగు సాహిత్యం, తెలుగు సినిమా, అనేవి త్రిగుణాలుగా మారి వారధి, అంబుధి సారథులుగా సంస్కృతీ చక్రాన్ని నడిపిస్తున్నాయి, పరస్పర ఆధారిత సూత్రంతో సాహితీ అంబుధిని మధించడానికి భాషా వారధిపై సినిమా సారథిగా సాంస్కృతిక జైత్ర యాత్రను సాగిస్తున్నాయ'ని చెప్పారు. ఎంత గొప్ప విశ్లేషణో కదా!

1885లో లూమియర్ బ్రదర్స్ తొలిసారిగా సినిమాని కనిపెట్టినప్పటినుండీ...ఈ 134 సంవత్సరాల్లో నువ్వెన్నెన్ని మార్పులు చెందావో! 1921 లోని మూకీ యుగాల నుండి 1931 నాటి టాకీ యుగాల వరకూ, అంటే 'భీష్మ ప్రతిజ్ఞ' సినిమా నుండి 'భక్త ప్రహ్లాద' సినిమా వరకూ ఈ రెండు దశాబ్దాల్లో నీ ప్రస్థానం ఎన్నెన్ని ఒడిదొడుకులతో సాగిందో... బహుశా ఈ దేశంలో దాదా సాహెబ్ ఫాల్కే వంటి దార్శనికులు తీసిన తొలి సినిమా 'రాజా హరిశ్చంద్ర' లేకపోతే మన భారతీయ సినిమా రంగం ఇంత వేగంగా పురోభివృద్ధి చెంది ఉండేది కాదేమో...!

ఖండాంతరాల్లో ఉన్న తెలుగు వారందర్నీ కలిపేసే ఏకత్వ భావనని సృష్టించేది నువ్వే కదా ! కొట్టి పారేస్తాం గానీ, ఈ దేశాన్ని ఐక్యంగా ఉంచే సాధనాలు రెండేనట. ఒకటి సినిమా అయితే, రెండోది క్రికెట్. సినిమా పట్ల ఏకత, ఆట పట్ల మమత – ఇవే కదా మన దేశాన్ని నడిపించే ఐక్యతా మంత్రాలు ! అయితే సినిమా సంస్కృతి రూపొందడానికి ఎంత కాలం పట్టిందో, మాలాంటి మధ్య తరగతి మనిషి నీ నిర్మాణంలో పాలు పంచుకోవడానికి అంతే సమయం పట్టిందని గమనించాలి. నీకు తెలియనిది కాదుగా, తెలుగు సినిమా రంగానికి రఘుపతి వెంకయ్య ఎంత సేవ చేసారో. విదేశాల్నుంచి తెప్పించిన సినిమాల్ని టూరింగు టాకీసుల్లో ప్రదర్శిస్తూ సినిమాల పట్ల ఆసక్తిని కలిగించాడు. అది చూసి ఆయన వెంటే తిరుగుతున్న తన కొడుకు ప్రకాష్ చిత్ర నిర్మాణం పట్ల ప్రేమతో దేశ దేశాలూ తిరిగి తాను నేర్చుకున్న పరిజ్ఞానంతో 'స్టార్ ఆఫ్ ద ఈస్ట్' అనే నిర్మాణ సంస్థని స్థాపించి తొలి మూకీ చిత్రమైన 'భీష్మ ప్రతిజ్ఞ'ని తీశారు. చిత్రమేంటంటే దేశంలోనే తొలి టాకీ సినిమా 'ఆలం ఆరా' ని నిర్మించిన అర్దేశిర్ ఇరానీ తన ఇంపీరియల్ బేనర్ మీద దీన్ని నిర్మించారు.

నీకొక విషయం అర్థమైందా ఇక్కడ..మన తెలుగు వాళ్ళు నాటకాల పిచ్చి వాళ్ళు. సురభి నాటకాల్ని, పౌరాణిక నాటకాల్ని, వీధి భాగోతాల్ని ఊర్లకి ఊర్లే బండ్లు కట్టుకుని వచ్చి మరీ చూసి ఆనందించేవారు, కళాకారుల్ని ఆదరించేవారు. ఇదంతా చూసే కదా, తెలుగు వాళ్ళు రసహృదయులని, ఇక్కడ సినిమాకి మంచి మార్కెటింగ్ అవకాశాలు ఉన్నాయని గమనించిన ఉత్తర భారతీయుడైన అర్దేశిర్ ఇరానీ తెలుగు సినిమాని నిర్మించిందీ ! చూసావా, ఇప్పుడంటే నువ్వు బాలీవుడ్ తర్వాత దేశ చిత్రసీమని ఏలేంత స్థాయిలో ఉన్నావు గానీ, అప్పుడు తప్పటడుగుల్లోనే నీ ఘనతని గుర్తించిన మేధావి తానే కదా. నువ్వు మొదట్లో చెన్నపట్నంలో నెలవై, ఆ తర్వాత 1970 దశకంలో హైదరాబాద్ కు తరలి వచ్చావని, అప్పట్నుంచీ నీ కొలువంతా భాగ్యనగరమే అయిందనేది సత్యమే.

అయితే చాలామందికి తెలియని ఒక విషయాన్ని ఇక్కడ వెల్లడి చెయ్యాలనుకుంటున్నాను. చెన్నపట్నంలో 1921 ప్రాంతంలో మూకీ సినిమాలు నిర్మిస్తున్న కాలంలోనే హైదరాబాద్–నైజాం స్టేట్ లో కూడా ఎన్నెన్నో మూకీ సినిమాలు ప్రదర్శితమవుతున్నాయి. అప్పట్లో నిజాం కాలేజ్ లో ప్రొఫెసర్ గా పనిచేసిన ధీరేన్ గంగూలీ అనే బెంగాలీ హైదరాబాద్ లో ఎన్నో చిత్రాలను నిర్మించారు. ఆయనకే ఆ తర్వాత జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని భారత ప్రభుత్వం అందించింది.

కథ, కథనం, టెక్నిక్, టెక్నాలజీ, మార్కెట్ పరంగా నువ్విప్పుడు కొత్త ఒరవడిని సృష్టించావ్. మాస్ కమర్షియల్ ఎంటర్టైనింగ్ వ్యవస్థగా మారిపోయావ్. పురాణ కథలతో మొదలెట్టి, జానపద హంగుల్ని సమకూర్చుకుని సాంఘిక చిత్రాలుగా పయనం సాగించావ్. నిజం చెప్పాలంటే మూడు ఫైట్లు, ఆరు పాటల స్థాయి నుండి నువ్విప్పుడిప్పుడే కదా మారుతున్నావ్. నీ ప్రస్థానం వినోదం మాత్రమే కాదని, సామాజిక బాధ్యత కూడా అందులో మిళితమై ఉందని తెల్సుకుని మనిషిని మార్చే దిశగా సందేశాత్మక చిత్రాల్ని కూడా తెరకెక్కిస్తున్నావ్. ఎక్స్పరిమెంటల్ గానూ, కమర్షియల్ గానూ నువ్వు నిలదొక్కుకుని ఫ్యాక్షన్, యాక్షన్, ఎంటర్ టైనర్, ఫ్యామిలీ డ్రామా, సస్పెన్స్, హారర్, థ్రిల్లర్, ట్రాజెడీ, మైథాలజీ, జానపదం, లవ్, రొమాన్స్, కామెడీలతో తొమ్మిది దశాబ్దాలుగా తెలుగువారి జీవితంలో భాగమైపోయావ్.

ప్రతి సంవత్సరం 150 సినిమాల్ని తెలుగు నేల నుండి విడుదల చేస్తున్నావంటే ఎంత గొప్ప విషయమో కదా. 'లవకుశ' సినిమా నిర్మాణానికైన ఖర్చు అప్పట్లో 25లక్షలేనట! ఇప్పుడు ఓ సాంకేతిక నిపుణుడు తన పనితనంతో అంతకంటే ఎక్కువే తీసుకోవడం గమనించాల్సిన స్థితి. ఇక బాక్సాఫీస్ కలెక్షన్ల విషయానికొస్తే నాలుగు కోట్ల మైలు రాయిని దాటిన 'అడవి రాముడు', పది కోట్లను దాటేసిన 'ఘరానా మొగుడు', ఇరవై కోట్లను చేరిన 'ఇంద్ర', ముప్పై కోట్లు వసూలు చేసిన 'పోకిరీ', దాదాపు అరవై దాటేసిన 'అరుంధతి', 'గబ్బర్ సింగ్', 'దూకుడు', వంద కోట్లు దాటేసిన మగధీర, 'బాహుబలి' సృష్టించిన చరిత్రలు అంతా ఇంతా కావు.

దేశం దేశమే టాలీవుడ్ చిత్ర నిర్మాణ కౌశలానికి అబ్బుర పడింది. అంతెందుకు, థియేటర్లో మాత్రమే చూసే సినిమాని కొత్తపుంతలు తొక్కించి శాటిలైట్ ఛానళ్లుగా మార్చి కొత్త వ్యాపార మార్గాలు దొరకపుచ్చుకున్నావుగా. జీవకళతో కదిలే, మాట్లాడే చిత్రాలను చూపించిన యంత్రం ఆనాటి బయోస్కోప్, ఆ తరవాత వెండితెరగా వెలిగి, దూరదర్శన్ గా ఇళ్ళల్లో చొరబడి, ఐమ్యాక్స్ గా విరాట్ స్వరూపాన్ని చూపించి, ఇప్పుడు అంతర్జాలం ద్వారా నేరుగా మన అరచేతిలో ఇమిడిపోయిన ఓ సెల్ఫోన్. ఇది సాంకేతిక మాయాజాలమేలే !

ఒకప్పుడు ప్రతి దానికీ మద్రాస్ పరిగెత్తిన మనవాళ్లు, ఇప్పుడు దేశాన్ని మన రాష్ట్రం వైపు నడిపిస్తున్నారంటే అది నీ ప్రస్థాన విజయమేగా! హైదారాబాద్ కి డబ్బు పెట్టెల్తో వెళ్తే చాలు, సినిమా పెట్టెల్తో బైటికి రావచ్చు అనేంత నమ్మకాన్ని పెంచేసావ్. ప్రీ ప్రొడక్షన్, ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ లలో విపరీతమైన మార్పులొచ్చి బడ్జెట్లు భారీగా పెరిగిపోయినా నీ మోహంలో పడ్డ జనాలు వెనుకడుగు మాత్రం వెయ్యట్లేదు.

సినిమాటోగ్రఫీ, ఫిల్మ్ ప్రాసెసింగ్, డిజిటల్ టెక్నాలజీ, సౌండ్ రికార్డింగ్, కంప్యూటర్ గ్రాఫిక్స్ తో ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కావ్. DI, మిస్టికా టెక్నాలజీ, కంప్యూటర్ యానిమేషన్స్, గ్రాఫిక్స్ ని అన్నీ సినిమాలూ ఇప్పుడు ఎడా పెడా వాడుతున్నాయ్. ఫిల్మ్ మేకింగ్ కోర్సులూ పెరిగాయి, పారితోషికాలు చుక్కల్ని అంటుతున్నాయి, పైరసీలు హల్ చల్ చేస్తూనే ఉన్నాయి. ఒకప్పుడు శతదినోత్సవాలతో పండుగలు చేసుకున్న నువ్వు, ఇప్పుడు శత ప్రదర్శనోత్సవాలతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

అయినా నా చిత్రరాజమా..నువ్వొక సాంస్కృతిక కేంద్రానివి..విశేషంగా పేర్కొనే దృశ్య కావ్యానివి. నువ్విప్పుడు బహుముఖంగా విస్తరించావు, బహుళంగా పని చేస్తున్నావు. హద్దులు సరిహద్దులు చెరిపేసి ప్రపంచాన్ని ఐక్యం చేసే వ్యవస్థగా మారావు. నిజం చెప్పాలంటే నీకు పాదాభివందనం చెయ్యాలి జాతి జనులు. ఎందుకంటే అన్ని రకాల దాడులనుండి తెలుగు సంస్కృతిని కాపాడుకుంటూ వచ్చింది నువ్వే. లార్జర్ దేన్ లైఫ్ – అనే సూత్రంతో నడిచే నువ్వు వాస్తవ జీవితాన్ని మాత్రం చూపించు, హీరోయిజాన్ని తగ్గించు, క్రియేటివిటీని, కమర్షియాలిటీని కలగలిపి పనిచేసే అవకాశాన్ని ఇవ్వు. పరాయీకరణం అయిపోకుండా గ్లోబలైజేషన్ సునామీ నుండి నిన్ను నువ్వు కాపాడుకుంటూ, బాక్సాఫీస్ ఆలోచన నుండి బయటపడి బతుకుల్ని ప్రభావితం చేసే విలువలున్న వ్యవస్థగా సరికొత్త చరిత్రను సృష్టించు.

ఎందుకలా నవ్వుతున్నావ్...కోట్లు ఖర్చు చేసి సినిమాలు తీస్తున్నారుగా, వాళ్ళు బ్రతకాలంటే, నాలుగు డబ్బులు వెనకేసుకోవాలంటే కమర్షియల్ టచ్ ఉండాలనే కదా... నిజమే, నాలాగా నీతులు అందరం చెప్తాం, దిగితేనే కదా లోతెంతో తెలిసేది. ఏ చెత్త తీసినా చూస్తున్నారు కదా అందుకే తీస్తున్నామని నిర్మాతలు, అరె..అంత డబ్బులు పెట్టి తీశారుగా చూస్తున్నామని జనాలు, పరస్పరం ఆరోపించుకోకుండా సినిమా అంటే సిగ్గు, నీతి, మానాన్ని అమ్ముకున్న మేడిపండు అని అపోహ పడకుండా సమధర్మాన్ని పాటించు. సామాన్య జనానికి వాస్తవ జీవితాల్ని చూపించు. నీ తెరేంద్రజాలంతో రిక్షా తొక్కి రాత్రికి రాత్రే కోటీశ్వరుడైపోయినట్టుగా, క్రాఫ్ నలక్కుండా వందమందిని చితక్కొట్టినట్టుగా అభూత కల్పనలతో చూపించకు. మరీ బొత్తిగా భౌతికశాస్త్రానికి విరుద్ధంగా ఉన్నట్టు చూపిస్తే ఎలా చెప్పు...!

అన్నిటికన్నా ముఖ్యంగా మా బస్తీల్నుండి వచ్చిన పిల్లల్ని కాపాడు, నిన్నీ స్థాయికి చేర్చిన సగటు జనాన్ని గుర్తు పెట్టుకో. నీ ప్రభావం అంతా ఇంతా కాదు, నీ మీద పిచ్చి ప్రేమతో ఎర్ర బస్సులెక్కి వాళ్ళు పట్నంలో దిగుతున్నారు. స్టూడియోల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు, మూటలు మోస్తున్నారు, లేబర్ పనులు చేస్తున్నారు. కేవలం నిన్ను చూడాలంటే మా ఊర్లలోని థియేటర్లు చాలు, కానీ నిన్ను సరికొత్తగా జనాలకు చూపించాలంటూ జేబుల్నిండా కలల్ని వేసుకొని, గుండెల్నిండా ఆశల్ని నింపుకొని నీ ప్రాపకం కోసం పడిగాపులు పడుతున్నారు, పస్తుల్తో పడుకుంటున్నారు.

నా బిడ్డ సినిమాలు తీసి BMW కార్లో తిరుగుతానని కలలు కంటూ నిన్ను చేరాడు. కనీసం బియ్యం కొంటానికి కూడా డబ్బుల్లేని దైన్యంతో బతుకుతున్నాడు. కృష్ణానగర్ వీధుల్లో నడిచి నడిచి మా పిల్లల కాళ్ళల్లో ఆనెలు కాసాయ్.

ఎప్పుడే అవకాశం తలుపు తడుతుందో అని ఎదురు చూసి చూసి కళ్ళన్నీ ఎర్ర బారాయి. లక్షల మందిని ఆదుకున్నావ్, కోట్ల మందికి వినోదాన్ని పంచుతున్నావ్, నిన్ను చేరేవాళ్ళంతా నిన్నొక పరిశ్రమగా చూడ్డంలేదు, నిన్నొక ప్రణయంగా చూస్తున్నారు. ప్రేమతో నిన్ను జయించాలనుకుంటున్నారు.

లక్షల మందిని ప్రభావితం చేయగల మాధ్యమంగా నిన్ను గుర్తించారు కాబట్టే వాళ్ళ ప్రతిభా పాటవాల్ని నీ ద్వారా కోట్ల మందికి ప్రదర్శించాలనుకుంటున్నారు. నా బిడ్డ చిన్నప్పుడు చేయి చాస్తే చాక్లెట్ కోసమనుకున్నా కానీ, ఆ డబ్బులన్నీ దాచుకుని వాడు సినిమాలకి వెళ్తున్నాడని కనిపెట్టలేకపోయా.

కాలేజీకి వెళ్తున్నాడనుకొని మంగళ సూత్రాలు కుదువబెట్టి పట్నం పంపించా. ఆ నోట్ బుక్కుల్నిండా రంగు రంగుల కలల్తో కొత్త కథల్ని రాస్కున్నాడని గమనించలేక పోయా. ఆలస్యంగా ఇంటికొస్తుంటే ఏ వయస్సుకాముచ్చట కదా, అమ్మాయితో ప్రేమలో పడ్డాడనుకున్నా కానీ పీకలోతుగా నీతో ప్రేమలో మునిగి తేలుతున్నాడనుకోలా. పేదవాళ్ళం కదా, పైసలు లేవని చెప్తేనన్నా నీ మోజులో పడి ఫెయిలైన సబ్జక్టుల్ని పూర్తి చేస్తాడనుకున్నా. కానీ రక్తాన్ని అమ్ముకుని నిన్ను చేరడానికి బస్సెక్కాడని తెల్సిందాకా నిజంగా తెలీలేదు, వాడు నిన్నింతగా ప్రేమిస్తున్నాడని.

ఓ నా చిత్రపరిశ్రమా ! నువ్వు విచిత్రాల గనివి, ఎంతో మందిని ఆకర్షిస్తావ్, మరెంతో మందిని పిచ్చివాళ్లని చేస్తావ్, బడిపాఠాల కన్నా బ్రతుకు పాఠాల్ని ఎక్కువగా నేర్పిస్తావ్. ఒక్క అవకాశం కోసం సంవత్సరాలుగా ఎదురుచూస్తూ జీవితాల్ని నీకు అంకితం చేసిన వాళ్ళున్నారు. అయాచితంగా దొరికిన అవకాశంతో అందలం ఎక్కినవాళ్లూ ఉన్నారు. అయితే ప్రేమించు లేదా జీవితాన్ని గ్రహించేలా ఐనా మార్చేయ్. త్రిశంకు స్వర్గంలో మాత్రం ఉంచకు. నీకు కనిపిస్తోంది మా పిల్లోడొక్కడే, కానీ వాడి వెనక ఓ కుటుంబం కుటుంబమే ఉంది. వాడి విజయం కోసం ఎదురు చూస్తూ ఒక ఊరు ఊరే ఉంది, వాడు సాధించే గెలుపు కోసం నిరీక్షిస్తూ.

ఓ నా చలనచిత్రమా ! రాసుకున్న కథల్తో, పేర్చుకున్న కలల్తో నీ ముందు పడిగాపులు కాస్తున్న మా కంటి పాపల్ని నీ ఇంట్లోకి రానివ్వవూ...వాళ్ళ తలరాతల్ని మార్చుకునే అవకాశాల్ని అందివ్వవూ...

సావధానంగా నా విన్నపాన్ని మన్నిస్తావు కదూ, నీ వెలుగుల్లో పడి పై పై మెరుగులకి ఆశపడి పేరు కోసం, కీర్తి కోసం జీవితాల్ని పణంగా పెట్టే బడుగు జీవుల భ్రమల్ని తొలగించి బ్రతుకు రహస్యాన్ని అందించు. ఓ చరిత్రను సృష్టించే సరికొత్త అవకాశాన్ని అందివ్వు. ఒక సావిత్రిలా, మరో కాంతారావులా, ఇంకో రాజనాలగా రంగుల ప్రపంచం నుండి జారిపడి జీవితపు రంగు వెలిసిపోకుండా కాపాడు. భద్రమైన బతుకుని, భరోసానిచ్చే కాలాన్ని అందివ్వు. నిన్ను నమ్ముకుని వచ్చినవాళ్ళు చచ్చేంత వరకూ నీ ఆకర్షణ నుండి బైట పడలేనంత గొప్ప ప్రేమికులు. వాళ్ళు నిన్ను ప్రేమించినంత గొప్పగా, వాళ్ళని వాళ్ళ కుటుంబాలు ప్రేమిస్తున్నాయని మాత్రం మర్చిపోకు.

నిన్ను గెలవాలని వచ్చినవాళ్లే, కానీ గేలి చేయబడుతూ బతుకుతున్న వాళ్ళు. ఒక్కసారి నీ స్టూడియో గేట్లని చూడు..అక్కడ ఎన్ని కన్నీళ్ళ చారికలు కనిపిస్తాయో..కృష్ణానగర్ వీధుల్ని తడిమి చూడు– ఎన్నెన్ని ఆకలి ఆర్తనాదాలు వినిపిస్తాయో..

ఓ నా చిత్రపరిశ్రమా, ఇంత విస్తారమైన వ్యవస్థ ఉన్న నీకు మా బిడ్డల్ని ఆదరించడం వల్ల కలిగే నష్టం ఏముంది చెప్పు. మా కడుపున పుట్టిన బిడ్డల్ని నీ కడుపులో పెట్టి కాపాడుకోవా..కాస్త అన్నం–వేళకి తినేలా చూసుకోవా..పస్తులు, ఆకలి మంటలు, నిర్వేదాలూ, నీరసాలూ దరికి రాకుండా గమనించుకోలేవా? బ్రతుకు నిండా నిన్నే నమ్మారు, గుండెల్నిండా నిన్నే నింపుకున్నారు, నీ విరహంలో బ్రతకలేరు, నువ్వు లేకుండా ఉండలేరు. పిచ్చితల్లీ, నువ్వంటే నీకున్న ప్రేమ కంటే, వాళ్ళకే నీ మీద ప్రేమ ఎక్కువ. అలా తమ కంటే నువ్వంటేనే ప్రేమున్న వాళ్ళని ప్రేమించు, ప్రేమగా లాలించు. మనం ప్రేమించిన వాళ్ళకంటే మనని ప్రేమించిన వాళ్లతోనే జీవితం బాగుంటుందని పెద్దలు చెప్తారు కదా. నిజాయితీ

కల ఆ ప్రేమ నీకు సరికొత్త కిరీటాలు పెడుతుంది. అప్పుడు ప్రేమలో ఇద్దరూ ఎదుగుతారు. ప్రజల గుండెల్లో వినయంగా ఒదుగుతారు.

"లైట్స్ ఆన్..కెమెరా...రెడీ...యాక్షన్" అనే మాటల్ని నిద్రలో కూడా కలవరించే వాళ్ళు, తమ జీవితాల్లో "షాట్ ఓకే...కట్" అనే మాటలు వినిపించాలని ఎదురుచూసేవాళ్ళు వేలాదిమంది ఉన్నారు. లైట్ బాయ్, కెమెరా అసిస్టెంట్, ప్రొడక్షన్ బాయ్ నుంచి మొదలుకొని ప్రొడ్యూసర్ వరకూ అందరికీ ఓ భద్రతను అందించే దిశగా ప్రణాళికను రచించు. నిన్నే నమ్ముకుని ఉన్నవారికి, వారి కుటుంబాల ఆరోగ్యాలకీ భరోసానివ్వు. అనుకోని ప్రమాదాలు జరిగితే బీమా సౌకర్యాన్ని అందించు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని మంటగలిపే 'కాస్టింగ్ కౌచ్' లేని కళాత్మక సంప్రదాయాన్ని, స్త్రీలను గౌరవించే సంస్కారాన్ని నీ బిడ్డల్లో కలిగించు.

ఇట్లు,

ఓ సినిమా ప్రేమికుని తల్లి

– స్వరాజ్యం

# మనలో ఒకడు

కామన్ మేన్ !

నమస్కారం ! ఓ మామూలు మనిషినైన నేను ఎప్పటినుంచో నీకో ఉత్తరం వ్రాయాలని అనుకుంటున్నా. కానీ సామాన్యమైన ఉత్తరం నా అసామాన్య ప్రేమికుడికి రాయకూడదు కదా, అందుకే ఇన్నాళ్లూ ఆగాక ఎంతో ధైర్యం..నీ మీద ఎంతో నమ్మకం కుదిరాక ఈ ప్రేమలేఖ మొదలుపెట్టాను.

నేను ప్రేమించాలంటే దానికి ఎంతో అర్హత కావాలి కదా! 130 కోట్ల జనాభాని కుటుంబంగా మలుచుకున్న వాడివీ, ఒక పెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని నడిపిస్తున్న వాడివీ నువ్వు. నీ కంటే గొప్ప ప్రేమికుడు ఎవరున్నారు చెప్పు. అందుకే కదా నీ ఉనికి, గమనం, క్షమ, సామర్థ్యం చూసి నేను ఫిదా అయిపోయి ఈ ఉత్తరాన్ని మొదలెట్టింది...

అమర్త్యసేన్ ఏమిటోఅత్యంత ధనవంతులు ఉన్న అతి పేద దేశంగా అభివర్ణించారు కానీ నేనైతే అత్యంత సామర్థ్యం కలిగిన సామాన్యులు ఉన్న అతి పెద్ద దేశంగా చెప్పేదాన్ని. నిజం ఒప్పుకోవాలంటే దాదాపుగా ఐదు శాతం కూడా లేని అపర కుబేరులకు ఇంకా ఇంకా సంపాదించాలన్న యావ తప్ప దేశం గోడు ఎపుడైనా పడుతుందా? ఎందుకంటే వారు global మనుషులు. మరోపక్క దారిద్ర్య రేఖకు దిగువగా ఉన్న అత్యంత పేదలకు రోజు ఆకలిని చల్లార్చుకోవడంతోనే సరిపోతుంది. వీరికిక దేశం గురించి ఆవేదన చెందే క్షణం ఎక్కడ దొరుకుతుంది? మరిక మా దిక్కు నువ్వేగా. అసలు పూర్వీకులు ఎనిమిది దిక్కులు అన్నారు కానీ మాకు తొమ్మిదవ దిక్కువి నువ్వు కాక ఇంకెవరో చెప్పు !

సగటు మనిషి బ్రతుకు ముత్యపు చిప్పలోని చినుకు. సమస్యలలో పుడతాడు, సంకెళ్లతో బయట పడతాడు – అని ఏ కవి రాశారో కానీ సమస్యల తోరణ జగతిలో అడుగడుగునా సమస్యలే నీకు. అయినా నిరంతరం సమస్యలతో రణం చెయ్యడానికి తల్లి గర్భంలోనే తర్ఫీదు పొందినట్లుగా అతి సహజంగా పోరాడుతూ సాగిపోవడం...నదీ ప్రవాహమంత సహజంగా చేస్తుంటావు నువ్వు.

బాధ వస్తే కర్మసిద్ధాంతాన్ని ఆశ్రయిస్తావు. ఓ ముడుపు దేవుడికి కట్టి తానే నీకోసం వచ్చి సమస్యను పరిష్కరిస్తాడని ఎదురుచూస్తావు. సంతోషం వస్తే ఏ పుణ్యఫలమో ఇంత ఆనందాన్ని ఇచ్చిందని, తనను నడిపించేది దేవుని కృపాకటాక్షమే అనుకుంటూ గుడికి వెళ్లి దండాలు పెడతావు. అదే ఆగర్భ శ్రీమంతుడిని చూడు. అంతా తన స్వశక్తి మూలంగా వచ్చిందని గర్వంతో ఉంటాడు. నువ్వే కదా దేన్నైనా..ఎలా ఉన్నా జీవితాన్ని ఉన్నది ఉన్నట్టుగా ప్రేమించేదీ.. నీతో పాటు అన్వయించుకుంటూ సంచరించేదీ. అయినా – నిదానమే ప్రధానం అనేదీ నువ్వే, ఆలస్యం అమృతం విషం అనేదీ నువ్వే. ఏదైనా నువ్వే అనాలి..వినాలి.. గొప్ప జాతకుడివి కామన్ మేన్ నువ్వు.

అయినా కామన్ మేన్ ! రోజంతా కష్ట పడతావు. కలర్ ఫుల్ గా రాత్రి నిద్రలో పిల్లల భవిత కోసం కలలు కంటావ్. ఇంటికి వచ్చేటప్పుడు మధ్యలో మందు బాటిల్ దగ్గర ఆగే వాళ్ళు మీలో కొందరు..రచ్చబండ దగ్గర రాజకీయ పార్టీలు మీరే స్థాపించినట్టు వాదించుకునే వారు మరికొందరు.. మూడుముక్కలాటలోకి దిగేవాళ్లు ఇంకొందరు..మరో పార్ట్ టైం జాబ్ లోకి మారి ఇంటి కష్టాన్ని మరింతగా ఆదుకునే వాళ్ళు మరికొందరు. పిల్లల్ని ఇళ్ళకు చేర్చేదీ మీరే, భార్యని ఆఫీసుకి చేర్చేవారూ మీరే, కుటుంబం ఆనందంగా ఉండేలా చూసేవాళ్లూ మీరే – మరి మీరు కాక ఇంకెవ్వరు చెప్పు..ఇన్నేసి పనులు చెయ్యగలిగేది!

మీ పేరు ముందు ఎంత 'కామ్' వుందో మీ జీవితంలో అంత అలజడి ఉంది, అసహనం ఉంది, ఆనందం ఉంది. అతి సహజత్వమూ ఉంది. పుట్టింది పనిచేయడానికే అన్నట్టుగా కొందరుంటే, బాధ్యతారాహిత్యంగా పరుల మీద ఆధారపడి బ్రతికే వాళ్ళు మరికొందరు.

విషాదమేమిటంటే – దేశాన్ని శాసించేటంత గొప్ప జనాభా మీ వెనుకున్నా ఎన్నికలప్పుడు తప్ప నువ్వు ఎవరికీ గుర్తు రావు. సురేష్ తెండూల్కర్ కమిటీ రిపోర్టు ప్రకారం 2009-2010 మధ్యలో 354 మిలియన్లు ఉన్న జనాభాలో 29.6 శాతం దారిద్ర్య రేఖకు దిగువనే ఉన్నారు. మన దేశంలో రోజూ 19 కోట్ల మంది ఖాళీ కడుపుతో నిద్రపోతున్నారట. ఆకలి సమస్య ఎదుర్కొంటున్న దేశాల్లో మన స్థానం 103. చిత్రమేమిటంటే మన దేశంలో 40 శాతం ఆహారం వృథా అవుతూనే ఉంది.

కన్నీళ్లతో బ్రతుకే భారమైపోయి నువ్వే కనుక అస్త్ర సన్యాసం చేస్తే దేశం కుప్పకూలిపోతుంది. చూడ్డానికి నువ్వు ఒక్కడివే కానీ నువ్వు పిడికిలెత్తి ముందడుగేస్తే మన దేశ జెండాకి ఉన్నంత శక్తి నీది. అందరూ అనుకుంటారు..దేశం మనల్ని ముందుండి నడిపిస్తుంది అని. కానీ దేశాన్ని ముందుండి నడిపించే వారు మీరే. మీరు లేకపోతే కర్మాగారాల్లో ఏ చక్రం తిరగదు. మీరు రాకపోతే విపణి వీధుల్లో ఏ వస్తువూ అమ్ముడు పోదు. అమ్మాలన్నా మీరే, కొనాలన్నా మీరే, వస్తువుల్ని తయారు చేయాలన్నా మీరే.

అప్పుల దుప్పటి కప్పుకుని గొప్ప కలలు కనేవాడు సామాన్యుడు. పేరేమో సామాన్యుడే కానీ అసామాన్యుడిగా మారేందుకు మెట్టు ఈ దశనే. పెద్ద పెద్ద మాటలు మాట్లాడకుండానే, పెద్ద పెద్ద పనులు చేస్తున్నానని చెప్పుకోకుండానే దేశ ప్రగతి రథాన్ని లాగే ఇరుసులుగా మారేవాళ్ళు సామాన్యులే కదా! మీరు టాక్సులు కట్టందే దేశ ఆర్థికరంగం బలపడదు తెల్సా. రోడ్లు పడవు, లైట్లుండవు, నీరు దొరకదు, ఆఖరికి దేశ కనీస అవసరాలు కూడా తీరవు.

సామ్రాజ్యపు దండయాత్రలో, సామాన్యుల సాహస మెట్టిది
ప్రభువెక్కిన పల్లకి కాదోయ్, అది మోసిన బోయీలెవరోయ్...
అని ఆనాడే గుర్తించి గౌరవించి సామాన్యుల చెమట చుక్కల్ని గొప్పగా ఆవిష్కరించారు శ్రీ శ్రీ.

వస్తున్నా యొస్తున్నాయ్ జగన్నాథ రథచక్రాలు, జగన్నాథుని రథచక్రాల్ – అంటూ పతితుల్ని, భ్రష్టుల్ని బాధా సర్ప ద్రష్టుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ – కవి అనేవాడు కష్టజీవి మొదట చివరా నిలబడాలి – అంటూ దన్నుగా నిలబడ్డాడు కాబట్టే శ్రీశ్రీ మహాకవిగా నిలబడగలిగాడు..అదీ నువ్విచ్చిన బిరుదేగా!

నీకొక విశేషం చెప్పనా! మనం చూసే ఏనుగు దంతాలు చూడటానికే తప్ప తినడానికి పనికిరావు.. తినే దంతాలెప్పుడూ పైకి కనపడవు. 'హాథీ కే దాంత్ ఖానే కీ ఔర్ దిఖానేకీ ఔర్' అని అందుకే అంటారు. పెద్ద పెద్ద తుఫానులు వచ్చినప్పుడు మేడలు, కొండలు కదలొచ్చు కానీ గడ్డిపోచ మాత్రం తల ఎత్తుకునే ఉంటుంది. చూడ్డానికి సామాన్యుడిలాగా నువ్వు చిన్నవాడివే, కానీ ధైర్యం.. అదే హిమ్మత్ ఎంతో ఉంటుంది. నిజానికి అసామాన్యుడిని తయారు చేసేది ఈ సామాన్యుడే. ఢిల్లీని ఏలే ప్రతివాడూ ఓ తల్లికి బిడ్డడే అన్నట్టుగా సమాజాన్ని శాసించే ప్రతి గొప్పవాడూ ఒకప్పుడు సామాన్యుడి చేతుల్లో ఎదిగిన వాడే – సామాన్యుడిలో దేశాన్ని చూసినవాడే.

కుదుమిస్తే ఈరోజు ఏం పండగ అని అడిగేంత అమాయకత్వం నీది. ఎన్ని ఫైనాన్స్ కంపెనీలు బోర్డులు తిప్పేసినా – ఎన్ని బోగస్ ఉద్యోగ కంపెనీల్లో లక్షలు పోగొట్టుకున్నా, నీ భూముల్లో ల్యాండ్ మాఫియా పాగా వేసినా, పంచ ప్రాణాలైన అమ్మాయిని ఆకతాయిలు గేలి చేసినా, నమ్ముకున్న స్వాములోరు స్కామ్ బాబులని తెలిసినా తలవంచుకుని పక్కకు తిరిగి వెళ్ళిపోతావు తప్ప పన్నెత్తి మాట్లాడవు. కర్మ సిద్ధాంతం నీకు వంట పట్టినట్టుగా ఏ యోగులకూ అర్థం కాదేమో..!

మనం పోగొట్టుకునే ప్రతి రూపాయి మనకు వంద రూపాయల అనుభవంగా మారాలి గానీ, మరో వెయ్యి రూపాయిలు పోగొట్టుకునే వ్యసనంగా మారకూడదన్నది మీలో ఎంతమందికి తెలుసో లేదో నాకు తెలియదు కానీ, బ్రతకడమంటే బ్రతుకుతున్నాంగా చూడూ అంటూ కన్న బిడ్డల్ని సాకుతూ, బతుకు బండిని ఈడుస్తూ లాక్కువస్తున్న ఉద్యోగాల్ని చూపించడం కాదు. జీవంతో బ్రతకాలి. ఓ ధ్యేయం కోసం బతకాలి, పోరాడుతూ బ్రతకాలి.

అయితే, సివిక్ సెన్స్ అలవాటుని మనలో ఎందరం పాటిస్తున్నామో ఆత్మ విమర్శ చేసుకుందాం. రాజ్యాంగం మనకు అందించిన హక్కులేమిటో మనలో ఎందరికి తెలుసో ఓ మారు పరిశీలించుకుందాం.

ఆశే నిన్ను నడిపిస్తుంది ఆకాశానికి
ఆశే దారి చూపిస్తుంది అవకాశానికి
ఆశ వెనుక ఆచరణ ఉంటే అద్భుతాలు నీ సొంతం
ఆదమరిచి నిదురిస్తుంటే అందదే వసంతం

నిప్పులే గుండెలో నిండుకున్నా ఉప్పొంగే జలపాతం జీవితం అంటూనే అంతిమ విజయం అనివార్యమని ఆశిస్తూనే బ్రతకాలి అనుకోవటం గొప్ప మలుపు కదా!

భోపాల్ గ్యాస్ లీకేజీ, పుల్వామా దాడులు, అక్షరధామ్ బాంబులు, కిడ్నీల రాకెట్లు, ఉమెన్ ట్రాఫికింగ్ లు గురించి వింటావు, చదువుతావు, బలవుతావు, బాధ పడతావు. మళ్లీ రేపు 'సామాన్యుడి' ముసుగేసుకుని రొటీన్ లైఫ్ లోకి వెళ్ళిపోతావు. మీ అమ్మాయి మీద అత్యాచారం జరిగితే, నీ మనవడు స్కూల్ బస్సు కింద నలిగితే, నీ బిడ్డ కాలేజీ అలజడుల్లో అరెస్టయితే, నీ ఇంట్లో దొంగలు పడితే నీది ఒంటరి దుఃఖమే తప్ప సామాజిక దుఃఖంగా ప్రభావితం కావు. ఎందుకంటే పరుగులు బ్రతుకులో అలవాటు చేసుకున్నావు.

నువ్వు లేనిదే నీ కుటుంబం జరగనంతగా పెనవేసుకున్నావు. కోర్టుల చుట్టూ తిరగలేనని, పోలీస్ స్టేషన్ అంటే భయమని కారణాలు చెబుతావే కానీ అలసత్వం నుండి పోరాడే పటిమను అలవాటు చేసుకోవు. ప్యాంట్ నుండి లుంగీలోకి జారినంత ఈజీగా ఉద్యోగిత్వం నుండి ఇల్లు చేరినాక టీ.వీ.లో క్రికెట్ చూస్తూ నువ్వు, మధ్యాహ్నం సీరియల్స్ చూస్తూ మీ ఆవిడ అదే బ్రతుకుగా జీవితాన్ని లాగేస్తుంటారు. అదే జీవితంగా బ్రతికేస్తుంటారు.

రోడ్డు మీద కుళాయి కారుతుంటే చూపు తిప్పుకుంటావ్, కట్టేయాలని ప్రయత్నించవు. బజ్జీ తిన్న పేపర్ ని గిరాటేస్తావ్, స్వీపర్లు ఊడుస్తార్లే అని. కానీ స్వచ్ఛ భారత్ ని గుర్తు చేసుకోవు. వీధి లైట్లు వెలగక పోతే సెల్ లోని లైట్ వెలిగిస్తావే కానీ కరెంట్ ఆఫీస్ వారికి ఫిర్యాదు చెయ్యాలి అన్న ఆలోచన చెయ్యవు. వారం రోజులుగా వీధి చివర చెత్తను క్లియర్ చెయ్యకపోతే ముక్కు మూసుకుని వెళ్తావే తప్ప కార్పోరేషన్ వైపు ముఖం కూడా తిప్పని వాడివి నువ్వు. ఎప్పుడన్నా సామాజిక కోణంలో ప్రతి స్పందించాల్సి వచ్చినప్పుడు 'అమ్మో! నా కుటుంబానికి ఏమన్నా అవుతుందేమో' నంటూ భయాన్ని చొక్కాకు అతికించుకుని పక్కకు తిరిగి తలొంచుకుని వెళ్లిపోవటమే అలవాటుగా మార్చుకున్న నువ్వు దాన్నే నీ పిల్లలకీ నేర్పించటం అత్యంత విషాదం.

మధ్యతరగతి వాళ్లందరం అల్పజీవులమే. కానీ తరాలుగా మారకపోతే అది మాన్యు ఫ్యాక్చర్ లోపం కాదు. మన ఆలోచనల పాపంగా ఇంకా గుర్తించకపోవడమే అత్యంత దౌర్భాగ్యం. అదృష్టాన్ని నమ్ముతావే కానీ, నీ కష్టాన్ని పూర్తిగా నమ్మలేని వాడివి నువ్వు. నీ మీద నీకు నమ్మకం లేనంత కాలం నిన్నూ, నిన్ను మోస్తున్న ఈ మన దేశాన్ని మార్చలేమని మర్చిపోవద్దు.

ఫ్లై ఓవర్ కూలినా, డ్యాం తెగినా, రైలు ప్రమాదం జరిగినా, ఫ్యాక్టరీలు విషాన్ని చిమ్మినా, నదులు కలుషితం అయినా ఏదీ నీకు పట్టదు. అదంతా పెద్దవాళ్ళ వ్యవహారం అంటారే కానీ అన్నింటిలో బలయ్యేది నువ్వే. 11 మంది ఆడే క్రికెట్ ఆటని పదివేల సార్లు చూసే నువ్వు, దేశ రక్షణ వ్యవస్థకు కావలసింది ఏమిటో, మనం నివసించే మహానగరంలోని ప్రభుత్వ ప్రణాళికలోని రూల్స్ ఏమిటో, ఏ రూల్ ని అనుకూలంగా మార్చుకోవచ్చునో, ఏ నిబంధనని అతిక్రమించకూడదో తెలియకుండానే బ్రతికేస్తావు. మాట్లాడడానికి నోరు వుందని, పనిచేసేందుకే వళ్ళుందని నువ్వు భావించినంత కాలం మన బ్రతుకులు ఇంతే. ఒకే ఒక్కసారి చరిత్ర తిరగెయ్యి, నీలాంటి వాళ్లు సాధించింది ఏమిటో గుర్తు తెచ్చుకో...

మౌంటెన్ మేన్ గా పేరు పొందిన బీహారీ దశరథ్ మాంఝీ, 22 సంవత్సరాల పాటు, ఒక్కడే బయటి ప్రపంచానికీ తమ గ్రామానికీ అడ్డుగా ఉన్న కొండను తొలిచి, 360 అడుగుల పొడవు 30 అడుగుల వెడల్పుతో దారి ఏర్పాటు చేశాడు. ఈ మహాయజ్ఞం సమయంలోనే సరైన సమయానికి వైద్యం అందక భార్య చనిపోయింది. అయినా రెట్టించిన పట్టుదలతో ఒకేఒక్కడుగా తన గ్రామానికి రహదారిని ఏర్పాటు చేశాడు.

విచారం కలిగించే సంగతేంటంటే, అటవీ సంపదను తవ్వడం అక్రమమని అధికారులు ఆరోపించిన కారణంగా, ప్రభుత్వం అప్పటికే చేసిన పద్మశ్రీ పురస్కార సిఫార్సుని వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. అప్పటి బీహార్ ముఖ్యమంత్రి, తాను నిర్వహించే జనతా దర్బార్ లో ఓ రోజు ఒక ఐదు నిమిషాల పాటు ముఖ్యమంత్రిగా ఉండమని, మాంఝీని కుర్చీలో కూర్చోబెట్టి గౌరవించారు. ఐతే, కామన్ మేన్ మాంఝీ ఈ తిరస్కారాన్నీ, పురస్కారాన్నీ పట్టించుకోనే లేదు. తన గ్రామవాసులికి స్కూలు, హాస్పిటల్ అందుబాటులోకి వచ్చాయన్నదే అతనికి ముఖ్యం.

నీకు గుర్తుందా కామన్ మేన్ – తండ్రి నీటికుంటలో పడి చనిపోవడాన్ని జీర్ణించుకోలేని ఓ చిన్నపిల్ల నీళ్లంటేనే ద్వేషం, భయం, అసహ్యాన్ని పెంచుకుంది. రోజువారీ కూలీకి వెళ్ళి తమ పొట్టలు నింపుతున్న తల్లి కష్టాన్ని, బస్తీలో తమ వెతల్ని చూసి, ప్రభుత్వ పాఠశాల్లో తన స్థాయిని మార్చేయాలనే పట్టుదలతో సెయిలింగ్ లో సాధన చేసి జాతీయ స్థాయి సెయిలర్ గా ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీ సాధించిన తొలి సెయిలర్ గా రికార్డ్ క్రియేట్ చేసింది 16 యేళ్ళ ఆ పాప – ప్రీతి కొంగర – తానూ అతి సామాన్యురాలే.

పొలాల్లో నాగలి పట్టి వ్యవసాయం చేసిన చేతులే, చేతుల్లో ఆయుధాలు పట్టుకుని నడిపించిన రైతాంగ పోరాట ఉద్యమాన్ని గుర్తు చేసుకో. మన గడ్డమీదే పుట్టి పెరిగిన వీర నారి చాకలి ఐలమ్మ సాహసం నీకు తెలిసిందే కదా! పాలకుర్తిలో ఆమె చేసిన భూ పోరాటం గుర్తుందిగా, ఈ భూమి నాది..పండించిన పంట నాది – అని దొరల ఆగడాల్ని ఎదిరించి నిలిచి గెలిచిన ఐలమ్మ అతి సాధారణ మహిళే కదా! నదుల్ని కలుషితం చేస్తున్న బడా బాబుల కాలర్ పట్టుకుని వీధుల్లోకి తీసుకొచ్చిన 'నర్మదా బచావో' ఉద్యమాన్ని గుర్తుచేసుకో.

అడవులను నరకొద్దంటూ చెట్లను వాటేసుకుని గిరిజనులు కాపాడుకున్న అడవుల సంరక్షణ 'చిప్ కో' ఉద్యమాన్ని గమనించు. బాసని, యాసని, బ్రతుకుని గేలి చేసిన వారి మీద 60 ఏళ్లుగా పోరాడి సాధించుకున్న నీ రాష్ట్ర ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకో. అంతెందుకు, సూర్యుడు అస్తమించని బ్రిటిష్ వాళ్లను తరిమికొట్టేలా అందరినీ సంఘటితం చేసిన బక్క పల్చని గాంధీ తాత అంశ మనందరిదీ అన్న ఆలోచన మనస్సులో నాటుకో. పోరాడితే పోయేది బానిసత్వపు సంకెళ్లు తప్ప మరేదీ కాదనే నిజం మార్క్స్ ద్వారా నీ పూర్వీకులే తెలుసుకున్నారన్న సత్యాన్ని గుర్తించు.

మేరీ కోమ్ ని చూసిన మనం ఇప్పుడు హిమదాస్ ని చూస్తున్నాం. దాదాపు ఐదు మెడల్స్ సాధించింది ఈ ఇరవై రోజుల్లో. పరుగుల రాణి పి.టి. ఉషను గుర్తుచేసుకుంటూ 'రన్ఎక్స్ ప్రెస్' అంటున్నారు.

మర్రిపల్లి అభిషేక్ అనే విద్యార్థి తల్లి కష్టం చూడలేక, రోజువారీ కూలీగా తండ్రి దుబాయిలో కష్టపడడాన్ని గుర్తించి తల్లి కోసం వ్యవసాయ యంత్రంగా ధాన్యాన్ని సంచుల్లో నింపే మర యంత్రాన్ని కనిపెట్టాడు, ఈ 8వ తరగతి విద్యార్థి – ఇతడూ నీ వారసుడే కదా!

అన్నా తెరిస్సా అనే విద్యార్థిని ఆడపిల్లలు పుష్పవతి అయితే బడి మానేయటానికి కారణం పీరియడ్స్ అని గుర్తించి, చవకగా సౌరశక్తితో పనిచేసే శానిటరీ నాప్ కిన్స్ తయారుచేసే వెండింగ్ మిషన్ ని కనిపెట్టింది.. తనూ నీ అడుగు జాడల్లోనే కదా నడిచి వచ్చింది!

ఫీడ్ ద నీడ్ సంస్థని నడిపిస్తూ ఫంక్షన్లలో వృథా అయ్యే ఆహారాన్ని సేకరించి ఫ్రిడ్జ్ లలో వుంచి రోడ్డు ప్రక్కన వుంచుతారు. ఎవరైనా అన్నార్తులు తీసుకుని తినొచ్చు. దీన్ని ప్రారంభించిన నీలిమ ఆర్య సాధారణ మహిళేగా.

రెస్టారెంట్లలో, వేడుకల్లో మిగిలిన ఆహారాన్ని సేకరించి అందరికీ పంచుతున్న రాబిన్ హుడ్ ఆర్మీకి 1000 మంది వలంటీర్లున్నారు తెల్సా. 18 నగరాల్లో రోజూ రెండు లక్షలమంది ఆకలి తీరుస్తున్న వీరు అతిసామాన్య రోటీ బ్యాచ్ మరింత వినూత్నమైంది. ఉత్తరప్రదేశ్ లోని మహ్ బా కు చెందిన మాజీ జర్నలిస్ట్ తారాపటా అతడు నివసించే ప్రాంతంలో 500 కుటుంబాల చేత రొట్టెలు చేయిస్తూ అన్నార్తులకు అందిస్తున్నారు.

తల్లి కష్టం చూసి 'ఆసు' యంత్రాన్ని తయారు చేసిన నేత కార్మికుడు మల్లేశం సామాన్యుడేగా.. మనలోని వాడే కదా. మన ఇళ్లల్లో పెరిగి ప్రపంచం యావత్తూ ముక్కున వేలేసుకునేలా హిమాలయ పర్వతాన్ని అధిరోహించి చూపించిన మాలావత్ పూర్ణ సాధారణ ఆడపడుచేగా.

గుప్పెడంత గుండె కష్టాన్ని కనిపెట్టి మొత్తంగా గుండెని విప్పకుండానే స్టంట్ లు వేసి గుండెల్ని కాదు సామాన్యుడి కుటుంబాల్ని ఆదుకున్న సోమరాజు గారు, అబ్దుల్ కలాం గారు సామాన్య కుటుంబాల్లో పుట్టి ఎదిగిన వారు కాబట్టే కదా. అత్యంత ఖరీదైన వైద్యాన్ని అతి సులభతరంగా, అతి చౌకగా మార్చగలిగారు.

మన జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య ఎంత నిరాడంబరుడో తెలుసుకదా. చిన్నపాటి విధి నిర్వహణ చెయ్యడం కూడా పనిలో భాగం అనుకోకుండా, ప్రజా ప్రతినిధులుగా అది తమ కర్తవ్యంగా భావించకుండా – గొప్ప సేవ చేస్తున్నాం సుమా. అని అనుకొనే ఈ తరం నాయకమ్మన్యుల కంటే, జాతి గౌరవ చిహ్నం మీద శాశ్వత పేటెంట్ వెంకయ్య గారిదే అనటం ఏమాత్రం తప్పు కాదు. భారతీయ ఆత్మకు ప్రతీక అయిన సామాన్యుడు..చివరి రోజుల్లో అత్యంత బీదరికంలో నిరాదరణకు గురై, అనారోగ్యంతో తనువు చాలించిన కామన్ మేన్ ఆయన.

ఇంకా చెప్పాలంటే 'భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు' అంటూ భారతీయులందరూ చేసే ప్రతిజ్ఞ రాసిన పైడిమర్రి వెంకట సుబ్బారావు గారికి, తన అంత్య కాలానికి కొంత కాలం ముందువరకూ, తాను రాసిన ప్రతిజ్ఞ దేశమంతటా అన్ని భాషల్లోనూ ప్రతిరోజూ పాఠశాల ప్రారంభ సమయంలో విద్యార్థులు పలుకుతారని కూడా తెలియదు. జాతి గౌరవ పతాకలైన ప్రముఖుల అతి సామాన్యజీవనం అబ్బురంగా లేదూ, ఉంటుంది, ఎందుకంటే ఆయన కామన్ మేన్ కదా!

అంతే మరి, లోక్ పాల్ బిల్ కోసం అన్నా హజారే విడుపులేని పట్టుదలతో ఎంత శ్రమ పడ్డారో తెలుసా కామన్ మేన్ ? జలవనరుల అభివృద్ధికోసం, సమాచార హక్కు సాధన కోసం, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి వ్యతిరేకంగా పోరాడ్డం కోసం అనుక్షణం పోరాటం సలుపుతూనే ఉన్నారు. తన గ్రామం రాలేగావ్ సిద్ధి ని దేశంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దిన కామన్ మేన్ హజారే మనకి స్ఫూర్తి కాదా..!

నీకో మాట చెప్దామనుకుంటూనే ఇంతసేపూ నీ గురించీ, నీ సగటు మనిషి మనస్తత్వం గురించీ, నీలోని స్పందన–ప్రతిస్పందనల గురించీ, నీ మౌనం, నీ ఆగ్రహం, నీలోనే నువ్వు కుమిలిపోవడం, నారాతింతే అని సర్దుకుకుపోవడం గురించీ చెప్తూనే ఉన్నానా ... ముఖ్యమైన సంగతే మర్చిపోయి ఈ ప్రేమలేఖని ముగించబోయా...

అప్పుడు వెలిగింది బుర్ర... అందులో నీ అమాయకపు నిలువెత్తు విగ్రహం... అవును కామన్ మేన్... నీ విగ్రహం చూసుకున్నావా... ఏమీ తోచని, అసమర్థపు చూపుల్తో, దిగ్భ్రమ చెందిన మోముతో కూడిన నీ విగ్రహం పూణే లో ఉంది. ప్రసిద్ధ పత్రకారుడు, కార్టూనిస్ట్ ఆర్.కే. లక్ష్మణ్ కొన్ని దశాబ్దాలపాటు పత్రికల్లో నిన్ను ఆలంబనగా చేసుకొని వేల కార్టూన్లు గీసారు... కామన్ మేన్ గా జీవితం పట్ల, సమకాలీన రాజకీయాలపట్ల, సామాన్యుని జీవిత గమనం పట్ల, ఆతృత, నిరాసక్తత, నిర్లిప్తత, ఎంతబాగా చిత్రించేవారో... ఆ సామాన్యుని రేఖాచిత్రానికి కంచు విగ్రహం చేయించి పూనాలో నిలిపారు. దేశంలోని సామాన్యునికి ప్రతీకగా ఆ గౌరవం మాత్రం నీదే కామన్ మేన్.

A Wednesday అనే హిందీ సినిమా చూశావుగా కామన్ మేన్, అదేలే తెలుగులో 'ఈనాడు' పేరుతో రీమేక్ చేశారు. తీవ్రవాద చర్యలతో దేశంలో అస్థిరత్వం కలగజేసిన కరడుగట్టిన తీవ్రవాదుల్ని వెంటనే శిక్షించకుండా, ప్రజల సొమ్ముతో వాళ్ళని పోషించడం సహించలేని ఓ సామాన్యుడు తనకు తెలిసిన సాంకేతిక పరిజ్ఞానంతో ఎలా స్పందించాడో, వాళ్ళని ఎలా అంతంచేశాడో అన్న సినిమా కథే అయినప్పటికీ అతనిలోని ఆక్రోశం, బాధ ఎలా వెళ్లగక్కాడన్నదానికి వెండితెర రూపం ఆ చలన చిత్రం.

కామన్ మేన్ లోని సంఘర్షణ తట్టుకోలేని స్థాయికి చేరినప్పుడు ఇలా జరగొచ్చనే ఓ మాటకి కథా రూపం ఆ సినిమా. కన్న కూతుర్ని, కుటుంబాన్ని కాపాడుకునే ప్రయత్నమే 'దృశ్యం' సినిమాలో ఓ సాధారాణ తండ్రి పాత్ర పడిన తాపత్రయం. ఇది ఆమోదయోగ్యత ఉన్న విషయమా అంటే – సమర్థనీయం కాని మానసిక వ్యథ ఇలా బయటపడే అవకాశం ఉంది సుమా అని, ఆలోచించమని కామన్ మేన్ గా వాళ్ళ స్పందనకి అది దృశ్యరూపం.

కామన్ మే...న్ ! ఈ దేశంలో... ఆ మాటకొస్తే ఏ దేశంలోనైనా – మట్టిలో కలిసిపోయే ప్రతి మనిషీ సామాన్యుడు కాకపోవచ్చు గానీ, ప్రతి మట్టి మనిషీ ఓ సామాన్యుడే..తన నేలతో అనుబంధం కొనసాగిస్తూ, పుట్టి పెరిగిన చోటి మట్టి పరిమళం అద్దుకుంటూ, సాటివారికోసం ఆలోచిస్తూ...ఉన్నదాన్ని చుట్టూ ఉన్నవారితో పంచుకోడంతోనే సంతృప్తి పడిపోయే ఆనందమూర్తి సామాన్యుడే!

ఈ నేల గంధం ఒంటికి అలదుకుంటూ, జ్ఞాపకాల సాంద్రతతో, కష్టసుఖాల్ని కావడి కుండలుగా భావిస్తూ, అవసరమనిపిస్తే భుజం మార్చుకుంటావే గానీ.. వేరే వాళ్ళ మీద నెపం వెయ్యవు. ఈ గాలినే శ్వాసించే.. ఇక్కడి నీటి జవాన్నే జీవంగా, అదే జీవితంగా భావించే నువ్వే... ఆ కామన్ మేన్ వి! నీకు పురస్కారాలు అందించినా..కాకపోయినా ఏం పెద్ద ఫరక్ పడదు, నీకు తెల్సు 'ఏక్ దిన్ కా సుల్తాన్ – న కభీ ఘాస్ కా, న గాడీ కా' ! అదంతా ఒక్క పొద్దు ఆడంబరమేనని అనుకుంటావ్ కదూ !

కార్గిల్ యుద్ధమప్పుడూ, పుల్వామా దాడి తర్వాతా నువ్వలాగే ఉన్నావ్; గొప్ప వాళ్లనిపించుకున్న పారిశ్రామికవేత్తలు ఆర్థిక వ్యవస్థల్ని కూలదోసి దేశందాటి పారిపోయినా, బ్యాంకుల్లో డిపాజిట్లని ఉదారంగా అప్పులిచ్చిన అధికారుల్ని, నీకది–నాకిది లెక్కన పరస్పరం లాలూచీ పడిపోతున్న వ్యక్తుల్ని–వ్యవస్థల్ని భరిస్తూనే, విసుక్కుంటూనే, ఏడుస్తూనే, నష్టపోతూనే అలవాటుగా జీవించేస్తున్న కామన్ మేన్... నువ్వంటే నాకు ప్రేమే సుమా. నీ స్థితప్రజ్ఞత నాకిప్పటీ ఆశ్చర్యమే. నీ క్షమాగుణం నాకేనాటికీ అర్థం కాని బ్రహ్మ పదార్థమే. ఇది స్తుతి నిందా కాదు, నిందా స్తుతీ కాదు. ఓ వాస్తవ దృశ్యం.


ఒక్క మాట చెప్తాను – నీ చుట్టూ ఉన్న పరిస్థితులకి లొంగిపోవడం కాదు, విశ్లేషించి స్పందించు. వివేకంతో జవాబివ్వు. ఎప్పుడో ఒక్కసారిగా ఫెటిల్లున బద్దలయ్యే అగ్నిపర్వతంలా కాక, జీవనదిలా సాగిపోతూ, నిన్ను నీవు

ప్రకటించుకుంటూ నలుగురినీ కలుస్తూ..కలుపుకుంటూ కొనసాగుతూ ఉండాలని ఆశిస్తూ... సామాన్యుడిగా పుట్టడం నీ తప్పు కాదు గానీ సామాన్యుడిగా చనిపోవడం నీ తప్పే అని గుర్తు చేస్తూ. . . అసామాన్యుడిగా, అందరివాడుగా మారే నా ప్రియతముడి కోసం ఎదురుచూస్తూ ఉండనా మరి...

ఇట్లు,

ఓ సామాన్య జీవి

– సమయ్



# మైత్రీ లోకం

రాణీ! ఓ నా ప్రియ నేస్తమా!

ఎలా ఉన్నావ్... ఎన్నేళ్ళో అయింది కదా ఉత్తరం రాసుకుని..! ఎందుకో నిన్న బీరువా సర్దుతుంటే నీ ఉత్తరం దొరికింది. ఎన్నిసార్లు చదువుకున్నానో..నిన్ను తడిమినంత ఆనందం కలిగింది, దాన్ని చేతిలోకి తీసుకుంటే. ఇప్పటి పిల్లలకి ఈ అనుభూతి తెలీటం లేదు. అప్పట్లో తాతయ్య వాళ్ళింట్లో ఓ చిలక్కొయ్యకి ఇనుప తీగకి గుచ్చి పెట్టిన ఉత్తరాల గుచ్ఛం ఉండేది. అప్పుడప్పుడు అమ్మమ్మ తాతయ్యలు దాన్ని కిందికి తీయించి దుమ్ము దులిపి ఆ ఉత్తరాలన్నీ చదువుకుంటూ ఎంత సంబరపడేవారో..నిజానికి మన పెద్దతరాన్ని బ్రతికించిన అనుభూతుల పుష్ప గుచ్ఛం అది. అంతెందుకు ఎన్నో ప్రేమలేఖలు ఎందరి బ్రతుకుల్లోనో పున్నమి వెలుగుల్ని నింపడం మనకు తెలిసిందే కదా..

ఫ్రెండ్ ! నీకు గుర్తుందా.. నీకొచ్చిన ఆకాశవాణి ప్రేమలేఖ ! ఎంత బాగుందో కదా, ఎవరు రాశారో కానీ ఇప్పటికి వారు గొప్ప కవి అయి ఉంటారు సుమా ! 'మొహబ్బత్ అంటే కలిసిన మనసులు కలిపి తాగే అనుభూతుల షర్బత్' అంటూ రాసిన మాట ఇరవై యేళ్ళైనా నాకు గుర్తుందంటే ఎంత బాగా రాసి ఉంటారో అనిపించట్లేదూ! నువ్వేమో, ఎదుటికొచ్చి చెప్పే ధైర్యం లేక ఇలా ఉత్తరాల రాయబారం పంపే పిరికి వాడిని ఎలా ప్రేమించడం, అన్నావ్...బాహాటంగా అందరికీ వినిపించేలా తిట్టావు కూడా.. ఇప్పుడది తలుచుకుంటే నువ్వెంత గొప్పగా ఆలోచించావా అని ఆశ్చర్యం కలుగుతుంది. నువ్వు ఆనాడు తీసుకున్న ఆ నిర్ణయం నీకొక సమర్ధుడైన భర్తని, చక్కని కుటుంబాన్ని ఇచ్చింది. సమాజంలో నీకు గొప్ప స్థానాన్ని కలిగించింది.

నిజం ఫ్రెండ్, నిన్న నీ ఉత్తరం చదువుతుంటే కళ్ల నుండి నీళ్లు కారుతున్న విషయం కూడా చూసుకోనంత అనుభూతిలో పడిపోయాను. బహుశా నీకు గుర్తు ఉండొచ్చేమో, ఇంటర్లో నేను ఫెయిల్ అయ్యాను – అదీ ఇంగ్లీషులో. మీరంతా డిగ్రీ చదువు కోసం పట్నం వెళ్ళారు. ఇంట్లో తిట్లు – వీధిలోకి వెళితే చాలు పెళ్లి సంబంధాల గోల – లేకపోతే ఆకతాయిల బెడద, చచ్చిపోవాలనిపించేది. అప్పుడు నన్ను బ్రతికించినవి – మళ్లీ పరీక్ష పాసయ్యేలా నిలబెట్టినవి – నీ ఉత్తరాలే. ఓడిపోవడం గెలుపుకి తొలిమెట్టంటూ స్ఫూర్తివంతంగా నాలో ఆత్మస్థైర్యాన్ని నింపావు – సెలవుల్లో నా దగ్గరికొచ్చి ఇంగ్లీష్ గ్రామర్ చెప్పేదానివి – స్నేహం ఎప్పుడూ సంతోషం లో కాదు బాధల్లోనే ఎక్కువ అవసరపడాలి అంటూ నన్ను సినిమాలకు, ఏటి ఒడ్డుకు తీస్కెళ్ళేదానివి.

పట్నంలో చదువులు, వ్యక్తుల తీరులు చెప్పి నన్ను ప్రిపేర్ చేసావు. డిగ్రీలోకి వచ్చాక నాకు కొత్తగా అనిపించకుండా వుండేందుకు ముందే మానసికంగా తయారు చేశావు. నేను పాసైన వెంటనే నన్ను తీస్కెళ్ళి నువ్వు చదివే కళాశాలలోనే అడ్మిషన్ ఇప్పించి నన్ను ప్రతిసారీ కనిపెట్టుకుని చూసుకున్నావ్. నీలాంటి వారు వేలు పట్టుకుని నడిపిస్తుంటే ఎవరు

మాత్రం లక్ష్యాన్ని సాధించకుండా ఉంటారు చెప్పు. చివరికి నువ్వు గ్రూప్-వన్ ఆఫీసర్ గా సెలెక్ట్ అయితే నేనొక లెక్చరర్ గా స్థిరపడ్డాం. తలుచుకుంటే నాకే నమ్మలేనట్టుగా అనిపిస్తుంటుంది, మన ప్రస్థానం.

ఇంటర్ లోనే ఫెయిల్ అయిన నేను పిడకలు చేసుకుంటూ, వ్యవసాయ పనులకు కూలీగా వెళ్తూ బ్రతికేదాన్ని కాబోలు..కానీ నన్ను అదే ఇంటర్ విద్యార్థుల్ని తీర్చిదిద్దే అవకాశాన్ని కలిగించింది నీ స్నేహం కాక మరేమిటి చెప్పు. నీ లాంటి మంచి ఫ్రెండ్ ని నేను ఎంచుకోవడమే నా అదృష్టం. అందుకే అంటారు – నీ మిత్రులెవరో చెప్పు..నీ గురించి నేను చెప్తానని.

సంతోషం పంచుకుంటే అరచేతి దూరంలో ఆకాశం అందినంత ఆనందం. దుఃఖం పంచుకుంటే అరచెయ్యే ఆకాశమంతై అక్కున చేర్చుకునే అమ్మతనం. 'శూన్యంలో సైతం నీకోసం ఎవ్వరూ లేనప్పుడు చల్లని చిరునవ్వుల చుక్కల్ని నీ దోసిట్లో పోసి నీ కళ్ళల్లో మెరుపుల్ని మెరిపించేదే అసలైన స్నేహ'మని పద్మజ నాగభైరవ రాసిన కవిత గుర్తొచ్చింది, నీ ఉత్తరం చదివాక. నిర్వచనాలకందనిది..నిరంతరం స్వేచ్ఛగా ప్రవహించే స్నేహనది ఒడ్డున గవ్వలేరుకున్న బాల్య స్నేహితం మనది. పరిచయమనే విత్తనంతో మొదలై వేళ్లూనుకున్న మర్రిచెట్టు లాగా విస్తరించి వికసించి, ఆశ్రితులకు నీడను ఇచ్చినట్టుగా మన కుటుంబాలకు అండగా..సమాజానికి గొడుగులా నిలబడ్డాం. అది నువ్వు పెట్టిన భిక్షనే.

ప్రపంచమంతా నాకు దూరమైనపుడు నువ్వు ఒక్కదానివే నాకు అత్యంత సన్నిహితంగా వచ్చి నన్ను నన్నుగా గౌరవించి, ఆదరించి నా పక్కన నిలబడి నా భుజం తట్టావ్-నేనున్నానంటూ. నిజం చెప్పాలంటే ఆమాత్రం భరోసా ఇచ్చే మనిషే కరువైపోయాడు ఈ లోకంలో. బాల్య స్నేహితులు, పాఠశాల స్నేహితులు, కళాశాల స్నేహితులు, ఉద్యోగ స్నేహితులు, ఇకిప్పుడు సోషల్ మీడియా స్నేహితులు అంటూ విభజించుకుంటున్నారే గానీ, 'స్నేహిత'మనేది ఎప్పటికీ చిగురించే చెట్టన్నది మాత్రం అర్థం చేసుకోవటం లేదు. ముఖ్యంగా మా వారిని చూస్తుంటే నాకది బాగా అర్థమవుతోంది. ఎప్పుడూ ఆ వాట్సప్ గ్రూపులో మెసేజ్ లు చూసుకోవడం, పంపించుకోవడంతోనే సరిపోతుంది జీవితం. మనకు అవసరమైనప్పుడు ఆ చాట్ లు ఏమైనా ఉపయోగపడతాయా చెప్పు..కాలక్షేప స్నేహితుల అవసరమా అని అనిపిస్తుంది నాకు.

మనం సంవత్సరానికి ఓ రెండు మూడు సార్లు కూడా మాట్లాడుకోం. కానీ అవసరం వున్నప్పుడు కుటుంబాల్ని కూడా చూసుకోకుండా వచ్చి సాయంగా నిలబడ్డాం. నేను బస్సు ఎక్కబోతూ జారి పడ్డప్పుడు నాతో బాటూ నువ్వూ హాస్పిటల్ లో 10 రోజులు వుండడాన్ని నేను ఎప్పుడూ మర్చిపోలేను. మీ పాప పెళ్ళికి నేనొచ్చి నెలరోజులుండి అన్నీ సర్దినాక ఇంటికొచ్చాను. ఇరు కుటుంబాల మధ్య ఓ అండర్ స్టాండింగ్ వుంది. 'వాళ్ళు ఒకరికొకరుంటారు – ఒకరికోసం ఒకరుంటారని' – మన వాళ్ళకో భరోసా.

To the world You may be just one person, but to one person You may be the world – ఎంత చక్కని మాట కదా – ప్రపంచానికి నువ్వు ఒక వ్యక్తివి మాత్రమే కావచ్చు, కానీ ఒక వ్యక్తికి నువ్వే ప్రపంచం అయ్యుండొచ్చు – ఇది ప్రేమికుల కోసమని చాలామంది అనుకుంటారు. కానీ ప్రేమలో పొసెసివ్ నెస్ వుంటుంది, స్నేహంలో ఇవ్వటం తప్ప వేరే ఆలోచన ఉండదు. గొప్ప గుణం కదా అది. నాకు అసలు సిసలు జీవిత పరమార్థం దొరికింది..నీ స్నేహంలోనే. స్నేహితం హితం కావాలి జీవితానికి. . .స్నేహితుడు హితుడు కావాలి జీవితాంతం – కానీ ఈ ఆధునిక కాలంలో అలాంటి నికార్సైన మిత్రులు కనిపిస్తున్నారా..ఏమో..అనుమానమే..

ఎన్ని దారుణాలు చూట్టం లేదు..మిత్రులమంటూ ఫేస్బుక్లో అమ్మాయి బొమ్మలు పెట్టుకుంటూ అబ్బాయిల్ని ప్రేమ, స్నేహం పేర్లతో మోసం చేస్తూ లక్షలు లక్షలు గుంజడం – అమ్మాయిల్ని మోసగించడం – సన్నిహితంగా ఉన్నప్పుడు తీసుకున్న ఫోటోల్ని పది మందీ చూసేలా అప్లోడ్ చేయడం – కూల్ డ్రింకులో మత్తు మందు కలిపిచ్చి

నగ్నంగా ఫోటోలు తీసి బ్లాక్మెయిల్ చేయటం. . . ఏమిటివన్నీ..అసహ్యంగా అనిపించడం లేదూ ! మరీ ఎబ్బెట్టు కలిగించిన అంశం – అప్పట్లో హాస్టల్స్ లో వున్న కొంతమంది అమ్మాయిల్ని బ్లాక్ మెయిల్ చేసి, మరికొందర్ని మత్తులో ముంచి వ్యభిచార గృహాలకు విక్రయించేలా చెయ్యటం. ఎక్కడికి పోతుంది మన సమాజం అన్పించేలా, భయం కలిగేలా 'స్నేహాన్ని' పెడదారిన నడిపించారు. అంతెందుకు, స్నేహితులమని చెప్పుకుంటూ మత్తు పదార్థాల్ని విక్రయించే ముఠాలు విద్యార్థుల్ని మత్తుకు బానిసలుగా చేయడం ఇప్పుడు చూడ్డం లేదా..!

అసలు సిసలు మిత్రుడు మనల్ని వ్యసనాలకు బానిసలు చేయరు, మన చెడును కోరుకోరు. తప్పుడు దారిలో నడిచేవారు మన పక్క నుంటే మనకూ అదే తొవ్వ చూపిస్తారుతప్ప మంచి దారి చూపరు కదా ! పంజాబ్ తర్వాత మాదకద్రవ్యాలు మనదగ్గరే విరివిగా దొరుకుతున్నాయంటే దానర్థం విక్రయించే ముఠాల కంటే స్నేహితులదే తప్పు. మన మిత్రుడు కోరి వ్యసనాలకు బానిసై తన కుటుంబాన్ని నాశనం చేసుకోవటమే కాక సమాజాన్ని కూడా భ్రష్టు పట్టించబోతున్నాడని అర్థం కదా !

ఫ్రెండ్ ! మొన్న పేపర్లో నేను ఓ వార్త చదివి కంగుతిన్నాను తెల్సా, ఈ మధ్య యువతలో గంజాయి వాడకం బాగా పెరిగింది. మద్యం తాగితే గుర్తుపట్టవచ్చు, తాగి ఉన్నాడని దూరంగా జరగొచ్చు, జాగ్రత్త పడొచ్చు. కానీ మత్తుమందులు తీసుకున్న వాళ్లని మనం గుర్తించలేం కదా. అలా మిత్రుడింటికి వచ్చిన ఓ పిల్లాడు పన్నెండేళ్లు కూడా లేని మిత్రుడి చెల్లెలి మీద అత్యాచారం చేశాడు. చూశావా..మిత్రుడంటూ చెడ్డవాడ్ని చేరదీస్తే కుటుంబాన్నే కాటు వేశాడు కదా... అలాంటి వాళ్ళు సమాజానికి చీడ పురుగులే తప్ప మిత్రులు కారు. పైగా నిజమైన మిత్రులం మనమే గనక అయితే ఇలా మత్తుకు బానిసలైన మన మిత్రుల్ని రిహాబిలిటేషన్ సెంటర్లలో చేర్పించి, మత్తుమందుల్ని విక్రయించే ముఠాల్ని పట్టించి, ఇంకా పది కుటుంబాలు బలికాకుండా కాపాడాలి...కాపాడుతాం కూడా.

నాణానికి రెండు పక్కలుంటాయి. చెడు మాత్రమే చెబుతున్నాననుకోకు... ఆన్లైన్ లోని స్నేహితులు ఆఫ్ లైన్ సామాజిక ఉపయోగ కార్యక్రమాలకు చేయూతగా మారిన సందర్భాల్ని కూడా చూస్తున్నాం.

'జిందగీ ఇమేజెస్' సంస్థ పేరుతో రెండున్నర లక్షల మంది జమగూడి మంచి చర్చలు జరుపుతున్నారు. మంచి పనులు చేస్తున్నారు. 'బ్లడ్ గ్రూప్' ఫ్రెండ్స్ ఎంతో మందికి సకాలంలో బ్లడ్ అందిస్తూ ప్రాణాలు కాపాడుతున్నారు. మంచి మనుషులు జత కట్టిన గ్రూప్ ఇది. గల్ఫ్ బాధితులు ఎంతోమందిని ఆదుకుంది. వాకర్స్ క్లబ్ ద్వారా నడక మిత్రులు కలిసి బద్ధకాన్ని వదిలేసుకుని ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్న వ్యవస్థనూ చూడగలుగుతున్నాం.

ఫ్రెండ్స్ ఫర్ కేర్ సంస్థ ద్వారా మనసులు కలిసిన మిత్రులందరూ కలుసుకొని మురికివాడల్లోని చిన్నారులకు విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పన దిశగా ప్రయత్నం చేస్తున్నారు. 'వింగ్స్ ఫర్ లైఫ్' సంస్థ ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్ పట్ల అవగాహన కలిగిస్తూ శిరీష, జ్యోతిర్మయి తమ స్నేహాన్ని సామాజికం చేసి జీవిత పరమార్థాన్ని సాధించుకున్నారు. 'హోప్ ఫర్ లైఫ్' సంస్థ ద్వారా హిమజ, మహాలక్ష్మిల స్నేహితం క్యాన్సర్ బాధితులకు అండగా నిల్చి వారికి సాంత్వనం కలిగిస్తున్నారు. ఫేస్బుక్ అయినా, వాట్సప్ అయినా, ఇన్స్టాగ్రామ్ అయినా – ఒక చోట చేరి స్నేహానికి సరికొత్త నిర్వచనం చెప్పుకుంటూ సేవా రంగాల వైపు పయనం మొదలు పెడుతున్నారు. కలిసి చదువుకోకపోయినా, కలిసి ఆడుకోకపోయినా సేమ్ వేవ్ లెన్త్ వున్న మిత్రులందరూ ఈ సోషల్ మీడియా ద్వారా కలుస్తున్నారు..నిర్మాణాత్మక పనులు ప్రణాళికా బద్ధంగా నిర్వహిస్తున్నారు.

'మీలో మార్పును అంగీకరిస్తూనే మీరు ఎదగాలని కోరుకునే వారు, మిమ్మల్ని మీరుగా అర్థం చేసుకుని ఆదరించేవారు స్నేహితులని', షేక్స్పియర్ ఎప్పుడో చెప్పారు. గ్రీకులకు అరిస్టాటిల్ ఎప్పుడో స్నేహం విలువను విప్పి చెప్పాడు – మంచితనం పునాదిగా అంకురించిన స్నేహం చిరకాలం నిలబడి ఉంటుందని.

సినిమా నటులు ఏది చెప్పినా వెర్రెత్తినట్టు నమ్మే జనాలు – సునీల్–త్రివిక్రమ్ ల దశాబ్దాల స్నేహితాన్ని, తనీష్–

నానీల మిత్రత్వంలోని గొప్పతనాన్ని, సమంత–మేఘనల మైత్రీబంధాన్ని, కొన్ని దశాబ్దాల పాటు సంగీత యాత్ర చేసిన రాజ్–కోటిల చెలిమిని, నాగశౌర్య–నందినీరెడ్డిల అరమరికలు లేని దోస్తీని, అభిజిత్–సంతోష్–ఆది పినిశెట్టిల స్వచ్ఛమైన ఫ్రెండ్షిప్ ని గుర్తించాలి. చప్పట్లు చరిస్తే నాలుగు కార్లు పైకెగరడాన్ని చూసి ఈలలు వేస్తూ అంత కంటే గట్టిగా చప్పట్లు కొట్టే మనం – వాస్తవ జీవితంలో స్నేహం ద్వారా వాళ్ళంతా మనకందిస్తున్న 'యారానా' ఎంత గొప్ప స్ఫూర్తిగా నిలబడిందో గుర్తించకపోవడం విచారించ వలసిన విషయం.

బ్రిటిష్ మానవ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ రాబిన్ దన్బర్ తన పరిశోధన ద్వారా ఒక మనిషి జీవితకాలంలో 148 మందితో సామాజిక స్నేహ సంబంధాల్ని కొనసాగించగలుగుతాడని 1990లోనే తేల్చి చెప్పారు. మన చిన్నతనంలోనే చిగురించిన స్నేహం ఇప్పుడీ వృద్ధాప్యంలో మనకెంత అండగా వుందో నీకూ తెల్సు కదా — నాకు ఏమాత్రం బాగో పోయినా ఇప్పుడు నువ్వొచ్చి హాస్పిటల్ కి తీసుకెళ్తావు. పక్కనే వున్న కిట్టీ ఫ్రెండ్ సుకృతి ఇంట్లోకి కూరాలూ అవీ చేసి ఇస్తుంది. తిన్నామో లేదో కనుక్కుంటూ ఉంటారు మరికొంత మంది మిత్రులు. ఆ మధ్య మా వారికి యాక్సిడెంట్ అయితే పాతిక మంది మిత్రులు పరిగెత్తుకొచ్చారు. కుటుంబాల్ని బంధువులకంటే మిత్రులే ఎక్కువ ఆదుకుంటారు.

స్నేహం మనసుకు ప్రశాంతతని, భరోసాని కలిగిస్తుందని, కుటుంబ అనుబంధాల్లో బాధ్యతలు ఎక్కువని పరిశోధకులు చెప్తున్నారు. జీవిత భాగస్వామి కంటే మిత్రులే ఎక్కువగా అర్థం చేసుకుంటారని ఎంతోమంది ఒప్పుకున్న విషయం. స్నేహంలో మాత్రమే ఒత్తిడిని తగ్గించే శక్తి ఉందని నిపుణులు చెబుతున్నారు.

ఒకసారి బాపు–రమణల్ని గుర్తు తెచ్చుకో ఫ్రెండ్. మన ఫ్రెండ్ బ్నిం గారు వారిరువురి గురించీ చెప్పిన విషయం గుర్తుందా నీకు – రమణ గారు ఎవరో మిత్రుడు అడిగితే ఆపదలో వున్నాడు కదా అని స్వంత పూచీకత్తుపై అతగానికి ఐదు లక్షల రూపాయలు అప్పుగా ఇప్పించారట. అది కాస్తా వడ్డీ, చక్రవడ్డీలుగా మారి కొన్ని సంవత్సరాల తరువాత 70 లక్షల అప్పుగా తయారై కూర్చుందట. అప్పు తీసుకున్న ఆసామి స్పందించక పోయేప్పటికి కోటి రూపాయల తన ఇంటిని అమ్మేసి ఆ అప్పు తీర్చేశారట రమణ గారు. ఇక అక్కడ ఉండలేక స్వంత ఊరు వెళ్ళిపోదామని సర్దుకుంటున్న దశలో విషయం తెలిసిన బాపుగారు, కుటుంబంతో సహా వచ్చి తన ఇంటి పైన ఫస్ట్ ఫ్లోర్ లో ఇల్లు కట్టుకుని శాశ్వతంగా తన దగ్గరే ఉండమని ఆహ్వానించారట. ఎంత గొప్ప స్నేహితం కదా వాళ్ళిదరిదీ..కాబట్టే కదా ఇప్పుడు ఇంత గొప్పగా చెప్పుకుంటున్నాం. చూడు మరి, శ్రీకృష్ణుడు–అర్జునుడు మంచి మిత్రులు కాబట్టి కలిసి మంచి పన్లే చేశారు. దుర్యోధనుడి చెయ్యి పట్టుకొని నడిచిన కర్ణుడు మంచివాడైనా కాల గర్భంలో కలిసిపోయాడు కదా !

మనతో మనం ఉన్నంత స్వచ్ఛంగా మనం మన మిత్రులతోనూ ఉండగలిగితే అది నిజమైన స్నేహం అనిపించుకుంటుంది. భయంగా, బిడియంగా, మోమాటంగా, ముసుగేసుకొని బ్రతికితే అది స్నేహం అనిపించుకోదు. స్నేహంలో మోసాలు, స్వార్థాలు ఉండకూడదు. స్నేహం చేస్తే ప్రాణం పోయేంతవరకూ హితాన్నే కోరుకోవాలి.

చిన్నప్పుడు మనం కట్టుకున్న గుజ్జనగూళ్ళు గుర్తున్నాయా – ఆ సముద్రం ఒడ్డున ఎంతో కష్టపడి అందంగా కట్టుకున్న మన కలల సౌధం ఒక కెరటం తాకిడికి కూలిపోతే నువ్వు ఎంత బాధ పడేదానివో; ఎక్కడో దొరికిన నెమలీకను పుస్తకాల్లో దాచుకొని అది పెట్టె మరో పిల్ల కోసం ఎదురుచూడ్డం; కలిసి పాటలు పాడుకోవడం, బుట్టలు అల్లుకోవడం, ఒంటికొమ్ము రాక్షసుడి కథలు కలిసి చదువుకోవడం, తొక్కుడు బిళ్ళ ఆటలు, ఇసుకలో పుల్లలు దాచి ఆపైన చేతులు పెట్టి పుల్ల ఉందో లేదో చెప్పమనడం. అబ్బా ఆటలంటే అవి కదా ! ఓటమిని అలవాటు చెయ్యటం – గెలుపును సమంగా పంచుకుని అందర్నీ మిత్రులుగా అక్కున చేర్చుకోవడం. ఇప్పుడీ పిల్లలకి ఇలాంటి ఆటలు లేవు. అందుకే జీవితం విలువ, ఓటమిలో నేర్చుకోవలసిన పాఠం విలివ తెలియక చిన్న చిన్న వైఫల్యాలకే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు, నేటి పిల్లలు.

ఇంటర్లో ఎవడో నీ వెనుక పడి ఏడిపిస్తుంటే మన స్కూల్ బ్యాచ్ అంతా వచ్చి వాడి కాలర్ పట్టుకుని నిలదీసేప్పటికి

కదా వాడు భయపడి పారిపోయింది. అప్పటి నుండి కాలేజీలో ఎవ్వరైనా సాహసించే వారా మనవంక చూడ్డానికి ! అదే ఇంట్లో పెద్దోళ్ళకి చెప్పుంటే భయపడి మనల్ని కాలేజీ మాన్పించేసేవారు. అమ్మానాన్నలతో, అన్నదమ్ములతో కూడా చెప్పుకోలేని ఇలాంటి విషయాల్ని స్నేహితులే కదా గమనించాల్సింది...పరిష్కరించాల్సిందీ.

స్వామి వివేకానంద బహుశా అందుకే అని ఉంటారు — శత్రువు ఒకరైనా ఎక్కువే, స్నేహితులు వందమందైనా తక్కువే అని. ప్రతి దశలో మనల్ని నడిపించే జీవనమే కదా స్నేహం. స్నేహం అనే రెండక్షరాల పదానికి ఈనాడు ప్రపంచం దాసోహం అయ్యిందంటే అది ఎంత గొప్ప భావనో కదా అనిపిస్తుంది.

స్నేహం మన జ్ఞాపకాల డైరీ అని కొందరంటారు. రంగు చూడకుండా, జాతులు అడక్కుండా, కులమతాలు ఎరగకుండా, కాలంతో పాటు కనుమరుగవకుండా మనసుల్లో ఎల్లకాలం నిలిచే అద్వితీయ బంధం స్నేహం అని ఎందరో చెప్పుకుంటూ ఉంటారు. తల్లిదండ్రులు కోప్పడితే కూడా విసుక్కునేవారు, స్నేహితులు కొట్టినా తిట్టినా లైట్ గానే తీసుకోవడం వెనుక ఉన్న మర్మం అదే. అడుగులు నాలుగైనా ఒకే గమ్యం వైపు మళ్ళేదీ, కన్నులు నాలుగైనా ఒకే చూపుగా నిలిచేది స్నేహం కాక మరేమిటి చెప్పు.

అందుకే ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు సృష్టిలో తీయనిది స్నేహమేనోయి అన్నారు. అమ్మతనం, నాన్న గుణం, చెల్లి ప్రేమ, సోదరుని తోడు, తాత అవ్వల ఆత్మీయత, ఇవన్నీ ఒక చోట గుమ్మరిస్తే 'స్నేహం' అవుతుంది. రక్త సంబంధాల్ని అడగకుండానే దేవుడు ఇచ్చేస్తాడు, కానీ, స్నేహితుల్ని మాత్రం ఎంచుకునే అవకాశం, అదృష్టం మనకి మాత్రమే వుంటుంది. నిజం చెప్పాలంటే జీవితాన్ని మలుపు తిప్పే బంధమిది. మంచి స్నేహితులు దొరికితే మనం సన్మార్గంలో నడుస్తాం. మంచితనం నేర్చుకుంటాం. చెడు స్నేహాల్లో చిక్కితే మన జీవితాన్నే కాదు మన కుటుంబాల్ని కూడా కష్టాల్లోకి నెడ్తాం.

నీకో తమాషా విషయం చెప్పనా – వియత్నాంలో 'ఫ్రెండ్షిప్' పేరుతో ఒక గ్రామం ఉందిట. 1992లో అమెరికా దేశస్థుడు అక్కడ ఆ గ్రామాన్ని స్థాపించాట్ట. అమెరికా–వియత్నాం యుద్ధం జరిగినప్పుడు చాలా మంది పిల్లలు అనాథలుగా మిగిలిపోతే, వారందరితో ఏర్పాటైన గ్రామం ఇది. అమెరికా, జర్మనీ, వియత్నాం దేశాలు కూడా ఈ గ్రామ అభివృద్ధికి పాటు పడుటూ తమ మానవత్వాన్ని నిరూపించుకుంటున్నాయ్.

నేస్తమా ! నా జీవితంలోని ప్రతి ముందడుగూ నీ ప్రోత్సాహంతో వేసిందే. నేను జారిపోబోయిన ప్రతి మెట్టు మీద నీ అరచేయి పెట్టి ఆపేసింది నువ్వే. విశ్వాసాలే మనుషుల మధ్య తరిగిపోతున్న తరుణంలో విశ్వాన్ని నిలబెట్టేంత 'ప్రేమని' పంచిన నేస్తమా... ముసుగులేసుకుని బ్రతుకుతున్న జీవితాల్లో మోసాల, స్వార్థాలకు ఆవల ఉన్న స్వచ్ఛతను నాకు చూపించిన నేస్తమా... ఏమివ్వగలను నీకు — రెండు చేతులెత్తి గుండెల నిండా నమస్కరించటం తప్ప — జీవితంలో స్నేహంలో పడి చెడిపోయినవాళ్లు వున్నారంటే నమ్మబుద్ధి కావడం లేదు. నీ స్నేహంలో పడి జీవితార్థం తెల్సుకున్న నేను స్నేహంలో పడి ఓడిపోవటాన్ని, జీవితాన్ని పోగొట్టుకోవటాన్ని చూస్తుంటే ఇది స్నేహమేనా అనిపిస్తోంది.

ఏది ఏమైనా, నీ జీవితానికి దారి దీపం నువ్వు, నా బ్రతుకులో ప్రాణ దాతవు నువ్వు

బహుశా ఇప్పుడు దేవుడు నా ముందుకొచ్చి నేను దేవుణ్ణి అని చెప్పినా నేను నమ్మలేనేమో, ఎందుకంటే నాకు తెల్సిన దేవుని రూపం నువ్వే. అందుకే అంటున్నా నీ రూపంలో వస్తే తప్ప నేను దేవుణ్ణి కూడా విశ్వసించనని...!

ప్రతి జన్మకు నీలాంటి ఫ్రెండ్ దొరకాలని, అలా దొరకని జన్మ నాకు రాకుండా వుండాలని కోరుకుంటూ...

నీ ఫ్రెండ్

– ఉమా బొద్దులూరి

# అవిఘ్నమస్తు

ఏకదంతుడా !

కుడుములు, ఉండ్రాళ్ళ కోసం అనింద్యుడనే నీ ఎలుక వాహనం ఎక్కి మా ఏకైక భూగోళానికి పరుగు పరుగున నువ్వొస్తుంటావే...ఆ మానవ లోకం నుంచే నీకోసం ఓ ఆహ్వానలేఖను రాస్తున్నాం. అసలు మీ కుటుంబంలో మీ భార్యలైన సిద్ధి, బుద్ధిల గురించి మా కెప్పుడైనా చెప్పావా చెప్పు. ఎంతసేపూ నీ ఆవిర్భావ కథలు, గణాధిపత్యం కోసం మీ అన్నదమ్ముల పోటీ విధానాలు; రావణ బ్రహ్మని సైతం పక్కతోవ పట్టించిన నీ గడుసుదనాలు, పరశురాముడితో పోటీ పడి నీవు విరగ్గొట్టుకున్న దంత గాథలు – ఇవేగా మాకు తెలిసిన కథలు. అందుకే ఓ ప్రేమలేఖ మా బొజ్జ గణపతయ్యకి ప్రియంగా రాద్దామనిపించింది. మళ్ళీ నవరాత్రులు ప్రారంభమయ్యాయనుకో నీకు వినే తీరిక కూడా ఉండదుగా. కాస్త ఆ చాట చెవుల్ని ఇటు పారేద్దూ..ఈ లేఖని వినిపిస్తానూ...

నువ్వు రావాలని, మళ్ళీ మళ్ళీ నవరాత్రి వేడుకలు జరగాలని, ప్రజలంతా ఐక్యంగా ఉండాలని – "గణపతి బప్పా మోరియా, అగలే బరస్ తూ జల్దీ ఆ" అని దశాబ్దాలుగా మేం వేడుతూనే ఉన్నాం. జనసంద్రమైన వీధులతో మిన్నంటే నినాదాలతో గుండెల్నిండా ప్రేమతో నిమజ్జనం రోజున నిన్ను నీళ్ళలో వీడుతూనే ఉన్నాం.

పండగలు పదుగుర్నిదగ్గరకి చేరుస్తాయ్. ఊళ్ళకి కొత్త అందాన్నిస్తాయ్. పట్టణ ఉత్సాహానికి ఊపిరిలూదుతాయ్. భారతీయ పండగలన్నింట్లో – ప్రకృతి పట్ల ప్రేమ, సంస్కృతి పరిరక్షణ పట్ల మమత అనివార్యంగా దాగే ఉన్నాయ్. అంతెందుకు.. నీ పండగనే తీస్కో. ముఖం – ఏనుగు, ఆభరణం – పాము, వాహనం – మూషికం, ఆహారం – బియ్యపు పిండిముద్దల ఉండ్రాళ్ళు, అర్చనకి – అడవంతా గాలించి తెచ్చిన పత్రి. ఎంత పేద దేవుడివయ్యా నువ్వు !

కొండంత దేవుడుకి కొండంత పత్రి ఇవ్వలేం కదా చిన్న గరిక ఇస్తే చాలు గంపల కొద్దీ వరాలిస్తావంట. మహా కాయుడవని నిన్నందరూ కొనియాడుతుంటారే, బంగారు వర్ణంతో మెరుస్తావంటగా ! పెద్ద పొట్టతో, పెద్ద పెద్ద చెవుల్తో, చిన్ని చిన్ని కళ్ళతో, ఏక దంతంతో, నాగ యజ్ఞోపవీతంతో నెలవంకని ధరించి ఉండే నిన్ను చూడ్డానికి రెండు కళ్ళూ చాలవెందుకు? పండగలన్నీ డబ్బులున్నవాళ్ళకోసమే వస్తాయనుకుంటాం.

కానీ మా గణపతయ్య మాత్రం మా పేద మండపాలక్కూడా నడిచొచ్చే దేవుడని చెప్పుకుంటాం. నువ్వు మా మిత్రుడివే, అయితే ప్రకృతికి సన్నిహితుడివి. ప్రకృతి–పురుష అభేద రూపానివి. నిన్ను క్షిప్ర గణపతి, బాల గణపతి, తరుణ గణపతి, వక్రతుండ గణపతి, ఉచ్చిష్ట గణపతి, వరసిద్ధి గణపతి అని ఇలా ఎన్నో రూపాలుగా కొలుస్తూ ఉంటారటగా. అయినా గుణాతీతుడివైన నువ్వు – నీకు కుడుములు, ఉండ్రాళ్ళు ప్రసాదంగా పెడితే చాలని, సర్వసిద్ధులు ప్రసాదిస్తావని, సర్వవిఘ్నాలను హరిస్తావని అందరూ చెప్పుకుంటూ ఉంటారు. నీకు ఇష్టమైన గరికను తాకితే చాలు



సర్వ పాపాలు ప్రక్షాళన అవుతాయని, నీ అనుగ్రహం, అభయం లభిస్తాయని ఎంతో మందికి విశ్వాసం. ఎంత గొప్ప మనసున్న దేవుడివయ్యా లంబోదరా...

నిన్నంతా ఓంకార స్వరూపం అంటారు – అకార, ఉకార, మకార తురీయాలు ఓంకారంలో ఉంటాయి. మొదటి మూడూ సృజనాత్మకతని అందిస్తే, తురీయం మాత్రం గుణాతీత విధానానికి దర్పణం పదుతుంది అని, ఈ నాలుగూ నీ చేతులని పెద్దలు అనటం నిజమేనా...? మట్టి వినాయకుడు సంతాన ప్రాప్తి కలిగిస్తాడని, సంపదను వృద్ధి చేస్తాడని చెప్పింది మా బామ్మ. ఎన్ని పేర్లతో పిలిచి ఎలా నిన్ను కొలిచినా మా కొంగు బంగారం నువ్వే కదా బంగారం.

అందరూ ఉండ్రాళ్ళు తిని తిని నీ పొట్ట కొండంత అయింది అని పొరపాటుగా భ్రమిస్తారు. కానీ సమస్త బ్రహ్మాండాన్ని దాచుకుంది నీ పొట్టలోనే అని ఎందరికి తెలుసు చెప్పు? ఒక చేతిలో మోదకంతో, మరొక చేతితో అభయాన్ని అందిస్తూ, పాశాన్ని ధరించి అనుబంధాలు పెంచడానికి, అదేవిధంగా తుంచడానికి కావలసిన సామర్థ్యాలతో అంకుశం ధరించి హెచ్చరిస్తావు. నీ దంతాన్ని ఆత్మ విశ్వాసానికి ప్రతీకగా చూపిస్తావు. నువ్వు ఎప్పుడూ ఆనందంగానే ఉంటావు కాబట్టే కదా చిదానంద స్వరూపుడివి అయ్యావ్. నువ్వున్న చోటుకి చిరాకులు, పరాకులు, వికారాలు రావట కదా. బాబ్బాబూ..ఆ మంత్రం ఏమిటో మా మనుషులందరికీ చెప్పి పోరాదా...

నిన్ను మా జనాలంతా మావాడు అంటే మావాడంటూ పంచేసుకుంటున్నారేంటీ? ఊర్లల్లో జానపదుల దేవుడంటూ "శివ శివ మూర్తివి గణనాథా నువ్వు శివుడి కుమారుడవు గణనాథా" అని డప్పులు ఎత్తి పాడితే జన సామాన్యుడివంటూ ఆ జగజ్జననియే స్వయంగా నిన్ను నలుగు పిండితో తయారు చేసిందంటూ నిన్ను నెత్తిన పెట్టుకొని మోస్తారు మా పట్టణవాసులు. చూశావా నీ దగ్గరుంటే చిట్టెలుక సైతం ఎంత ప్రాచుర్యం పొందిందో.. "మూషిక వాహన గజానన మా ఊరి దేవుడా మహానానా" అని పాటలు పాడతారు. నీ ప్రతి ఏడాది పండగకీ ప్రతి ఇల్లూ ఓ మహా మంటపంగా మారుతుంది. గణాధిపతిగా నువ్వు బాధ్యతలు తీసుకున్న రోజునే, నిన్నే మా ఇలవేల్పుగా కొలుస్తూ ఇన్ని శతాబ్దాలు గడిచినా సేవకులుగానే నిన్ను నమ్ముకుని ఉన్నాం. నీ పేరు పలికితే చాలు పరమానందంతో ఒళ్లంతా పులకించిపోతుంది.

అయినా నువ్వు ప్రకృతి–పురుషుడు అయిన పార్వతీపరమేశ్వరుల శక్తి స్వరూపానివి. దివ్యాంగుల్లో సైతం నీ మరుగుజ్జు రూపంతోనే ఆత్మస్థైర్యాన్ని నింపిన గొప్ప దేవుడివి. చిన్ని కాళ్లతో ఏ పనైనా చేసే ముందు ఆలోచించి అడుగెయ్యాలని నేర్పిన గురువ్వి. తొండంలో ఉన్న నాసికతో ముందే ప్రమాదాన్ని పసిగట్టమని సూచిక చేస్తావు. సింహం తన నిద్రలోకి రాకూడదని ఏనుగు ఒంటి కన్నుతో నిద్రపోయినట్టుగా ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తావు.

నోరు–తొండం వెనుక ఉండడంలో పరమార్థం ముందు పనులు చేసి ఆ తర్వాతే మాట్లాడాలని సూచించడమే కదా. ఎక్కువ మాట్లాడితే తక్కువగా వింటావు. కానీ నువ్వు ఎక్కువగా వినడం తక్కువగా మాట్లాడడం అలవాటు చేసుకోవాలని చెప్పేది నీ తత్వం. అందం లేకున్నా, ఐశ్వర్యం రాకున్నా, ఆజానుబాహుడివి కాకున్నా అసలేంటి నీకింత ఫాలోయింగ్ అని ఎన్నో సార్లు ఆలోచించా. గరిక ఇస్తే చాలు వరాలు కుమ్మరిస్తావని అత్యంత విశ్వాసంతో నీ దగ్గరకొచ్చే జనాల్ని చూసినపుడు అర్థమయ్యింది. నీవెంత భక్త హృదయుడివో, కరుణాంతరంగుడివో!

అయినా గణపతయ్యా ! దేశ వాణిజ్య రాజధానిలో లక్షా 50 వేల విగ్రహాలు నిమజ్జనం చేస్తారనేది అందరికీ తెలిసిందే. హైదరాబాద్ లో ఏటా 60 వేల విగ్రహాలు నిమజ్జనం అవుతాయి గానీ, ఈ సారి లక్ష దాటొచ్చు అంటున్నారు. నువ్వు పేదల దేవుడివే కాదు రైతన్నల నేస్తానివి కూడా. వాళ్ళు నిన్ను చూస్తే ఎంతో ఆనందాన్ని పొందుతారు. వర్షాలు రావాలన్నా, అతివృష్టి ఆగాలన్నా, పంటలు సక్రమంగా పండాలన్నా నువ్వే దిక్కనుకుంటారు. నీ వాహనం ఎలుక – పంటని నాశనం చేస్తుంది. ఎలుకను తినే నాగుపాము నీ నడుముని చుట్టే బంధమైంది. చూశావా.. వైరుధ్య జీవులు కూడా నీ వద్ద ఎంత స్నేహంగా మెసులుతున్నాయో !



తొమ్మిది రోజులూ నీ మంటపాల దగ్గర ఎంత గొప్ప సందడే కదా. వితరణ గొప్పదనం అప్పుడే అర్థమౌతుంది. కులమతాలకతీతంగా భజనలతో ప్రతిరోజూ ప్రసాదాలు పంచుతారు. నీ నామ సంకీర్తనలతో వీధులన్నీ మారు మ్రోగిపోతాయి. హైదారాబాద్ లో ప్లాస్టిక్ సంచులు నిషేధించారు. ప్లాస్టిక్ హఠావో అంటూ జనాలందరూ దేశవ్యాప్తంగా పాటిస్తే ఎంత బావుండో అనిపిస్తుంది.

ఇక నీ నిమజ్జనం రోజు చూడాలి.. రోడ్లన్నీ జనాలతో క్రిక్కిరిసి ఉంటాయ్. అందరూ ఒళ్ళంతా వెయ్యేసి కళ్ళు చేసుకుని నిన్ను చూడాలని తపిస్తారు. మళ్ళీ సంవత్సరం దాకా నిన్ను చూడలేక పోతున్నామనే బాధతో కొంత, నీ సుందర రూపాన్ని ప్రత్యక్షంగా చూడాలని మరికొంత...ఇలా గడప దాటని వారు సైతం గల్లీల్లోకి అడుగుపెడతారు. డాన్సులు చేస్తారు.

గణనాథా కాస్త ఈ సారైనా ఈ మైకుల జోరు తగ్గించు. వాతావరణ కాలుష్యం అసలే ఎక్కువగా ఉంది. బొత్తిగా వర్షాలూ పడ్డం లేదు. డిసెంబర్ నుంచే నీళ్ళు కొనాల్సి వస్తుందని భయపడుతున్నాం. దయచేసి ఈ ఉపద్రవాన్ని ఆపించు. నీ గణాలని పంపించి ఆ వరుణ దేవుడ్ని పిలిపించు, బోరు బోరున వర్షాల్ని కురిపించు. జోరు జోరుగా భూగర్భ జలాల్ని హెచ్చించు. అందర్నీ చల్లగా కాపాడు తండ్రీ.

నాకు బాగా నచ్చే విషయం చెప్పనా... నిమజ్జనం రోజున ప్రతి గల్లీలో మహమ్మదీయ సోదరులు కూడా మజ్జిగ ప్యాకెట్లు, నీళ్ల ప్యాకెట్లు పంచుతారు. శోభా యాత్రకు ఆటంకాలు లేకుండా, రాకుండా చూస్తారు. గణనాథుల దండుకు అండగా నిలబడి సహోదరత్వాన్ని చాటుతారు. కరెంటు తీగల్ని కర్రల్తో పైకి లేపుతూ శోభా యాత్రలో సహకరిస్తారు. తోటి మిత్రుల పట్ల మైత్రిని ప్రదర్శిస్తారు. “సర్వ విఘ్న హరం దేవం సర్వ విఘ్న వివర్జితం సర్వసిద్ధి ప్రదాతారం వందేహం గణనాయకమ్” అని నిన్ను ఎప్పుడు ప్రార్థిస్తూ వుంటాం. మనిషన్నవాడు ఎవరికైనా ఆపదలు, అడ్డంకులు అంటే భయమే కదా. అందుకు పాశ్చాత్యులు కూడా మినహాయింపు కాదు కదా. అందరూ నిన్ను పూజిస్తారు. తెలుగు వాళ్ళకి ఇది కాస్త విచిత్రంగా అనిపించినా ఇది ముమ్మాటికీ నిజం.

గ్రీకు వారు డర్మినస్ గా, రోమన్లు జేనస్ గా, ఈజిప్షియన్లు గూనిస్ గా నిన్ను పూజిస్తారు. కొలంబస్ అమెరికాని కనిపెట్టడానికి ముందుగానే హిందువులు అమెరికా చేరారని..అప్పటికే అక్కడ వినాయక ఆరాధన ఉందని ‘హిందూ అమెరికా’ అనే గ్రంథంలో దివాన్ చమన్ లాల్ రాసారు. ఎంతో చిత్రంగా అనిపిస్తోంది కదా. శ్రీలంకలోని కొలంబోకి 150 కి.మీ. దూరంలో ఉన్న కటర్గామ్ లో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కొలువైన నీ విగ్రహానికి మహమ్మదీయులు, క్రైస్తవులు కూడా పూజలు చేస్తుండడం విశేషంగా కనిపిస్తుంది. చైనాలోని శాసనాల్లో నిన్ను ‘ఏనుగుల దొర’ అని పిలిచారట కదా. ‘కువాన్షీ ఆయన్’ అని నిన్ను చైనా భాషలో పిలుస్తారా..! జపాన్లో ‘కాంగితెన్’ గా వ్యవహరిస్తారు. అంటే శుభాన్ని, సమృద్ధిని ఇచ్చేవాడనే కదా అర్థం. సుమో యోధుడిగా ఉన్న నీ విగ్రహం కూడా అక్కడే కనిపిస్తుంది.

క్రీస్తుశకం 806 లోనే కోబోగాయిష్ అనే బౌద్ధ మతస్తుడు జపనీయులకి వినాయకుణ్ణి పరిచయం చేసినట్టుగా చరిత్ర చెబుతుంది. ఆఫ్ఘనిస్తాన్ లోని కొన్ని ప్రాంతాల్లో గణపతి ఆరాధన ఇప్పటికీ కొనసాగుతోంది. కాంబోడియాలో ఆరో శతాబ్దం నాటి అంకారావత్ శాసనం ద్వారా గణపతి ఆలయానికి బానిసల్ని దానం చేశారని తెలుస్తూ ఉంది. అన్నట్టు గుర్తు చేసుకోవడం మర్చిపోయాను... స్వాతంత్ర్యోద్యమ కాలంలో నీ పేరు చెప్పుకునే కదా మేమంతా ఐక్యంగా కలిసిందీ. నీకు లాల్–బాల్–పాల్ గుర్తున్నారా... లాలా లజపతిరాయ్, బాల గంగాధర తిలక్, బిపిన్ చంద్రపాల్ కలిసి దేశ ఐక్యతకోసం వ్యూహరచన చేశారు. నలుగురు మనుషులు కలవడాన్ని నిషేధించిన ఆనాటి బ్రిటిష్ కాలంలో, ఇక దేశాన్నంతా కలపటం ఎలా అని ఆలోచించిన బాల గంగాధర తిలక్, నీ నవరాత్రుల్నే వేదికగా ఎంచుకున్నారు. పురాణగాథల్ని చెప్తూ భావ సారూప్యతల్ని, సమైక్యతా సందేశాల్ని అందించారు.

హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు, రావణుడు లాంటి ప్రతి నాయకులతో ఆంగ్లేయుల్ని పోలుస్తూ, ప్రహ్లాదుడుగా, రాముడిగా మనం మన దేశం కోసం, మన ధర్మం కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉండాలని బోధించారు. వినాయక చవితి రోజు వినాయకుణ్ణి పూజిస్తే, వరసిద్ధి వ్రతం చేస్తే మంచి జరుగుతుందనే సందేశాన్ని సకల జనాలకూ వాడవాడలా అందేలా చేశారు. దేవుడి మీద ఉన్న నమ్మకాన్ని దేశం మీది భక్తిగా మార్చారు. మనం నిలబడాలంటే, మన సంస్కృతిని నిలబెట్టుకోవాలంటే స్వేచ్ఛ అవసరమనే భావాన్ని ప్రతి మనిషిలో నింపారు. చూశావా మహాకాయా.. నువ్వు మా స్వతంత్ర సాధనలో ఎలా స్ఫూర్తిని నింపావో...

అన్నట్టు 21 పూర్ణ సంఖ్య. 21 సమిధల్ని యజ్ఞంలో వాడతారందుకే. అందుకే 21 రకాల పత్రులతో నీకు పూజ చేస్తారు. నాకు తెలిసిపోయిందిలే వాటి వెనుక ఉన్న ఆరోగ్య రహస్యాలు. అందుకే కదా నీకు ఇష్టమైన పత్రాల్తో పూజ చేస్తున్నందుకే మాకు మేలు చేస్తూ ఉంటావు. అంత పెద్ద ఆయుర్వేద రహస్యాలని ఎంత బాగా చెప్పావో, ఈ 21 పత్రాల ద్వారా. అర్జున పత్రం అంటే తెల్ల మద్దిచెట్టు ఈ ఆకులు శ్వాస సంబంధ వ్యాధులకి, హృద్రోగాలకీ అంటే గుండెకి ఉపయోగపడుతుంది. మాచీపత్రం గాలిని శుద్ధి చేయడానికి, ఉబ్బస వ్యాధికి పనికొస్తుంది. గండకీ పత్రం రక్తాన్ని శుద్ధి చేస్తుంది. బదరీ ఆకులు అంటే రేగు జీర్ణ శక్తిని పెంచుతుంది.

కరవీర అంటే గన్నేరు, బొల్లి వ్యాధిని నియత్రిస్తుంది. సింధువార అంటే వావిలాకు పంటి నొప్పులకి, కీళ్ల నొప్పులకు పనిచేస్తుంది. బిల్వపత్రాలు ఇవి ఇరవై ఒక్క రకాల బ్యాక్టీరియాలను నిర్మూలిస్తాయి. ముఖ్యంగా కంటి వ్యాధుల నుంచి సాంత్వన చేకూరుస్తుందీ పత్రం. అశ్వత్థ వృక్షం అంటే రావి చెట్టు, అంటే బోధివృక్షం కూడా ఇది అతిసారానికి, కంటి వెలుగుకి పనిచేస్తుంది. ఇక తులసి మనందరికీ తెలిసిందే.

గొంతు జలుబు, దగ్గుని మాయం చేస్తుంది. బృహతీ అంటే నేల మునగ లేదా వాకుడాకు, వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. దత్తూర అంటే ఉమ్మెత్త, కీళ్ల రోగాల నుంచి ఊరట కలిగిస్తుంది. అర్క అంటే జిల్లేడు, పాము, తేలు కాటు విషాన్ని హరించడానికి ఉపయోగపడుతుంది. అపామార్గ అంటే ఉత్తరేణి, పొట్టలో పురుగుల నివారణకు ఉపకరిస్తుంది. జాజిపత్రం తలనొప్పికి, నోటి పూతని నివారిస్తుంది. జ్ఞాపకశక్తిని పెంచుతుంది దేవదారు పత్రం. దూర్వా అంటే గరిక లేదా బెర్ముడా గడ్డి. ఇది చర్మ వ్యాధుల నుండి కాపాడుతుంది. విష్ణుక్రాంత అంటే అవిసె లేదా అపరాజిత పత్రం. ఇది పిత్తం, కఫం, జ్వరం నుండి కాపాడుతుంది. మరుపక అంటే మరువం, జుట్టు రాలడాన్ని అరికడుతుంది.

చూత అంటే మామిడి చిగుళ్ళ వ్యాధి, నోటి పూతని అరికడుతుంది. శమీ అంటే జమ్మి చెట్టు ఆకు చర్మవ్యాధులను నివారిస్తుంది. దాడిమ అంటే ఎరుపు గుంజల దానిమ్మ. రక్త హీనత నుండి కాపాడుతుంది. అబ్బో ఇన్ని ఆయుర్వేద గుణాలు ఉన్నాయి కాబట్టే కదా ఓ రోజంతా ఇంట్లో ఉంచుకోమంటావ్, దగ్గర కూర్చొని ఆ పత్రాలతో పూజ చేయమంటావ్. అన్నట్లు గణపతయ్యా ఎందుకయ్యా నీకు మా మనుషుల్లాగా ఆ రంగుల షోకు... ప్రకృతి దేవుడివి కదా, ప్రకృతి పరంగా వచ్చిన పువ్వులు, ఆకులతో పూజలు చేయించుకోవచ్చుగా, అనాదిగా అదే కదా చేశావ్... మరి ఇంకా ఆ కృత్రిమ రంగులు అద్దుకోడం ఎందుకు చెప్పు.

ఎలా కొలిచినా కోరిన వరాలిచ్చే బోళా శంకరుడి సుపుత్రుడివి నువ్వు. సుభిక్షంగా జగతి ఉండాలని, సకల వనరులూ శ్రేయస్సుతో నిండాలని, మనిషికి ఏ విఘ్నాలూ కలగకూడదని కోరుకునే మనిషి ప్రేమికుడివి నువ్వు. ప్రకృతిలో దొరికే వనరులతోనే నీ రూపం చేసి, ప్రకృతి పరంగా లభించే రంగులు అద్దితేనే కదా – నీకూ మాకూ మేలు జరిగేది ! అయినా ప్లాస్టర్–ఆఫ్–పారిస్, విష రసాయనాలతో ఊరేగడం నీకు మాత్రం ఇష్టమా చెప్పు. కాపర్ సల్ఫేట్, అల్యూమినియం ఆక్సైడ్, మెర్క్యూరీ సల్ఫైడ్, మెగ్నీషియం, సిలికాన్, కోబాల్ట్, మాంగనీస్ డయాక్సైడ్, ఈస్ట్ తిన్నర్, వార్నిష్ లు రంగుల్లో ఉండటం వల్ల నిన్ను నిమజ్జనం చేసిన చెరువుల్లోని చేప పిల్లలు చచ్చిపోతున్నాయట. కొన్ని చేపలు

మిగిలినా...వాటిని తిన్న మనుషుల్లోని మెదడులోని సున్నిత కణాలు దెబ్బతినటం వల్ల మరణం కూడా సంభవించే ప్రమాదం ఉందిట. మెర్క్యురీ మూలకం ఎంత ప్రమాదమో నీకు కూడా తెలుసు కదా.

అంతెందుకు నిమజ్జనం చేసిన చెరువుల్లోని అరుదైన వృక్షజాతులు కనుమరుగయ్యే ప్రమాదం దీని మూలంగా హెచ్చుగానే ఉందని శాస్త్రవేత్తలు అంటున్నారు. గణపతి దేవుడా చిన్నప్పుడు నేను సోమరితనంతో హోం వర్క్ సరిగా చేయకపోతే, నువ్వు చాలా ఫాస్ట్ గా రాస్తావని, అందుకే నిన్ను వ్యాస భగవానుడు భారతాన్ని రాయడానికి వినియోగించుకున్నాడని, నేను కూడా ఫాస్ట్ గా రాస్తే నాకూ నీలా మంచి పేరు వస్తుందని మా అమ్మ చెప్పింది. షట్చక్రాల్లో అంటే మనిషి శరీరంలో ఉన్న ఆరు చక్రాల్లో మూలాధార చక్రానికి అధిష్టాన దేవత నువ్వేనని, అందుకే నిన్ను పార్వతీ దేవి ద్వారపాలకుడిగా కాపలా పెట్టిందనీ, అలా నిక్కచ్చిగా వృత్తిని ధర్మ నిరతితో పాటించేవాడు గొప్ప వాడవుతాడని మా తాత చెప్పాడు.

నీ చెవులు చూపించి, పెద్ద చెవులు ఎక్కువగా వినడానికని, చిన్ని నోరు తక్కువగా మాట్లాడ్డానికేనని మా నాన్న చెప్పేవారు. నీ నడుముకున్న నాగుని చూపించి ఎక్కువగా తింటే కడుపు పగిలి ఉండ్రాళ్లు బయటకు వచ్చాయని, శంకరుడు నాగ బంధంతో నీ పొట్టని బంధించిన సంగతి చెప్పి, మితాహారం హితమని మా పిన్ని చెప్పింది. ఎలుక వాహనం ఎక్కి ఏడేడు లోకాలకీ వెళ్లడాన్ని చూసి, బలహీనులైన ఎలుకలాంటి వాళ్లతో కూడా పనులను సక్రమంగా చేయించుకునే నేర్పు మనకి ఉండాలని మా మామయ్య చెప్పారు.

హస్తిముఖుడా, నీ గురించి కరుణశ్రీ గారు ఏం చెప్పారో తెలుసా, "ఎలుక గుఱ్ఱమునెక్కి నేఱేడు భువనాల పరిగెత్తి వచ్చిన పందెకాడు, ముల్లోకముల నేలు ముక్కంటి ఇంటిలో పెత్తనమ్మొనరించు పెద్ద కొడుకు, నల్లమామా యంచు నారాయణుని పరియాచకాలాడు మేనల్లు కుఱ్ఱ" అని. ఎంత బాగా వుందో కదా ఈ పద్యం. నాడు మూడు కోట్ల యాభై లక్షల నదుల్లో ఎక్కడికెళ్ళినా స్నానం చేసి వస్తూ, కుమార స్వామికి నీవే కనిపించి నాయకత్వాన్ని చేజిక్కించుకున్న విఘ్నాతిపతివి నువ్వు. నారాయణ మంత్రోచ్చరణతో విఘ్నాదిపత్యాన్ని జననీ జనకుల చుట్టూ తిరిగి – తల్లిదండ్రుల్ని సేవించడాన్ని మించిన గొప్ప సేవ మరోటి లేదని చాటిన కొడుకువి నువ్వు.

ఈ రోజు చంద్రుడ్ని చూస్తే నీలాపనిందలు కలుగకుండా ఉండేందుకు శమంతకోపాఖ్యానాన్ని చదివి, విని పూజాక్షతల్ని తలపై వేసుకుంటే సకాల శుభాలు కలిగేలా ఆశీర్వదించిన దొడ్డ మనసున్న దేవుడివి నువ్వు. నాకు ఒక్క విషయం మాత్రం ఎందుకో బాగా బాధ వేస్తుంది. వెలకట్టలేని సంపద అనుగ్రహించే నిన్ను అంగట్లో అమ్మకానికి కూచోబెట్టడాన్ని చూడలేక పోతున్నాను. వరుసగా నిలబెట్టి సెలక్షన్ల కోసం నీ చుట్టూ చక్కర్లు కొట్టడాన్ని చూసి జీర్ణించుకోలేక పోతున్నాను.

నీకు కూడా మా మనుషులు రంగుల తేడాను పులుముతున్నారు. కుల, మతాల్ని పులుముకున్న పార్టీల కండువాలు కప్పుతున్నారు. తమకిష్టమైన హీరో పోలికలతో నిన్ను తయారు చేస్తున్నారు. నీ దగ్గరకు చెప్పులతో వెళితేనే తప్పు అనుకునే వాళ్ళు నీ పేరు మీద ఎన్ని తప్పులైనా అలవోకగా చేసేస్తున్నారు. నిన్ను చూపించి విరాళాలు అడుగుతూ తమ బొజ్జల్ని బాగా నింపుకుంటున్నారు. మేం వేసే కన్నాల ముందు నీ ఎలుక చేసే కన్నాలు ఏ పాటి చెప్పు! నిజం చెప్పనా – నువ్వు దేవుడిగా మండపంలో వుంటేనే మొక్కుతాం. నువ్వాలా నడివీధుల్లో అమ్మకానికి నిలబడితే చూసి, మొక్కలేని జనాన్ని చూసి ఎందుకో బాధగా ఉంది.

గణపతయ్యా ! దేవుణ్ణి కూడా అమ్మకం పాలు చేస్తున్న మా పైత్యాన్ని తగ్గించు. ఎంచక్కా పూర్వం రోజుల్లాగా చెరువుల్లోకి వెళ్లి మట్టి తెచ్చుకుని ఎవరి ఇంట్లో వాళ్లే మట్టి ప్రతిమలు చేసుకునే రోజుల్ని మళ్లీ రప్పించు. పర్యావరణాన్ని రక్షించే ఇలాంటి పండుగల్ని మరిన్ని చూపించు. దేవుడు అంటే ప్రకృతని, దాన్ని కాపాడుకుంటే దేవుడి అనుగ్రహాన్ని దక్కించుకోవడమేనని పీఠాధిపతులతో చెప్పించు. నీ పై మరొకరి పెత్తనం లేకుండా స్వతంత్రంగా ఉండడం నన్నెంతో

ఆకర్షించింది. నీలాగా నన్ను సామర్థ్యంతో ఉండేలా దీవించు. లేఖనా సాంప్రదాయ ప్రవర్తకునిగా నీకులా నేను కూడా పేరు తెచ్చుకునేలా ఆశీర్వదించు. సిద్ధి, బుద్ధిలను అడిగినట్లుగా చెప్పు. క్షేముడిని క్షేమాలకు అధిపతిగా, లాభుడిని లాభాలకు అధిపతిగా నియమించు. మాకు సర్వ శుభాలూ, సకల సిద్ధులూ, సమస్త ఐశ్వర్యాలూ కలగాలని దీవించు. ఇకనుంచీ నువ్వెప్పుడొచ్చినా, ఇకో ఫ్రెండ్లీ గానే ఉంటానని, పర్యావరణ హితుడిగా, మానవాళి మనుగడను శ్వాసించే మిత్రుడిగా ఉంటానని మాటివ్వు.

వుండనా మరి నీ భక్తురాలినే కాదు

నీ అభిమాన పాత్రురాల్ని కూడా.

– సరోజినీ దేవి

# తలసీమియా

రత్నా!

ఎప్పుడో... ఎక్కడో... చదివిన జ్ఞాపకం. ఋషులు అడవుల్లోనే వుండరు. ఏకైక లక్ష్యంతో పనిచేసే ప్రతి మనిషి ఋషే – వాళ్ళు జనావళిలోనే, ఈ జనారణ్యంలోనే దొరుకుతారని. నిజంగా నిన్ను చూసేంతవరకు అనుకోలా ఓ మనిషి తన కన్నీళ్ళని మింగి, తనలాంటి కోట్ల మందికి ఆ కన్నీరే తాకనంత ఎత్తున పెద్ద దుర్గం కడ్తారని...

నిజంగా నీ జన్మ సఫలత చెందింది రత్నా ! మానవుడే మాధవుడని, చాటి మనిషికి సేవచెయ్యటమే దైవత్వమని ఎందరో ప్రవచకులు చెప్పారు. కానీ ఆచరించటం ఎంత మందికి సాధ్యం చెప్పు... నన్నే తీసుకో, కాలమంటే నాకు దైవంతో సమానం. నారాయణ స్వరూపంగా కొలుస్తాను. office కి time కి వెళ్తాను... time కి వస్తాను. విధి నిర్వహణ ఖచ్చితంగా పాటిస్తూ దేశాన్నే ఉద్ధరించేస్తున్నాను అనుకునేదాన్ని కానీ అదే నారాయణుడు ఓ మనిషి బ్రతకటానికి చనిపోవటానికి మధ్య 2, 3 వారాల కాల అవధిని నిర్ణయిస్తాడని... ఇది ప్రతినెల జరిగే యమ యాతన పర్వమని తెలిశాక నాకు నేను బ్రతకటంకాదు నాచుట్టూ ఉన్న జనాల వెతల్నికూడా చూడటమే నిజమైన నైజం అని తెలుసుకున్నాక నా అజ్ఞానం మీద నాకే అసహ్యం కలిగింది.

ఈ భూమ్మీద విచ్చుకత్తులు పట్టుకుని ఒకరినొకరు నరికేసుకుంటున్న జనాల్ని చూసిన నాకు – ''బాబూ! కాస్త రక్తం దానం చెయ్యండి బాబూ. నా పిల్లాడి బ్రతుకు మీరిచ్చే రక్తం మీదే ఆధారపడి వుంటుంది. కాస్త కనికరించండి'' అంటూ కాళ్ళా వేళ్ళా పడటమంటే ఎంత ఘోరంగానో అన్పించింది. నిజంగా నేను చూశాను రత్నా. ఇలా అడుగుతున్న వాళ్ళని... విసుగ్గా చీత్కారంగా తన ముఖంమీదే తలుపులు వేసుకున్న వాళ్ళని... బ్రతకటానికి... తన వాళ్ళని బ్రతికించుకోవటానికి ఓ మనిషి ప్రతినెలా పడే కష్టాన్ని తల్చుకుంటే గుండె చెరువవుతుంది. ఓ అబ్‌నార్మాలిటి మనిషిని మృత్యువులా తరుముకొస్తుందని, రోజుల తాఖీదులందిస్తూ నేలకింది పడకను సిద్ధం చేస్తుందని, అనుభవం లేని ఎవరికన్నా చెబితే నమ్ముతారంటావా? ఒకప్పుడు నేనూ అంతేగా ...

కానీ నమ్మాలి... నమ్మి తీరాలి... తలసీమియా వ్యాధిగ్రస్తుల తలరాతలు చదువుతుంటే రంగులన్నీ తెలుపులో కల్సి ఒకే రంగైనట్టు వేదనంతా ఒకేలా కనిపించింది. ఎన్ని కథలు విన్నా చివరికి పుట్టటం దగ్గర అందరిదీ ఒకే ప్రోసెస్... అయినా... చివరికి అబ్‌నార్మలిటి జన్యు కలయిక. వాహకులుగా వున్న ఇద్దరు వ్యక్తుల సంపర్కం ఒక బిడ్డగా జన్మించినపుడు ఆ జననం తన కుటుంబాన్నే అతలాకుతులం చేయటం ఎంత దౌర్భాగ్యం. చిత్రం ఏమిటంటే తలసీమియాకి కారణమైన జన్యువును కలిగివున్న తల్లికి కానీ తండ్రికి కానీ ఏవిధమైన ఆపదా రాకపోవటం, లేకపోవటం ఇద్దరూ కారకులుగా వున్న వారి జన్యుసంపర్కం వల్ల పుట్టే బిడ్డలు మాత్రమే ఇలా బాధపడ్తారు. బలవుతున్నారు...

రాములవారు ఒకసారి ఒక ఉడుత మీద చేయివేసి కూచున్నారట. చాలాసేపటి తరువాత అది గమనించి బాధపడి ఇంతనొప్పిగా ఉంటే నువ్వు నాకెందుకు చెప్పలేదు. చూడు నువు ఎంత నలిగిపోయావో అని అనునయంగా అడిగారట. అందుకు ఆ ఉడుత ‘‘శ్రీరామచంద్రా! నాకే కష్టమొచ్చినా రామా అని నిన్నే పిల్చేదాన్ని. ఆకష్టమే నీరూపంలోవస్తే ఇంకెవరికి చెప్పుకోను చెప్పు’’ అందట. అలాగే మనకే కష్టమొచ్చినా తల్లిదండ్రులకు చెప్పుకుంటాం. తల్లిదండ్రులు మనకండగా నిలబడి ఆ కష్టాన్నుండి మనల్ని దూరం చేస్తారు. అలాంటిది పసిపిల్లలకి తలసీమియా పేరుతో వచ్చే కష్టానికి కారకులు వాహకులుగా వారే అయితే ఇంకెవరికి చెప్పుకుంటాం.

నిజానికి ఇది ఒక వ్యాధి అందామా ? జన్యుపర్యమైన డిజార్డర్ అందామా? ఒకే వ్యక్తి ఈ వాహకంగా ఉంటే ప్రాబ్లమ్ ఏమీలేదు అనే కదా నువ్వు చెప్పింది. అదే ఇద్దరూ తల్లీదండ్రి ఈ జన్యువుకు వాహకంగా ఉంటే అపుడు పుట్టే పిల్లలు తలసీమియాతో బాధ పడ్తారు. డిఫెక్టివ్ జీన్స్‌తో పుట్టడం వల్ల ప్రతి 2, 3 వారాలకొక్కసారి (బ్రతికినంత కాలం) వీరు రక్తం ఎక్కించుకుంటూనే ఉండాలా? అయితే ఇది దయాలసిస్ మాత్రం కాదు ? అంతేగా..

అన్నట్టు నువ్వేదో అన్నావు చూడూ ! ఐ ఇంచెలెన్స్‌థెరపీ అని. నాకు అది బాగా అర్థంకాలేదు. అయితే వీళ్ళకు మందులు బయట దొరకవనీ చెప్పావు. ఎందుకంటే side effects ఉంటాయనీ అన్నావు కదా! ప్రతి కుటుంబంలో తలసీమియా గ్రస్తులు ఒకరుంటే జీవితాంతం ఆ వ్యక్తికి రక్తం ఎక్కించుకుంటూపోతే ఆ కుటుంబంలో ఒక వ్యక్తి ఆ బాధితులతోనే ఉండాల్సిరావడం జరిగిద్ది కదా! రేపు అసలు ఏమి అవుతుందో తెలియని దశలో పిల్లల్ని అలా చూస్తూ ఉండటం ఎంతకష్టమో కదా! రత్నా ! నువు విన్నావో లేదో మనం ఆ సొసైటీకి వెళ్లినపుడు ‘వల్లి’ అనే ఒకావిడ ఒకమాట అన్నది. నాకు జీవితంలో పెద్ద కోరికలేం లేవు. నా బాబు school bag పట్టుకొని అందరి పిల్లల్లా ఆడుతూ పాడుతూ స్కూలుకు వెళ్ళటాన్ని చూడాలన్నదే నా కోరిక అని. నిజంగా నా కళ్ళల్లో నీళ్ళు వచ్చాయి తెలుసా !

నా జీవితాశయంగా అదే పెద్ద కలగా బ్రతికాను అని ఆ బాబుతల్లి అంటుంటే ప్రతి కుటుంబంలో సహజాతి సహజంగా జరిగే ఆటపాటలు స్కూల్, పిల్లల మాటలు, అల్లరి మాటలు, అల్లరి ఇవన్నీకూడా వాళ్ళకి ఎంతో అరుదుగా దొరుకుతాయా అన్పించింది. నిజంగా నువ్వర్థం చేసుకున్నావు రత్నా నామానసిక స్థితిని. అందుకే వెంటనే బయటకి తీసుకొచ్చేశావు. వాళ్లముందు ఏడ్చి వాళ్ళను బలహీనపర్చొద్దు అని కూడా వార్నింగ్ ఇచ్చావ్.

దాదాపుగా మనం వెళ్ళిన తలసీమియా Sick cell Society లోనే 2700 పై చిలుకు బాధితులు ఉన్నారంటే ఇక దేశం పరిస్థితి ఏంకాను. ప్రతి ఏడాది మనదేశంలో 10 వేల మంది తలసీమియా బాధితులు పుడుతున్నారా ? వింటుంటే భయంగా వుంది రత్నా !

చాలామంది దీన్ని మొదట్లో రక్తహీనతగానే భావిస్తారు. తొందరగా అలసిపోవడం, చర్మం పాలిపోవడం, ఎముకల సమస్యలతో, బలహీనంగా అన్పించడం కనిపిస్తుంది. అతి విషాదకరం ఏమంటే ఈ Disorder కి లోనైన ఆడపిల్లల్ని కుటుంబంలో ఎవరూ పట్టించుకోకపోవడం వల్ల త్వరలోనే వారు చనిపోతున్నారు. మగ పిల్లవాడు వంశోద్ధారకుడంటూ సాకుతున్న పెద్దలు ఆడపిల్లేగా అనే నిర్లక్ష్యం చేయడాన్ని ఎందుకో నేను జీర్ణించుకోలేక పోతున్నాను.

శరీరమాద్యం ఖలుధర్మసాధనం కదా. అంటే ఏ పని సాధించాలన్నా ఆరోగ్యకరమైన శరీరం కావాల్సిందే. మన అవగాహన రాహిత్యం మూలంగా పుడుతున్న పిల్లలు ఇబ్బందులు పడాల్సిందేనా అని నెనడిగితే తలసీమియా రహిత తెలుగు రాష్ట్రాలని చూడటమే నీ ఆశయంగా నువు చెప్పినపుడు నీ పాదాలకు దండం పెట్టాలన్పించింది.

అయితే ఈ ఇబ్బంది నుండి బయట పడాలంటే Bone Marrow Transplantation ద్వారా మాత్రం శాశ్వత పరిష్కారం దొరుకుతుందని విన్నాను. దగ్గరి రక్త సంబంధీకులయితే పర్లేదుకానీ బయటివాళ్ళ దగ్గరి నుండి కూడా 100% DNA కుదిరితే Transplant చేసుకోవచ్చును. అందుకు దాదాపు 30 లక్షల ఖర్చు అవుతుందట. ఇది

మనలాంటి కుటుంబాలకి సాధ్యమయ్యే పనేనా అనిపిస్తుంది. Corporate Hospital లో ఈ Blood ఎక్కించుకోవడానికి ఎలాంటి సదుపాయాలున్నాయో అలాంటి అవసరాల్ని కల్గిస్తున్న మీలాంటి స్వచ్ఛంద సంస్థలకు Salute చేయాలి. ప్రతిరోజు 50 మంది పిల్లలవరకు బ్లడ్ ఎక్కించుకోవడానికి Society లకి వస్తున్నారంటే అర్థంచేసుకోవచ్చు ఎన్ని కుటుంబాలు ఈ యజ్ఞంలో మగ్గుతున్నాయో.

Blood అనేది Factory లో తయారయ్యే పదార్థం కాదు. కేవలం మనిషిలో మాత్రమే దొరికే అతి ముఖ్యమైన పదార్థం. చూడడానికి ఎర్రగా ఉన్న తెల్లకణాలు, ఎర్ర కణాలు, ప్లాస్మా అనే మూడింటి సముదాయంగా కన్పించే రక్తంలో 90% నీరే ఉంటుంది. ఒక చిన్న రక్తపు చుక్కలో 50 లక్షల ఎర్ర కణాలుంటాయి Hemoglobin వల్లనే వాటికి ఎర్రరంగు వస్తుంది. రక్తం గుండెనుండి ఊపిరి తిత్తుల్లోకి పోయినపుడు ఎర్రకణాలు అక్కడ Oxygen పీల్చుకొని శరీరంలోని జీవకణాలకందిస్తుంది. మనం తినే ఆహార పదార్థంలోని ఇనుము మూలంగానే రక్తం చిక్కగానూ, ఎర్రగానూ ఉంటుంది. తలసీమియా గ్రస్తుల్లో ఆ ఇనుపధాతువే ఇబ్బంది పెడితే ఇక వారి పరిస్థితి ఏమి కానో ఆలోచించుకుంటే భలే బాధేస్తుంది.

తెల్ల రక్తకణాలు రోగాల్ని పుట్టించే సూక్ష్మ జీవుల్ని అడ్డుకుంటూ హరించివేస్తాయి. ఏదైనా దెబ్బ తగిలినపుడు ఒకదానిపై ఒకటిచేరి గాయాల్ని మాన్పేశక్తి తెల్లకణాలకే ఉంది. ఇక Plasma విషయానికొస్తే రక్తం గడ్డకట్టడాన్కి ఇది దోహదపడ్తుంది. ప్రతి మనిషి శరీరంలో 200 ఔన్సుల రక్తం ఉంటుంది. ఒకవేళ తడవకు 8 ఔన్సులు తీస్తే మరలా రెండురోజుల్లోనే ఎముకల మూలుగుల్లోంచి మళ్లీ పుడుతుంది.

రక్తం గంటకు 7 మైళ్ళ వేగంతో ప్రవహిస్తుంది. అలాంటి అద్భుతమైన రక్తాన్ని మరో వ్యక్తి ప్రాణదానం కోసం ఇవ్వలేమా? ప్రతి 6 నెలలకొకసారి రక్తం దానం చేస్తూ ఉంటే మళ్ళీ కొత్తగా రక్తం పుడుతూనే ఉంటుంది. అలాంటపుడు మనసాటి మనిషిని బ్రతికించగల్గే ఈ రక్త దానానికి మనం ఎందుకు ముందుకు రావడం లేదూ? ఇపుడు మన దగ్గరున్న తలసీమియా వ్యాధిగ్రస్తులు ఆరోగ్యంగా జీవితాంతం బ్రతికాలంటే ప్రతిరోజు వందమంది అయినా రక్తదాతలు ముందుకు రావాలి. క్రాస్ మ్యాచ్ అయిన blood ని, RBC అయిన బ్లడ్‌నే పిల్లలకు ఎక్కిస్తారు.

ఇంతక్రితం వీరికి ఆరోగ్యశ్రీ సదుపాయంకూడా లేదు. ఇపుడు గుడ్డిలో మెల్లగా ఆ అవకాశం వచ్చి చేరింది. కానీ Railways లో ఉన్నట్టుగా Bus లో కన్సెషన్ ఇస్తే బావుండు అన్పించిది. పెద్దగా గమనించీ గమనించనట్టుగా చూశా... నువ్వెందుకు పొద్దస్తమానం Tea ఇస్తున్నావా అనుకున్నాను. 2సార్లు Tea ఇచ్చావు. 2 సార్లు గోధుమ గడ్డితో చేసిన ద్రావణాన్ని ఇచ్చావు. ఇవి తలసీమియా వ్యాధి గ్రస్తులకు మంచిదని నువ్వు చెప్పేవరకు నాకు తెలియలేదు తెలుసా.

Bone Marrow Center లు ఎక్కువుంటే ఈ బాధితులు శాశ్వత పరిష్కారాన్ని పొందగల్గుతారేమో. సొంత Lab లు, సొంత blood bank లు, లాభాపేక్ష లేకుండా నిర్మించగలిగే వారుంటే నిర్ధారిత సేవలతో ఆరోగ్యకరమైన పిల్లల్ని త్వరగా చూడొచ్చు కదా అన్పించింది. అయినా ఈ పిల్లలు HpA2 చేసుకుంటే బావుంటుంది. I ఇంజిలేషన్ Drugs అవసరం కూడా ఎక్కువేనని చెప్పావు కదా ఎవరైనా విశాలహృదయం ఉన్నవాళ్ళు ఈ పిల్లలకోసం ముందుకొచ్చి ఉచిత సహకారాన్ని అందిస్తే బావుండు. ప్రతినెలా రెండు యూనిట్ల రక్తాన్ని వెతుక్కోవడమంటే ఎంత భారమోకదా. నువ్వన్నది నిజమే. Counselling చేస్తూ Population Screening చేస్తూ ఇలాంటి పిల్లలు పుట్టకుండా చేయగల్గితే మనం అనుకున్న లక్ష్యాన్ని చేరుకో గల్గుతాం. ఈ పిల్లలకి Iron దుష్ప్రభావం ఏ అవయాలమీద పడుతుందో తెలుసుకునేందుకు Organ Screening Camp లు నిర్వహించటం గొప్ప విశేషం రత్నా !

ఈ మధ్య నా స్నేహితుడు ఒకరు Isabella's Journey అనే పుస్తకాన్ని నాకిచ్చారు. Her battle , with the blood disorder! ఇది నిజంగా అద్భుతమైన Biography. ఇది రీల్ స్టోరీకాదు Real Story నే. Isabella కు ఆమె కుటుంబం, స్నేహితులుల, Doctors ఎంతగా సహాయ సహకారాలు సమకూర్చారో మానవతా దృక్పధంతో

ఎంతగా స్పందించారో తెలిపే విశేషాలు ఎన్నో ఉన్నాయి పుస్తకంలో. అయ్యో అని పెదవి విరిచి ఊరుకుంటే సరిపోతుందా? రోజంతా ప్రార్థనలు చేస్తే వారి బ్రతుకులు బాగుంటాయా ? ప్రార్థించే పెదాలకంటే సాయంచేసే చేతులు పవిత్రమైనవి అని మదర్ థెరిస్సా చెప్పిన మాటలు వినలేదా? ప్రపంచ జనాభాలో వారి శాతం 1 కన్నా తక్కువే కావచ్చు! కానీ వారి కన్నీరు తుడవడానికి రెండు పొడిచేతులు కూడా ఇవ్వలేమా? నాబాబు రేపటికి బ్రతికుంటాడా అన్న సందిగ్ధంతో రాత్రంతా వాడి పక్కనేకూర్చొని చూస్తూ ఉండేదాన్ని. రక్తం ఎక్కించిన రోజున మాత్రమే నేను నిశ్చింతగా పడుకునేదాన్ని. నా బాబు మరో 15 రోజులు బ్రతికే ఉంటాడన్న నమ్మకంతో. ఇలా చావు బ్రతుకుల మధ్య లోలకం లా తిరిగే కుటుంబాలు ఎన్నో కదా. ఇలా కొన్ని సం॥లుగా ఎన్ని నిద్రలేని రాత్రులు గడిపానో అని ఓ తల్లి చెపుతుంటే కడుపు తరుక్కుపోయింది.

ఇందాక వల్లి అనే ఆవిడ తన బాబు స్కూల్ బ్యాగు పట్టుకుని అందరి పిల్లల్లా స్కూల్ కు వెళ్ళడం చూడాలన్నారని చెప్పానుగా. నిజంగా ప్రతి కుటుంబంలో అతి సహజంగా ప్రతిరోజూ నెరవేరే ఆ కోరిక వల్లికి జీవిత కలగా మారటం ఎంత దురదృష్టం.

ఓ పెద్దాయన, ఆపక్కనే ఉండి మరొకమాట అన్నాడు. ''అడుక్కోవటం మా కుటుంబాల్లో లేదు, కాని బిడ్డను బ్రతికించుకోవటం కోసం రక్తాన్ని అడుక్కుంటూనే ఉన్నా'' మని. అసలు ఇది యాతన ఎందుకవుతుంది. ప్రతి మనిషికి కావలసిన రక్తం కంటే ఎక్కువ రక్తమే కదా ఉంది. చెలమలో నీరు ఊరినట్టు, రక్తం తీస్తున్నకొద్దీ, కొత్త రక్తం ఉబుకుతూనే ఉంటుంది. అది ఆరోగ్యదాయకం కూడా. ఒక మనిషిని బ్రతికించే అవకాశాన్ని, అదృష్టాన్ని మీరు వారికి కలిగిస్తున్నారనుకొని చూడండి ఎంత రిలీఫ్‌గా ఉంటుందో. మీ సెంటర్‌కి వచ్చి రక్తదానం చేసిన ప్రతి ఒక్కరూ అదొక పవిత్ర బాధ్యతగా భావిస్తున్నారే తప్ప... భారంగా భావించకపోవటాన్ని నేను గమనించాను.

అందుకే మనం ఒక Action plan తయారుచేసుకుందాం Action plan అంటే A అంటే Awareness, C అంటే Confidence, T–అంటే Timely treatment, I – information. O – openness N – అంటే New life ఇదే నా Action plan. దీనికోసం మూడు దశాబ్దాలుగా నువు పడ్డ శ్రమని గుర్తించి నీ సహాయకులుగా ఓ వెయ్యిమంది యువదళాన్ని కూడగడుదాం. ప్రతి మనిషిలో రక్తదానం పట్ల అవగాహన పెంపొదిద్దాం. పెళ్ళికిముందే రక్త పరీక్షలు చేయించుకోవడాన్ని ఓ చట్టంగా తీసుకొచ్చే ఏర్పాట్లకు శ్రీకారం చుడదాం.

ఈ రోజు నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను రత్నా ! నిజాయితీగా, బ్లడ్ డొనేషన్ క్యాంపుల్ని నిర్వహిస్తాను. రక్తదాతలకు అవగాహన కలిగించి, సహానుభూతితో సాటి మనుషుల కోసం ముందుకొచ్చే ఏర్పాట్లు చేస్తాను. మనిషిగా మరో మనిషిని బ్రతికించే యజ్ఞానికి సమిధగా మారుతాను. నా జీవితానికి ఒక అర్థాన్ని సద్భావన కలిగించినందుకు ధన్యవాదాలతో...

ఉండనా మరీ...

నీ

– లతాజైన్

# సమాజమా...!

సమాజమా!

'సమ' అన్న పదాన్ని పేరులో పెట్టుకున్నదానివి. సమవర్తిగా న్యాయాన్యాయాలు సరిచూసుకోవాల్సిందానివి. సంగమ స్థలిగా, కూడలిగా, విభిన్న వర్గాలను-వర్ణాలను కలిపి ఉంచే చైతన్య ప్రకాశానివి. మరి నువ్వే గతి తప్పితే ఎలాగమ్మా? పంచభూతాలు ఆక్రోశిస్తాయి. సృష్టి తన పంజా విసిరి ఈ ప్రపంచాన్ని అంతం చేసి సరికొత్త జీవజాలానికి మళ్ళీ పురుడు పోస్తుంది. అందుకే నువ్వు తార్కికంగా, మానవీయంగా, శాస్త్రీయంగా ఆలోచించి కాస్త మా ఈ ఆసమానతల్ని, అన్యాయాల్ని, అత్యాచారాల్ని అమానవీయతని సరిదిద్ది మానవాళిని కాపాడవా...

ఏమిటీ... అలా తెల్ల ముఖం వేసుకొని నా వంక చూస్తున్నట్టుగా అనిపిస్తున్నావు. ఇంకా నేను ఎవరో నీకు అర్థం కావట్లేదా? జస్టిస్ ఫర్ దిశా ని . గుర్తొచ్చానా.అంత తేలిగ్గా మర్చిపోయే విషయమా నా జీవితం .ఐనా నీకు తెలియంది ఏముంది చెప్పు. ఏ పత్రిక తిరగేసినా, ఏ ఛానల్ పెట్టినా, ఏ నలుగురు మనుషులు గుమిగూడినా ఇవ్వాళ్రేపు చర్చించుకునేది నా గురించేగా ... పసిపిల్లల మీద అత్యాచారాలు, అతివలపట్ల అమానవీయత, ఉమెన్ ట్రాఫికింగ్ లేనిరోజు భారతంలో కనిపిస్తుందా ! అసలు ఈ మాటలు రాస్తుంటేనే గుండె పగులుతోంది తెలుసా... ఎంత నికృష్టం కాకపోతే ఇలాంటి ఆలోచనలు మెదడులో మొలుస్తాయ్ చెప్పు!

అమ్మంటే కష్టాలకు, కన్నీళ్ళకు వీలునామా కాదు
కల్మషం లేని ప్రేమకు చిరునామా...
కోడలంటే కూడికల తీసివేతల లెక్క కాదు
మన వాకిట్లో పెరిగే తులసి మొక్క...
భార్య అంటే దించేసుకునే బరువు కాదు
మన ఇంట్లో వెలిసిన కల్పతరువు...
కూతురంటే భద్రంగా చూడవల్సిన గాజు బొమ్మ కాదు
మన కడుపున పుట్టిన మన అమ్మ

అని నా పొయెట్ ఫ్రెండ్ లా ఎందుకు ఆలోచించరు.. ? కడుపులో నవమాసాలు మోసిన అమ్మ ఋణం కూతురు రూపంలో మనం తీర్చుకుంటామని చాలా మంది నమ్ముతారు. ప్రతి స్త్రీ ఓ వ్యక్తికి భార్యగానో, మరో బిడ్డకు తల్లిగానో, మరొక వ్యక్తికి కూతురుగానో, ఇంకో వ్యకికి తోబుట్టువుగానో వుండే ఉంటుందిగా .. మరి మీ కూతురిలా పవిత్రంగా — మీ భార్యంత గౌరవంగా — మీ అమ్మంత ప్రేమగా — మీ తోబుట్టువంత ఆదరంగా వాళ్ళతో ఉండవెందుకని ఈ మగాళ్ళని

అడగవెందుకు సమాజమా? కూతురు ఒక్క క్షణం ఏడిస్తేనే తల్లడిల్లే ఓ తండ్రి హృదయం అతనికి నిజంగా వున్నట్లైతే మరో తండ్రి గుండె ఆగిపోయే పని ఎందుకు చేస్తాడు? ఏ అన్న అయినా తన చెల్లిని నిజాయితీగా గౌరవించి వుంటే మరొకరి చెల్లి పట్ల అంత ఘోరంగా ఎందుకు ప్రవర్తిస్తాడు? ఒక తమ్ముడే కనుక నిండుగా నవ్వే అక్కని తేరిపార ఎప్పుడైనా చూసి వుంటే ఆ నవ్వును ఎందుకు మరో తమ్ముడి అక్క నుండి దూరం చేయాలనుకుంటాడు – అందరూ అందరి మగాళ్లకు రక్త సంబంధీకులేగా... మరి పాము తన పిల్లల్ని తానే చంపుకున్నంత హేయంగా ఈ అఘాయిత్యాలు, అత్యాచారాలు ఏమిటి? కామానికి లజ్జ, గౌరవం, ఉచితానురీతులు గుర్తుకురావా?అసలు ఏమిటి నేను చేసిన తప్పు ? అందంగా పుట్టటమా .. ఆడపిల్లగా బతకటమా .. మనుషుల్ని ఇంకా నమ్ముతామా? నా పని నేను చేసుకుంటూ నీకు సేవ చేస్తూనే ఉన్నానుగా .. నేను చూసే పశువులకన్నా క్రూరంగా మనుషులు ప్రవర్తిస్తుంటారని ఎరక్క పోవటం నా తప్పా.. నా బండిని బాగు చేసుకుని తీసుకెళితే నాన్నకి రేపు పని సులువవుతుంది అనుకున్నానే కానీ అమ్మ నాన్నకి ఇంత కడుపు కోత ఉంటుందనుకోలా..

ప్రతి ఇంట్లో తాను ఉండలేనని తనకు మారు రూపుగా అమ్మను సృష్టించాడు ఆ బ్రహ్మ. అమ్మంటే కన్నీళ్లు–చనుబాలు కలగలిసిన రూపం. గర్భాలయంలో 9 నెలలు తన రక్తాన్ని పంచి మనకు జన్మనిస్తుంది. సృష్టిని నిలబెట్టడంలో మహోన్నత పాత్రను పోషిస్తుంది. పాపగా–అమ్మాయిగా–భార్యగా–చెల్లిగా–అక్కగా–వదినగా–విభిన్న రూపాల్లో కనిపిస్తూ మగవాడి మొరటు శిలా గృహానికి అలరించే, అలంకరించే ఆలంబనవుతుంది. అందుకేగా 'ఆడపిల్లలు ఆడపిల్లలు అవని కురిసిన పూల జల్లులు' అన్నారో కవి.

గణాంకాలు తీసుకుంటే భయంతో వొళ్ళు జల్లు మంటుంది ..పంజాబ్ పాటియాలలో అత్యాచారం చేసిన వాళ్ళు నవ్వుకుంటూ బెయిల్ మీద తిరుగుతుండటం చూసి నా చెల్లి ఆత్మహత్య చేసుకుంటే .. ఉత్తర ప్రదేశ్ లో రక్షక భటుడే అత్యాచార బాధిత అమ్మాయిని కోరిక తీర్చమంటే ఏమౌతుంది ఈ సభ్య సమాజం అని నీకు అనిపించటం లేదా.? మర్మస్థానం కాదు అది నీ జన్మ స్తానం అని చెప్పలేవా.. గడ్డితిన్న ఆవు పాలిస్తే మా పాలు తాగి పెరిగిన మగవాడు మృగంగా మారటం ఎంత దుఃఖం .. మా మీదే ఇంత పైశాచికం గా ప్రవర్తిస్తే నోరు తెరిచి చెప్పలేని చిన్న పిల్లల నరకంఊహించుకుంటేనే రక్తం మరుగుతుంది .

బాలల నిధి (యూనిసెఫ్) 2007 లో చేపట్టిన సర్వే ప్రకారమే 51% బాలలు వేధింపులకు గురవుతున్నా, ప్రపంచ వ్యాప్తంగా 40% ఉన్న పిల్లలకు తగిన రక్షణ కల్పించటంలో వైఫల్యం చెందుతున్నారన్నది వాస్తవం. మనదేశంలో ముగ్గురు పిల్లల్లో ఇద్దరు వేధింపులకు గురవుతున్నారు. అయినా 70% కేసులు బయటకు రావటం లేదు. 28% శారీరకంగాను, 10% మానసికంగాను, 30% లైంగిక వేధింపులకు గురవుతూనే ఉన్నారు. 2001 – 2019 వరకు మనదేశంలో 48,338 కేసులు బాలల లైంగిక వేధింపులుగా రికార్డు కావటం అత్యంత దురదృష్టకరం. నాకర్థం కావటం లేదు సమాజమా, తెలిస్తే నువ్వైనా సమాధానం చెప్పవూ...

యాత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః అంటూ నిరంతరం చదువుకొనే మనం, ఎక్కడ స్త్రీలు పూజింపబడుతారో అక్కడ దేవతలు నడయాడతారని నమ్మే మనం, సనాతనమైన ఆ సంప్రదాయాన్ని పక్కకు తోసి ఇంతగా కుళ్లిపోయిన ఈ విచ్చలవిడి అత్యాచారాల జోలికి ఎందుకు వెళ్తున్నాం? వేదాలు వెలసిన పుణ్య భూమిలో పుట్టినవారు మహిళల్ని అమ్మి పోగేసుకున్న డబ్బుల్తో జీవనాన్ని సాగించేంతగా దిగజారిపోయి, దైన్యంలో పడిపోతున్నాడా అనిపిస్తోంది. ఎప్పటి కీచక పర్వాలు...ఇంకెప్పటి వస్త్రాపహరణాలు...అదెప్పటిదో సీతాపహరణం...ఆ కథలన్నీ విన్నవే – చివరికి దుష్ట సంహారం, శిష్ట రక్షణా జరిగినవే. కానీ ఈ కలియుగంలోని కీచకులు, రావణులు, దుశ్శాసనులు ఎన్నో రూపాల్లో ఎక్కడెక్కడో చేస్తున్న ఈ నిరంతర క్రూర పర్వాలకు విముక్తి లేదా? నిర్భయంగా పసిపిల్లలు, ఆడవాళ్లు తిరగ్గలిగే రోజులు రావా...? ఎన్నేళ్లుగానో ఎదురు చూస్తున్నాం తెల్సా... ఉందిలే మంచి కాలం ముందు ముందునా అని. ఆ కాలం అసలు వస్తుందంటావా?

పురిటి బిడ్డ మీద పాపిష్టి కళ్ళు పడ్డం ఏమిటీ ? నెలన్నర పాప మీద అత్యాచారమా... 9 నెలల పాపని పొత్తిళ్ళ నుండి ఎత్తుకెళ్ళి తన కిరాతక క్రియలతో హింసించి, చంపి భుజాన వేసుకొని నడిచొచ్చే దుర్మార్గుల్ని చూసాక ఇక పిల్లలకి, మహిళలకి రక్షణ వుందా ఈ నేల మీద, అనిపిస్తోంది. గొంతు చించుకొని అరిచి, గల్లాపట్టి నిలదీయలనిపిస్తుంది. కానీ నాకు రూపం లేదుగా... ఎలా నా ఉక్రోషాన్ని తీర్చుకోను. అత్యాచారం జరగని రోజు రావాలని – అత్యాచారాల వార్తలు లేని దినపత్రిక చూడాలని ప్రతి మహిళా ఆశపడుతుంది.అలాగే నేను అనుకున్నాను . కానీ నేనే పతాక శీర్షిక అవుతానననుకున్నానా..?నా లాంటి ఆడపిల్లల కన్నీళ్లు జీవనదులై పొంగుతుంటే నిజమైన వరదొచ్చి ఈ పాడులోకం కొట్టుకుపోదా? ఎందుకింత నిర్లక్ష్యం, ఉపేక్ష, వెకిలితనాలు? మహిళలకోసం, పిల్లలకోసం ప్రత్యేక భద్రాగారాలు తెరవలేమా? ధర్మాగ్రహంతో ఈ కీచకుల్ని కారాగారాల పాలు చెయ్యలేమా...?

భార్యలకు ఇనుపకచ్చడాలు కట్టి వాటికి తాళం వేసుకుని వేటకు వెళ్ళేవారు రాజులు, అని చదివి చరిత్రను అసహ్యించుకునే వాళ్ళం. మళ్ళీ అలాంటి రక్షణ కావాలా మాకు ? ఏమిటో ఈ దౌర్భాగ్యం, మా తల్లుల కడుపుకోత ఎవరు తీర్చాలి. ఇన్ని శిక్షలు పడుతున్నా నేరాలు తగ్గాల్సింది పోయి పెరుగుతున్నాయెందుకు? ఇంట్లోనే విచ్చలవిడిగా చొరబడ్తున్న TVల్లోని అశ్లీల రేప్ లు..నీలి చిత్రాల మాయా జాలమా ఇది? విచ్చలవిడిగా దొరుకుతున్న డ్రగ్స్, పెచ్చుమీరిన పాశ్చాత్య ధోరణులదా ఈ తప్పంతా..

NCRB జాతీయ నేర గణాంకాల సంస్థ తాజా గణాంకాల మేరకు లైంగికదాడి కేసులు 33,356 అట ఈ సంవత్సరం. సగటున రోజుకు 89 ఘటనలు జరుగుతుంటే ప్రతి నలుగురిలో ఒకరు మైనర్ వుండటం కలచివేస్తుంది. 50% వరకు కౌమార దశలో వున్నవారే. బాగా తెల్సినవారే 94% మంది లైంగికదాడికి పాల్పడుతున్నారని తెల్సిన వార్తలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. ఆరేండ్ల లోపు వారు 281 మంది అయితే 60 ఏళ్ళ వయస్సు పైబడ్డవారు 727 మంది ఉన్నారు. దేశ రాజధాని ఢిల్లి లైంగిక నేరాల్లో ప్రథమస్థానంలో ఉంది. 1215 మంది లైంగిక హత్యాచారానికి గురయ్యారు.

ఎక్కడికి పోతున్నావు సమాజమా..?! నీడనుకుని..కాపాడుతుందని నమ్మి చెంత నిలిస్తే పాము పడగై కాటేస్తున్న మానవత్వం, తోడనుకుని ఆదరిస్తే నల్ల తేలై కరిచిన బాంధవ్యం – ఎవర్ని నమ్మాలో, ఎవర్ని నమ్మకూడదో తెలియడం లేదు. అసలు స్త్రీని భోగవస్తువనో, కుతి తీర్చుకునే కామకేళి అనో ఎందుకనుకుంటున్నారు ఈ మగవాళ్ళు? స్త్రీ అంటే మనకు మాత్రమే కాదు..ఈ లోకానికే అమ్మ. అన్న స్పృహ ఎందుకు రావడం లేదు? గద్ద కోడి పిల్లల్ని ఎగరేసుకుపోయినట్లు ఆడపిల్లల్ని ఎగరేసుకుపోవడం, రెడ్ లైట్ ఏరియాల్లో, గల్ఫ్ వంటి పరాయి దేశాలకు అమ్మేయడం చదివి నమ్మాలా? ఇప్పుడు ఇంత నరకప్రాయం చూసాక ఆడతనం అంటేనే భయం వేస్తుంది ..

నీ లోపల ఏమి జరుగుతోందో నీకేమైనా అర్థమౌతోందా సమాజమా... ఈ క్యాన్సర్ నిన్నెంతగా బలహీన పరుస్తుందో ఇప్పటికైనా గ్రహించు. ఆకాశంలో సగం అంటున్నారు ..అవనిలో సగం అంటున్నారు ఆనందాల్లో సగం ఇవ్వకపోగా అవమానాలు మాత్రం హెచ్చుగానే చేస్తున్నాం. ఆత్మగౌరవాన్ని అందించకపోగా అడుగడుగునా విమర్శనాస్త్రాలు సంధిస్తున్నాం. ఇదేనా మేమంతా వున్న నీ రూపం? పైకేమో మెచ్చుకోలు..దేశాన్ని ఉద్ధరిస్తున్నట్లు ఉపన్యాసాలు.. ఇంటికెళితే చాలు ద్వితీయశ్రేణి పౌరులుగా చూట్టం. దాన్ని కూడా పట్టించుకోకుండా 'మన' కుటుంబం అనుకుంటూ అన్నీ ఓర్చుకుని, అన్నీ తట్టుకుని పనులు చేసుకుంటూనే ఉన్నాం. కానీ ఈ వంచనాశిల్పాన్ని మాత్రం భరించలేకపోతున్నాం. ఎందుకింత వివక్ష.. వివక్షను ఇన్నేళ్లుగా భరించినా మా కడుపుకోతల్ని, ఈ బర్త్ రేప్ ల్ని , బాల,మహిళా రేప్ ల్ని సహించలేకపోతున్నాం.

మాకేది సౌకర్యంగా, సదుపాయంగా వుందో ఆ బట్టలేసుకొంటే రెచ్చగొట్టేలా వస్త్రధారణ ఉందని..అందుకే పురుషులు టెంప్టై పోయి అత్యాచారాలు చేస్తున్నారని, పుచ్చిపోయిన మెదళ్లు కొన్ని తమ జాతిని సపోర్ట్ చేస్తున్నాయ్.

ఒంటినిండా బట్టలేసుకున్న నేనేమి రెచ్చగొట్టాను అని నువ్వు అడగవేమి ? ఒకటి–రెండు నెలల పాప ఏ బట్టలేసుకొని రెచ్చగొట్టిందని మరోమారు అడుగు సమాజమా? పసిమొగ్గల్లో పరువాన్ని చూసే పాపాత్ముల్ని ఏమనాలి..తాగి రాక్షసుల్లా మారి నన్ను హింసించటటమే కాక పెట్రోల్ పోసి తగలేస్తారా.. ? వీళ్ళా మన పౌరులు.. మనతో బతికే సహవాసులు.. సంఘ జీవులు? అవునా? మనుష్యజాతిని కబళించే ఈ దుష్ట గ్రహాలకి, మానవత్వాన్ని ప్రశ్నార్థకం చేస్తున్న ఈ నరరూప రాక్షసులకి ఏ చట్టం కావాలి? ఎన్ని శిక్షలు వేయాలి?

గుడ్డిలో మెల్లగా నన్ను కాస్త శాంతింపజేసిన విషయం. ఏ న్యాయవాదీ వాళ్ళ తరపున వాదించకపోవడం. నిజం కదా! అయ్యో! అని పెదవి విరిచి కాసిన్ని సానుభూతి వచనాలు పలకటం వల్ల ప్రయోజనం ఏమిటి? శాశ్వత పరిష్కార మార్గాలు వెతకాలి కదా! నా అక్క నిర్భయ ఉదంతం జరిగినప్పుడు దేశమంతా తమ ఆడబిడ్డకే దుర్న్యాయం జరిగినట్టు తల్లడిల్లిపోయారు. నేను ఉద్యమస్ఫూర్తితో ముందుకు కదిలాను. ఆ అలజడి ఒక చట్ట రూపకల్పనకి దారి తీసి వేలమంది బాధితుల కంటనీరు తుడవడానికి, మృగాళ్లని కారాగారాల పాలు చేయడానికి దోహదం చేసింది.

నిజమే కదా, మాంసానికి అలవాటు పడ్డ పులులు సభ్య సమాజంలో ఉండే అర్హతను కోల్పోతాయి. వీళ్లూ అంతే అనుకున్నాను .. కానీ ఇంకా వాళ్లకి మరణ శిక్ష అమలు పరిచారా,, లేదే .. ఎందుకు..?. నిస్సహాయ పసిపిల్లలతోనూ, కౌమార ఆడపిల్లలతోనూ అసభ్యంగా ప్రవర్తిస్తూ అదును చూసి పంజా విసిరి కబళించే క్రూరమృగాలు... వీళ్ళ తరపున వాదించటానికి ఏ న్యాయం వుంది? వీరికి బాసటగా నిలబడటానికి..వీళ్ళకి అండగా ఉండడానికి ఏ కుటుంబం ముందుకు వస్తుంది? అదే జరిగింది కదా నా విషయం లో .. బీబీ పేట విషయంలోనూ, భువనగిరి ఉదంతంలోనూ, వరంగల్ నేపథ్య ప్రస్తావనలోనూ — ఆ దుర్మార్గుల కుటుంబాల వాళ్ళు ఆ వ్యక్తుల్ని చూడ్డానికి అసహ్యించుకున్నారు. ఏ న్యాయవాది కూడా వాళ్ళ తరపున వాదించబోమని బార్ కౌన్సిల్ సాక్షిగా ప్రమాణం చేసారు. ఏ ఒక్కరూ కూడా 'అయ్యో పాపం' అన్న మాట అనకుండా, సానుభూతి చూపించకుండా 'మరణశిక్ష' వేయాలని ఎలుగెత్తి ఉద్యమించారు.నా విషయం లోను ఇలాగే జరగాలి.మరొకరు నాలా బలవకూడదు . సున్నితమైన కలల్ని కాష్టం పాలు కానివ్వ కూడదు.

సంస్కరణలు కుటుంబాలనుండే మొదలవ్వాలి. కుటుంబమే ఓ చిన్న సమాజం అక్కడే తప్పుల్ని సరిదిద్దుకోగలిగితే శాంతి ప్రపంచమంతా నిండుతుంది. ఉదాహరణకి షుగర్ బాధితుడికి వేలు పుచ్చిపోయి కాలుకి ప్రాకితే కాలు తీసేస్తున్నామా లేదా? అయ్యో నా కాలా అని ఏడుస్తున్నామా... ఇది అంతే మనింట్లో మన పిల్లోడు దారి తప్పితే చెడిపోయిన వాడిని మంచి మాటలతో దారికైనా తేవాలి లేదా పోలీస్ స్టేషన్లలో అయినా అప్పచెప్పాలి. మన మమకారం మరోకుటుంబానికి శాపంగా మారకూడదు.

సవతి తండ్రి భార్యకి మత్తుమందు కలిపిచ్చి ప్రతీరోజు వరుసకు కూతురైన అమ్మాయి మీద అత్యాచారం చేస్తూ నువ్వు ఎవరికైనా చెపితే అమ్మని చంపేస్తానని బెదిరిస్తూ వుంటే ఏం చెయ్యాలో తోచని దుర్భర పరిస్థితుల్లో 13 ఏళ్ళ ఆ చిట్టితల్లి ఆత్మహత్య చేసుకుని ఎంతటి నరకయాతన అనుభవించి వుంటుందో ఊహించు.

మతిస్థిమితం లేని బాలిక మీద అత్యాచారం జరిగితే తాగుబోతు తండ్రి, తిరుగుబోతు కొడుకు కనీసం పోలీస్ స్టేషన్కెళ్ళి ఫిర్యాదు కూడా చేయకపోగా పనిమనిషిగా పనిచేస్తూ కుటుంబాన్నే నడుపుతున్న తల్లిని కూడా వారిస్తారా పోలీస్టేషన్కెళ్ళి చెపితే కేసులు, కోర్టులు తలనొప్పని.. ఇంత విచ్ఛిన్నం అయ్యాయా అనుబంధాలు, మమతానురాగాలు?

బాగా బతకాలన్న మితిమీరిన ఆశలతో అమ్మాయిలను అమ్మేస్తే ఎక్కువ డబ్బులొస్తాయని ఏ వెదవో చెప్పిన మాట విని అక్రమ రవాణాలకి తెగబడ్డ ఓ తండ్రికితన కూతుర్ని మరొకరు చరబట్టిన దాకా తెలియలేదు. గుండెకోత ఎంతగా మనిషిని దహిస్తుందో. అందరూ తన ఆడబిడ్డలాంటి, బంగారు తల్లులే కదా అన్న సత్యం.

కంచే చేనుని మేస్తే ఇక రక్షణ ఎవరు అంటూ నువ్వు నిర్వేదం చూపించటం కాదు మాకు కావల్సింది. మరొక తండ్రి అలా ప్రవర్తించాలన్నా ఆలోచన కూడా పుట్టకుండా శిక్షించు.. ముసుగేసుకుని మహారాజుల్లా చలామని అవుతున్న

వీళ్ళ అసలు రూపాల్ని వాళ్ళ కుటుంబాలకు చూపించు. శిక్ష మాత్రమే మారుస్తుందని భ్రమించకుండా కొంతకాలం జైల్లో పెట్టి ఆ ప్రబుద్ధుడు చేస్తున్న ఉద్యోగాన్ని ఆ భార్యబిడ్డలకి ఇప్పించు. తప్పు చేయని బాధితులకి స్వేచ్ఛను కల్గించు. కెమెరా ఫోనోడింగ్స్ మధ్య కుటుంబాన్నీ విచారించి పరివర్తన దిశగా మళ్ళించు. బాధితురాలికి పెన్షన్ ముద్దాయికి శిక్ష చెప్పటానికి బాగున్నాయి, వినటానికి బాగున్నాయి మరి దీని మూలంగా కేసులు తగ్గాలి కదా, ఎందుకు పెరుగుతున్నాయంటావ్?

నాకు మాత్రం మనం సరిఅయిన దారిలో వెళ్ళడం లేదన్నది అర్థమవుతుంది. ఆడదాని బలహీనత పిల్లలు వాళ్ళ భవిష్యత్, మగవాడిధైర్యం అర్థబలం, అంగ బలం, మగవాడినన్న అహం. పిల్లలకి ఏంకాదన్న విశ్వాసం ఆమెకి కల్గిస్తే చాలు... ఏం చేసినా చెల్లిపోతుందిలే అనే మగ అహంకారాన్ని దెబ్బ కొడితే చాలు – ఒక్కసారి అయిన మంచి దారిలో నువ్వు నడిచినట్లే . ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ముందుతరాలకి అందించినట్లే.... వెంటాడే చూపు వేటాడే తలపు .. కామస్పర్ధ,, చెరపట్టిన చేవ మెలితిప్పే నొప్పి.. పైకి చెప్పలేని వేదన , లోకం పట్ల ఏవగింపు కలిగేలా మేము బతకాలా? అంగాంగాల్ని నలిపేసే ఆరాచకత్వం పెరుగుతుంటే వెయ్యాల్సింది సిగ్గుబిళ్ళలా , ఇనప కచ్చడాల అంగవస్త్రాలా? ఇంత నిర్లజ్జగా తెగిస్తే చట్టాలు, కోర్టులు, శిక్షలు అవసరమా అంటున్నారు కానీ మోరల్ పోలీసింగ్ – కమ్యూనిటీ పోలిసింగ్ కావాలన్నదే కదా మన కోరిక కూడా.

ఇంద్రుడి వందకళ్ళని తెచ్చుకుని ప్రతి అమ్మ కాపలా వుండాలా మా మానసంరక్షరార్థం. కృష్ణుడు ద్రౌపది కి చీర అందించునట్టు ఎవరో వస్తారని ఎదురు చూస్తూ బ్రతకాలా జీవితాంతం. మనల్ని మనం నియంత్రించుకోలేమా ? మగాడి ఆలోచనల్నిసరిఅయినదారిలోపెట్టలేమా? పెంపకంనుంచేపరివర్తనతేలేమా?.నిజమేసమాజమా!మనుషులు మృగాళ్లుగా మారుతున్నారంటే నువ్వూ, నేను, మనమంతా కారణమే.

ఒక పిల్లాడిని మంచి పౌరుడిగా తీర్చిదిద్దడానికి ఊరుకి ఊరే కావాల్సి వస్తుందంటారు. కానీ ఒక పిల్లవాడు దుర్మార్గుడిగా, కిరాతకుడిగా తయారుకావటానికి మాత్రం విచ్ఛిన్నమైన, విశృంఖలమైన కుటుంబ నేపథ్యం, అశ్లీల దృశ్యాల వీక్షణలు కీలకమైన కారణాలు. నిజం, మత్తుమందులు..అశ్లీల చిత్రాలు మనిషి విచక్షణని దెబ్బతీస్తాయి. ఏం చేస్తున్నామో తెలియని ఉద్రేకాన్ని నింపేస్తాయి. తమాయించుకునే గుణాన్ని, నియత్రించుకోగల సామర్థ్యాన్ని కాలరాస్తాయి. చట్టాలు ఆడవాళ్ళకు ఎన్నో రక్షక వలయాల్ని ఏర్పాటు చేసాయి. అడుగడుగునా అండగా నిలిచాయి. కానీ ఎంతమందికి చట్టం పట్ల అవగాహన వుంది? అసలు తమ రక్షణ కోసం వున్న చట్టాలు ఏమిటో అన్న చైతన్యం కూడా లేకపోవటం బాధాకరం. నువ్వు కాస్త ఆ చైతన్య యాత్రలు – అవగాహనా శిబిరాలు పెట్టవా సమాజమా!

1. సెక్షన్ 100 ప్రకారం ఆత్మరక్షణ కోసం దాడి చేసినప్పుడు ఎదుటి వ్యక్తి చనిపోయినా తప్పులేదని, శిక్ష పడదని చెబుతోంది.

2. 116 (బి) సెక్షన్ ప్రకారం బాధితురాలికి హాస్పిటల్లో చికిత్స చేయకపోతే అది పనిషబుల్.

3. అత్యాచార బాధిత మహిళ అనుమతి లేకుండా మీడియా ఆమె పేరు, ఫోటోలు ప్రచురిస్తే, చూపిస్తే 228.A సెక్షన్ ప్రకారం ఆయా సంస్థలు బాధ్యత వహించాలి.

4. 354 సెక్షన్ ప్రకారం స్త్రీని వక్రదృష్టితో చూసినా, తాకినా, అవమాన పరిచినా, ఫోటో–వీడియోలు తీసినా ఆ బాధితులు ఫిర్యాదు చేయొచ్చు. బట్టలు తొలగించే చర్య చేస్తే 354 (B) సెక్షన్ ప్రకారం 3 నుండి 7 యేళ్ళ ఖైదు పడుతుంది.

5. 18 ఏళ్ల వయసు లోపు అమ్మాయితో సెక్స్ లో పాల్గొంటే, అది ఆమె అంగీకారంతోనే అయినా కూడా 376 సెక్షన్ ప్రకారం నేరం. అందుకు ఏడేళ్ళ కఠిన కారాగార శిక్ష విధిస్తారు.

6. 509 సెక్షన్ ప్రకారం సైగలు చేసినా అది అవమానం చేసినట్లు భావించి శిక్షిస్తారు.

7. 499 సెక్షన్ ప్రకారం ఫోటో మార్ఫింగ్ చేసినా అది శిక్షార్హమే.

8. 18 ఏళ్ల మైనర్ బాలికను కొనుగోలు చేస్తే పదేళ్ళ జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.

9. 376 (B) సెక్షన్ ప్రకారం సామూహిక అత్యాచారాల విషయంలో ఒకరి మీద ఎక్కువమంది సామూహికంగా అత్యాచారం చేస్తే జీవిత ఖైదు విధించవచ్చు.

10. 366 (A) ప్రకారం మైనర్ బాలికను వ్యభిచార కూపం లోకి దించినా, లైంగికంగా ప్రలోభ పెట్టినా పదేళ్ళ జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.

11. బలవంతంగా ఎత్తుకెళ్లినా, పెళ్లి చేసుకున్నా పదేళ్ళ జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.

అయినా నా పిచ్చి గానీ, నా ప్రియ సమాజమా! చట్టాలు, శిక్షలు ఎన్ని ఉన్నా మనుషుల్లో – ముఖ్యంగా మా మగాళ్లలో మార్పు రానంత వరకూ, మాలో ఆ చైతన్యం, బాధ్యతాయుత వైఖరులు రూపొందేవరకూ ఇవన్నీ కాగితపు రాతలుగానే మిగులుతాయి. ముందు మా మైండ్‌సెట్ మార్చు.ఆదిమ కాలం నుంచీ, హమ్మురాబీ కాలంలో, షోడశ మహా జనపదాల కాలంలో, ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక కాలాలన్నింటిలో, అన్ని దేశాల్లో, అన్ని ప్రాంతాల్లో స్త్రీల పైన జరిగే అకృత్యాలకు ఆయా కాలాల్లో అనుకూలమైన చట్టాలు, శిక్షలు అమల్లో ఉన్నాయి.

యుగాలు, తరాలు గడిచినా, రాజ్యాలు, సామ్రాజ్యాలు మారినా, చట్టాల తీవ్రత పెరిగినా నేరాలు ఎప్పటికప్పుడు కొత్త ముసుగులతో కొత్త అవతారాలు ఎత్తుతూనే వచ్చాయి. ఇది నీకు తెలిసినంతగా మరెవరికీ తెలీదు కదా.. అందుకే, ఆడబిడ్డ అస్తిత్వానికి గౌరవం రావాలన్నా, ఆమె ఆత్మగౌరవంతో మనుగడ సాగించాలన్నా మార్పు రావాల్సింది మొదట నీలోనే.. మనుషులు, మగాళ్ళందరి సామూహిక మనస్తత్వాన్ని పెంచి, పోషించి, పాలించి, శాసించిన నీ నుండే ఆ దృక్కోణం మారాలి.

నా ప్రియాతి ప్రియమైన సమాజమా ! 'దేవుని తర్వాత అంత శక్తిమంతమైనది సమాజం' అని ఒక వేదాంతి చెప్పింది నీకున్న ప్రభావ తత్వాన్ని పునరుద్ఘాటించేదే కదా ! అలాగే, వ్యక్తితో సమాజం మారుతుందా? సమాజంతో వ్యక్తి మారతాడా? అనే అనాది చర్యలో నీతోనే అన్ని పరిణామాలు సాధ్యమని నిరూపించే చారిత్రక సందర్భం ఇప్పుడు వచ్చింది. వ్యక్తి కన్నా సమాజమే, నువ్వే బలమైన దానివని ప్రపంచానికి చాటే సమయం ఇప్పుడు ఆసన్నమైంది. నిన్ను మించిన పాఠశాల గానీ, ప్రయోగశాల గానీ లేదని విద్యావేత్తలెందరో సోక్రటీస్, దిజ్ఞాగుడి కాలం నుంచీ చెప్తూ వచ్చారు. ఆ మాటలను రుజువు చేసే క్షణం ఇదే. ఇక, లే... నీ పాజిటివ్ ముఖాన్ని చూపించు. నీ సంప్రదాయాల జూలు విదుల్చు. నీ జీవన విలువల రెక్కలు కదుల్చు... నీ మానవతా నియమాల చూపులను ప్రసరించు... నీ విశ్వ సౌభ్రాతృత్వ హస్తాలను అందించు... నీ ఆదర్శ ఆశయాల నడకలను ఈ మనుషులకు నేర్పించు... వారందరినీ బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దు...ఒక నిర్భయ ..మరో అబల..ఇంకో అసిఫా .. మరో స్వప్నికా.. ప్రత్యూషా. మానస.. పేరులో ఏముంది .. అందరం బాధితులమే .. మా అందరి చావు నీకు కనువిప్పు కావాలి .. ఇకనైనా కళ్ళు తెరువు . మానవ జాతి బతకాలంటే ముందు ఆడది బతకాలన్న స్పృహ తెచ్చుకో. మగవాడు ఏమి చేసినా ఒప్పే అన్న సంకుచిత భావన లోంచి బయట పడి మానవతను కాపాడు.. నిన్ను నువ్వు కాపాడుకో.

సమాజమా, నా ఆవశ్యక నేస్తమా... నా విన్నపాన్ని ఆలకించు.. నవ మానవ లోకాన్ని సృష్టించు.

ఉండనా మరి ..

– దిశ

# తోకలేని పిట్ట

ఉత్తరమా !

భలే చిత్రంగా ఉంది కదా! అందరికీ నువ్వు యోగక్షేమాలు, అనుభూతులను కార్డు మీద రికార్డ్ చేసి అందిస్తావ్. వేల ఇళ్ళకి అనుకోని అతిథిలా వెళతావ్. లక్షల మందిలో ఆనందాన్ని, సంతృప్తిని కలిగిస్తావ్. కానీ, నీకే ఒక కొత్త ప్రేమ లేఖ వస్తే ఎలా ఉంటుందో కదా. అందుకే ఈ ఉత్తరాన్ని ప్రియంగా నా ఉత్తర స్నేహితకి రాస్తున్నా.

చిన్నప్పుడెప్పుడో చదువుకున్నాం కదా 'తోక లేని పిట్ట తొంభై ఆమడల దూరం పోతుంది' అన్న పొడుపు కథని. అబ్బో ఈ పొడుపుకథ అంత చిన్నది కాదులే నీ ప్రస్థానం. విప్పితే చాంతాడంత పెద్దదే సుమా. అయినా అప్పుడెప్పుడో మేఘం ద్వారా, హంసల ద్వారా, కాకుల ద్వారా ఉత్తరాలు పంపేవారు అని విన్నాను. నీకు గుర్తుందో లేదో, తాటి కమ్మల మీద, ఆకుల మీద, జంతు చర్మాల మీద, బట్టల మీద లేఖలు రాసి పంపేవారనీ చరిత్రలో చదువుకున్నాం. ఆ తర్వాతే కదా చైనా వాళ్ళు పేపర్ ని కనిపెట్టింది. అప్పుడే కదా నువ్వు మా దగ్గరకు చేరిందీ..నీ విశ్వరూపాన్ని మాకు చూపించిందీ.

అయినా సెల్ఫోన్లు వచ్చాక నీ అవసరం లేదనుకున్నావా, అలా అనుకొని మరుగున పడిపోయి అనామకంగా తలదాచుకుంటావా? నువ్వలా చేస్తే మేము ఏమై పోతామో చెప్పు. నెట్వర్క్ లు వచ్చి సిటిజన్లు అంతా నెటిజన్లుగా అయిపోయాక నువ్వు మాకు మరింత సన్నిహితంగా రావాల్సింది పోయి అలా దూరంగా వెళ్ళి తలదాచుకుంటే ఎలా చెప్పు? నీవు లేని చోట మేము ఉండడం మాకు సాధ్యపడే పనేనా? మరుగున పడిపోతున్న అనుబంధాల విలువను పది మందికి పరిచయం చేయాలనుకుంటే నీలాంటి వాళ్ళు ఉంటేనే కదా మేము ఏమైనా చేయగలిగేది? నువ్వు మా మార్గదర్శివి, మమ్మల్ని నడిపించే హితైషివి.

నాకిప్పుడు శ్రీశ్రీ కవితొకటి బాగా గుర్తొస్తోంది. "కాళ్ళ కింద భూమి కరిగిపోతున్నప్పుడు, పూర్వం వేసిన పునాదులు కదిలిపోతున్నప్పుడు, మనిషికి మనిషికి మధ్య మబ్బు తెరలు కమ్మినప్పుడు, మనసుకి మనసుకి మధ్య మంచు పొరలు కప్పినప్పుడు ఎవరు మళ్ళీ అతుకుతారు విరిగిన జీవిత శకలాల్ని" – అని అనిపిస్తోంది. ఎవరి చేతుల్లో చూసినా సెల్ఫోన్లు. ప్రతి మనిషి తనకు తానుగా ఎప్పుడైనా బయటకి వస్తాడా 'ఆ ఏకాంత సౌధాల్ని వీడి' అనిపిస్తూంటుంది. నీతో మేం గడిపిన బంగారు కాలాన్ని చూసిన మాకు ఇప్పుడీ సెల్ ఫోన్ వ్యసనం చూశాక ఎలా ఉంటుందో చెప్పు, వీటికి ఇంతగా బానిసలైపోయిన ఈ తరాన్ని చూస్తే, మాకు మిగిలేది బాధే కదా... అయినా ఈ తరాన్ని కదిలిస్తే ఉత్తరం అంటే ఏమిటి అని అడిగే దుస్థితిలో ఉన్నారనే కదా నీ ఆక్రోశం అంతా. అదే కదా నీ మనో వేదనకి కారణం..మరి ఇప్పుడు ఏం చేద్దాం చెప్పు.

అమ్మనాన్నలకి ఉత్తరం రాద్దామంటే సొంత భాష రాదాయే. పర భాషలో పలకరిద్దామంటే మన పెద్దలకి ఆ భాష రాదాయే. ఉన్నా ఆ భాషలో తనకే పరిపూర్ణత లేదు కాబట్టి ఆత్మవిశ్వాసం రావడం లేదు..ఆత్మన్యూనతా భావంతో



సహచరులకి కూడా రాయాలన్నా అనిష్టత వీడడం లేదు. సాఫ్ట్ ఫోన్ వచ్చాక ఎవరి జేబుల్లోనూ కలం కనిపించడం లేదు. వాచీలకి అంతకన్నా కాలం చెల్లిపోయింది. తెల్ల కాగితాలు వాడే నాథుడే లేక తెల్లముఖం వేసుకుని షాపుల్లో మూలుగుతున్నాయి. పోస్ట్ బాక్స్ అడ్రస్ గల్లంతై పోయింది. పోస్ట్ ఆఫీస్ వృత్తి ధర్మాలు మరో పార్శ్వం లోకి మారిపోయాయి. ఈ తరం జనరేషన్ కి వేళ్ళు పనిచేస్తున్నాయి కానీ, మన మూలాల వేళ్ళు ఉత్తరాలలోనే ఉన్నాయనే సంగతి సైతం పసికట్టలేనంత పరాయీకరణలో బతుకుతున్నారు.

మా తరానికి నువ్వు చేసిన సేవలు ఎన్నని చెప్పను, ఎలా చెప్పను.. అయినా నీ చరిత్ర విస్తరణ అంత చిన్నగా ఒక్క మాటలో చెప్పుకునేదా చెప్పు. లభ్యమైన సమాచారం ప్రకారం క్రీస్తు పూర్వం 500 సంవత్సరాల క్రితం రాసినట్లుగా చెబుతున్న పర్షియా రాణి అటోస్సా చేతిరాతతో ఒక ఉత్తరం దొరికినట్టుగా చారిత్రిక ఆధారాలు ఉన్నాయ్. తర్వాత స్టాంప్ అంటించి పోస్ట్ చేయడం అనే ప్రక్రియ 1840లో క్వీన్ విక్టోరియా కాలంలో జరిగినట్టుగా చెబుతారు. భారతదేశంలో పోస్ట్ కార్డ్ అనే అనే ప్రక్రియ 1879 జూలై 1వ తేదీన ప్రారంభం అయింది. ప్రపంచంలో మొట్టమొదటి సారిగా 1869 లో పోస్ట్ కార్డ్ ని ఆస్ట్రియా దేశస్థుడైన డాక్టర్ ఇమ్మాన్యుయెల్ హెర్మాన్ అనే వ్యక్తి అతి చౌకగా సమాచారం పంపించేందుకు వీలుగా పోస్ట్ కార్డ్ ను రూపొందించాడు. ఫస్ట్ ఇండియన్ పోస్టల్ స్టాంప్ ని 1854 అక్టోబరు 1న భారతదేశంలో ప్రారంభించినట్లు గా చారిత్రక ఆధారాలు ఉన్నాయి.

ఈస్టిండియా కంపెనీ మనల్ని పరిపాలించింది కదా, ఆ కంపెనీ 1774 లో కలకత్తాలో పోస్టాఫీసులు ప్రారంభించింది. అప్పట్లో దూరాన్ని బట్టి 100 మైళ్ల దూరానికి రెండు అణాలు వసూలు చేసే వారట. ఇండియా పోస్ట్ కార్డ్ అని పిలవడాన్ని మొట్ట మొదటి సారి 1911లో మొదలెట్టారు. అప్పటి దాకా అది ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధీనంలోనే ఉండేది. స్వాతంత్ర్యం వచ్చాక మూడు సింహం ముఖాలు అంటే త్రిముఖాలతో ప్రకాశవంతమైన ఆకుపచ్చ రంగుతో ముద్రించారు పోస్టల్ స్టాంప్ ని రూపొందించారు. 1949 డిసెంబర్ 7వ తేదిన భారతదేశంలో ఫస్ట్ పోస్టల్ స్టాంప్ ని విడుదల చేశారు, దాని విలువ మొదట్లో ఆరు పైసలుగా ఉండేది.

అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ, కుక్కపిల్ల కాదేదీ కవితకనర్హం అన్నట్టుగా ఉత్తరాలు రాయడానికి విషయంతో పనేంటీ. ఏ ఉత్తరమైనా వ్యక్తి సమాచారాన్నో లేదా వ్యవస్థకు సహకారంగానో ఉండేది గానీ, ఉత్త చెత్త ఏ ఉత్తరంలోనూ ఉండేది కాదు. ఉదాహరణకి, నెహ్రూ గారు ఇందిరా గాంధీకి రాసిన ఉత్తరాలనే తీసుకుందాం. అవి ఓ తండ్రి కూతురికి రాసినట్లుగా కాక, విస్తృతమైన అధ్యయనంతో ఓ మేధావి మరో మేధావిని రూపొందించేవిగా ఉన్నాయ్. ఆ తర్వాత వాటిని 'ద డిస్కవరీ ఆఫ్ ఇండియా' అనే పుస్తకంగా అచ్చు వేశారనే సంగతి నీకూ తెలిసిందేగా. అవి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచాయి. సామాజిక పరిణామాలు, భారత దేశ పురోగతి, చరిత్రను గురించిన అవగాహన కలిగించాయి.

ఆ లేఖలు. ప్రముఖ రచయిత గుడిపాటి వెంకటాచలం గారు వ్రాసిన ప్రేమలేఖలు అందరికీ తెలిసినవే. ఎన్నో అనుభవాలు, అనుభూతుల మందారమాల అది. పోస్ట్ చేయని ఉత్తరాలు కూడా సంచలనంగానే నిలిచాయ్.

అమెరికన్ ప్రెసిడెంట్ అబ్రహాం లింకన్ తన కొడుకు టీచరుకు రాసిన ఉత్తరం ఎంతో ప్రాచుర్యం పొందింది. దాన్ని 'లెటర్ టు ఏ టీచర్' అంటూ ఇప్పటికి కూడా చాలామంది స్ఫూర్తివంతమైన ఉత్తరంగా చెప్పుకుంటూ ఉంటారు. జర్మన్ సంగీతజ్ఞుడు బిథోవిన్ రాసిన ప్రేమ లేఖలు కూడా జగద్విఖ్యాతమే. నోబెల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ గురించి ఎంత చెప్పుకున్నా ఇంకా తెలియాల్సిన విషయాలు ఎన్నో ఉంటాయి. విక్టోరియా ఒకెంపో అనే అర్జెంటీనా రచయిత్రికి ఠాగూర్ రాసిన లేఖల మీద విశ్వ భారతి యూనివర్సిటీ వారు ఏకంగా పీ.హెచ్.డీ. నే చేయించారు.

నీ గురించిన చిత్రమైన విషయాలు గుర్తు చేయనా, రెండో ప్రపంచ యుద్ధానికి ముందు జపాన్లో పత్రిక కార్యాలయంలో వార్తలు పంపటానికి పావురాలను ఉపయోగించేవారు. 1964లో టోక్యో నగరంలో జరిగిన ఒలింపిక్స్

గేమ్స్ వార్తలు సేకరించడానికి జపాన్ దేశంలోని స్థానిక వార్తాపత్రికలు 250 పావురాలు ఉపయోగించాయట.

లేఖలు రాసే అలవాటున్న పాఠకులు రష్యా దేశంలోనే ఎక్కువట. రష్యా దేశం లోని పాఠకులు పత్రికలకు రోజుకు రెండు లక్షలు తక్కువ కాకుండా ఉత్తరాలు రాస్తారట. 1982 లో 'త్రూద్' అనే పత్రికకు ఏడు లక్షల లేఖలు రాసారుట పాఠకులు. 'ప్రావ్దా' పత్రికకు ఆరు లక్షల మంది పైగా ఉత్తరాలు రాసారు. అక్కడ పత్రికలు పాఠకుల లేఖలకి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి తక్షణమే తగిన మార్పులు చేర్పులు చేస్తాయి.

చార్లెస్ కూపర్ అనే అమెరికా వ్యక్తి 78000 పైగా ఉత్తరాలు వివిధ పత్రికలకి రాశారట. ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదలిక అన్న కాళన్న మాటని స్ఫురింపజేస్తుంది. 1747 లో బెంజమిన్ ఫ్రాంక్లిన్ గీసిన మొట్టమొదటి రాజకీయ కార్టూన్. ప్లెయిన్ ట్రూత్ అనే కరపత్రంలో పునర్ముద్రింపబడిన ఈ కార్టూన్ వల్ల 10 వేల మంది పెన్సిల్వేనియా సైన్యంలో చేరారంటే నువ్వర్థం చేసుకోవాలి. ఇంత చిన్న ఆలోచన రగిలించిన చైతన్యాన్ని నువ్వు అర్థం చేస్కోవాలి.

1929లో బాబ్ రీప్లే అనే అమెరికా దేశస్థుడు 'నమ్ము-నమ్మకపో' అనే శీర్షికతో ఒక పత్రికలో ఒక కార్టూన్ చిత్రీకరించాడు. దాని సారాంశం ఏమిటంటే అమెరికాకు స్వంత జాతీయగీతం లేదని, ప్రస్తుతం ఉపయోగిస్తున్నది ఇంగ్లీష్ వారి పురాతనమైన తాగుడు పాట, అని. ఇంకేముంది అగ్ని రాజుకుంది, అమెరికన్ ప్రజలు అలజడి చెందారు. అమెరికన్ కాంగ్రెస్ పై 50లక్షల ఉత్తరాలు సంధించారు. రీప్లే రాసింది నిజమేనా అంటూ నిలదీశారు. 1931 లో మార్చి 3వ తేదీన స్వంత జాతీయ గీతాన్ని అమెరికా రూపొందించుకుంది. చిత్రమేమిటంటే రీప్లే చనిపోయిన రోజు కూడా అదే.

నీకు గమ్మత్తయిన ఇంకో ఉత్తరం గురించి చెప్పాలి. ఇంగ్లీష్ గ్రంథకర్త చార్లెస్ డికెన్స్ తన పుస్తక ప్రచురణకర్తకు అక్షరాలు లేకుండా ఒక లేఖ రాశాడు. తన గ్రంథం అమ్మకాలు ఏ విధంగా ఉన్నాయో తెలుసుకోవాలని కార్డు మీద 'ప్రశ్నార్థకాన్ని' వేసి పంపించాడు. ప్రచురణకర్త కూడా భావుకుడే కాబట్టి జవాబుగా, ఊహించిన దాని కన్నా ఎక్కువగానే అమ్ముడు పోతున్నాయని తెలియజేస్తూ కార్డు మీద 'ఆశ్చర్యార్థకం' వేసి జవాబు పంపించాడు, ఇప్పుడు మనం వాడుతున్న 'ఎమోజీ'ల లాగా అన్నమాట. చూశావా అక్షరాలు లేకుండా కూడా ఎంత చమత్కారం సృష్టించవచ్చో.

ఉత్తరమా ! నువ్వు లేకపోతే, నిజంగా హృదయం ఉండాల్సిన చోట పాస్వర్డ్ కోల్పోయిన కంప్యూటర్లా ఖాళీగా మారిపోయింది ఈ ప్రపంచం. ఆ స్థానాన్ని ఈ-మెయిళ్ళు తీసేసుకున్నాయ్. నిన్ను అందుకున్నప్పుడు పొందే ఆనందం, ఆ స్పర్శ, ఎదురు చూపుల్లోని తపన ఈ తరానికి ఎలా తెలుస్తాయి చెప్పు. ఫాస్ట్ ఫుడ్ కల్చర్ లాగానే ఇన్స్టంట్ ప్రేమలు, అసహజమైన బ్రేకప్ లు, ఒంటరి జీవితాలు. నువ్వు మళ్ళీ మా దగ్గరకి రాకపోతే, నువ్వే లేకపోతే మా హృదయం అంతా ఏదో పోగొట్టుకున్న తనంతో నిండిపోతుంది. జీవితంలో భద్రత కనిపిస్తోందా, భరోసా అన్న మాట వినిపిస్తోందా?

నువ్వు ఎప్పుడు వచ్చినా నిన్ను చేతుల్లోకి తీసుకున్నప్పుడు ఎంత ఆనందమో... నువ్వు వచ్చేది ఒక్కసారే కానీ, నిన్ను చేతుల్లోకి తీసుకొని అలా అలా చేతులు మార్చుకుంటూ మార్చిమార్చి చదువుకుంటే, ఎన్నిరోజులకైనా గుబులొస్తే చాలు చిక్కం కు గుచ్చిన ఉత్తరాలు తీసి దుమ్ము దులిపి చదువుకునేవాళ్ళం కదా. ఇంటిల్లిపాది అంతా నిన్ను బతుకమ్మలా తల మీద పెట్టుకున్నట్టుగా సంబరంగా చూసుకునేవాళ్ళం కదా. ఎంతైనా ఆ రోజులే వేరులే. చిన్ని చిన్ని ఆనందాలతో రోజంతా ఉత్సాహంగా ఉండేవాళ్ళం. ఇప్పుడు పెద్ద ఆనందం కోసం ఏళ్లకేళ్లు ఏడుపు మొఖాలు వేసుకొని యంత్రాల్లా పనిచేస్తూ మేమూ మరమనుషులమైపోయాం. ఇప్పుడు ఆ పెద్ద ఆనందం అంది వచ్చినా ఆస్వాదించే మనసూ ఉండడం లేదు, వయసూ ఉండడం లేదు.

నిజానికి నా మట్టుకు నాకు ఇప్పటి జీవితాల కన్నా నువ్వు ఉన్నప్పటి మా జీవితాలే ఎంతో బావున్నాయ్. నిజం చెప్పు నువ్వు ఉన్నప్పుడు మా జీవితాలు ఎంతో కళగా, ఆనందంగా ఉండేవి కదా. అసలు మా జీవితంలోంచి నువ్వెప్పుడు వెళ్లిపోయావో తెలీడమేలేదు. అంటే అంతటి పరుగులతో జీవితాన్ని గడిపేస్తున్నామా అనిపిస్తోంది. నువ్వే చెప్పు,

నీకోసం ఎన్ని ఇళ్ళ తలుపులు ఎంత ఆశగా ఎదురుచూసాయో. పట్నంలో ఉన్న కొడుకు రాసే ఉత్తరం కోసం గుమ్మానికి కళ్ళు అతికించుకొని ఓ తల్లి..కాబోయే పెళ్లికొడుకు రాసానని చెప్పినా ఇంకా రాని పోస్ట్ మేన్ కోసం ఎదురు చూస్తూ కాలు కాలిన పిల్లిలా అటు ఇటు తిరుగుతూ ఎదురుచూసే ఓ కన్నె పిల్ల.. ఇంటర్వ్యూ లేఖ కోసం నిరీక్షించే నిరుద్యోగి.. నెలలు నిండిన భార్య దగ్గర నుండి ప్రసవం బాగా జరిగిందనే సంతోషకర వార్తను మోసుకొచ్చే ఉత్తరం కోసం ఎదురు చూసే ఓ భర్త..ప్లటూన్ నుండి తమ ఊరి సైనికుడు రాసే ఉత్తరం కోసం, ఆ యుద్ధ వార్తల కోసం నిరీక్షించే ఓ ఊరు.. ఛాతీ మీద పెట్టిన మెడల్స్ బరువుతో శవపేటిక నుండి లేవలేని సైనికుడి మరణవార్తను మోసుకొచ్చే ఉత్తరం..ఇలా ఎన్నెన్ని రకాలో.. నీవి ఎన్నెన్ని రూపాలో.

అయినా నీ విశ్వరూపాన్ని కన్నులతో చూసిన తరం మాది. ఆ ఆనందాల్ని పోగేసుకున్న జీవితాలు మావి. నిజమైన ఆనందాల్ని, అనుభూతుల్ని చవిచూసిన నిజాయితీతో కూడిన సంతోషకరమైన రోజులవి. అసలు జీవితమంటే అదే కదా.. చిన్నప్పటి బంధాలు, చుట్టుపక్కల వారితో అనుబంధాలు, పరిచయస్తులతో మమకారాలు, సహోద్యోగుల పలకరింపులు.. జీవితం భిన్న పార్శ్వాల గాజు పట్టకం.. తీసుకొనేది ఒకే కాంతి అయినా వెదజల్లేది పలు వర్ణాలు.

ఇదంతా ఒకనాటి జ్ఞాపకంగా, నోస్టాల్జియాగా మిగిలింది. అలా ఇప్పుడు తరం మారింది...ఉత్తరం కూడా మారింది. మనిషి నిరంతర పరిణామశీలి అంటారు. ఆదిమ మానవుడి నుండి ఆధునిక మానవుడిగా, ఆధునికానంతర మానవుడిగా ఇప్పుడు ఎన్నెన్నో మైలురాళ్లను దాటి పయనించాడు.

లోతుగా ఆలోచిస్తే, నా ప్రియమైన ఉత్తరమా, నువ్వు కూడా మా మానవులలాగే నిత్య పరిణామాన్ని పొందావనే అనిపిస్తుంది. మొదట్లో మొదట్లో వస్త్రం మీద, ఆ తర్వాత తాళపత్రాల మీద, ఆ పిదప పేపర్ మీద మీ ప్రస్థానాన్ని సాగిస్తూ వచ్చావు. ఇప్పుడు సాంకేతికత, ఇంటర్నెట్ యుగంలో ఈ–మెయిల్ గా, ఫేస్బుక్ మెసేజ్ గా, వాట్సప్ చాట్ గా, ట్విట్టర్ సందేశంగా రూపాంతరం చెందావేమోనని అనిపిస్తోంది.

సంప్రదాయ ఆలోచనతో చూస్తే, ఉత్తరంగా నువ్వు పేపర్ మీది అక్షరాలు దగ్గరే ఆగావనే కోణానికి పరిమితం అవుతాము. లేదూ.. నువ్వే వాహికను మార్చుకుని క్రొంగొత్త రూపంలో దర్శనమిచ్చావని భావిస్తే, ఒకలాంటి ఆనందమూ కలుగుతోంది. నిజమే, ఉత్తరం లోనూ, ఇ–మెయిల్స్ లోనూ అవే అక్షరాలు, వాక్యాలు.. వాటిలో నిబిడీకృతమైన ఆనందాలు, విషాదాలు, భావోద్వేగాలు.. అన్నీ ఒకటిగానే అని ఇప్పుడు కొత్తగా అర్థమవుతోంది కదా...

మన రేడియో కేంద్రానికొచ్చే ఉత్తరాల ప్రత్యేకత అందరికీ తెలిసిందే... నిన్ను రకరకాల రంగులతో, పువ్వులతో, బొమ్మలతో అలంకరించి, మందారమాలలు కట్టి తమ మనసులోని మాటని శ్రోతలు మనోరంజనంగా రాసి పంపిస్తే జనరంజనంగా వినిపిస్తుంది రేడియో. సినిమా పాటలు కోరుకొనేవారు, కార్యక్రమాల పట్ల అభిప్రాయాలూ, సమస్యా పూరణలు పంపేవారు.. ఇలా ఎందరినో ఉత్తరం, శ్రోతని రేడియోకి ఆత్మీయుడిని చేసింది. ధర్మసందేహాలకు రేడియోకి ఉత్తరాలు రాయడం ద్వారా సమాధానాలు పొంది స్వాంతంలో సాంత్వనం పొందినవారు కొల్లలు.

వార్తా పత్రికల్లో వివిధ అంశాలపై ప్రశ్నోత్తరాలు నడిపిన ప్రకరణాలు నాకిప్పటికీ గుర్తే ప్రియతమా. స్కూళ్లలో పిల్లల 'సెలవు చీటీలు', కాలేజీ కుర్రాళ్ళ కొంటె పనులకు ప్రిన్సిపల్ రాయించుకున్న 'అపాలజీ లెటర్లు', ఆఫీసుల్లో అభ్యర్థన పత్రాలు... ఇక 'ప్రేమ లేఖల' సంగతులు చెప్పుకుంటే పావుగంట కాదు, పాతిక రోజులు కేటాయించినా తక్కువే. మరిప్పుడు ఆ పరిమళాలు ఎక్కడున్నాయా అని వెతుకుతుంటే ఓ తత్త్వం బోధ పడింది.. జీవన సత్యం అవగాహనకు వచ్చింది...

'ఉత్తరం'గా నీ ప్రధాన ఆశయం ఏమిటి? సందేశాన్ని, మనుషుల భావోద్వేగాలను చేరవేయడమే కదా... ఆ లెక్కన ఇప్పటి ఈ–మెయిల్స్ కూడా చేస్తున్నది అదే కదా... ఇంకా చెప్పాలంటే, నిన్నటి తరంలో లేని సౌలభ్యం, సౌకర్యం ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయ్ తెలుసా? ఉత్తరం రాసినప్పుడు మనలోని భావోద్వేగాలను తెలపడానికి కేవలం

ఐదు సంకేతాలు మాత్రమే అందుబాటులో ఉండేవి. అవి– ప్రశ్నార్థకం, ఆశ్చర్యార్థకం, కామా, ఫుల్‌స్టాప్, చుక్కలతో కూడిన కొనసాగింపు......ఇవి మాత్రమే.

కానీ ఇప్పటి నీ కొత్త అవతారంలో చూడు... ఎన్ని రకాల ఎమోటికన్స్..మరెన్నో రకాల ఎమోజీలున్నాయో... అన్ని రకాల భావాలను వ్యక్తీకరించగలిగే సంకేతాలు ఇప్పుడు వాట్సాప్ లో లభిస్తున్నాయి. ఆఖరికి బుగ్గలు ఎర్రబారాయనే వ్యక్తీకరణకు సైతం సంకేతాలు వచ్చాయి.

అందుకని ఉత్తరమా, నా హృదయ సమీరమా... నువ్వు నిరంతరం నా మనసుకు అద్దంలా నిలిచావు... పేపర్ మీద ఉన్నా, కంప్యూటర్ మానిటర్ మీద ఉన్నా, సెల్ ఫోన్ స్క్రీన్ మీద ఉన్నా నీ ఆత్మీయత తగ్గలేదు..నీ నిబద్ధత తరగలేదు.. మాతోబాటు సమాంతరంగా నువ్వు నడిచిన ప్రయాణం ఇంకా ఆగలేదు...

ఉత్తరమా, నా నిరంతర చైతన్యమా! ఎన్నెన్నో అవతారాలెత్తి, ఎప్పటికప్పుడు నా మనసు దోచుకున్నావు. నా హృదయాన్ని నీలో నిక్షిప్తం చేసేలా చేసావు...

ఉత్తరమా, జ్ఞాపకంగా నిలిచిపోయిన నీ పాత అవతారానికి వందనం... నేటి వెలుగుగా వచ్చిన నీ కొత్త అవతారానికి స్వాగతం...

ఇక ఉండనా...

నీ

– హిమబిందు

# ఈ శతాబ్ధి సత్యం

బాపూ!

పరమత సహనం, దయాగుణం, సత్యనిష్ఠ నీ ఆచరణీయ విలువలుగా నువ్వు పదే పదే చెప్పినప్పటికీ, ప్రజలమధ్య ఉన్న ఓ మహనీయుడిగా నిన్ను ప్రపంచమే గుర్తించినప్పటికీ, అదే సహనంతో అదే సత్యనిష్ఠతో అందరికోసం నువ్వెలా అంత అకుంఠిత దీక్షతో పనిచేశావో మాకిప్పటికీ అంతుచిక్కని ప్రశ్నగానే మిగిలింది. ''ఈ భూమ్మీద రక్తమాంసాలతో గాంధీ అనే వ్యక్తి నడయాడాడంటే రేపటి ప్రజలు ఆశ్చర్యపడతారు'' అన్న మహనీయుల స్టేట్మెంట్లు మా ఆరాధనని నీపట్ల మరింతపెంచాయి. సూర్యుడు అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి తోకముడిచి పారిపోయేలా చేసిన మీ సత్యగ్రహం విలువ, అహింసల చేయూత మన జాతి ఎప్పటికీ మర్చిపోదు.

సమైక్యతాభావన, సంఘటిత శక్తిని జాతి జనాల్లో నింపటానికీ, నీ వెనుక నడిచేలా చెయ్యటానికి, నువు చేసిన త్యాగాలు, నువ్వు ఆచరించి చూపించిన నైతిక విలువలు మా జనానికెప్పటికీ ఆచరణీయ పాఠాలే. ఒక్కసారి చరిత్ర తిరగేద్దాం ... ఆ చీకటి రోజుల్ని జ్ఞాపకం చేసుకుంటేనే కదా వెలుగుల్ని పరిచిన నీ ఆత్మశోధన, కనిపెట్టిన సత్యాగ్రహం, అహింసల శక్తి తెల్సేది.

అతిక్రూరమైన దోపిడీ రూపం బానిస వ్యవస్థ... వలేసి చాపలు పట్టినట్టు మనుష్యుల్ని తెల్లవారు పట్టుకుని వ్యవసాయ పనుల్లో, గృహల్లో, గనుల్లో వెట్టికి వాడేవారు. బానిసలు యజమాని ఆస్తులు. మాన, ప్రాణాలూ యజమాని ఇష్టమే. 16 – 19 వ శతాబ్దాల్లో 2 కోట్లమంది ఆఫ్రికన్ ప్రజల్ని అమెరికా, బ్రెజిల్, కరెబియన్ దీవులకు నిర్భందంగా తీసుకెళ్ళినట్టు చారిత్రక ఆధారాలున్నాయి. అయినా బాపూ!

జంతువుల్లాగా మనుష్యుల్ని రోడ్లమీద మరో మనుష్యులే అమ్మడం ఏమిటి? ఎంత అనాగరికం కదా? ప్రపంచమెంత దుర్మార్గంలో ప్రవర్తిస్తున్నా సన్మార్గానికి దాసోహమంటుంది. అని నువ్వన్నట్టుగానే ఆ దోపిడి వ్యవస్థను నిరోధించుకున్నాం – నివారించగలిగాం. కానీ నీకో విషయాన్ని జ్ఞాపకం చెయ్యనా బాపూ !

అణుబాంబులు తయారుచేయాలని అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్‌కి సలహానిస్తూ వ్రాసిన ఉత్తరం మీద సంతకం చేసి మహాతప్పిదం చేశానని ఐన్‌స్టీన్ తాను చనిపోవడానికి కొద్దిరోజుల ముందు సన్నిహితులతో అన్నాడట కదా బాపూ! – ఇంతగా అంతగొప్ప సైంటిస్టునే కలవర పరిచిన విషయం మనందరికి ఇప్పటికీ కన్నీళ్ళు తెప్పిస్తూనే వున్న అంశం వినాశనమేగా. తాను కనిపెట్టిన కొన్ని సిద్ధాంతాల మూలంగా అణుబాంబు రూపొందింపబడటం ఎంత బాధపెట్టేయో పాపం ఐన్‌స్టీన్‌ని.

ఒక స్విట్జర్లాండ్ శాస్త్రవేత్త లెక్కల ప్రకారం 5,500 సంవత్సరాల్లో యుద్ధాలసంఖ్య 14 వేలు – మరణించినవారి సంఖ్య 364 కోట్లు. నాశనమైన వస్తు విలువ 50 లక్షల స్విస్ ఫ్రాంకులు. అంటే... ఒక కోటి కోట్ల రూపాయలు.

ఒక్కసారి నువ్వన్నమాట జ్ఞాపకం వస్తుంది బాపూ! ఆర్థిక దోపిడి, సామ్రాజ్య వాదాలవల్లే యుద్ధాలోస్తాయని. నిజం కదా! లాటిన్ అమెరికా దేశాల్లో 150 సంవత్సరాల్లో 550 సార్లు సైనికాధికారులు అధికారాన్ని వశం చేసుకున్నారు. మత యుద్ధాలు అంటే క్రూసేడ్ల వల్ల అదే జెరూసలెం నగరాన్ని 8వ శతాబ్దంలో ముస్లింలు వశపర్చుకున్నప్పటికీ, 11వ శతాబ్దంలో క్రైస్తవ పర్యాటకుల మీద ఆంక్షలు విధించినప్పటి నుండీ 14వ శతాబ్దం వరకు ముస్లింల మీద 9 సార్లు దండయాత్రలు జరిగాయి. అందులో లక్షల మంది మృతి చెందారని అందరికీ తెలుసు.

ఫ్రాన్స్ భూముల్ని ఆక్రమించుకోవాలని 1338–1453 ల మధ్యకాలంలో 100 సంవత్సరాల పాటు ఇంగ్లాండ్ ఫ్రాన్స్ మీద యుద్ధంచేసి పరాజయం పాలైంది. జన్మభూమి కోసం ఫ్రాన్స్ దేశస్థులెందరో ప్రాణాలు కోల్పోయారుగా. చైనాలో జరిగిన తైపింగ్ తిరుగుబాటు అంటే మంచూ రాజుల పాలనకు వ్యతిరేకంగా రైతులు చేసిన తిరుగుబాటు అంతర్యుద్ధంకి దారితీస్తే, దాంట్లో కూడా 3 కోట్లమంది ప్రజలు చనిపోయారు. ఉదాహరణగా నెపోలియన్ నే తీసుకుందాం బాపూ! – సామ్రాజ్యవాద పిచ్చితో 10 లక్షల సైన్యాన్ని తయారు చేశాడంటే అది ఫ్రాన్స్ జనాభాలో 5వ శాతం కదా! ఎంత అధికార దాహం అన్పించట్లేదూ? అంతెందుకు బాపూ మన ప్రపంచ యుద్ధాలే చూద్దాం.

1914 జూలై 28న ప్రారంభమైన మొదటి ప్రపంచ యుద్ధం జర్మన్ సామ్రాజ్యవాదం వల్లేగా వచ్చింది – 6 కోట్ల 35 లక్షల సైనికులు సమీకరింపబడ్డ ఆ యుద్ధంలో కోటిమంది చనిపోగా 2 కోట్ల మంది గాయపడగా 4 లక్షల కోట్ల రూపాయల ఆస్తినష్టాన్ని చవిచూసి 1918 నవంబర్ 11న ముగిసింది. అసలు ఎందుకు మొదలయినట్టు ? ఏం సాధించానని ముగిసినట్టు ? రెండవ ప్రపంచ యుద్ధాన్ని తీసుకుంటే 1939 సెప్టెంబర్ 1న జర్మనీ సైన్యాలు పోలెండ్‌పై దాడితో ప్రారంభమై 61 దేశాలకు విస్తరించింది. 40 దేశాలపై దాడులు జరిగాయి. 10 కోట్ల 70 లక్షల సైనికులు పాల్గొన్న ఈ యుద్ధంలో 5 కోట్ల, 50 లక్షల మంది చనిపోయారు. 32 లక్షల కోట్ల ఆస్తి నష్టం జరిగి 1945 జూన్లో యుద్ధాన్ని ముగించారు. ఇదీ అర్థంకాని వ్యవస్థేకదా.

అంతెందుకు ప్రపంచ పోలీస్‌గా మనమంతా పిల్చుకునే అమెరికా ఈ 30 సంవత్సరాల్లో ఇతర దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం కల్పించుకుని 215 సార్లు తన సాయుధ బలగాల్ని ఉపయోగించిందని రాజనీతిజ్ఞులు రాస్తున్నారు. ఎంత బాధాకరం కదా – బాపూ! నువ్వు కన్నీళ్ళు పెట్టుకున్న సందర్భాలు ఎన్నో వున్నాయి. అందులో నాజీల దురాక్రమాలు – దుర్మార్గాలని తడి కళ్ళతో చెప్పిన విశేషాలూ వున్నాయి.

2 కోట్ల 60 లక్షల ప్రజల్ని నాజీలు కాన్సెన్ట్రేషన్ క్యాంపుల్లో బంధించి 1 కోటికి పైగా గ్యాస్ బాంబర్లలో పెట్టి చంపారని, ఉరితీసి కొందర్ని, తుపాకులతో కాల్చిమరికొందర్ని కిరాతకంగా చంపేశారని చెప్పగా విన్నాం. ఖైదీల కొవ్వుతో సబ్బులు, జుట్టుతో తివాచీలు తయారుచేసి వాడారని వింటుంటేనే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. తలల్ని రసాయనాల్లో ముంచి పేపర్ వెయిట్స్‌గా ఉపయోగించేవారటగా.. అంతెందుకు... ఇప్పటికీ మన నెత్తి మీద మృత్యువు ఆటంబాంబు రూపంలో దోబూచులాడుతూనే ఉంది. నిజం చెప్పనా బాపూ ! ఇప్పుడు ప్రపంచం దగ్గరున్న బాంబులతో ప్రపంచం మొత్తాన్ని 15 సార్లు నాశనం చెయ్యొచ్చట తెల్సా.

ఇవన్నీ తెల్సుకునే కదా నువ్వు ప్రపంచానికి 'అహింస'ను అందించావ్... హింసావాదాన్ని సత్యమనే ఆగ్రహంతో తెలియ పరిచే 'అహింస' ఎంత గొప్పదో ప్రపంచానికి చూపించావు! ఒకవైపు బ్రిటీష్ సామ్రాజ్యం వైశాల్యం కోటి 45 లక్షల చదరపు మైళ్ళట. జనాభా 60కోట్లు.. దేశాల సంఖ్య 59 – అటువంటి సూర్యుడు అస్తమించని బ్రిటీష్‌సామ్రాజ్యాన్ని 'అహింస'తో గెల్చుకున్న ఏకైక వ్యక్తివి నువ్వు... ప్రజల మానప్రాణాల్ని చూసి తల్లడిల్లి ప్రపంచాన్ని ప్రధాన నైతిక విలువలవైపు నడిపించిన దేవుడివి నువ్వు–

అయ్యో బాపూ ! తప్పుగా మాట్లాడానా... అవును... వ్యక్తిగా ప్రతివారిని గౌరవించాలి కానీ విగ్రహంగా ఎవ్వర్నీ మార్చకూడదు, వ్యక్తి పూజలు చేయకూడదు అని చెప్పింది నువ్వే... కానీ నేను నిన్ను స్తుతించటమంటే మచ్చలేని నీ వ్యక్తిత్వాన్ని మరో మారు గుర్తుచేసుకోవటమే – సత్యగ్రహం ద్వారా విభిన్న జాతుల, మతాల, ఆచార వ్యవహారాల్ని కల్గిన ఈ మన భారత జాతిని సంఘటితం చేసి బానిసతనం నుండి విముక్తం చేసిన జాతిరత్నానివి నువ్వు.

నువ్వు జెండాగా ఎగురుతూ మా మీద పువ్వుల దీవెనలు పరుస్తూ వుంటే నీ అంత ఎత్తుగా ఎగరమని మానవత్వ తత్వంతో దీవిస్తున్నట్టుగా భావిస్తాం మేము. నక్షత్రాలను పండించే ఆకాశంలా, గింజల్ని పండించే రైతులా, మహాత్మా! మా ఆలోచనల్ని పండించిన నువ్వంటే నాకెంతో ఇష్టం తెల్సా.


నాగరికతకు నాగలి తొలి సోపానంగా... సంస్కృతికి భాష ఆది ఓంకారంగా కళ్ళుతెరవని బానిసదేశానికి మరొక్కసారి నేర్పింది నువ్వేగా. భూగోళపు నల్లపలకమీద 'దయ' అనే తొలిపదం రాయించింది నువ్వేగా – దేశాన్ని ప్రేమించటమంటే మనిషిని పూజించటమేనని ఎరుకపరిచింది నువ్వేగా – అహింసను ప్రపంచానికి చవిచూపించింది నువ్వేగా. మొక్క మొక్కకు చెమట చుక్కల్ని పోసి బతికించుకున్నట్టు... మనిషి మనిషిని దేశభక్తి స్ఫూర్తితో నడిపించేది నువ్వేగా !

'నా దేశం పావనగంగ – నాదేశం కరుణాంతరంగ – నాదేశం భగవద్గీత – నాదేశం అగ్ని పునీత సీత – నా దేశం సంస్కార తరంగ' అంటూ ఎందరో కవులు వేనోళ్ళు పొగిడి వుండొచ్చు. కానీ నేను నీకు సాష్టాంగపడి నమస్కరిస్తూ సజల నయనాలతో ఓ కోరిక కోరతాను. తీరుస్తావా జాతిపితా ! నాకు మానవ జన్మలెన్ని వున్నా ప్రతి జన్మలోనూ నేను నీ ఒడిలోనే పుట్టాలి. ఈ నేల మీదే నడవాలి. ఇంతకన్నా నాకే స్వర్గం వద్దయ్యా.

వేదాలను అనువదించీ అనువదించీ జర్మన్ భాషావేత్త మాక్స్ ముల్లర్ భారతదేశాన్ని, నిన్ను ఆరాధించటం మొదలుపెట్టాడు. ఎంతగా అంటే పునర్జన్మ అంటూ వుంటే మీరెలా పుట్టాలని భావిస్తున్నారు అని ఓ విలేకరి అడిగితే భారతీయుడిగా పుట్టాలని కోరుకుంటున్నాను అనేంతగా నువ్వు స్ఫూర్తిని రగిలించావు. అంతెందుకు మీరేమన్నారో గుర్తుందా జాతిపితా ! ఇది నా దేశం కాబట్టి నేను ప్రేమించటం లేదు. విశిష్ట లక్షణాలను ఇక్కడ చూశాను కాబట్టి నేను ఈ దేశాన్ని నా ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమిస్తున్నాననే కదా ఎప్పుడూ చెప్పేవారు.

భారతదేశపు ఆత్మ వివేకానందుని ప్రసంగాల్లో కన్పించేదని అంటుండేవారు కదా ! చికాగోలో వివేకానందుని ప్రసంగం విని, విశ్వమానవుడిని దర్శించగలిగామని ఆత్మజ్ఞానం–ఆధ్యాత్మిక శక్తి కలగల్సిన మూర్తిమత్వం భారతీయుని స్వంతమని అక్కడి పత్రికలు రాయటం మనం మర్చిపోగల్గుతామా... నువ్వు దేవుడికి మొక్కుతావా – గురువుకు మొక్కుతావా అని కబీరుదాసుని అడిగితే దేవుడిని ముందుగా చూపించిన గురువుకే నా తొలి దండం అన్న సంస్కర్తల్ని కన్న నేల ఇది. ఇదొక సనాతన తత్వ ప్రబోధం. ధర్మమే నిలువెత్తు రూపంగా నిలిచిన హర్మ్యం. అందుకే కదా! ఈ దేశంలో హిమాలయాల్లో నిత్యం మంత్రజపం చేస్తున్న ఋషులు వల్లనే ఈ ప్రపంచం మనుగడ సాగించగల్గుతుంది అన్న విషయాన్నే ఎంతో మంది నమ్మతారు.

'అహింస' అనే ఆయుధంతో చిటికెడు రక్తం చిందకుండా సూర్యుడు అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని వెనక్కు పంపిన నువ్వు పుట్టిన నేల ఇది. శాంతినే ప్రవచించి, సన్మార్గాన్నే బోధించిన బుద్ధుడు నడిచిన నేల ఇది – అన్ని జీవజాతుల్ని ఒకటిగా చూసిన రమణమహర్షి నిర్యాణం పొందిన నేల కూడా ఇదే. నిజమే – ఎక్కడో పాటలో విన్నట్టు చాలా దేశాలు కళ్ళు తెరవకముందే మనం సంస్కృతిని రూపొందించుకున్నాం, నాగరికతను ఏర్పాటు చేసుకున్నాం. సర్వ సంపన్నంగా రోడ్లమీద వజ్రాలను, ముత్యాలను, బంగారాలను రాశులుగాపోసి అమ్ముకున్నాం.



అవును – రత్నగర్భ మనదేశం రాశులుగాపోసి రత్నాలతోపాటు 'బాలశిక్ష' తన నీతిపద్యాల్ని, పురాణాల్లోని నీతివచనాల్ని ప్రబోధించింది ఇక్కడే. పరాధీనులం కాకుండా, అస్థిత్వంలేని అనాథలం కాకుండా కాపాడింది నువ్వే. మా విశ్వాసాలు, మా వికాసాలు పుట్టింది ఈ మట్టిలోంచే, మీలాంటి మహనీయులనుంచే అందుకే నా కన్నతల్లివి, తల్లివేరువి, ఊరేగే కల్పవల్లివి, పూజలందుకునే పాలవెల్లివి దేశంతోపాటు నువ్వు కూడా బాపూ ! మనదేశం పచ్చమాగాణం, లోకాన్ని ఎరుకపర్చిన మహాకావ్యం, కళల పుష్పం, అన్ని మతాల ఇంద్రధనస్సు మనదేశం.

ఎన్సైక్లోపీడియా బ్రిటానికా భారతదేశం గురించి ఏమందో తెలుసా – 'ఆ దేవదేవుడి అనుగ్రహం పొందిన దేశాల్లో ముందువరసలోనిది' అని. ఆ అనుగ్రహం దేశానికి ఎలా కల్గింది? నీలాంటి మహనీయులు నడయాడటం వల్లనే కదా! శత్రువుకి సైతం కీడును తలపెట్టలేని నీ కరుణాగుణంవల్లే కదా!

అవును – నీవంటే ఎవరు? నిన్నెలా అంచనా వేయాలి? నీ దేశం గొప్పేమిటీ అని చాలామంది అంటారు. నేను ఒకమాట చెప్తాను. వింటేనో, చెప్తేనో, చూస్తేనో అర్థం అయ్యేంత చిన్నది కాదు నా దేశం. రండి నా దేశంలో ఉండండి, ఆ అనుభవాల్ని ఆస్వాదించండి. అప్పుడు అర్థమవుతుంది అని. గంగామాతంత గొప్పతనం, ఎవరెస్ట్ అంత మానవత్వం, కలిగిందే నా భారతదేశం అని అప్పుడు అర్థమవుతుంది. అవును, నువ్వు గంగా–జమునా తెహజీబ్‌గా దేశాన్ని పిలుస్తావు. ప్రఖ్యాత షహనాయ్ విద్వాంసులు, అంతర్జాతీయ వాద్యకారులు, ఉస్తాద్ బిస్మిల్లా ఖానును ఎన్నో దేశాలు ఎంతో డబ్బులిచ్చి, గౌరవాలు అందించి మా దేశాల్లో స్థిరపడమని బలవంతం చేసినా నేను రాలేనని – నా దేశాన్ని వదిలివుండలేనని చెప్పాడంటారు. 'మీ దేశానికి నాతోపాటు నా గంగామాయిని కూడా తేగలరా? గంగను వదిలి బిస్మిల్లాఖాన్ షెహనాయి పాడదు. విశ్వనాథుడు కూడా నిద్రలేవడ'ని కథలుగా ఇప్పటికి చెప్పుకుంటూనే ఉంటారు జనం.

మనదేశం ఆధ్యాత్మిక చైతన్యం ముందు, నీ వ్యక్తిత్వం ముందు ఆ ఆకాశం కూడా వంగి సాష్టాంగ నమస్కారం చేయాల్సిందే. భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడగలిగిన విశాలత, పుట్టుకతోనే అలవడే భక్తితత్వం నీ చేతలద్వారా మా అందరి నరనరాల్లో రగిలించావు. విభిన్న సంస్కృతుల్ని గౌరవించటం, గుర్తించటం, పోషించటం, మంచి వుంటే ఆచారాలుగా పాటించటం ప్రతి భారతీయుని అభిమతంగా మార్చేసింది నువ్వే.

అందుకే కదా ఎన్నెన్నో దేశాల నుండి ఎందరెందరో మహా మేధావులు, తత్వజ్ఞులు, ఆధ్యాత్మిక వేత్తలు మన మూలాల్ని తెల్సుకోవాలని, మన సంఘటిత శక్తిబలాన్ని అన్వేషించాలని ఎన్నో వేల యేళ్ళుగా ప్రయత్నిస్తూనే వున్నారు. తాత్కాలిక విజయాలే తప్ప శాశ్వత స్థిర విజేతలు కాలేకపోయారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని స్వంతం చేసుకున్న ఆధ్యాత్మిక వికాసమే ఈ దేశ ప్రధాన గుణంగా మార్చిన మా గురువువి నువ్వు. ఈ జాతి నాగరికతను, ఔన్నత్యాన్ని అర్థం చేసుకోవాలంటే మన సాంస్కృతిక వికాసాన్ని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఒక్క కుంభమేళా చూస్తే చాలు మనదేశ ఆధ్యాత్మిక ఆత్మదర్శనం ఏమిటో తెలుస్తుంది – వేలల్లో వచ్చే నాగ సాధువులు స్నానం చేసిన తర్వాత కిక్కిరిసిన జనాలమధ్య ట్రాఫిక్‌జాంలే కాకుండా, ఒక్కరి దర్శనం కూడా ఆ తరువాత ఎవరికీ కాకుండా అసలు దొరక్కుండా, ఎలా – ఎక్కడ అదృశ్యమవుతారన్నది ఇప్పటికీ అంతు చిక్కని రహస్యమే కదా బాపూ!

అయినా కాళన్న నీ గురించి కవితాత్మకంగా చెప్పిన మాట గుర్తుందా బాపూ!

సత్యాహింసల ఖ్యాతి వెలిగించిన బ్రతుకు నీది
ద్వేషం ఎరుగని సైరణ సామరస్య సరళి నీది
జాతి పితవు అయికూడ తల్లి గుండె కలవాడవు
మా తప్పుల వొడి నిడుకొని ప్రాచితముగ పస్తు పండి

జాతిని భారత జాతిని దయజూచిన వాడవు మరి –
జాతిపితా! ఓ మహాత్మా అంటూ నీరాజనం పలికారు.

బాపూ! ఎన్నెన్నో సిద్ధాంతాలు చూసాం. ఎన్నో సైద్ధాంతిక ప్రసంగాలు విన్నాం. కానీ గాంధీ ఇజాన్ని మించిన మానవతా వాదం, మనిషిని మనిషీగా మార్చే మానవీయకోణం నాకెక్కడా తారసపడలేదు. మనిషినే సాధనంగా ఉపయోగించుకొని అహింసనే ఆయుధంగా వాడుకొని, అసాధ్యాలను సుసాధ్యం చేసిన నవీనబ్రహ్మవి నువ్వు. నాదేశాన్ని బానిస సంకెళ్లనుండి విముక్తంచేసి స్వేచ్ఛను ప్రసాదించిన మా అమ్మవి నువ్వు. స్పెయిన్ దేశంలో సేలియా అనే చిన్న టౌన్‌లో 'వితోపాల్లో' అనే వ్యక్తి, నీ మీద గౌరవంతో నెలలో రెండు రోజులపాటు ఉపవాసం ఉంటాడని నెలకు ఒకటైనా నీ పెయింటింగ్ వేస్తాడు అని చదివి, ఆశ్చర్యపోయింది మాతరం.

ఓ బాపూ! మమ్మల్ని ఆశీర్వదించు. నీ వారసులుగా, నీ ప్రతిరూపాలుగా మారగల సహనశక్తిని, ఆత్మ నిగ్రహశక్తిని, పరమత సహన భక్తిని, మాకు అందివ్వు. మన దేశాన్ని నిరంతరం శాంతి సామరస్యాలతో, మెలిగే శక్తిని చేకూర్చు.

ఉండనా మరి...

– శ్యామ్ సుందర్

# తీరొక్క పువ్వు

బతుకమ్మా!

ఎంత బాగుందో నీ పేరు–ఎంతైనా బతుకునిచ్చే అమ్మవు కదా! మనిషికి పూలతో, నీతోవున్న గాఢమైన అనుబంధాన్ని ఎన్నో యేళ్ళుగా కాపాడుకుంటూ సంప్రదాయాన్ని మాలో బతికించుకుంటూ వస్తున్న బంగారు తల్లివి నువ్వు. మట్టి నుండి పుట్టిన మనిషి, మట్టిలో కలసిపోయినట్టు ప్రకృతి నుండి పుట్టిన పూలు నీళ్ళను శుద్ధిచేస్తూ ఆ నీళ్ళలో లయమైపోవటయే సదాచారంగా మాతో చేయిస్తున్నావు.

పూలకొండలలో నివాసం – పూల గుండెలలో విలాసం, అందుకే కదా అవధాని, సంస్కృతీ పండితులు అయాచితం నటేశ్వరశర్మ గారు నీ మీద ఓ గొప్ప కవితనే రాయగలిగారు.

పూలలోపల పుట్టి పుడమి వాకిట మెట్టి, పూలతో అలరించు పువ్వైన బతుకమ్మ.
ఊరేగుతూ రావే గారాల బతుకమ్మ, ఉప్పొంగి ఇటురావే ఉదయాన బతుకమ్మ.
నీ చుట్టూ మా ఆట నింగికెగిసిన పాట, ఉయ్యాల పాటలతో ఉర్రూతలూపేవూ' అంటారు.
నిజం... నీ పుట్టుకే గొప్పది... నీ రూపం అతి గొప్పది... నీ జన్మమే ఇంకా గొప్పది.

కాకతీయుల కాలంలో జీవనం ఎక్కువగా వ్యవసాయమే కాబట్టి ఆర్థిక పరిపుష్టిని కలిగించే ఆధారం చెఱువే కాబట్టి, లక్షన్నర చెఱువులు ఆ కాలంలో ఉన్నాయని చెప్తారు కాబట్టి ఇంటి ముత్తైదువులంతా యేదాదికోసారి కొత్తబట్టలు కట్టుకుని ప్రసాదాలు తీసుకొని చెరువుల దగ్గరకెళ్ళి చెరువునే తమ ఇంటి దేవుడిగా, పంటల దేవుడిగా భావిస్తూ చెరువులో పూలు వేసి తమ భక్తిని చాటుకుని అక్కడే ప్రసాదం పెట్టి దాన్ని అందరికీ పంచి ఓ రోజుని ఆనందంగా గడిపేవారు. అలా అది ఆచారంగా మారిందని, చెరువులను పూలతో పూజించటంలో క్రియాత్మకత చోటు చేసుకుని గౌరమ్మ తల్లీ పసుపు కుంకుమల్ని కాపాడే తల్లి కాబట్టి ఆ గౌరమ్మను పూల సింగిడిగా పేర్చి చెరువులో వదిలేవారని తెలుస్తుంది. బిరుదురాజు రామరాజుగారు తన జానపద గీతా సాహిత్యంలో ఇలాంటి ఎన్నెన్నో విలువైన విషయాలు తెలియచేశారు.

బ్రతుకమ్మా! నువ్వు ముఖ్యంగా నాలుగు కళారూపాల సమాహారానివి. లయబద్ధంగా గాజుల సవ్వడులను చేతులతో మోగిస్తూ సంగీతాన్ని సృష్టిస్తావ్. ఈ లయకు అనుకూలంగా వృత్తాకారంలో తిరుగుతూ నాట్యాన్ని సృష్టిస్తావ్. ఈ రెండిటిని గమనిస్తూ హుషారెత్తే పాటల్ని అందిస్తావు. సృజనాత్మకంగా కళాత్మకంగా 'పూల సింగిడిలా' నిన్ను తయారుచేయటమే, ఓ గొప్పకళగా భావింపచేస్తావ్. అవును, తపుకు కాని, తంబాలం కానీ తీసుకొని గుమ్మడి ఆకులు

పరచి గుమ్మడి పువ్వును విడదీసి పరిచి ఆకులు మొగ్గలు లేకుండా వికసించిన పూలను కట్టలుగా పేర్చుకుంటూ వస్తారు. సిరాలో మునకేసిన గునుగుపూలు రకరకాల రంగుల్లో కన్పిస్తూ అబ్బురపరుస్తాయి.

''నేలపైనా నీవే, నీటిలోపలా నీవే, నింగిలోన నీవే, గాలిలోన నీవే – దివ్వెలోనా నీవే వెలుగుతుంటివి తల్లి! కాంక్షలను తీరుస్తూ బతకవే బతుకమ్మ మమ్ము కాపాడుతూ!'' అని వేడుకుంటూ ఆడతారు మహిళామణులు.

మహాగౌరి అమ్మవారే నీ రూపంలో భక్తుల ఇంటికొస్తుందని తెలంగాణలోని ప్రతి మహిళా భావిస్తుంది. ఇన్ని తరాలు మారినా ఈ పండుగ మరవకపోవటానికి అదొక కారణం, అదే నమ్మకం. అయితే పెట్టే నైవేద్యాన్ని బట్టి ఒక్కో రోజుని ఒక్కోలా పిలుస్తారు.

నువ్వు గమనించావో లేదో కానీ ఈ తొమ్మిది రోజులు నీ గురించి ఆడే విధానం, పాటలు అన్నీ ఒకటే కానీ ప్రతిరోజూ బతుకమ్మగా నిన్ను పిల్చుకునే విధానం మాత్రం తయారుచేసే ప్రసాదాలనుబట్టి మారుతుంది. పూలతో నిన్ను పేర్చి చుట్టూ తిరిగి అక్కాచెల్లెళ్ళతో నృత్యం చేస్తు పాటలు పాడి చివరికి దగ్గరలోని చెరువులో వదిలేస్తారు కదా!

1 మహాలయ అమావాస్య రోజు వచ్చే నిన్ను ఎంగిలి పూల బతుకమ్మ అంటారు. మొగ్గలుగా వుండే పూలు తెచ్చి పెదవులతో ఊది వికసింపచేస్తారు కాబట్టి ఎంగిలి పూల బతుకమ్మ అని పిలుస్తారు. నువ్వులు, బియ్యం పిండితో చేసిన ప్రసాదాన్నే ఆరగింపుగా పెడ్తారు.

2 ఆశ్వయుజ పాడ్యమి రోజును అటుకుల బతుకమ్మగా నిన్ను పిలుస్తారు. చప్పిడి పప్పు, అటుకులు, బెల్లం నైవేద్యం.

3 ముద్దపప్పు బతుకమ్మ – ఆశ్వయుజ శుక్ల విదియనాడు చేస్తారు. ముద్దపప్పు, పాలు, బెల్లం ఆరగింపు.

4 నానబియ్యం బతుకమ్మ – ఆశ్వయుజ శుక్ల తదియనాడు చేస్తారు. ఆరోజే నానేసిన బియ్యం, పాలు, బెల్లం, నైవేద్యం

5 అట్ల బతుకమ్మ – ఆశ్వయుజ శుక్ల చవితి నాడు వస్తుంది. అట్లు పోసుకొని అమ్మవారికి నైవేద్యంగా పెడతారు.

6 అలిగిన బతుకమ్మ – ఆశ్వయుజ పంచమి నాడు వస్తుంది. ఈ రోజు బతుకమ్మకి ఎలాంటి నైవేద్యం పెట్టరు.

7 వేపకాయల బతుకమ్మ – ఆశ్వయుజ శుక్ల షష్ఠినాడు వస్తుంది. బియ్యపు పిండి ఉండలను వేపకాయల ఆకారంలో చేయించి నీకు సమర్పిస్తారు.

8 వెన్నముద్ద బతుకమ్మ – ఆశ్వయుజ శుక్ల సప్తమినాడు వస్తుంది. నువ్వులు, వెన్న లేదా నెయ్యి, బెల్లంతో చేసిన ప్రసాదాలను అమ్మవారికి సమర్పిస్తారు.

9 సద్దుల బతుకమ్మ – నీ వేడుకల్లో చిట్టచివరిది. ఇది దుర్గాష్టమి రోజున వస్తుంది. ఈ రోజు మహిళలు సహజంగా ఐదు రకాలైన అన్నాలు వండుతారు. పెరుగన్నం, చింతపండుతో పులిహోర, నిమ్మకాయల పులిహోర, కొబ్బరన్నం, నువ్వుల అన్నం చేసి ఆరగింపు పెడ్తారు. నీకు తెలియవని కాదు బతుకమ్మా నీలో వున్నా వైవిధ్యాన్ని మరోమారు గుర్తు చేస్తున్నాను.

నిన్ను పేర్చటంలో ఉపయోగించే పూలు ఎంతో ఔషధ విలువల్ని కల్గి వున్నాయి.

మహాలయ అమావాస్య నుండి మహర్నవమి వరకూ తెలంగాణ సాంస్కృతిక సౌరభాల్ని వాడవాడలా చాటుతూ పేదింటి నుండి పెద్దింటి వరకూ సంబరాలు చేసుకునే విధానం నిజంగా ఓ బ్రహ్మోత్సవమే. తెల్లారిగట్లే లేచి చెరువులు, చెల్కలు వెతికి పూలు తెచ్చి ఇంటి ఆడవాళ్ళకు అందివ్వటం ఆ ఇంట్లోని మగవారి బాధ్యత.

చూడ్డానికి చిన్న పూలే – పేద పూలే – ఎక్కడ వేసినా మొలిచే పూలచెట్లు ఇవి – సామాన్య మానవుడికి భారం కాకుండా మన చుట్టూవున్న ప్రకృతిలో దొరికే పూలే, కానీ పరికించి చూస్తే ప్రాణదాతలుగా కన్పిస్తాయి. మందార, గన్నేరు, రుద్రాక్ష, గోరింట, పట్టుకుచ్చులు, రోకలి బండలాంటి తీరొక్క రూపుగావున్న పూలు ప్రధానంగా కన్పిస్తాయి. అయితే వీటిని మూలికలుగా ఎన్నో మందుల్లో వాడుతుంటాము. ఆలోచిస్తే స్త్రీ, పురుష అవయవాలను పోలివుండే గుమ్మడి పువ్వును శిఖర స్థానంలో ఉంచి ఆ రంగును బట్టి గౌరమ్మ అని పిలిచేవారని, రంగును బట్టి కట్ల పువ్వును విష్ణువుగా, రూపాన్ని బట్టి గునుగు పువ్వును బ్రహ్మగా–భావిస్తూ ముగ్గురమ్మల మూలపుటమ్మ ఆది పరాశక్తి రూపంగా నిన్ను కొలుస్తారు కదా! ఆ పూలను ఓ సారి గమనిద్దామా బతుకమ్మా!

1. గునుగు పూలు :– యాంటీ బాక్టీరియల్గా వుండి గాయాల్ని మాన్పగల్గుతాయి. షుగర్ వ్యాధి నివారణకు ఉపయోగపడ్తుంది. అతిసారానికి ఎక్కువగా వాడ్తారు. పెద్దపేగులోని పురుగుల నివారణకు, రక్తపోటు అదుపులో ఉంచడానికి దీని కన్నా దివ్య ఔషధం లేదు.

2. తంగేడు పూలు :– మూలికలుగా వాడ్తారు. జ్వరం, మలబద్ధకానికి మంచి ఔషదాలు – తంగేడు పూలని ఆరబెట్టి, ఉసిరికాయ పొడి, పసుపు గోరువెచ్చని నీళ్ళలో కలిపి, తినడానికి అర గంట ముందు త్రాగితే చక్కెరవ్యాధి అదుపులో ఉంటుంది.

3. బంతి పువ్వు :– మంచి యాంటీ సెప్టిక్లా పనిచేస్తాయి. వాపులు నివారించటానికి ఫంగస్, కళ్ళ కలక, గాయం, చర్మ సంబంధ రోగాలకు దివ్య ఔషధం. బంతి పూల వాసన జలుబు నుంచి ఉపశమనాన్ని కల్గిస్తుంది.

4. చామంతి పువ్వు :– ధాతువులు ఎక్కువగా వుండే పువ్వు చామంతి కాల్షియం, మాంగనీస్, ఐరన్, సోడియం, పోటాషియం, ఫాస్పర్, జింక్, కాపర్లు కన్పిస్తాయి. శరీరాన్ని చల్లబర్చటంలో కీలక భూమిక పోషిస్తుంది. అధిక రక్తపోటు, మధుమేహ నివారణ, ఒత్తిడి, కోపం లాంటి భావోద్వేగాలకు అద్భుత ఉపశమనం

5. తామర పువ్వు :– నిండా ఔషధ విలువలే. ఫేషియల్కి బాగా వాడ్తారు. తామర, కలువ, కుంకుమ పువ్వులు కలిపి మొఖానికి రాస్తే మంచి కలరొస్తారు. రక్తస్రావ నిరోధశాలి. సుగంధ ద్రవ్యాల తయారీలో బాగా వాడ్తారు. తామర, చందనం, పసుపు కలిపి ముఖానికి రాసుకుంటే బంగారు వర్ణం వస్తుంది. చర్మ సంబంధ వ్యాధులకి మంచి నివారిణి.

6. గుమ్మడి పువ్వు :– ఇవి అగ్రభాగాన కన్పిస్తాయి బతుకమ్మలో. మధుమేహ నివారిణి. కణితలు నివారణకు, రక్తపోటు, కీళ్ళ వ్యాధులకి బాగా పని చేస్తాయి. గుమ్మడి గుజ్జు పొడిబారిన చర్మానికి, మచ్చలు కాలిన గాయాలకు మంచి ఔషధం. సబ్బులు తయారీలో బాగా వాడతారు.

7. దోస పువ్వు :– చర్మ రోగాలకు బాగా పనిచేస్తుంది.

8. కట్ల పువ్వు :– కాన్సర్ నివారణకే కాక, నొప్పిని తగ్గించే లక్షణాలను పుష్కలంగా కలిగివుంటుంది.

9. బీర పువ్వు :– కామెర్ల రోగ నివారణకు వాడ్తారు. బీర వేళ్ళు నంజు నివారణకు బాగా పనిచేస్తాయి.

ఈ బతుకమ్మ పేదపువ్వు తంగేడు రాష్ట్ర పుష్పమై అత్యంత గౌరవాన్ని పొందింది – ఇది హర్షించదగ్గ అంశం.

ఇది ఊహించే కాబోలు కాళోజి గారు అద్భుతమైన కవిత రాశారు.

''గుమ్మడి పూలు పూయంగ బ్రతుకు, తంగేడు పసిడి చిందంగ బ్రతుకు
గునుగు తురాయి కులుకగ బ్రతుకు, కట్ల నీలిమలు చిమ్మగ బ్రతుకు
బ్రతుకమ్మ బ్రతుకు – అమ్మని మరువని సంతానం కని బ్రతుకమ్మ బ్రతుకు'' అని.

నిజమే, ఈ సామూహిక ఉత్సవంలో పూలదే అగ్రస్థానం. పూలు వికసిస్తాయి. మనిషికి వికసనాన్ని నేర్పిస్తాయి. పూలు సౌందర్యాన్ని చిమ్ముతాయి. మనసుకు ఆనందాన్ని కల్గిస్తాయి. పూలు ఆరాధనకి పనిచేస్తాయి. దేవుళ్ళకే కాదు మనుష్యులకి విన్నపాలు, ప్రేమలు, విజ్ఞప్తులు తెలపటానికే కాకుండా త్వరగా కోలుకొమ్మని చెప్పడానికి పనికొస్తాయి. ఇలా ప్రతి సంధర్బంలోనూ పూలతోనే అనుభూతుల్ని తెలియచేస్తారు జనం. అసలు పూలు లేకుండా భారతీయ సంప్రదాయంలో ఏ ఉత్సవం లేదు. ప్రకృతి పూల సోయందం. చప్పట్లే వాద్యాలై – కూని రాగాలే ఉయ్యాల పాటల్లా లయబద్ధ నడకలే నృత్యాలై – కుతుహలంగా కుషీగా ఆడుకునే పండుగ. తొమ్మిది రకాల సద్దులతో నైవేద్యం సమర్పిస్తారు. పులిహోర, తియ్యటి పొడులు, పెరగన్నం, అటుకులు, బెల్లం లేదా లడ్డుని మహానైవేద్యంగా పెడ్తారు. సత్తు పిండి లడ్డు చేస్తారు. నువ్వుల పొడి, కొబ్బరి లడ్డు అందరూ పంచుతారు.

చాలామంది నీ సంబురాల్లో బొమ్మల కొలువులు పెడ్తారు. అమ్మవారిని వేడుకుని బొమ్మల్ని సృజనాత్మకంగా ఇంట్లో కొలువు చేయటం గొప్ప సంప్రదాయం. ఎంతోమంది ఇళ్ళలో కొత్త కోడలు రాగానే తాను తెచ్చుకున్న రెండు బొమ్మలతోపాటు తరతరాలుగా వస్తున్న బొమ్మల పెట్టె ఇచ్చి దీన్ని ప్రతి సంవత్సరం కొత్త బొమ్మల చేర్పుతో మరో తరానికి వారసత్వంగా అందించమంటారు. ఇంట్లో ఆడవాళ్ళంతా హుషారుగా బొమ్మల కొలువులో పాటలు పాడతారు. పిల్లలకి ఈ బొమ్మల కొలువు భలే ఆట విడుపు. నీ దగ్గర పాడే ప్రతి పాటలో ఏదో ఒక ఇతివృత్తం వుంటుంది. కథలలో సొగసు వుంటుంది. జానపథ కథలు వుంటాయి. ముఖ్యంగా యువతరం ఇష్టపడే ఒక రిథమ్ వుంటుంది. కోల్ కోల్, ఉయ్యాల, చందమామ లాంటి పాటలు అందర్నీ అలరిస్తాయి. పూలవనం నగరానికి వచ్చిన చందంగా పూలజాతరగా, రంగుల హరివిల్లుగా, సప్తవర్ణ శోభాయమానంగా వెలిగే నీ సంబరాలలో పాటలే ప్రధాన భూమిక వహిస్తాయి. ఇందులో జానపథ కథలు, సాంఘిక కథలు, చారిత్రక కథలెన్నో వినిపిస్తాయి.

మహిషాసురుణ్ణి చంపటానికి వచ్చిన గౌరీదేవి భీకరంగా యుద్ధం చేసి ఆ అసురుణ్ణి సంహరించి డస్సిపోయి మూర్ఛపోయిందని తమ పీడని వదిలించిన గౌరిదేవిని మూర్ఛనుండి లేపటానికి బ్రతుకునిచ్చిన తల్లి కాబట్టి బ్రతుకమ్మ అని పిలుస్తూ, పాటలు పాడి ఆడారని అలా అది రివాజుగా మారిందని చెప్పుకుంటారు.

ధర్మాంగధుడు అనే రాజు యుద్ధంలో వందమంది కొడుకుల్ని కోల్పొయిన దుఃఖంలో లక్ష్మిదేవిని ప్రార్థిస్తే, ఆమె కూతురిగా పుట్టి చక్రాంగదుడు అయిన శ్రీహరిని పెండ్లాడిందని, సత్యవతి గుండము, స్థంభం, ధర్మపురిలో ఇప్పటికి ఉన్నాయని 14వ శతాబ్ధం నాటి సిద్ధేశ్వర చరిత్రలో ఈ కథంతా ఉండటం విశేషంగా చెప్తారు.

కాకతీయుల రాణి రుద్రమదేవి శత్రువుల చేతిలో చిక్కుకున్నప్పుడు, ఒక అపరిచిత స్త్రీ శత్రువులను ఎదురించి ప్రాణత్యాగం చేసి రాణిని కాపాడుకుంది. అది కాకతీ దేవియే అని నమ్మిన కాకతీయులు, తిరిగి రుద్రమకు బ్రతుకిచ్చిన తల్లిగా భావిస్తూ, కాకతిని గుమ్మడి పూలతో పూజించేవారు కాబట్టి నిన్ను కూడా గుమ్మడి పూలతో కొలవటం ప్రారంభించారు. అదే సంప్రదాయంగా మారిందని అంటారు.

సాంఘికంగా మరో కథ వాడుకలో ఉంది. ఎనిమిదో సంతానంగా పుట్టిన ఆడపిల్లకి బతుకమ్మ అని పేరు పెట్టుకొని అల్లారుముద్దుగా పెంచుకొని పెళ్లి చేస్తారు ఓ పల్లె దంపతులు. పుట్టింటికొచ్చిన ఆడబిడ్డను చెరువు దగ్గర గొడవల్లో వదెన చంపేసి పాతేస్తుంది. అక్కడ మొలిచిన తంగేడు తనని వెతకటానికి వచ్చిన భర్తకు, అన్నకు తన కథ చెపుతుంది. ఆమె జ్ఞాపకార్ధంగా నీ వేడుకల్ని చేసారని జానపదుల నమ్మకం.

నీ ఆరాధన రాజ్య వ్యవస్థ ఏర్పడకముందు నుండి అంటే క్రీస్తు పూర్వం 3వ శతాబ్ధం నుండి ఉన్నట్లుగా ఎన్నో ఆధారాలు ఉన్నాయి.

కోటిలింగాల శాసనం ద్వారా గోండులు పశువుల పేడతో నిన్ను చేసి పసుపు, కుంకుమలు చల్లి పూజించే వారని తమిళనాడులో గొబ్బియళ్ళ పేరుతో పూజించేవారని, ఇలా శాతవాహనుల కాలం నాటికే పేదవారి ఈ బతుకమ్మ కాస్తా, ధనికుల గౌరిగా మారి దక్కన్ రాష్ట్రాల వరకు విస్తరించిదని చరిత్రకారులు అంటున్నారు.

ఇక్ష్వాకులు హారతి దేవతను పూజించే వారని, గాజులను సమర్పిస్తు, తొమ్మిది రోజులు పూజలు చేసి కృష్ణలో నిమజ్జనం చేసేవారని అందుకే కృష్ణా జిల్లాలోని హారీతి దేవుల, హారీతిమాన్ చల్కలో ఇప్పటికీ ఆచారం ఉందని, ముదిగొండ చాళుక్యులు తాము హారితి పుత్రులం అని సప్తమాత్రుకలచే పాలింపబడేవారమని గొప్పగా వేయించిన శాసనాల ద్వారా తెలిసింది.

మేలుగొండు సోదరులు 800 ఏళ్ళ క్రితమే కృష్ణా, మూసి నదుల సంగమ స్థలమైన, బతుకేశ్వర స్థానంలో, బతుకమ్మకు గుడి కట్టారని ఆ వాణిజ్య కేంద్రంలో త్రికూట ఆలయం కూడా ఉండేదని, నీరే జగతికి ప్రాణాధారం కాబట్టి నిమజ్జనం అక్కడే జరిగేదని చారిత్రక ఆధారాలు ఉన్నాయి.

కుతుబ్ షాహీలు, బతుకమ్మ ఆటపాటల్ని అడ్డుకునేవారు కాకపోవటంతో వారిని కూడా పాటలలో కీర్తిస్తూ, అతివలు బతుకమ్మ పాటలు పాడేవారని, అలాగే కాంచనపల్లి నరిసింహా దాసు అనే మొగిలిచర్ల వాసి అపుడే ముప్పైమూడు పద్యాలలో బతుకమ్మ చరిత్రను వ్రాసాడని తెలుస్తోంది.

చిత్రమైన అంశం ఏంటంటే నిన్ను వేరు వేరు ప్రాంతాలలో వేరువేరుగా పూజిస్తారు. వేములవాడలో 7 రోజులే పూజిస్తారు. నల్గొండ జిల్లాలో జిల్లేడు పువ్వులతో నిన్ను చేస్తారు. మెట్పల్లి ప్రాంతంలో మహాలయ అమావాస్య నుండి మహర్నవమి వరకూ మాత్రమే కాకుండా దసరా తెల్లారి పెద్దగా నిన్ను చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో నూతి బతుకమ్మ అంటూ బావి త్రవ్వి నిమజ్జనం చేస్తారు. కల్వకుర్తిలో మగవాళ్ళు నీ బ్రతుకమ్మ ఆట ఆడ్తారు. దీన్ని దుంకుడు బ్రతుకమ్మ అంటారు. హైదరాబాద్లో బతుకమ్మ కుంట అనే ప్రాంతం ఇప్పటికి ఉంది.

మధ్యతరగతి మహిళల జీవితాల్లో పండుగంటే – ఇల్లు వాడ శుభ్రం చేసుకోవటం. తీపి పదార్థాలు వండుకోవటం... పిల్లా పెద్దలకి కొత్త బట్టలు కుట్టించటం ఎంత పెద్ద అంశమో... ఈ దసరాకి మహిళలకి కొత్త చీరలు అన్న అంశం కూడా అంతే ప్రాధాన్యమైంది. రాఖీ, నాగుల పంచమి, సంక్రాంతి ఏ పండగొచ్చినా ఆడబిడ్డకి చీరని బహుమతిగా ఇచ్చే సత్ సంప్రదాయం మనది. నగలు కంటే పుట్టింటి వారిచ్చే చీరనే ఆడబిడ్డ ఆనందంగా అందుకుంటుంది. నిజంగా అది పుట్టింటి బహుమతి. అందమైన చీరకట్టుతో వాడకట్టులో నుడుగులు పాడుతూ సామూహికంగా మహిళలందరూ ఆడుతుంటే ఆ సంబరం చూడటానికి రెండు కళ్ళూ సరిపోవు.

నిజానికి చీర రెండక్షరాల పదమే కానీ రెండు వందల రూపాయల చీరైనా బంధాలు ముడిపడటానికి అనుబంధాల తెర లేవటానికి ముఖ్య భూమిక అవుతుంది. చేనేతకు చేయూతనందిస్తూ సాంస్కృతిక ప్రతీకగా, అస్తిత్వ చిహ్నంగా అలరారే బతుకమ్మ పండుగలో మగ్గాలతో రూపొంది మన ఇంటి భామలను అలంకరించి ముంగిళ్ళలో కొలువైన గౌరమ్మను పొదుముకున్న పూల సింగిడి చుట్టూ గాజుల చేతులతో ఆడటం–పాడటం ఎంత గొప్పనో చీర పాత్ర కూడా అంతే గొప్పది.

అయితే ప్రకృతిని ప్రకృతి గొప్పదనాన్ని మనిషికి తెలియజెప్పే సుమశిఖర రూపమే నువ్వు. ప్రాకృతిక శక్తి స్వరూపిణి బతుకమ్మ గిరులు, తరులు, ఝరులు, పల్లెలు, నగరాలు, వాగులు, వంకలు, కొండ కోనలు దాటి ఇప్పుడు జగతి సిగలో తంగేడు పువ్వై విరబూశావు నువ్వు.

నిన్ను జాగృతి వారు ప్రపంచ స్థాయికి తీసుకెళ్ళారు. తెలంగాణ ఉద్యమకాలం నుండి మన బాష, మన యాస, మన గోస అంటూ భుజాల కెత్తుకున్న కల్వకుంట్ల కవిత గారు ఈ లోకల్ బతుకమ్మను గ్లోబల్ బ్రతుకమ్మగా మార్చి బ్రిటీష్ పార్లమెంట్ లో కూడా బతుకమ్మ గురించి ప్రస్థావించారు.

తెలంగాణా సాంస్కృతిక వైభవానికి ఈ నీ సంబరాలు నిదర్శనాలు, నిలువుటద్దాలు. నీ ఆరాధనే జగతికి సుగతిని అందిస్తుందని అతివలు నమ్ముతారు. 'కసపు' చీరలు కట్టుకొని 10 రోజులపాటు జరుపుకొనే ఓనం పండుగను చూడటానికి తిరువనంతపురానికి విదేశాల నుండి అతిథులు వచ్చినట్టే రాష్ట్ర పండుగైన నిన్ను చూడటానికి విదేశీయులందరూ వస్తున్నారు

'బతుకమ్మే తెలంగాణ జీవం, బతుకమ్మే దైవం' అంటూ పూలే మనిషి జీవన కావ్యానికి ప్రతీక, మానవ వికాసానికి పతాకం అంటూ సాగుతూ నీ పాటల్లోని భాషపై పరిశోధన జరగాల్సిన అవసరం ఉంది. పారిభాషక పదకోశాలు తీసుకు రావల్సిన అగత్యం ఉంది. బంగారు బ్రతుకమ్మ, రంగారు బతుకమ్మ, పొంగేటి ఆశలకు రూపమైన బతుకమ్మ. అందుకే మనసులో నిన్ను స్మరించుకుంటూ... బతుకును మహాద్భాగ్యంగా భావించుకుంటూ బతుకమ్మ వైభవమే భారతీయ సంస్కృతిగా తెలంగాణ వైభోగంగా భావించుకుంటూ నీ చుట్టూ ఆడుతూ నీ మహిమ పాడుతూ నూరేళ్ళు నిండుగా బతుకుతామే అంటూ ఆశీర్వదించు తల్లి. నీ ఆటలు ఆడుతూ, పాటలు పాడుకుంటూ జీవితాన్ని సార్థకం చేసుకుంటాం తల్లీ.

వుండనా మరి...

– గుర్రం వాణిశ్రీ

# విజయీభవ!

విజయమా !

ఎందుకో నీకొక నమస్కారాన్ని పెట్టాలన్పిస్తుంది. మానవాళికి నువ్వొక సెలబ్రిటీవి. ఎంతోమంది నీ కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తుంటారు. కనీసం జీవిత కాలంలో ఒక్కసారన్నా నువ్వు కాస్త స్పర్శించాలని, వారి గడపలో అడుగుపెట్టాలని తపన పడిపోయి జీవితంలో సంతృప్తి లేక నీ అర్థం, అడ్రస్సు తెలియక, చేస్తున్న పనివల్ల నమ్మకం, ప్రేమలేక నిరంతరం అన్వేషణలో వుంటున్నారు జనాలు. నీకు తెల్సు కదా! నిన్ను ప్రేమించని వారు ఈ ప్రపంచంలో ఎవ్వరూ లేరు. నిజానికి చాలు అన్నపదం అహోరాని'కి మాత్రమే సరిపోద్ది. అది నీ కన్నా వర్తిస్తుందేమో అనుకుంటే ఎన్నో చరిత్రలు సాధించినా మరింతగా సాధించాలన్న తృష్ణతోనే వుంటున్నారు నువ్వు వరించిన వాళ్ళు, నువ్వు ఆవహించిన వాళ్ళుచాలు అన్నపదం వారి డిక్షనరీలో లేదన్నట్టుగా..! కొంతమందినే కనికరిస్తే ఎలా చెప్పు మిత్రమా?

అయితే వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూ, అస్థిత్వాన్ని మెరుగు పరుచుకుంటూ ఔన్నత్యాన్ని ప్రకటింపచేసుకుంటూ, అవసరమైనవేళ పరాక్రమాన్ని ప్రదర్శింపచేసుకుంటూ మనకేం కావాలో మనం తెల్సుకునే వ్యక్తులు ఎందరుంటారు చెప్పు ? మనం సాధించాల్సిన జయం దుర్గుణాలపైనే కానీ, వ్యక్తుల మీద కానీ, వ్యవస్థ మీద కానీ కాదని ఎంతమంది గ్రహిస్తున్నారు. వాంఛల్ని నిగ్రహించుకుంటూ, నియంత్రించుకుంటూ వుంటే అన్నీ విజయాలే కదా! మన గుణాలే మనకు అగ్రపూజ్య అందిస్తాయని పురాణాలు చెప్పాయి కూడానూ...

అయినా విజయమా – జయం, నువ్వు కవలలా – అన్న సందేహం కలిగేదినాకు. కానీ అనుభవంతో తెలిసింది. అశాశ్వతమైన గెలుపు జయం అని సంపూర్ణం, శాశ్వతమైన గెలుపు నువ్వని... నిజమేనని ధర్మశాస్త్రాలు కూడా బలపరిచాయిలే. మనుష్యులు స్వశక్తితో సాధించుకున్నది జయమని – భగవదనుగ్రహంతో లభించేది నువ్వని – అంతెందుకు శ్రీకృష్ణుని అండ వుండబట్టే కదా అర్జునుడు విజయుడిగా వెలుగొందింది – శ్రీకృష్ణుని నిర్యాణం అనంతరం దోపిడి దొంగల్ని కూడా జయించలేక కావిడి బద్దలతో దెబ్బలు తిన్నాడు కదా!

నిన్ను పొందటంలో, సాధించటంలో ఆకస్మికాలు వుండవు – అప్పనంగా రావు. నిర్విరామ కృషి వల్లనే కదా నువ్వు వరించేది, ఖ్యాతిని అనుగ్రహించేది. అయినా కష్టపడకుండా, వచ్చినదేది ఎట్లా వచ్చిందో అలాగే వెళ్ళిపోద్ది – సాధనతో నిరంతర కృషితో నిన్ను ప్రసన్నం చేసుకుంటే అది శాశ్వతంగా వుంటుందానే కదా నువ్వు చెప్పేది, ఆచరాణాత్మకంగా చూపించేది.

ఒక్కసారి గమనించు. పర్యావరణ ఉద్యమకారిణి 16 యేళ్ళ గ్రెటా థన్ బర్గ్ స్వీడన్ పార్లమెంట్ ఎదుట నిరసన తెలిపినప్పటి నుండి ఇప్పటిదాకా ఎంతో మందికి స్ఫూర్తిని కల్గించారు. పెద్దలెందరినో నిలదీశారు – మీకు కావల్సింది

కల్తీలేని వాతావరణం... ఆరోగ్యకరమైన పర్యావరణం అంటూ ప్రతి మనిషిని ఆలోచింపచేసిన గ్రేటా సాధించింది చిన్న విజయం కాదు కదా!

పోలాండ్‌లో చదువుకున్న ఒక విద్యార్థి College Fees కట్టలేక ఇబ్బంది పడుతుంటే ఒక friend సలహా ఇస్తాడు– ఏదైనా సంగీత విభావరి పెడితే డబ్బులొస్తాయి, ఆర్టిస్ట్కి రెమ్యురేషన్ ఇవ్వగా మిగిలిన డబ్బుతో ఫీజు కట్టొచ్చు అని. 2000 డాలర్లకు మాట్లాడుకున్నాడు. టిక్కెట్లమ్మితే 1600 ల డాలర్లు మాత్రమే వస్తాయి. తిరిగి పాదర్ విస్కి దగ్గరికెళ్ళి, విషయం చెప్పి, మిగతా డబ్బులకు ప్రామిసరీ నోటు రాసిస్తానని, కార్యక్రమానికి మాత్రం తప్పకుండా రావాలని అడుగుతాడు ఆ విద్యార్థి. ఆ విద్యార్థి గురించి ఎంక్వైరి చేసిన పాదర్విస్కి అతని నిజాయితీ చూసి, ఆ షోని విజయవంతంగా ముగిస్తాడు. కాలచక్రం ఓ 10 ఏళ్ళు తిరుగుతుంది. ఆనాటి పియానిస్ట్ పోలాండ్ ప్రైమ్ మినిస్టర్ అవుతాడు. మొదట ప్రపంచయుద్ధం అనంతరం పోలండ్ దగ్గర ఉన్న ఆహారపు నిల్వలన్నీ ఖాళీ అయిపోతాయి. దిక్కుతోచని స్థితిలో అమెరికా ప్రెసిడెంట్‌కి ఉత్తరం రాస్తాడు సహాయం చేయమని. తిరుగుటపాలో అందుకు అంగీకరిస్తూ అమెరికా ప్రెసిడెంట్ జాబు అందుతుంది. కొన్ని రోజులు తర్వాత స్వయంగా వెళ్ళి అమెరికా ప్రెసిడెంట్కు ధన్యవాదాలు చెప్తారు – పాదర్ విస్కి.

అప్పుడు ఆ అమెరికా అధ్యక్షుడు ''హెర్బర్ట్ హూవర్'' మీరు నాకు థ్యాంక్స్ చెప్పకూడదు. మీరారోజు నా కాలేజీ fees కి సహాయం చేయకపోతే నేనీ Position లో ఉండేవాడిని కాదు. మీరారోజు thanks చెప్తే, ఆపదలో ఉన్న వారికి సహాయం చేయి, నాకు thanks కాదు చెప్పాల్సింది అన్నారు. ఇప్పుడు నేను చేసింది అదే అంటాడు వినయంగా.

చూసావా విజయమా – ఫీజుకు కూడా డబ్బుల్లేని విద్యార్థిని తీసికెళ్ళి ఒక అగ్రదేశమైన అమెరికాకే అధ్యక్షుణ్ణి చేశావ్! ఏ కష్టానికి, ఏ సింహాసనాన్ని అధిష్టింపచేయాలో నీకు తెలిసినంతగా ఎవరికీ తెలియదేమో. అబ్దుల్‌కలాం గారి మాట గుర్తుందా నీకు... Success అంటే ఏంటి అని కలాంగారిని అడిగితే ఎప్పుడైతే నీ సంతకం ఆటోగ్రాఫ్గా మారతుందో అదే Success అని చెప్పిన నిగర్వి ఆయన.

నీకింకొక సంఘటన గుర్తు చేయనా... 'జేమ్స్ కెమెరాన్' పేరు వినగానే నీకు టైటానిక్, అవతార్లు గుర్తుకొస్తాయి కదా. అసలు సినీ ప్రవేశమే చిత్రంగా జరిగింది కెమెరాన్ది. సృజనాత్మకశీలిగా పేరొందిన జేమ్స్ కెమెరాన్ 11 ఏళ్ళు కష్టపడి, ఒక సినిమా కథ రాసుకుని, ఎన్నో సినిమా కంపెనీల చుట్టూ తిరిగాడు. ఎవరూ పెద్దగా ఆసక్తి చూపించలేదు. కొత్తగా ఒక ప్రొడక్షన్ కంపెనీ పెట్టారని తెలిసి – కథ ఇస్తాడు. ఏమీ తోచక ఆ కథ చదువుతుంది ఆ సభ్యులలో ఒక భాగస్వామి. వారం తర్వాత వచ్చిన కెమెరాన్తో కథను తమకు ఎంతకు అమ్ముతావు అని అడుగుతుంది. 1 డాలర్ అంటాడు కెమెరాన్. ఆశ్చర్యపడి 10 ఏళ్ళ పై చిలుకు కష్టపడి రాసావు కదా, ఒక డాలర్ ఏంటీ అంటుంది. అవును, కథకు 1 డాలర్ మాత్రమే, కానీ ఈ కథని నా అంత బాగా ఎవరూ Picturization చేయలేరు. Direction కు 1 బిలియన్ డాలర్లు అంటాడు. కొత్తగా కనిపిస్తాడు కెమెరన్ ఆ యువతికి. అతనిలోని ఆత్మవిశ్వాసానికి మెచ్చి తన Partners ను ఒప్పించి, సినీ నిర్మాణాన్ని చేపడుతుంది ఆసంస్థ. ఆలా 1984 లో వచ్చని సినిమానే టెర్మినేటర్. అలా సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టించింది నువ్వేకదా విజయమా!

★ 60 ఏళ్ళవరకు అప్పులు, అపజయాలు తప్ప నీ స్పర్శే తెలియని Colonel Sanders అనే అమెరికన్ వ్యాపారిని అష్టైశ్వర్యవంతునిగా అచిరకాలంలోనే తీర్చిదిద్దింది నువ్వుకాక మరింకెవరు చెప్పు. chicken restaurant తో ప్రపంచ వ్యాప్తంగా అండాసిడర్‌గా మారి, కెంటకీ కోలోనెల్గా మారిన గొప్ప వ్యాపార దిగ్గజం ఆయన. చూసావా... ఒక ఆలోచనతో జీవితాన్ని నువ్వెలా మార్చేసావో.

★ చెక్కముక్కలతో వ్యాపారాన్ని ప్రారంభించి ప్రపంచంలోనే అగ్రగణ్య వ్యాపారవేత్తగా మారిన IKEA Stores

"Ingvar Kamprad" గురించి తెలియని వారెవరు ? ప్రపంచానికి కొత్త ఫర్నీచరును పరిచయం చేసిన ఈ వాణిజ్య దిగ్గజం ఒకప్పుడు రొట్టెముక్క దొరకక ఆకలితో కేకలు వేసినవాడే.

కోక్ సీసాల్ని అమ్మి పొట్ట పోసుకున్న స్టీవ్‌జాబ్స్ ప్రపంచాన్ని శాసించింది విధిని నమ్ముకుని కాదు. తనను తాను నమ్ముకునే కదా. మనసుమాట వింటే ప్రతి విజయం నీదవుతుందని గర్వంగా చెప్పగలిగాడు. నలిగిపోయి అందరూ నడిచిన దారి మీద నడిస్తే నీ గొప్పతనం ఏముంది. నీకు నువ్వు కొత్త దారిని నిర్మించుకుంటే కదా కొత్త చరిత్ర రూపొందించబడ్తుంది అని అర్ధవంతంగా చెప్పినవాడు జాబ్స్. వెనకనుండి మనల్ని ఎవరు తోయనవసరం లేదు. మన కలలే మనల్ని ముందుకు లాగుతుంటాయి. నిజంగా మిమ్మల్ని మీరు ప్రేమించుకుంటే పనిని ప్రేమిస్తారు. సరిక్రొత్త చరిత్రను సృష్టిస్తారని సానుకూల దృక్పథాన్ని యువతలో పెంచింది జాబ్స్ కదా.

నువ్వు అహంకారాన్ని పెంచకుండా విజయాన్ని పెంచితే అంతా సంతోషమే. కానీ శివుని కోపాగ్నికి బూడిదగా మారిన మన్మథుడి నుండి పుట్టిన భండాసురుడు, వేదాల్ని ఎత్తుకెళ్ళి ప్రపంచాన్ని అజ్ఞానం దిశగా తిప్పప్రయత్నం చేసిన దుర్గమాసురుడు, మహిళంటే అబలని, అబలతో మరణం రాదని విర్రవీగుతూ వరాన్ని పొందిన మహిషాసురుడు అర్ధంతరంగానే కదా జీవితాన్నే ముగించుకుంది. అదే గజాననుడు చూడు వినయంతో వుండి విఘ్నాధిపతిగా జేజేలు పొందాడు. ఈ కథలెన్ని విన్నా నువ్వు జీవితాల్లోకి వస్తే చాలు తాము అగ్రభాగాన ఉన్నట్టు భ్రమిస్తుంటారు ఎంతోమంది. పిచ్చివాళ్ళనిపిస్తుంది నాకు వాళ్ళనుచూసి...

అయినా సౌందర్యం కూడా ఒక పాజిటీవ్ ఎనర్జీనే కల్గిస్తుంది కదా విజయమా! 'మోహిని' వృత్తాంతంలాగానే అందంగా వుండి ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేసిన వాళ్ళు మరింత త్వరగా నీ దగ్గరికి రాగల్గుతారనుకుంటాను of course confidence చేసే పనిపట్లనే కాదు ముందు తనమీద తనకుండాలి.

అయినా నెల్లూరుకి చెందిన మార్షల్ ఆర్ట్స్ మాస్టరు ప్రభాకరరెడ్డి గారు ఏకంగా 21 గిన్నీస్ రికార్డులు సాధించారు. భార్య నగల్ని తాకట్టుపెట్టి చైనాలోని షావోలిన్ టెంపుల్లో తన మార్షల్ ఆర్ట్స్ని మెరుగు పరుచుకున్న ప్రభాకర్ ఏ Event చేసినా అది రికార్డుల మీద రికార్డ్స్ క్రియేట్ చేస్తూనే వుంటుంది.

నాకు తెలియక అడుగుతాను కానీ విజయమా! కొత్తతరానికి, కొత్తదనానికి చోటిస్తూ నువ్వు అప్పుడప్పుడు పాతబడిపోతుంటావు కదా. నీ స్థానంలో క్రొంగొత్త విజయం పొడ చూపుతుంది. అంత దాక విజయగర్వంతో మీసం తిప్పిన నీవు, కొత్త విజయానికి తోవ చూపిస్తూ, సింహాసనం దిగిపోక తప్పదుగా. ఆ నిష్క్రమణని తేలికగా తీసుకోగల్గుతూ ఉండే నీ విశాలత మేం నేర్చుకోవాలి. మూసలో బ్రతకటం, ముసుగులో బ్రతకటం అందరికీ సాధ్యం కాదు. అలా ఏమిటీ జీవితం అని ప్రశ్నించుకోగల్గిన వాళ్ళు పేరు ప్రఖ్యాతలు తెచ్చుకుంటారు. ఏదో సాధించాలన్న ఆకలితో వున్నవారే ఈలోకానికి కావాలి. వారే కొత్తగా ఆలోచిస్తారు. కొత్తదెపుడు మొదట్లో పిచ్చిపనిగానే కన్పిస్తుంది. జనాలు కూడా వెంటనే మెచ్చరు. రిస్కు్ల ఎవరికి నచ్చవు గదా. కానీ రిస్క్ చేయగల్గినవారు తనని తాను నమ్ముకుని ఆ విశ్వాసాన్ని జనాలకు అందించగల్గిన వారే నాయకుడు. అపజయాల్ని విజయాలుగా మలుచుకున్నవారు, ఓటమినుండి గెలుపు పాఠాలు నేర్పగలిగినవారు, శాంతం నుండి పరాక్రమం వైపు అవసరాన్ని బట్టి అడుగువెయ్యని వారు నీ వారసులు కాదు కదా విజయమా.

★ అంతెందుకు ప్రగ్యా మీద యాసిడ్ దాడి జరిగి మొఖమంతా కాలిపోయి నా జీవితాన్ని గెలవడంకోసం ఆవిధంగా 15 సర్జరీలు చేసుకుని ముక్కు నోటి రంధ్రాలు తెరిపించుకున్నప్పుడు అర్థమయింది, మరొక జీవితాన్ని తాను పొందగలిగానని. అందుకే కదా యాసిడ్ బాధితులకు అండగా నిలబడి ఆర్ధికసాయం అందిస్తూ సరికొత్త మార్గాన్ని మనిషిగా పొందింది.

★ సునీత కృష్ణన్ అత్యాచారానికి గురై అవమానాలు ఎదుర్కొంది. ఏడుస్తూ కూర్చోకుండా వెలివేతను దాటి ప్రజ్వల

సంస్థను స్థాపించి తనలాంటి ఎంతోమందికి అండగా, ధైర్యంగా నిలబడింది. మానవ రవాణామీద గొప్ప యుద్ధం చేస్తుంది. ఎన్నిసార్లు ఆమెమీద దాడులు జరిగినా వెరకక ఎంతోమంది అమ్మాయిల్ని వ్యభిచార కూపాల్నించి కాపాడారు.

అయితే – ఎర్లీ సక్సెస్ కిల్స్ అన్నమాట అనాదిగా వింటూనే వున్నాం. ఎప్పుడూ కూడా అనుభవం సాధించాక వచ్చే విజయం వినయాన్ని తీసుకొస్తుంది. కానీ చిన్న వయసులో నువ్వు అందించే ఆ కిక్కు ఉంది చూసావా – అది ఎంత అహంకారం తెస్తుందో నీకు తెలుసా! నేనే ఈ ప్రపంచంలో సుప్రీమ్ అనుకుంటే ఎలా విజయమా? నువ్వొక గాలి తెమ్మెరలాంటి దానివి. ఓ కెరటం లాంటి దానిని – అలా వస్తూ ఉంటావు..అలరించి వెళ్ళిపోతూ ఉంటావు. పన్నీరు లాంటిదానివి నువ్వు. ఆస్వాదించి వదిలేయాలి కానీ తాగుతూ కూర్చో కూడదు కదా! అయినా ఎప్పుడూ కంటిన్యూస్ గా ఈ నీ విజయాలే వస్తూ ఉంటే కొన్నాళ్లకు ఏవగింపు కలుగుతుంది. తినగా తినగా తీపి లడ్డూ మీద కూడా మొహం మొత్తుతుంది కదా..అలాగే ఇది కూడా.

నాకు అర్థం కాదు గానీ విజయమా – నువ్వూ మరణిస్తావు కదా, మరి ఈ మనిషికెందుకు నీ మీద ఇంత దాహార్తి. అప్పుడెప్పుడో చంద్రుడి మీద కాలు మోపిన నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ గొప్పతనాన్ని రెండు తరాలు చెప్పుకున్నాయనుకో. ఆ తర్వాత మరో వ్యక్తి వచ్చి ఆ చరిత్రను తిరగ రాసినప్పుడు ఆ నీ గుర్తింపు మరుగున పడిపోతుంది కదా. అది నీ మరణమే కదా. చిరకాలం మనలేని గొప్పతనం శాశ్వత ఆనందాన్ని ఇవ్వలేదన్న సత్యం కూడా నీకు తెలియకపోతే ఎలాగమ్మా... విజయాన్ని సెన్స్ చేసే వారు..విజయాన్ని ఓ సైన్స్ లాగా చూసేవారు స్థితప్రజ్ఞతతో ప్రవర్తిస్తారు. వారిని యోగులనో, ఋషులనో నేను అనను. వారు మా మానవుల్లోని ఉత్తమోత్తములు అనే కన్నా మనీషులు అనుకుంటేనే నాకు బాగుంటుందనిపిస్తుంది. నువ్వు ఎప్పుడూ ఓ కామావి మాత్రమే. ఫుల్ స్టాప్ వి కావు విజయమా. సంపూర్ణత నీలో లేదు. నువ్వు ఎప్పుడూ అసంపూర్ణంగా ఉన్నంత వరకే మనిషి ప్రగతి బాటన నడుస్తాడు. ఎప్పుడు నీతో ప్రేమలో పడిపోతాడో..ఆ మోహంలో కూరుకుపోతాడో అప్పుడే అతని పతనం ప్రారంభం అవుతుంది. అందుకే విజయంలో పడండి కానీ విజయంతో సహవసించకండి అంటాను నేను.

నీకు కథ చెప్పనా – బిల్ గేట్స్ ఒకసారి, ఈ పేరు ప్రఖ్యాతులు, డబ్బులు లేనప్పుడు, ఓ పేపర్ కుర్రాడి దగ్గర పేపర్ తీసుకొని డబ్బులు ఇవ్వడానికి జేబులో చూసుకుంటే చిల్లర లేదట. చేతిలోకి తీసుకున్న ఆ పేపర్ ని తిరిగి ఆ బాయ్ కి ఇచ్చేసి 'సారీ' చెప్పారట. దానికి ఆ పేపర్ అబ్బాయి 'ఎంతో ఇష్టంగా చేతిలోకి తీసుకున్నారుగా, మీరు చదవండి' అని తిరిగి ఇచ్చాట్ట. 'మరి నా దగ్గర డబ్బులు లేవు' అన్నారంట బిల్ గేట్స్. 'ఫర్వాలేదు లెండి, నాకు ఈ పేపర్లన్నీ అమ్మేశాక కొంత కమీషన్ మిగులుతుంది. ఆ డబ్బులతో ఈ పేపర్ ఖరీదు నేను కట్టేస్తాను' అని చెప్పి వెళ్ళిపోయాడు. రెండు దశాబ్దాల తరవాత ఆయన గుర్తుపెట్టుకుని ఆ పేపర్ అబ్బాయి కోసం వెతికి 'నాకొకసారి నువ్వు న్యూస్ పేపర్ ఉచితంగా ఇచ్చేవు తెలుసా, నీకేం కావాలో చెప్పు, ఏదైనా నేనివ్వగలను' అన్నారట. దానికా అబ్బాయి 'సార్, నేను అప్పుడు చేసిన సహాయంతో మీరు ఇప్పుడు చేసే సహాయం ఎలా సరితూగుతుంది' అని అడిగాడట. 'అవును సార్, నేను పేదవాడిని, పేపర్లు అమ్ముకుని బతికే వాడిని, అయినా మీకు సాయం చేశాను. మీరు ధనవంతులు, ఏదైనా కొనగలిగిన వారు, కానీ ఏమీ డబ్బు లేకుండా నేను సహాయం చేసిన ఆ హృదయం, ఆ సందర్భం ఈరోజు మీరు చేద్దామనుకున్న ఈ సహాయంలో లేదు కదా' అన్నాడట.

అప్పుడు జ్ఞానోదయం అయిందట బిల్గేట్స్ కి... 'సహాయం చేయడానికి కావలసింది చేతినిండా డబ్బు కాదు, హృదయం నిండా ప్రేమ' అని. అదేకదా అసలైన విజయం ! బిల్ గేట్స్ ప్రపంచ కోటీశ్వరుడు కావచ్చు, కానీ అసలైన విజయాన్ని ఆ పేపర్ కుర్రాడు లో, అతని సింపుల్ జీవితంలో చూసారాయన. అప్పటి నుండీ తానూ విరివిగా విరాళాలు ఇవ్వటం ప్రారంభించారు. చూసావా విజయమా! నువ్విచ్చిన 'కిక్' కంటే ఆ పేదపిల్లాడు చేసిన సాయాన్ని అందుకున్నప్పటి ఆర్తే గొప్పగా అన్పించింది నాకు కూడా.

నువ్వు వస్తున్నావంటే అందరూ సంబురాలు చేసుకుంటాం. ఎంతో ఆశగా నిరీక్షిస్తారు. కానీ ఓటమిపాలైనప్పుడు నేను పొందే కసి, పట్టుదల, ఎదగాలన్న తపనలో ఉండే స్థిర నిర్ణయం నువ్వొచ్చాక నాలో వుండవెందుకని? ఏదో అభద్రత, అలజడి, అశాంతి ఉంటాయి. ఇంతమంది నన్ను మెచ్చుకుంటున్నారు కదా – ఇంద్రుడు, చంద్రుడని పొగుడుతున్నారు కదా. ఇది శాశ్వతంగా నేను నిలబెట్టుకోగలుగుతానా అన్న సంశయం ఆవరించి ఉంటుంది విజయులందరికీ. నిజమే కదా, విజయం అనేది సూది మొన మీద నిలబడ్డమే కదా, అక్కడ ఎంతసేపో నిలబడలేం. ఎప్పుడైనా పక్కకి జారొచ్చు, కిందపడొచ్చు. ఎవరైనా వచ్చి తోసేయొచ్చు. అప్పుడు కలిగే బాధ ముందు నువ్వు వచ్చినప్పుడు అందించిన ఆనందం చిన్నగా అనిపిస్తుంది.

వెలుగులోనే నీడ కూడా ఉంటుంది. నీ నీడ ఓటమే. నిన్ను సాధించగానే ఆ మెట్లు ఎక్కడానికి నిచ్చెనలా ఉపయోగపడ్డ జనాలని మర్చిపోతాం. ఓటమికి కారణాలు వెతుక్కుని వేరొకరి మీద తోసేసే జనాలు, నిన్ను సాధించడానికి మాత్రం తాము ఎంతో కష్టపడ్డామని... అంతా తమ ప్రతిభే అని గోరంతలు కొండంతలుగా చెప్పుకుంటూ ఉంటారు. స్వోత్కర్షని చాటుకుంటూ ఉంటారు. అవి సక్సెస్ సూత్రాలని అనుకొని నోట్లో వేలేసుకుని అమాయకంగా నేనెప్పుడూ వినలేను. ఫెయిల్యూర్ స్టోరీస్ లో మనం నేర్చుకోవాల్సినవి ఎన్నో ఉంటాయి. అదే నీ సక్సెస్ స్టోరీస్ లో ఒకటే – కాలం కలిసి వచ్చింది..దేవుడు కరుణించాడు... ఎంతో సాధన, నిరంతర శ్రమ – ఇవే మాటలు.

విజయమా! నీ చెంత నిలబడటానికి దూర తీరాల నుండి పరుగెత్తుకొచ్చే జనాలకి..ఆ భారాన్ని, ఆ అలుపుని తీర్చుకునేంత సమయం కూడా ఇవ్వకుండానే వెనక్కి పంపించేస్తావ్. చాలా తక్కువ మందికి మాత్రమే నీతో కలిసి జీవిత చరమాంకం వరకు నడవగలిగే అదృష్టం దొరుకుతుంది. కానీ, మనని 'సక్సెస్' సింహాసనం మీద కూర్చుండ బెట్టిన మనుషులు అప్పుడు చుట్టుపక్కల ఎక్కడా కనిపించరు. అన్నీ కొత్త ముఖాలే.. పొగడ్తల వర్షాలు, చప్పట్ల హోరులు. ఇంటికెళ్ళి ఏకాంతంగా కూర్చున్నాక ఏదో అశాంతి, అలజడి. మన విజయాన్ని, మనవాళ్లనుకున్న వాళ్ళతో పంచుకోలేకపోతే ఆ ఆ విజయానికి అర్హత కూడా ఉండదు..అర్థం కూడా ఉండదు. దాని కన్నా నా ఓటమిలో ప్రపంచమంతా లేకున్నా, నన్ను కావాలనుకున్న నిజమైన నా ఒక్క మనిషి ఉన్నా అదే గొప్ప ఆర్తిని, భరోసాని అందిస్తుంది.

''అవును! నిన్ను చేరుకోవాలంటే ఎవరో ఒకరిని పడదోయాల్సిందే. ఎక్కడో దగ్గర తప్పు చేయాల్సిందే'' అయితే ఆ విజయం నాకసలు వద్దు అని అరవాలనిపిస్తుంది. ఓటమిని ఎదుర్కోగలిగిన బలమైన గుండె ముందు గెలుపెప్పుడూ మోకాళ్ళ మీద కూర్చునే ఉంటుంది. ఓటమి అనాథ అని, అది ఒంటరిదనీ ఎంతో మంది అంటారు. కానీ ఓటమి మనిషి జీవితంలోని ముఖ్యమైన వ్యక్తుల్ని, వారి నిజస్వరూపాల్ని నగ్నంగా చూపిస్తుంది. కోల్పోయిన విలువల్ని తిరిగి కూడగట్టుంది. అందుకే నువ్వు కావాలనుకోవాలి గానీ నిన్ను పొందాలనుకునేంత కాంక్ష వుండకుండా బతగ్గలగాలి. అని కోరుకుంటాను.


నిజం విజయమా! ఎక్కడో ఎప్పుడో ఓ సినిమా డైలాగ్ గుర్తొస్తుంది నాకు. 'విజయానిదేముందిరా – నిన్ను ప్రపంచానికి పరిచయం చేస్తుంది. అంతేగా నాన్నా! ఈ ఓటమి వుంది చూశావా ప్రపంచాన్ని నీకు పరిచయం చేస్తుంది' అని–

నాతో ఈ ప్రపంచం వుండాటాన్నే నేను కోరుకుంటాను. నా అనుకున్న మనుష్యులు నా చుట్టూ వుండే అసలైన విజయాన్ని వినయంతో కోరుకుంటాను... అది అందరికీ అందివ్వు మిత్రమా – సరికొత్తదనాన్ని స్వశక్తితో చూపించు విజయమా.

వుండనా మరి.

నీ

– విజయ మామిడి



# జగద్రక్ష

ఓ ఫ్రెండూ ! ఓ ఫ్రెండ్లీ పోలీసూ !

ఎలా ఉన్నారు మీరు... నిరంతరం వృత్తి ధర్మంతో, నిత్య ప్రజాసేవలో జాగరూకులై వుంటారని తెల్సు. జోరున కురుస్తున్న వర్షంలో... సముద్రాల్ని తలపించే రోడ్ల మీద ట్రాఫిక్‌ను సర్దుతూనో – జారి పడుతున్న బురదలో పిక్‌పాకెటర్ని వెంటాడుతూనో, తుర్రున పారిపోతున్న ట్రాఫికింగ్ వ్యానుల్ని వేటాడుతూనో, దేశంలో అలజడుల్ని సృష్టించాలనుకునే అరాచకశక్తులను అడ్డగిస్తూనో, కిరాయి మూకల నరాలు తీసే పనివత్తిడిలోనో, బాంబుల దాడిలో గాయపడి నెత్తుటి ముద్దవై ఎగిరెగిరి పడుతూనో... ఎక్కడో అక్కడ ... అలజడులు, అశాంతులు, ఆవేశాలు, ఆవేదనలు, ఆరని ఉద్రిక్తతల మధ్య కత్తి మీద సాములా కలవరపరిచే సంఘటనల మధ్య జనాల కోసం... జీవార్తిని పెంచుతూ మీరు. మీరున్నారన్న భరోసాతో నిశ్చింతగా నిద్రిస్తూ మేము... అయినా మీపట్ల మా కృతజ్ఞతలు తెల్పాలన్న ఉద్దేశ్యంతోనే ఈ క్రొత్త ప్రేమలేఖని అభిమానంగా వ్రాస్తున్నాను.

అయినా ఫ్రెండ్ ! దేశ సరిహద్దుల్లో దేశ సంరక్షకులుగా సిపాయిలు, సమాజం లోపల సుశిక్షుతులైన జన రక్షకులుగా మీరు వున్నారన్న ఆలోచనతోనే కదా మేము గుండెల మీద చేతులు వేసుకుని నిశ్చింతగా బ్రతుకుతున్నది... ప్రశాంతంగా జీవిస్తుంది.

వంటి మీద ఖాకీ డ్రస్సు – చేతిలో లాఠీ – పెదవుల మీద విజిల్, రేడియాన్ని పులుముకున్న చూపులతో ధైర్యంగా మీరు నిలబడితే చాలు ... అరాచక శక్తులన్నీ క్షణాల్లో పారిపోతాయి. సామాజిక ఆస్తుల్ని పరిరక్షించటంలో, శాంతి భద్రతల్ని కాపాడటంలో, జనావళి ప్రాణాల్ని, ప్రశాంతిని పదిలపర్చటంలో మీ సేవలు అపారం... మీ త్యాగాలు అజరామరం. ప్రజల కోసం జీవించటమే కాదు ప్రజాసేవలో మరణించటం కూడా మీ విధిలో భాగంగా భావించే వృత్తిధర్మ పరులు మీరు.

అందరి ఉద్యోగుల్లా 10 to 5 పనికాదు మీది. అత్యంత శ్రమతో క్రమశిక్షణాయుతంగా, కార్యశీలతతో సుశిక్షితులైన సైనికులుగా సమాజ సేవలో లీనమై వుంటారు. అసలు మీరు లేని సమాజాన్ని మేం ఊహించుకోలేం. ఎవరికి ఏ సాయం కావల్సి వచ్చినా ముందుగా మీ దగ్గరికే కదా వస్తారు. ప్రతి అవసరం తీరేది మీ ద్వారానే. అంతర్గత శత్రువులకు తొలిగా బలయ్యేది మీరే. అయినా ప్రతి గడపని – ప్రతి వ్యక్తిని రాగబంధంతో అల్లుకుని శాంతి భద్రతల్ని కాపాడటంలో మీరు చూపించే దీరోధాత్తత సర్వదా ప్రశంసనీయమే.

సమయపాలన లేని వృత్తిని కర్తవ్యంగా తలకెత్తుకుని, మూడు సింహాల్ని మీ వంట్లో ఆవహింప చేసుకుని, చట్టాల ఉల్లంఘన జరగకుండా, శాంతి భద్రతల్ని మరవకుండా నిబద్ధంగా, నికార్సుగా వృత్తిలోనే ప్రవృత్తిని పెంచేసుకుని, ప్రజలకు ప్రేమను పంచే ఫ్రెండ్లీ పోలీస్ మీరు. జీసెస్ చెప్పిన వాక్కుల్లోని నైతికబలం, ప్రవక్త పెంచుకున్న బాధ్యతల్లోని

బరువు, కృష్ణుడు చెప్పిన గీతా బోధనల్లోని క్రియాశీలత మీ వృత్తి ధర్మంలో అడుగడుగునా కన్పింపచేస్తూ ప్రతి ఒక కుటుంబానికి నేను ఉన్నాననే నమ్మకాన్ని కలిగిస్తారు.

కొంచెం లోతుగా ఆలోచిస్తే, ఈ ప్రపంచంలో మొదటి పోలీసు ఎవరో తెలుసా? ఆశ్చర్యంగా అనిపించొచ్చు కానీ, నా దృష్టిలో మాత్రం శ్రీ మహావిష్ణువే తొలి పోలీసు ! దుష్ట శిక్షణ – శిష్ట రక్షణే మహావిష్ణువు ప్రధాన ఆశయం అయితే, ఈ యుగంలో ఈ నేల మీద ధర్మరక్షణ కోసం పాటుపడుతున్న మీరు విష్ణువు అంశలే అవుతారు కదా... మీకు తెలుసుకదా! త్రిమూర్తులలో బ్రహ్మ సృష్టికారుడు, శివుడు లయకారుడు, ప్రపంచ స్థితిని, గతిని సుస్థితిలో ఉంచేవాడు మహా విష్ణువే కదా... సమాజంలో నిరంతరం క్రమతని, స్థితిని, కొనసాగించేందుకు కృషిచేస్తున్నది మీరే కదా!

మహా విష్ణువు ధర్మరక్షణ కోసం యుగానికొక్క అవతారం ఎత్తాడు. దశవతారాలు మనందరికీ తెలుసు కలియుగంలో ఆయన అంశను మీలో నింపి తన కర్తవ్యాన్ని మీద్వారా నిర్వహిస్తున్నాడేమో... అందుకే సృష్టిలో తొలి పోలీస్ అయిన మహా విష్ణువు మానస పుత్రులు మీరని నా గట్టి నమ్మకం.

నీకు తెలుసా మిత్రమా! పోలీస్ అనే పదం గ్రీకు నుండి పుట్టింది. పోలీస్ పదానికి అర్థం నగరం అని. అవును నువ్వు మా చుట్టూ ఓ శత్రు దుర్భేద్యమైన కోటని కడ్తావు. బుల్లెట్ ప్రూఫ్ లాంటి భద్రతను మాకివ్వాలని తపనపడ్తావు. నిజానికి మీ మీద వచ్చినన్ని విమర్శలు, తిట్లు, కవిత్వాలు ఏ వృత్తి మీదా రాలేదేమో కదా...

''దేశంలో గుడిసెకు కలప దొరకట్లేదుట... అవును మరి దేశంలో పండిన కలపంతా పోలీస్ లాఠీలకే చాలటం లేదు'' అంటూ చమక్కులు మెరిపించినా... 'లాఠీతో లూటీ చేసేవాడే పోలీస్' అని వక్ర భాష్యం చెప్పినా... కవ్వించినా... కరుకుగా ద్వేషించినా స్థిత ప్రజ్ఞతతో మీ పనిలో మీరు లీనమై వుంటావు... ఎక్కడ ఏ నలుగురు జతకూడినా... ఏ ఊరేగింపులు తీసినా... ఏ ఉత్సవాలు జరగాలన్నా... ఏ అలజడులు రేగినా అందరికీ గుర్తొచ్చేది మీరే. ఎవరేమన్నా, ఎవరెలా గునిసినా, ఖాకీ డ్రస్ వెనకున్న కారుణ్యపు అడ్రసు తెలుసుకున్నాం కనుకే, ఇప్పుడు మా తరం అంతా మిమ్మల్ని ఫ్రెండ్లీ పోలీస్ గానే పిలుచుకుంటున్నాం.

ఫ్రెండ్ ! ఎక్కడ డేంజర్ సిగ్నల్ కన్పిస్తుందో, ఎక్కడ ఆపదల విజిల్ విన్పిస్తుందో అక్కడ విపత్తుకు, ప్రజలకు మధ్య నిలబడే ఏకైక వ్యక్తి మీరు కాక ఎవరుంటారు చెప్పు! రక్షణ అంటే గుర్తొచ్చేది మీరే కదా. 24 గంటలు on Duty తో అసలు డ్యూటీ టైం టేబుల్ లేకుండా, విరామ దినాలే లేకుండా పనిచేసే 6 అడుగుల నికార్సయిన బుల్లెట్ లాంటి వారు మీరు.

విశ్రాంతిలేని విధి నిర్వహణ, కొంతమంది పైఅధికారులు ప్రదర్శించే బాసిజం, షిఫ్ట్ డ్యూటీలకు కూడా అనుమతి ఇవ్వలేని పని వత్తిడిలు ఎన్ని జీవొలొచ్చినా ఇంతవరకు అమలుకాని సంక్షేమ పథకాలు... ఇలా నిరాశల చీడలు, ఎన్నెన్నో ఉన్నా మీరే ఒక సైన్యంగా మాకోసం నిలబడతారు. తీవ్రమైన మానసిక ఒత్తిడులు ఓవైపు... కాపాడుకోవల్సిన దేహదారుఢ్యం మరోవైపు – అనారోగ్య స్థితిగతులు – నిరంతర ఉద్యోగ నిర్వహణ, ఎప్పుడూ కుటుంబానికి దూరంగా వుండాల్సి రావటంతో కుటుంబ బరువు బాధ్యతల్లో సముచిత పాత్రను పోషించలేకపోవటం బాధాకరమే... సమాజానికంతకీ మీరు భరోసా... కానీ మీ కుటుంబాలకు భరోసా ఎవరు ఇవ్వగలరు? మీరు దగ్గరలేని లోటును ఎవరు పూడ్చగలరు? విధి నిర్వహణ మీదైనా, ఖాకీడ్రస్ వేసుకోకుండానే బాధ్యతల్ని నిర్వహించేది నిజానికి మీ కుటుంబాలే. మీరు చేస్తున్న ఈ వృత్తి నిర్వహణకి, ఈ సేవలకి ఏమిచ్చి మేమంతా మీ కుటుంబ ఋణం తీర్చుకోగల్గుతాం మిత్రమా – నేరగాళ్ళను మీరు నియంత్రించ లేకపోతే సమాజం ఇంత ప్రశాంతంగా ఎలా బ్రతకగల్గుతుంది చెప్పుమా!

పెరిగిన సాంకేతికతతో నేరగాళ్ళు ఎప్పటికప్పుడు సవాల్ విసురుతున్నా, నిత్య విద్యార్థిగా కొత్త టెక్నాలజిని నేర్చుకుంటూ సైబర్ నేరగాళ్ళను ఎదుర్కొవటంలో మీరు చూపించే మేధావితనం ముచ్చట గొల్పుతుంటుంది. మనసు చెదిరే హత్యలు – పసిపిల్లల మాన భంగాలు, వీగిపోతున్న మానవ సంబంధాలు – ఆర్థిక నేరగాళ్ళ సైబర్ ట్రిక్కులు,

వీటన్నిటి మధ్య ప్రతిసారి ఎదురీదుతూ బ్రతకగలగడం అసాధ్యం – ఆ గుండె దిటువు మీకు కాక ఎవరికుంటుంది చెప్పు నేస్తం?

ఎండనకా, వాననకా, పగలు రేయి తేడా తెలియనంతగా 24/7 విధి నిర్వాహణలో మీరు చేస్తున్న ఈ అపూర్వ సేవలు – అనితర సాధ్యమైన కార్యక్రమాలు, చేయూత, సంపూర్ణ భాగస్వామ్యాన్ని ఎవరూ రీప్లేస్ చేయలేరు. మీ పట్ల మీ కుటుంబం పట్ల సానుభూతిని చూపించటం కన్నా సహానుభూతిని ప్రకటించడం, గౌరవించటం, అభిమానించడమే మీకు మేము తెల్పుకునే కృతజ్ఞతాపూర్వక హరిచందనాలు.

అవును–మీ పిల్లల కొంటెచేష్టలు, చిలిపిపనులు, వాళ్ళ ఆలనా–పాలనలు చూడటం, పెద్దవాళ్లతో మసలడం, భార్యతో గడపటం లాంటివి మీకు ఎప్పుడో దొరికే అదృష్ట జ్ఞాపకాలే. నిశ్చింతగా మీ భార్య మీతో చెప్పాలనుకునేవి, మీరు జీవితాంతం మధురంగా దాచుకున్న తీపి అనుభూతుల్ని పంచుకునే క్షణాల్ని ఇవ్వలేనంత పని వత్తిడి మధ్య నలుగుతూ వుండే వారు మీరు – మిమ్మల్ని చూడాలని తపించే మీ తల్లిదండ్రులకు మీతో మాట్లాడాలని ఎదురుచూసే మీ రక్త సంబంధీకులకు కూడా మీరు సమయం ఇవ్వలేని బాధ్యతల బరువులు, కర్తవ్య దీక్ష, కార్యనిర్వహణల మధ్య నిర్విరామంగా ఎప్పుడూ శరీరాన్ని స్టిఫ్‌గా, మీ ఖాకీ బెల్టులాగా నిలబెట్టే ఉండాల్సిన స్థితిలోనే మీరు ఉండటం ఎంత గొప్పవిశేషం.

మీకు కొన్ని తమాషా విషయాల్ని గుర్తుచేయనా –

- 50 కిలోమీటర్ల మేర న్యూయార్క్ నగరంలో రోడ్డును తవ్వుకుపోయిన దొంగల్నీ,
- అస్థి పంజరాలతో వ్యాపారం చేసే H. H. హోమ్స్ తన వ్యాపారాభివృద్ధి కోసం చికాగో నగరంలోనే 200 మంది స్త్రీలను చంపేసారని తెల్సినప్పుడు పొందిన గగుర్పాటును,
- అమెరికా భూతలస్వర్గం అని తలపోసే పిచ్చోళ్ళకేమి తెల్సు – ప్రతి 18.5 సెకన్లకి ఓ సామూహికదాడి జరుగుతుందని – 27 సెకండ్లకో దోపిడి – 3 నిమిషాలకొక మానభంగం, 28 నిమిషాలకొక హత్య జరుగుతుందని అసలు ఉహించగలుగుతామా?
- టోక్యో నగరంలో 40 వేల పోలీస్ బలగాలున్న 15 యేళ్ళ క్రితమే రోజుకు 5 హత్యలు, 10 ఆత్మహత్యలు, 15, సాయుధ బంధిపోటు దొంగతనాలు, 1500 చిన్న నేరాలు జరిగాయంటే నమ్ముతారా ?
- జైళ్ళరాజ్యం దక్షిణాఫ్రికాలో 2 లక్షల 74 వేలమందికి ప్రతి సంవత్సరం జైలు శిక్ష విధిస్తూనే ఉన్నారని ఎందరికి తెల్సు. ఇవి మచ్చుకు కొన్నే. మీలాంటి నిబద్ధత కల్గిన వ్యక్తులు ఉండటం వల్లనే మనదేశంలో, మన రాష్ట్రంలో శాంతి సుహృద్భావాలు విలసిల్ల గలుగుతున్నాయి.

ఫ్రెండ్! విధినిర్వాహణలో 2018 సెప్టెంబర్ నుంచి ఈ యేడాది ఆగష్ట్ వరకు 292 మంది పోలీసులు చనిపోయారని అధికారికంగా వెల్లడించింది కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 36,136 మంది పోలీసులు అమరులయ్యారు. ఉగ్రవాదుల పోరులో 67 మంది బలయ్యారు. పుల్వామ దాడిలో ఏకంగా 40 మందిని ఒకేసారి పొట్టన పెట్టుకున్నారు.

నిజంగా దేశాన్ని సిపాయిలు బయటనుండి కాపాడుతుంటే, సరిహద్దు గ్రామాల్లో ఉగ్రదాడుల్లోనూ, దేశంలోపల మావోయిస్టుల దాడుల్లోనూ అత్యధికంగా బలయ్యేది మీరే కదా ఫ్రెండ్ – జార్ఖండ్, ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, సిక్కిం, అంతెందుకు మన ఆంధ్రప్రదేశ్ ఉమ్మడిగా ఉన్నప్పుడు ఇక్కడా ఎక్కువ మంది చనిపోయారుగా – సంఘ వ్యతిరేకుల్ని – చట్టల్లోంఘనల్ని అదుపుచేసే దీక్షలో మీరున్నప్పుడు ఎన్ని అవాంతరాలు అడ్డుపడి ఉంటాయో కదా!

గోషామహల్ స్టేడియంలో వున్న పోలీస్ అమరవీరుల స్థూపాన్ని చూస్తుంటే ఎవరికైనా సెల్యూట్ చేయాలన్పిస్తుంది. మీ నిరంతర అప్రమత్తతవల్లే కదా శాంతి భద్రతలతో రాష్ట్రం నిండుగా బ్రతక గల్గుతుంది. నేర రహిత రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా ముందుకు వెళ్ళగల్గుతుంది. హోంగార్డులు విధుల్లో వుండి చనిపోతే వారి కుటుంబాలకు 30 లక్షలు అందేలా చూస్తామని అధికారికంగా చెప్పారు. రెండు విషయాలు వినటానికి నేనెంతో సంబరపడ్డాను తెల్సా – దేశంలోనే అత్యాధునిక టెక్నాలజీతో నిర్మిస్తున్న పోలీస్ కమాండ్ కంట్రోల్ రూం ఒకటైతే, రాష్ట్రంలోని 800 పోలీస్ స్టేషన్లను అనుసంధానం చేసిన గొప్ప ఆధునిక టెక్నాలజీతో దేశ చరిత్రలోనే కొత్త శకాన్ని ఆవిర్భవింప చేయనుంది మీ ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ.

అంతెందుకు 'షీ టీమ్స్' వచ్చాక అత్యాచారాల మీద, మహిళల భద్రత మీద ఆడవాళ్ళకు ఎంతో భరోసా వచ్చింది. 256 షీ టీమ్స్ నిరంతరం పనిచేస్తూ మహిళలకు ఎంతో రక్షణగా నిలబడగలుగుతున్నాయి. ఈవ్ టీజింగ్‌లు, పోకిరీల బెదదలు ఆఫీసులో, అన్ని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు check పెట్టేసింది – వరంగల్‌లో జరిగిన 9 యేండ్ల బాలిక అత్యాచారం – హత్య కేసును 48 రోజుల్లో ఛేధించి, నేరస్థుడికి ఉరిశిక్ష పడేలా చేశారు. మత సంఘర్షణలకి పెట్టింది పేరైన మన Hyderabad లో ఇప్పుడు మత వైషమ్యాలు చోటుచేసుకోకపోవటం మీ సమర్థత వల్లనే సాధ్యపడింది.

రాష్ట్రంలో 15 లక్షల సి.సి. కెమెరాలు ఏర్పాటు చేయగలిగితే నేరాలు ఘననీయంగా తగ్గుతాయని ఎంచి ఆ దిశగా కూడా మీరు పురోగమిస్తున్నారు. ఒక్క హైదరాబాద్లోనే 6 లక్షల కెమెరాలను అమర్చటం అంటే మాటలా చెప్పు? 11,500 అత్యాధునిక టెక్నాలజీ వాహనాలలో మీరు ఎప్పటికప్పుడు ప్రజల అవసరాలు గమనిస్తూ గస్తీ తిరుగుతుంటే ఏ నేరగాడు ధైర్యం చేయగలడు చెప్పు? ఇలా మీరు నిరంతర పర్యవేక్షనతో ఒక భయాన్ని మాత్రం నేరగాళ్లలో కల్గించారన్నది మాత్రం వాస్తవం.

కనీసం ఇప్పటికైనా మీకు వారంతపు సెలవులు దొరికాయి. సర్వీసుల్లో ఎక్కువకాలం లూప్‌లైన్లో వున్నవారే అధికం కదా – ఒత్తిడిలో ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకున్న ఉద్యోగుల్ని కూడా చూస్తున్నాం – మరికొంత మంది ఉద్యోగాల్ని వదిలేసివెళుతున్న వాళ్ళను చూస్తున్నాం. మరో పోస్టింగ్‌కి వేచిచూస్తున్న ఆశావహులు – చక్కటి ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తువరించి వచ్చిన అవకాశాన్ని అంది పుచ్చుకుని ఆస్తులు వెనకేసుకున్న ప్రబుద్ధులు కూడా ఉన్నారనుకో. ఫ్రెండ్స్ – ఒక్క ర్యాంకు అధికారి వేర్వేరు ప్రదేశాల్లో వివిధ తరహాల్లో విధులకు న్యాయం చేయాల్సిరావటం కూడా కాస్త బాధాకరమే – ఫ్రంట్‌లైన్ అందరికీ అందనిద్రాక్షే.

మిత్రమా! రా మిత్రమా..!

మా అందరి భారాన్ని – ప్రతి కుటుంబ శాంతి భద్రతల్ని కాపాడుతూ, అలసిపోయి ఆగిపోయినప్పుడు మా భుజాల సాయం తీసుకోండి – మీరంతా కొంత సమయం సేదతీరండి. మా మనసులు పాడే కృతజ్ఞతా పూర్వకమైన గౌరవ గీతాన్ని వినండి– మీ కుటుంబాల సంక్షేమం కోసం దేవుడిని వేడుకుంటున్న మా సామూహిక ప్రార్థనని ఆలకించండి.

నిజంగా – విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయాక త్రివర్ణ పతాకాన్ని కప్పుకొని నడిచే మీ పార్థివ దేహాల ముందు పొగిలి పొగిలి ఏడ్చేకన్నా – సమాజ శాంతి కోసం ప్రాణాల్ని సైతం తృణప్రాయంగా వదిలేయగల విశ్వాసాన్ని మాలో కల్గించిన మీ విధి నిర్వహణ తీరుపట్ల సగౌరవంగా, సవినయంగా, సాధికారికంగా మేమంతా చేస్తున్న సెల్యూట్ని స్వీకరించు –

ఏమైనా

నిరంతర సేవా తృష్ణే ఆత్మగా...

త్యాగానికి నిలువెత్తు రూపంగా...

వేలమందికి స్ఫూర్తినిచ్చే వ్యక్తిత్వంగా...

ఖాకీలమాటున దాగిన కారుణ్య తత్వంగా నిలబడ్డ ఓ నా ఒంటరి అక్షరమా! సాల్యూట్ మీకు! మనిషిగా, మానవీయమూర్తిగా సేవలో తరించు! సరిక్రొత్త స్ఫూర్తిగా చిగురించు..

వుండనా మరి...

మీ

– మమత

# మార్గదర్శులు

జ్వాల !

ఎలా వున్నావ్ ? 'ఈ మధ్య పేపర్ చూస్తుంటే భయం వేస్తుంది' అంది మీ అమ్మ నిన్న కల్సినప్పుడు. ఎందుకు అన్నాను ''మా అమ్మాయి చేస్తుంది పెద్ద ఉద్యోగం కదా! ఏ అలజడి ఏ వైపు నుండి ఉపద్రవమై వచ్చి పడ్తుందోనన్న భయం'' అంది కన్నీళ్ళతో. నాకు నీ గురించి బాగా తెలుసు. న్యాయంకోసం పాటుపడ్తావ్. ధర్మాచరణతో అడుగు ముందుకేస్తావ్. అయినా నీకు కొన్ని విషయాలు చెప్పాలనిపిస్తుంది రా తల్లీ – పేరుకోసం, పెంపుకోసం పాటు పడకుండా జనాలకోసం, మంచి కోసం పాకులాడుతూ విస్మృతులుగా ఎన్నో యేళ్ళు మిగిలిపోయిన వారెందరో వున్నారు. వారందరూ అందించిన స్ఫూర్తి నీలాంటి యువతరానికి కావాలి.

ఒకప్పుడు ఈ తెలంగాణది ఒక చిత్రవిచిత్ర పరిస్థితి. భారతదేశానికంతా స్వాతంత్ర్యం వచ్చినా మనకి మాత్రం రెండో స్వాతంత్ర్య పోరాటమంత గొప్ప పోరాటం చేశాక మాత్రమే స్వేచ్ఛను పొందగలిగాం. మన పంటకోసం మనమే యుద్ధం చేయాల్సినంత పోరాటం చేసిన ఐలమ్మ, దొడ్డి కొమరయ్యలు... వందల కొద్దీ గడీల కింద నలిగిపోతున్న జనాల వెతల్ని తీర్చటానికి ఉద్యమించిన కొదమ సింహాలు నల్లా నరసింహులు, గూడ అంజన్న, కొమ్రం భీం, ప్రత్యేక తెలంగాణ కోసం ఆక్రోశించిన జయశంకర్ సార్, దాశరథి, కాళన్న, కొండా లక్ష్మణ్ బాపూజీ ఇలా ఎందరెందరో వున్నారు. కొందరికి కొందరే తెల్సు. కానీ చరిత్రకు ఎక్కని పేర్లు ఇంకా వున్నాయి. వారు కాలం చెక్కిట కన్నీటి చుక్కలుగా మిగిలిపోయారు. అయితే వారు చేసిన త్యాగాలు మాత్రం నిత్య స్మరణీయాలే! నిరంతర జాగృత కేతనాలే...!

అవును. నిజంగా ఇది పోరుగడ్డ... పోరాటాల అడ్డ... ఎప్పుడు ప్రజాపక్షంగా నిలిచే నాయకులు వస్తూనే వుంటారు. న్యాయానికి అండగా నిలబడే వుంటారు. అలాంటప్పుడు భయాలెందుకురా తల్లీ! ఉద్యోగమనేది కేవలం కడుపు నింపటానికి మాత్రమే కాదు. మనసు నింపే వృత్తి, ప్రవృత్తిల సంతృప్తినికూడా అందివ్వాలి. దానికోసమే కదా ఇంతమంది పోరాటాలు చేసింది.. నిరంతర త్యాగమయులుగా నిలిచి గెలిచింది. వారి పోరాట స్ఫూర్తిని నీకొకసారి జ్ఞాపకం చేయాలనే ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. కాస్త నింపాదిగా చదువునాన్నా !

పైడి జయరాజ్ పేరు విన్నావా... అదే రవీంద్ర భారతిలో 2వ అంతస్థులో పెట్టిన పేరు అంటావు కదా నువ్వు. సరోజినీ నాయుడు, యం. గోవింద రాజులు నాయుడుల మేనల్లుడు పైడి జయరాజ్, 300 పైగా సినిమాల్లో నటించాడు. రాజ్‌కపూర్ తనని పాపాజీ అని పిల్చేవారు. ప్రముఖ సంగీత దర్శకుడు నౌషాద్‌ని పరిచయం చేసింది పైడి జయరాజే, గుజరాత్, మరాఠీ, హిందీ, ఉర్దూ భాషల్లో నటించినప్పటికీ ఒక్క తెలుగు సినిమా కూడా చెయ్యలేకపోయాననే దిగులు బాగా వుండేది తనకి. జైరాజ్ చేసిన ఒకే ఒక ఫాంటసీ చిత్రం 'హతీంతాయి' లో షకీలాపై చేసిన 'సర్వర్ దిగార్ అలమ్' అనేపాట ఎంత పాపులర్ అంటే నిజాం నవాబ్ ఆ పాటని ఎన్నోసార్లు రివైండ్ చేయించి మరీ చూసేవారట. చలనచిత్ర

పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక పేజిని సువర్ణక్షరాలతో లిఖించుకున్న నిర్మాత, నటుడు, క్యారెక్టర్ ఆర్టిస్ట్, దర్శకుడు ఆయన. మూకీ యుగం నుండి మొదలెట్టి టాకీ యుగం వరకు ముంబాయిలో తొలితరంకి ప్రతినిధిగా నిలిచిన తెలుగువాడు అతను. 1980లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును అందుకున్న తెలంగాణ కీర్తిబావుట అతను. వీరి పేరుమీద పురస్కారం ఇవ్వాలని ఇప్పుడు తలపోస్తోంది మన రాష్ట్ర ప్రభుత్వం.

మనం శాంతి కాముకులం. అహింస మన ఆయుధం కాబట్టి ఇద్దరు గాంధీల గురించి ముందుగా చెప్తాను.

అబిద్ హసన్ సఫ్రానీ పేరు విన్నావు కదా నువ్వు. జైహింద్ నినాదాన్ని జాతికి అందించిన పరమత సహన సహృదయశీలి. అజాద్ హిందూ సైన్యంలో కల్నల్ హోదాలో పనిచేసి నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కి జర్మనీలో ఘనస్వాగతం పలికిన గాంధేయ వాది. భగవద్గీతను ఉర్దులోకి తర్జుమా చేసిన దేశభక్తుడు. ''రఘుపతి రాఘవ రాజారాం'' ప్రార్థనలో ఈశ్వర్ అల్లా తేరేనాం కూడా ఉండాలని గాంధీ గారిని ఒప్పించిన సమతావాది. ఆజన్మాంతర బ్రహ్మచారి, మన హైదరాబాదీ. జీవితం మొత్తం తనకంటూ లేకుండా జాతికి అంకితం చేసిన త్యాగజీవి. పెద్ద పెద్ద పదవుల్ని పొందకుండానే జీవిత చరమాంకంలో హైదరాబాద్‌లోనే తనువు చాలించిన గొప్ప మానవతావాది.

సరిహద్దు గాంధీ ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ గురించి నీకు తెల్సుకానీ మన తెలంగాణ గాంధీ గురించి నువ్వు బహుశా విని వుండకపోవచ్చు. తెలంగాణ అపర సరిహద్దు గాంధీగా పిలవబడ్డే అర్హత ఒక్క జమాల్‌పూర్ కేశవరావు గారికే చెందుతుంది. హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసి మరింత బలవత్తరం చేద్దామంటూ ప్రతిజ్ఞ బూని యువతరాన్ని ఉరకలెత్తించిన యువకిషోరం ఆయన.

ఖమ్మంలో గాంధీగారి ప్రసంగం వినటానికి 80 వేలమందిని స్వచ్ఛందంగా రప్పించిన కార్యదక్షుడు. నిజాం ప్రభుత్వంలో వందేమాతరమే పాడకూడదంటే, వందేమాతరాన్ని విద్యార్థులతోనే పాడించి ఆ నిషేధం ఎత్తెయ్యాలని యువతరంతోనే ఉద్యమింపచేసిన ఉద్యమ నేత. టంగుటూరి ప్రకాశం గారిలాగా గుండుకెదురుగా గుండెని నిలిపి ఇల్లెందులలో పోలీస్ ఆఫీసర్‌నే చమటలు పట్టించిన కొదమసింహం. అప్పుడే జనాలంతా 'సర్దార్ కేశవరావ్ జిందాబాద్' అంటూ నినదించింది. మధిరలో సత్యాగ్రహానికి అనుమతివ్వక నిర్బంధం విధిస్తే రైతులా వెళ్ళి అనర్ఘలంగా ప్రసంగించి ఉత్తేజాన్ని నింపి ఉద్యమాన్ని నడిపించిన ధీశాలి.

అందుకే కాళన్న జమాల్‌పూర్‌ని ''మచ్చలేని మనసు, జబ్బులేని ఒళ్ళు, డబ్బులేని జేబు నీదన్న! సర్దార్ నామంబు, సహజ నామంబు గా సరిపోతుంది నీకు కేశన్న!'' అని కొనియాడాడు. అలాంటి నిస్వార్థపరుడు కేశవరావు గారు. ఒకసారి ఒక ముస్లిం సోదరుడు ఒక కార్యక్రమంలో సాయంకాలం ఇబ్బంది పడుతుండటం గమనించి తన భుజంపై కండువా తీసిచ్చి ''నమాజ్ చేసుకోభాయి, ఈ కండువాకి మట్టి అంటుకుంటుందని భయపడకు. ఇంతకన్నా సార్థకత మరోటి ఉండదు'' అన్న సర్వమత సామరస్య ప్రేమికుడు కేశవరావు.

కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు రాస్తుంటేనే గుండె ఉప్పొంగుతుంది. గాంధేయవాది. లాలాలజపతిరాయ్, మహాత్మ జ్యోతిబా పూలే, డా॥ బి.ఆర్. అంబేద్కర్, గాంధీజీల నిజమైన వారసుడు. 97 సంవత్సరాలు జీవించిన ఆయన చూడని విషయాలు లేవు... తెలుసుకోని అంశాలు లేవు... 15 ఏళ్ళ వయసులో 'చందా' వెళ్ళి గాంధీ గారి ఉపన్యాసము విని ఎంతో స్ఫూర్తిని పొందాడు. తెల్లటోపీని ధరించటం నిజాం కాలంలో ధిక్కారంగా భావించేవారు. అయినప్పటికి జీవితకాలం మొత్తం తెల్లటోపిని ధరించిన గాంధేయవాది ఆయన.

వ్యాయామశాలకు15 ఏళ్ళపాటు అధ్యక్షునిగా పనిచేసారు. వకీలుగా నిజాం వ్యతిరేక కేసులెన్నింటినో వాదించేవాడు. డబ్బుల్లేకుండా ఊర్ల నుండి వచ్చే వారికోసం కేసుల్ని ఉచితంగా వాదించటమే కాకుండా, కొన్ని సార్లు యింకా న్యాయ ఖర్చులు కూడా పెట్టుకుంటూ, వారి జేబుల్లో సైతం ఖర్చులుకోసం కొంత డబ్బులు పెట్టేవాడు. ఎమర్జెన్సీని నిరసిస్తూ, కాంగ్రెస్‌ను వదిలేశాడు. అయినా గాంధేయవాదిగానే జీవితాంతం గడిపాడు. 23 సంవత్సరములు

యం.యల్.ఏ. గా, డిప్యూటీ స్పీకర్‌గా, వైస్ ప్రెసిడెంట్‌గా, రెండు సార్లు కెబినెట్ మంత్రిగా పనిచేసారు. జై తెలంగాణ అంటూ ప్రత్యేక రాష్ట్రం కోసం మంత్రి పదవికిసైతం రాజీనామ చేసారు. ప్రత్యేక తెలంగాణ వాదాన్ని విరివిరిగా వినిపించినందుకు 2002లో అప్పటి ప్రభుత్వం తన యింటిని మొత్తం నేలమట్టం చేసింది. 2006లో సుప్రీంకోర్టు తీర్పు వెలువడేంత వరకు ఆ విషయం మీద విరివిగా తన నిరసనలు, వాదనలు వినిపిస్తూనే వచ్చారు. అలాంటి ఆచరణీయ విలువలున్న వ్యక్తుల్ని చాలా తక్కువగా చూస్తుంటాము.

షోయబుల్లాఖాన్ పేరును చిన్నప్పటి నుండి నీకు చెప్తూనే వున్నాను కదా తల్లీ ! మత విద్రోహశక్తులకు సింహస్వప్నంగా నిల్చి, నిజాం నిరంకుశ పాలనకు బలైన అమరజీవి ఆయన. ఆయన గురించి తెలంగాణ చరిత్రలో రక్తాక్షరాలతో లిఖించాల్సి వుంది. మానుకోట మీదుగా గాంధీ గారు సబర్మతి వెళుతున్నారంటే విధి నిర్వహణ చూసుకుంటున్న హబీబుల్లాఖాన్ అనే పోలీస్ అధికారి ఉత్సాహంగా గాంధీ గారిని చూడ్డానికి వెళ్ళి ఇంత బక్కపల్చని వ్యక్తి దేశాన్ని ఒక తాటి మీదకి ఎలా తేగలిగాడు అని ఆశ్చర్యపడుతూ ఇంటికి రాగానే కొడుకు పుట్టాడని తెల్సి ఆ పిల్లాడిని చూసిన వెంటనే గాంధీ గారి నవ్వులా అన్పించడంతో అభిమానంగా 'షోయబుల్లా ఖాన్' అని పేరు పెట్టుకుంటాడు.

చిన్నప్పుడు షోయబ్‌ని, గాంధీ షోయబ్ అని అందరూ పిల్చేవారు. చిన్నప్పటి నుండి 'షోయబ్' జనాల బాధలు చూస్తే సహించలేక పోయేవాడు. అందునా మతం పేరుతో కాశీం రిజ్వీ అనుసరులు ''మజ్లిస్ ఇత్తే హదుల్ ముసల్మీన్'' సంస్థ పేరుతో చేస్తున్న మరణకాండని ప్రతిరోజు నిరసిస్తూ తేజ్ ప్రతికలో విరివిగా వ్యాసాలు రాసేవాడు. తేజ్ ప్రతికను బ్యాన్ చేశారు. ఆ తరువాత మందుముల గారి 'రయ్యత్' పత్రికలో ఆగడాలను నిరసిస్తూ ఎన్నో వార్తలు రాశాడు. దాన్ని కూడా నిషేధింప చేయిస్తాడు రిజ్వీ.

ఇమ్రోజ్ పత్రికను తానే స్థాపించి మత ఛాందస వాదాన్ని, దహన కాండల్ని, నిప్పులు చెరిగే పెన్ గన్‌తో చీల్చి చెండాడటం ప్రారంభిస్తాడు. ఆ పత్రిక ప్రభావానికి భయపడ్డ రిజ్వి ఎన్నో మార్లు ఉత్తరాలతో బెదిరిస్తాడు. కసాయి మూకలతో హెచ్చరింపచేస్తాడు. అయినా వెరువక, మడమ తిప్పక తన విమర్శలను మరింత పదును తేలుస్తూ రచనలు కొనసాగిస్తాడు షోయబ్. గాంధీజీని పొగుడుతూ, స్వాతంత్ర్యం విలువను తెలియచేస్తూ హైదరాబాద్ సంస్థానంలో జరుగుతున్న అరాచకాల్ని ఎండగడుతూ సునామీగా విరుచుకు పడ్తున్న తనని, రజాకార్లతో కాల్పించి కత్తులతో తన చేతుల్ని నరికించి కిరాతకంగా హత్య గావిస్తాడు ఖాసిం రిజ్వి. ఆగష్టు 22, 1948 రాత్రి 12 గంటలకు తాను చనిపోతూ కూడా చివరగా ''ఇమ్రోజ్ పత్రిక ఆగకూడదు. ధర్మం ఎప్పటికైనా జయిస్తుంది'' అని చెపుతూ ఊపిరి వదిలిన సాహసి షోయబ్... అప్పుడాతని వయసు 28 ఏళ్ళు. చూశావా ఎంత గొప్ప యోధుడుని మనం పోగొట్టుకున్నామో!

స్వాతంత్రోద్యమంలో వీరకిషోరమై దూకుతున్న టంగుటూరి ప్రకాశం పంతులు గారిని బంధించాలని సర్కార్ హుకుం జారీచేస్తే గుండెరావు హర్కారే, తన ఇంట్లో 4 రోజులు ప్రకాశం గారిని దాచి, ఆ తర్వాత నలుగురు మనుషులతో మనిషి కూర్చునేంత పెద్ద వెదురు బుట్టను దట్టంగా అల్లించి నలుగురు బలాఢ్యులతో దాన్ని మోయించి, రహస్య స్థావరానికి ప్రకాశం గారిని చేర్పించిన  దేశభక్తుడు హర్కారే. బహుబాషా కోవిదుడు, అనువాదకుడు. గుమస్తాగా న్యాయస్థానంలో చేరి ప్రధాన న్యాయమూర్తి అంతరంగిక కార్యదర్శిగా నియమితుడై, గద్వాల్ సంస్థానంలో 30 యేళ్ళు న్యాయాధీశుడుగా, కలెక్టర్‌గా, సెషన్స్ జడ్జిగా పనిచేశాడు. గద్వాల్ సంస్థానం 30,000 బాకీ వుందని సాలార్ జంగ్ తాకీదు పంపిస్తే కేవలం 300 రూపాయలే బకాయి అంటూ పక్కాలెక్కలు చూపించి సాలార్ జంగ్‌నే అబ్బురపరచిన గణిత పారంగతుడు గుండెరావు హర్కారే. దేనికి బెదరని ఆ గుండెనిబ్బరం మన అందరం నేర్చుకోదగ్గది .

తెలంగాణా టైగర్ నల్లా నరసింహులు... 3 సార్లు ఉరిశిక్షలు పడ్డా తిరిగి ఉద్యమించిన చైతన్యనేత్రం. తన భార్య వజ్రమ్మతో సహ అడవుల్లోనే అజ్ఞాతంలోనే ఉండి సహజ ఉద్యమనేత దొడ్డి కొమరయ్యను కోల్పోయి కూడా వెరువక భార్య జైలులోపలే పాపకు జన్మనిచ్చినా చలించక దేశ్‌ముఖ్‌లను ఎదురొడ్డి తెలంగాణ రైతాంగ పోరాటాన్ని సాయుధ

పోరాటంగా మలచిన వాళ్ళలో పేరెన్నిక గన్నవాడు నల్ల నర్సింహులు. జెండా పండుగనాడు పర్కాలలో భయంకరమైన సామూహిక హత్య, బైరాన్ పల్లిలో వందల మందిని చెట్లకు కట్టేసి హింసించటం, స్త్రీలను వివస్త్రలనుచేసి బతుకమ్మ ఆడించి అమానుషంగా, సామూహిక అత్యాచారాలు చెయ్యటం, 118 మందిని కాల్చి చంపటం ఒకటేమిటి అన్నీ అమానవీయ చర్యలే. హింసా ప్రతిహింసలతో తెలంగాణా అగ్ని గుండమై ప్రజ్వరిల్లిన ఆ నాటి రోజులల్లో అడుగడుగునా ప్రజలకు వెన్నుదన్నుగా నిలబడ్డ నిస్వార్థపరుడు నర్సింహులు.

యూనియన్ సైనిక జనరల్ జె.యన్. చౌదరి నల్లగొండ జైలుకు కేవలం ఈ తెలంగాణ టైగర్ని చూడటానికి వచ్చాడంటేనే అర్థం చేసుకోవాలి అతడెంత గొప్ప వీరుడో. విషాదం ఏమిటో చెప్పనా తల్లీ. మన రాష్ట్రం మనకొచ్చినా జైలుగోడలు, కేసులు దాటి నర్సింహులు బయట పడటానికి సాయం చేసింది మాత్రం పుచ్చలపల్లి సుందరయ్య గారే. 1959 జనవరి 26 న జైలు గోడలుదాటి జన సమూహంలోకి అడుగు పెట్టారు నల్లా నరసింహులు. ఇది ఎంతో విషాదం కదా!

తుర్రెబాజ్ఖాన్ పేరు విన్నావా నువ్వు. నువ్వేమన్నా తుడూంఖాన్వా అంటుంటారు ఇప్పటికీ. ఎవ్వరికీ చిక్కడు, దొరకుడు. ఆంగ్లేయులు చేస్తున్న క్రైస్తవ మత ప్రచారానికి వ్యతిరేకంగా పోరాడుతూ మతాన్ని, మానవత్వాన్ని కాపాడుకునేందుకు తలని కోట గుమ్మానికి వేలాడదీసుకున్న త్యాగపురుషుడు. 'వహబి' ఉద్యమానికి చేయుతగా నిల్చినందుకు నిజాం సోదరుని సైతం చంపేసిన బ్రిటీష్ వారిపై దాడికి దిగిన యువ కిషోరం. ఛీటాఖాన్తోపాటు 13 మంది భారతీయ సైనికులు ఔరంగాబాద్ నుండి తప్పించుకుని నిజాంని శరణుకోరితే రెసిడెంట్కి అప్పగించిన నవాబ్ దురాగతాన్ని గర్హిస్తాడు.

వారిని కోఠి రెసిడెన్సీలోని నేల మాళిగలో బంధీ చేసి చిత్ర హింసలకు గురిచేస్తున్న విషయం తెల్సుకుని మౌల్వీ అల్లావుద్దీన్, తుర్రేబాజ్ఖాన్ రెసిడెన్సీమీద దాడికి దిగుతాయి ఎంతో పోరాటం తరువాత తమ అనుచరులు చాలామంది చచ్చిపోయాక ఇద్దరూ తప్పించుకొంటారు. చివరికి తుర్రేబాఖ్ దొరికిపోతాడు. అతనికి అండమాన్లో యావజ్జీవ కారాగారశిక్ష విధిస్తారు. దాన్ని ఉరిశిక్షగా మార్చమని 'డేవిడ్సన్' గవర్నర్ జనరల్ని కోరతాడు. కస్టడి నుండి తప్పించుకుని పారిపోతున్న తుర్రేబాజ్ని ఖుర్బాన్అలీ తుపాకితో కాల్చి చంపుతాడు. 1859లో తలను మొండాన్ని వేరుచేసి కోటగుమ్మానికి వేలాడదీసి, భీభత్సంగా కొన్ని రోజులు ప్రదర్శనగా ఉంచి, తమ కక్షని తీర్చుకుంటారు బ్రిటీష్ వాళ్ళు. కొంత ఆర్థిక సహాయం, మరికొంత హార్థికసాయం దొరికివుంటే, హైదరాబాద్ సంస్థానం నుండే బ్రిటీష్వాళ్ల పతనం ఆరంభమైవుండేది. చూసావా! జనాలకోసం చావును ఎంత ఆనందంగా ఆహ్వానించగలిగాడో ఆ యోధుడు!

'పూల కుండీలు పోయాయని' ఉద్యోగంలో నుంచి సస్పెండ్ చేయించినప్పటికీ వెరువకుండా ఉన్న ఆస్తుల్ని అమ్ముకుని బతికి తన వ్యక్తిత్వాన్ని నిరూపించుకున్న తెలంగాణ వాది మాటేటి రామప్ప గారిది కూడా మచ్చలేని వ్యక్తిత్వమే. డిప్యూటీ కలెక్టర్గా, మేధావిగా వెస్టన్ జ్యోతిష్య దృష్టగా పేరొందిన ఈయన ఆదినుండి తెలంగాణ వాదాన్ని విన్పిస్తూనే వచ్చారు. ఫజల్ అలీ కమీషన్కి ఆంధ్రాతో తమని కలపొద్దు అని ఉత్తరం వ్రాసినందుకు నీలం సంజీవరెడ్డి గారు 'తెలంగాణ వాళ్ళకి తెలివి లేదు' అని అన్నారని ఘాటుగా రిటార్ట్ ఇచ్చినందుకు ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆర్థికంగానూ, వృత్తి రీత్యాను. అయినా జంకకుండా పోరాడి నిల్చిగెల్చాడు. ఆ తర్వాత మలేషియాలో నిర్వహించిన రెండవ తెలుగు మహసభల్ని సి.యం అంజయ్య గారి సాయంతో చేసి గొప్పపేరును తెచ్చుకున్నారు. తెలుగు ఉర్దూ భాషా నిఘంటువులను తయారుచేసి తానెప్పుడు చనిపోతానో జ్యోతిష్యవేత్తగా తెల్సుకుని ముందుగానే కరెంట్ బిల్లులను, మనవడి ఫీజును కట్టేసిన క్రమశిక్షణ కలిగిన సశ్శీలుడు మాటేటి గారు.

రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్. అంబేద్కర్ గురించి అందరికీ తెల్సు. కానీ వారికే గురువులాంటి వారు భాగ్యరెడ్డి వర్మ గారని, వారు మన తెలంగాణా వారని ఎందరికి తెల్సు చెప్పు! వారి 130వ జయంతి ఉత్సవాల్ని జరుపుకుంటున్న

ఈ తరుణంలో ఆది హిందువుల నాయకుడిగా 3 దశాబ్ధాలకుపైగా ప్రజాసేవలోనే గడిపిన రాజనీతిజ్ఞుడు ఆయన. అంతేకాకుండా దళితుల పాఠశాలలకోసం ఎంతో శ్రమించారు. దేవదాసి నిర్మూలన కోసం, ఆర్థిక సామాజిక ప్రగతికోసం, అలసిపోని పోరాటం చేసిన సేవాదురంధరులు భాగ్యరెడ్డి వర్మ. ఆది హిందూ, భాగ్యనగర్ పత్రికల వ్యవస్థాపకుడు. ఆంధ్రా మహాసభల్లో తన ప్రసంగాలతో, పత్రికల్లో కొన్ని కథలతో చైతన్యం తీసుకొచ్చిన మహా మేధావి. అప్పటికీ, ఇప్పటికి వారి ఎడిటోరియల్, కథలు, లేఖలు సేకరించటంలో ఎంతో పరిశోధన జరగాల్సిన అవసరం ఎంతో కనిపిస్తుంది.

చదవటం రాయటం రాని ఒక అతి సాధారణ వ్యక్తి ఆంధ్ర మహాసభల్లో, చైతన్య స్ఫూర్తితో, ధిక్కార స్వరాన్ని వినిపించిన తొలితరం రచయిత ఆవుల పిచ్చయ్య. 'మీజాన్' పత్రికలో అచ్చుఅయిన ఆవుల పిచ్చయ్య కథలమీద సంగిశెట్టి శ్రీనివాస్ గారు ఎంతో పరిశోధన చేసారు. ఇంకా ఎంతో జరగాల్సింది వుంది. బి.యన్. శాస్త్రి గారు, తెలంగాణ చరిత్రను దశాబ్దాలపాటు పరిశోధించిన చారిత్రక పరిశోధకులు. శాసనాల్లో, తెలుగు భాష పరిణామంలో ఆదికవి నన్నయ్య కాదని, నన్నే చోడుడు అని ప్రతిపాదించినందుకు డాక్టరేట్ గ్రంధాన్ని కూడా త్రిప్పికొట్టి, తిరగరాయమని పంపించిన ఛాందసుల మధ్య ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నాలుగు వందల శాసనాలని పరిష్కరించారు. రెండువేల శాసనాలని ముద్రించారు. తవ్వినకొద్ది ఊటబావిలా పొంగుకొస్తున్నా తెలంగాణా చరిత్రకు బి.యన్. శాస్త్రిగారు చేసిన సేవ అంతా, ఇంతా కాదు. అయినా ఆయనకు రావల్సినంత పేరు ఇంకా రాకపోవటము విచారకరం.

ఎన్నో సుప్రభాతాలు రాసిన మామిడిపల్లి సాంబశివశర్మ గారి గురించిన సమాచారం రావాల్సింది ఎంతో వుంది. వందేమాతరం, జనగనమన అంత ప్రముఖమైంది ప్రార్థన. మన పిల్లలు రోజు పాఠశాలలో చదువుతారే "భారతదేశం నా మాతృ భూమి. భారతీయులందరూ నా సహోదరులు" అని ! అది రాసిన పైడిమర్రి వెంకట సుబ్బారావు బహుభాషా కోవిదులు. 1962లో చైనా యుద్ధం వచ్చినప్పుడు చైనా పాఠ్యపుస్తకాల్లో దేశభక్తితో కూడిన పాఠ్యాంశాలు ఉండటం గమనించిన పైడిమర్రి ప్రతిజ్ఞను రాసి ప్రముఖ సాహితీవేత్త తెన్నేటి విశ్వనాథం గారికి అందించారు. వారు దానిని విద్యాశాఖ మంత్రి పి.వి.జి. రాజు గారికి చూపిస్తే వారు దాన్ని కాసు బ్రహ్మానంద రెడ్డి గారికి అందించారు. బ్రహ్మానంద రెడ్డి గారు బావుందని మెచ్చుకొని పాఠ్యపుస్తకాలలో పొందుపరచి ప్రతి పాఠశాలలో రోజు ప్రతిజ్ఞ చదివేలా ఓ రూల్ పాస్‌చేసారు.

అలా 1963 నుండి రాష్ట్రంలో ఈ ప్రతిజ్ఞ అన్ని పాఠశాలలో చదవటం అలవాటు అయ్యింది. ఆ తరువాత దీన్ని అనుసరిస్తూ కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు వారి వారి భాషల్లోకి అనువదింప చేసుకొని పిల్లలతో ప్రతిజ్ఞ పాలన చేయించారు. విషాదం ఏమిటంటే 1988 వ సంవత్సరంలో 3వ తరగతి చదువుతున్న తన మనవరాలు ఆ ప్రతిజ్ఞను వల్లెవేస్తుండం విన్న పైడిమర్రి అది తను రాసిందేనని తన కుటుంబ సభ్యులకు తెలియజేస్తే అప్పుడు వారు ప్రభుత్వానికి నివేదిస్తే, తాను చనిపోవటానికి కొన్ని నెలలముందు పైడిమర్రి వెంకట సుబ్బారావు గారి పేరును ఆ ప్రతిజ్ఞకింద పొందుపరచటం జరిగింది. చూశావా ! అలా దాదాపుగా 25 సంవత్సరాలు విస్మృతుడిగానే మిగిలిపోయిన గొప్ప దేశభక్తిపరుడు పైడిమర్రి.

నిజం ! అప్పట్లో మా తరం అందరం వరంగల్ వెలితే వేయ్యి స్థంభాల గుడిని, కాళోజీని చూసి వచ్చేవాళ్లం. హైదరాబాద్ వస్తే చార్మినార్‌ని, మగ్ధుం మొహియోద్దీన్ని చూసి వచ్చేవాళ్లం. అన్నట్టు మగ్ధుం రాసిన ఒక మల్లెపందిరి నీడ కింద కవితను ఇష్టపడి రాజ్‌బహుదూర్ గౌర్ తన ఇంటి గోడపై మల్లె పందిరి పెంచినట్టుగా తెలుసుకున్న మీ తాతగారు వెళ్లి, ఆ మల్లె పందిరిని కూడా చూసి వచ్చారంటేనే నీవు అర్ధం చేసుకోవాలి. ఆ కవి అంటే మీ తాతగారికి ఎంత పిచ్చి ప్రేమనో... ఇదంతా ఎందుకు చెప్పానంటే వృత్తిని ప్రేమించు, ధర్మాన్ని ఆచరించు. చట్టాన్ని గౌరవించు అన్యాయాన్ని ఎదురించు. సత్యం వైపు నిలబడు. ప్రజల తరుపున మాట్లాడు. ఇదే నేను నీకు చెప్పాలనుకున్న విషయం.

వీరందరి గురించి ఎందుకు చెప్పానో తెలుసా! వీరందరిని నెత్తిన పెట్టుకొని ఎవరు మోయలేదు. తెలంగాణా వచ్చాకే వీరంతా వెలుగులోకి వచ్చారు. ఒకరు గుర్తించలేదని బాధపడకుండా, గౌరవించలేదని దిగులుపడకుండా తన ధర్మాన్ని తాను చేసుకుంటూ పోయిన వీరి లాగానే, నువ్వు నిజాయితీగా నిలబడు.

మాటల్లాంటి కత్తులకి, పెట్రోల్‌కి, తూటాలకి వెరిస్తే నీ అస్థిత్వం నిలబడదు, నీ వ్యక్తిత్వం మసకబారుతుంది. నువ్వు ఎప్పటికీ నువ్వే ! ఎన్నో నిద్రలేని రాత్రులు చదువుకుంటేనో నువ్వు ఈ ఉద్యోగాన్ని సంపాదించావు. ఎందరో నిరుద్యోగులకి ఎన్నో ఆశయాలు ఉన్నా చేయలేని పనుల్ని, ఈ ఉద్యోగం ద్వారా నీవు నిర్వహించ గలుగుతావు. వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో. వృత్తిని రాజకీయం చేసుకోకు. ప్రజలు పెట్టిన భిక్ష మన వృత్తి. ఎందుకంటే మన జీతం, ఈ జీవితం వారు ఇచ్చిందే. ప్రజలముందు అహంకారంతో తల ఎప్పుడూ ఎగరవేయకు, ధైర్యంగా నిలువు... నీతిగా గెలువు... అదే నిన్ను కోరేది

ఉండనా మరి..

మీ అమ్మమ్మ

– సుబ్బాయమ్మ

# స్ఫూర్తిదాతలు!

జ్వాలా !

నీకు ఉత్తరం వ్రాయాలన్న ఆతృతలో పడి మొన్న తాతగారికి జావ కాసివ్వడం మర్చిపోయి అర్ధాంతరంగా ఆపేయాల్సి వచ్చిందని, అందుకే తృప్తిగా లేదని మీ అమ్మమ్మ చెప్పింది. తాను చెప్పదల్చుకున్న విషయాలు ఇంకా మిగిలేవున్నాయని, నన్ను మరొక ఉత్తరం వ్రాయమని మరీ మరీ చెప్పింది. ఎంతైనా ఇద్దరం చరిత్ర పరిశోధకులమే కదా! ఇద్దరం రిటైర్ అయిపోయాక మళ్ళీ ఒకసారి చరిత్ర పుటలు తిరగేయాల్సి వచ్చింది. అందుకే తన ఉత్తరాన్ని నేను కొనసాగిస్తున్నానమ్మా!

మనమధ్య లేకున్నా... పదిమందికి ఉపయోగపడేలా ప్రతి క్షణాల్ని ప్రణాళికాబద్ధంగా, ఆచరణీయ విలువలతో ఆలోచనల్ని చెక్కుకున్న మహానుభావులెందరో మనలో వున్నారు. ఎవరో వస్తారని తమకేదో పదవులు, అవార్డులు ఇస్తారని ఆశించి వారేమి చెయ్యలేదు. వాళ్లకి నచ్చినదారిలో నచ్చిన విధంగా ప్రజలకోసం బ్రతుకుల్ని త్యాగం చేశారు. తమ పేరుకన్నా ముందు ప్రజల అవసరాలు తీరాలని పోరాటం చేసారు. అలాంటివారిని మాతరం గుర్తుపెట్టుకున్నా రాబోయేతరం కేవలం పుస్తకాల్లోనే వెతికేస్థాయిలో విస్మృతులుగా మిగిలిపోతారేమో అన్పించి నీకు వారి గురించి చెప్పాలనుకుంటున్నా... అయినా మనిషికన్నా ముందు వారి మంచి ప్రయాణించింది. పేరుకన్నా ముందు వారి ప్రేమ పలకరిస్తుంది. వారి మాదిరిగానే నీవు నిబద్ధంగా అంకితభావంతో ప్రజలకోసం సేవ చేయాలిరా తల్లీ!

నువ్వు చిన్నప్పుడు ఎంతో ఆసక్తిగా పాడేదానివి చూడు ''ఊరు మనదిరా – ఈ వాడ మనదిరా'' అంటూ ఎందరి నోళ్ళలోనే పరవళ్ళు తొక్కిన అలాంటి పాటల రేడు గూడ అంజయ్య గారు ఒక్క పాటతో పెత్తందార్ల గుండెల్లో గునపాల్ని దించి దేశాన్నే ఉల్లిక్కిపడేలా చేసిన వీరిది అడుగడుగునా పోరుబాటనే. నిబద్ధంగా చివరి శ్వాస వరకు నిలబడ్డ నీతిగల పోరాడయోధుడు, విలువలున్న మనిషి. కులరాజకీయాలను, కుళ్ళు ఆధిపత్యాలను నిలదీస్తూ మధ్యలో దొర యేందిరో, దొర పెత్తనం ఏందిరో అంటూ భూస్వాముల దురాగతాలను పాటల్తో ఎండగట్టిన నేత గాడు తాను. బండి మనదిరో బండెద్దు మనయిరా అంటూ, సావు కాడ మనమే – సన్నాయికాడ మనమే, మరి ఈ దొరల పెత్తనం మన పల్లెలమీద ఏమిటీ అంటూ పాటల అంకుశంతో పొడిచి, విప్లవోద్యమాన్ని రగిలించిన ప్రజా గాయకుడు తను. నువ్వు అయ్యోనివా అమ్మోనివా అని నిగ్గదీసి అడుగుతూ పాటల పహారా కాసిన అంజన్న తెలంగాణ విప్లవోద్యమాన్ని ప్రతి గడపకు, ప్రతి గుండెకు పంచాడు.

ప్రపంచ ప్రఖ్యాత సినీ దిగ్గజం శ్యాం బెనగల్ తేలియా రుమాల్ ఆర్ట్, అలి జారిన్ డై ఆర్ట్‌లోను నేత సిరిమంతుడు అయిన చిలువేరు రామలింగం కోసం పోచంపల్లికి తరుచూ వచ్చేవాడని ఎందరికి తెలుసు చెప్పు ? సరిక్రొత్త డిజైన్ల ఈ నిత్యాన్వేషి ప్రతి బోనాల రోజు ఎడ్ల బండి మీద మగ్గం పెట్టుకొని ఊరేగుతూ ఇంటి నుండి అమ్మవారి గుడికి వెళ్లేలోగా

అమ్మవారికి చీర నేసి బహుమానంగా ఇవ్వడాన్ని చూసి స్ఫూర్తి పొందిన శ్యాం బెనగల్ 'సుష్మన్' చిత్రంలో ఈ సంఘటనని యథాతథంగా పెట్టారని నీకు తెలుసా! కుంచెతో కాన్వాస్‌కు రంగులద్ది నూలు పోగుల మేలు కలయికతో మగ్గంమీద చిత్రాలువేసి అందరికీ బహుకరించే రామలింగం తన కళతో ఊరు పేరు వెలగాలని, తన పేరు కన్నా తన కళ చిరస్థాయిగా నిలవాలని కోరుకున్న నిస్వార్ధజీవి.

సునీల్ గవాస్కర్ కొడుకు పేరు రోహన్ జై విష్ గవాస్కర్. అందులోని 'జై' ఎవరో తెలుసా : మణికట్టు మాయాజాలంతో, సొగసైన బ్యాటింగ్‌తో సినీ ప్రముఖులు కూడా అనుసరించిన Dress Sense తో Showman గా ఎదిగిన ఆగర్భశ్రీమంతుడు అయిన ఒకప్పటి మేటి క్రికెటర్ M.L. జయసింహ. బేగంపేట విమానాశ్రయాన్ని, కంటోన్మెంట్‌ని నిర్మించిన కాంట్రాక్టర్ లక్ష్మీనర్సు జై నాన్నగారు. మెడలో స్కార్ఫ్, ఇన్‌షర్ట్, మణికట్టు దగ్గర మడిచిన సిల్కుషర్టు, కాలర్ గుండీలు పెట్టుకుని, కాలర్ వెనకవైపున ఎత్తిపట్టుకుని ఉండే ''జై'' నడిచొస్తుంటే క్రికెట్ మైదానంలోనే కాదు, బయట కూడా ఈలలు, చప్పట్లు మర్మోగేవి. ఎర్రపల్లి ప్రసన్న అనే క్రిటిక్ "One more over" అనే తన పుస్తకంలో జై గురించి ప్రశంసల జల్లు కురిపించారు. వెనుక అడుగుపైన Mid-on కు ఎడంగా జై Short కొడుతుంటే చూసి తీరాలి తప్ప, చెప్తే తరగనిది. అది జై మాత్రమే చేయగలిగేది.

1959 నుండి 71 వరకు 12 ఏళ్ళపాటు రంజిలో 33 సెంచరీలు, 157 క్యాచ్లు పట్టిన తెలంగాణ మేటి క్రికెటర్, Hyderabad నుంచి అజారుద్దీన్‌ను select చెయ్యకపోతే తాను resign చేస్తానని కమిటీని బెదిరించి మరీ అజారుద్దిన్ను క్రికెట్‌కు బహుకరించిన వ్యక్తే కాకుండా సునీల్ గవాస్కర్కి తొలిరోజుల్లో మెళకువలను నేర్పిన గురువు కూడా. నీ కొక తమాషా సంగతి చెప్పనా! క్రికెట్ బోర్డు ఎప్పుడెలా స్పందిస్తుందో అప్పట్లో కూడా తెలిసేది కాదు 1967 – 68 ల్లో ఆస్ట్రేలియా పర్యటనలో ''జై''ను select చెయ్యకుండా జట్టుని పంపించారు. పేలవమైన ఆటతీరుతో జట్టు అంతా అగచాట్లు పడుతుంటే జై కోసం ప్రత్యేక విమానాన్ని తెప్పించి ఆస్ట్రేలియా పంపించారు. Airport నుండి direct గా stadium కి వెళ్ళిపోయి శతకాలు తీసిన ఘనత ''జై'' ది. 1960 Test cricket లో 5 రోజులు Batting చేసి రికార్డు క్రియేట్ చేసిన క్రికెటర్ – జై మాత్రమే.

ముంగిట్లో విద్య పేరుతో – లక్షలాది మందికి దూరవిద్యను మనసుకు దగ్గరగా చేర్చిన దూరవిద్యాపితామహుడు – గడ్డం రామిరెడ్డి పేరును విన్నావా తల్లీ... 48 ఏళ్ళ వయసులోనే వైస్ చాన్స్‌లర్‌గా బాధ్యతల్నిచేపట్టి 1982 లోనే డా॥ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయానికి శ్రీకారం చుట్టినవారు ఆయనే. ఆ Inspiration తోనే కేంద్ర ప్రభుత్వం కూడా వారి ఆధ్వర్యంలోనే ఇందిరాగాంధి విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేసి పాఠ్య ప్రణాళిక రూపకల్పన కూడా వారికే అప్పజెప్పింది. అంతర్జాతీయస్థాయిలో బంగ్లాదేశ్‌లో ఏర్పాటుచేసిన మొదటి సార్వత్రిక విశ్వవిద్యాలయం సలహాదారుగా, ఆసియా దేశాల సార్వత్రిక విశ్వవిద్యాలయం అసోసియేషన్‌కు మొట్టమొదటి సెక్రటరీ జనరల్‌గా, Common wealth దేశాలు నెలకొల్పిన Common wealth of learning సంస్థల స్థాపనలో బోర్డు సభ్యులుగా నాణ్యమైన విద్యను ప్రపంచానికి అందించే గురుతర భాధ్యతను జీవితకాలం మోసారు. U.G.C. సంఘానికి Chairman గా పనిచేసిన ఈ మేధావికి అనుకున్న స్థాయిలో గుర్తింపు రాలేదన్న బాధ ఆయన శిష్యగణానికి ఎంతో ఉంది.

యక్షగానాన్ని ప్రజా ప్రయోజనాలకు వాడిన తొలి యక్షగాన పితామహుడు చెర్విరాల భాగయ్య. యక్షులు పాటగా పాడుకునే ఈ ప్రక్రియలో విశేషమైన ప్రావీణ్యాన్ని సంపాదించి దక్కన్ రేడియోలో నరకాసుర వధ బుర్రకథను స్వయంగా ప్రదర్శించిన శతగ్రంథ కర్త, అర్ధ శత యక్షగాన రచయిత వీరు. బహుబాషా కోవిధులే కాక వీర ధవళ నవల, మంత్రశాస్త్ర గ్రంథాలెన్నో రాసిన ఈయన బట్టలమిల్లులో కూలిపనులు, బండిమీద కూరగాయలు అమ్మి చివరి వరకు ఆటుపోటులతోనే గడిపిన నిజమైన శ్రామిక కళాకారుడు.

అష్టావధాని చందాల కేశవదాస్‌ది మరో వినూత్న, విశిష్ట చరిత్ర. వైద్య విద్యతో ప్రజలకు చేరువై కవిగా, గాయకుడిగా, హరిదాసుగా, ఎన్నో సేవలను ప్రజలకందిస్తూ తన గురువు గారైన బాపట్ల లక్ష్మీకాంతయ్య గారితో కలసి యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలలో సంగీత ధార్మిక కార్యక్రమాలను మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టి అప్పుడు పాడిన ''పరబ్రహ్మ సచ్చిదానంద'' ఆ తరువాత ప్రతీ నాటకానికి ముందు పరబ్రహ్మ పరమేశ్వర ప్రార్థనగీతంగా మారింది. ఆ సాంప్రదాయం ఇప్పటికీ ఆనవాయితీగా వస్తుందంటేనే మనం అర్థం చేసుకోవాలి ఎంత గొప్ప పండితుడో ఆయన అని. మూడువేల పైచిలుకు ప్రదర్శనలు చేసిన 'కనకతార' పద్యనాటకం వ్రాసింది ఆయనే. అక్కినేని నాగేశ్వరరావు గారు, సత్యసాయిబాబా గారు ఈ నాటకంలో నటించారని చెప్తారు. సంస్కృతి టాకీస్ వారు ఈ నాటకాన్ని సినిమాగా తీస్తే సముద్రాల రాఘవాచారి గారు మాటల రచయితగా పరిచయం అయ్యింది అప్పుడే. కేశవదాస్ రాసిన భలే మంచి చౌకబేరము పాట 1935, 1958, 1966ల్లో ముగ్గురు తీసిన సినిమాల్లోను ఉంది. సతీ అనసూయ సినిమాకి కథ, మాటలు, పద్యాలు అన్నీ తానే. 1956లో చనిపోయిన కేశవదాస్ సమాధి నాయకన్ గూడెంలో అనామకంగా పడివుందని మీకు తెలుసా ?

నిమజ్జనం, ఊరుమ్మడి బ్రతుకులు సినిమాలతో ఎన్నో అంతర్జాతీయ వేదికలమీద తెలుగు సినిమా ప్రభంజనాన్ని సృష్టించిన బి.యస్. నారాయణ, అసిస్టెంట్‌గా, అసోసియేట్‌గా కె.యస్. ప్రకాశరావు, కె.బి. తిలక్, హెచ్.బి. బాబు దగ్గర పనిచేసిన అనుభవంతో 32 చిత్రాలకు దర్శకత్వ బాధ్యతల్ని నెరవేర్చి జాతీయస్థాయి ఉత్తమ చిత్రంగా ఊరుమ్మడి బ్రతుకును తీర్చిదిద్దిన సినీ దిగ్గజం ఆయన. నిమజ్జనం సినిమా ద్వారా ఊర్వశి శారదకు ఉత్తమనటి జాతీయ అవార్డును ఇప్పించ్చింది ఆయనే. జాతీయస్థాయి ప్రాంతీయ చిత్రంగా రికార్డును సృష్టించింది ఆయనే. షుగర్ వ్యాధితో కంటిచూపు కోల్పోయినప్పటికి ఆ నేపథ్యంతోనే 'తమసోమ జ్యోతిర్గమయ' డాక్యుమెంటరీ తీశాడు, మార్గదర్శి చిత్రానికిగాను, రాష్ట్రస్థాయి జాతీయ సమైక్యతా చిత్రంగా నంది అవార్డుతోపాటు, లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్‌నుకూడా సాధించుకున్న తెలుగు సినీ స్వాప్నికుడు ఆయన.

జ్వాలా!

ప్రతి మనిషి జీవితం ఒకదీపం లాంటిది. ఆ ప్రాణదీపంతో మరో మనిషి జీవితాన్ని వెలిగించాలే కానీ మండించ కూడదు. అజ్ఞానం అనే చీకటినుండి విజ్ఞానం అనే వెలుగుల్లోకి నడిపించేది ధర్మదీపమే. పగటికి దీపం అయిన సూర్యుడు, రాత్రికి దీపం అయిన చంద్రుడు మూడు కాలల్లోను మూడు లోకాల్లోను ధర్మమే దీపం అని సత్యమే జ్వాల అని చెప్పకనే చెబుతున్నారు. ఆ ధర్మ జ్యోతుల్ని వెలిగించడానికి, ఆ సత్య ప్రకాశాల్ని పంచడానికి నీవు నీ జీవితాన్ని అంకితం చెయ్యి.

చిన్నదీపం అనుకోకు అది చీకటిని కాల్చేస్తుంది. జనమేం చేస్తారనుకోకు జాతకాలు మార్చేస్తారు అన్నది మర్చిపోకు. ప్రజలే పాలకులు, ప్రజలే నిర్దేశకులు. నీ వృత్తి ధర్మాన్ని పీడితులైన ప్రజలకోసం ప్రజా సంక్షేమంకోసం వెచ్చించు. ఏ జంకు బొంకు లేకుండా, ప్రజా సేవకోసం మీ జీవితాన్ని అంకితం చేస్తావని భావిస్తూ... నిన్నెప్పుడూ ఆశీర్వదిస్తూ...

ఉంటాను మరి..

మీ

నానమ్మ

– నారాయణమ్మ

# అక్షరబ్రహ్మ

ఓనా ప్రియమైన సృజనకారుడా!

నలుగురు చూసిందే చూసి, నలుగురు చెప్పలేనిది చెప్పేవాడివి నువ్వు... మాకందరికీ తెలిసిన ప్రదేశాలే, దేశాలే, పుష్పాలే, అడవులే... కానీ మాకు తెలీని కొత్తకోణాన్ని, కొత్తగా చెప్పే సృజనాత్మకత నీకు మాత్రమే సొంతం... రోజూ మేము వాడుతున్న పదాలే... మాకు తెల్సిన అక్షరాలే... కానీ అవే అక్షరాలని, అవే పదాలని చక్కగా పేర్చి, కూర్చి, తీర్చిదిద్ది మాకు తెలీని, మేం చెప్పలేని ఎన్నెన్నో క్రొంగొత్త భావాలను పరిచయం చేసేది నువ్వే...

నిజం చెప్పనా కవీ! నీ అక్షరం ఒక నివేదన – నీ పదం ఒక సంవేదన. నీ వాక్యం ఒక ఆవేదన. నీ పద్యం ఒక ఆలాపన. మొత్తంగా నీ కవిత్వం ఓ జీవితాన్వేషణ ! అసలు నువ్వే ఒక శుభకామనవి. దైవ వాక్యానివి... ప్రజా మనోగతానివి... మానవ జాతి ఆకాంక్షల పతాకానివి ! ఆలోచనల సాంద్రత ఎరిగిన వాడివి నువ్వు... ఆర్ధ్రతల అర్థం తెలిసిన వాడివి నువ్వు... కవితల కల్పతరువువి నువ్వు... కరుణాంతరంగానివి నువ్వు.. పదాల ప్రయోగాలు నీకు తెల్సినట్టుగా ఏ భాషా తాంత్రికుడికి తెలియదేమో. అక్షరాల మనసు నీవెరిగినట్టుగా ఏ మాటల మాంత్రికుడూ ఎరగడేమో... ప్రకృతికి నచ్చే కృతులు నువ్వు గుర్తించినట్లుగా ఏ భావకుడూ చెప్పలేడేమో. మనిషి తత్వాన్ని నువ్వు పసికట్టినట్లు ఏ లేఖకుడు కృతి కట్టలేడేమో.

నిజం ! నీకున్నంత సాహిత్య స్ఫూర్తి, సమయస్ఫూర్తి, సభాస్ఫూర్తి, స్నేహస్ఫూర్తి నాకు తెల్సి ఏ మానవుడికీ వుండదు. భూమిని దైవంగా, మట్టిని మాగాణంగా భావించే నీకన్నా గొప్ప పూజారి ఎవరుంటారు చెప్పు. క్రాంతదర్శివి – మా మార్గదర్శివి నువ్వే కాబట్టి నీకే ఆరాధనగా ఈ ప్రేమలేఖ రాయాలన్పించింది.

నువ్వేమన్నా మామూలు మాలాంటి మనిషివా ఏమిటీ? విశ్వమానవుడివి, విశ్వ ఆరాధకుడివి, ప్రాంతాలు, భాషలు, దేశాలు అన్నీటికీ అతీతంగా వున్న విశ్వ ప్రేమికుడివి నువ్వు. నిజానికి విష్ణుమూర్తివి దశావతారాలు అని చెప్పారు కానీ నీ అవతారాల ముందు అవన్నీ తక్కువే కదా! ప్రపంచ దేశాల్లో ఎక్కడ ఏ స్థితి గమనించినా అక్కడి మూలాల్లో నీ అస్తిత్వాన్ని గుర్తు పట్టొచ్చు.

ఎప్పుడూ ప్రజాపక్ష పాతిగా నిలిచే నీకు ప్రజలెప్పుడు నీరాజనాలు పల్కుతూనే వుంటారు. పీడిత తాడితుల్ని తయారుచేయటంలో రాజ్యం పోషించే ద్వందనీతి సూత్రాల్ని వ్యతిరేకిస్తూ నిరంతరం పెన్‌గన్‌లతో పోరాటం చేసే ఉద్యమ కారుడివి నువ్వు. అసలు నువ్వే లేకపోతే... నువ్వే వాస్తవ స్థితిగతుల్ని రాయకపోతే ఈ ప్రపంచ సంఘర్షణలు ఇంత హృదయానికి హత్తుకునేవిధంగా, ఈ జగతి సంవేదన ఇంత ఆలోచనా స్ఫోరకంగా ఆవిష్కరించ బడేదంటావా ? ఈ లోకం ఇంత అందంగా ఇంత గొప్పగా వుండేదంటావా...?

నువ్వు దీపమైతే కవిత్వం వెలుగు. నువ్వు మేఘమైతే కవిత్వం వర్షం. నువ్వు వృక్షమైతే కవిత్వం పుష్పం. నువ్వు మనిషివైతే కవిత్వం మానవత్వం. భాషా పదాలన్నీ మాకు తెల్సినవే, కానీ పదబంధాలతో, ఉపమానాలతో metaphor, Simile లతో, భాషను సుసంపన్నం చేసిన నీకంటే ఎవరు ఎక్కువ భాషా సేవ చేస్తారు చెప్పు? కవిత్వానికి మానవీయతని, పరనీయతని, ఆదరణీయతని పెంచిందీ, పంచిందీ మీరే. మీరు చూపించే వెన్నెల్లో ఆడపిల్లల్ని నిజజీవితంలో ఊహించుకుంటూ, సెవెన్ ఏజెస్ ఆఫ్ మేన్‌ని తాత్వికంగా స్వప్నించుకుంటూ, జీవజలం చలాన్ని ఆవహింప చేసుకుంటూ, వస్తున్నాయ్ వస్తున్నాయ్ జగన్నాధ రథచక్రాలంటూ, నిరంతరం ఆశావాద దృక్పదంతో బ్రతికేసే వాళ్ళు ఎందరో ఉన్నారు.

కవిగా నువ్వు అంతర్లోకాల్లో చేసే నిరంతర ప్రయాణంతో పాటు బాహ్య ప్రపంచ శక్తులపై అవిశ్రాంత సమరం చేస్తుండటం వల్ల ప్రజాపక్షపాతిగా, ప్రతి పక్షపాత్రలో బ్రతుకు చిత్రాలతో రోజూ రణం చేస్తూ... భావోద్వేగ తోరణాలు అల్లుతూ వుంటావు కదా... సాగర సంచలనాలనీ, మట్టి పరిమళాన్ని, మల్లెల సుగంధాన్ని ప్రకృతి పరవశాన్ని, ప్రచండ సూర్య జ్వలనాన్ని అన్నిటినీ నీ కలంలో ఇముడ్చుకున్న మహాశక్తివంతుడవు నువ్వు. కెరటాలే ఊహలుగా, పవనాలే భావాలుగా, కొత్త చిగుళ్ళే వాక్యాలుగా, మెరుపు రేఖలే మాలగా, ఇవన్నీ కలగల్సిన కాల్పనిక జగత్తును కవిత్వంగా మలిచే అక్షరాల ఋషివి నువ్వు. అక్షరఋషివి నువ్వు. నవ్య పోకడలతో, దివ్య భావనలతో భవ్య భవిష్యత్ వెలుగుల వైపు ప్రజలకు దిశా నిర్దేశనం చేస్తూ సాగిపోయే ద్రష్టవు నువ్వు...

చారిత్రక అంశాల్ని నిరంతరం రికార్డ్‌చేసే చరిత్రకారులు కవులేగా. మీరుచేసే ప్రతీకావ్య సృష్టి మీకాలపు చరిత్రకు దిక్సూచి... కాకతీయుల కాలంనాటి క్రీడాభిరామం. రాయవాచకం అదే శ్రీ కృష్ణ దేవరాయుల కాలంలో దినచర్య నంతా రికార్డు చేసినట్లు చూపించిన పుస్తకం. అన్నీ మీ సృష్టే కదా... చరిత్ర నిర్ధారకులు... చరిత్ర దివిటీలు కూడా మీరేకదా కవీ! ప్రబంధాలని రాసి, పాండిత్యాన్ని పెంచి, రస హృదయాలకు ప్రమోదాన్ని అందించింది మీరే. ప్రేయసిని విపరీతంగా ఆరాధించి శృంగార కవితల్ని రాసిందీ మీరే. అష్టాదశ వర్ణనలతో సృష్టికి ప్రతిసృష్టి చేసి అలరించిందీ మీరే.

నిజానికి మీ కవులంతా లక్ష్మీ కటాక్షం విషయంలో ఎలా ఉన్నా సరస్వతీ దేవి దీవెనలతో మాత్రం మహా సంపన్నులే! మీకు తెల్సిన జ్ఞానాన్ని వాక్యాల పొట్లాలలో నింపి అందరికీ పంచే మహాదాతృత్వం మీదే! మీరిచ్చే సంపద వెలకట్టలేనిది. నిజానికి జాతి సంపద మీరు. దురాచారాల ధిక్కారిగా, ఖడ్గదారిగా పూర్ణమ్మను రాసిందీ మీరే, భవిష్యవాణిని ఎప్పుడూ ఇచ్చింది మీరే– నాస్ట్రడమస్ ప్రాఫెసీలలోని ఊహన, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానంలోని తాత్విక దార్శనికత మీ ప్రాపంచిక దృక్పథానికీ, సమ్యక్ వీక్షణకీ ఉదాహరణాలే కదా! పర్యావరణ కాంక్షివీ, ప్రజల హితకారుడువి నువ్వు – మట్టిని పూజించే వాడివి, నేలను ప్రేమించే వాడివి నువ్వే. ఎప్పుడైతే నీ నేలకు, నీ దేశానికి ఇబ్బంది కల్గిందో అప్పుడు నువ్వు మహోగ్ర జ్వాలవై లేస్తావు. అక్షరాగ్రుల్ని కురిపిస్తావు. అందుకే నువ్వు కవి సైనికుడివి.

బంకించంద్ర ఛటర్జీవై వందేమాతరంతో యావత్ జాతిని ఏకటాటి మీదకు తెచ్చావ్. రవీంద్రనాథ్ ఠాగూర్ జనగణమన గీతంతో ప్రజలలో జాగృతిని రగిలించావ్. దాశరథివై 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ కోట్ల మంది గుండెల్లో మట్టిపై మమకారాన్ని నిక్షిప్తం చేసావ్. గోరేటి వెంకన్న పల్లె కన్నీరు పెడుతుందో అంటూ ఆవేశాన్ని ఎగదోసావ్. అందెశ్రీ వై 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం' అంటూ యువతరాన్ని ఉద్యమం వైపు పరుగులు పెట్టించావ్.

కవీ, సృజన రవీ! బహురూపివి కదా నువ్వు... బహు అవతారాల సంకలనం కదా నువ్వు... హోమర్, వేదవ్యాసుడు, వాల్మీకి, కన్ఫూషియస్, కాళిదాసు, షేక్స్ స్పియర్, ఖలీల్ జీబ్రాన్, జాన్ కీట్స్, షెల్లీ, మిల్టన్, భీమ్‌సేన్ నిర్మల్, సుబ్రహ్మణ్య భారతి, మఖ్దుమ్ మొహిఉద్దీన్, ఇంకా ఎందరో... అందరూ నీ మానస పుత్రులేకదా. ఎంత గొప్ప చరిత్రలు మీవి...

ఒక్క జయ సంహిత, ఒక్క రామాయణం, ఒక్క భగవద్గీత, ఒక్క విక్రమార్జున విజయం, ఒక్క భారతం. ఇవన్నీ నీ మేధో సృజనలే కదా. ఇవన్నీ మన మూలాల్ని మనకే కొత్తగా పరిచయం చేస్తూ, ఎంతగా జాతిని జాగృత పరచాయో తెలుసా! ఒక్కో తరంలో నువ్వు ఒక్కోలా పుట్టి యుగకర్తగా కనిపిస్తావు. ఒకప్పుడు పంపన, జినవల్లభుడు, కవిత్రయంగా, మరొకప్పుడు పాల్కురికి సోమనగా, శ్రీనాథుడిగా, పోతనగా, కేతనగా మాలో ప్రత్యక్షమవుతావు. మొల్లగా, ముద్దుపళనిగా, పెద్దనగా, తెనాలి రామకృష్ణగా, నంది తిమ్మన్నగా సాక్షాత్కరిస్తావ్. ఇంకోసారి గురజాడ, శేషేంద్రశర్మ, తిలక్, గుర్రం జాషువ, కాళోజి, సావిత్రి, బైరాగిలా దర్శనమిస్తావ్..

కవీ! నిత్య మనోసంచారజీవీ..! తర్కశాస్త్రాన్ని అందించిన దిజ్నాగుడూ, షడ్దర్శనాలనూ అందించిన మహాజ్ఞానులు, ఆదర్శ వాదాన్ని ప్రతిపాదించిన ప్లేటో, ప్రాకృతిక వాదాన్ని బలపరచిన రూసో, ఉపయోగితా వాదాన్ని సమర్థించిన జెరిమీ బెంతామ్, గతి తార్కిక వాదాన్ని అందించిన హెగెల్, జిగీషా వాదాన్ని వినిపించిన నీషే, పరిణామ తత్వాన్ని వివరించిన డార్విన్, సైకో ఎనాలిసిస్‌ను వర్ణించిన ఫ్రాయిడ్, కమ్యూనిజాన్ని చాటిచెప్పిన మార్క్స్ ఎంగెల్స్, సత్యాగ్రహాన్ని చూపించిన మహాత్మాగాంధీ, సాంస్కృతిక విప్లవాగ్నిని రగిలించిన మావో, అనుభూతివాదం, కాల్పనికవాదం, వాస్తవికవాదం, అభ్యుదయవాదం, అధివాస్తవికవాదం, విప్లవవాదం, దిగంబరవాదం, చేతనావర్తం, అస్తిత్వవాదం, స్త్రీవాదం, మైనార్టీవాదం, దళితవాదం, అలా అలా తిప్పేసి, ఆఖరికి మానవతావాదమే నీ అభిమతంగా మార్చుకొన్న చైతన్యపు ప్రతినిధివి నీవు. ఎంతోమంది మానవజాతి దీపధారులకి ఏదో సందర్భంలో మీ వాక్యాలే స్ఫూర్తి... మీ వాక్కులే దీప్తి... మానవుడే నా సంగీతం, మానవుడే నా సందేశం అంటూ ఈ శతాబ్దపు పిలుపును పునరుద్ఘాటించింది మీరే కదా.

కబీర్‌దాస్, సూర్‌దాస్, తులసిదాస్, రచనల్లో ప్రవహించింది మనదేశ ఆధ్యాత్మిక చింతనే కదా. కర్నాటక సంగీత త్రయంగా పేరొందిన త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షుతులు, శ్యామ శాస్త్రి గార్లు ఇంకా అన్నమాచార్య, పురందర దాస్, మువ్వ గోపాల పదాలు రాసిన క్షేత్రయ్య, స్వాతి తిరునాల్, సర్వమానవ సమానత్వాన్ని అందించిన బసవేశ్వరుడు, శతకాలలో మానవ జీవన బహుముఖాలను తాత్వికంగా ఆవిష్కరించిన భర్తృహరి, బద్దెన్న, వేమనలు నీ విశ్వరూపాలే కదా. రాకమచర్ల వెంకటదాసు, కృష్ణమదాస్, హనుమద్దాసు, దున్న ఇద్దాసుల తత్వాలలో వెల్లువెత్తింది వాగ్గేయ వైభవమే కదా. ఆఖరికి కావ్యాలనికూడా దేవునికి మాత్రమే అంకితంచేసి నీలోని భక్తితత్పరతలో నిజాయితీని ప్రదర్శించావు. కష్టజీవికి రెండు పక్కలా నిలిచేవాడే కవి అంటూ మీరు 365 కోణాల్లో పీడిత తాడితుల్ని గమనిస్తూ ఆదిమకాలం నుండి అక్షరం నేర్చుకున్నప్పటి నుండి ఈనాటి ఆధునిక కాలం వరకు అన్నిటా ప్రజలకు అండగా నిలబడ్డవారు మీరు.

చిలీ దేశపు జాతీయ కవిగా 'పాబ్లో నెరుడా' పేరుతో 13వ యేటనే అధి వాస్తవికం, ప్రేమ, చారిత్రక, రాజకీయ నేపధ్యంతో రచనలు చేసి ప్రపంచాన్ని ఒక ఊపు ఊపింది మీ అంశే కదా... యంగ్ పొయేట్ అవార్డును అతిపిన్న వయసులో పొంది, చికాగో నల్లజాతి పునరుజ్జీవన ఉద్యమంతో కీలకపాత్ర పోషించిన మార్గరెట్ వాకర్ అమెరికా అంతర్యుద్ధ కాలంలో చిన్నాభిన్నమైన నల్లజాతి బానిస కథను 3 దశాబ్దాలపాటు రాసి అలెక్స్ హేలీ ఏడుతరాలకు ప్రేరణ నవలగా మాలచగల్గిందీ మీరే కదా.

జైలు జీవితాన్ని, గృహ నిర్బంధాన్నీ అనుభవిస్తూ కూడా శరణార్థుల పొలికేకగా పిలిచుకునే నిరంతర పోరాట పతాక మహమూద్ దర్విష్ వీ నువ్వేకదా. పాలస్తీనా రిబరేషన్ ఆర్గనైజేషన్లో కీలకంగా వ్యవహరించి తరువాత వైదొలగి ఎన్నో పత్రికల్లో పనిచేసి జనాలని జాగృత పరచింది నీ చేతనమే కదా...

బల్గేరియా దేశపు ప్రముఖ కవయిత్రిగా పేరొందిన బ్లాగా డిమిత్రోవా హక్కుల కర్యకర్తగా, జర్నలిస్ట్‌గా ఎన్నో సేవలుచేసి బల్గేరియాలో కమ్యూనిష్టు ప్రభుత్వ పతనం తర్వాత వైస్ ప్రెసిడెంట్‌గా ఆ దేశంలో ఎన్నికైన తొలి మహిళగా కీర్తిబావుటా ఎగరేయించింది నీ అక్షరమేగా...

పోలీష్ బాషలో రాసి నోబుల్ బహుమతిని గెల్చుకున్న లిథువేనియా వాసి 'జెస్లా మిలోజ్' ఆ తర్వాత అమెరికా పౌరసత్వాన్ని పొంది దౌత్యవేత్తగా, అనువాదకుడిగా పోలండ్ జాతి వ్యతిరేకిగా, క్యాథలిక్ మత వ్యతిరేకిగా ఎన్నోపోరాటాలు చేయటానికి సహకరించింది మీ కవిత్వపు బలమేగా...

చైనా నవీన వచన కవిత్వ దిక్సూచిగా పేరొందిన గు చెంగ్ ప్రవాసంలోకి వెళ్లిపోయి, తర్వాత అధ్యపకుడిగా పనిచేసి Misty poets గా క్రియాశీలకపాత్ర పోషించడంలో అంతర్గత బలాన్ని ఇచ్చింది నీ కవి కులమేగా... కావ్య పఠనాన్ని ఒక కళగా ప్రచారంచేసిన డిలాన్ థామస్ బి.బి.సి. రేడియోకి రచయితగా, సిని కథా రచయితగా చేసినప్పటికీ కవిత్వమే తన ఇజంగా బ్రతికిన ఆ పోరాటంలో గెలిపించింది నీ డి.యన్.ఏ.నే కదా !

ఉరుగ్వే దేశ కరెన్సీ నోటుమీద ముద్రింపబడ్డ ఆ దేశ జాతీయ కవయిత్రి 'జువానా డి ఇబర్ బరో' ఎంత పోరాటం చేసిందో. నాలుగుసార్లు నోబుల్‌కి నామినేట్ అయిన ఈ ఫెమినిస్ట్ కవియిత్రి, స్పానిష్ భాష కవులందరిలో అత్యంత ప్రజాధరణ పొంది తీవ్ర ప్రతిఘటనను జీవితాంతం ఎదుర్కొంటూనే ఆత్మగౌరవ పతాకంగా నిలిచింది.

ఆఫ్రికన్ సాహిత్యానికి చుక్కానిగా నిలచి మానవులందరి విషాదం ఒక్కటే అని నమ్మి నైజీరియా దేశం నుండి స్వాతంత్రంకోసం పోరాడిన బయాఫ్రా ప్రజలకు మద్దతుగా నిలచి, పీడిత ప్రజలకోసమే కవి పనిచేస్తాడనే నమ్మకాన్ని జనాల్లో కలిగించి బుకర్ ప్రైజ్‌తో పోరాటానికి సరికొత్త సొబగులు అందించిన ఉద్యమశీలి నీ నేస్తమే కదా...

అంతెందుకు రష్యన్ ప్రజలు అమితంగా ఆరాధించే అన్నా అక్మతోవా బ్రతికినంత కాలం తన రచనలపైన సెన్సార్‌షిప్‌నే ఎదుర్కొన్నప్పటికీ, నమ్మిన సిద్ధాంతానికి జీవితాన్ని అంకితం చేయడానికి ఉపయోగపడింది మీ కలం బలమేగా. తాను రాసిన ఒకే ఒక్క కవితతో నేషన్స్ ఫేవరెట్ పోయంగా బి.బి.సి. సర్వేలో ఇంగ్లీషు సాహిత్యపు స్మృతి కవితలలో విశేష ప్రాచుర్యాన్ని పొందిన మేరి ఎలిజబెత్ ఫ్రేమ్ ది ఎంత గొప్ప ఆర్ద్రగుణమో కదా.

యుద్ధ కవిగా అలన్‌సీగర్ రాసిన కవిత అమెరికన్ ప్రెసిడెంట్ జాన్ కెన్నడీకి అత్యంత ఇష్టమైనది అంటారు. ఆఖరి ఊపిరిని కూడా యుద్ధక్షేత్రంలో వదిలిన ఈ కవికి నివాళిగా ఫ్రెంచ్ ప్రభుత్వం ఒక వీధికి తన పేరు పెట్టుకోవటమే కాకుండా, రెండు ప్రతిష్టాత్మక అవార్డులను తన పేరు మీద ఇవ్వడమూ ఎంత గొప్ప సుకృతమో కదా.

అంతేనా, నువ్వు నిత్య అక్షరాగ్నిహోత్రుడివి... అక్షరానికి పాలుపట్టి పదం చేస్తావు... పదానికి అన్నంపెట్టి, వాక్యం చేస్తావు... వాక్యానికి అనుభవం ఇచ్చి కవిత్వం చేస్తావు... కవిత్వానికి జీవితాన్ని ఇచ్చి ఆయుధంగా మలుస్తావు. నీవు మహా స్రష్టవు... ఒక్క అక్షరం దొరికితే చాలు ఆకాశాన్ని సైతం భూమికి దించేంతగా ధైర్యాన్ని అందిస్తావు... మహా ఇతిహాసాలను లిఖిస్తావు... మానవాళికి దిశ నిర్దేశం చేస్తావు...

కానీ ఎందుకు కవీ! మీలో కొందరు దిగజారుడుతనాన్ని ప్రదర్శిస్తారు. దేవదేవుడి చేతనే పల్లకీలు మోయించుకున్నావు. చక్రవర్తిచేత కాలికి గండపెండేరం తొడిగించుకున్నావు. రాజులచేత కనకాభిషేకాలు చేయించుకున్నావు. ఊర్లకి ఊర్లే నీకు దక్షిణగా రాయించుకున్నావు. ఇప్పటికి అంతర్జాతీయ స్థాయిలో మేధో వికాస మూర్తిగా నోబుల్ ప్రైజులు పొందుతూనే వున్నావు. అయినా తృప్తి కలగలేదా...? కుతి తీరలేదా? మీలో ఎంతోమంది

కారాగారాల్లో మగ్గారు. ఊచకోత కోయబడ్డారు. చీకటి గదుల్లో సమాధి అయ్యారు. అయినా ప్రజల పక్షాన నిలబడి రాజ్యహింసకు వ్యతిరేకంగా గొంతెత్తి అరుస్తూనే ఉన్నారు. అయితే మీలో కొందరు కవులు ఎప్పటికీ సత్కారాలు, అవార్డులు, ఆర్థిక ప్రయోజనాలు అంటూ ప్రక్కదారులు త్రొక్కుతారు. పొగడ్తలలో దొర్లుతారు. చప్పట్లకి ఆశపడతారు. ఐక్యత లేకుండా బ్రతుకుతారు. కవీ! నీ వ్యక్తిత్వమే నీకు అందం. ఎన్నో జన్మల సుకృతం వల్ల ఓ మనిషి కవిగా మారతాడు. అత్యంత గౌరవాన్ని కల్గించే మేధావిత్వపు తొలకరి మొలకలు మీరు. కవికి మాత్రమే దొరికే అరుదైన గౌరవం ఏమిటో తెలుసా, ప్రజల నాల్కలమీద నిరంతరం నానుతూ వారి గుండెల్లో కొలువై వుండటం. వారి ధైర్యంగా నిల్చిగెలవడం. ఇది ఎందరికి సాధ్యమో చెప్పు.

నా విన్నపం, నా విజ్ఞప్తి ఒక్కటే. కప్పివుండే జీవన సంఘర్షణలని విప్పిచెప్పే మహా విద్యేదో నీకు మాత్రమే తెలుసు... కవిత్వం ఓ ఆల్కెమీ, దాని రహస్యం నీకు మాత్రమే తెలుసు... ప్రపంచం ఒక పద్మవ్యూహం, విశ్వం ఒక నిత్య చైతన్యం, మనిషి అంతరంగమొక నిగూఢ సౌందర్యం. వీటన్నింటి మూలసత్యం నీకుమాత్రమే తెలుసు. అందుకే నీ సృజనకు చరమగీతం పాడకు, నీ కల్పనకు సంకెళ్ళు వేయకు. యధేచ్ఛగా, స్వేచ్ఛగా నీ హృదయపక్షిని ఎగరనీయి. సరికొత్త ఆలోచనా వ్యూహాలను, భావసమూహాలను, భావనా వీచికలనూ ప్రసరించనీయి... నవ సమాజ నిర్మాణంలో దీపధారిగా ముందుకు నడిపించు. ఆరోగ్యకర సమాజాన్ని తిరిగి సృష్టించు...

వుండనా మరీ...

మీ అభిమాని...

– సంహిత

# 47. రాజ్యాంగం...

ఓ నా భారత రాజ్యాంగమా!

ఆప్‌కో బహుత్ బహుత్ ముబారక్ హో...

నువ్వు మాకొక కలవి. ఆ కలని సాకారంచేసి మా చేతుల్లో ఒక ఆచరణీయ గ్రంథంగా నిన్ను పెట్టిన మహనీయులందరికీ ముందుగా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. 70 ఏళ్ళుగా ఆటుపోట్లను తట్టుకుంటూ, ఎప్పటికప్పుడు సవరణ చేసుకుంటూ, దేశప్రజలందరికీ ఒకే విలువ, ఒకే ఓటు, ప్రాదేశిక నియోజక వర్గాలు, చట్ట సభలు, పరిపాలనా వ్యవస్థ, న్యాయ వ్యవస్థలను సమంగా చూసుకుంటూ, ఈ మౌలిక అంశాల ఆధారంగా నువ్వు రూపొందించబడ్డావు కదా. ఇంత గొప్ప బాధ్యతను భుజస్కంధాలమీద వేసుకొని బలమైన కేంద్రంగల సమాఖ్య రాజ్యాంగంగా స్వతంత్ర న్యాయ వ్యవస్థతో ప్రాథమిక హక్కులు, విధులు, నిర్దేశిక నియమాలతో నువ్వు ఠీవిగా నిలబడితే సెల్యూట్ చేయకుండా ఉండగలిగే దేశపౌరుడు కనిపిస్తాడా ?

1947 ఆగష్టు 27 నాడు రాజ్యాంగ ముసాయిదా కమిటీకి డా॥ బి.ఆర్. అంబేద్కర్ లాంటి జాతీయ వాది, మేధావి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఛైర్మన్‌గా ఎన్నుకోబడ్డప్పటి నుండి, నీ ప్రస్థానం ప్రారంభమయిందని అందరూ అనుకుంటారు కానీ దాని వెనుక వున్న మూలాల్లో ఎన్నెన్నో మేధోమథనాలు జరిగాయన్నది ఎందరికి తెల్సు చెప్పు.

ప్రపంచంలో ఉన్న రాజ్యాంగాల్లో అతిపెద్ద లిఖిత రాజ్యాంగం నువ్వు. నువ్వంటే ఒక కాగితాల పొట్లం కాదు. నువ్వు ఒక్కసారి చూసుకొని మర్చిపోయి ప్రక్కన పడేసే పుస్తకానివి అంతకన్నా కాదు. ఒక భగవద్గీత, ఒక ఖురాన్, మరో బైబిల్ అంత పదిలంగా, పవిత్రంగా దాచుకోవల్సిన పవిత్ర గ్రంథానివి నువ్వు. అంతెందుకు ప్రగతిశీల పరిరక్షణ చట్రానివంటూ పెద్దలెందరో నీకు కితాబులిచ్చారు. సమభావాన్ని, సమన్యాయాన్ని అందరికి సమంగా పంచే ఉన్నత శాసనానివి అంటూ నెత్తిమీద మోసారు.

ఎంతైనా నువ్వు నువ్వే రాజ్యాంగమా! నీతో సరిపోటీగా నిలబడగల సత్తాకాని, అర్హతగాని దేనికీ లేదు, రాదు. దేశ కాల మాన, గ్రహ గతుల్ని ఆద్యంతం పరిశీలించిన తర్వాతే నీ రూపకల్పన జరిగింది. అన్నట్టు మన తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ గారు నీ గురించి ఏమన్నారో తెలుసా ''చట్టం కంటే కూడా ఎంతో ఉన్నతమైన వాగ్దానం మీద నిలబడింది ఈ రాజ్యాంగం. జాతికి ఇదొక భద్రతాంగం. మనమంతా అంకితభావంతో దేశ నిర్మాణంలో పాల్గొనాల్సిన బృహత్ లక్ష్యాన్ని నిర్దేశించే శాసనం ఇది'' అని. విన్నావు కదా! ఎంతో విశ్వాసంతో మరెంత నమ్మకంతో నీ గురించి చెప్పారో! వారికే కాదు ఈ దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరికి నీ మీద అదే నమ్మకం. స్వేచ్ఛ, సమానత్వం నీకు

రెండు కళ్ళు. సౌభాతృత్వాన్ని మూడోకన్నుగా చేర్చుకొని నువ్వు ముక్కంటివి అయ్యావు. దేశం స్థిరంగా నిలబడటానికి కావలసిన మూడు మూల స్తంభాలు కూడా అవే నన్న సంగతి నీకు తెలుసుగా నా ప్రియమైన రాజ్యాంగమా...

ప్రజాస్వామ్య విలువలకి నువ్విచ్చే ప్రాధాన్యత వల్లే, ప్రపంచ దేశాల్లో గౌరవ ప్రతిష్ఠలు ఇంత గొప్పగా పొందగలుగుతున్నావు. ఎంతటి సంక్లిష్ట సమస్యకైనా నీ దగ్గర తగిన సమాధానం ఉండే విధంగా నిన్ను నీవు రూపొందించుకున్న తీరు గొప్పగా అనిపిస్తుంది. అందరికీ అభివృద్ధి, సంక్షేమం అందే విధంగా ప్రగతిశీల విధానాన్ని రూపొందిస్తూ ఆచరణలో సఫలీకృతం చెయ్యటానికి సాగుతున్న నీ ప్రస్థానం నాకు అసాధారణంగా తోస్తుంది. స్ఫూర్తిని కలిగిస్తుంది.

1947 ఆగష్టు 27 నుండి అంటే రాజ్యాంగ మూసాయిదా కమిటీ ఏర్పడినప్పటినుండి యన్. గోపాలస్వామి అయ్యంగార్, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, డాక్టర్ కె.యం. మున్షి, సయ్యద్ మహ్మద్, యన్. మాధవరావు, కృష్ణమాచారి.. ఇలా ఏడుగురు సభ్యులతో కమిటీగా రూపొందించబడ్డాక ఎన్నిసార్లు చిత్తు వ్రాత పతులు రాసుకున్నావో... అప్పటి 36 కోట్ల జనాల ఆకాంక్షలన్నీ నీమీదే పెట్టుకున్నారన్న ఒకే ఒక ధ్యేయంతో 60 దేశాల రాజ్యాంగాలన్నింటినీ పరిశీలించాక తయారైన అతిగొప్ప ఉద్గ్రంథంగా భారతదేశ తలరాతనే మార్చేశావు. మనిషి తలరాతను బ్రహ్మదేవుడు రాస్తాడన్నది ఎంత నిజమో, దేశ తలరాతని రాసిన విధాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అన్నది అంతే నిజం.

ఫ్రెంచ్ నుంచి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ ఆలోచనల్ని, సోవియట్ రష్యా నుంచి పంచవర్ష ప్రణాళికల ఆచరణలను, ఐర్లాండ్ నుండి ఆదేశిక సూత్రాల మౌళిక విశేషాలను, జపాన్ నుంచి సుప్రీంకోర్టు పని విధాన సరళిని పొంది, దక్షిణాఫ్రికా నుంచి రాజ్యాంగ సవరణ విధానాన్ని పుణికిపుచ్చుకున్నావు. అన్నట్టు నువ్వు మమ్మల్ని 5 విశేషాలతో సంభోదించావు. సార్వభౌమాధికార, లౌకిక, సామ్యవాద, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాంగంగా అవతరించావు. చూశావా అన్ని దేశాల్లోని అత్యుత్తమ విశేషాల సమాహారాంగా ఎలా రూపొందావో...

శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలతో ప్రతి పౌరుడు రాజ్యాంగ నైతికతను పాటించాల్సిన ధర్మాన్ని కలిగించిన సూత్రం నువ్వు. హక్కులకు మూలం విధులేనని పూజ్య బాపూజీ పదే పదే చెప్పేవారన్నది మన ఇద్దరం ఇక్కడ మరోమారు గుర్తుచేసుకుందాం. 1948 జనవరి నెలలో అదే ప్రాతిపదికన తొలి ముసాయిదాని విడుదల చేసినపుడు 7,635 సవరణ ప్రతిపాదనలు వచ్చాయట కదా రాజ్యాంగమా? ప్రజలెంత నిశితంగా నిన్ను గమనించారో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. దాంట్లోంచి అత్యుత్తమ మైనవిగా భావించిన 2473 సవరణల గురించి మళ్లీ వాద ప్రతివాదనలు పరిశీలించారని... 1949 నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్ నిన్ను ఆమోదించిందని అందరికీ తెల్సిందే. అయితే 284 మంది రాజ్యాంగ పరిషత్ సభ్యులు చేసిన సంతకాలు 1950 జనవరి 26 నుంచీ, నీ అమలుకు దోహదం చేసాయన్నది కొందరికే తెలుసు!

నీ రచనకి పట్టిన కాలం 2 సంవత్సరాల, 11 నెలల, 18 రోజులని, నీ రచనకు అయిన ఖర్చు 64 లక్షల రూపాయలని, హిందీ, ఇంగ్లీషులలో వ్రాయబడ్డ నీ మూల ప్రతుల్ని పార్లమెంట్ గ్రంథాలయంలో హీలియంతో నింపిన పెట్టెలలో బద్రపరిచారని, నీలో అందమైన చిత్రాలు గీసిన వ్యక్తి నందాలాల్ బోస్ గారని, ఆంగ్లప్రతిలోని పదాలసంఖ్య 1,17,369 అని, అందమైన దస్తూరితో ఇంగ్లీషులో నిన్ను రాసినవ్యక్తి ప్రేమ్ బిహరారీ నరైన్ రైజాడా అని చాలా తక్కువమందికి తెలుసు.

స్వాతంత్ర్య పోరాటంలో స్వేచ్ఛకోసం, సమానత్వ సాధనకోసం, స్వచ్ఛమైన జీవన విలువలకోసం ఎందరో త్యాగధనులు చేసిన బలిదానాల బలిపీఠాల నుండి ఆవిర్భవించిన ఆకాంక్షలు, ఆశలు, ఆశయాలను సాకారం చేయాల్సిన గురుతర భాధ్యత కమిటీమీద పెట్టారు నేతలందరూ. దేశం దేశమే ఆశగా చూస్తూవుంది రాబోయే

రాజ్యాంగం ఎలా ఉండబోతుందా అని. అలాంటప్పుడు రాజ్యాంగ ముసాయిదా కమిటీమీద ఎంత ప్రెజర్ ఉంటుందో కదా.

అయినా రాజ్యాంగమా!

దేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్రంత గొప్పది కదా నీ ప్రస్థానం–

1909 మింటోమార్లే సంస్కరణలు, 1919 నాటి మాంటెగ్ ఛెమ్స్ ఫర్డ్ సంస్కరణల పేరుతో భారత ప్రభుత్వ చట్టం ద్వంద్వ పరిపాలనను ప్రవేశపెట్టిన ఆంగ్లేయులు ద్విసభా విధానాన్ని అమలుచేసారు. దిగువ సభను లెజిస్లేటివ్ అని, ఎగువ సభను కౌన్సిల్ స్టేట్స్‌గా పేర్కొన్నారు. దానికే కొన్ని మార్పులు చేస్తూ 1935 నాటికి భారత ప్రభుత్వ చట్టాన్ని ఏర్పాటుచేసారు. బ్రిటీష్ ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం దీనికి మూలాధారంగా మారిందని నీకూ తెలుసుగా రాజ్యాంగమా... కమ్యూనల్ అవార్డు పరిణామం వల్ల ముస్లిమేతరులకు ప్రత్యేక నియోజక వర్గాలను కేటాయించడం, 1946లో ఏర్పాటు అయిన భారత రాజ్యాంగ పరిషత్‌లో బంగ్లాదేశ్, పాకిస్తాన్ భూభాగాల ప్రతినిధులుకూడా ఉండడాన్ని ఇక్కడ విశేషంగా చెప్పుకోవాలి.

రాజ్యాంగ పరిషత్తు మొత్తం సభ్యుల సంఖ్య 389, అయితే అందులో 208 మంది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ వారైతే, 73 మంది ముస్లింలీగ్ సభ్యులు వివిధ సంస్థానాలకు చెందిన ప్రతినిధులు 93 మంది చీఫ్ కమీషనర్ ప్రావిన్స్‌ల ప్రతినిధులు 4 ఇక ఇతర పార్టీల వారు మరికొందరు. అయినా బ్రిటీష్ పార్లమెంట్ భారత స్వతంత్ర చట్టాన్ని జూలై 5, 1947నే కదా ఆమోదించింది. జూలై 18న బ్రటీష్ రాచరికం ఆమోదాన్ని పొందాకే కదా ఈ చట్టం ఆగష్టు 15 నుంచీ అమలులోకి వచ్చి మనకు స్వేచ్ఛ దొరికింది. స్వేచ్ఛా, సమానత్వం అందరికీ సమాన అవకాశాలు అందించే లక్ష్యంతో నీవు 1950 జనవరి 26న రూపొందాక మాకెంతో ధైర్యం వచ్చింది సుమీ...

అలజడులు, అశాంతులు ఉన్నప్పుడు విప్లవాలు, విద్వేషాలు కూడా ఉంటాయి కదా. చిత్రమేమిటంటే నీ నిర్మాణ పరిశీలనలో అమెరికన్, ఇంగ్లీషు, రష్యన్, ఫ్రెంచ్ విప్లవాలను ఎక్కువగా పరిశీలించారట కదా. వాటినుండి నేర్చుకున్న గుణపాఠాల్ని తీసుకున్నారని మా సోషల్ టీచర్ చెప్పిన జ్ఞాపకం. అయినా రాజ్యాంగమా! 22 భాగాలు, 395 అధికరణలతో 8 షెడ్యూల్స్‌తో నువ్వు ఎంత పరిపూర్ణంగా ఉన్నావో తెలుసా.? ఇప్పుడు నీలో 25 భాగాలు 12 షెడ్యూల్స్ 465 అధికరణాలు, 5 అనుబంధాలతో సుందరంగా రూపుదిద్దుకున్నావు. దేశంకోసం రాజ్యాంగం అనుకున్నారు కానీ ఇది ఒక సరికొత్త నాగరికత కోసమని, జాతి పునర్‌నిర్మితి కోసమని ఎందరు గ్రహించారు చెప్పు?

అయినా నీకు తెలుసుగా! మనదేశం విభిన్నజాతుల, మతాల కలయిక. భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడగలిగిన నిత్యచేతనం మనదేశంలో మాత్రమే సాధ్యం. ఇలా ఏ దేశం కూడా ఉండదు. అలాంటప్పుడు అందరి మనోభావాలు దెబ్బతినకుండా అతి సున్నితంగా వ్యవహరించాల్సి ఉంటుంది కదా ఆ సమయంలో..పారదర్శకంగా చర్చించుకోవటం, వాద వివాదాలను స్వీకరిస్తూ సంప్రదింపులు జరపడం, మార్పుల్ని ఎప్పటికప్పుడు విసుగు లేకుండా చేస్తుండటం, ప్రక్కవారితో రాజీ పడుతూ సామరస్యంగా ప్రతుల్ని తయారుచేయడం ముసాయిదా సభ్యులకు మాత్రమే చెల్లింది. అన్నట్టు భూ సంస్కరణలు జరగాలని ఒకరు, ఎమర్జన్సీ అధికారాలు ఉండాలని మరొకరు, బలమైన కేంద్రం ఉండాలని ఇంకొకరు, పీ.డి. చట్టం ఉంటే శాంతి భద్రతలు ఉంటాయని కొందరు ఇలా ఎన్నెన్నో అంశాలు పరిశీలనకు తెచ్చారట కదా!

కేంద్రానికి రాష్ట్రాల సరిహద్దులు మార్చే అధికారం, కొత్త రాష్ట్రాలు ఏర్పాటుచేసే అధికారం ఉండటం వివాదగ్రస్తం అన్నారట కదా కొందరు. కానీ అవసరాలదృష్ట్యా భాషా పరమైన వైవిధ్యాల వల్ల కేంద్రానికి ఈ అధికారం అవసరమని భావించారట కదా ఎక్కువమంది. నువ్వు ఎదుర్కొన్న సమస్యలు సవాళ్లు బహుశ ఏ దేశపు రాజ్యాంగం ఎదుర్కొని ఉండదేమో. కేంద్రపాలిత ప్రాంతాల పునర్ వ్యవస్థీకరణ, ప్రాంతీయ అసమానతల్ని సరిచేసుకోవటం, రాష్ట్రపతి పాలన

విధించాల్సి రావడం, యస్.సి., యస్.టి., బి.సి. జాతీయ కమీషన్లకు భద్రత కల్పించడం, ఫిరాయింపు నిరోధక చట్టాన్ని పటిష్ఠం చేయడం, GST అమలు ఇలాంటివి ఎన్నో కదా! అయినా ఆస్తిహక్కును ప్రాథమిక హక్కుల జాబితానుండి తొలగిస్తూ చట్టబద్ధ హక్కుగా గుర్తించడంవల్ల నిన్ను నీవు గౌరవించుకున్నట్లుగా అయ్యింది. అన్నట్టు లోక్ సభ, శాసన సభ మొత్తం సభ్యుల సంఖ్యలో పదిహేను శాతం మించి మంత్రులు ఉండరాదని స్పష్టం చేయడం వల్ల, ఒక నిశ్చయాన్ని బలంగా కలిగించగలిగావు. అంతేకాకుండా నువ్వందించిన అతి గొప్ప అంశం భావప్రకటన స్వేచ్ఛ. ప్రతి పౌరుడు తన మనసులోని మాటను నిర్భయంగా చెప్పొచ్చు. ప్రభుత్వ ఆస్తులను రక్షించాలని సూచించటమే కాకుండా హింసకు దూరంగా వుండాలని హితవు పలికావు. అందరికీ సమాన అవకాశాలు కల్పించడం వల్లనే కదా ఇప్పుడు మేమంతా బాధ్యతాయుతమైన ఉద్యోగాలు చేయగల్గుతున్నాము. ఎంతో మంది మహిళలు, దళితులు, నిమ్న వర్గాల ప్రజలు ఎన్నికల్లో గెలిచి లోక్ సభలో, రాష్ట్ర శాసన సభలలో కూర్చోగలిగారు. ఇవన్నీ నీవు మాకు అందించిన వరాలే కదా.

అంతేందుకు ఈమధ్యనే జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కలిగిస్తూ చేసిన అధికరణం 370ను ఎత్తివేయటంతో పాటు లఢక్, కాశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చటం చెప్పుకోదగ్గ అంశమే. నాకు తెలిసినంత వరకు ఉస్మానియా విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ జి.బి. రెడ్డి గారు తెలియపరిచినంత వరకు 1788 నుంచీ ఇప్పటి వరకు అమెరికన్ రాజ్యాంగాన్ని 27 సందర్భాలలో మాత్రమే మార్చారు. ఆస్ట్రేలియా రాజ్యాంగాన్ని 1900 నుండి 8 సవరణలు మాత్రమే చేసారు. ఎప్పటికప్పుడు మారుతున్న ప్రజావసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా నిన్ను సవరించటం వల్ల ప్రజాస్వామ్యానికి, ప్రజాభీష్టానికి పట్టం కట్టినట్లైంది కదా.

ఇక నీలో నాకు బాగా నచ్చిన అంశాలు చెప్పనా... అదేశిక సూత్రాలను అగ్రభాగాన ఉంచడం, ఉమ్మడి పౌరస్మృతిని సాకారం చేయడం, అవినీతి కట్టడికి పటుత్వమైన వ్యవస్థను రూపొందించడం, సహజ వనరులను విచ్చల విడిగా తవ్వితీయకుండా పరిమితులు విధించడం, గనులు లైసెన్సులలో పకడ్బందీగా వ్యవహరించడం లాంటివి మచ్చుతునకలుగా చెప్పుకోవాలి. నాకెందుకో ఈ క్షణాన మొదటి రాష్ట్రపతి బాబా రాజేంద్ర ప్రసాద్ గారి మాటలు గుర్తొస్తున్నాయి ''ఎన్నికైన ప్రజా ప్రతినిధులు నిజాయితీ పరులైతే రాజ్యాంగంలో లోపాలున్నా వారి చర్యల వల్ల ఫలితాలు బాగా వస్తాయి. పాలకులు సమర్థులు కాకపోతే రాజ్యాంగం ఎంత గొప్పదయినా ఉపయోగం లేదు'' అని. కానీ నువ్వు ఎప్పటికప్పుడు నిన్ను నీవు నిరూపించుకోవడంలో.. ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో ఎప్పుడూ ముందదుగులోనే ఉండటాన్ని గొప్పగా చెప్పుకోవాలి. అందుకే కదా అంబేద్కర్ గారూ సామాజిక ప్రజాస్వామ్యమే పునాదిగా రాజకీయ ప్రజాస్వామ్యం పెరగాలని ఆశపడ్డారు.

అవును నీ గురించి కలలు కన్న అందరికంటే నిన్ను సాకారంగా మామధ్య నిలబెట్టిన నీ పెద్దకొడుకు రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్. అంబేద్కర్ నీ గురించి ఏమన్నారో తెలుసా ''భారత రాజ్యాంగం ప్రత్యేకత ఏమిటీ అని ఎవరైనా అడగొచ్చు. ప్రపంచ రాజ్యాంగాల్ని పరిశీలించిన తరువాత ప్రధాన నిబంధనలు అన్నింటిలో ఒకేలా అనిపించాయి. కాని వివిధ రాజ్యాంగాలలోని లోపాలను సవరించి మన దేశ అవసరాలకు అనుగుణంగా మనం మార్చుకోగలిగాము'' అంటూ సగర్వంగా ప్రకటించారు. నిజమే! మారుతున్న పరిస్థితులకి అనుగుణంగా దేశ కాలమాన పరిస్థితులకు అనుకూలంగా రాజ్యాంగ మౌలిక లక్ష్యాలకు భంగం కలగకుండా ఇప్పటివరకు 103 సార్లు నిన్ను సవరించారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన వర్గాల సంక్షేమంకోసం 1951లో తొలిసారిగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్యా ఉద్యోగ అవకాశాలలో పదిశాతం రిజర్వేషన్ కల్పిస్తూ, ఈ ఏడాది జనవరిలో మలిసారిగా సవరణలు జరగటం వలన నీవు మరింత పటిష్టంగా తయారు అయ్యావు.

నెహ్రూ హయాంలో జమీందారీ వ్యవస్థ రద్దుకు, రాష్ట్రాల భాషా ప్రాతిపదికన పునర్ నిర్మించటానికి ఈ సవరణలమీదే ఆధారపడటం గొప్ప విశేషంగా చెప్పుకోవాలి. నీ ఆలోచనలో ఎప్పుడయితే న్యాయ వ్యవస్థ దృఢంగా

నిలబడిందో అపుడే ప్రజాస్వామ్య విజయం ప్రారంభమయ్యింది. రాజ్యాంగ లౌకికత్వం అన్నది ప్రభుత్వానికి, న్యాయస్థానాలకి మాత్రమే సంబంధించింది మాత్రమే కాకుండా ప్రజల్లో ప్రజాస్వామ్యం పట్ల బలమైన విశ్వాసాన్ని కలిగించ గలిగావు. తద్వార నీపట్ల విధేయత మరింత పెరిగిందని నేను భావిస్తున్నాను.

అభిప్రాయ బేధాలను ప్రక్కనపెట్టి రాజ్యాంగ విశిష్టతను గౌరవిస్తూ, రాగద్వేషాలకు అతీతంగా రాజ్యాంగ నిర్మాతలు శ్రమించారు కాబట్టే నీవు మాకు దక్కావు. వారికి భారత జాతి ఎప్పటికీ రుణపడి ఉంటుంది. మొత్తానికి 1949 నవంబర్ 26న రాజ్యంగ పరిషత్ ఆమోదించిన దానికి గుర్తుగా భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నవంబర్ 26న నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం తలపోయడం నిజంగా గొప్ప విశేషం. ఎంతైనా నువ్వు మా ఆరాధనీయ ఆచరణీయ గ్రంథానివి. నీవే కాదు నిన్ను ఇంత గొప్పగా తీర్చిదిద్దిన రాజ్యాంగ రచయితలకు కూడా సాగిలపడి నమస్కరించవలసిన తరుణం ఇది.

130 కోట్ల భారతీయుల ఆశాజ్యోతిగా నువ్వు మా అందర్ని సమంగా నడిపిస్తున్న తీరు అద్వితీయం. ప్రతి విద్యాలయంలో రాజ్యాంగ అవతారికను మననం చేసుకోవాలని ఈ సంవత్సరం నుండీ దాన్ని అమలుకోసం ఆలోచిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఈ ఏడాది నువ్వు 70 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సంధర్భంగా విశేష కార్యక్రమాలను ఏడాది పొడుగునా రూపొందింప చేసుకోవటం కూడా గొప్ప విశేషమే. తద్వారా నీ పట్ల మరింత అవగాహన పెంపొందించబడుతుందని మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మన రాష్ట్రపతి గౌరవనీయులు రామ్‌నాథ్ కోవింద్ గారు ఏమన్నారో తెలుసా ''ప్రాథమిక విధులు, హక్కులు నాణానికి రెండు వైపులు. ప్రతి పౌరుడు ఆత్మ పరిశీలన చేసుకొని రాజ్యాంగ నిర్మాతలు చాటిన స్ఫూర్తిని ప్రతిబింబింప చేసేలా మరొక్కమారు మనం పునరంకిత మౌదాం. సమస్యలన్నీ పరిష్కరించే శక్తి కేవలం రాజ్యాంగానికి మాత్రమే ఉందని, రాజ్యాంగ పరిధులకు లోబడి మన చర్యలు ఉన్నాయా లేదా అన్నది ప్రతి పౌరుడు పరిశీలించు కోవాలని'' సందేశాన్ని అందించారు.

అంతెందుకు ఉప రాష్ట్రపతి శ్రీ వెంకయ్య నాయుడు గారు కూడా ప్రస్తుతం ఉన్న వ్యవస్థలను వ్యక్తిగతంగా ఎలా సంస్కరించవచ్చో ఆలోచిస్తూ, మన పనితీరు ప్రపంచ దేశాలలో అన్నిటికంటే అత్యుత్తమంగా ఉండాలని, బాధ్యతల్లోంచి హక్కులు, విధులు వస్తాయని జాతి నిర్మాణం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని పౌరులందరూ సమాన భాగస్వామ్యులని తెలియజేసారు. భారత ప్రధానమంత్రి గౌ॥ నరేంద్ర మోదీ గారు మాట్లాడుతూ 'చాలా యేళ్లుగా మనం హక్కులు గురించి మాత్రమే మాట్లాడుతున్నాము. ఇప్పుడు బాధ్యతల గురించి మాట్లాడాల్సిన సమయం వచ్చింది'' అన్నారు. లోకసభ స్పీకరు ఓం బిర్లా గారు కూడా రాజ్యాంగబద్ధ విధుల్ని నిర్వహించటంలో పార్లమెంట్ సభ్యులు జనాలకి ఆదర్శంగా నిలవాలని కోరారు.

''భారత ప్రజలమైన మేము'' అని సగర్వంగా చెప్పుకునే ప్రతి భారతీయుడు నీకు విధేయుడే. మా విన్నపమల్లా ఒక్కటే. పౌర హక్కులు అందరికీ దక్కాలి. బాధ్యతలు అందరూ కలసి పంచుకోవాలి. అవినీతి కలుపును కూకటివేళ్లతో ఏరిపారేయాలి. లంచం లేని రాజ్యాన్ని మేము చూడాలి. అందుకు నీ ఆశీస్సులు.. నీ ఆచరణీయ విలువలు మా కెప్పటికీ కావాలని కోరుకుంటూ మరొక్కమారు నీకు అభినందనలు తెలియజేస్తూ

వుంటాను...

నీ

అభిమాని

– శ్రీవల్లి

# ప్రమాదాలు...

ఓ నా అంబులెన్స్!

ఒకప్పటి ప్రేమనగరం కాస్తా ఇప్పుడు ప్రమాదాలకీ, అత్యాచారాలకి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయిందేమిటి! దినదినగండం... అగ్నిసుడిగుండం అన్నట్టుగా తయారయ్యింది. ఇంటినుండి బయట కాలు పెడితే చాలు తిరిగి ఇంటికి వస్తామన్న నమ్మకంమాత్రం ఉండటం లేదు. ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఏ పేపర్ తిరగేసినా రక్త సిక్తమైన రహదారులే. ఏ ఛానెల్ చూసిన బ్రేకింగ్ న్యూస్ అంటూ భీభత్సమైన సన్నివేశాలే. ఐటి క్యారిడార్లు క్రైం కార్నర్లుగా మారుతున్నాయి, పిల్లర్లు. కిల్లర్లైపోతున్నాయి. ఫ్లైఓవర్లు పై లోకాలకి పాస్‌పోర్టులు జారీచేసే ఎంబసీలుగా మారిపోయాయి. ఇన్నిటి మధ్య నీకసలు రికమే ఉండటంలేదు కదా.

నిజం చెప్పు! ఏ కాలనీలో కానీ, ఏ కంట్రీలోకానీ, ఏ దేశములోకానీ నువ్వు తిరగని రోడ్డు ఉందంటావా... బోయ్.. బోయ్.. మంటూ నీ హారన్ వినిపిస్తేచాలు అది బోర్ బోర్ మంటూ ఏడుస్తున్నట్లుగా అనిపిస్తుందని, కాళ్లలోని వణుకు కళ్లలోకి పాకుతుందని అంటారు కొందరు. కానీ నాకేమో నీవు కన్పిస్తేచాలు చేతులెత్తి మొక్కాలనిపిస్తుంది. ఎవరింట్లో ఏ మృత్యుగంట వినబడబోతుందోనని ఆ కుటుంబం పట్ల సానుభూతి కలుగుతుంది. అర్థాంతరంగా అవిటితనం సంభవిస్తే, ఆ నరకయాతనను కుటుంబానికి కుటుంబాలే భరించాల్సి రావడం బాధల్లోకెల్లా పెద్దబాధగా అనిపిస్తుంది. నువ్వు లేకపోతే, నువ్వే సకాలంలో రాకపోతే ఎందరి ప్రాణాలు గాలిలో కలసిపోతాయో కదా. నువ్వే ఆదుకోకపోతే ఎన్ని కుటుంబాలు వేదనతో అల్లాడిపోతాయో కదా.

నిజమే! దేశాభివృద్ధి రవాణా సౌకర్యాలమీదనే ఆధారపడివుంటుంది. దేశమెంతగా శాస్త్ర సాంకేతికతను ఉపయోగించుకొని ముందుకు వెళుతోంది అన్నదానిమీదనే మన ఆర్థిక పరిపుష్టి కేంద్రీకృతమవుతుంది. 150 యేళ్ల క్రితమే హైదరాబాద్ కి రైలు రవాణా ఏర్పాటు అయ్యింది. బస్సులు, బండ్లు, సైకిళ్లు, ఆటోలు, ఇప్పుడు క్యాబ్‌లు... ఒకటేమిటి ఎప్పటి అవసరాలకి అనుగుణంగా అప్పుడు మారుతూ వస్తూనే వున్నాం. కానీ వాహనాలు ఎన్ని పెరిగాయో, ప్రమాదాలూ అన్నే పెరిగాయి. నువ్వు వచ్చాక మాకు కాస్త రిలీఫ్ దొరికింది అనుకో. మొన్నామధ్య కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ 2018 గణాంక వివరాలను, రోడ్డు ప్రమాదాల నివేదికను విడుదల చేసింది. విస్మయానికి గురి అయ్యాము తెలుసా. తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఒకటి, రెండు స్థానాలు ఎప్పటి మాదిరే పంచుకున్నాయి. ప్రమాదాలలో మన తెలంగాణ స్థానం ఎనిమిదోదైతే, మరణాలలో 10వ స్థానాన్ని ఆక్రమించుకున్నాం. ఈ మాట చెపుతుంటే గుండె బావురుమంటూంది మిత్రమా.

నిజానికి 22,230 రోడ్డు ప్రమాదాలకి నువ్వే సాక్షివికదా. జాతీయ రహదారుల మీద 2,064 ప్రమాదాలు జరిగితే, రాష్ట్ర రహదారుల మీద 1,165 ప్రమాదాలు జరిగినాయా? ఈ సంవత్సరం మన రాష్ట్రంలో 6,603 మంది

ప్రమాదాల వల్ల చనిపోయారా? ఇందులో అత్యంత దురదృష్టకరంగా మన భాగ్యనగరంలోనే 2,846 మంది చనిపోవటం విషాదకరం. ర్యాష్ డ్రైవింగ్, మితిమీరిన వేగంతో ప్రయాణించడం రాంగ్ రూట్లో వెళ్లడం, మద్యం త్రాగి వాహనం నడపటం, సెల్ మాట్లాడుతూ డ్రైవ్ చేయటం ఇవన్నీ కూడా ప్రమాదాలకు కారణాలే. అత్యంత విషాదం ఏమిటంటే ఎవరో చేసిన తప్పులకి అమాయకులు బలికావడం. నీకూ అలాగే అనిపిస్తుందా నా అంబులెన్స్ మిత్రమా!.

మొన్న చూశావుగా అతివేగంతో దూసుకువచ్చిన కారు ఫ్లై ఓవర్ పై నుండి క్రింద బస్సు కోసం ఎదురుచూస్తున్న మహిళమీద పడి ఆమె మరణానికి కారణం కావడం ఎంత దురదృష్టకరం చెప్పు. అలా అనుకోకుండా జరిగే ప్రమాదాలవల్ల 4,977 మంది క్షతగాత్రులు కావటం ఎంత దారుణం? దేశంలో సగటున గంటకి 55 ప్రమాదాలు జరుగుతుండడం విషాదమైతే అందులో 17 మంది సగటున చనిపోవటం మరీ విషాదం.

రోజుకు సగటున దేశంమొత్తంమీద 400 మంది అర్థాంతరంగా మరణిస్తున్నారట. ఇప్పుడే వస్తానంటూ ఇంటి నుండి బయటకి వెళ్లిన మనిషి ప్రాణాలు పోగొట్టుకొని శవంగా రావడం ఎంత హృదయ విదారకమైన సంఘటననో ఊహించుకో. అయినా ఈ మెలిత్రిప్పే దుర్ఘటనలకి, కారణాలు నీకు తెలిసినంతగా నాకు తెలియకపోవచ్చు. ఎందుకంటే నీవు మా ఆపద్ధర్మ నేస్తానివి. చెప్పు అంబులెన్స్ ఇవి మానవ తప్పిదాలా లేక వ్యవస్థ లోపాలా? సూసైడ్ బాంబర్లవంటి మద్యపాన ప్రియులవల్ల అమాయకులెందరో విగత జీవులు అవుతున్నారని అందరికీ తెలుసు. మరి మద్యపానాన్ని నిషేధించగలుగుతున్నామా? అని నీవు అడగాలనుకుంటున్నావా? నిజమే. ఆ దిశగా అందరూ ఉద్యమిస్తే ప్రమాదాలే కాదు, అత్యాచారాలు కూడా తగ్గుతాయని నాకు అనిపిస్తోంది.

MMTS ప్రస్తుతం 45 కిలోమీటర్ల మేర రెండు మార్గాల్లో అందుబాటులోకి వచ్చింది. ఇక మెట్రో రైలు అంటావా! 56 కిలోమీటర్ల పరిధిలో సేవలు అందిస్తూనే ఉంది. ప్రతి 5 నిమిషాల కొకసారి బస్సులు తమ సేవలు అందిస్తూనే ఉన్నాయి. అయినా జనాలు తమ తమ ప్రయివేట్ వాహనాల్లో వెళ్ళడాన్నే ఇష్టపడుతున్నారు. ఒకప్పటి ''బాగ్''ల మయమైన హైదరాబాద్‌లో ఇప్పుడు ఎక్కడ చూసిన ''జామ్''ల మయమే. దాంతో జనాలలో అసహనం, సకాలంలో ఇళ్లు చేరకపోవడం, రూల్స్ కేవలం ఫూల్స్ కోసమేనంటూ ట్రాఫిక్ రూల్స్‌ని పాటించకపోవటం ఇలాంటివన్నీ ప్రమాదాలకు కారకాలే కదా. అయినా మిత్రమా వాహనాలమీద ఉన్న క్రేజ్ ప్రాణాలమీద కూడా చూపించుకోవాలి కదా మా మానవాళి! ఎందుకు ఇంత నిర్లక్ష్యం వహిస్తున్నారంటావు ?

ప్రమాదాల సూచీని గమనిస్తే నవయవ్వనులే ఎక్కువగా ప్రమాదాలకి గురి అవుతున్నారు అని తెలుస్తుంది. తాజా లెక్కల ప్రకారం 37 యేళ్లలోపు వయసు ఉన్నవారు దాదాపు 1850 వరకు ఉన్నారట. వాహనాల్లో అత్యధిక మరణాలు ఆటో ప్రమాదాలవల్లే సంభవిస్తున్నాయట. 4990 మంది ఆటో ప్రమాదాల వల్ల మరణించారంటేనే మనము అర్థం చేసుకోవాలి అదెంత ప్రమాదకరమో! చట్టాలు ఎన్ని ఉన్నా, నిరంతరం పోలీస్ పర్యవేక్షణలో జరుగుతున్నా, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తున్న వారు 571 మంది పట్టుపడటం ఎంత దారుణం. 2015 నుంచి ఇప్పటివరకు 22వేలు దాటిన ప్రమాదాల సూచీని గమనిస్తే 90 శాతం మరణాలకి కారణం అధిక వేగమేనని రుజువయ్యిందంటే అందుకు కారణం యువతరం యొక్క బాధ్యతారాహిత్యమేనని మనం అర్థం చేసుకోవాలి.

మనం గమనించాల్సిన అతి గొప్ప అంశమేమిటంటే, ప్రమాదాలు ఎక్కువగా జరిగే సమయాలు తెల్లవారి 3 నుండి 6 గంటలు, రాత్రి 6 నుండి 9 గంటలు అంతెందుకు, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నవాళ్లు 15,798 మంది అక్టోబర్ వరకూ పోలీసులుకు దొరికారంటేనే మనం అర్థం చేసుకోవాలి జనాలెంత నిర్లక్ష్యంగా ఉన్నారో... ఫోన్ మాట్లాడటం వల్ల భావోద్వేగాలకు గురిఅవుతామని, ఒత్తిడి పెరుగుతుందని, డ్రైవింగ్ మీద ఏకాగ్రత కుదరదని ఎన్నిసార్లు ప్రభుత్వం పదేపదే హెచ్చరించినా, మనం పెడచెవిన పెడుతూనే ఉన్నాం.

ప్రత్యక్షంగా ప్రమాదం ఒక్కరికే కాని పరోక్షంగా దానివల్ల బాధపడేవారు, బలయ్యేవారు ఎన్నో కుటుంబాలు ఉన్నాయి. ఇంట్లో ఆర్జించే వ్యక్తి అర్ధాంతరంగా మరణిస్తే ఆర్థికంగా కుటుంబం చిన్నాభిన్నం అవ్వటమే కాకుండా కోలుకోలేని దెబ్బతింటుంది. ఒక వ్యక్తి తప్పిదం పదిమందికి శాపంగా మారుతుంది. ముఖ్యంగా పాదచారులు, బైక్ వాళ్లు ఎక్కువగా సెల్‌ఫోన్ ప్రమాదాలకి గురవుతున్నారు. దీనివల్ల 25 మంది బైకర్లు చనిపోతే, 365 మంది పాదచారులు ప్రాణాలు కోల్పోయారట కదా! అయినా అంబులెన్స్ ప్రమాదాలబారిన పడినవారు రక్తపు మడుగులమధ్య కొట్టుకుంటుంటే, నువ్వే కదా అమ్మ ఒడిలా భద్రంగా వారిని అక్కున చేర్చుకుంటావు. ఆత్మీయంగా సేవలు చేస్తావు. బాధను తగ్గించే ఏర్పాట్లను చూస్తావు. నీవే కనుక లేకపోతే మరణాలు మరింతగా పెరిగేవి. నీ హృదయ విశాలతకి మేమంతా రుణపడి ఉన్నాము.

నగరంలోని రోడ్లు 9,100 కిలోమీటర్లయితే వేగ నిరోధకాలు 5,000 వేల వరకు ఉండటం కూడా ప్రమాదకరమే అంటున్నారు సాంకేతిక వర్గాలు. ఇందులో ప్రమాణాలకు వ్యతిరేకంగా ఉన్నవి 95% అట. ఎవరికి ఇష్టమొచ్చినట్టుగా వారు స్పీడు బ్రేకర్లను నిర్మిస్తున్నారు. దీని మూలంగా వాహనాల షాక్ అబ్జర్వర్స్ దెబ్బతినటమే కాక నాడీ మండల వ్యవస్థకూడా ప్రమాదాలకి గురవుతుంది. నిజానికి రంబుల్ స్ట్రిప్స్ అంటే అడుగు వెడల్పుతో 8 వరుసల్లో అర అంగుళం ఎత్తున తెలుపు గీతల్ని గీయటం, వీటిని ఆధునికంగా స్పీడ్ బ్రేకర్స్‌గా వాడుతున్నారు. కాని మన కాలనీలలో సిమెంట్‌తోనో, ఇనుముతోనో కట్టడం వలన ఎక్కువ ప్రమాదాలు జరుగుతూ ఉన్నాయి.

నీకు తెలియదు కాబోసు కానీ, ఆదిమకాలంలో ఎస్కిమోలు మంచు మీద కుక్కలులాగే స్లెడ్జి బండ్లపైన ప్రయాణం చేసేవారు, నార్వే దేశీయులు రెయిన్ డీర్ బండ్లమీద, అరేబియన్లు ఒంటెలమీద ప్రయాణాలు చేసారు. ఆధునిక వాహక చరిత్రకు శ్రీకారం చుట్టింది సుమేరియన్లు మొదట బండి చక్రాలు కనిపెట్టినాకే కదా.

ఇది క్రీస్తు పూర్వం 3 వేల సంవత్సరాల నాడే అయినా 12వ శతాబ్దం తర్వాత చక్రాల బండ్లు విరివిగా వాడకంలోకి వచ్చాయి. క్రీ॥శ 1500లో హంగేరియన్స్ నాలుగు చక్రాల పెద్ద లాగుడు బండిని తయారు చేసాక ప్రపంచ ముఖచిత్రమే మారిపోయింది. రిక్షాలు, సైకిల్స్ విరివిగా జనాలు వాడటం ప్రారంభించారు. 1840లో కె.కె. ప్యాట్రిక్ మ్యాక్ మిలన్ స్కాట్లాండ్ వాసి సైకిల్ని తయారుచేస్తే, 1883లో ఇంగ్లాండువాసి స్టార్లే దాన్ని ఆధునీకరించాడు. డైమ్లెర్ అనే జర్మనీ వాసి సైకిల్‌కి చిన్న ఇంజను అమర్చి మోటర్ సైకిల్‌ను తయారుచేసాడు.

అంబులెన్స్! ఇన్ని వాహనాలని మనిషి మేధ మానవుడి సౌకర్యంకోసం, సుఖ జీవనం కోసం తయారుచేసింది. కానీ మనిషి చాంచల్యం ఆ వాహనాలతోనే చితిపేర్చుకుంటోంది. నువ్వు ఆశ్చర్యపడే ఒక విషయం చెప్పనా, కారుని ప్రారంభించింది మొదలు పూర్తయ్యేవరకు 8వేల సార్లు పరీక్షిస్తారట. అయిన్నప్పటికీ కారు వాడకంలోకి వచ్చాక ఇప్పటి వరకు 3 కోట్ల పై చిలుకు జనాలు చనిపోయారట. ప్రపంచవ్యాప్తంగా ప్రతియేటా 2 లక్షలమంది చనిపోతుంటే, లక్షకుపైగా క్షతగాత్రులు అవుతున్నారు. ఇంతకీ మొదటి కారు ప్రమాదం ఎప్పుడు జరిగిందో తెలుసా 1899 సం॥లో. భూమి మీద ప్రమాదాల గురించి మాట్లాడుకుంటున్నాం కానీ, సముద్రంలో జరిగే ప్రమాదాలు అత్యంత విషాదకరమైనవి కదా. అవన్నీ సామూహిక ప్రమాదాల శవయాత్రలే. 1912లో అట్లాంటిక్ సముద్రంలో ఓడ మునిగినప్పుడు 1,517 మంది చనిపోయారు. 1945లో బాల్టిక్ సముద్రంలో విల్హెల్మ్ మునిగినపుడు 4వేల 125 మంది చనిపోయారు. ప్రతి సంవత్సరం 350 నుండి 400 వరకు పెద్ద నౌకలు సముద్రంలో మునిగిపోతూనే ఉన్నాయి. ఇక విమానాల సంగతి చెప్పాల్సిన పనేలేదు.

నీ గురించి నీకు చెప్పటం అని కాదు కానీ 1487లో స్పానిష్‌లో నిన్ను మొదటిసారిగా ఉపయోగించారట కదా. నెపోలియన్ ఆర్మీలో ఉండే చీఫ్ సర్జన్ నిన్ను కాస్త మార్చుకొని, యుద్ధంలో గాయపడిన పెద్ద పెద్ద ఆఫీసర్లకోసం నిన్ను సాంకేతికంగా తయారు చేసుకున్నారు. అన్నట్టు అంబులెన్స్ నీ మీద నీ పేరును ఉల్టాగా రాస్తారేమిటి? తలకిందులుగా

పుట్టిన మనుషులకి త్వరగా అర్థమవదులే అనా? కాదులే. కుంభాకార, పుటాకార కటకాల గురించి సైన్స్‌లో చదువుకున్నాములే. ఎదుటి అద్దాల్లో సక్రమంగా కనిపించటానికే కదా!

అన్నట్టు నీకు బాగా తెలుసుగా అంబులెన్స్! ప్రమాదానికి గురియైన బాధితులకి తొలి గంటలోనే చికిత్స అందటం ఎంత అవసరమో, అందుకనే కదా దానిని గోల్డెన్ అవర్ అంటారు. ప్రమాదం జరిగిన వెంటనే 108 కి కాల్ చేయండి అంటారు. ఆ కాలంలో తెల్లటి రంగుతో పరుగున పరుగున వచ్చే నీవు మాకు దేవదూతలాగ కనిపిస్తావు. తప్పిపోయిన బిడ్డని పొదువుకునే తల్లిలా ఆత్రంగావచ్చి, గుండెల్లో పెట్టుకుంటావు చూడూ. అపుడు నాకెంత సంతోషం కలుగుతుందో. నీవు వచ్చావుగా చూసుకుంటావులే అన్న భరోసాతో ధైర్యంగా వుంటాను.

మిత్రమా అంబులెన్స్! కావాలని ప్రమాదాలు చెయ్యకపోయినా బాధితులు చనిపోతే నిందితులకి 2 సం॥ల జైలుశిక్ష జరిమానా విధిస్తున్నారని నీకు తెలుసా. అయితే సరైన ఆధారాలు పోలీసులు చూపించక పోవటంవల్ల నిందితులు తప్పించుకోగలుగుతున్నారు. కొన్ని కేసులు వీగిపోతున్నాయి. ఉద్దేశ్యపూర్వకంగా ఘటనకి కారకులయితే, యావజ్జీవ కారాగార శిక్ష కూడా విధించవచ్చు. అన్నింటికంటే విషాదం ఏమిటంటే కోర్టులో ఉన్న పెండింగ్ కేసుల వల్ల, కేసు విచారణకి రావటానికి 3 లేక 4 యేండ్లు పడుతుంది. వాహనాలకి బీమా సౌకర్యం లేకపోవటంవల్ల, బీమాని రెన్యువల్ చేయించకపోవటంవల్ల ఆర్థికసాయం సకాలంలో అందటంలేదు. వ్యక్తుల్ని కోల్పోయిన దుఃఖంతోపాటు, చితికిపోయిన ఆర్థిక పరిస్థితుల్లో బాధితులు ఎక్కువమంది నిందితులతో రాజీపడుతుండటం బాధగా అనిపిస్తుంది.

ఇందుకుగాను చట్టాల్ని ఆధునీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మోటరు వాహనచట్టం ప్రకారం జిల్లా కోర్టుల్లో తక్షణ సహాయం కోసం కేసు వేస్తే నెలరోజుల్లో 50,000 వరకు పరిహారం వస్తుంది. మృతి చెందిన వ్యక్తి ఉద్యోగి అయితే, వయసునుబట్టి హోదాబట్టి థర్డ్ పార్టీ బీమాకింద కోటి రూపాయలు వరకు పరిహారం పొందవచ్చు. హిట్ అండ్ రన్ కింద కేసువేస్తే గాయపడినవారికి 25,000, మరణించిన వారికి 50,000 తక్షణం అందచేస్తారు. ఒకవేళ బీమా లేకపోతే వాహన యజమాని నుంచి పరిహారం ఇప్పిస్తారు తెలుసా.

తెలంగాణాలో పోలీస్ యంత్రాంగం తీసుకుంటున్న చొరవని నువ్వు నిక్కచ్చిగా అభినందించాలి. మైనర్‌లు కారును డ్రైవ్ చేస్తుంటే సీజ్ చేసి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇప్పించి వార్నింగ్ ఇస్తున్నారు. మద్యం సేవించి వాహనం నడుపుతున్న సెలబ్రెటీలను కూడా వదలకుండా కౌన్సిలింగ్ ఇప్పిస్తూ అవగాహన కలిగిస్తున్నారు. ఈ యేడాది సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం కొత్త మోటరు వాహన చట్టం వల్ల రోడ్డు నిబంధనల అతిక్రియలకు భారీ జరిమానాలు, శిక్షలు విధించటం వలన గుడ్డిలో మెల్లగా కాస్త ప్రమాద గణాంకాలు తగ్గినట్టుగా కనిపిస్తున్నాయి.

ఇంకొక కొత్త విశేషం చెప్పాలి. కేరళలో స్మార్ట్ ఎక్లిప్స్ అనే పరికరాన్ని అభివృద్ధి చేశారు. అతివేగంగా వెళ్ళే వాహనాన్ని ఇది హెచ్చరించటమే కాకుండా ఇంజనునుకూడా నిలిపివేస్తుంది. 100 పై దేశాలనుండి ఈ సాధనం తమకు కావాలంటూ 140 కోట్ల విదేశీ పెట్టుబడులతో ముందుకు వచ్చారంటే అతివేగంవల్ల ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నాయో మనము అర్థం చేసుకోవాలి. ప్రమాద ఘంటికలు వినిపించని సమాజాన్ని చూసేందుకు దీన్ని ప్రతి కారులో పెట్టుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాల్సిన దిశగా ఆలోచించాలని కోరుకుందాం.

అంబులెన్సా! నా ఆత్మీయ నేస్తమా! పెద్దలందరికీ ట్రాఫిక్ నిబంధనలపట్ల అవగాహన లేదని గమనించిన రాష్ట్ర లా అండ్ ఆర్డర్ అదనపు డీ.జీ. జితేందర్ గారు ఎల్.బి. నగర్ అల్కాపురి చౌరస్తాలో పిల్లల శిక్షణా పార్క్‌ను ప్రారంభించారు. పోలీస్ యంత్రాంగం చిన్నప్పటినుండి పిల్లలకు శిక్షణ ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో సుఖవంతమైన జీవితాన్ని ప్రమాద రహిత జీవనాన్ని పొందగలుగుతారని ఆకాంక్షించింది. అంతే కాకుండా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌తోనే అతిక్రమణలు చేస్తున్న పెద్దమనుషుల్ని పట్టుకుంటున్నారు. డీ.జీ. మహేష్ భగవత్ గారైతే ఏకంగా 'రక్తదానం రోడ్లమీద కాదు ఆసుపత్రుల్లో చేయండి, క్షేమంగా మీ ఇళ్లకు వెళ్లండి. కుటుంబాలతో హాయిగా గడపండి'

అంటూ హితవు చెబుతున్నారు. నువ్వు అలాగే మాకెప్పుడు హితవు చెబుతునే ఉన్నావు. ఇక ఆ తప్పు చెయ్యములే మిత్రమా. ఇక నీవంటూ వస్తే పసికూనల ప్రసవ ఆనందాలకు, పెద్దవారి అనారోగ్య కారకంగానో రావాలితప్ప ఇలా ప్రమాదాల బారినపడి పిలిచేరోజు రాకూడదని ఓవర్ డ్యూటీ చేసిన నీకు ఇకనన్నా రెస్ట్ ఇవ్వాలని మనసారా కోరుకుంటున్నాను.

యాక్సిడెంట్ రెప్పపాటే. కాని దాని ఫలితం జీవితాంతం. జీవితం ఎంతో విలువైనది. ఎన్నో పుణ్యఫలాలుగా మానవ జన్మ దొరుకుతుంది. చేతులారా దాన్ని, పాడుచేసుకోం అని ప్రతిజ్ఞ చేస్తున్నాము. నిర్లక్ష్యంగా వ్యవహరించబోమని మాట ఇస్తున్నాం. వెళ్లి రావమ్మా అంబులెన్స్! మళ్లీ ఆనందాల సిరివై రావమ్మా అంబులెన్స్!

ఇట్లు...

నీ

– మాధవి

# అమ్మ భాష!

గురువు గారు!

మీరెంతో ఆనందపడే విషయాన్ని చెప్పాలని ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. నిజానికి నేనే వచ్చి మీ ఎదురుగా కూర్చుని భక్తిగా మీకు నమస్కరించి మీ ఆశీస్సులు తీసుకుని వినమ్రంగా చెప్పాలని కలలు కన్నాను. కానీ ఆఫీసులో అన్నీ అప్పచెప్పి నేను మళ్లీ ట్రైనింగ్‌కి వెళ్లాల్సిన సమయం దగ్గరకొస్తుండటం వల్ల మీకు ఉత్తరం మాత్రమే రాస్తున్నాను. అన్యథా భావించకండి గురువుగారూ...

అదేపనిగా కళ్ళనుండి కన్నీరు ఉరుకుతూనే వుంది. ఏమి రాస్తున్నానో తెలియనంతగా అక్షరాలన్నీ అల్లుకుపోయి కనిపిస్తున్నాయి – కానీ మీరిచ్చిన స్ఫూర్తి – మీరు నాలో నింపిన ఆత్మ విశ్వాసం ఎంతో గొప్పగా అన్పిస్తున్నాయి. ఓ పల్లెటూరులోని పూరిగుడిసె నుండి సాగిన నా ప్రస్థానం, నాకే స్ఫూర్తిదాయకంగా అనిపిస్తుంది. మట్టిలో బతికిన ఓ పల్లె పిల్లను తీసుకొచ్చి మీరు మలచిన తీరు నాకు ఎంతో గొప్పగా అన్పిస్తుంది. అందునా తెలుగుని ఆప్షనల్‌గా తీసుకుని నన్ను సివిల్స్‌కి ప్రిపేర్ అయ్యేలా అనుక్షణం నన్ను ఉత్సాహపరుస్తూ మీరు చూపించిన పట్టుదల నాకు వేయి ఏనుగుల బలాన్ని ఇచ్చింది. నిజం గురువుగారూ మీరు ఊహిస్తుంది నిజమే.. నేను సివిల్స్‌లో ర్యాంక్ సాధించాను – మీ ఆశీస్సుల మూలంగానే ఇది సాధ్యమైందనిపిస్తుంది.

ఎంత గొప్పగా వుందో తెల్సా మాస్టారూ... మొదట్లో నేను తెలుగు ఆప్షనల్ తీసుకుని ప్రిపేరు అవుతుంటే అందరూ ఏమిటీ జిడ్డుమాలోకం అన్నట్టు చూశారు... చులకనగా మాట్లాడారు... తర్వాత వాళ్లతో సమంగా మార్కులు వస్తుండటంతో మా గ్రూప్లో మిత్రులందరూ నన్ను సలహాలు అడగటం ప్రారంభించారు. ఇదంతా మీరు నేర్పించిన క్రమశిక్షణ, హర్డ్‌వర్క్, ప్రణాళికాయుతమైన జీవనంమూలంగానే సాధ్యపడిందని అనిపిస్తోంది.

పలక కూడా కొనలేని ఓ గూడెం పిల్లని నేను... ఇసుకలో నాకు అక్షరాలు దిద్దిస్తున్నప్పుడు పుండు పడిన ఆనాటి మీ 'వేలు' సాక్షిగా చెపుతున్నా. నాకు అద్భుత మార్గాన్ని చూపించిన గొప్ప గురువు మీరు... నీలో ప్రతిభ వుంటే అదృష్టం తనంతట తానే తలుపు తోసుకుని వస్తుంది. భాష ఒక మార్గం మాత్రమే. ఆ వాహికద్వారా విజయం సాధించటానికి కావల్సిన అద్భుత సంకల్పాన్ని నీలో నింపుకో. అసాధారణ సహనం వుంటే అన్నీ సాధ్యాలే అని అనుక్షణం చాటిచెప్పిన గొప్ప వ్యక్తి మీరు. అవును! 'మాతృభాష కళ్ళు లాంటిది. ఆంగ్లభాష కళ్లజోడు లాంటిది' అని తరుచూ చెప్పే ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు గారి స్ఫూర్తివంతమైన మాటల్ని అనుక్షణం గుర్తుచేసుకుంటాను నేను.

మీరు బతకలేని తెలుగు బడిపంతులు కాదు మాష్టారు – బతుకు విలువ తెలియచెప్పే మా మార్గదర్శులు. లీడర్స్ కాదు మేకర్స్, ఢిల్లీకి ప్రధానైనా ఓ మాస్టార్ చేతిలో దెబ్బలు తిన్న విద్యార్థే కదా. దేశ భవిష్యత్ నిర్ణేతలైన విద్యార్థుల్ని తీర్చిదిద్దే మీలాంటి గొప్ప గురువులు ఉన్నంత వరకూ మాలాంటి వారు ఎదుగుతూనే వుంటారు. నాకుతెలిసి ఏ విద్యార్థిని

అడిగినా నీకు నచ్చిన మాస్టర్ ఎవరంటే తెలుగు మాస్టరనే చెబుతారు. ప్రతి పిల్లవాడి మేధోవికాసానికి ఆద్యుడు తెలుగు మాస్టారే అంటే అతిశయోక్తి కాదు. ఆనందం వచ్చినా, దుఃఖం వచ్చిన అమ్మ భాషలోనే కదా వ్యక్తం చేస్తాం. చిన్నప్పుడు మాతో పాడించే పాట అదే మాస్టారూ–

'ఆ శివతాండవ కేళిగా
అలరారే గీతంగా
భాషించే భాష తెలుగు
తెలుగంటే వెలుగు జిలుగు
తెలుగంటే కలికి కులుకు
తెలుగంటే ఆమని, తెలుగంటే యామిని
తెలుగంటే కలలసోన, తెలుగంటే అలలవాన'

– రాధశ్రీ రాసిన ఈ పాటను నేను జాతీయ గీతమంత గౌరవంగా ఎప్పుడూ పాడుకుంటానే వుంటాను మాస్టారు. నా ఎద ఈ పాట పాడుతుంటే గర్వంగా ఉప్పొంగుతుంది. దేశాన్ని అభిమానించని వారు మీ దృష్టిలో ఎప్పుడు మనుష్యులు కాదు అని పదే పదే చెప్తూ మాలో కూడా అవే భావాల్ని పెంచి ఈ రోజు ముస్సోరిలో ఐ.ఏ.యస్. ట్రైనింగ్‌కి పంపేంతగా నన్ను ఇన్‌స్పైర్ చేసినవారు మీరు. స్వంత భాషను ప్రేమించు. పరభాషను ఆదరించు' అన్నది మీ నినాదమే కాదు విధానంగా మార్చుకున్నారు. కాబట్టే మాకీ విజయాల్ని అందించగలిగారు. పరభాషాజ్ఞానాన్ని సంపాదించండి కానీ మాతృభాషలోనే సంభాషించండి అంటూ ఎక్కడా తెలుగుకి ఆత్మనూన్యత సోకకుండా మీ జీవిత చట్రాన్ని అడ్డుగా వేసి కాపాడుకుంటున్న మీలాంటి వారివల్లే కదా మాస్టారు మన తెలుగుకి ప్రాచీన హోదా దక్కింది. మనమిప్పుడు గర్వంగా చెప్పుకోగలుతోంది. ఎంత అభివృద్ధిని సాధించినా అది మన ఆచార భాషా ప్రగతిని మింగెయ్యకుండా జాగ్రత్త పడాలి కదా మాస్టారూ–

మీకు తెల్సా మాస్టారు నిన్న మీడియావాళ్లు ఇంటర్వ్యూ చేస్తూ తెలుగు ఆప్షనల్‌తో నేను విజయం సాధించానని తెలిసి కనుబొమ్మలు ఎగరవేశారు. ఓ పత్రికవారు తెలుగులోనా అన్నారు చులకనగా. నా ర్యాంక్ ఎంతో తెలుసా అన్నాను నవ్వూతూ నేను. ఎంతా అన్నారు అనాసక్తిగా, 5వ ర్యాంకు అని గర్వంగా చెప్పాను నేను. అపుడు వాళ్ల మొఖం చూడాలి మాస్టారూ బలే కిక్కు ఇచ్చింది మాస్టరూ ఆ సంఘటన నాకు.

మాతృభాషలోనే విద్యాబోధన జరగటంవల్ల జరిగే ప్రయోజనాలు, ఎన్నో ఉన్నాయి అంటూ జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి, అదే NCERT, కూడా పదేపదే చెబుతున్నా ఈ పాశ్చాత్య భాషా ప్రేమికులకు అర్థం కాదా! ఇంట్లో మాట్లాడే భాష వల్ల కదా మేము స్కూల్ అంటే భయం లేకుండా వస్తూ త్వరగా అర్థం చేసుకోగలిగాం. అభ్యసనా సామర్థ్యం, వివేచన, ఆలోచన, ఊహాశక్తి, విశ్లేషణలు కూడా సృజనాత్మకతతో కూడి వుండి త్వరగా ఎదుగుతారనే కదా ఆ సంచాలకులు హృషీకేశ్ సేనాపతిగారు పదే పదే చెప్పింది. అమ్మా భాషలో భావవ్యక్తీకరణ రెక్కలు విచ్చుకుంటుంది. అంతెందుకు నూతన జాతీయ విద్యా విధానంపై వేసిన కమిటీ కూడా 8వ తరగతి వరకు మాతృభాషలోనే విద్యాబోధన జరగటం వలన పిల్లల్లో అవగాహనా సామర్థ్యం పెరుగుతుందని నెత్తీ నోరు కొట్టుకుని చెప్పలేదా... అయినా ఇంత చిన్నచూపు తెలుగు మీద ఎందుకో నాకర్థం కావటం లేదు మాస్టారూ.

అంతెందుకు మన జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, కవన విశ్వంభరుడు సి.నా.రె. ఏమన్నారో మరోమారు మీకు గుర్తు చేయాలి అనిపిస్తుంది గురువు గారు!

'భాషే నేను తెచ్చుకున్న తియ్యనివరం
భాషే నేను కట్టుకున్న జీవన గోపురం

నా యింటి వివృత గవాక్షం భాష
నా కంటి వి నిర్మల కటాక్షం భాష' అని అనలేదా...?
అంతెందుకు 'పలుకు పలుకులోన తెలుగు పలికెను పర్జన్యంలా
పదం పదంలోన తెలుగు ఎదిగెను చైతన్యంలా'
అని రోమాలు నిక్కబొడుచుకునేలా చెప్పలేదా?
ఎవరి పద్యమో తెలియదు కానీ గురువు గారు తెలిస్తే చెప్పరా–
గంటాన కవితను కదను త్రొక్కించిన నన్నయభట్టు లీనాడు లేరు
కలహాన కంచుఢక్కల నుగ్గు నుగ్గు గావించిన శ్రీనాథు లీ వేళ లేరు
అంకాన వాణినోదార్చి జోలలుపాడు పోతనామాత్యు లీ ప్రొద్దులేరు
పంతాన ప్రభువుతో పల్లకీనెత్తించు కొనుపెద్దనార్యు లీ దినము లేరు

'వాణి నారాణి' యంచు సవాలుకొట్టి మాట నెగ్గించు వీరు లీపూట లేరు– కానీ వారి స్ఫూర్తి చైతన్యం మనలో నిత్యం ఉన్నాయి కదా మాస్టారు... ఉండాలనే కదా మీరు ప్రతిరోజు భోధించేవారు. మేము తప్పులు వ్రాయకుండా ఉండాలనే కదా చెవి మెలిత్రిప్పుతూ బాధించేవారు. మీరు అప్పుడు పెట్టిన క్రమశిక్షణే మాస్టారు ఇప్పటి నా విజయం.

ఆంగ్ల విద్యా బోధనకు ఆద్యుడు మెకాలే మాటలు ఓసారి స్ఫురణకు తెచ్చుకుందాం. ఎంతో దూరదృష్టితో ఆయన అక్కడినుండి జనాలను ఇక్కడకి తెచ్చి తమ దేశానికి ఆర్థికభారం కాకుండా తమ భాషను ఇక్కడివాళ్లకు నేర్పితే రంగు– రూపంలో మాత్రమే భారతీయులుగా వుండి బ్రిటీషర్స్ మాదిరి ప్రవర్తిస్తారని, తమ దేశానికి విధేయులుగా ఉంటారని ఆంగ్లాన్ని మనమీద రుద్దారు. కానీ ఆంగ్ల విద్య ద్వారా ప్రపంచ దేశాల చరిత్రను తెలుసుకున్న భారతీయులు ఉద్యమించారు. భావ సుసంపన్నతతో దేశభాషలు ఐక్యంగా నిలబడ్డాయి. బ్రిటీషర్స్‌ని నిలదీసాయి. స్వాతంత్ర్యాన్ని సాధించాయి.

అంతెందుకు చైనా, జపాన్‌లు తమ మాతృభాషలు ప్రపంచ పోటీలో నిలబడలేవని భావిస్తూ ఆంగ్లాన్ని దిగుమతి చేసుకోలేదే. జపాన్ ఎప్పుడూ వలస పాలన కిందకు రాలేదు. అనువాదాలతో తమ భాషల్లోకి విజ్ఞానాన్ని సమపార్జించుకుంది. జ్ఞానంతో భాష సుసంపన్నం అవుతుంది తప్ప భోధన వల్లకాదు. అట్లంటే మెక్సికన్లు అమెరికాలో కొన్నితరాలుగా ఉన్నారు కదా. మరి వారెందుకు ఆంగ్లభాష ద్వారా ఎదగలేకపోయారు? విద్యారంగ సమస్యలు భాషతో ప్రమేయంలేనివి. బడుల భాష కావాలా, పలుకుబడుల భాష కావాలా అని కాళోజి గారు ఎప్పుడో ప్రశ్నించారు. వందేళ్ల క్రితమే కొమర్రాజు లక్ష్మణరావు విజ్ఞాన సారస్వాన్ని రాశారు. భావ వ్యక్తీకరణ సరిగా లేకపోతే బోధన లోపమే తప్ప భాషదే తప్పుగా ఎత్తిచూపేవాళ్లు మూర్ఖులు కాక ఎవరుంటారు మాస్టారూ ?

మీకు గుర్తుందా మాస్టారూ! నేను యూనివర్సిటిలో మాట్లాడుతుంటే ఎంతో మంది వేళాకోళం చేస్తున్నారని ఏడ్చేదాన్ని. నా తెలంగాణ మాండలికాన్ని తక్కువచేసి వెకిలిగా నవ్వుతున్నారని ఉక్రోశపడేదాన్ని. మీరప్పుడు సముదాయించి నీదనుకున్న దారిలో నువ్వు వెళ్లమన్నారు. ఇంకా, ఇంకా భాషని బాగా నేర్చుకుని అదే మాండలికంలో సెమినార్లు కూడా ఇవ్వమన్నారు. నాతోటి వాళ్ళు తమ భాషను మార్చుకున్నారు టీజింగ్‌కి భయపడి. కానీ ఆ తర్వాత తర్వాత నన్నే అందరూ ప్రోత్సహించి నాతోనే ఎక్కువ పేపర్స్‌ని ప్రజెంట్ చేయించారు. ఎందుకంటే నా దగ్గర కంటెంట్ వుంది. సభను ఆకట్టుకునే యాస ఉంది. భాషపై పట్టువుంటేనే కదా ఏ విజయమైనా సాధించేది.

అయినా సాగరాంధ్ర భాష– అంటే గుంటూరు, కృష్ణ, ఉభయ గోదావరి జిల్లాలోని భాష సొబగు ఒక మాదిరి వుంటే, రాయలసీమ భాష అదే–చిత్తూరు, నెల్లూరు, అనంతపూర్, కడప, కర్నూల్ భాషలో మరో అందం వుంటుంది.

విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని కళింగాంధ్ర భాషకు మరో చమక్కువుంటుంది. నా తెలంగాణ యాసకు మరో జిలుగుంది. ఏదైనా ఇవన్నీ తెలుగుకి కొత్త అందాన్ని తెచ్చిన యాసలే కదా మాస్టారు అయినా అమ్మకు పుట్టిన పిల్లలందరూ ఒక తల్లి బిడ్డలే కదా–

తెలుగు భాష గొప్పదనం తెలుగు భాష తియ్యదనం, తెల్సుకున్న వాళ్ళకు తెలుగే ఒక మూలధనం అని చంద్రబోస్ లాంటి వారు ఏకంగా పాటలే రాశారు. హన్మకొండలోని పింగళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు తెలుగు భాషమీద సమగ్ర పరిశోధన చేశారని ఈ మధ్యనే పేపర్లో చదివాను. ఇలాంటివి ఇంకా ఇంకా వస్తే మన తెలుగుకి ఇంకా విస్తృతంగా ప్రచారం మొదలవుతుందని నా అభిప్రాయం.

అంతెందుకు దాదాపు 16 కోట్ల మందికి పైగా తెలుగు మాట్లాడే వారు ప్రపంచం మొత్తం మీద వున్నారు తెల్సా మాస్టారు. మా లింగ్విస్టిక్ ప్రొఫెసర్ కూడా 'భాష ఒక జీవనది లాంటిది. ప్రయాణంలో ఆయా ప్రాంతాల సారాన్ని తనలో కలుపుకుంటూ పరవళ్ళు తొక్కుతూ పోతుంది. ఎంత గ్లోబలైజేషన్ యుగంలో మనం వున్నా లోకలైజేషన్లో మన మాండలికాల్లోని మధురత ఎక్కడ దొరుకుతుంది' అనేవారు. అంతే కాకుండా కావ్య భాషకు పట్టం కట్టిన రోజుల్లో సైతం శిష్ట భాషతో పాటు గ్రామ్య భాషలో కూడా సహజీవనం చేసిన చరిత్ర మనది అనేవారు. ఎంతగొప్ప మాటో కదా గురువుగారు.

మనజాతి సంస్కృతిలోని అభివ్యక్తి రూపాలని అధ్యయనం చేయటంలో 3 సూచికలు ప్రధాన భూమిక పోషిస్తాయని మేధావులెందరో చెప్పారు కదా మాస్టారూ, అవి భాష, సాహిత్యం, సినిమా– భాష జనావళి మధ్య ఐక్యతని పెంచి భావప్రకటనకు వారధి వేస్తుంది. సాహిత్యం సమాజహితాన్ని కోరుతూ వారసత్వ వికాసానికి తోడ్పడుతుంది. ఇక సినిమా విషయానికొస్తే ఊహ వికాసానికి కథాత్మక వ్యక్తీకరణకు ఉపకరిస్తుంది. ఇవన్నీ రేపటి బంగారు సమాజాన్ని వృద్ధి చేయటం కోసమేకదా మాస్టారూ.

2008 అక్టోబర్లో తెలుగు భాషకి ప్రాచీన హోదా ఇచ్చే క్రమంలో 1000 యేళ్ల చరిత్ర లేదని, తెలుగులో కవిత్రయం 900 సంవత్సరాల క్రితం వారేనని మళ్ళీ పిటిషన్ పడింది. అప్పుడే కదా భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణా వారు ఆనాటి వేములవాడ చాణుక్య రాజుల వద్ద క్రీ.శ. 941లో ఆస్థాన కవిగా ఉండిన పంపనకవి గురించి చెప్పి, తెలుగు భాషకు 1100 వందల సంవత్సరాల చరిత్ర వుందని నిరూపించగల్గింది. అది సాధించటంలో కీలకభూమిక పోషించింది మన సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ గారే కదా. మన బోధన్లో మీరు ఎన్నిసార్లు ఆ 'పంపనకవి' సమాధిని చూపించి, అక్కడే కూర్చోపెట్టి ఎన్ని తెలుగు భాషా విశేషాలు చెప్పేవారో– అంతెందుకు. గోల్కొండ నవాబు ఇబ్రహీం కుతుబ్షా నుండి అగ్రహారాన్ని కానుకగా పొందిన మలింగంటి సింగరాచార్యులు తెలుగు సాహితీ ప్రస్థానంలో మొదటి నిరోష్ఠ్య రచన పద్యం చదివేటపుడు పెదవికి, పెదవి తాకకుండా చదివేవారు. వీరి ఆస్థానంలో ఆస్థాన కవిగా వున్న అద్దంకి గంగాధర కవి అసాధారణ మేధావి.

పంపకవి సోదరుడైన జినవల్లభుడి కంద పద్యం కుర్క్యాల శాసనం ద్వారా దొరికింది. వీరి మిత్రుడు మల్లియరేచన రచనల మీద సి.పి. బ్రౌన్ పరిశోధనలు చేశాడు. ప్రజల భాషకు గౌరవాన్ని తెచ్చి తొలి స్వతంత్ర కావ్యాన్ని రాసిన పాల్కురికి సోమన్న మన వాడే కదా. ద్విపద ప్రక్రియ సృష్టికర్త ఆయనేగా. సాంఘిక కావ్యం బసవపురాణం వ్రాసింది ఆయనేకదా. కుప్పాంబిక పద్య ప్రౌఢిమ ఎంత గొప్పదోకదా.

కన్నడిగులు, తమిళులు ప్రేమించినంతగా తెలుగువారు మాతృభాషను ప్రేమించరని ఒక అపవాదు మన మీద వుంది. కానీ మేధోవికాసం వల్లనే కదా పద్యాన్ని సాగు చేశాం... ఏ భాషలోలేనట్టి అవధానాల్ని పెంచి పోషించాం. అష్టావధానం, శతావధానం, ద్విశతావధానం, నేత్రావధానం లాంటివి ఎన్ని విభిన్న ప్రక్రియలు అభివృద్ధి చేశామో

కదా– పద్యం పండితుని సేద్యం, రసజ్ఞ హృదయనైవేద్యం అంటూ ఎంతో గొప్పగా చెప్పుకునేంత కృషి చేసింది మనమే కదా.

'ఇంగ్లీషుని కాటుకగా దిద్దుకో కానీ, ఒళ్ళంతా పూసుకోకు నల్ల బడ్తవు
ఇంగ్లీష్‌ని ఇంగువగా అద్దుకో కానీ, ముద్దచేసి మింగబోకు రుచి చెడుతుంది'.

అని అవధాని నాగఫణిశర్మ గారు ఎప్పుడో చెప్పారు కదా. నిజమైన భావ్రపేరణ, ప్రగతి మాతృభాష నుండే వస్తాయి.

ఐ.రా.స. గుర్తించిన అధికార భాషలు – 6. ఇంగ్లీషు, ఫ్రెంచ్, స్పానిష్, అరబిక్, రష్యన్, చైనీస్. రష్యాలో ఇంగ్లీష్ లేదు. అయినా విజ్ఞానంలో ఎంతో పోటీ పడ్తుంది. నిజానికి ఇంగ్లీష్, రష్యన్, జర్మనీ, ఫ్రెంచ్ భాషల్లో పదాల సంఖ్య 4 లక్షలకు మించి వుంది. పదాల్ని బట్టే భాష పరిపుష్టం అవుతుంది – అన్యభాషాపదాల్ని గ్రహించని భాష ప్రపంచంలో లేనే లేదు. భారతదేశం – 3,500 సంవత్సరాల క్రితం ప్రాకృత భాష, పాలీ, మగధ, వ్రజ్, ద్రవిడ, గిరిజన, పైశాచి, కూయి, గదబ, కోలామి, బ్రాహూయి–(ఆఫ్ఘనిస్తాన్) వేదాలకు ముందుదశలో భాషలన్నారు. వేదాల తర్వాత సంస్కృతం, పాకృతం నుంచి సంస్కరించబడ్డ భాషగా రూపాంతరీకరించబడింది.

712లో ముస్లింల పాలన వచ్చాక అరబిక్, పర్షియన్ భాషలొచ్చాయి. ప్రజల భాష హిందీ అయింది. 16వ శతాబ్దం వరకు పారశీ, అరబ్బి, సంస్కృతం చెలామణిలో వుండేవి. అరబ్బీ పర్షియన్, హిందీ కల్సి ఉర్దూ భాషగా మొదలైంది. మాతృభాష ఉర్దూకి ఒక యూనివర్సిటీ ప్రారంభించిన ఘనత నిజాందే. అలా ఉస్మానియా యూనివర్శిటి ఉర్దూ మీడియంలో ప్రారంభమయింది.

గురువుగారూ! ''ప్రపంచానికి 6000 భాషలు తెల్సు. అందులో సజీవంగా ఉన్నవి 3000 మాత్రమే. 10 లక్షల మించి మాట్లాడే భాషలు 200. ఐదు కోట్లకు పైగా మాట్లాడే భాషలు 20 మాత్రమే. చిత్రమేమిటంటే ఈ 20 భాషలు 65 దేశాల్లో ప్రభుత్వ భాషలుగా వున్నాయి. మనదేశం విషయానికొస్తే 179 భాషలు, 544 మాండలికాలు వున్నాయని'' మీరేగా చెప్పేవారు.

అయితే, మనందరం గొప్పగా చెప్పుకునే ఇంగ్లీష్‌లో 1000 వరకు భారతీయ భాషా పదాలున్నాయి తెల్సా. తెలుగులో వాడుక భాషలో 3000 పదాలు ఆంగ్లభాషవి వున్నాయి. తమిళంలో 5000 వరకు వున్నాయి. ఫ్రెంచ్ భాషలో 450 జర్మనీ పదాలు, 500 ఇంగ్లీష్, 1000 ఇటలీ పదాలున్నాయని పరిశీలకులు అంటారు. సంస్కృత భాషలో సూర్యుడికి 100 పర్యాయ పదాలున్నాయని ఎందరికి తెల్సు చెప్పండి మాస్టారూ– హంగేరి భాషలో స్త్రీకి 600 పర్యాయ పదాలు వున్నాయట. ఉర్దూ భాషలో 'దిల్'ని 750 పర్యాయ పదాలలో పిలుస్తారట. ప్రేమకి 500 ప్రత్యమ్నాయ పదాలున్నాయి. ఇంకా చిత్రమేమంటే సూర్యుడిని ప్రపంచ వ్యాపితంగా 10,000 పేర్లతో పిలుస్తారట.

మనం తెల్సుకోవాల్సింది మీరు ప్రతీసారీ చెప్పేది ఒకటే కదా మాస్టారూ–

భాషని మనం సృష్టించలేం. కృత్రిమంగా నిర్మించలేం. తరతరాలుగా సమిష్టిగా సృజింపబడే భాషకు Best ఉదాహరణ పోలిష్ బాష. 2000 సంవత్సరాల నాడే యూదు జాతీయులు విచ్ఛిన్నమైనా వారి మాతృభాష హిబ్రూ చెక్కుచెదరకుండా వుండటాన్ని చూసి మనం సిగ్గు పడాలి కదా మాస్టారు–

గర్వంగా చెప్పుకోవల్సిన అంశం ఏమిటంటే తెలుగు భాష ప్రపంచంలోని ముఖ్య భాషల్లో ఒకటి. 2000 సంవత్సరాలుగా అభివృద్ధి చెందుతున్న తెలుగుని కృష్ణదేవరాయల వారు 'దేశభాషలందు తెలుగు లెస్స' అన్నారు. ప్రపంచస్థాయిలో ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్‌గా కీర్తించారు. అంటే పడమర దేశాలైన పాశ్చాత్యులలోకంలో ఇటలీ

అత్యంత సౌందర్యంగా మధురంగా, చిత్రకళగా వుండే అక్షరాలతో అందర్నీ ఆకట్టుకుంటుంది. అంత గొప్పది తెలుగు అని ఎన్నో దశాబ్దాల క్రితమే తెలుగుని కొనియాడారు పాశ్చాత్యులు సైతం.

సొంత భాషలో అధికార వ్యవహారాలు చూసుకోలేని జాతి ఇంకా బానిసత్వంలోనే వున్నట్లని ఎంతోమంది మేధావులు హెచ్చరిస్తూనే వున్నారు కదా! అది మనం ఇంకా ఆచరణలో పెట్టాల్సి వుంది. జింబో గారు మాత్రం న్యాయాధిపతిగా తీర్పుల్ని తెలుగులో విన్పించి తెలుగులోనే అందించి కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని మనందరకి తెలుసు. ఇది అభినందించదగ్గ విషయం కదా!

కారొచ్చింది – కాలినడక మానేశాం. టెలిఫోన్ వచ్చింది – ప్రత్యక్ష పలకరింపులు మానేశాం. మరలతో చేయి కలిపి మనిషి 'మర'గా మారినట్లే ఆంగ్లంతో చేయి కలిపి పాశ్యాత్యునిగా మారకూడదు– ఇంగ్లీష్ వారి హేర్ స్టైల్ బాగుందని ఆ అమ్మాయిలు బాగున్నారని మన అమ్మగా భావించగల్గుతామా – ఒక జాతి సంస్కృతిని బహుళతని నిర్ణయించేది, నిర్దేశించేది భాష మాత్రమే – సంస్కృతి దేహమైతే భాష ముఖం వంటిది. ద్రవిడ భాషా కుటుంబానికి చెందిన తెలుగు భాష జాతి అస్తిత్వ కేతనం.

కాబట్టి ప్రతి ఒక్కరు గుర్తించాల్సింది గౌరవించాల్సింది బాషనే. మనం ఆస్తుల్ని అతి జాగ్రత్తగా మదుపు పెట్టుకున్నట్టే, పెంచి నాలుగింతలుగా హెచ్చించుకున్నట్టే మాతృ'భాషని' కూడా కాపాడుకోవాలి. ఇది మన జాతి సంపద – భవిష్యత్ తరాలకు మనం అందించాల్సిన విలువైన వారసత్వ సంపద.

కాబట్టి మీలాంటి పెద్దల మార్గదర్శకత్వంలో తెలుగు భాషను నమ్ముకుని నేనీస్థాయికి వచ్చినట్టే మాతృభాషల్లో విద్యార్జన చేస్తూ రేపటితరం మరింతగా వికాసంతో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిస్తున్నాను మాస్టారు.

అమ్మ ఎలావున్నా అమ్మే, అమ్మ అందంగాలేదని ప్రేమించకుండా వుండలేం కదా... మాతృభాష మన శ్వాసగా ఎదగాలన్న తపన మనలో వుంటే 'భాష' ఒక సమస్య కాదన్నది ఇకనైనా గుర్తిస్తే బాగుండును కదా మాస్టారూ!

ఈ వారం వీలుచూచుకుని నేనొస్తాను గురువుగారూ, మీ ఆశీస్సులు ఎప్పుడూ నా మీద వుండాలని కోరుకుంటూ...

మీ

– నవ్యత

# నో చెప్పటమూ ఒక కళే!

C.E.O. గారూ!

నమస్కారం.

నేను మీ కంపెనీలో పనిచేసే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని తల్లిని. సాఫ్ట్‌వేర్ కుటుంబాలన్నీ సాఫ్ట్‌గానే గడచిపోతాయని అనుకోలేము కదా. రెండు పదుల వయసులోనే ఆరుపదుల జీతం వస్తున్నా డబ్బే ఆనందానికి ప్రతిపదిక కాదుకదా. ముందుకన్నా ఇప్పుడు ఎక్కువగా, జీవితం హాయిగా గడచిపోతుందని అనుకునేంతలోనే పింక్‌స్లిప్‌లు, అశాంతులు, పనివత్తిడిలు, విఫల ప్రేమలు వెంటాడే క్రీనీడల్లా Soft ware ఉద్యోగి కుటుంబాన్ని అతలాకుతలం చేస్తున్నాయి.

మొన్నటికి మొన్న 'ప్రేమ్' ఆత్మహత్య, నిన్నటికి నిన్న 'వనిత' డిప్రెషన్లోకి వెళ్ళటం, గత నెల 2000 మంది ఉద్యోగాలు పోవటం, ఉద్యోగుల మధ్య సత్సంబంధాలు లేకపోవటం, ప్రేమారాహిత్యం, విఫల ప్రేమలు, అసూయ, ద్వేషాలు పెరగటం... ఏమిటీవన్నీ అన్పిస్తున్నాయి. 'Soft ware' అంటే అంతా Soft గా వుంటుందనుకున్నాను. కానీ ఇదొక సంస్కరించాల్సిన రంగమన్నది ఇప్పుడే అర్థమవుతుంది.

మీరు పెద్దస్థాయి ఉద్యోగులు... అయినా ఈ చిన్న ఉత్తరం చదివి మరింత మెరుగైన వాతావరణాన్ని మీ పని ప్రదేశంలో అదే మీ కార్పోరేట్ ఆఫీస్‌లో కల్పిస్తే మరిన్ని మంచి ఫలితాలు సాధిస్తారు. సమాజంలో మరిన్ని మార్పులు తీసుకు రాగల్గుతారు. పని వత్తిడి లేకుండా Joyful గా work place వుండేలా చూడాల్సిన బాధ్యత మీదేగా. ఇప్పటికే మీరు ఎన్నో సంస్కరణలు చేశారు. పసిపిల్లల తల్లుల కోసం క్రష్‌లు, ఫీడింగ్ రూంలు పెట్టారు. దేహదారుఢ్యం కోసం 'జిమ్'లు పెట్టారు.

బుర్రతో పనిచేసి అలసిపోయి చిరాకు పడకుండా 'రిలాక్స్' అయ్యేలా మసాజ్ సెంటర్‌ని ప్రోత్సహించారు. ధూమపానం వల్ల ఆరోగ్యం పాడవుతుందని తెల్సినా పాసివ్ ధూమపానం మరింత హానికరం కాబట్టి 'స్మోకింగ్' రూంని ఓపెన్ చేశారు.– రిక్రియేషన్ రూంని తెరిపించారు. పెట్‌డాగ్‌ల కోసం సెంటర్ని కూడా ప్రారంభించారు. వీగాన్స్ అదే జంతువుల నుంచి వచ్చే ఏ ఉత్పత్తినీ తీసుకోని వారికోసం ఓ రెస్టారెంట్ తెరిపించారు– అన్నిటికీ Yes Yes అంటూ అలవాటుచేసి ఉద్యోగస్థులకి అవసరాలు తీర్చటంలో ముందుంటున్నారు కానీ నావీ కొన్ని సూచనలు పాటిస్తారని చిరు ప్రయత్నంగా ఈ ఉత్తరం మొదలెట్టాను.

మీకు తెల్సా! పని సంస్కృతికోసం మీరు ఏదైతే ఆలోచిస్తున్నారో అది సాధ్యపడాలంటే ఉద్యోగస్థుల మధ్య వున్న Gap లు తగ్గాలి. పూర్వకాలంలో ఒకే దగ్గర 30–40 యేళ్ళు పని చేసేవారు. యజమాని గురించి ఉద్యోగికి, ఉద్యోగి గురించి ఆ కంపెనీ అధికారికి సంపూర్ణ అవగాహన ఉండేది. కానీ ఇప్పటి లెక్కల ప్రకారం ఒక కంపెనీలో పనిచేసే

ఉద్యోగి సగటు ఉద్యోగ వయస్సు 18 నెలలట. అంటే 1981 తర్వాత పుట్టిన 'మిలీనియల్స్' ఆలోచనల ప్రకారం ఎవరెక్కువ జీతమిస్తే వారి దగ్గరే పనిచెయ్యాలనుకుంటున్నారు. సౌకర్యాలు, జీతం, Better Future ని పరిగణనలోకి తీసుకుంటున్నారు.

అంటే ఒక ఉద్యోగిని మీ కంపెనీ Value Asset అంటే ఆస్తిగానో లేక వస్తువుగానో చూడకూడదని అందరూ భావిస్తున్నారని అర్థం చేసుకోవాలి కదా! నిజం. ఈరోజు అందరికీ అన్నీ వున్నాయి. చదువు, స్థాయి, డబ్బు... మీ కంపెనీ కాకపోతే మరో కంపెనీ. పని చేసే వారికి ఎక్కడైనా ఒకటే కదా! అప్పుడు 'లాస్' అయ్యేది మీరే కదా! తరుచూ ఉద్యోగుల్ని మార్చుకుంటూ పోవటం వల్ల కస్టమర్స్‌తో మీకు చెడ్డపేరే కాకుండా పని సంస్కృతి కూడా దెబ్బతింటుంది. ఆ వచ్చిన కొత్త వారు మనకి అలవాటు పడటానికి ఎంతో కొంత సమయం పడుతుంది.

జీవితానికి 'జీతం' మాత్రమే ముఖ్యం కాదన్నది ఈ జనరేషన్‌కి బాగా అర్థం అయింది. అన్నిటికంటే ముఖ్యంగా 'Work life Balance' ని బాగా చూసుకుంటున్నారు. నిబద్ధత అనేది పూర్వపు తరంలాగా జీతం ఇస్తున్న కంపెనీకన్నా తాను నేర్చుకున్న పనికే ఎక్కువ ఇవ్వటం వలన కంపెనీలతో అనుబంధాల్ని పెద్దగా పెంచుకోవటం లేదు ఈనాటి తరం. అందుకే మరిన్ని ఆకర్షణలు మీ కంపెనీకి అత్యవసరం.

ఏ కంపెనీ అయినా 'సమాజం' కోసమే తన పనితనాన్ని, ఉత్పాదకతను అందించాలి కదా. అలాంటప్పుడు ఆ కంపెనీలో సమాజంలోని అన్ని వర్గాలు ఉండేలా చూసుకోవాలి. ఉద్యోగుల్లో ఆడవారు, దివ్యాంగులు, పెద్ద వయసు, చిన్న వయసు వారు పల్లెలు, పట్నాల వారు అన్ని వర్గాల వారు వుండాలి. True employ అంటే నిజమైన ఉద్యోగి ఎప్పుడూ తన తోటి ఉద్యోగిపట్ల అనుచితంగా, అమర్యాదగా, అగౌరవంగా ప్రవర్తించడు. అలాంటి పని సంస్కృతిని నేర్పించాలి. అమ్మ చెప్పిన మాటను బుద్ధిగా వినే కొడుకులు, ఆఫీసులో మాత్రం మహిళా అధికారి పట్ల గౌరవాన్ని ప్రకటించరు. చులకనగా చూస్తారు. తోటి ఉద్యోగిని అన్న ఆలోచనకూడా లేకుండా గౌరవంగా చూడరు. మరి తన భార్య కూడా ఒక కంపెనీలో పనిచేస్తుంటే ఆమెని కూడా అలాగే చూస్తారన్న ఆలోచన ఈ ప్రబుద్ధుడికి రాదంటారా? వృత్తి క్రమశిక్షణని నేర్పించగలిగితే ఆ ప్రాజెక్ట్‌కే కాదు మీ కంపెనీ సమాజానికి కూడా ఎంతో మంచిది.

**No Cell Phone Day** : 'సెల్‌ఫోన్' లొచ్చాక ప్రతి మనిషికి తనదనుకున్న Space వుండటం లేదు. అందుకే ఒకరోజన్నా సెల్‌ఫోన్‌కి విరామమిద్దాం. నెలకు ఒకసారన్నా పాటిద్దాం. అప్పుడు మనం మన సెల్‌ని వీడి జనాల ముఖాల్ని చూడగల్గుతాం. మన కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉండగలుగుతాం.

**No Talking Day** : మన పూర్వీకులు నేర్పిందే కదా, ఒకరోజు మౌనవ్రతం వల్ల అంతఃకరణ శుద్ధి జరుగుతుందన్నది నిజం. మనుష్యుల మధ్య అపార్థాలు, మాటల యుద్ధాలు కూడా తగ్గుతాయి కదా. మౌనం విలువ కూడా తెలియాలి కదా ఈనాటి తరానికి.

**No Spending Day** : వారానికి ఓ రోజుని కేటాయిద్దాం. ప్రతి శుక్రవారం సంధ్యవేళదాటుతుంటే మన ఊర్లలో డబ్బులెవ్వరూ ఇవ్వరు. అది ఒక ఆచారంగా ఎన్నో తరాలుగా పాటిస్తున్నారు. సంపాదన ఎంతన్నది అందరికీ అర్థం అవుతుంది. కానీ ఖర్చు ఎంతన్నది ఎవ్వరూ ఖచ్చితంగా చెప్పలేరుకదా. ఇలా వుండటం వల్ల మనం జమా పద్దుల పట్ల అవగాహన పెంచుకుంటాం. ఆర్థిక క్రమశిక్షణ కూడా పెరుగుతుంది.

**No Private Transport Day** : 80 నిమిషాలకో మరణం, 20 ని॥కు ఒక ప్రమాదం జరుగుతూవున్న దశను చూస్తున్నాం. 'జాముల' మయమైన నగరంలో కాస్తన్నా రిలాక్స్‌గా వుంచేందుకు స్వంత వాహనాలకు విరామ మిచ్చేసి ప్రభుత్వ రవాణా వ్యవస్థలో మనం ఆఫీసులకి ఒక్కరోజన్నా ప్రయాణం చేద్దాం. దీనిద్వారా ప్రజల కష్టనష్టాలు తెలుసుకోవటమే కాకుండా, పెట్రోలుని కూడా ఆదాచేసినట్టు అవుతుంది. శరీరానికి వ్యాయామం కలుగుతుంది.

**No Violence Day :** సాఫ్ట్‌వేర్ రంగంలో చాలావరకు నాన్‌వెజ్‌లే ఇష్టపడతారు. జీవహింసని నిర్మూలిద్దాం. జీవకారుణ్యాన్ని పెంపొందిద్దాం. వీగాన్స్‌కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయిద్దాం. చక్కని ఆరోగ్యంకోసం ఈ వీగనిజాన్ని సిద్ధాంతాలను పాటించేవారు వేలల్లోనే ఉంటున్నారు. ఆరోగ్యం, పర్యావరణం, అహింస ఈ మూడింటి సమ్మేళనం వీగాన్. ఆరోగ్య కరమైన మార్పుని అందరూ ఆహ్వానించాల్సిందే కదా. మనిషిలోని హింసా ప్రవృత్తిని మార్చేలా సాటి ఉద్యోగులతో హింసాత్మకంగా ప్రవర్తించకుండా సున్నితంగా వ్యవహరించేలా చూస్తూ ప్రోత్సాహకాలతో అభినందిద్దాం.

**No Booching Day** : మన పొట్టేమీ dustbin కాదు, ఏది కన్పడితే అవి తినెయ్యటానికి పోగేసుకోటానికి. కంప్యూటర్ దగ్గర కూర్చుని చేసే పనులతో ఎలాంటి వ్యాయామాలు లేకుండా బాన పొట్టలతో వినాయకుడిలాగా మారుతున్నారు అతి చిన్న వయసులోనే software పిల్లలు. కాబట్టి నోరు కట్టుకోవటం ఎలాగో ముందు నేర్పించండి. మితాహారం, పరిమిత వ్యయం ఎప్పుడూ సుఖ జీవితానికి సువర్ణ మార్గాలని ముందు ఉద్యోగస్థులకి చెప్పండి.

**No Sitting Day** : సాఫ్ట్‌వేర్లో సాఫ్ట్ స్కిల్స్ అంటూ కూర్చొని పనిచేయటం వలన అందరూ ఊబకాయులుగా తయారైపోతున్నారు. కనీసం ఒక్కరోజులో కొన్ని గంటలైనా, నిలబడి పనిచేయటం అలవాటు చేసుకుందాం.

**No Plastic Using Day** : ప్లాస్టిక్ భూగోళాన్ని నిర్వీర్యం చేసే మహమ్మారి. వీలైనంత వరకు ప్లాస్టిక్‌ని వాడటం ఆపేసి గాజు వస్తువులవైపు మనం ప్రయాణం సాగిద్దాం. ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వాడేది మంచినీళ్ళ బాటిళ్ళే, నెలకు ఒక్కరోజు కాకుండా జీవితకాలం మొత్తం మనం ప్లాస్టిక్‌ని 'Ban' చేయగలిగితే మన బతుకులు బాగుంటాయి.

**No City Day** : ఆ రోజు నెలకు ఒక్కరోజైనా పర్వాలేదు. software ఉద్యోగస్థులంతా City లో ఉండకుండా ఏదో ఒక గ్రామానికి వెళ్ళి ఏదైనా సేవ చెయ్యండి. బడులుకానీ, గుడులు కానీ, మడులు కానీ ఎక్కడైనా ఫరవాలేదు. దేశ స్వరాజ్యం గ్రామాల్లోనే ఉంది కాబట్టి, గ్రామాలకు సేవ చేయటం అలవాటు చేసుకోండి.

అన్నిటికంటే ముందుగా కొలిగ్స్ మధ్య ఉండే క్లోజ్‌నెస్‌తో ఎక్కువ మంది ఆకర్షణని ప్రేమనుకుని చివరికి కృంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. సహజీవనం అదే లివింగ్ రిలేషన్తో ఎంతో మంది ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడ్తున్నారు. అందుకే ఏది చేసినా ఆలోచించి చేయాలి. ఇష్టం లేకపోతే మొహమాటానికి పోయి yes అని చెప్పకుండా ధైర్యంగా No చెప్పగలిగి వుండాలి.

ప్రేమంటే ఇద్దరు ఒకరి మనసును ఒకరు తెల్సుకుని ఒకరినొకరు గౌరవించుకుంటూ సాగాలే కానీ పర్సుల బరువుని బట్టి నెలసరి పే స్లిప్‌నిబట్టి బేరిజువేసుకుని తీసుకునే నిర్ణయం కాదని తెల్సుకోవాలి – అందుకే ప్రేమ విషయంలో చక్కటి క్లారిటీ ఉద్యోగస్తులకి వుండేలా చూడండి. మీరు ప్రతి సంవత్సరం కొత్త వెర్షన్ soft ware లు వస్తే ఎలా ట్రైనింగ్ ఇస్తారో అలాగే మీ ఆఫీసులో ఓ సైక్రియాటిస్ట్‌ని మరో కౌన్సిలర్ని కూడా అపాయింట్ చేయండి. ఆకర్షణని ప్రేమ అనుకుని yes చెప్పి జీవితాన్ని నాశనం చేసుకునే కంటే No చెప్పి స్వేచ్ఛగా బ్రతుకటాన్ని నేర్పించండి.

సమాజంలో అందర్నీ ముందు Respect చేయటం నేర్చుకోవాలి. ఆడవారిని, వికలాంగుల్ని, అన్నింటికిమించి తోటి ఉద్యోగస్తుల్ని గౌరవించటం, పలకరించటం, సాయం చేయటం అలవర్చుకోవాలి. మనం true employee గా మారాలంటే మనతోపాటు అందర్నీ గౌరవంగా చూడాలి. సమాజం అంటే అందరమూ కల్సి వున్న విభిన్న వ్యక్తుల సమూహం. కనుక ఒక కంపెనీలో వుండే అందరూ ఐకమత్యముతో పరస్పరం సహకరించుకుంటూ సామాజిక చైతన్యంతో ఉన్నప్పుడు అన్నింటికంటే ఆ కంపెనీ ఎంతో సక్సెస్ సాధించి 'work life' బ్యాలెన్స్‌ని అభివృద్ధి పరుస్తుంది.

వృత్తి క్రమశిక్షణని నేర్పిస్తుంది. మీ కల నాకు తెల్సినంతవరకు ప్రతి సోమవారం మీ ఉద్యోగులు office కు రావటానికి ఉత్సాహపడాలి. ఎప్పుడెప్పుడు Office కి వెళ్లాలి అని ఎదురుచూసేలా ఆఫీసు ఉండాలి. ఆ రోజు కోసమే కదా మీరు నిరంతరం పాటు పడుతుంది. మీ కల సాకారం కావాలని మీ సారథ్యంలో పనిచేయటానికి యువతంతా అమితాశక్తిని చూపించాలని మనసారా కోరుకుంటూ, వృత్తి కేవలం కడుపు నింపడానికి పనికివస్తుంది. ప్రవృత్తి మనసుని నింపుతుంది. ఈ చిన్న విషయాన్ని గమనిస్తారని మా చిరు ఆర్తిని గుర్తిస్తారని కోరుకుంటూ...

వుంటానండి...

– ఐ. సుధారాణి

# కొత్త సృష్టి చేతనం!

విత్తనమా ! నా రేపటి హరిత ఆకాశమా !

అందరికీ ఒక కోరిక ఉంటుంది.. రథం ఎక్కాలని, దానిపై చక్కర్లు కొట్టాలనీ... కానీ అది అందరికీ తీరే కోరిక కాదు కదా! అబ్బా...ఎన్నాళ్ళకి నీ కల నెరవేరిందో కదా. ఎన్ని తరాల తర్వాత నీ తపన తీరిందో కదా... నీకూ ఓ రథం వచ్చేసిందిగా.. దాన్ని 'విత్తన రథం' అంటూ నీకోసమే ప్రత్యేకంగా సృష్టించారుగా.. నాకెంత సంబరంగా వుందో తెల్సా !

చిన్నప్పుడు ధాన్యం నూర్చాక ఆ పొలాల్లో నిన్ను ఏరుకొని..తల మీదికి ఎత్తుకుని గాదెల్లో నింపుకుని నీ వంక ఎంత ఆశగా చూసేవాళ్ళమో తెలుసా... గాదెంత ఎత్తుగా ఉంటే ఆ రైతు కుటుంబం అంత గొప్పగా వుంటుందని, పురి ఎంత పెద్దగా వుంటే ఆ రైతంత పెద్దవాడని గొప్పగా చెప్పుకొనే వాళ్లం.

అయినా విత్తనమా ! నువ్వు అంకురించాలంటే ఎన్ని అవరోధాల్ని, అడ్డంకుల్ని అధిగమించాలో కదా. మహా వృక్షానివై, మహాద్భుతాల్ని ఆవిష్కరించాలంటే ఎన్నెన్ని కష్టాల సముద్రాల్ని ఈదాలో కదా. మా మనుషులు అమ్నియో సెంటెసిస్ అంటూ పరీక్షలు చేసి భ్రూణ హత్యలకు పాల్పడుతున్నట్టే సీతాకోక చిలకల్నీ, కీటకాల్నీ, తెలీకుండానే నిర్మూలింపజేస్తూ నీ పరాగ సంపర్కానికీ, పరపరాగ సంపర్కానికీ చిక్కులు కలిగిస్తూ మేం కూర్చున్న కొమ్మనే నరికేసుకుంటున్నాం కదా..నీ పుట్టుకకే అడ్డంకులు కల్పిస్తున్నాం కదా. మా పిచ్చి మనుషుల్ని మన్నించవూ..! ఈ ప్రపంచాన్ని ఆకలి చావులనుండి కాపాడవూ !

పుస్తకం హస్తభూషణం అంటారు కానీ నువ్వు మాత్రం సమస్త పోషకం కావేంటీ? అసలు నువ్వు లేకపోతే ఈ ప్రాణికోటి మనుగడ సాగిస్తుందంటావా.. అంత పెద్ద మర్రివృక్షం ఇంత చిన్న విత్తనంలోనే కదా ఇమిడి ఉంటుంది. ప్రాణికి వెన్నెముకవి కదా నువ్వు. 'నా మొలక – నా చెలక – నా పలక' అంటూనే కదా మేమంతా ముందుకెళ్తున్నాం. రచయితులు కూడా మెదడులో పడ్డ ఓ ఆలోచనల విత్తనంతోనే కదా, వాళ్ళ పెన్నుముక్క తోనే కదా సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు.

అన్నట్టు, నువ్వెన్ని అవతారాల్లో కనిపిస్తావో తెల్సా!

వ్యాపారి దృష్టిలో నువ్వొక అమ్మకపు సామగ్రివి. ఒక్క విత్తనంతో వేల విత్తనాలు ఉత్పత్తి చెయ్యొచ్చనుకుంటాడు. ఉప ఉత్పత్తులతోనూ బోలెడు లాభాలని ఊహించుకుంటాడు. విత్తనోత్పత్తిదారుడు ప్రత్యుత్పత్తి కలిగిన ఇంధనంగా నిన్ను వాడుకుంటాడు. కొన్నిలక్షల ఆటంకాల్ని భరించి అంకురం నుండి అమ్మకం వరకూ సాగే విధానమే గొప్ప ప్రయోగశాలగా ఎంచుకుంటాడు. సంస్థల దృష్టిలో విస్తరింప చేసే వ్యవస్థగా నిన్ను భావిస్తారు. తక్కువ పెట్టుబడితో

గొప్ప సంపదను సృష్టించే వ్యాపార రహస్యం నువ్వేనంటారు. దేశం దృష్టిలో నువ్వంటే ఆహార భద్రత, వ్యాపార భద్రత, ఉద్యోగ కల్పనావకాశంగా భావిస్తారు. రైతు దృష్టిలో మాత్రం నిన్ను అమ్మకం సరకుగా కన్నా అమ్మగా భావించే ధోరణే ఎక్కువగా కనిపిస్తుంది. విత్తనాన్ని దైవంగా చూస్తాడు. నిజం చెప్పాలంటే రైతుకు ఆధార వనరు నువ్వే. కూతురుకి పెళ్లి చెయ్యాలన్నా, కొడుక్కి చదువు చెప్పించాలన్నా, తన అప్పులు తీర్చుకోవాలన్నా రైతుకు కనిపించే నిత్య దైవం విత్తనమే. రైతు ఎత్తుకునే నిత్యబోనం విత్తనమే.

నువ్వలా భూమిలో విత్తిన వెంటనే రెండాకుల చేతుల్తో బయటకు వస్తుంటే ఎత్తుకోమని నా బిడ్డ చేతులు చాపినట్టు అనిపిస్తోంది తెలుసా. అచ్చమైన వరికుప్పని చూసినా.. నికార్సయిన చెరుకు గడని తడిమినా.. నిలువెత్తుగా ఎదిగిన వృక్షాన్ని హత్తుకున్నా నిన్ను ముద్దాడినట్లు అనిపిస్తోందేమిటో... విత్తనమా!

నిన్ను భాగవతంలో ఏమన్నారో తెల్సా... తపస్సు చేస్తున్న దేవతవన్నారు. నీరనే అర్ఘ్యం ఇస్తే తప్ప కళ్ళు తెరవవన్నారు. ఎంత నిజమో కదా. లక్షల టన్నుల కొద్దీ మెతుకు ముత్యాల్ని పండించే అన్నదాత రైతులకు ప్రత్యక్ష దైవం నువ్వే కదా ! రైతాంగ అభివృద్ధికి నువ్వే కీలకం.. ఆహార భద్రతకు నువ్వే వాహకం. అందుకే 1966 లోనే విత్తన చట్టాన్ని దేశం నాటుకుంది. మట్టిలోని మమతను కడుపారా మోస్తూ నీ సర్వస్వాన్ని మాకిచ్చే పాలవెల్లి నువ్వే కదా. నువ్వంటేనే అవనిపై ఆదరించే అమ్మ రూపం. సృష్టి లోని మమతనంతా గుమ్మరించే మాతృదీపం. అయినా మిత్రమా 1947లో ఆహార ఉత్పత్తి 56 మిలియన్ టన్నులట..ఇప్పుడు 256 వేల మిలియన్ టన్నులు. 2050 కల్లా నీ అవసరం ఎంతుందో తెల్సా..330 వేల మిలియన్ టన్నులు. అంటే అంత ఉత్పత్తిని అందించాలన్న మాట. ఎంత చాలెంజ్ కదా రైతుకి. 'వరి మన జీవనఝరి' అంటూ వరి పంట వెంట పడ్తున్నారే కానీ, అపరాల సాగు ద్వారా లబ్ధి పొందవచ్చన్నది ఈ రైతన్నల మెదళ్ళలో ఇంకా ఇంకదెందుకు మిత్రమా.

వ్యవసాయ ఉత్పత్తుల్లో అగ్రగాములమయ్యామంటే అదంతా నీ చలువే కదా నేస్తమా– అయినా విత్తనకాలం 10,000 సంవత్సరాలే కదా. అప్పుడే కదా వ్యవసాయం పుట్టింది. ఇప్పుడు 400 కంపెనీలతో 5 వేల కోట్ల రూపాయల విత్తన వ్యాపారం చేస్తున్నామంటే మాటలా చెప్పు. 70 వేల కోట్లు వ్యవసాయంపై రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించటం ఎక్కడైనా కనిపించిందా. మొత్తం మీద తిప్పి తిప్పి చూసినా తెలంగాణలో 4 కోట్ల మంది జనాభా ఉంటారు. 4 కోట్ల మంది కోసం 70 వేల కోట్లు వెచ్చిస్తే, 18 కోట్ల జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కనీసం 10,000 కోట్లు కూడా ఖర్చు పెట్టలేకపోవడాన్ని గమనించాలి కదా విత్తనమా నువ్వు.

నువ్వంటే మాకెంతో ఇష్టం. ఇష్టాన్ని మించిన గౌరవం. ఎందుకంటే నువ్వూ మా అమ్మ లాంటి దానివే. తన కడుపు లో పెట్టుకుని నవమాసాలు మోసి నాకు జన్మ నిచ్చినట్టు నువ్వు కూడా పైరునంతా నీ కడుపులో దాచుకుని పుట్లకొద్దీ ధాన్యానికి జీవం పోస్తావు. అన్నట్టు వ్యవసాయాన్ని ఒక పండుగలా చేయడంలో మా ముఖ్యమంత్రి KCR గారి ఆదేశానుసారంగా ఇప్పుడు నువ్వు రథ యాత్ర చేస్తున్నావు. నాకు నీ రథం ఎంత బాగా నచ్చిందో తెలుసా !

రాష్ట్రంలోని అన్ని గ్రామాలు తిరుగుతావు, కరపత్రాలు పంచుతావు, వీడియోలు చూపిస్తూ, నాటికల ద్వారా, కళాజాతర బృందాల ద్వారా శిక్షణ ఇప్పిస్తూ, పాటల ద్వారా ధృవీకరించిన విత్తనాల వాడకం వల్ల కలిగే లాభాల పట్ల అవగాహన కలిగిస్తూ నకిలీ, నాసిరకం విత్తనాల బారిన పడకుండా బాధపడకుండా రైతుల్ని చైతన్యపరచడమే కదా నీ రథయాత్ర యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

అన్నట్టు నీ లోగో కూడా బలేగా వుందిలే. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లో ప్రాచుర్యం బాగా పెరుగుతుంది తెల్సా. అంతేకాక సముచిత గౌరవం కూడా దొరుకుతుంది. విత్తన రైతులకు లాభం కూడా బాగా వుంటుంది. ఎందుకంటే లోగో వుంటే భరోసా, భద్రత, నైతికత వుంటుంది కదా. అన్నట్టు, ఆర్టిస్ట్ సాగర్ గారే కదా ఆ లోగో వేసింది..

ఎంచక్కా పంచకట్టు, తలకట్టుతో ఉన్న రైతు తల ఎత్తుకొని ఉన్నట్టుగా ఈ లోగోలో నువ్వింక హుందాగా, గర్వంగా అంతర్జాతీయ వ్యవసాయ అవనికపై మెరిసిపోతావు కదా !

విత్తనమా! పూర్వకాలంలో రైతు ధాన్యాన్ని జాగ్రత్త చేసి, తాను పండించిన పంట నుండే విత్తనాలు తీసుకునేవాడు. కాబట్టి చాలా జాగ్రత్తగా విత్తనాన్ని నిల్వ చేసుకునే వాడు..పంట పండించేవాడు. ఇప్పుడు సరికొత్త శాస్త్రీయ పద్ధతుల్లో దిగుబడులు బాగానే వస్తుండడంతో ఎక్కువ మందికి సరిపడా ధాన్యాన్ని అందించాల్సి వస్తోంది. దాంతో ఇంకా మేలైన విత్తనాల సాగుకు సిద్ధమవుతున్నాడు. ఆ మధ్య కాలంలో జాల్నా ప్రధాన కేంద్రంగా విత్తనోత్పత్తి జరిగేది. ఆ తర్వాత ఏలూరుకి మారింది. ఇప్పుడు హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా మారింది. నీకు తెలుసుగా అంకాపూర్ జాతీయ విత్తన గ్రామంగా, వ్యవసాయ గ్రామంగా గుర్తింపు పొందిందని.

2015 అక్టోబర్ లో రైతుల కోసం నాణ్యమైన విత్తనాలు అనే ప్రధాన అంశంగా జాతీయ విత్తన సదస్సు జరిగింది. విత్తన లీడర్ గా రైతు క్యాడర్ ని మలిచే దశని చూసింది నువ్వేగా. సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాని కాస్తా 'గ్లోబల్ సీడ్ హబ్'గా మార్చబోతోందీ నువ్వేగా ! Seed is the necessary need of every one. స్వచ్ఛత, నాణ్యత ప్రతి విత్తనానికీ కావాలి. కూరగాయల ఉత్పత్తి క్షేత్రాలను సముదాయాలుగా గుర్తించడం... ఉద్యాన, మార్కెట్ శాఖలకు అనుసంధానం చేసి వినియోగదారుడికి అందుబాటు ధర, రైతుకు గిట్టుబాటు ధర కల్పించడం చేయాలి. వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, అటవీ శాఖలు ఒకదానికొకటి సహకరించుకుంటూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ అధిక రాబడితో బాటు నాణ్యమైన ఉత్పత్తిని అందివ్వగలగాలి అన్నది నువ్విచ్చే దిశానిర్దేశమే కదా!

పాపం అప్పుడెప్పుడో సీతమ్మ ఒక్కసారే అగ్ని ప్రవేశం చేసింది. కానీ మీరు ప్రతిసారీ ధృవీకరణ కోసం మీ బీజోత్పత్తి శాతం కోసం ఎప్పటికప్పుడు పరీక్షల్ని ఎదుర్కొంటూనే ఉన్నారు కదా ! నిర్దేశింపబడిన ప్రమాణాలను అనుసరించి మిమ్మల్ని నమోదు చేసుకుంటారు కదా ! విత్తనశుద్ధి కర్మాగారాల్లో మిమ్మల్ని శుభ్రపరచడం, ధృవీకరణ ట్యాగ్ లు జోడించడం, ధృవీకరణ పత్రాలు విడుదల చేయడం.. అబ్బో.. అడుగడుగునా పరీక్షలే సుమా ! అవును నీకు బలే బలే రిబ్బన్ లు కడ్తారే.. అదేలే నిన్ను భద్రపరచే సంచులకి ... బ్రీడర్ విత్తనాలకి పసుపు వర్ణపు ట్యాగ్ కడతారు కదా. బ్రీడర్ విత్తనం నుండి ఉత్పత్తి చేసే మూల విత్తనానికి తెలుపు రంగు, మూల విత్తనం నుండి ఉత్పత్తి చేసే ధృవీకరణ విత్తనానికి నీలి రంగు ట్యాగు వేస్తారు. ధృవీకరింపబడ్డ విత్తనాన్ని పైరుకి కదా వాడతారు.

అన్నట్టు విత్తనమా..!

ఒక్కసారి మా రైతన్నని చూడు. తన భుజం మీది తువ్వాలునడుగు. కన్నీటి సంద్రాలెన్ని పీల్చిందో చెప్తుంది. కుడి ఎడమల దగా దగా అని దగాకోరు దళారుల చేతిలో అమాయకంగా బలవుతూ అటు తనకీ, ఇటు వినియోగదారుడికి లాభాలు లేకపోగా బిల్డింగుల మీద బిల్డింగులు కట్టే దళారులు మాత్రం కుబేరులుగా, రైతులు మాత్రం కుచేలులుగా మారుతూ పెళ్ళాం పుస్తెలమ్మి శిస్తులు కడుతూ పస్తులతో రోజులు గడిపేవాడు ఒకప్పుడు. నువ్వు వచ్చేశాక నాణ్యమైన ఆరోగ్యకర సమాజం తెచ్చేశాక, విత్తనోత్పత్తిని రైతులు చేస్తున్నాక ప్రాణం కాస్త కుదుట పడిందనుకో.

నిజం చెప్పు విత్తనమా – రైతు నీ ప్రియ పుత్రుడు కదా, పైరగాలిలో సప్తస్వరాలు వింటూ కల్లంలోనే అష్టైశ్వర్యాలు కంటూ..మట్టే తన ఇష్టంగా.. సేద్యంనే సర్వస్వంగా పూజించే నిత్య భూమిపుత్రుడు రైతు. రైతు లేనిదే రేపటి ప్రపంచమే లేదు కదా. ధనం మూలం ఇదం జగత్ అని కాకుండా బీజం మూలం ఇదం జగత్ అనగలిగే రోజును ఇప్పుడు చూడాలి. అతిపెద్ద ఉపాధి రంగంగా వ్యవసాయం ఉంది కాబట్టే కదా ఆర్థిక మాంద్యం ప్రభావం భారతదేశం మీద పడకుండా ఉంది. నిజానికి అశాస్త్రీయ, అసంబద్ధ పోకడలు పోకుండా ఉంటే వ్యవసాయం ఎప్పుడూ మంచిదే, ఎప్పుడూ లాభదాయకమే. బయో టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, నానో టెక్నాలజీ వచ్చాక ఎంతో ముందడుగు వేసింది వ్యవసాయ రంగం అంటున్నారు విశ్లేషకులు సైతం.

క్రిమిసంహారక మందుల్ని నీ మీద గుమ్మరించకుండా, ఎరువుల్ని మోతాదుకి మించి వాడకుండా, హానికర రసాయనాలు చిమ్మకుండా ఉంటేనే కదా నీకు సంతోషం. పారదర్శకంగా ఉండాలి, జవాబుదారీతనాన్ని చూపించాలంటూ రైతులు వ్యాపారుల్ని, పాలకుల్ని నిలదీస్తున్న విధానం చూస్తున్నాం. నువ్వూ మారావులే, అవును కదా మారుతున్న కాలాన్ని బట్టి యాంత్రీకరించబడ్డ మనిషిని బట్టి మారాల్సిందే కదా విత్తనమా! ఇక మారాల్సింది మా రైతులే. ఆరోగ్యకరమైన పంటల్ని అందించాలంటే ఆరోగ్యకరమైన విత్తనాన్ని అందించాలన్న నిబద్ధతను అలవాటు చేసుకోవాలి.

Online Seed Certification Process కూడా వచ్చేసింది. Organic Certification కూడా అవసరమంటున్నారు అంతా. అంటే రసాయనిక మందుల అవశేషాలు లేవని, సేంద్రియ పద్ధతుల్లో పండించినవేనని ధృవీకరించాలి. భవిష్యత్తు అవసరాలకు కావలసిన విత్తన డాటా బ్యాంకుని ఆన్లైన్లోనే చూసుకుంటున్నామిప్పుడు. వెబ్ సైట్ లాంచ్ చేసుకున్నాం కాబట్టి ప్రపంచంలో ఏ మూలనున్న రైతైనా నిన్ను చూడగలుగుతాడు. విత్తన పరిమాణం లక్ష్యంగా TSSDC, విత్తన నాణ్యత లక్ష్యంగా TSSCA లు పనిచేస్తున్నాయిగా. దిగులు లేదిక రైతన్నకు –

విత్తనమా! నీ గురించి నీకే తెలియని ఓ కొత్త విషయం చెప్పనా.. దక్షిణ అమెరికాలోని ఎడారి ప్రాంతంలో కొన్ని శతాబ్దాలుగా వర్షం పడకుండా ఉందిట. 374 సంవత్సరాల తర్వాత..అంటే మూడున్నర తరాల తర్వాత అనుకో.. నిక్కచ్చిగా చెప్పాలంటే 1551లో వర్షం పడ్డ తర్వాత తిరిగి1925 లోనే వర్షం పడింది. ఆ పడిన వర్షం వల్ల ఆ ఎడారి అంతా పచ్చటి హరిత వనంగా తయారైందట. అంటే ఇన్ని వందల ఏళ్ల తర్వాత కూడా భూమిలో ఉన్న నీ విత్తనాల మూలంగా నువ్వు అంకురించావన్న సత్యం ప్రపంచానికి తెలిసింది. ఎందరికి తెలుసో నాకు తెలీదుగానీ, ఆర్చిడ్ అనే పూలమొక్క విత్తనాలు ఒక ఔన్స్ కి కోటీ యాభై లక్షలు తూగుతాయట. ఎంత చిన్నగా ఉంటాయో ఒక్కసారి ఆలోచించు.

ఇలా నిన్ను చూసిన కళ్ళకి హిందూ మహాసముద్రంలోని షెషిల్లేన్ దీవుల్లో కాసే జంట కొబ్బరి కాయలు 80 పౌన్ల బరువుతో ఉంటాయంటే నమ్మాల్సిందేగా. పొగ విత్తనాలు ఔన్స్ కి మూడు లక్షల యాభైవేలు తూగుతాయట. ఒక టీ స్పూన్ విత్తనాలతో ఆరు ఎకరాల పంట సాగుచేయొచ్చట. ఉల్లిపాయ జన్మస్థానం పశ్చిమ ఆసియా ప్రాంతం. ఇప్పుడు కొండెక్కి కూచున్న ఉల్లిపాయల్ని ప్రాచీన ఈజిప్షియన్లు దైవానికి నైవేద్యంగా పెట్టేవారంట.

చిత్రంగా అన్పిస్తుంది కదా! అవును మరి ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదంటారు. ఎన్నో ఔషద విలువలు వున్నాయి అందులో. అందుకే కదా ఇపుడు మన రాష్ట్ర ప్రభుత్వం ఉల్లి విత్తనాల్ని సబ్సిడీ ధరల్లో అందించాలని భావిస్తుంది. వ్యవసాయ శాఖామాత్యులు మన అక్షరయాన్ సదస్సులోనే కదా అధికారుల్ని ఆ దిశగా ఆదేశించారు.

అన్నట్టూ... ఏక బీజమే కాకుండా, నువ్వు ద్విదళ బీజంగా కూడా కనిపిస్తావ్ కదా. కంది, పెసర, మినుము, శెనగ, వేరుశెనగ, ఆముదం ఇలాంటివన్నీ ద్విదళ బీజాలే కదా. ఆగ్నేయ యూరప్ లో పండించడం మొదలెట్టిన గోధుమ కంకిలో 50వరకూ గింజలుంటాయ్. 8వేల సంవత్సరాల నుండీ పండిస్తున్న ఈ గోధుమలో ఏడువేల రకాలున్నాయంటే ఆశ్చర్యమే కదా. అర్జంటీనాలో దొరికిన రెండువేల సంవత్సరాల నాటి ఫిగ్ వీడ్ గింజలు భూమిలో నాటితే మొలకెత్తాయని, కెనడాకు చెందిన ఆర్కిటిక్ ప్రాంతంలో దొరికిన పదివేల ఏళ్ల నాటి విత్తనాలూ మొలకెత్తినాయని చరిత్రలో చదువుకున్నాం. పరిమళ ద్రవ్యాలలో ముఖ్యమైన లవంగం వికసించకుండానే ఎండిన మొగ్గే కదా ! ఎంత చిత్రం నీ చరిత్ర...

చైనాలోని ఓ సంగతి నీకిప్పుడు చెప్పాలి.. ఫాదర్ ఆఫ్ హైబ్రీడ్ రైస్ గా పిల్చుకునే డా. యువాంగ్ లాంగింగ్ నేతృత్వంలో మూడో తరం హైబ్రీడ్ రైస్ లో అధిక దిగుబడిని సాధించింది. హెక్టారుకి 15.7 మెట్రిక్ టన్నుల్ని, ఎకరానికి 62.8 క్వింటాళ్లని, 70 కిలోల బ్యాగులు సుమారు 90 బస్తాల్ని పండించింది.

మడుల్నే గుడులుగా, బ్రతుకు పైరు నిలిచే బదులుగా, కోరికలకు కొత్త నుడులుగా, బ్రతుకు గుండె చప్పుడుగా

భావించే రైతు కోసం నువ్వింకా పాటుపడాలి విత్తనమా! ఇప్పటి దాకా మనం విశ్వవీక్షణం చేశాం. మన స్వరాష్ట్రంలోని క్షేత్రాలు సౌభాగ్య క్షీర ధారలు. Lab to Land అంటూ పరిశోధనా శాలల్ని పంట పొలాల దాకా మనం తీసుకెళ్లగలగాలి. వ్యవసాయంలో సంక్షేమ స్వర్ణ యుగం రావాలంటే నువ్వే కదా కీలకం. కోటి ఎకరాలకు పైగా సాగునీరు అందించేందుకు పథకాలు సిద్ధంగానే ఉన్నాయి. రైతు బంధు – చేయూతగా, ఎకరానికి పదివేలు ఆర్థిక సాయంగా, రుణమాఫీతో, ఉచిత విద్యుత్ తో, పెట్టుబడి రాయితీల అందజేతతో, రైతు బీమా పథకం కింద ఐదు లక్షల పరిహార పంపిణీతో ఇప్పుడు వ్యవసాయం వ్యవస్థకు సాయం చేసే యంత్రాంగంగా మారింది. వ్యవసాయాన్ని వ్యయసాయం కాకుండా కాపాడాల్సింది నువ్వే కదా విత్తనమా !

2025 నాటికి విత్తన వ్యాపారాన్ని ఆరు లక్షల కోట్లకు చేర్చాలని అంచనా వేస్తున్నారు. విత్తన మార్పిడిని వేగంగా చేయాలని, నూనె గింజల్ని అభివృద్ధి చెయ్యాలని, జీవ ఇంధన విత్తనాల వాడకాన్ని వేగవంతంగా పెంచి పెట్రోల్ ధరల్ని కిందకు దించాలని, పోషకాహార విత్తన సాగుని బాగా పెంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని లక్ష్యంగా ఎంచుకుంది వ్యవసాయ రంగం. సర్ జగదీశ్ చంద్రబోస్ ఎన్నెన్నో పరిశోధనలు చేసి క్రిస్కో గ్రాఫ్ ని కనుక్కున్నారని, అనుభూతులు, అనుభవాలు, ఉద్వేగాలు మొక్కలకు కూడా ఉంటాయని తెలియజెప్పారని చెప్పుకుంటారు. నాకు కూడా అలాగే ఒక సీడో గ్రాఫ్ ని కనిపెట్టాలని ఉంది మిత్రమా..తద్వారా నీ అనుభూతిని తెలుసుకోవచ్చు కదా !

ఎందుకలా నవ్వుతావు విత్తనమా! నాకు అర్థమయ్యిందిలే.. నువ్విప్పుడు వ్యవసాయ రంగంలో మహారాజులాగా వెలిగిపోతున్నావ్. తెలంగాణా విత్తనం, దేశ విత్తన భాండాగారంలో మహారాజే కదా మరి. ఇప్పుడు నువ్వు మా పల్లెటూరి విత్తనం కాదు. నీకిప్పుడు మాలాగానే పాస్ పోర్టులొచ్చేశాయ్. నువ్విప్పుడు సీడ్ పాస్ పోర్ట్ చూపించి ఏ దేశమైనా వెళ్లిపోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం విత్తన ధృవీకరణ సంస్థకే సేంద్రియ ఉత్పత్తుల్ని కూడా ధృవీకరించే అనుమతులనిచ్చింది. తద్వారా కేంద్ర ప్రభుత్వం కూడా దీన్ని రీజనల్ కౌన్సిల్ గా గుర్తించింది. భూసారం క్షీణించి నేలను నిర్జీవం కాకుండా సేంద్రీయ సాగు కాపాడుతుంది కాబట్టే, మన రాష్ట్ర నేలలు భౌగోళికంగా, వాతావరణ పరంగా సేంద్రియ సాగుకు అత్యంత అనుకూలంగా ఉన్నాయి కాబట్టే ఇది సాధ్యమైంది.

ఒడీశా, ఛత్తీస్ ఘడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సంస్థల్ని కూడా ధృవీకరించే దిశగా మన తెలంగాణా విత్తన పాలనారంగం ఎదిగింది. ఐరోపా దేశాలకు ప్రస్తుతం దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా దేశాలే కదా ఉత్పత్తిని అందిస్తున్నాయి. కానీ రేపటి రోజున అందించాల్సింది నువ్వే కదా. రాజేంద్రనగర్ లోని ప్రయోగశాలని అంతర్జాతీయ విత్తన ప్రయోగశాలగా ISTA గుర్తించడం విశేషంగా చెప్పుకోవాలి. కానీ విత్తనమా మా సగటు మనిషి అర్థం చేసుకోవాల్సింది ఒకటే. ధాన్యానికి జీవం ఉండదు, విత్తనానికి జీవం ఉంటుందని. మనిషి ఆరోగ్య అలవాట్లతో ఎలా ఆయుష్షుని పెంచుకోవచ్చో, అలానే విత్తన ఆయుష్షుని కూడా పెంచొచ్చు. వ్యవసాయోత్పత్తి స్థిరంగా ఉండాలంటే నీ ఉత్పత్తి కీలకమని మర్చిపోవద్దు అని చెప్పాలి – నిన్ను స్వచ్ఛంగా, స్వేచ్ఛగా ఉండనివ్వాలి. రసాయనాలకు దూరంగా పెరగనివ్వాలి. అన్నట్టూ నువు సాధించిన ఘనతను ఒకసారి గుర్తు చేయనివ్వు.

తెలంగాణా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ . . .

* ఈ సంవత్సరం 52,000 ఎకరాల్లో 8 లక్షల క్వింటాళ్ళ విత్తనోత్పత్తి కార్యక్రమాన్ని ప్రణాళికగా సిద్ధం చేసింది. 79,000 క్వింటాళ్ళ విత్తనాల్ని ఇతర రాష్ట్రాలకు సరఫరా చేయాలని ప్రణాళిక వేసింది.
* వరిలో pre released విత్తనోత్పత్తిని; టమాటా, వంకాయ, మిరప, బెండకాయల విత్తనోత్పత్తిని చేపడుతుంది.
* 2022కి విత్తనోత్పత్తి 10 లక్షల క్వింటాళ్ళ లక్ష్యంగా విత్తన శుద్ధి సామర్థ్యం 3.5 లక్షల క్వింటాళ్ళ నుండి ఇప్పుడు 6.5 లక్షల క్వింటాళ్ళకు పెంచుతుంది.

* విత్తన నిల్వ సామర్థ్యం 4.2 లక్షల చదరపు అడుగుల నుండి 5.5 లక్షల చదరపు అడుగులకు అభివృద్ధి చేసింది.

* అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 31 విత్తనశుద్ధి యంత్రాలను నెలకొల్పింది..

* విత్తన సరఫరా 3.36 లక్షల క్వింటాళ్ళ నుండి 4.2 లక్షల క్వింటాళ్ళకు పెంచింది.

* ఉత్తరప్రదేశ్, ఛత్తీస్ ఘడ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాలకు మన రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలను సరఫరా చేస్తుందన్నది నీకూ తెలుసు.

ప్రభుత్వ విధానాలే కాకుండా, అనుకూల వాతావరణం, రైతుల శ్రద్ధ, పరిశోధనా సంస్థల సహకారం, అధికారుల అంకితభావనతోనే కదా ఈ తెలంగాణ రాష్ట్రం దేశానికే విత్తన భాండాగారం కాగల్గింది...రేపటి ప్రపంచ సీడ్ హబ్ గా నిలబడబోతోంది. ఆధునిక శాస్త్రీయతను నీకు ఆపాదించి నాణ్యంగా నిన్ను రూపొందిస్తేనే కదా రేపటి నా తరం నిలిచేది.. పెరుగుతున్న జనాభాకి కావల్సిన ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచడంలో విత్తన నాణ్యత కీలకమన్న ISTA సెక్రెటరీ జనరల్ ఆండ్రూ మాటల్ని మళ్ళీ ఓమారు గుర్తు చేసుకుందాం. ఏ విత్తనాల ద్వారా ఎలాంటి లబ్ధి చేకూరుతుందో ప్రభుత్వాలకు, రైతులకు వివరించటంతో పాటు, ఆహార భద్రత గురించి అవగాహన కల్పించటమే అంతర్జాతీయ విత్తనసంస్థ ముందున్న లక్ష్యంగా భావిద్దాం.

నీకు తెలుసా నా ప్రియమైన విత్తనమా ! దేశంలో నీ కోసం 100 కి పైగా పరిశోధనా సంస్థలు, 60 కి పైగా వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, 16 రాష్ట్ర స్థాయి విత్తన కార్పోరేషన్లు, 26 రాష్ట్ర విత్తన ధృవీకరణ ఏజెన్సీలు పనిచేస్తున్నామని, వారి సహకారం ఉంటేనే కదా నువ్వు విశ్వ అవనిపై విజయకేతనం ఎగరేస్తున్నావ్, 'విత్తన లా ఎన్ఫోర్స్మెంట్ అధారిటీ' ద్వారా విత్తనాలు బాగా నాణ్యత కలిగినవన్న ముద్రతో బయటకొస్తున్నావ్.

నీ గురించి, నీ విశిష్టత గురించి, మా జీవితాలలో నీ ప్రాధాన్యత గురించి ఇంతగా తెల్సుకున్నాక ఇప్పుడు నాకేమనిపిస్తోందో చెప్పనా.. విత్తనమా!

నీకో మనసుంది – దాన్ని మేం గమనించాలి

నీకో స్పందన ఉంది – దాన్ని మేం గౌరవించాలి

నీకో అనుభూతి ఉంది – దాన్ని మేం గుర్తించాలి

విత్తనమా, నీకో హృదయముంది – దాన్ని మేం ప్రేమించాలి... !

అంతేకదా...

సూర్యుడు రాక ముందే పొలం చేరి, చుక్కల్ని చూసి గూటికి చేరే రైతన్నకి నువ్వే అమ్మవి, నువ్వే అన్నానివి..అది మాత్రం మర్చిపోకు. నేను తెల్సుకున్న ఈ విషయాన్ని లోకమంతా చెప్పడానికి వెళుతున్నా...

నాకు సెలవా మరి...

ఇట్లు,

నీ

– హర్షిత

# కొత్త ప్రేమలేఖలు....
# అక్షర స్పందనలు

## ఇవి ప్రేమలేఖలు కావు

– కోటం చంద్రశేఖర్
94920433348

ఇద్దరి మధ్య నిల్చిన కాలక్షేపం రాతలా ఇవి !
ఇద్దరి మధ్య నడ్చిన పురాణం రాతలా ఇవి !
ప్రియుడి మీద ప్రియురాలు
ప్రియురాలు మీద ప్రియుడు గీసిన గీతలా ఇవి !
వ్యక్తిని విశ్వమానవునిగా తీర్చిదిద్దేది
కవితో... గజలో ...
మానవాళికి మహోపదేశంగా
సరికొత్త ఒరవడిలో రాసిన లేఖో...
సూచనల సలహాల మధ్య
బాధ్యతల బరువుల మధ్య
కురిసిన ప్రేమలేఖలు
మెరిసిన సూర్యరేఖలు ...
జీవిత పాఠాలను బోధించిన లేఖలు
కర్తవ్యాన్ని కదం తొక్కించిన దాఖలు ...
ఇవి మామూలు లేఖలు కావు
విలువలతో ప్రమాణాలతో కూడినవి ...
హృదయ విదారక వేదనలో ఓదార్పు లేఖలు

అగాధాల లోయలో ఆశని వీడని లేఖలు ...
గుండెల్లో గులాబీ బాణాలు గ్రుచ్చుకునే
లైలామజ్నూ లేఖలు కావు ...
మనసు తడిస్తే రాసినవి
కన్నీళ్ళు కురిస్తే రాసినవి ...
సవాళ్ళను చేధించిన లేఖలు
సంకెళ్ళను తెంచేసిన లేఖలు ...

# ప్రేమ పావురాలు

– కందాళై రాఘవాచార్య
99086 12007

"కొత్త ప్రేమ లేఖలు"
నవ్యతగా విశ్వ యువతి
హృదయ ఆవిష్కరణ. ప్రతి
లేఖలో స్త్రీ అంతరంగ దర్శనం
సాధికారతగా శాసనమే.
కొత్త కోణంలో ప్రేమ లేఖలు
సాహిత్యంలో ఆర్ధ్ర సంభాషణ
ఐంది. శ్రీ లక్ష్మి గారు "చార్మినార్"
పై సందడి వీధులుగా రాసినట్లే
ప్రేమ లేఖలను అందరి
మానసంగా "కొత్త ప్రేమ లేఖలు"
ను ఇతి వృత్తం చేశారు.
ఒక్కో లేఖ ఆకాశవాణి ద్వార
ఇంటింటికి ఎగిరి వచ్చిన
అపురూప పావురమే .
చదివాక మనం కొత్తగా
మారిపోతాం. కొత్త హృదయం
వస్తుంది.
కొత్త ప్రేమ లేఖ – కొత్త లోకం!

# అభినందన గంధం

– మోహిత కౌండిన్య
9985287398

సుతిమెత్తటి ఆత్మతో
సున్నితమైన భావాలతో
ఆత్మీయత నిండిన పదాలతో
కలంలో ప్రేమ సిరా నింపుకుని
గళంలో మాధుర్యాన్ని ఒంపుకొని
పదం పదంలో ఆత్మీయతని రంగరించి
లేఖ లేఖలో సృజనాత్మకతని మోహరించి
ప్రతి సోమవారపు పొద్దులో పలకరించే సౌమ్యలేఖ
అయినంపూడి శ్రీలక్ష్మి కొత్త ప్రేమలేఖ

తెలుగు టీచర్ కు భక్తిగా నమస్కరించి మట్టిలో బతికిన పల్లెపిల్ల
బానిసత్వపు చీకటి రోజుల్లో వెలుగులు పంచిన బాపూని కొనియాడి
కాలం చెక్కిట కన్నీటి చుక్కలుగా మిగిలిన పోరుగడ్డ వీరులకు జోహార్లు అర్పించి
స్నేహం ముసుగులో జరిగే అసహ్యాలను ఎండగడుతుంది.

అందానికి ఉత్తరం రాయాలని ఎవరికైనా అనిపిస్తుందా అసలు?
యోగాకు, కాళేశ్వరం ప్రాజెక్టుకు, భారతదేశానికి,
మంచి ఎండల్లో మేఘానికి, ఉగాది సందర్భంగా కాలానికి,
ఎన్నికల సమయంలో బాలట్ బాక్స్ కి, రాజ్యాంగానికి,
పిచ్చుకలకి, పెళ్ళికి, బతుకమ్మకు రాసిన లేఖలు
కాదేదీ లేఖకు అనర్హం అని నిరూపిస్తాయి!

ఆడవారికి ఆరోగ్యసూత్రాలు చెప్పే వైద్యుడవుతుంది ఒక లేఖ.
మనుషులు ఎన్ని రకాలో చీరలు అన్ని రకాలు అని
వినియోగ చైతన్యం కలిగిస్తుంది మరో లేఖ
ఖాకీ డ్రెస్ వెనకున్న కారుణ్యపు చిరునామా వెతుక్కుంటూ వెళ్లే లేఖ

చంద్రయాన్ 2 సందర్భంగా చందమామయ్య అంటూ నింగిని దాటుతుంది.
కృత్రిమ రంగులొద్దంటూ వినాయకుడికి రాసిన లేఖ
సీఈవోకి జీవితమంటే జీతంకాదని నచ్చజెప్పి
విత్తనానికి పట్టంకట్టి రథంపై ఊరేగిస్తుంది.

చీకటిదారుల్లో తడుముకునే
ముందుచూపు లేని మనుషులకు దీపమై,
సంబరం, మమత, విజ్ఞానం, వినోదం, ఆహ్లాదం,
సమత, హెచ్చరిక, కరుణ కలగలిసిన కదంబం.
ఏడాది కాలం జీవనదిలా ప్రవహిస్తూ
తనను తాను ప్రకటించుకుంటూ ప్రసారమైన
ప్రతి లేఖా ఒక వ్యక్తిత్వ వికాస పాఠం.

"ఆకాశవాణి నా హృదయ రాణి..
నా సహస్ర గళార్చన..
వినడానికి రెండు చెవులూ చాలవు..
పొగడడానికి ఒక నోరు సరిపోదు.."
స్వరమే మీ జీవనంగా, జీవన కారణంగా మారినందుకు
సభక్తికంగా సమర్పించిన లేఖ రేడియోకి కలికితురాయి!

బోనాలు, చెట్టు, వైద్యం,
నాన్న, అమ్మ, వృద్ధాప్యం, జీవితం,
విజయం, థలసీమియా – వీటికే కాక
ఉత్తరమే ఆశ్చర్యపోయేట్టు తనకే ఉత్తరం రాసి
సంభ్రమంలో ముంచి
సంక్రాంతికి, రైతుకి, సైనికుడికి సెల్యూట్ చేస్తారు.
బహు అవతారాల సంకలనం కదా శ్రీలక్ష్మిగారు!

అందుకే, రేడియోలో అపరిమిత అభిమానాన్ని పొందిన
'కొత్త ప్రేమలేఖలు' పుస్తకమై కొత్తగా వస్తున్న వేళ
మరింత ఆదరణ పొందాలని
అందుకోండి, అభినందన చందనం...!
శుభాకాంక్షల వందనం... !

# బాకుల్లాంటి వాక్యాలు

– కోటం చంద్రశేఖర్
94920433348

ఇది అభినందన కాదు
వాక్యాలు జోడెద్దుల్లా పరుగులు తీస్తున్నాయి; అంతే ...
సరుకు ఇరుకైతే
అరుపులో విరుపుండదు; మెరుపుండదు
అసూయసీమలో స్నేహహస్తం లాంటి వాక్యాలు; అందుకుందామా !
నెర్రెలనేలలో వానచినుకు లాంటి వాక్యాలు; తడిసి ముద్దవుదామా !
స్వల్పంలో సముద్రం విప్పేసి
అల్పంలో అనల్పర్థం చెప్పేసి
వాక్యాలు సైన్యంలో కవాతులా ...
వినయంతో మూలాలు విస్మరించవద్దని బోధనలు
ఋణపడి వున్న పుణ్యభూమిలో సమాంతర వాదనలు ...
బావిలోంచి నీళ్ళు తోడినట్టు
భావాలు తోడితే పరిమళించిన వాక్యాలు; గుబాళించిన లేఖలు ...
సంక్లిష్టం మీదుగా ఉక్కు సంకల్పమై మాయా ఆవరణాల్ని త్రెంచేవాక్యాలు ...
నిజంగా సహజాతి సహజంగా సమాజంగా వాక్యాలు ...
వినయ విధేయంతో ప్రజ్ఞాపాటవంతో భూత భవిష్యాలను ఎరిగిన వాక్యాలు ...
మచ్చలేని మహాసౌందర్యంలో సంద్రంలోని అలలవోలే ఎగిరిన వాక్యాలు...
మనసు శుద్ధమవడానికి విందాం
మానసిక ఆరోగ్యానికి దివ్యౌషధంగా భావిద్దాం ...
శ్రామికజన పక్షపాతం
సామాజిక చైతన్యంలో సమసమాజ నిర్మాణం
లేఖల్లోని వాక్యాల ఉద్దేశం ...
రంగు వెలిసే వాక్యాలు కావు
హంగు ఆర్భాటాల్తో సరిపెట్టుకొనే వాక్యాలు కావు
హామీలు గుప్పించే రాజకీయ పక్షాల వాక్యాలు కానేకావు ...

ఆధునిక పురోగమనంలో నూతన చరిత్రకి పురుడుపోసే వాక్యాలు ...
జీవశక్తి నశించి రాలిపడ్డ ఆకుల్లాంటి వాక్యాలు కావు
ఒక ప్రగతిశీల భావజాలంతో కాలానికి ఎదురొడ్డి
నిలబడ్డ బాకుల్లాంటి వాక్యాలు ...
మనిషిలోని విధ్వంసం మీద గురిపెట్టిన వాక్యాలు ...
ఐనంపూడి శ్రీలక్ష్మి రాత చావలి దేవదాస్ కూత
ఆకాశవాణి శ్రోతలకి భగవద్గీత ...

# పదమంజీరాల సుహృల్లేఖ

– సి.యస్.రాంబాబు
94904 01005

అక్షరాలు మహాగొప్పవి
ఎక్కడెక్కడి భావాలను
మౌనంగా పోగుచేసి
ఒక్క చోటచేర్చి
చదువుకోమనంటాయి
మధుమాస పరిమళమై మురిపిస్తాయి
కలతల అంతరంగానికి
మధురోహల కలనేతను ప్రసాదిస్తాయి

మనసును తట్టే స్వరం
అక్షరగీతంలా 'కొత్తప్రేమలేఖ'ను
క్రమం తప్పని బడిగంటలా
వాయుతరంగాల సాక్షిగా
హృదయపుకోవెల గోపురంగా చేసి
అనుభూతుల నాగస్వరమవుతుంది

మారాం చేసే మనసులకు అందే
మనోహరం స్వప్నం కదా ఈ 'కొత్త ప్రేమలేఖ'
కోయిలపాటలా ఉద్వేగాల ఊయలను పలికించే కోటిరాగాల
హృదయవీణ ఈ సుహృల్లేఖ

సునాదమై సుస్వరగీతమై
శ్రోతల గుండెచప్పుడైన
పలుకుతేనెల జావళి
పదమంజీరాల నాగవల్లి
ఈ 'కొత్తప్రేమలేఖ'

## ఆమని మాత్రమేనా? ఆమెకాదా!

– కోటం చంద్రశేఖర్
94920433348

'కలుపును' కలుపుకుపోదు
కలవరపెట్టే కళల్ని కలకనదు
పరిణిత వనిత
పట్టువస్త్రాలు చుట్టుకొన్న పరిమళ పారిజాత –
కులగజ్జిలోనో మతపిచ్చిలోనో
విమర్శ దగ్గర పరమార్శ
పరమార్శ దగ్గర విమర్శ
చేయలేదు –
నిబద్ధత చాటని నడకేది ?
అభ్యుదయ బాటవీడని నడతేది?
విస్తరిస్తున్న విద్వేషాలపై వికసిస్తున్న వికృతాలపై వైరి–
నేరాలపై ఘోరాలపై సమరభేరి–
నిర్దేశిత ఆదర్శాల ఆచరణలో ఆవేదనాక్షరి–
కొత్తరాతల క్రొంగొత్త గీతల రేడియోఅధికారి–
పదాలు పారదర్శకం
సేవలు చిరస్మరణీయం–
శ్రోతల్ని మెప్పించే భిన్న రచయిత్రి
భావస్వేచ్ఛకై ప్రాకులాడే నిష్కంళక కవయిత్రి
మురిపించే మైమరిపించే రచనల్లో మెరిసిన మైత్రి–
క్షణం క్షణం అనుక్షణం వినూత్న ఆలోచనలు

పునికి పుచ్చుకున్న ఆమెలో గాయమై గేయమై–
ఎల్లవేళల పూసే
కుహుకుహు రాగాలు తీసే ఆమనిమాత్రమేనా?
ఆమె కాదా?
మీనమేషాల్ లెక్కించదు; వెర్రివేశాలై పోదు–
దోపిడిపై నిర్దయగా చీకటిపై కర్కశంగా
అలుపెరగని సాహితీ ప్రస్థానం–
అపరిమిత సృజనాశక్తితో కళాత్మక దృక్కోణం–
ఇనుమడించిన కర్తవ్యనిష్ఠ
మబ్బుల నీడలు చీల్చి
వెలుగు చూపించిన ద్రష్ట–
పంతాలకి పట్టింపులకి దూరం
పగలకి ప్రతీకారాలకి దూరం
శుష్కప్రలాపాలకి వితండవాదాలకి ఆమె దూరం
విపరీతార్థలకి నానార్థాలకి ఆమె దూరం
అచంచల విశ్వాసం తోడైనవేళ
హేతుబద్ధంగా అర్థవంతంగా ఆమె–
వినాశనానికి స్వాగతిస్తూ
నెత్తురోడుతున్న భూమ్మీద శాంతిగీతమై ధ్వనిస్తూ–
ఆధునిక సాహితీసంద్రంలో ఉత్తుంగ తరంగం ఆమె
మానవతని సమాధి చేసి దానవతని చాటే వ్యవస్థ
అంకురించిన కర్తవ్యం–
ఒక పచ్చని శ్వాసకోసం ఎదురుచూపుల పర్వం
భాధలు పగుళ్ళై బాధిస్తున్నా ఆశలు చిగుళ్లైన
ఒకానొక సందర్భం–
సమాజపార్శ్వాలు కళ్లెదుట నిలబెట్టే ప్రయత్నం
భువిచరమాంకం వరకు
ప్రేమలేఖలు ప్రపాణవాయువులవ్వాలని
కోరుకునే మా అభిమానం–
అనితర సాధ్యమైన కలం
అనన్య సామాన్యమైన గళం–

## చైతన్య దీపికలు

– రమాదేవి కులకర్ణి
8985613123

మనసుంటే అందులో ప్రేముంటే
రాయినైనా కదల్చవచ్చనీ
ప్రేమికులే కాదు సుమీ....
వైద్యం, కాలం,అందం, చెట్టు,
సోల్జర్స్, పిచ్చుక, చీరకట్టు
ఏదైననేమి ఎవరైన నేమి
ప్రేమలేఖ సంధించవచ్చని
కొత్త సందేశం అందించవచ్చని
ప్రేమను ప్రేమకై ప్రేమించవచ్చని
మదిని తాకేలా చెప్పే...
ఐనంపూడి కొత్త ప్రేమలేఖలు...!
నవనవోన్మేష సూచికలు
సమతా మమతల దీపికలు
నైరాశ్యం చీల్చు కణికలు...!!

## కావ్య కానుకలు

– డా॥ సమ్మెట విజయ
9989820215

మనసుకు హత్తుకునే మధుర భాష్యాలు...
గుండె పొరలువిప్పి పలికిన గమ్మత్తైన భావనలు...
జ్ఞానజ్యోతిని వెలిగించే విజ్ఞానదీపికలు...
వృద్ధుల ఆదరణ బంధాలు విలువల సప్రమాణాలు..
అమ్మ నాన్న చెట్టు మేఘం ప్రకృతుల సాక్షీభూతాలు..
మట్టిపాటలతో తీరొక్కపూలతో
బోనాలు ముగ్గుల పండుగల కలబోతలు..

మనలను ముందుకు నడిపించే వెలుగు దివ్వెలు..
డిజిటలిజం ,అరాచకాలు, ప్రమాదాల హెచ్చరికలతో
మార్గనిర్దేశనం చేసే ఆత్మీయ బోధలు...
కొత్తదనంతో నిత్యనూతనంగా విరాజిల్లుతూ
విశ్వప్రేమను పంచే మానసపుత్రికలు...

## జనాల్ని కుదిపేస్తాయి

– కోటం చంద్రశేఖర్
94920433348

ఎక్కడా
వెలవెల లేదు; దిగాలు లేదు
నిర్లిప్తం కనబడలేదు; నిస్తేజం అగుపడలేదు–
ఎక్కడా
ఒంటరితనం లేదు; కృత్రిమత్వం లేదు–
తగ్గిపోయి కాదు; అగ్గిరాజేసుకొని–
పనికట్టుకొని కాదు; ఊహలనందిపుచ్చుకొని–
చక్కదనానికి కాదు; చిక్కదనంకై పాటుపడి–
మూర్ఖత్వంతో కాదు; తర్కాన్ని జోడించుకొని–
సిరులై కాదు; భావవిరులు స్వంతం చేసుకొని–
కమ్మదనం లేఖలు
చెమ్మదనం లేఖలు–
ముఖ్యం మథనం; తర్వాతే కథనం
అక్షరాల్ని కాదు; నక్షత్రాల్ని వెంటేసుక
ఆమె పయనం–
కువకువవో
మానవత్వపు మెలకువవో
దీపానివో
భావోద్వేగాల రూపానివో నీవు–

నీ
వేదన రోదన సృజన
క్షతగాత్రులకు స్వాంతన
సార్వజనీనమైన సత్యాన్వేషణ–
శాంతి నీవు
పరుచుకున్న ధవళవర్ణపు కాంతి నీవు
తోటలోని పూలమధువులన్నీ గ్రోలి
పరిమాళాలు మోసుకొన్న వసంతగాలి నీవు–
భాధల్ని ఒంపుకొని; గుండెల్లో
నదుల్ని నింపుకొని రాసావా?
జనాల్ని కుదిపేస్తాయి; ప్రభంజనాల్తో
కుదిపేస్తాయి–

# స్పందన

– సూర్యాపేట ఎల్లయ్య
95020 77979

అక్షరాల విరులు అందంగ అల్లుతు
అనుబంధ పరిమళం వెదజల్లు పలుకులు...
మనిషి మానసకోశ లోపొరల మీటుతు
మమతానురాగాలు చిలికేటి మాటలు...

చిరుగాలి ఎదమీటి హాయినిచ్చినయట్లు
శ్రీలక్ష్మి మాతల్లి వరమిచ్చు రచనలు
బంధాల గంధాలు తెలుపు తేనెతొనలు
ఆకాశవాణిలో ఆ ప్రేమలేఖలు...

వ్యవసాయ సాయమును వెలుగెత్తి చాటింది
వినియోగ యోగమును వివరంగ చెప్పింది
మచ్చికతో పిచ్చుకల వెచ్చగా తాకింది
నాన్న మనసును వెన్నపూసగ చూపింది.

# సహృదయ అక్షర కలాపం!

– కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261

ప్రేమ లేఖ
ఒక సున్నిత హృదయ స్పందన
అవ్యక్త ప్రేమామృతాన్ని
అక్షరాల్లో ఒలకబోయడం!

కాల్చుక తినే పగటి నుండి
వేపుక తినే వెండి వెన్నెల రాత్రుల నుండి
తనను తాను కాపాడుకునే
లలిత హృదయం చేసే అక్షర కలాపం!

ప్రియుడో ప్రియురాలో ఉండక్కర్లేదు
లోన ఒక పసి తనం తొణికిసలాడితే చాలు
భావాంభర వీధుల్లో విహారం
అది లభించే దాకా తపో సంచారం!

ఇప్పుడు వాట్సాప్ సందేశాలొచ్చి
ప్రేమను కాలుష్యంతో ముంచెత్తాయి కానీ
ప్రేమ లేఖలు జీవితం కాలం
వెంటాడే మధుర స్మృతులు!

దారీ తెన్నూ లేని ప్రేమలకు
'ఈ' తరం యువ హృదయాలకు
ప్రేమ దారులు తెరిచి ఇవీ అంటున్న
అయినంపూడి శ్రీలక్ష్మి గారి
కొత్త ప్రేమ లేఖలకు స్వాగతం పలుకుదాం!!

# శుభాకాంక్షలు

– తమిరిశ జానకి

9441187182

ఐనంపూడి శ్రీలక్ష్మి మనసెంత మంచిదో ఆమె రచనలు అంత బాగుంటాయి. కేన్సర్ పైనా, చార్మినార్ పైనా ఆమె రాసిన కవితా సంపుటాలు చదివాను. మనసుకి హత్తుకుపోయే లక్షణం ఆమె కవితల్లో ఉంది. ఆడపిల్లలమీద జరుగుతున్న అత్యాచారాలకు నిరసనగా ఆమె ఈమధ్య రాసిన కవిత కూడా ఎంతగొప్పగా రాసిందంటే మొదటి బహుమతి గెలుచుకుంది. ఇప్పుడు కొత్త తరహాలో రాసిన ఈ కొత్త ప్రేమలేఖలు ఆమె రచనా వైవిధ్యాన్ని చాటి చూపిస్తున్నాయి. ఇంత కొత్తరకంగా తను చెప్పదల్చుకున్న అంశాలు ఈ రీతిలో పాఠకుల ముందు ఉంచాలన్న తన ఆలోచనని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

మనిషి ఉన్నవీ లేనివీ , తాను విన్నవీ అన్నిఅనారోగ్యాలూ తనకే ఆపాదించేసుకుని భయపడిపోతుంటే నేటి వైద్యపు తీరుతెన్నులు ఆ మనిషితో ఎలా ఆడుకుంటాయో చక్కగా మనకి కళ్ళకి కట్టినట్టు చూపించింది రచయిత్రి.

నీలో మేమున్నాము కానీ మాలో నువ్వులేవు అంటూ కాలానికి లేఖ రాసి అది చదివిన మనిషిని నిజాన్ని తెలుసుకొమ్మని పరోక్షంగా హెచ్చరించింది రచయిత్రి.

ఐనంపూడి శ్రీలక్ష్మి ఏమిరాసినా అయస్కాంతంలా పాఠకుల్ని ఆకర్షిస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు.

ఈ రెండుమాటలూ రాసే అవకాశం నాకు కలగజేసినందుకు శ్రీలక్ష్మికి ధన్యవాదాలు తెలియజేస్తూ మరిన్ని రచనలతో పేరు ప్రఖ్యాతులు మరింతగా గడించుకోవాలని శుభాశీస్సులు అందజేస్తున్నాను.

# ఆత్మీయ వాక్యం

– అయినంపూడి సుధా శేఖర్
మిల్ వాకీ – USA
సెల్ : 0016 306216815

మా శ్రీ లక్ష్మి అక్షరయాత్ర ప్రారంభించి అప్పుడే 35 యేళ్ళు అయినట్లుంది. ఇంతకాలం గడిచిందా అన్పిస్తుంది వెనక్కు తిరిగి చూసుకుంటే అత్త కూతురు కావటంవల్ల నేను శ్రీలక్ష్మీతో చిన్నప్పటి నుండి ఎక్కువగా కలవటం జరిగేది. కొన్ని తరగతులు వారింట్లోనే వుండి చదువుకున్నాను. కవిసమ్మేళనాలకు తనతోపాటు వెళ్ళటం, NSS కార్యక్రమాలకు ఊర్లకు వెళ్ళి సేవచేయడం, లియోక్లబ్‌లో తనతో కల్సి పనిచేయటం నాకు చిన్నప్పటి జ్ఞాపకాలు. ఒక యూత్ ఎక్స్చేంజ్ క్యాంపు కోసం (అంతర్జాతీయ స్థాయిలో) వైజాగ్ వెళ్ళిన జ్ఞాపకం కూడా వుంది. ఆ తర్వాత మా అన్నయ్యతో తన పెళ్లి, వాళ్ళ అన్నయ్యతో నా పెళ్ళి నిశ్చయం కావటంతో తాను నన్ను 'వదిన' అని పిలవటంతో తన ఫ్రెండ్స్ అందరూ నన్ను 'వదిన'గానే భావించేవారు. అలాగే పిల్చేవారు.

శ్రీలక్ష్మి ఏ స్పందననైనా సరే త్వరగా express చేస్తుంది. వచనమైతే తాను కొట్టివేతలు లేకుండా ఏకబిగిన రాస్తుంది. కవిత అయితే ఎన్నోసార్లు సరి చూసుకుని రాస్తుంది. అంశం ఎన్నుకునేంత వరకు టైం తీసుకుంటుంది. ఒక సబ్జెక్ట్ తనమనసుకు తడితేచాలు, రెండు(రోజుల్లో కవిత రాస్తుంది. చాలా ఫాస్ట్‌రైటర్ తాను. నిజం చెప్పాలంటే ప్రొపెషనల్ రైటర్. వెంటనే పేపర్లకి పంపుతుంది. సంఘటన జరిగిన వెంటనే స్పందించటంవల్ల తన రచనలు వెనువెంటనే ప్రచురింపబడతాయి. చిన్నప్పుడు అంటే కళాశాల రోజుల్నుంచి తన కవితలు రేడియోలో రావటం, పత్రికల్లో రావటం వల్ల ఎన్నో ఉత్తరాలు వస్తుండేవి ఇంటికి.

అన్నిటికంటే మా శ్రీలక్ష్మిలో నాకు నచ్చేది మొక్కవోని తన పట్టుదల. ఎన్ని ఎదురుదెబ్బలు తిన్నా కూడా కృంగిపోకుండా తిరిగి తలెత్తుకునేలా బతకగల్గటం తన గొప్పతనం. జీవితంలో ఎన్నో ఆటుపోటులు చూసింది. అయినా సరే వెనక్కి పోకుండా పట్టుదలగా తిరిగి ఉన్నత శిఖరాలకి ఎదిగింది. జీవితాన్ని మళ్ళీ మొదట నుండి మొదలెట్టి శిఖరాగ్రం చేరటం ఎలాగో తననుండి నేర్చుకోవాలి. ''రేపటి రోజు మన కోసం ఎదురుచూస్తుంది. ఈ రోజు ఓడిపోయామనుకుని ఎందుకు బాధపడటం. రేపటి రోజుందిగా'' అంటుంది. అదీ తన గొప్పతనం. అదే తన విజయ రహస్యం కూడా.

మామయ్య పాటలు రాస్తూ వుండేవారు. నేను నా స్పందనని చిన్న చిన్న కవితలుగా రాస్తూ వుండేదాన్ని. సైబ పరంధాములు గారు, శోభనాథ్ సింహ్ గారు, గన్ను కృష్ణమూర్తి గారు, వి.పి. చందనరావు గారు నాకిప్పటికీ జ్ఞాపకమే. వారు మమ్మల్ని బాగా ఎంకరేజ్ చేసేవారు. మా ఇంట్లో తాను కవిత రాస్తే అందరూ కూర్చుని వినేవాళ్ళం. ఎవరు వినకపోయినా అలిగేది. అందరం స్పందన తెలియచేయాల్సిందే అనేది. నిజం చెప్పాలంటే కవి సమ్మేళనాలకన్నా, నెల నెలా వెన్నెల అంటూ ఇందూర్ భారతి వారు ప్రతి పౌర్ణమికీ, ఓ సాహితీవేత్త ఇంట్లో పెట్టే సాహితీ సమావేశాలలోనే కొత్త కవిత్వాలు బాగా వచ్చేవి. కొత్త కవులకు కూడా అది స్ఫూర్తిదాయకంగా ఉండేది. నేను కవిత్వం మొదలెట్టింది ఆ కార్యక్రమాలతోనే.

మా ఇంట్లో తన సాహిత్యంతో సామాజిక కార్యక్రమాలతో బాగా ఇబ్బందులు పడింది మా మరిది సుబ్బారావే. శ్రీలక్ష్మి ఏ కార్యక్రమాలకి వెళ్ళినా ఎస్కార్ట్‌గా తనని పంపిచేవారు మా అత్తమ్మ. అన్నటికంటే ఇబ్బంది కవిసమ్మేళనాలే అనేవాడు మా మరిది. నిజామాబాద్‌లో సాహిత్య సృజన చాలా ఎక్కువకావటంతో అందునా తాను వ్యాఖ్యానం చేస్తూ

వుండటం వలన ఆ 60 లేక 80 మందో అందరూ అయిపోయాకనే ఇంటికి రావాలి. దాంతో తనకి 2, 3 గంటలు పట్టేది. అంతసేపూ మా మరిది అక్కడే వుండాల్సి వచ్చేది. ఒక్కోసారి నేను వెళ్తే మాత్రం తాను రావల్సిన అవసరం వుండేది కాదు. అందుకే 'వదిన ప్లీజ్ నువ్వూ కవిత రాయవా' అనేవాడు. ఎందుకంటే కవిత రాస్తే కవిసమ్మేళనంలో నేనూ పాల్గొనటానికి వెళ్తానని తన ఆలోచన. మొత్తం మీద నిజామాబాద్ తల్లి చల్లని దీవెనలతో తాను సాహిత్యరంగంలో తన కంటూ ఒక పేజిని సృష్టించుకోగల్గటం మా అందరికీ సంతోషదాయకం.

ఇవన్నీ ఎందుకు చెప్పానంటే శ్రీలక్ష్మి ప్రస్థానం ఆదినుండి చూసిన వాళ్ళం మా కుటుంబమంతా. నిజానికి ఈ పుస్తకానికి నాలుగు మాటలు మా మామయ్య రాస్తారనుకున్నాను. శ్రీలక్ష్మి సాహిత్యంవైపు రావటానికి స్ఫూర్తి మా మామయ్యే. కానీ తానేమో ''నన్నే రాయమన్నారు''.

శ్రీలక్ష్మికి ముందు నుండి కవిత్వమంటే ఎందుకు ఇష్టమో నాకు తెలియదు కానీ తాను వచనాన్ని చాలా శక్తివంతంగా రాయగల్గుతుంది. తాను ఇంటర్‌లో వుండగా రాసిన 'రిక్షావాడు' కథ నాకు ఇప్పటికీ బాగా గుర్తు. ఆ కథకు అవార్డ్ ఇస్తూ అప్పటి శ్రీలక్ష్మి తెలుగు లెక్చరర్ Dr. నాళేశ్వరం శంకరం గారు 'చలంగారి శైలి తనది' అన్నారని ఎంతో పొంగిపోయింది. పైగా కథలు నాకు తెల్సి ఓ 25 వరకు రాసినట్టు గుర్తు. ప్రింట్‌లో నేను ఓ 10 వరకు చూశాను. కానీ అర్ధాంతరంగా దాన్ని వదిలేసినందుకు కవిత్వాన్ని తలమీద పెట్టుకుని మోస్తున్నందుకు నేను బాధపడ్డ సందర్భాలు వున్నాయి. ఇన్నాళ్ళకు ఇలా 'లేఖలతో' మమ్మల్ని మళ్ళీ ఒప్పించింది మా శ్రీలక్ష్మి – అన్నిటికంటే మా లక్ష్మి.

ఈలేఖలు ప్రసారం అవుతున్నప్పుడే మేము విన్నాము. వెంటనే స్పందన కూడా తెలియజేసే వాళ్ళం. ఉత్తరాలు చదివిన తీరు మాకు బాగా నచ్చింది. రాసిన వెంటనే నాకు Mail చేసేది. ఒక గంటకే Call చేసేది ఎలా వుంది అని. నేనింకా చదవలేదు అంటే చదివిన వెంటనే కాల్ చెయ్యి అనేది. ఏ విమర్శ చేసినా సానుకూలంగా స్పందించేది. కొన్నిట్లో వచ్చిన వాక్యాలే మళ్ళీ పడ్తున్నాయి అంటే మార్చుకునేది.

నాకు బాగా నచ్చినవి సోల్జర్, పిచ్చుక, రైతు, వృద్ధాప్యం, పాలియేటివ్‌కేర్, బతుకమ్మ, కాళేశ్వరం, ఆకాశవాణిలు. నేను పెరిగింది రైతు కుటుంబంలో కాబట్టి రైతుకురాసిన ఉత్తరం విత్తనం మీది ఉత్తరాలు నాకు నచ్చేస్తాయి. ఓ ఆడపిల్ల సమాజానికి రాసిన ఉత్తరం అత్యాచారాల్ని నిలదీసినట్లు అన్పిస్తుంది. మా శ్రీవారు ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేశారు కాబట్టి 'సోల్జర్' ఉత్తరం బాగా నచ్చుతుంది. ఎందుకంటే మృత్యువును ప్రేమించటం, దేశం కోసం జీవించటం వారికి తెల్సినంతగా ఎవ్వరికీ తెలియదు. ఇక మా అమ్మ 90 యేళ్ళ వృద్ధురాలు కాబట్టి వృద్ధాప్యంలో వుండే సాధకబాధకాలు నాకు బాగా తెల్సు. నేనే కాదు ఇలా ప్రతి ఒక్కరూ ఈ ఉత్తరాల్లో తమని తాము వెతుక్కుంటారు. తమని ఉద్దేశించే రాసిందా అనుకుంటారు. అరె– ఇవి నా ఆలోచనలు కదా తనకెవరు చెప్పారు అని మరికొన్ని సార్లు అనుమానపడ్తారు. మొత్తంమీద ఈ ఉత్తరాలన్నీ మన మనస్సుల్ని తడ్తాయి. మనకోసం తపనపడ్తాయి.

కొన్ని ఉత్తరాలు వేటాడతాయి. మరికొన్ని వెంటాడతాయి. కొన్ని ఉత్తరాలు ప్రేమలో పడేస్తాయి. కొన్ని అనుబంధాల్ని తిరిగి తోడాలన్న భావనను రేకెత్తిస్తాయి. ఈ ఉత్తరాలన్నీ మృగ్యమైపోతున్న మానవీయకోణాన్ని మళ్ళీ బ్రతికించటానికి ప్రయత్నించినట్టుగా కన్పిస్తాయి. అన్నిటికన్నా ముఖ్యంగా కనుమరుగై పోతున్న ఉత్తరానికి మళ్ళీ జవసత్వాలు పోసినట్లుగా అన్పిస్తాయి.

మా ఆడపడుచు రాసిందని చెప్పటం కాదు. మమతల విలువను తెలపటానికి, ఆత్మీయ అనుబంధాల్ని పెంచటానికి ఇలాంటి లేఖా సాహిత్యం అవసరం ఈ నాటి తరానికి చాలా అవసరం. మా మిల్ వాకీలో కూడా చక్కటి సాహిత్యసేవ జరుగుతుంటుంది. సమాజ హితమే సాహిత్యం కాబట్టి సృష్టింపబడే ప్రతి అక్షరం సమాజ సంక్షేమానికి తోడ్పాటును అందివ్వాలన్నది నా ఆకాంక్ష.

ఆ లెక్కన గమనిస్తే ఈ ఉత్తరాలన్నీ ఉత్తరాతలు కాకుండా ఉత్తమ విలువల్ని, ఉన్నత నైతిక అవసరాల్ని గురించి చెప్పినవేనని నేను భావిస్తున్నాను. మీకు తెల్సు కదా మంచి వుంటే మైకులో చెప్పాలని చెడు అన్పిస్తే చెవిలో చెప్పాలని పెద్దలు చెప్తారు. కాబట్టి ఇప్పుడు మైక్ లేదు కాబట్టి అక్షరం సాక్షిగా చెప్తున్నాను. అక్షరాలా ఇవి అచ్చమైన మానవీయ రాతలే... మర్చిపోలేని అనుభవాల గీతలే.

అందుకే ఈ ప్రేమలేఖల్ని తెరచి చూడండి. తాను చెప్తున్న మాటల్ని తరచి వినండి. విషయాన్ని ఆలోచించండి. ఆచరణీయత కన్పిస్తే ఆదరించండి. పది మందికి మాత్రం ఈ అనుబంధాల విలువల్ని పంచండి.

# అమెరికాలో సైతం అక్క కవిత్వమే

– I.V. సుబ్బారావు, బిందు

నాన్నగారు మంచి పాటల రచయిత. మా నాన్నంటే అక్కకి పిచ్చి ప్రేమ. మా నాన్నని అనుకరిస్తూ మా అక్క కవిత్వం అంటూ 5వ తరగతి నుండి మా వెంట పడేది. నాలుగు లైన్లు రాసి వినమని చంపేసేది. నాకు బాగా గుర్తు, అది రాసిన మొదటి కవిత – దొంగలు నల్లగా వుంటారు చీకటిలాగా, చీకట్లోవచ్చి దోచుకుపోతారందుకేనని. అలా మొదలైన అక్క కవిత్వం ఇంటర్‌లోకి వచ్చేసరికి బాగా చిక్కపడింది. పత్రికల్లో రావడం ప్రారంభమైంది. తన కవిత ప్రచురింపబడ్డ పత్రికలకోసం ఊరంత త్రిప్పి తెప్పించేది. మొదటినుండి అక్కది నాయకత్వ పటిమే. అక్కతోపాటు హైదరాబాద్ రేడియోస్టేషన్‌కు వచ్చి అక్క కవిత్వం రికార్డు చేయించేపని నాదే. కవి సమ్మేళనాలకు అక్కతోపాటు వెళ్లడం, లియో క్లబ్ ప్రెసిడెంట్‌గా అక్కచేసే పనులన్నింటిని వెంట వుండి నడిపించటం నా డ్యూటి. అయితే ఆ కవి సమ్మేళనాల బాధ నన్ను ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది. నాకు సాహిత్యం పట్ల ఆసక్తిఉన్నా, చెవుల తుప్పువదిలించే కొత్త కలాలపట్ల తగని భయం పట్టుకుంది అప్పట్నుంచి. నాకు బాగా ఇష్టమైన కవి నిజామాబాద్‌లో శోభనాధ్ సింహ్ గారు. ఆయన కవిత చదువుతుంటే, బయటఉన్న అందరూకూడా వేదిక దగ్గరకి పరిగెత్తేవారు. అలా వ్రాయమని అక్కకి చెప్పేవాణ్ణి. హింది గజల్‌కి ఉన్న అందం అది అనేది అక్క.

అక్క బాగా రాస్తుందని, ఎవరన్నా మెచ్చుకుంటే నాకెంతో గర్వంగా ఉండేది. రాను రాను అక్కకి వస్తున్న అవార్డ్సు, ప్రచురింపబడే రచనలు, కవిత్వంలో తన గాఢతనిచూసి మా కుటుంబమంతా గర్వపడేది. మా వదినైతే ఇండియానుండి అక్క పుస్తకాల్ని మోసుకొచ్చి ఇక్కడ అమెరికాలో అందరికి పంచుతుంది. ఈ–పేపర్‌లో అక్క కవిత ఎప్పుడు చూసినా అందరికి ఫార్వర్డ్ చేస్తుంది.

మీకొక రహస్యం చెప్పనా! అక్కతో ఏదైనా పని ఉందంటేచాలు ‘‘అక్కా! నీ కవిత వినిపించవా!’’ అనేస్తాం. ఇక మా పని అయిపోయినట్లే. మా బావ అయితే ఏకంగా అమెరికాలో కవిత్వం చదవటానికి పిలిచినా ఛార్జీలు పెట్టుకుని మరి వెళ్లి చదివి వస్తుంది మీ అక్క అంటారు. కానీ అక్కకి అమెరికా రావడం ఇష్టం ఉండదు. ఇక్కడ మేము ఇరవై కుటుంబాలు ఉన్నాం. అందుకే అప్పుడప్పుడు అక్కకోసం సరదాగా సాహిత్య కార్యక్రమాలు పెడుతున్నాం వస్తావుగా అని పిలుస్తాం. తనకి అమెరికా చలి అంటే తగని భయం. అక్కకి కుటుంబం అంటే ఎంత ప్రేమనో, కవిత్వం అన్నా అంతే ప్రేమ.

అక్క ఈమధ్య రాసినా కొత్తప్రేమలేఖలు యూట్యూబ్‌లో విని నా ఫ్రెండ్స్ అందరూ చాలా బాగున్నాయని మెచ్చుకుంటున్నారు. అందుకే ఈ బుక్‌ని నేను మా అన్నయ్య శేఖర్ కలిసి ప్రచురిస్తున్నాం. మా అక్కకి నగలమీద, చీరలమీద వ్యామోహం ఉండదు. తన కిష్టమైన పుస్తకాన్ని కానుకగా అందివ్వటం మాకు ఇష్టమే కదా. ఆకాశవాణికి కూడా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మాలాగా ఎంతో దూరాన ఉన్నవారికి సైతం మంచి కార్యక్రమాలు వినే, అవకాశాన్ని యూట్యూబ్ ద్వారా కలిగిస్తున్నందుకు. ఈ పుస్తకాన్ని ఆదరిస్తున్న అందరికీ మా కుటుంబ తరుపున నమస్కారాలు.

# కృతజ్ఞతలు

నా ప్రగతిని నిరంతరం కాంక్షించే రాష్ట్ర గవర్నర్ గౌ॥ డా॥ తమిళసై సౌందర రాజన్ గారికి, హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయులు గారికి, గురుతుల్యులు మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్. విద్యాసాగర్‌జీ గారికి, కేంద్రమంత్రివర్యులు కిషన్‌రెడ్డి గారికి, మా జిల్లా మాన్యమూర్తులు శాసనసభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి గారికి, రాష్ట్ర మంత్రివర్యులు కల్వకుంట్ల తారకరామారావు గారికి, కవితమ్మకు, వ్యవసాయశాఖామాత్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారికి, శ్రీ చిట్ల పార్థ సారథి, ఐ.ఏ.యస్., వదినమ్మ శోభమ్మకి, సెల్ఫీ ఆఫ్ సక్సెస్ పుస్తకంతో ఎంతో మందికి స్ఫూర్తి కలిగించిన బుర్రా వెంకటేశం ఐ.ఏ.యస్. గారికి, బి. నరసింగ్ రావు గారికి, వేదకుమారి గారికి, కోట్ల వెంకటేశ్వర రెడ్డి అన్న–వనజాత వదినమ్మకి, లతాజైన్, సరళ గారికి,

కేంద్ర సాహిత్య అకాడమీ K.S. రావుగారికి, సాహిత్య అకాడమి నందిని సిధారెడ్డి గారికి, బి.సి. కమీషన్ బి.ఎస్. రాములు గారికి, ఎస్.వి. సత్యనారాయణ గారికి, పత్తిపాక మోహన్, విజయేంద్ర ప్రసాద్, కట్టా శేఖర్ రెడ్డి గారికి,

ఈ కార్యక్రమాలు విని ఎప్పటికప్పుడు స్పందిస్తూ 'కొత్త ప్రేమలేఖలు'కి సరికొత్త కవిత్వపు ప్రేమ లేఖలందించిన నా కవిత్వ సోదరులు కోటం చంద్రశేఖర్ గార్కి, కందాళై రాఘవాచార్య గారికి, ఎల్లయ్య గారికి, సి.ఎస్. రాంబాబు, మోహితా కౌండిన్య, సమ్మెట విజయ, రమాదేవి కులకర్ణి, గౌ॥ శ్రీనివాసరెడ్డిగారికి, పులిగుండ్ల మోహన్‌కుమార్ గాంధి గార్లకి ధన్యవాదాలు.

అభిమాన శ్రోతలు మలక్ పేట రాధా దేవి, హరీంద్రబాబు, రఘుబీర్ సింగ్, నాగూరుబాబు, కూచన శ్రీహరి, ఉమ్మెడజైనుద్దీన్, త్యాగులు–రాఘవేంద్ర, బండారు త్రిమూర్తులు గుప్త, జయ మహాలక్ష్మి, పోలేరయ్య, రవి, అమలాపురం కామేశ్వరి, శ్రీనివాస్, గంగాధర శ్రీనివాస్, గౌనె రవి, సుంకే కార్తీక్, బత్తుల సతీష్, శ్రీనివాస్, నరసింహ చారి, గంగసాని రామ్ దయాకర్ రెడ్డి, ఎర్రం రాజు, ముదిగంటి విష్ణు వర్ధన్ రెడ్డి, ఎర్రోజాల దయాకర్ శర్మ, వేముల పరశురాములు, , గోనె శంకరయ్య, కోలేటి సుధాకర్, చిన్న సాంబ మూర్తి, పార్థ సారథి, బొమ్మి దేని లక్ష్మి నారాయణ, గంధం నరసయ్య, కేమా చంచయ్య, సుజాత ప్రసాద్, సుమో (Mr. గంటి సుజల), జేరిపోతుల బుచ్చయ్య , బరిగె గట్టన్న, నిర్మల దేవి లకు ప్రత్యేక ధన్యవాదాలు.


ప్రూఫ్‌లో సహకరించిన అనురాధ, స్రవంతి ఇంకా మిగతా క్యాజువల్ అనౌర్సర్లకి నా ప్రత్యేక ధన్యవాదాలు. ఇక ఈ పుస్తకాన్ని ఇంత అందంగా అందించిన నా తమ్ముడు రెయిన్‌బో ప్రింట్ ప్యాక్ అధిపతి కాకా నరేంద్ర, మరదలు పద్మకి ప్రత్యేక కృతజ్ఞతలు. చక్కగా పుస్తకాన్ని తీర్చిదిద్దిన డిజైనర్స్ కిషోర్, కుమార్‌లకి ప్రత్యేక ధన్యవాదాలు.


అన్నిటికి మించి నన్ను నిరంతరం ప్రోత్సహించే నా ఆకాశవాణి సిబ్బందికి, ముఖ్యంగా నా డ్యూటి రూమ్ సిబ్బందికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.


**– అయినంపూడి, బండ్లమూడి కుటుంబం**


# అయినంపూడి శ్రీలక్ష్మి రచనలు


కవయిత్రి:


















రచయిత్రి:





అనువాదకురాలు:


















సంపాదకురాలు:





సంపాదకురాలు:














సహకారం – కూర్పు:




సహకారం – కూర్పు:


తల్లివేరు


కళా తెలంగాణం
తెలంగాణ ప్రభుత్వం
భాషా సాంస్కృతిక శాఖ


తెలంగాణ తేజోమూర్తులు
తెలంగాణ ప్రభుత్వం
భాషా సాంస్కృతిక శాఖ


పటం కథలు
తెలంగాణా ప్రభుత్వం
భాషా సాంస్కృతిక శాఖ


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
భాషా సాంస్కృతిక శాఖ
సమర్పించు
శారద
Narrative Folk Art